
# శ్రీ దత్త వేదము

## భగవాన్ శ్రీ దత్తాత్రేయస్వామి వారి దివ్యవాణి

(అక్షరప్రసాదము)



సమర్పణ :

**డా॥ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి**

M.Sc., Ph.D.

దత్త భక్తులు

ఓం

# శ్రీ దత్త వేదము

భగవాన్ శ్రీ దత్తాత్రేయస్వామి వారి దివ్యవాణి

(అక్షరప్రసాదము)




డా॥ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి
M.Sc., Ph.D.



దత్త భక్తులు
రామిరెడ్డిపేట, నరసరావుపేట.

తృతీయ ముద్రణ :
శ్రీ వృష నామ సం॥
ఆషాఢ శుద్ధ పూర్ణిమ ( గురు పూర్ణిమ)
5-7-2001

మూల్యము :
**గురుదక్షిణ**
**80 రూపాయలు**

**ప్రతులకు :**

విజయవాడ

**1.** శ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తి
శ్రీమతి భవాని
డోర్ నెం. 41-15-4, నల్లగేటు డౌన్
కృష్ణలంక, విజయవాడ-520 013
ఫోన్ నెం : 521 809.

**2.** శ్రీ శిష్ట్లా భీమశంకరం
ఓగిరాలవారి వీధి
సత్యనారాయణపురం
విజయవాడ
ఫోన్ నెం : 531167

**3.** D.S.K.S.N. మూర్తి( అజయ్)
సాయిరత్న టవర్స్
సత్యనారాయణపురం
విజయవాడ-520011
ఫోన్‌నెం : 531321

హైదరాబాద్

**3.** శ్రీ.సి.వి. రమణ
MIG II Block 20
F 14 బాగ్ లింగంపల్లి
హైదరాబాద్ - 44
ఫోన్ నెం : 7667758

**2.** శ్రీ. టి. దేవోత్తం
నెం.1-8-37సి
చిక్కడపల్లి
హైదరాబాద్ - 20
ఫోన్ నెం : 7645883

**3.** శ్రీ పి.వి. కృష్ణమూర్తి
ప్లాట్ నెం.19 S.B.I కాలని
బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్
ఫోన్ నెం : 7618805

నరసరావుపేట

డా॥ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి M.Sc., Ph.D.
రామిరెడ్డిపేట, నరసరావుపేట

---

Sri **S. CHANDRA SEKHAR**
ENGINEER EQUIPMENTS SUPPORT KUWAIT, OICCO (KOC)
P.B. NO 9758 AHMADI-61008 KUWAIT
Phone : 009651/3983324

---

ముద్రణ : సవితా ప్రింటర్స్, విజయవాడ-2 ఫోన్ నెం : 576670.




## శ్రీ బ్రహ్మదత్తులు

శ్లో॥ శివశ్రీశయోరాన నాభ్యాం షడంసం
చతుర్వేద మూలం జగత్సృష్టిలోలమ్
సరస్వత్యుపేతం సరోజాత వర్ణం
పరబ్రహ్మ మధ్యం భజే దత్త దేవమ్ ॥



# శ్రీ విష్ణుదత్తులు

శ్లో॥ విధీశానయోరాన నాభ్యాం షడంసం
ఘనశ్యామ గాత్రం ప్రఫుల్లాబ్జనేత్రమ్
రమా వక్షసం రమ్యరూపాభిరామం
మహావిష్ణు మధ్యం భజే దత్త దేవమ్ ॥



# శ్రీ శివదత్తులు

శ్లో॥ హరి బ్రహ్మణోరా ననాభ్యాం షడంసం
లలాటేక్షణం చన్ద్రఖణ్డావతంసమ్
భవానీ సమేతం విభూతి ప్రభాజ్గం
మహాదేవ మధ్యం భజే దత్త దేవమ్ ॥

జయగురుదత్త శ్రీగురుదత్త

# శ్రీ నృసింహ సరస్వతి స్వామి వారు



## కృష్ణ కృత
# శ్రీ నృసింహ సరస్వతి స్తోత్రం

శ్రీ నృసింహ సరస్వతీ యోగిరాజం భజేహమ్॥
కర్ణాంత కమల నయనం కనకవర్ణ చ్ఛాయం
వటవృక్షాధః శిలాతలోపరి పద్మాసనాసీనమ్ ॥ శ్రీ నృసింహసరస్వతి॥

నిజ తను ధృత కాషాయాంబర సంవృతోత్తమాంగం
కంఠ మాలాయిత పావన రుద్రాక్షహారవ్ ॥ శ్రీ నృసింహసరస్వతి ॥

అనేక లీలా మహిమ ప్రదర్శన సద్గురు మూర్తిం
హరిహర బ్రహ్మాత్మక శ్రీ దత్తాత్రేయ పూర్ణావతారమ్ ॥ శ్రీ నృసింహసరస్వతి॥

జయగురుదత్త

శ్రీగురుదత్త

## శ్రీదత్త సేవలో



శ్రీ సీతేపల్లి చంద్రశేఖర్‌గారు,

వారి ధర్మపత్ని శ్రీమతి గాయత్రిగారు,

వారి పుత్రికలు చి॥ ప్రియాంక, చి॥ మానస

జయగురుదత్త    శ్రీగురుదత్త

# వినతి

శ్రీ సీతేపల్లి చంద్రశేఖర్‌గారు, వారి ధర్మపత్ని శ్రీ మతి గాయత్రి గారు పుణ్యదంపతులు. వారి సంతానము చి॥ ప్రియాంక, చి॥ మానస ధన్య కుటుంబము. ఈ దంపతులు దత్తవేదమును చదివి పరవశులై మరల దత్త వేదమును తృతీయ ముద్రణమునకు 30 వేల రూపాయలను గురుదక్షిణగా సమర్పించి యీ గ్రంథముద్రణమును కావించినారు. శ్రీదత్త సేవలో పాల్గొని నిజముగా యీ కుటుంబము తరించినది.

యింకనూ ఎన్నో గ్రంథములు ముద్రణము కావలసి యున్నవి. ఎన్నో దత్త భజనలు, శ్రీ దత్త భక్తులు వేణుగోపాలకృష్ణమూర్తి గారి నుండి వెలువడినవి ముద్రించబడవలసియున్నవి. మరియు క్యాసెట్స్ రూపంలో భక్తులందరికీ అందించవలసిన భక్తి కార్యక్రమమున్నది.

శ్రీ దత్త సేవలో పాల్గొనదలచిన వారు మమ్ములను సంప్రదించి పాల్గొనవచ్చును.

ఇట్లు
దత్తసేవలో
**చిలుకూరు బాలకృష్ణమూర్తి**
**శ్రీమతి భవాని**

**41-15-4**, నల్లగేటుడౌన్,
కృష్ణలంక, విజయవాడ-**13**.
ఫోన్ః **521809**

శ్రీ మహా గణాధిపతయే నమః శ్రీ మహా సరస్వత్యై నమః

శ్రీపాద శ్రీవల్లభ నృశింహ సరస్వతీ అక్కలకోట మహరాజ్
మాణిక్యప్రభు షిరిడి సాయినాథ శ్రీ సత్య సాయినాథ
శ్రీగురు దత్తాత్రేయాయ నమః

శ్లో॥ ఆదౌ బ్రహ్మ హరి ర్మధ్యే అన్తే దేవ సదాశివః
మూర్తిత్రయ స్వరూపాయ దత్తాత్రేయ నమోస్తుతే.

# శ్రీ దత్త వేదము

(శ్రీదత్తాత్రేయస్వామివారి దివ్యవాణి)

## అక్షరప్రసాదము

ఇందు

స్వామి : భగవాన్ శ్రీదత్తాత్రేయ స్వామి వారు

దత్తభక్తులు : డా॥ జన్నాభట్లవేణుగోపాలకృష్ణమూర్తి M.Sc.,Ph.D
కెమిస్ట్రీ ప్రొఫెసర్, రామిరెడ్డిపేట,
నరసరావుపేట.

నేను : చిలుకూరు బాలకృష్ణమూర్తి
రిటైర్డు డిప్యూటి జనరల్ మేనేజర్
ఆంధ్రప్రదేశ్ స్టేటు కో- ఆపరేటివ్ బాంకు

నివాసము : 41-15-4 నల్లగేటు డౌన్
కృష్ణలంక, విజయవాడ-13

నాధర్మపత్ని : చిలుకూరు భవాని

శ్లో॥ గురు ర్బ్రహ్మ గురు ర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః
గురు స్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః

శ్రీ గురుదత్త ! ఓం జయ గురుదత్త !

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## విషయసూచిక

ముందు మాట

అధ్యాయము–1 : స్వామి అద్భుత లీలలు– దత్త భక్తుల అనుభవాలు– మాకు నిదర్శనాలు–శ్రీదత్త భక్తులకు సప్త మహర్షుల దర్శనం – శ్రీదత్త సత్యశాయి శరణాష్టకమ్.

అధ్యాయము–2 : సాధన– ఆరాధన– మహాభావము– రాజయోగము– శ్రీదత్త స్వరూపము– ముముక్షువు– ఆహారనియమము– నన్నుచేరు మార్గము– భావ తీవ్రత.

అధ్యాయము–3 : శ్రీశైల రహస్యము–శ్రీముఖనామ సం॥ ఉగాది సందేశము –నరకలోకంలో విచారణ– సాక్షాత్కారము గొప్ప విషయము కాదు– శక్తి వినియోగము – కుండలిని – షట్చక్రములు –యమనియమములు.

అధ్యాయము–4 : స్వామి సర్వశక్తి సంపన్నుడు– పరబ్రహ్మము– నారాయణుడు –సదాశివుడు– శ్రీశక్తి – ఉపనిషత్సార సంగ్రహము.

అధ్యాయము–5 : బ్రహ్మ విష్ణు మహేశ్వరుల తత్త్వము– శంకర, రామానుజ మధ్వాచార్యుల సిద్ధాంతముల వివరణ– పరాభక్తి– పరాకాష్ఠ – అంత్యకాలములో తెలివి– మౌనవ్రత వివరణ– అంతర్ముఖోపాసన–సమాధి.

అధ్యాయము - 6 : నిష్కామము- జీవులకు పూర్తి స్వాతంత్ర్యము నిచ్చుట - దత్తపుత్రుడను నేనే- భగవద్గీత పారాయణము గురించి వివరణ - పూర్ణ దత్తోపాసన - కృష్ణాష్టమి సందేశము - రాసక్రీడా రహస్యము- మరణమునకు ముక్తికి సంబంధము లేదు- జీవన్ముక్తియే నిజమైన ముక్తి- నైష్కర్మ్య సిద్ధి.

అధ్యాయము - 7 : శ్రీదత్త భక్తులకు జరిగిన విచిత్రానుభవము - ప్రారబ్ధము - సంచితము - ఆగామి - దిగంబర శబ్ద- వివరణము - భక్తియే ముక్తికి ఏకైక మార్గము - అయ్యప్పను నే నొక్కడినే - మా దంపతుల సందేహ నివారణము - రేపు లేదు ఈ రోజుననే సాధన చెయ్యి - మోక్షము - దత్త పరీక్ష.

అధ్యాయము - 8 : యోగసిద్ధి - తృప్తి - పూర్ణసిద్ధి - అద్వైత సిద్ధి - అహంకారము- స్వార్థము త్యజించి నిష్కాముడవు కమ్ము - గురుపూర్ణిమ సందేశము - భావమే సాధన సర్వస్వము- శాంతి చేతనే యోగము సిద్ధించును. క్రియా యోగము.

అధ్యాయము - 9 : భగవంతుడు సర్వ వ్యాపకుడు - నిజమైన పుణ్య క్షేత్రము - శ్రీ దత్త జయంతి సందేశము- ఆధ్యాత్మిక సాధన జీవిత విధానము - శ్రీ సత్యశాయి రూపములో శ్రీదత్త దివ్యవాణి - ముగింపు.

అనుబంధమును పఠించి ఆనందించ వినతి.

శ్రీదత్త శరణం మమ

ప్రభుదత్త శరణం మమ గురుదత్త శరణం మమ



శ్రీ గణేశాయ నమః   శ్రీ గురుదత్తాత్రేయాయ నమః   శ్రీ సరస్వత్యై నమః

# శ్రీ దత్త వేదము

## ముందు మాట

భక్త మహాశయులకు మనవి. ముందుగా నన్ను నేను పరిచయము చేసుకొంటున్నాను. మేము చిలుకూరు వారము. మాది తెనాలి తాలూకా పిడపర్రు గ్రామము. ప్రస్తుతం విజయవాడలో స్థిరపడినాము. మా తండ్రిగారు సూర్యనారాయణగారు. మా మాతృదేవత చెల్లమ్మగారు. మాది హరితస గోత్రము. మేము ముగ్గురు అన్నదమ్ములము, ఒక సోదరి. నేను చిన్నవాడిని. నన్ను బాలకృష్ణమూర్తి అంటారు. నా సహధర్మచారిణి భవాని. ప్రభలవారి ఆడపడుచు. ప్రభల శేషాచలపతి, శారదాంబ పుణ్య దంపతుల కుమార్తె. వారిది భరద్వాజస గోత్రం ఆమె పుట్టిల్లు కూడా పిడపర్రు గ్రామమే.

పూర్వజన్మ పుణ్యఫలమో అన్నట్లు భగవదానుగ్రహం వల్ల మా దాంపత్య జీవితం మూడు పూలు ఆరు కాయలుగా సాగింది. భగవంతుడు మాకు ముగ్గురు పుత్రులను, ఇరువురు కుమార్తెలను అనుగ్రహించాడు. వారికి వివాహములై మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమరాళ్ళను ఎత్తుకున్నాము. మా జీవితంలో భగవదానుగ్రహం వల్ల కాశీ, రామేశ్వరం, హరిద్వారము, బదరీనాథ్, పశుపతినాథ్, షిరిడి, గానుగాపుర్, అక్కలకోట మొదలగు ఎన్నో పుణ్యక్షేత్రాల దర్శనం సేవ సంప్రాప్తించింది. ధన్యులం.

నేను గుంటూరుజిల్లా, ప్రకాశంజిల్లా కో- ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల కార్యదర్శిగాను, విజయవాడ, కృష్ణా, రాజమండ్రి కో- ఆపరేటివ్ సెంట్రల్ బాంకులలో జనరల్ మేనేజర్‌గాను పనిచేశాను. తరువాత హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ డిప్యూటీ జనరల్

మేనేజర్‌గా 1989 సంవత్సరంలో రిటైరయి నేను నా శ్రీమతి కొంతకాలము విజయవాడలోను, కొంతకాలము హైదరాబాదులోను, కొంత కాలము శ్రీశైలంలోను మా శేషజీవితాన్ని గడుపుతున్నాము.

మా పూర్వజన్మ పుణ్యఫలమా అన్నట్లు సుప్రసిద్ధ దత్త భక్తులు శ్రీ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తి గారితో 1992 సం॥ శివరాత్రి పర్వదినాన పరిచయం కలిగింది. వీరిది నరసరావుపేట. సుప్రసిద్ధ జ్యోతిష్కులు, సిద్ధాంతులు అయిన శ్రీ జన్నాభట్ల వీరభద్రయ్యగారే వీరి పితృదేవులు. హనుమాయమ్మగారు వీరి మాతృదేవత. శ్రీ వీరభద్రయ్యగారిని మేము తాతయ్యగారంటాము. వీరు మా గురుతుల్యులు శ్రేయోభిలాషులు.

శ్రీ వేణుగోపాల కృష్ణమూర్తిగారు M.Sc,Ph.D., కెమిస్ట్రీ ప్రొఫెసరు, సంస్కృత విద్యలో మేధావులు. 60కి పైగా గ్రంథాలు వ్రాశారు. సంస్కృతంలో ఆశువుగా కవిత్వం చెప్పగలరు. మంత్ర శాస్త్రము జ్యోతిష్యంలో అందె వేసిన చేయి. చిన్నతనంలో కంఠంలోతు నీటిలో నిలబడి అక్షర లక్ష గాయత్రి చేసి సిద్ధి సాధించిన మహా తపస్వులు. శ్రీవిద్య కొంతకాలం, శివ పూజ కొంతకాలం, శ్రీమహావిష్ణువును కొంతకాలం, ఆదిశంకరుల నాశ్రయించి అద్వైత విద్య కొంతకాలం నిర్వర్తించి అన్ని మార్గముల సిద్ధి సాధించినప్పటికి పూర్ణ తృప్తి నొందక చివరకు శ్రీ దత్తాత్రేయుడే త్రిమూర్త్యాత్మకుడు, పరబ్రహ్మ అని నమ్మి సేవించి సాక్షాత్కారము పొందిన పరమ భక్తులు. వారికి శ్రీదత్తాత్రేయ స్వామి సర్వకాలములలో సాక్షాత్కరిస్తారు. వారితో ప్రసంగిస్తారు. విన్నపములు వింటారు. విశదీకరిస్తారు. సమస్యలు పరిష్కరిస్తారు. వేయేల స్వామి దత్త భక్తులకు సర్వకాల సర్వావస్థలయందు ప్రసన్నులే. ఇది అతిశయోక్తి కాదు. ఇది అక్షర సత్యం. ఇందుకు మా దంపతులకు వారితో ఎన్నో అనుభూతులు వున్నవి. ఇక్కడ మా అనుభవం ఒకటి మచ్చుతునకగా పొందుపరుస్తాను.

నేను, నా శ్రీమతి, శ్రీ దత్త భక్తులు కలిసి శ్రీశైలం వెళదామని అనుకున్నాము. ప్రయాణం 22-3-93 ఉదయం 9గంటల బస్సులో

హైదారాబాదు నుండి. మా అబ్బాయి చి॥ రమణకు టిక్కెట్లు రిజర్వు చేయించమని చెప్పి మేము భార్యభర్తలము అయ్యప్పస్వామి దర్శనార్థం శబరిమల వెళ్ళాము. శబరిమల యాత్రకు వెళ్ళేటప్పుడు శ్రీదత్త భక్తులు మమ్మాశీర్వదించి పంపారు. 15-3-93 నుండి 21-3-93 వరకు శబరి మల యాత్ర జరిగింది. 21-3-93 హైదరాబాదు తిరిగి వచ్చాము. 22-3-93 శ్రీశైలం ప్రయాణం గదా. కాని శ్రీదత్త భక్తులకు 26-3-93 వరకు హైదరాబాదులో స్వంతపనులు ఉండటంవలన 22-3-93న శ్రీశైలం వెళ్ళటానికి వీలులేకపోవడం, అందువలన టిక్కెట్లు రిజర్వు చేయకపోవడం జరిగిందట. సరే! అంతా భగవత్సంకల్పం! అని ఊరుకున్నాము. ఉగాది 24-3-93 అయింది. నా శ్రీమతి అన్నది- ''ఉగాదికి వెళదామనుకున్నాము గదా. దత్త భక్తులకు 26-3-93 వరకు పనులు ఉండటంచేత వెళ్ళలేకపోయాము గదా. కనీసం 26-3-93న అన్నా వెళదామా ?'' అని. నేనన్నాను - ''అయిపోయింది గదా - ఈ సారికి శ్రీశైలం ప్రయాణం కాన్సిల్ '' అని.

అంతే...తరువాత ఎంత విచిత్రం జరిగిందో చూడండి. శ్రీదత్త భక్తులకు శ్రీ భ్రమరాంబ తల్లి సాక్షాత్కరించింది. కంటినీరు పెట్టుకుంది. ఏమిటి ఈ దృశ్యం అనుకున్నారు దత్త భక్తులు. ఇంతలో మాకు తెలిసిన వారు కాశీకి వెళుతున్నామని, అక్కడ యజ్ఞములు జరుగుతాయి మీరు కూడా వస్తారా అని ఫోను చేశారు. ఎలాగో శ్రీశైలయాత్ర లేదు గదా. కాశీకి వెళ్ళి యజ్ఞాలు చూచి వద్దామా అని మా దంపతులము అనుకు న్నాము. ఇలా సంకల్పించామో లేదో వెంటనే శ్రీ భ్రమరాంబ తల్లి శ్రీదత్త భక్తులకు దర్శనమిచ్చి ''నా ఉత్సవాలకు నా బిడ్డలిద్దరిని తప్పకుండా రమ్మనమను'' అని చెప్పిందట. శ్రీదత్తభక్తులు ఇరకాటాన పడ్డారట. వీళ్ళేమో కాశీకి వెళదామనుకుంటున్నారు. అమ్మ ఏమో శ్రీశైలం రావాలని ఆదేశిస్తున్నది. వీళ్ళకు ఎలా చెప్పాలా అని మధన పడ్డారు. ఇంతలో నా శ్రీమతి వచ్చి ''స్వామి ఏమంటున్నారు?'' అని దత్త భక్తులను ప్రశ్నించింది. అప్పుడు ఈ వివరం అంతా చెప్పారు మాకు. నా శ్రీమతి

అన్నది "స్వామి! తల్లికి చెప్పండి. ఈ సారి కాశీ వెళ్ళడానికి మంచి తోడు దొరికింది. యజ్ఞములు చూచి వస్తాము... అమ్మను కాశీకి వెళ్ళడానికి అనుజ్ఞ ఇమ్మని విన్నవించండి అని". వారు అమ్మకు విన్నవించారు. వెంటనే చైతన్య రూపంలో వున్న అమ్మ ముఖం ముడుచుకొని చిన్నపుచ్చుకుని ఎట్టి ఆదేశము ఇవ్వకుండా విగ్రహ రూపము తాల్చింది" అని చెప్పారు... మేము ఏమి చేయాలా అని ఆలోచనలో పడ్డాము శ్రీదత్త భక్తులు స్నానం చేయడానికి స్నానాల గదిలోకివెళ్ళారు. చిత్రం! విచిత్రం!! వణుకుతూ శ్రీదత్త, శ్రీదత్త అనుకుంటూ బయటకు వచ్చారు. విభూతి ధరించి, కళ్ళు మూసుకొని దత్తభజన చేస్తున్నారు. వారిలో చాలా మార్పు కనిపించింది. నేను అన్నాను " ఎందుకు అలా వున్నారు? స్వామి ఏమన్నారు?" అని. నా భార్య వంట ఇంట్లోనుంచి గబగబా వచ్చింది. ఏమిటి ?ఏమి జరిగింది? అంటూ. శ్రీదత్త భక్తులు ఇలా సెలవిచ్చారు. "నేను బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను గదా! అమ్మ సాక్షాత్కరించింది. ఆమెకు మహా ఉగ్రం వచ్చింది. నీవల్లనే ఇలా జరిగింది. నీ మూలకంగా వాళ్ళు శ్రీశైలం మానేశారు. నీవే బాధ్యుడివి" అని మందలించింది. "మీరు ఇరువురూ శ్రీశైలం వచ్చినా రాకపోయినా నేను మాత్రం వెంటనే వెళ్ళి అమ్మ దర్శనం చేసుకుంటాను" అన్నారు దత్తభక్తులు. నేను వెంటనే అన్నాను. "స్వామీ! శ్రీశైలం వస్తాము" అని. వెంటనే మరో విచిత్రం జరిగింది. శ్రీదత్త భక్తులకు అమ్మ మరల దర్శనం ఇచ్చింది. విశాలంగా చిరునవ్వు చిందించింది. అంతర్ధానమైంది . ఇంతే! అన్నారు దత్త భక్తులు. అప్పుడు శ్రీదత్తస్వామి శ్రీ దత్త భక్తులకు సాక్షాత్కరించారు. యిలా అన్నారట "వీళ్ళు కాశీకి వెళ్ళేది ప్రధానంగా శ్రీ విశ్వేశ్వరుడి దర్శనానికి కాదు. యజ్ఞం చూడడానికి గదా! అక్కడకు ఆ యజ్ఞం కోసమే వెళ్ళడం చెరకు నుండి రసం తీసిన తర్వాత మిగిలిన పిప్పిని సేవించడం మాత్రమే అవుతుంది. కాశీ విశ్వనాధుని దర్శించడం మంచిదే. ప్రధానంగా అందుకు కాదుగదా వీళ్ళ ప్రయాణం. శ్రీశైలం మోక్షప్రదమైనది. అక్కడ వాళ్ళకు అమృతం లభిస్తుంది. వాళ్ళు ఇప్పుడు కాశీకి కాదు

వెళ్ళవలసింది-శ్రీశైలం వెళ్ళాలి అన్నారట. ఈ విషయం మాకు శ్రీదత్త భక్తులు చెప్పారు. మా కళ్ళు చెమర్చాయి. కృతార్థు లము. వెంటనే శ్రీశైలం వెళ్ళడానికే నిశ్చయించుకున్నాము. అమ్మ సంతసించింది. వెంటనే శ్రీశైలం వెళ్ళాము. శివసదనములో స్వామి మాకు అనుగ్రహించిన 24వ నెంబరు గదిలో బస చేశాము.

ఎంత విచిత్రం! ఎంత ప్రత్యక్ష నిదర్శనం. శ్రీశైలం వెళ్ళిన తర్వాత మాకు నిజంగానే అమృతం లభించింది. చాలా చాలా విశేష అనుభూతులు కలిగినాయి. ఆధ్యాత్మిక అమృతపానం లభించింది. శ్రీదత్త భక్తులు మా దంపతులచేత అనేక పూజలు చేయించి మమ్ము పునీతులను చేశారు. మనం దేవుని విగ్రహం ఎదుట కూర్చుని ప్రార్థిస్తూ వుంటే తల్లి విన్నదో లేదో ఆమెకు మన ప్రార్థన వినిపించిందో లేదో అని భ్రమ కలుగుతుంది కదా. అది సరికాదు. తల్లి అన్నీ వింటుంది. మనం ఆమె వైపుకు ఒక అడుగు వేస్తే, ఆమె మనవైపుకు వంద అడుగులు వేస్తుంది. భగవంతుని కరుణ అపారం . అమ్మ ఎవరు? ఆదిపరాశక్తి. శ్రీదత్త భగవానుని మూలకారణ శక్తి. ఆ త్రిమూర్త్యాత్మకుడైన దత్తాత్రేయ స్వామియే. ఇందులో ఎట్టి సందేహానికిగాని, సంశయానికిగాని తావులేదు. శ్రీదత్త స్వామి, శ్రీదత్త భక్తులకు ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా అన్ని విషయాలు చెప్పేవారు. ఆ విషయాలు శ్రీదత్త భక్తులు మాకు చెప్పేవారు. ధన్యులం. శ్రీదత్త భక్తులు జన్మ జన్మాంతరములలో ఎంత పుణ్యం చేశారో గదా! ఎంత తపస్సంపన్నులో గదా. ఈ జన్మలో వారికి శ్రీగురుదత్త ప్రభువు సాక్షాత్కరించడం - సంభాషించడం జరుగుచున్నది. వారి సత్సంగం మా దంపతులకు లభించడం మా దంపతులం ఏ పుణ్యం చేసుకున్నామో! కృతార్థులము. అప్పటికి తెలిసినది అంతే! తర్వాత గాని మాకు అసలు విషయం తెలియలేదు. శ్రీ దత్త భక్తులు సాక్షాత్తు కాలభైరవులే. మమ్ముద్ధరించడానికి యేతెంచిన దైవము అని.

ఇది యదార్థగాథ. ఇక రెండు మాటలను మనవి చేస్తాను. త్రిమూర్త్యాత్మకుడయిన శ్రీభగవాన్ దత్తాత్రేయ గురుపరబ్రహ్మ స్వామి,

సర్వదేవ-దేవతా-బ్రహ్మర్షి -గ్రహసిద్ధాత్మకుడు. అపారజ్ఞాన సాగరులయిన స్వామివారు శ్రీదత్త భక్తులయిన శ్రీవేణుగోపాలకృష్ణమూర్తిగారికి కనిపించి ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు చెప్పుతూ వుంటారని, ఆదత్త భక్తులు, ధర్మపత్నీ సమేతుడనగు నాకు చెప్పుతూ వుండేవారు. ఎన్నో రోజులు శ్రీశైలంలో ఆ దత్త భక్తుడు మేము కలిసి వుండగా, ఎన్నో విషయాలు స్వామి చెప్పుతున్నారని ప్రతి క్షణమూ మా దంపతులకు చెప్పేవారు. ఆ విషయాలన్నీ విని ఆనందించామే కాని, వాటిని గ్రంథస్థం చేస్తే ఎన్నో భావితరాలకు సాధనలకు ఉపయోగపడతాయని ఊహించలేకపోయాము. కానీ హైదరాబాదులో మా స్వగృహంలో ఒకనాడు ఆ దత్తభక్తులు - ''స్వామి చేప్పే విషయాలన్నీ గ్రంథస్థం చేస్తే స్వామి వారికి నిజమైన సేవ చేసినట్లు అవుతుంది'' అన్నారు. అప్పటినుండి అలా చేద్దామని ప్రారంభించాము. ఆరోజు 12-3-1993 శుభదినం.

శ్రీ దత్త భక్తులను నా శ్రీమతి ఇలా ప్రశ్నించింది. ''తమ్ముడూ! స్వామి కనబడతారా లేక ఇదంతా ఆలాపనగా వస్తుందా?'' అని. దత్త భక్తులిలా చెప్పారు. ''అక్కా! ముందు నాలో ఒక విశేషశక్తి ప్రవేశిస్తుంది. స్వామి నన్ను ఒక కాలాతీత-అవస్థలోకి తీసుకువెళుతారు. ఆ అవస్థలో ఆయన ఒక గంట మాట్లాడుతారు. ఆయనను నిన్నెలా చూస్తున్నానో అలానే చూస్తాను. మరల ఈ లోకంలోకి రాగానే ఈ మాట్లాడిన గంట సమయం మన గడియారంలో 5 నిమిషాలు మాత్రమే అయి వుంటుంది'' అన్నారు. కొంచెం సమయం తర్వాత దత్త భక్తులిలా చెప్పారు. స్వామి దర్శనమిచ్చి ఇలా చెప్పారుట. ''భగవద్గీతను అర్జునుడికి ఇలానే చెప్పాను 18 అధ్యాయాలూ 18 గంటలసేపు కాలాతీత అవస్థలో చెప్పాను. కానీ కౌరవసేనలకది 18 క్షణాలే. ఇది తెలియక కొందరు యుద్ధం సిద్ధమైన సమయంలో 18 అధ్యాయాలు చెప్పే వరకు సేనలు ఆగినవా అని హేళన చేస్తారు'' అని. అప్పుడు నా శ్రీమతి మరల ఇలా ప్రశ్నించింది. ''మనకు 18 గంటలు దేవమానంలో 18 క్షణాలు కావచ్చును. కానీ, దేవమానంలో 18 గంటలు మనకు 18 క్షణాలు ఎలా అవుతాయి? అని . దత్త భక్తులిలా

వివరించారు - ''స్వామి సర్వశక్తిమంతుడు గదా. మన మానంలోని 18 క్షణాలను పైమానంలో 18 గంటలు చేయగలడు. దేవతను మనిషిగాను, మనిషిని దేవతగాను చేయగలడు స్వామి.''

ఉదయం 10.30 అయింది.నేను జపం చేసుకుంటున్నాను. నా శ్రీమతి వంట ఇంటిలో వంట చేస్తున్నది. శ్రీదత్త భక్తులు శివసదనం మధ్య తోటలో ఈశ్వరుని విగ్రహందగ్గర జపంచేసుకుంటున్నారు. ఇంతలో ఉన్నట్లుండి దత్త భక్తులు గబగబా గదిలోకి వచ్చి నాతో ఇలా అన్నారు- ''స్వామి ఇప్పుడే కనిపించారు. మీ భార్యాభర్తలను ఇరువురను ఒక ప్రశ్న వేయమన్నారు'' అంటూ నన్ను ప్రశ్నించారు. '' ఈ పిచ్చివాడు తడవకు ఒకసారి స్వామి కనిపించారు, ఇలా చెప్పారు, అలా చెప్పారు అని విసుగు పుట్టేట్టుగా అదే పనిగా చెప్పుతున్నాడు. నిజంగా స్వామి చెప్పుతున్నారా? లేక ఈయనకు ఏమైనా మతి చెలించిందా? ఇది అంతా సత్యమని మీరు నమ్ముతున్నారా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు నేను కొంచెం ఆశ్చర్య చకితుడనైనాను.

నేనన్నాను - ''ఎక్కువగా విని విని బుర్ర చెడగొట్టుకోవడం కంటే స్వామిని హృదయపూర్వకంగా ప్రేమించి వారి ధ్యానమే చేస్తూ స్వామి చెప్పినవాటిలో కొన్నైనా చేసి తీరాలని అనుకున్నాను. ఇప్పటివరకు స్వామి చెప్పిన విషయములన్ని యధార్ధములని నమ్ముతున్నాను'' అన్నాను. ఇంతలో నా భార్య వచ్చింది. ఆమెను కూడా ఇదే ప్రశ్న వేశారు దత్త భక్తులు. ఆమె వెంటనే తడుముకోకుండా ''మీరు చెప్పినవన్నీ సత్యములని నిస్సంశయముగా నమ్ముతున్నాను'' అన్నది. ఆమె ధన్యురాలు- ఎట్టి తడబాటు లేకుండా వెంటనే చెప్పింది.

అప్పుడు దత్త భక్తులు - ''మీరు ఇదంతా సత్యమని నమ్మితే పరమ ధన్యులు'' అన్నారు స్వామి. ఆహా! స్వామీ!మమ్మనుగ్రహించుటకే కాబోలు మాకీ పరీక్ష.

''స్వామి జ్ఞానసాగరులు. అంతులేని జ్ఞాన సముద్రం వారు. ఆ జ్ఞాన సముద్రంనుండి ఒక గుక్కో, రెండు గుక్కలో స్వామి మనకిస్తుంటేనే మనం తట్టుకోలేక పోతున్నాము'' అన్నారు దత్త భక్తులు.

శ్రీ స్వామి దత్త భక్తులకు మరల సాక్షాత్కరించి ఇలా సెలవిచ్చారు - ''నా సందేశములను గ్రంథ రూపముచేసి, ముద్రించి ఎందరో జీవులకు

నా ప్రాప్తియందు సహకరించుటకు చేయు ఈ ప్రయత్నము కూడా నా ఆరాధనమే. ఎందరు దీనిచేత తరింతురో వారి అందరి పుణ్యముల భాగములు నిన్ను చేరుచున్నవి. కాన నా తత్త్వ ప్రచారము వలన చాలా పుణ్యమును సాధించుకొని దానిద్వారా నా అపరిమిత అనుగ్రహమునకు పాత్రులగుదురు. మిగిలిన సాధన అంతయు నిన్ను నీవు ఉద్ధరించుకొనుట. ఇది పరుల నుద్ధరించుట కాన నా కార్యక్రమమున నీవు భాగముకొని నా కృపకు పాత్రుడవగుదువు'' అన్నారు స్వామి.

శ్రీదత్తాత్రేయస్వామివారి దివ్యవాణిని శ్రీదత్త భక్తులు యదాతథముగా గ్రంధస్థము చేసిన పుష్పరాజమే ఈ దత్తవేదము. శ్రీదత్త స్వామి వారి పాదపద్మములకు ప్రణమిల్లి, శ్రీదత్త భక్తులకు నమస్కరించి ఈ దివ్య దత్తవేదమును సమర్పించు భాగ్యము మా దంపతులకు కల్గినందుకు బ్రహ్మానందభరితులమగుచు కృతార్థులను చేయవయ్యా, అనుగ్రహించవయ్యా అని శ్రీస్వామిని ప్రార్థించుచు, శ్రీవారి దివ్యవాణిని ఆదేశరూపముగా శిరసావహించి 12-7-95 గురుపూర్ణిమనాడు భక్తకోటికి అందించగలిగాము. ఈ పవిత్ర గ్రంధము అందుకొన్న భక్తులు కృతార్థులు.

కాపీలు అయిపోయినవి భక్తుల కోరిక మేరకు శ్రీదత్త భగవానుని ఆదేశము మేరకు శ్రీ దత్త భక్తుల అనుమతితో మిత్రులు భక్తులు శ్రీ శిష్ట్లా భీమశంకరం గారు వారి సతీమణి శ్రీమతి వసుమతిగారు ఇంకా కొందరు మిత్రుల సహకారంతో శ్రీదత్తవేదము పునఃముద్రణ వేయుచున్నాము. సవితాప్రింటర్స్ అధినేత శ్రీసుబ్బరాజుగారి సహకారము ఎంతో చెప్పలేం. వారికి మాధన్యవాదాలు. సహకరించిన మిత్రులకు కృతజ్ఞతలు.

విజయవాడ :
ప్రమాధి నామ సం॥
మార్గశిర పూర్ణిమ
22-12-1999
బుధవారము.

ఇట్లు
శ్రీ దత్త భగవానుని సేవలో
**చిలుకూరు బాలకృష్ణమూర్తి**
**భవాని దంపతులు**

# ప్రార్థన

శ్లో॥ శ్యామలాం గిరి సుతాం సరస్వతీం
పాణ్డురాంచ కమలాం కలారుణామ్
దత్త ఏషపరిరభ్య భాసతే
సప్రయాగ ఇవ వాహినీత్రయః ॥

తా॥ శ్యామలయైన పార్వతిని, తెల్లని సరస్వతిని, అరుణవర్ణయగు లక్ష్మిని, కౌగలించుకొని శ్రీ దత్తుడు గంగా-యమునా-సరస్వతీ నదులతో కూడిన ప్రయాగవలె భాసించుచున్నాడు.

శ్లో॥ దృష్ట త్రిమూర్తి భిరతర్పిత మానసేన
బ్రహ్మవలోక పరమాగ్రహ నిశ్చలేన
అన్వేషితాయ చిరమత్రి మహర్షిణాతే
జ్వాలామయేన తపసా మమవన్దనాని ॥

తా॥ త్రిమూర్తులు గోచరించిననూ తృప్తి చెందని మనస్సుతో, బ్రహ్మమును దర్శించవలెనని పట్టుదలతో, జ్వాలలతో కూడిన తపస్సుతో అత్రి మహర్షి చేత అన్వేషించబడిన వానికి నా నమస్కారములు.

శ్లో॥ ఏకోదత్తో బ్రహ్మదేవోఽ స్యకర్తా
విష్ణుర్దేవో ఽ ప్యేషలోకస్యభర్తా
ఈశోదేవో ఽ ప్యేషలో కస్యహర్తా
భిన్నైరూపైర్మాయయా భక్త హేతోః

తా॥ ఒకే దత్తుడు, ఈ జగత్కర్తయగు బ్రహ్మ దేవునిగా, ఈ లోక భర్తయగు విష్ణుదేవునిగాను, ఈ లోక హర్తయగు ఈశ్వరదేవునిగాను, భక్తులకోసము, మాయ చేత భిన్నరూపములను ధరించుచున్నాడు.

శ్లో॥ మదిరాచషకేన దణ్డపాణిం
శునకై రావృతమన్త్య జాఙ్గ రూపమ్
పితృకర్మ పురోహితార్థమేతో
వికలః పశ్యతి భార్గవోఽపిదత్తమ్ ॥

తా॥ పితృకర్మనాచరించుటకు పురోహితునిగా వరించి వచ్చిన పరశు రాముడు, కల్లుకుండతోను, కర్ర చేతిలో నుండగా, కుక్కలతో చుట్టబడి చండాల రూపములో నున్న స్వామిని వికలుడై చూచుచున్నాడు.

శ్రీ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి
దత్త భక్తులు.

శ్రీ గురుదత్త ! ఓం జయ గురుదత్త !

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము -1

## శ్రీ దత్తుని అద్భుత లీలలు మచ్చుకు కొన్ని

స్వామి దివ్య సందేశము ఇలా ఉన్నది :-

" యాత్ర దేహము అనుభూతి అగును మనసు
మనసు లేని దేహము యేల ? మనమునందు
దేవతా రహస్యములను తెలిసి దాచి,
తలచి తదుపాసననుఁ జేయ ధన్య మగును ".

అన్నారు స్వామి. శ్రీ దత్త భక్తులకు బహుదేవ-దేవతల సాక్షాత్కారం కలిగినది. శ్రీ దత్త ప్రభువు అనేక దివ్యదర్శనములనిచ్చారు. అనేక రసవత్తరమైన సత్యములను తెలియచెప్పారు. దివ్య దృశ్యములను సందర్శింపచేశారు. దేవరహస్యములను తెలిసి దాచి తలచి తదుపాసన చేసి ధన్యమగునని స్వామి ఆదేశము గదా ! అందువలన భక్తమహాలోకము నిరాశ చెందకుండుటకు, భగవంతునిపై సద్భక్తి పెంపొందకలందులకు కొన్ని దివ్యలీలలను స్వామి అనుగ్రహంతో ఇక్కడ పొందుపరచు చున్నాము.

1. అది చైత్రమాసం నేను నా ధర్మపత్ని, శ్రీ దత్త భక్తులు కలిసి శ్రీశైలం వెళ్ళాము. పూర్ణిమ వెళ్ళిన తర్వాత మంగళవారం కాని శుక్రవారం కాని ఏది ముందువస్తే ఆరోజు శ్రీ భ్రమరాంబదేవికి కుంభోత్సవం జరుపుతారు. ఆరోజు అమ్మవారు చాలా ఉగ్రరూపంలో వుంటుందట. శ్రీదత్తస్వామి సాక్షాత్కరించి, దత్త భక్తులను ''ఈరోజు సౌందర్యలహరి పారాయణ చెయ్యి'' అని ఆదేశించారట. ఆ ఉదయం మేము ముగ్గురము సాక్షిగణపతి, పాలధార, పంచధారలు, హటకేశ్వరము, శిఖరము దర్శించాము 'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' అన్నారు కదా. ''స్వామీ! శిఖరదర్శనం చేయించమని'' శ్రీ గురుని దత్త భక్తులుప్రార్థించారట. కొండమీదరోలులో నువ్వులు, బియ్యం వేసి పాత్రం తిప్పుతూ నంది కొమ్ముల మధ్యనుండి శిఖరదర్శనం చేయాలి. మేమందరము చేశాము కానీ శిఖరదర్శనం ఏమీ కాలేదు. శ్రీ గురుని కృపాకటాక్షం చేత శ్రీదత్త భక్తులకు తళుక్కుమని శిఖరదర్శనమైందట. వారు ధన్యులు. దత్త భక్తులు పాతాళగంగలో స్నానం చేశారు. సౌందర్యలహరి పారాయణ ఆపకుండా చేస్తూనే యున్నారు. సాయంత్రం అయేసరికి సౌందర్యలహరి 100 శ్లోకాలు ఆరుసార్లు పారాయణ చేశారు. శ్రీభ్రమరాంబతల్లి దేవళంలో అమ్మవారి ఎదుట సింహ వాహనం ఉంది. ఆ వాహనం వద్ద కూర్చుని పారాయణ చేస్తున్నారు దత్త భక్తులు. రాత్రి 7-30 అయింది. ఉత్సవ అనంతరం గర్భగుడి మూసివేశారు. వెంటనే ఒక విచిత్రం జరిగింది. భ్రమరాంబ తల్లి కుమారి రూపంలో 9 ఏండ్ల బాలికగా నల్లగా బొద్దుగా నల్లని కురులతో విరబోసిన జుట్టు, ముఖముపై విభూతి రేఖలు, కుంకుమబొట్టు, ఎర్రనిలంగా ధరించి ఎగురుకుంటూ అమ్మవారి విగ్రహం లో నుండి వచ్చి, ''ఎన్నాళ్ళైందిరా విని'' అంటూ చాలా ఆనందంగా వచ్చి శ్రీ దత్త భక్తులను పట్టుకొని ఎడమ భుజముపై గట్టిగా ముద్దు పెట్టుకొని అంతర్ధానం అయిందట. మరుసటి ఉదయం శ్రీ దత్త భక్తులకు శ్రీగురుడు ఆదిశంకరులరూపంలో దర్శనమిచ్చి ఈ విధంగా వివరణ ఇచ్చినారట.

" ఆ తల్లి ఎవరనుకున్నావు?'' "ఏషావై భ్రామరీ పూర్వరూపం'' అన్నారట. పూర్వం ఆదిశంకరులు సౌందర్య లహరిని జపించి శ్రీ భ్రమరాంబ దేవిని ఆనందింపచేశారు అప్పుడు. మరి ఇప్పుడో? శ్రీ దత్త భక్తులు సౌందర్యలహరి ఆరుసార్లు పారాయణ చేయడంవల్ల మరల అమ్మ అదే ఆనందం పొందింది'' అని వివరించారు. ఆహా! ఎంతటి నిదర్శనం.

శ్రీ గురుడు దత్త భక్తులకు ప్రత్యక్షమై సౌందర్యలహరిలోని 96వ శ్లోకవము విషయమై యిట్లు వచించినారట. ఈ శ్లోకవములో కొన్ని అక్షరములు ఆదిశంకరులు చెప్పినవి కావట. కాలక్రమేణ మారినవట. అందువలన నీచ భావము స్ఫురించుచున్నదట. ఇది సరికాదట. మార్పు చెందిన శ్లోకార్థము నీచభావమును కలిగియున్నదట.

"పతివ్రతయగు ఓ తల్లీ ! సరస్వతీదేవిని ఎందరు కవులు పొందుటలేదు! ధనము సంపాదించి ఎందరెందరో లక్ష్మీపతు లగుట లేదా?'' అను నీచ భావము వచ్చినదట. శారదోపాసకుడును, కనకధారా స్తుతికర్త ఇట్లు చెప్పునా? అనుచూ స్వామి శ్లోకమును ఆదిశంకరులు ఎట్లు చెప్పిరో చెప్పినారు. దీని అర్థమిట్లున్నది.

"ఏ కవి అయిననూ వాణీపతి కాగలడా? ఎంత ధనవంతుడయిననూ లక్ష్మీపతి కాగలడా?'' అని.

ఇది సమంజసము.

ఆదిశంకరులు చెప్పిన శ్లోకం---

"కళత్రం వైధాత్రం కతికతి భజంతే నుకవయః
శ్రియోదేవ్యాః కోవా ప్రభవతి పతిః కైరపి ధనైః
మహాదేవం హిత్వా తవసతి సతీనా మచరమే
కుచాభ్యా మాసంగః కురవకతరో రప్యసులభః''

ఇది ఎంత వింత ?

2. ఆరోజు మంగళవారము తేదీ 14-4-92. మేము, (నేను, నా శ్రీమతి, శ్రీ దత్త భక్తులు) శ్రీశైలంలో ఉన్నాము. ఉదయం

నిద్రలేవగనే స్వామి శ్రీ దత్తభక్తులతో ఇలా అన్నారు. '' ఈరోజు చాలా ప్రమాదకరమైనది. ఉదయం గం. 11-00లకు ప్రమాదం జరగవచ్చు. అపమృత్యుదోషం వున్నది.మరల రాత్రి గం.11-00లకు సర్ప దోష మున్నది. కనుక ఈరోజంతా భగవధ్యానం చేయండి''. అని ఆదేశించారు.

శ్రీదత్తభక్తులు మాచేత ఆ రోజంతా భగవధ్యానం చేయించారు. రాత్రి 11-00 దాటేవరకూ ఎక్కడకూ పోకుండా బసలోనే వున్నాము. తర్వాత నిద్రించాము. మరునాడు 15-4-92 ఉదయం శ్రీ స్వామి దత్త భక్తులకు దర్శనమిచ్చి ఇలా వివరించారు. ''వాయువ్యకోణే సర్పదోషనివృత్తి ః'' అని. క్రిందటి రాత్రి వాయువ్యదిశలో సర్పదోష నివారణ చేసినట్లు స్వామి శ్రీదత్త భక్తులకు వివరించారు. నాకు, నాధర్మపత్నికి అపమృత్యు దోషనివారణ చేశారు స్వామి. స్వామి చాలా ప్రసన్నులైనారట. ''వీరిద్దరూ నా పుత్ర పుత్రికలే. ముందు జీవితం భగవతారాధనలో చక్కగా గడపడానికి అపమృత్యుదోషనివారణచేసి పునర్జన్మనిచ్చాను'' అన్నారట స్వామి. స్వామీ! ఎంతటి కరుణా సముద్రుడవయ్యా! మేము మూఢులము! చంచలమైన మనస్సు కలవారము. మామీద ఇంతటి కరుణ! స్వామీ! ధన్యులను చేశావా ప్రభూ!.

ఈనాడు 23-11-99. 7 సంాలు గడిచాయి ఆహా!! స్వామి మాచేత ఎంతోసేవ చేయించారు శ్రీదత్తవేదము, గురుస్తుతి,భోగభాగ్య గుళికలు, శ్రీదత్తసూక్తులు, శ్రీదత్తామృతము, శ్రీదత్త ఉమామహేశ్వర స్తోత్రము, శ్రీపాదవల్లభులు, శ్రీనరసింహసరస్వతి స్వామివారు, శ్రీమాణిక్యప్రభువు, శ్రీ అక్కలకోట మహరాజ్, శ్రీషిరిడి సాయి నాధుడు, శ్రీదత్త కాలభైరవస్తుతి, శ్రీదత్తగురు భగవద్గీత, మరచి పోకుము దత్తుని మంచిమాట, శ్రీసత్యసాయి నాధుడు మొదలగు ఎన్నో పవిత్రగ్రంధములు వెలువరింప చేశారు. ఆహా! ప్రభూ! ధన్యులం.

3. శ్రీశైలంలో అఖిలభారతీయ కరివెన బ్రాహ్మణ నిత్యాన్న దాన సత్రమున్నది. 13-4-92 న మేము శ్రీవారి అభిషేకము, భ్రమరాంబ

తల్లికి కుంకుమార్చన ముగించుకొని భోజనానికి కరివెన సత్రానికి వెళ్ళాము. అక్కడ శ్రీ మహరాజ్ అను మహర్షి శివపురాణం పారాయణ చేసుకుంటున్నారు. బంగారువంటి దేహచ్ఛాయ వారిది. వయస్సు 70 సంవత్సరములకు పైగా వుండవచ్చు. వారిని చూడగానే ''మహాత్ములు'' అని ఎవరైనా నమస్కరిస్తారు. వారిని సేవించుకుంటున్నాము. వారుకూడా మమ్ములను ''భవాని బాలకృష్ణ'' అని శ్రీదత్త భక్తులను ''పండిట్‌జీ'' అని పిలుస్తూ ఆప్యాయంగా ఆదరించారు. రోజూ వారి దర్శనం చేసుకుంటున్నాము. 16-4-92 మధ్యాహ్నం శ్రీ దత్త భక్తులకు స్వామి సాక్షాత్కరించారు. మధ్య ఈశ్వరరూపం, ఇటు అటు బ్రహ్మ విష్ణు ముఖములు గలవట. తెల్లగా విభూది రేఖలతో ఈశ్వరరూపంలో దత్తస్వామి వెలిగిపోతున్నారట. వారిపాదములవద్ద శ్రీమహరాజ్ సేవించుకుంటున్నారట. ఈ దృశ్యం శివసదనంలో 24 నెం॥ గదిలో జరిగింది. శ్రీదత్త భక్తులను శ్రీమహరాజ్‌జీ, శ్రీ మహరాజ్‌జీని శ్రీదత్తభక్తులు ఒకరి నొకరు చూచుకున్నారట. ఇది దృశ్యం. ఇలా దర్శనమిచ్చారని శ్రీ దత్తభక్తులు మా దంపతులకు వెంటనే చెప్పారు. శ్రీదత్త భగవానులు శ్రీ దత్త భక్తులతో ఇలా వచించారట ''నాయనా! ఈ శ్రీ మహరాజ్ ఎవరను కున్నావు? ఈయన సాక్షాత్తు మార్కండేయుని రూపాంతరమే'' నని. ఆరోజు రాత్రి మేము ముగ్గురము శ్రీమహరాజ్‌జీని సత్రంలో మరల దర్శించుకున్నాము. కొంచెంసేపు సంభాషణ అయిన తర్వాత వారు ఇలా పాడారు.

'' ఆజ్ మీ దత్తకో దేఖ్‌లియా'' అంటే ''నేను ఈరోజు శ్రీదత్తాత్రేయస్వామిని దర్శించాను'' అని. మధ్యాహ్నం శ్రీదత్తభక్తులకు కనిపించిన దృశ్యం, రాత్రి శ్రీమహరాజ్‌జీ వారిపాట ఎంత వింత? సాక్షాత్తు శ్రీ మార్కండేయ స్వామిని వారి రూపాంతరంలో దర్శించి ధన్యుల మయ్యాము.

4. మరియొక అద్భుతం. 17-4-92 శుక్రవారము. మేము శ్రీమహరాజ్‌జీని దర్శించుకున్నాము. వారు శివపురాణం పారాయణ

చేసుకుంటున్నారు. మేము వారి సన్నిధిలో కూర్చున్నాము. శ్రీ మహరాజ్‌జీ ''ఆవ్ బేటీ! ఆవ్ బేటీ! అని లాలించి ఆనాటి శివపురాణ పారాయణలోని ఘట్టం ఇలా సెలవిచ్చారు ''కార్తికేయుని చూడడానికి కైలాసం నుండి పార్వతీదేవి ప్రతి పౌర్ణమి రోజున జ్యోతిర్లింగమైన మల్లికార్జునమ్ అంటే శ్రీశైలం వేంచేస్తుందట. శ్రీశైలమే క్రౌంచపర్వతమట'' అని.

అనంతరం మేము మా వసతి గృహానికి వెళ్ళాము మరునాడు శ్రీదత్త భక్తులకు శ్రీ దత్తాత్రేయస్వామివారు దర్శనమిచ్చి శ్రీదత్త భక్తులకు ఈ విధంగా వివరణ ఇచ్చారు. అమ్మవారు పార్వతీదేవి ప్రతి పూర్ణిమనాడు కైలాసంనుండి శ్రీశైలం వేంచేస్తుందని ఈనాడు పూర్ణిమ శుక్రవారం సాయంత్రం 4.00 గంటలకు కైలాసంనుండి వచ్చి శనివారం ఉదయం 8.00 గంటలవరకు శ్రీశైలంలో వున్నారని శెలవిచ్చారు. దీనికి నిరూపణ ఎంత సత్యంగా వున్నదో చూడండి. ఇది పరమాద్భుతము. మనవి చేస్తాను. ఆరోజు ఏం జరిగిందంటే-శుక్రవారం ఉదయం శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలోకి వెళ్ళగానే నాకు ఎన్నడూలేని అంతటి నీరసం వచ్చింది. నిలబడలేకపోయాను. వెంటనే స్వామి వారి ప్రసాదం పులిహోర మూడు పొట్లాలుకొని తెచ్చాను. ఒకటి నాకు, ఒకటి నా శ్రీమతికి, ఒకటి దత్త భక్తులకు అని. నేను తిని కాసిని నీరు త్రాగాను. నీరసం తగ్గినది. వారిద్దరు తరువాత తింటామని సంచీలో వేసుకున్నారు. పూజలు ముగించుకొని శివసదనంలోని మా గదికి వచ్చాము. విశ్రాంతి తీసుకున్నాము. సాయంత్రం 4గంటలకు శ్రీదత్త భక్తులు ''వ్యాఘ్రాన్న ప్రియమానస'' అంటూ పులిహోర పొట్లాలు రెండు తినేశారు. కొంచెం ప్రసాదం నా శ్రీమతికి పెట్టారు. తర్వాత శ్రీదత్త భక్తులు ఇలా అన్నారు, ''అమ్మ కైలాసం నుండి ఇప్పుడే సరాసరి ఇక్కడకు అంటే మన వసతి గృహానికి వేంచేసింది. పులిహోర ఆరగించి ఆలయానికి వెళ్ళింది'' అని. అమ్మ పులిహోర ఆరగిస్తున్న సమయంలో నాకు దగ్గు వచ్చింది. అమ్మకు ఎంత వాత్సల్యం! అమ్మ నా ఆరోగ్యం గురించి పరామర్శించింది. ఆదిత్య హృదయం చేసుకోమన్నది. మరునాడు శనివారం ఉదయం 8.00లకు

శ్రీ దత్త భక్తులు ఇలా అన్నారు ''అమ్మ ఇప్పుడే కైలాసం వెళ్ళింది'' అని. కళ్ళకు కట్టినట్లు శివపురాణ వాక్యం ఎంత సత్యమో చూడండి. శ్రీ మహరాజ్‌జీ మహానుభావులు. శ్రీ దత్తభక్తులు సిద్ధులు. మేము ధన్యులము. మనమందరము అదృష్టవంతులమే. మమ్మనుగ్రహించవయ్యా యని శ్రీగురునికి ప్రణమిల్లెదము.

5. ఇక గురుచరిత్ర పారాయణ మహత్యం గురించి మా అనుభవము మనవి చేస్తాను. శ్రీముఖనామ సంవత్సర అధిక భాద్రపద ఏకాదశి ఆదివారము (12-9-93) ఉదయం విజయవాడలో బయలుదేరి సాయంత్రం శ్రీశైలం చేరాము. శివసదనంలో బస ఏర్పాటుచేసుకొని దైవదర్శనానికి వెళ్ళాము. స్వామివారి అమ్మవారి దర్శనం చేసుకొన్నాము. 13-9-93 సోమవారం అర్చన పూర్తిచేసుకున్నాము. 14-9-93 మంగళవారం ఉదయం గురుచరిత్ర దీక్షగా పారాయణ పూర్తి చేసుకున్నాము. శ్రీనృసింహ సరస్వతీ గురుదేవులను ధ్యానించుకొని హారతిచ్చాము. ప్రతిసారి గురుచరిత్ర పారాయణ పూర్తి కాగానే ఒక అనుభవం కలగడం పరిపాటి. ఈ రోజు స్వామి ఎలా అనుగ్రహిస్తారో అనుకున్నాము నేను, నా శ్రీమతి. ''తప్పక ఫలితం లభిస్తుంది. ఎట్టి సందేహం లేదు'' అన్నది నా శ్రీమతి. ఎదురు చూశాము. ఇంతలో ఒక అద్భుతం జరిగింది.

ఆశ్చర్యం! గానుగాపురం నుండి శ్రీ నృసింహసరస్వతి స్వామి వారి పీఠముతో స్వాములవారు, వారి మాతృమూర్తి వేంచేశారు. మా గది పక్కనే వారికి వసతి ఇచ్చారు. మాకు వారి దర్శనం, వారి మాతృమూర్తి అనసూయాదేవి దర్శనం, శ్రీనృసింహసరస్వతి స్వామివారి పాదుకల దర్శనం, తీర్థప్రసాదములు అనుగ్రహించారు. ఇది గురుచరిత్ర పారాయణ ఫలిత నిదర్శనం కాదా!

6. మరియొక అద్భుత సన్నివేశం మనవి చేస్తాను.

శ్రీ దత్త భక్తులు నరసరావుపేటలో యుండగా ఒక శనివారము నాడు ఒక విప్రశ్రేష్ఠులు వచ్చారట. ఆయన తెల్లగా, కాంతివంతముగా ముఖ తేజస్సు కల్గియున్నారట. తెల్లని పంచె, జుబ్బా వేసుకున్నారట. ముఖముపై

ఎర్రని కుంకుమబొట్టు ఉన్నదట.వారు వస్తూనే అన్నారట --

" ఏమండీ! మీ నాన్నగారు ఉన్నారా? అని ప్రశ్నించారట. (శ్రీదత్త భక్తులనాన్నగారు శ్రీజన్నాభట్లవీరభద్రయ్య గారు, జ్యోతిష్కులు, సుప్రసిద్ధ సిద్ధాంతులు)

"లేరండి" అంటూ లేచి నిలబడి, వారికి నమస్కరించి కూర్చోమన్నారట దత్త భక్తులు. వారు కూర్చుంటూ- "వారి పెద్దబ్బాయి ఉన్నారా?" అని అడిగారట. "నేనే వారి పెద్దబ్బాయిని"- "రండి కూర్చోండి" అన్నారట. వారు కూర్చున్నారట. అప్పుడు దత్త భక్తులు " ఏం పనిమీద వచ్చారు? అని పలకరించారట.

అప్పుడు వారు అన్నారట. "నేను జాతక విషయంలో సంప్రదించాలని వచ్చాను అంటూ వారి జాతక వివరములు తెల్పుతూ,మీరు జ్యోతిష్కులే గదా దీని భావము తెల్పండి" అని

| | | | |
|---|---|---|---|
| ల శు | కే | చ | |
| | మీనలగ్నం | | గు |
| కు | రోహిణీ నక్షత్రం | | |
| | | ర రా | బు శ |

కోరారట. వారు ఇచ్చిన జాతక చక్ర వివరములు ఇలా ఉన్నవట. అప్పుడు దత్త భక్తులు ఇలా చెప్పారట.

1. లగ్నం మీద శుక్రుడు ఉచ్ఛ
2. తృతీయంలో చంద్రుడు ఉచ్ఛ
3. పంచమంలో గురువు ఉచ్ఛ
4. లాభంలో కుజుడు ఉచ్ఛ
5. సప్తమ మారక స్థానంలో బుధ, శనులు ఉన్నారు.
6. అష్టమంలో రవి, రాహువులు

అయ్యా, ఈ జాతకుని తండ్రిగారికి అగ్నిప్రమాదం జరిగి వుంటుంది కాని ప్రాణ హాని జరిగి వుండదు. ఈ జాతకునికి వివాహం జరిగి వుండదు. సన్యాసాభాస కలిగి వుంటుంది. వేదాంతం చక్కగా చెప్పగలరు అని ఈ విధంగా ఒక్కొక్క విషయం చెపుతూ ఉంటే వారు నవ్వడం మొదలు పెట్టారట అంతా 10,15 నిమిషాలలో జరిగిందట. ఇంతలో వారు పెద్ద పెట్టున పకపకా నవ్వుతూ కుర్చీలోంచి లేచి'' ఇది ఎవరి జాతకం అనుకున్నావు?'' అంటూ చటుక్కున అదృశ్యమైనారట. ఆ సన్నివేశంతో దత్త భక్తులు కొంచెంసేపు నిశ్చేష్టులైనారట. స్వయంగా శ్రీ దత్త ప్రభువే వచ్చి, ప్రసంగించి, ఆశ్చర్యపరచి, అంతర్ధానమైనారట. ఆహా!! ఏమి విచిత్రం!! ఎంత అద్భుత సన్నివేశం!!!

## మరియొక అద్భుతం.

7. శ్రీ శేషాద్రి వాసులయిన శ్రీ అలమేల్మంగా సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారు త్రిమూర్త్యాత్మకులు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపులు. ఆదిపరాశక్తికూడా. సాక్షాత్తూదత్తస్వామియే శ్రీవెంకటేశుడు. శ్రీదత్త భక్తులు కాలేజీ పనులమీద తిరుచానూరులో దేవస్థానం ప్రక్కన ఒక కాలేజీలో 15 రోజులుండటం తటస్థించిందట. కాని ఒకరోజు కూడా అమ్మవారి దేవాలయానికి కాని, కొండమీద శ్రీవారి దర్శనానికి గాని వెళ్ళలేదట. ఈ విషయము విని మేము ఆశ్చర్యపోయాము. ఇన్నాళ్ళు

ఉండికూడా ఒక్కరోజున కూడా దర్శనం చేసుకోలేదేయని. '' ఏమిటి ఇలా చేశారు?'' అన్నాము. శ్రీ దత్త భక్తులు ఇలా వివరించారు :

''నేను కాలేజీ పని మీద తిరుచానూరులో వున్నాను. విపరీతమైన తుఫాను వచ్చింది. ఆనాటి రాత్రి నాకు విపరీతమైన జలుబుచేసి, ముక్కు బంధించింది. శ్వాస రావడంలేదు. చెమట పట్టుతోంది. ప్రాణాలే పోయేట్లున్నవి. ''స్వామీ! దత్తా!'' అని ప్రార్థించాను. శ్రీ స్వామి సాక్షాత్కరించారు. ''స్వామీ! నాప్రాణం పోయేట్లున్నది ఊపిరి ఆడటం లేదు. అనుగ్రహించండి స్వామీ!'' అని వేడుకున్నాను. స్వామి నవ్వారు. అవసాన కాలం. ఆఖరి క్షణం వచ్చిందా? అయితే నన్నే స్మరించు ''అని అదృశ్యులయ్యారు. అప్పుడు అనుకున్నాను. ఇదే ఆఖరి క్షణం కాబోలు అని. వెంటనే శ్రీ దత్తస్మరణ చేశాను. ఆశ్చర్యం!! బాధ అంతా అదృశ్యమైంది. ఇదే దత్త కృప. రాత్రి గం.12.00 అయింది. పై అంతస్థులోవున్నాను. శ్రీ వెంకటేశ్వరస్వామి వారు, పద్మావతీదేవి, లక్ష్మీదేవి సమేతుడై దర్శనమిచ్చారు. నాతో ముచ్చటించారు. ఇలా అక్కడ ఉన్న అన్నిరోజులు రాత్రి 12 గంటలవేళ స్వామి దర్శనం ఇస్తూనే ఉన్నారు. ఇలా వుండగా కాలేజీ వాళ్ళు కారు తీసుకొస్తాము. మనం కొండమీదికి వెళ్ళి శ్రీవారి దర్శనం చేసుకోవడానికి ఏర్పాటు చేస్తాం, రేపు వెళదామా? అన్నారు. ''కానీయండి'' అన్నాను. ఆనాటి రాత్రి 12.00 గంటలకు శ్రీవారు లక్ష్మీ, పద్మావతీ సమేతులుగా దర్శనమిచ్చారు. నేను చూస్తూ వుండగనే లక్ష్మీ, పద్మావతులు ఐక్యం అయ్యారు స్వామిలో. స్వామి అన్నారు, ''మేము రోజూ నీకు దర్శనం ఇస్తూనే వున్నాము కదా - రేపు ప్రత్యేకంగా నీవు కొండ మీదకి రావడం ఎందుకు?'' అని నవ్వుతూ అదృశ్యులయ్యారు. ఇది కారణం'' అన్నారు దత్త భక్తులు. వారు సిద్ధులు గదా. ఇంతకంటే అదృష్టం వుందా!

8. మరో అద్భుత సన్నివేశము. ఆనాడు 21-1-1995 భావనామ సంవత్సర పుష్య బహుళ పంచమి శనివారము సాయంత్రం

5.00గం. అయినది. మాదంపతులము విజయవాడ నుండి గుంటూరు వెళ్ళి అక్కడ మా అమ్మాయి శ్రీమతి శ్రుతకీర్తి - రమేష్‌కుమార్ వాళ్ళ ఇంట్లో వుండటం జరిగింది. మా అమ్మాయివాళ్ళు లక్ష్మీపురంలో రమ్య అపార్టుమెంట్సులో వుంటున్నారు. శ్రీదత్త భక్తులు మా అమ్మాయివాళ్ళ ఇంటికి వచ్చారు. ఆయన సాయంత్రం 6.10 నిమిషాలకి రైలులో నరసరావుపేట వెళ్ళాలి. కుర్చీలో కూర్చున్నారు. వారిమీద స్వామి ఆవహించే వున్నారు అనిపించింది. అప్పుడు సాయంత్రం 5.35 అయినది. '' ఒక కాగితం పెన్ను తీసుకుని నేను చెప్పింది వ్రాయండి'' అన్నారు. నేను సిద్ధమైనాను. దత్త భక్తులు అప్పటివరకూ మూసుకునియున్న కళ్ళు తెరచి ఇలా అన్నారు. '' ఇప్పుడే సప్తమహర్షులు ప్రత్యక్షమై శ్రీసత్యసాయియే శ్రీ దత్తాత్రేయుని వర్తమాన అవతారమనియు వారిపై శరణాష్టకము ఆశువుగాచెప్పమని వారిలో అంగీరస మహాముని ఆదేశించి అదృశ్యులయ్యారు అని''. వెంటనే శ్రీదత్త భక్తులు, శ్రీదత్త సత్యసాయి శరణాష్టకమును ఆశువుగా చెప్పారు. వ్రాసే అదృష్టం శ్రీ స్వామివారు నాకు అనుగ్రహించారు. ధన్యుడను. అప్పటికి గం.6.10 దాటుతున్నది. రైలు వెళ్ళే టైము అయిపోయింది ఇంకేం అందుతుంది అనుకున్నాము. మామనుమడు శ్రీనివాసు స్కూటర్‌మీద వారిని స్టేషనుకు తీసుకు వెళ్ళాడు. రోజు సకాలానికి వెళ్ళే రైలు ఈరోజు ఇంకా రానేలేదు. ఎంతటి వింత! సిద్ధుల సంకల్ప బలం!!

## శ్రీ దత్త సత్యశాయి శరణాష్టకమ్

శ్లో॥ శ్రీ దత్తదేవ భగవత్ కరుణావతార
శ్రేణిస్ఫురన్మణిగణోజ్జ్వల మధ్య రత్నమ్
మాయాంధకార పటలీపటపాటనాంశుం
శ్రీ సత్యశాయి తరణిం శరణం ప్రపద్యే॥

తా॥ శ్రీ దత్తాత్రేయ భగవానుని కరుణావతారములను ప్రకాశించు మణుల మాలలోని ముఖ్యమైన రత్నమును, మాయాంధకార సమూహ మను వస్త్రము చీల్చు కిరణములు కల శ్రీ సత్యశాయి సూర్యుని శరణము

పొందుచున్నాను.

శ్లో॥ ఛాయాగ్రహవ్యసన పుత్ర కళత్ర బంధ
వ్యామోహనక్రఘన మృత్యు తిమింగిలోగ్రం
సంసార సా..ర మిమం సహసైవతర్తుం
శ్రీ సత్యశాయి తరణం శరణం ప్రపద్యే॥

తా॥ వ్యసనములను ఛాయాగ్రహములతోను భార్యాపుత్రుల బంధములందు గల మోహములను మొసళ్ళతోను, మహామృత్యువను తిమింగలములతోను, భయంకరమైన ఈ సంసార సాగరమును వెంటనే దాటుటకు శ్రీ సత్యశాయి పడవను శరణము పొందుచున్నాను.

శ్లో॥ వ్యర్థ ప్రసంగమతి దుర్వినియోగశక్తి
నిస్సార జీవ నివహోద్ధరణాయ జాతం
సృష్టి స్థితి ప్రళయ హేతు కృత త్రిమూర్తిం
శ్రీ సత్యశాయి తరుణం శరణం ప్రపద్యే॥

తా॥ వ్యర్థములైన వాక్కులు, ఆలోచనలు క్రియులతో శక్తి దుర్వినియోగము కాగా, సారమును కోల్పోయిన ఈ జీవులను ఉద్ధరించుటకు అవతరించిన వాడును, సృష్టి స్థితి ప్రళయముల కొరకు త్రిమూర్తులైన వాడును అగు శ్రీ సత్యశాయిని తరుణ వయస్కుని, శరణము పొందు చున్నాను.

శ్లో॥ బ్రహ్మర్షి శేఖర సముల్లస రంతరంగ
కేదారపాక కరశీకర కారణాభ్రమ్
భక్తప్రమోద నవశీతల వాతహేతుం
శ్రీ సత్యశాయి వరుణం శరణం ప్రపద్యే॥

తా॥ బ్రహ్మర్షులలో శ్రేష్ఠులైనవారి యొక్క ఉల్లాసముతో గూడిన మనస్సులను మాగాణి భూముల పంటలను పండించు చినుకులను వెదజల్లుచున్న ఆకాశమును, భక్తులకు ఆనందమును కలుగజేయు చల్లని

వాయువులనొసగుచున్న శ్రీ సత్యశాయి వరుణుని శరణము పొందు చున్నాను.

శ్లో॥ శ్రీ శంఖ చక్ర జలజాది పవిత్ర రేఖా
సంలక్షితం శ్రితజనావనబద్ధ దీక్షమ్
అజ్ఞాన రాత్రి గమనోదయ పుల్లపద్మం
శ్రీ సత్యశాయి చరణం శరణం ప్రపద్యే ॥

తా॥ శుభమైన శంఖ,చక్ర,పద్మ, పావన రేఖలతో కూడినదియు, ఆశ్రయించిన వారిని రక్షించుటకు దీక్షను వహించి నట్టిదియు, అజ్ఞానమను రాత్రి పోయిన తర్వాత వచ్చిన ఉషః కాలమునందు ఉదయించిన పద్మమువంటిదియు అగు శ్రీ సత్యశాయి యొక్క చరణమును శరణము పొందుచున్నాను.

శ్లో॥ మాయా కలి ప్రబల కాల ఘనాఘనాభ్ర
చ్ఛేదాగత స్ఫుట తటిత్తతి హేతి తీక్ష్ణమ్
కైవల్య మార్గకలనా సహకారి దివ్యం
శ్రీసత్యశాయి కిరణం శరణం ప్రపద్యే॥

తా॥ మాయతో కూడిన ఈ కలియుగమను నల్లని మేఘములతో కప్పబడిన ఆకాశమును చీల్చుకొని వచ్చినట్టిదియు, బాగుగా మెరయు మెరుపుల తీక్ష్ణ ధారయు, మోక్ష మార్గమును చూపుటలో సహాయ మును చేయునట్టిదియు అగు దివ్యమైన శ్రీ సత్యశాయి కిరణమును శరణము పొందుచున్నాను.

శ్లో॥ నానా వ్యధావికలిత శ్రిత కర్మపాక -
పీడాఫలగ్రహణ దుఃఖ సుఖానుభూతిమ్
ప్రేమ ప్రసన్న జలధిం రస సార్వభౌమం
శ్రీ సత్యశాయి కరుణం శరణం ప్రపద్యే ॥

తా॥ అనేక బాధలతో వికలితులైన భక్తుల ప్రారబ్ధ కర్మ పీడాఫలములను తాను గ్రహించి వారి దుఃఖమును సుఖముగా తాను అనుభవించువాడును, ప్రసన్నమైన ప్రేమసముద్రమును, నవరసములలో

ఉత్తమమును, అగు శ్రీసత్యశాయి కరుణను, శరణము పొందు చున్నాను.

శ్లో॥ ప్రేమావతార సముపాశ్రయ సాధనాంత
సాయుజ్య తత్పర మహోన్నత భక్త బృందైః
ఆత్మీయ భావవిమలైః కృతమేక భాగ్యం
శ్రీ సత్యశాయి వరణం శరణం ప్రపద్యే ॥

తా॥ ప్రేమావతారమగు తనను ఆశ్రయించి సాధనచే సాయుజ్యమును పొందగోరు ఆత్మీయ భావ విశుద్ధులగు భక్తులచే చేయబడిన అదృష్టఫలమగు శ్రీ సత్యశాయిని వరించుటను శరణము పొందుచున్నాను.

## ఫలశ్రుతి

శ్లో॥ శ్రీ దత్తాత్రేయ భగవత్ – వర్తమాన శరీరిణమ్
సత్యశాయిన మాలంబ్య కైవల్యపదవీం వ్రజేత్
శ్రీ సత్యశాయి భగవత్ – అష్టకం దుఃఖ నాశకమ్
సప్తర్షివాంఛయా కృష్ణ – కృతం సాధక సాధనమ్॥

తా॥ శ్రీ దత్తాత్రేయ భగవానుని వర్తమానావతావమగు శ్రీసత్యశాయిని శరణము పొందినవాడు కైవల్యమునుపొందును. సప్తమహర్షుల కోరికచే కృష్ణునిచే రచింపబడినదియు, సాధకులకు సాధనమగు ఈ సత్యశాయి భగవానుని అష్టకము సర్వ దుఃఖములను నశింప జేయును.

ఇంకొక అద్భుతం వివరిస్తాను. మేము శ్రీశైలంలో యుండగా ఒక ప్రాతః కాలమున శ్రీ దత్త భగవానుడు సప్తాశ్వరూఢుడై సూర్య భగవానునిగా దత్త భక్తులకు దర్శనమిచ్చి ఆనందపరచారు. ఆ విషయం శ్రీ దత్త భక్తులు మాకు తెలియజేసి మమ్మానందింప చేశారు. అందరం శ్రీ మల్లికార్జునస్వామి వారి ఆలయంలో ప్రవేశించాము. అద్భుతం! దేవాలయంలో ఆదిత్యహృదయము ప్రసారంచేశారు. ఆహా! ఎంతటి నిదర్శనం.

ఇంకా మహిమలు ఎన్నెన్నో!!

★ ★ ★

శ్రీ గురుదత్త ! ఓం జై గురుదత్త !!

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము - 2

మేము హైదరాబాదులో యున్నాము. శ్రీదత్తభక్తులు మా అతిధిలుగా మావద్ద యున్నారు. ఆరోజు 12-3-93 తెల్లవారిన సమయం. శ్రీ దత్తభక్తులకు శ్రీ దత్తాత్రేయ స్వామివారు సాక్షాత్కరించి ఇలా వచించారు.

### సాధన

''నాయనా! సాధనలో వివిధ అవస్థలను వివరిస్తాను. శ్రద్ధగా ఆలకించు. వాక్కు, మనసు, క్రియ అని శక్తి మూడు విధములు. అవసరమయిన పనులకు వాటిని ఉపయోగించుకో -నేను వద్దనను. కానీ ఉపయోగం లేకుండా అనవసరంగా వృధా చేసేబదులు ఆ మూడు రూపాల శక్తిని నా ఆరాధనకు ఉపయోగించు. రూపాయి పెట్టి కొనుక్కొని తిను. వద్దనను లేదా దాచుకో, వద్దనను. కానీ వృధాగా చెత్తకుండీలో విసరి పారవేసే బదులు నాహుండీలో వేయమని అంటున్నాను. ఇది సాధనలో మొదటి అవస్థ.

రెండో అవస్థలో అవసరమైన పనులు చేసుకుంటూ ఖాళీగావున్న శక్తి రూపాలను నా ఆరాధనకు వినియోగించుట. ఉదా॥ వంట చేస్తున్నపుడు క్రియ, మనసు అనే రెండు శక్తులూ ఉపయోగపెడుతున్నావు. వాక్కు ఖాళీగా వున్నది కదా. వాక్కుతో భగవన్నామ స్మరణ చేస్తూ మిగతా రెండు శక్తులతో (అంటే మనస్సును క్రియను వంట పనికి ఉపయోగిస్తూ) వంట చెయ్యి.

ఇక మూడో అవస్థలో, అన్ని అవసరమైన పనులను నేనే చేస్తాను అని విశ్వసించి సదా ఆ మూడుశక్తులను నా ఆరాధనకే వినియోగించుట''.

శ్రీదత్త ప్రభువులు శ్రీ దత్త భక్తులకు 13-3-93 ఉదయం సుమారు 9గం.లకు ఇలా వచించారు.

''నాయనా ఆరాధనా సమయంకన్నా ఆరాధన శక్తి విలువ గొప్పది. ఆ శక్తిని (గుణం) పెంచుకొని, ఆ స్థాయితో తర్వాత సమయం అంతా వినియోగించాలి. ఉదా॥30 రోజులు పని చేస్తే వంద ఇస్తారు మొదటి ఉద్యోగంలో. రెండో ఉద్యోగంలో నెలకు 4 రోజులే పని చేస్తే రు.400 ఇస్తారు అనుకో. అంటే రోజు పని చేసే శక్తి స్థాయి విలువను పెంచారు రెండో ఉద్యోగంలో. కనుక మొదటి ఉద్యోగం నుండి రెండో ఉద్యోగంలోకి మారాలి. అంటే రోజూ చేసే దైవారాధనలో భక్తి యొక్క స్థాయిని పెంచాలి. అంటే నన్ను ప్రేమించే స్థాయి తీవ్రతరం కావాలి. అప్పుడా 4 రోజుల దైవారాధన విలువ 30 రోజుల దైవారాధన విలువ కన్నా గొప్పది. ఇక మూడో ఉద్యోగం ఏమంటే 30 రోజులు పనిచేసి రు.3000 తీసుకోవడము. ఇలా భక్తి యొక్క స్థాయిని పెంచుకున్న తర్వాత, ఆస్థాయిలో సమయం అంతా ఆరాధన చేయాలి. ఇలా 3 అవస్థలున్నాయి సాధనలో. ఆరాధనలో కోరిక ఉండరాదు. కోరిక విలువను పోగొట్టుతుంది. ఉదా॥ బిచ్చగాడు మీ ఇంటికి వచ్చి దీనాతిదీనంగా పిడికెడు మెతుకులు అడిగితే కసురుకుంటారు. నేను అతిధిగా వచ్చి అన్నం అడగకపోయినా భోజనానికి సాదరంగా పిలుస్తున్నారు. మేమిద్దరమూ బిచ్చగాళ్ళమే. కాని వాడికి విలువలేదు. నాకెందుకింత విలువనిచ్చారు? దీనికి కారణం ఒక్కటే.నేను మీ యింటికి మీ అన్నం కోసం రాలేదు, కేవలం మీ కోసమే వచ్చానని మీకు తెలుసు. వాడు మీకోసం రాలేదు, కేవలం అన్నం కోసమే వచ్చాడని మీకు తెలుసు. కనుక అతిధిగా నేను గౌరవించబడ్డాను. బిచ్చగాడు కసురుకొనబడ్డాడు. కాన కోరికలు తీరడం కోసం చేసే దైవారాధన ఆరాధనల విలువను పోగొట్టుచున్నది. ఆరాధన కోరిక కోసం కాకుండా,స్వామి కోసమే చేయాలి. కోరికపై ధ్యాస వుండరాదు. మీకు కావలసింది మీరు కోరకుండానే నేనే సాదరంగా ప్రేమతో తీరుస్తాను'' అని వచించారు స్వామి.

## మహాభావము

దీ. 14-3-93 ఉదయం 3.30 గం.లకు శ్రీ దత్త భక్తులకు శ్రీ దత్త ప్రభువులు దర్శనమిచ్చి ఇలా వచించారు:

''నాయనా! విను. అకారణంగా పుట్టినట్టిదియు ఏ విధమయిన స్వార్థ లాభమును ఆశించనట్టిదియు, ఎన్ని కష్టనష్టములు వచ్చినను తరుగనట్టిదియు శరీర ప్రాణ మనస్సులతో సహా తన సర్వస్వము నా కొరకే నిలచి నాకు సమర్పితము అయినట్టిదియు, అవసరమైనచో నా కొరకు తన ప్రాణములను తృణప్రాయముగా అర్పించగల తీవ్రస్థాయిలో ఎప్పుడును వున్నట్టిదియు అగు మహైశ్వర్యకరమైన అత్యద్భుతమైన ప్రేమయే మహా భావము లేక సమాధి స్థితి అని పిలువబడును. అదియే భక్తి అనబడును. భగవంతుని పొందుటకు ఆయనలో లీనమగుటకు ఈ భక్తి తప్ప రెండవ మార్గము లేదు. ఇందులో అహంకారము సర్వసమర్పణము చేయుటవలన శూన్యమైయుండునుగాన, స్వామి తప్ప ఇతర వస్తువు గాని, ఇతర వ్యక్తి గాని, తాను గానీ, సాధించు సాధనముగా తలపక స్వామియే సర్వ సాధనమని తలచు మహావైరాగ్యముయొక్క పరాకాష్ఠ ఇందున్నది. జ్ఞానమార్గమున గాని, కర్మమార్గమున గాని, యోగమార్గమునగానీ, నీవు చేయు ప్రయత్నము సాధనము అగు అహంకారముతో కూడియుండుటవలన నాయొక్క కరుణను సాధించుటకు వీలుపడదు. భక్తియొక్కటియే స్వామిలో కరుణను, ప్రేమను కలుగజేయగలదు. ఇట్టి భక్తితో కూడిన ఏవిధములయిన క్రియలుగాని ఏవిధములయిన వాక్కులుగాని, ఏవిధములైన భావములుగాని, పరిపూర్ణమయిన, శక్తివంతమయిన ఆరాధనలే అగుచున్నవి '' అని వచించారు.

మరల ఉదయం 8.30 గం॥లకు స్వామి సాక్షాత్కరించి భక్తిస్థాయిని గూర్చి యిలా వివరించారు :

''మిల్లితో వేసినా చిట్టి ఎత్తివేసినా ఎంత నేతిని వడ్డించారనేది లెక్కగానీ, ఏవిధంగా వడ్డించారనేది గాదు. స్త్రీకి కేశములు ఒత్తుగా వున్నప్పుడు ఏవిధంగా ముడివేసినా చక్కగానే యుండును. ఆ కేశములే

పలుచగా వున్నప్పుడు ఏ విధముగా ముడివేసినా బాగుండదు. అలాగే, ఏ దైవరూపాన్ని ఆరాధించినా, ఎంత భక్తి వుంది? ఆ భక్తి యొక్క స్థాయి ఎంత? అనేది లెక్కగానీ, దైవరూపాన్ని మార్చినంత మాత్రాన ఒరిగేదేమీలేదు. అన్ని దైవరూపాలు నావే. అవి అన్నీ నా వేషాలే. ఆ వేషాలలో ఉన్నది నేనొక్కడినే. ఒక్కరూపాన్నేఆరాధించడంగొప్ప, బహురూపాలను ఆరాధించడం తక్కువ యని కొందరనుకుంటారు. కానీ 4 పాత్రలలో నాలుగు పావుశేర్లు పాలున్నా, ఒకే పాత్రలో శేరున్నా, పాలలెక్క శేరు మాత్రమే. అలానే ఎందరు దేవతల నే పాత్రలలో వుంచినా భక్తి అనే పాలయొక్క ప్రమాణము ఎంత అనేది లెక్కకు వస్తుంది.'' అన్నారు స్వామి.

## రాజయోగం

రాజయోగం గురించి స్వామి ఇలా వచించారు :

''అజ్ఞానిలాగా, జ్ఞాని నటించడమే రాజయోగము. తనపై బంధములుంచుకున్నవారు కూడా దీనితో సంతృప్తి చెందుతారు. తాను ఏమాత్రం అంతర్ముఖంగా నిర్లిప్తుడై ఇతరులకు మనోబాధ కలిగించకుండా అజ్ఞానిలాగా తానూ ఆసక్తితో ఉన్నట్లే నటిస్తాడు. అయితే ఈ నటనలో ఒక్కొక్కసారి నిజంగానే ఆసక్తి ఏర్పడి బద్ధుడైపోతాడు. ఆసమయంలో తాను నటిస్తున్నాననే గుర్తుపోయి యోగభ్రష్టుడవుతాడు. కేవలం యోగారూఢుడైన వానికే ఈ రాజయోగం చేతనవుతుంది. మీ శక్తినీ, సమయాన్ని దుర్వినియోగంచేసి వృధా చేసేది మాత్రమే నా వైపుకు మళ్ళించండి, అదిచాలును. నాసాక్షాత్కార సాయుజ్యాల నిస్తుంది. కూడు, గుడ్డ నీడలకుమాత్రం మిగతా శక్తిని వినియోగించడం కూడా నా ఆరాధనే. ఎందుకంటే కర్తవ్యాలను ఆచరిస్తేనే ఈ శరీరం నిలబడుతుంది. అది నిలబడితేనే గదా ఆరాధన చేయుడానికి అవకాశము. కాన, కర్తవ్యాచరణముకూడా ఆరాధనలో ఒక భాగమే అయినది. కర్తవ్యం మానుకొని పూజచేయవలసిన పనిలేదు. ఎందుకంటే కర్తవ్యాచరణం పూజలో ఒక భాగమే అవుతుంది. కాన కర్తవ్యాన్ని ఆచరిస్తూ, ఎం డు మిగిలిన శక్తినీ, సమయాన్ని వృధా చేయకుండా నాకు సమర్పిస్తున్న

వాడు సర్వశక్తిని సమయాన్ని నా ఆరాధనకు వినియోగించినవాడే అవుతున్నాడు కనుక ఆయురారోగ్యములను కాపాడుకోవాలి. ఎందుకంటే అవి చెడితే దైవారాధన వీలుపడదు. శరీరము....మనసు ఈ రెండిటికి రోగాలు వస్తాయి. కాన ఈ రెండిటికి ఆరోగ్యం ముఖ్యం. మనస్సుకు వచ్చే రోగం చింత,వ్యధ. దీనివలన మనస్సు శ్రమించి బలహీనవవౌతుంది. ఈ మనస్సు ఆరోగ్యాన్ని రక్షించేటందుకే రాజయోగము. మనస్సుకు ఏదీ అంటకుండా, అంటినవానివలే నటించుట. ఇక శరీరారోగ్యము రాజస,తామస ఆహారములను తినకుండా వుండటమే. ఎక్కువ కారం,పులుపు, ఉప్పు రాజసాహారాలు. చల్లబడి, చద్దివాసన వచ్చునది సూక్ష్మజీవులు ప్రవేశించినందున తామసాహారం. ఇది రోగం తెస్తుంది. మనస్సులోని చింత, ఆవేశం, బాధకూడా శరీర రోగాలకు దారి తీస్తుంది. కాన సాత్వికాహారము,రాజయోగము. ఈ రెండూ పూర్ణ ఆరోగ్యమును ఇస్తాయి.''

''ఏ రూపం అయినా, ఆరాధనా విధానం ఏ విధంగా వున్నా, నీ భక్తి యెక్క ప్రమాణ స్థాయినిబట్టే ఫలము. ఏ కొట్టుకు వెళ్ళినా, ఏ దోవలో వెళ్ళినా నీ వద్ద వున్న డబ్బును బట్టియే సరుకు వస్తుంది. సర్వదేవతలూ , ఋషులూ, గ్రహాలూ, సిద్ధులూ, త్రిమూర్తుల రూపాలే. ఆ త్రిమూర్తులూ నేనే. నేనొక్కడినే ఇన్ని వేషాలలో వున్నాను. ఎన్నో జన్మల పరిపాక తపస్సు వల్లగానీ, ఇన్ని వేషాలలో వున్న అసలు వ్యక్తినైన నన్ను గుర్తించరు. నా భక్తీ, నా అనుగ్రహమూ ఎంతో దుర్లభమయినది. నేను సంకల్పిస్తే గాని, అన్ని వేషాలూ తీసివేసి, ఏ వేషంలేని నన్ను చూడలేరు. నన్ను చూసినా, నా సంకల్పం వుంటేనే గాని నా భక్తి రాదు'' అన్నారు స్వామి. అంతా దత్తానుగ్రహం. స్వామీ! అల్పులం. నీవు కరుణా సముద్రుడవు . కరుణించి,అనుగ్రహించవయ్యా అని ప్రణమిల్లుదము.

## శ్రీ దత్త స్వరూపము

అంగీరసనామ సంవత్సరం శివరాత్రినాడు అంతా అభిషేకం చేసిన తరువాత శ్రీ దత్తస్వామి సాక్షాత్కరించి శ్రీ దత్త భక్తులతో ఇలా వచించారు.

''నేను ఒక్కడినే గుణ కర్మల వశంచేత త్రిమూర్తులుగా రూపొందాను. నన్ను గానీ, నేను త్రిమూర్తులుగా మారటం గానీ, సృష్టిపూర్వం జరిగింది. కాన ఎవరికి తెలియదు. అత్రిమునికి నేను, త్రిమూర్తులుగా కనిపించినవారే ఏకంకాగా, ఒకే మూర్తినై కనిపించాను. ఇది ఒక్కటి మూడయినదని చెప్పడమే తప్పు, మూడు ఒక్కటైనది కాదు.( అందుకనే మీ పుత్రిక చి.ల.సౌ. రమకు స్వప్నంలో శ్రీ దత్త స్వామి త్రిమూర్తులుగా దర్శనమిచ్చారు''. అని దత్త భక్తులు 1.9.95న గుంటూరులో శెలవిచ్చారు). త్రిమూర్తులకు కారణరూపంలో నేను నిరాకార, నిర్వికల్ప, నిరంజన అవధూత నామాలతో పిలువబడి, ఉన్మత్త, పిశాచ, దిగంబర రూపాలలో దర్శనమిచ్చి సద్యోమోక్షాన్ని ఇస్తాను. నా ఈ కారణరూపానికి కేవలం '' ఓం'' కారమే మంత్రము. దీనినే కేవలం సన్యాసులు, అవధూతలు అయిన తీవ్రముముక్షువులు గానీ, గృహస్థాశ్రమంలోని వారు అంత్యదశలోనూ ఉపాశిస్తారు. ఈ కారణ రూపంలో గడ్డిబొమ్మలైన నామరూపులయిన జీవులను దహించే మహాతేజోరూపిణి. అత్రిముని ఋషపర్వతంపై గృహస్థుడయ్యును, మోక్ష కామంతో కాక ఐహికమైన సంతానార్థియై అనసూయతోకూడి కేవలం ఓంకారం జపం చేశాడు. ఐహికార్థులయిన కేవల గృహస్థులకు అది దుఃఖకరము, అందుకే అత్రి దహింపబడినాడు.

అప్పుడు నేను కారణరూపంలో కాక, త్రిమూర్తులుగా గోచరించి, మరల ఏకమై.... త్రిముఖ...షడ్భుజ రూపంలో ''అత్రివరద'' రూపంలో గోచరించాను. ఈ రెండవ రూపమే యోగిరాజ - యోగీశ్వర నామాలతో ఉన్న ఈశ్వరరూపం. నాకారణ రూపాన్ని పరబ్రహ్మని బ్రహ్మాభిమానులూ, నారాయణుడని వైష్ణవులూ, సదాశివుడని శైవులూ, శ్రీశక్తియని శాక్తేయులూ పిలుస్తారు.

యదువు తనవంశం నిలుపమని నన్ను వేడినందున యదు వంశంలో నేను కృష్ణుడిగా అవతరించాను. అప్పుడే అర్జునునికి యోగీశ్వరుని విశ్వరూపం అయిన ఈ రెండవ రూపాన్ని చూపాను. ఆ విశ్వరూపంలో మధ్యనున్న మూడు ముఖాలే త్రిమూర్తి ముఖాలు. మిగత

ముఖాలన్నీ త్రిమూర్తుల అంశల ముఖాలే. ఈ రెండవరూపాన్ని ఆరాధిస్తే అణిమాద్యష్టసిద్ధులనిస్తాను. అవి నా కుడిచేతి గుప్పెట్లో వున్నాయి. ఈ అష్టసిద్ధులూ కేవలం నాస్తిక మత ఖండనం చేసి, ఆస్తిక మతాన్ని స్థాపించే గురువులకు వాటి అవసరం వుంది కాన ప్రసాదిస్తాను. వాటిని స్వార్థానికి ఉపయోగించినా, కీర్తియను అహంకారములో పడినా పతనం కాక తప్పదు. ఎంత గురువైనా గురుశబ్దము కేవలం నాయందే సార్థకము.

అత్రిముని దీనితో తృప్తిపడ్డాడు. జన్మలేనందున స్వయంగా దత్తత చేసుకున్నాను. కాన దత్తుడ నయ్యాను. నాభక్తులు నా దత్త పుత్రులు కాన దత్తుడనయ్యాను. ఉపాసనలు పూర్తిచేయక ముందే వాత్సల్యాతిశయంతో ఫలాలనిచ్చుదును కాన దత్తుడను. (''ఇలా మమ్ముద్ధరించారు స్వామి. ధన్యులము. మాయలోపడకుండా మమ్మను గ్రహించి నీ చెంతకు చేర్చుకోవయ్యా అని మా వినతి''.) లోకానికి ఈ రూపంలో దత్తుడనయ్యాను కాన దత్తుడినయ్యాను.

అనసూయ మాత్రం మాతృగర్భవాంఛతో నుండుట చేత ఆమె గర్భంలో ముగ్గురు బాలురుగ జన్మించి, మరల ఏకమై, మరల త్రిముఖ షడ్భుజరూపంలో సాక్షాత్కరించాను. ఇదే ''అనసూయాత్రి నందన'' మనబడే మూడో రూపము. ఇది అన్ని ఐహిక వరాలనిస్తుంది. ఇది సర్వమంత్రసిద్ధిప్రదము. అన్ని మంత్రాల సిద్ధులూ నా ఎడమ చేతి గుప్పెట్లో వున్నాయి.

ఏతావాతా, తేలిందేమంటే - త్రిముఖ షడ్భుజ రూపం అష్టసిద్ధులనూ, సర్వమంత్ర ఫలాల నిస్తుంది. అన్ని ఐహిక వరాలనిస్తుంది. గృహస్థులు కేవలం ఈ త్రిముఖ-షడ్భుజ రూపాన్నే ఆరాధించాలి కాని, నా అవధూత దిగంబర రూపం ధ్యానించినా, కేవలం ఓంకారం జపించినా దుఃఖాలు పొందుతారు. వారలు కేవలం అంత్యదశలోనే నా నిర్గుణకారణ రూపాన్ని ఓంకార జపంతో ఉపాసించాలి.

నేను స్మరణ మాత్ర సంతుష్టుడను. నావరాలు అనంతాలు. అమోఘాలు. అందుకే మాయ నన్నావరించి అయోగ్యులైన మానవులకు నన్నందనీయకుండా భ్రమింపచేయుచున్నది. వారు వరములను సిద్ధులను

పొంది పతనము చెంది లోక కంటకులగుదురు. దాదాపు మానవులంద రునూ అయోగ్యులే కాన, ఈ మనుజ లోకమున నన్ను ప్రసిద్ధికి రానీయకుండా, మాయ, నన్ను గోప్యంగా వుంచింది. దత్తాత్రేయ మన్న కేవలము అవధూత రూపమేననియు, అది కేవలము ఆముష్మికమనియు, పిచ్చి, సంసార విచ్ఛేదము, కేవలమోక్షము నిచ్చుననియు, ప్రచారములను పుట్టించి, నరులను దగ్గరకు రానీయకుండా లోకకళ్యాణార్థము నన్ను ఆవరించియున్నది. కార్తవీర్యార్జును డట్లే అహంకరించెను గదా.

నా నుండి త్రిమూర్తులు, వారి నుండి మూడు కోట్లదేవతలు వారినుండి 33 కోట్ల దేవతలు వచ్చినారు. నాకు పెట్టిన ఒక్క నమస్కారము 33 కోట్ల నమస్కారములగును.

నా బ్రహ్మముఖమునకు ఋషి పూజయు, విష్ణుముఖమునకు శ్రీసత్యనారాయణ వ్రత నామసహస్రపూజయు, రుద్రముఖమునకు రుద్రాభిషేకమును చేయుము. బ్రహ్మర్షులందరును బ్రహ్మాంశలే. దేవతలందరూ విష్ణురుద్రాంశలే. నాబ్రహ్మముఖ జిహ్వయందు వాణియు, నామధ్యవక్షమునందు లక్ష్మియు, నా శివముఖ వామభాగమున గౌరియు ప్రకాశించుచున్నారు. ఈ ముగ్గురు శక్తులు కలసిన దుర్గయు నాయందే యున్నది. నాకన్నా వేరు కాని ఆ శక్తియే శ్రీశక్తి.

కాన, నన్ను స్మార్తులు, వైష్ణవులు, శైవులు, శాక్తేయులు అందరును ఉపాశించుదురు. గణపతి, కుమార, వీరభద్రాది శైవరూపాలన్నీ నా శివ ముఖంలోను- రామ, కృష్ణ, నరసింహాది రూపాలన్ని నా విష్ణుముఖంలోను లీనమైయున్నాయి. హరిహరాత్మకుడైన మణికంఠుడు నా హరిహర ముఖాలే. త్రిమూర్తుల అంశ అయిన మారుతి నాయందే కనిపించును. నా అంశావతారాలైన సిద్ధులందరూ అన్ని దేవతా రూపాలను చూపించగలుగుచున్నారు. స్మార్తులు వదలిన బ్రహ్మపూజయు నాయందు లభ్యము.

జీవులందరును బాల్యమందే అక్షరునుపాసించు అక్షరా భ్యాసము నందు ''గురుర్బ్రహ్మ'' అను శ్లోకంతో నన్నే ఉపాసించుటకు ఆరంభించు చున్నారు. ఉపనయన మంత్రమందు కూడ పురుషవాచకమైన సవిత నేనే. అంధకార వినాశ మొన రించు అర్ధముగల గురుశబ్దమునకులక్ష్యార్థము నేనే కదా! శిష్యుల బుద్ధులకు పదును పెట్టి ప్రేరేపించుచున్నవాడను నేనే. గాయత్రి యనునది కేవలం ఛందోనామమే తప్ప దేవతా వాచకముగాదు. ఆ ఛ్ఛందస్సు పేరుతో నేనే సూచింప బడుచున్నాను.

## నవగ్రహములు

నేను భోగ మోక్షప్రదుడను. భోగములనిచ్చి తృప్తి నొందించి జీవుల కావల మోక్షమునొసంగుచున్నాను. నాషోడశాక్షరీ మంత్రంలో వున్న నవ బీజాలే నవ గ్రహాలు. అవి నా శరీర స్థానముల నాశ్రయించి నడచుచున్నవి.--

| | | | |
|---|---|---|---|
| 1. | ఓంకారము | హృదయము | సూర్యుడు |
| 2. | ఐం బీజము | శంఖము | చంద్రుడు |
| 3. | క్రోం బీజము | చక్రము | కుజుడు |
| 4. | క్లీం బీజము | డమరుకము | బుధుడు |
| 5. | క్లూం బీజము | కమండలము | గురువు |
| 6. | హ్రాం బీజము | జపమాల | శుక్రుడు |
| 7. | హ్రీం బీజము | త్రిశూలము | శని |
| 8. | హ్రూం బీజము | వామపాదము | కేతువు |
| 9. | సౌః బీజము | దక్షిణపాదము | రాహువు |

ఈ గ్రహములన్నియు జీవుల కర్మఫలములనొసంగుచు, కర్మ ఫలప్రదాతయగు నా స్వరూపములే.

కాన నన్ను సర్వదేవ (పుం) - సర్వదేవతా - (స్త్రీ) సర్వ బ్రహ్మర్షి - సర్వగ్రహ - సర్వసిద్ధుల రూపాలతో నున్న త్రిమూర్తుల ఏకరూపంగా తెలుసుకొనుము. అన్నిరూపాల సమిష్టియు ప్రతిరూపము పూర్ణముగాను వుండుట నా అనూహ్య శక్తికి సాధ్యము.

## పాదుకలు

నన్ను ఆరాధించుటకు నా పాదుకలు చాలును. ఏలనన్నచో, నాపాదుకలను వేదములే కుక్కలరూపంలో నాకుచున్నవి. అన్ని అపవిత్రతలనూ పోగొట్టగల వేదాలే అపవిత్ర శునకములై నాపాదముల వద్ద నుండగా, నా పవిత్రతను ఊహించుట నరుల కసాధ్యము.

## ధర్మదేవత

గోరూపమున ధర్మదేవత నన్నాశ్రయించినది కాన అనేక సిద్ధుల రూపాలలో మహిమలను ప్రదర్శించుచు, ఆచార్యుల రూపంలో సిద్ధాంతాలను వ్రాయుచు నాస్తిక మతమును ఖండించుచూ కలియుగంలో ధర్మదేవత.ను కాపాడుచున్నాను. ధర్మమునకు మూలము దైవమే కదా.

## లోక సంగ్రహకార్యము

గంగా,యమునా,సరస్వతి నదుల సంగమం ప్రయాగవంటి త్రిమూర్త్యాత్మకుడనైన నేను, త్రిమతాచార్యుల సిద్ధాంతములను సమన్వయపరచి, ప్రస్థానత్రయ భాష్యములను వ్రాయసంకల్పించి వున్నాను. నా భక్తుడవైన నీకి కీర్తి నీయదలచి యున్నాను. ఇది నా ఆదేశము. నిన్నావేశించి నేనే వ్రాయుదును. మోక్షము నొసగవలసిన బ్రహ్మ విద్యాగ్రంధములన్నియు చివరకు వాదకలహముల కాలవాలమైయున్నవి. ఇది ప్రస్తుత లోకసంగ్రహకార్యము.''

దత్త భక్తులు స్వామి ఆదేశముతో, వారిచే ఆవేశింపబడి అట్లే ప్రస్థానత్రయ గ్రంధములకు భాష్యములను వ్రాయుచున్నారు.

- శ్రీ దత్త

## ముముక్షువు - ఆహారనియమము

21-3-93 ఉదయం 4-30 గంటలకు శ్రీ దత్త భక్తులకు శ్రీ దత్తస్వామి ప్రత్యక్షమై ముముక్షువులు సాధనలో సిద్ధిని సాధించుటకు ఆహార నియమమును నొక్కి వక్కాణించారు.

" ఆహారం పరిమితంగా తినాలి. ఆహారం పరిమితంగానే శక్తిగా మారుతుంది. మిగిలినది శరీరమునకు రోగము తెస్తుంది. ఇది అతిగా భుజించుటవలన ఫలితము. ఆ శక్తినే దైవారాధనకు వినియోగిస్తే యిక శక్తి మిగలదు కాన సంసార బంధాలకు వాక్కులో గాని, భావాలలో గాని క్రియలలో గాని వినియోగపరుచుటకు వీలుండదు. కాన వైరాగ్యం దానంతటదే వస్తుంది. ఒక్కొక్క శరీరానికి ఒక్కొక్క ప్రమాణంలో ఈ ఆహారశక్తి తయారౌతుంది. ఇది ఎలా గుర్తించుటయనగా ఇక తాను తినలేనంతగా ఎంత తినగలరో అది పూర్ణ భోజనము. అది చేస్తే నిద్ర, మత్తు మొదలగు తమో గుణాలు వస్తాయి. ఆ పూర్ణ భోజనంలో సగం మాత్రమే తినవలయును. మిగతా సగంలో జలమును త్రాగవలయును. మిగిలిన నాల్గవ భాగము ఖాళీగా వుండవలెను. ఆహారము శుచిగా, సాత్విక ముగా, శక్తికరముగా, మితముగా వుండవలెను" అని వచించారు.

## నన్ను చేరే మార్గము

22-3-93 ఉదయం 5-00 గంటలకు శ్రీ దత్త భగవానులు శ్రీ దత్త భక్తులతో తనను చేరే మార్గాన్ని ఉపదేశించారు. మనం కూడా తెలుసుకుని ఆచరించి తరిద్దాము.

"నాయనా! శ్రద్ధగా విను. త్రిమూర్తులను మించినవారు లేరు. కాన త్రిమూర్త్యాత్మకుడ నగు నన్ను మించిన వాడు మరియొకడు లేడు. నా ఆరాధన అనేక విధములుగా చేయవచ్చును. జపము, గానము, పద్యపఠనము, కరతాళములతో భజన నమస్కార ప్రదక్షిణములు, ధ్యానము, నా గ్రంథ పఠనము, నా చిత్రమును చూచుట, నా కథలను వినుట, నన్ను గురించిన సత్సంగము, నన్ను గురించి వ్రాయుట, నా ప్రచారము చేయుట నా కార్యములకై తన శక్తిని సమయాన్ని, తన కర్మ ఫలమైన ధనాన్ని కానీ వెచ్చించుట ఇవి అన్నీ నా ఆరాధనలే. దేనినీ తక్కువగా భావించరాదు. ధ్యానించువారనేకులు, అలానే ధ్యాన మార్గములు అనేకములు, అలానే ధ్యానింపబడు రూపములనేకములు. అహంకారముతో ఏ ఒక రూపమును కించపరచరాదు. అలానే ఏ ధ్యాన మార్గమును కించపరచరాదు. అన్నీ

నారూపాలే. అన్నీ నన్ను చేరే మార్గాలే. ఎవరి కేమార్గం ఇష్టమో, దానినే అవలంబించి నన్ను చేరవచ్చును. ఒక మార్గం కాకున్న రెండుమార్గాలుగా ఆరాధించవచ్చును. 4-5 మార్గాలుగా ఉపాసించు. ఒక మూర్తినిగాని అనేక మూర్తులను గాని ఉపాసించు..... ఆరాధించు. ఎలా అయినా ఒక్కటే. ఉదాహరణకు ఒక కూర అయినా 4-5 రకాల కూరలయినా ఎంత ప్రమాణం మొత్తం తిన్నావని లెక్కకు వచ్చినట్లే. ఏ మార్గమయినా లేక ఎన్నిరకాల మార్గాలైనా, నీవు ఎంత శక్తిని, ఎంత సమయాన్ని వెచ్చించావు, నీయొక్క భక్తి తీవ్రత ఎంత అనేదే లెక్కకు వచ్చును.

సాధారణంగా మనస్సు వైవిధ్యాన్ని కోరుతుంది. కాన అన్నిమూర్తులను కొలవడము మనస్సునకు అనుకూలం. ఇంత మాత్రాన బహు దేవతా భక్తుడు ఏక దేవతా భక్తునికన్నా ఎక్కువ కాదు, తక్కువా కాదు. కేవలం మనస్సుయొక్క అనుకూలతను బట్టి ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. ఇలానే ఒకే మార్గంలో ఆరాధిస్తే మనస్సుకు విసుగు వస్తుంది. అప్పుడా మార్గం మార్చి మరొక మార్గాన ఆరాధిస్తే నిరంతర ఆరాధన అవుతుంది. అంటే. కొంతసేపు జపం, కొంతసేపు భజన, కొంతసేపు సత్సంగము. ఇలా ఒక వ్యక్తికి కేవలం జపంలోనే వుండుట ఇష్టమై విసుగురానిచో అతడట్లే వుండుగాక. బహువిధములుగ ధ్యానించువాడు ఏకవిధముగా ధ్యానించువానికన్నా ఎక్కువా కాదు, తక్కువా కాదు. ఈ ఇరువురిలో ఎవరికి భావతీవ్రత వున్నదో వారే గొప్పవారు.

నా ఆరాధనా విధానాలు, ఒక్కొక్కరికి (తమ నిత్య కర్తవ్యము నాచరించక తప్పనిసరి కావచ్చును అను పక్షంలో) వీలుకాకపోవచ్చును. అలాంటి సమయంలో ప్రతిక్రియను నాకు సమర్పణం చేయుభావంతో చేస్తే అదీ నా ఆరాధనే అవుతుంది. ఉదాహరణకు వంటచేయాలి. ఇది నా ఆరాధనా మార్గాలలో ఏది కాదు. అయినా ఆ వంటను నాకు నివేదించే లక్ష్యంతో చేస్తే అది కూడా ఆరాధనా మార్గమే అవుతున్నది. అలానే అందరిలోనూ నన్నే చూడుము. అంతర్యామిగా సర్వసృష్టిలో వ్యాపించి నేనే వున్నాను కదా. ఇలా సర్వేంద్రియముల క్రియలూ నా

ఆరాధనా మార్గాలుగా మార్చుకొన్నవాడునూ నా ఆరాధకుడే అగును. అయితే ఇలా చేయుట వారి వారి అనుకూలత్వమును పట్టియే కాని, వెనుక చెప్పిన ఆరాధనలకన్నా వీరు ఎక్కువా కాదు తక్కువా కాదు. ఇవన్నీ ఆయా వ్యక్తుల అనుకూలత్వములననుసరించినవే. ఎక్కువ తక్కువలు కేవలం నాపైన ప్రేమ ఎంత వున్నది అనే విషయాన్నిబట్టే వుంటుంది''. అని వచించారు.

స్వామీ! నీకన్న వేరే దైవం ఎవరున్నారయ్యా! నీవే బ్రహ్మవు నీవే విష్ణువు, నీవే శివుడవు, నీవే సరస్వతివి, లక్ష్మివి, పార్వతివి, నీవే దుర్గవు. నీవే హనుమంతుడవు, సర్వబ్రహ్మర్ష్యాత్మకుడవు, సర్వసిద్ధాత్మకుడవు, సర్వగ్రహాత్మకుడవు, సర్వ దేవతా-దేవాత్మకుడవు సర్వశక్తి సంపన్నుడవు. నీవే తల్లివి దండ్రివి నీవే గురుడవు నీవే దైవము మేము నీ బిడ్డలము. నీవే తప్ప ఇతరములేదు అనుగ్రహించవయ్యా! అని ప్రణమిల్లుదము.

శ్రీ గురుదత్త.

★ ★ ★



శ్రీ గురుదత్త ! ఓం జయ గురుదత్త !!

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము - 3

## శ్రీశైల రహస్యం

మా పూర్వజన్మ సుకృత కర్మఫలమాయన్నట్లు, భగవదానుగ్రహము వలన మాకు ఈ జన్మలో శివారాధన ప్రాప్తించింది. మాగురుదేవులు శ్రీ స్వామి సదానంద సరస్వతి మహారాజుల వారు మమ్మాశీర్వదించి మా చిన్నతనంలోనే పంచాక్షరీ ఉపదేశించారు. తర్వాత ఒక శివరాత్రినాడు శ్రీశైల క్షేత్రంలో శివసదనంలో ఒక వసతి గదిని తీసుకొనుటకు సంకల్పం కలిగించి మమ్ము అనుగ్రహించారు శ్రీ భ్రమరాంబికా మల్లిఖార్జునుడు. ప్రతి సంవత్సరం ఆశ్వీజ మాసం (దసరాలలో) పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, ప్రతి సంవత్సరం ఉగాది ఉత్సవం శాశ్వతంగా జరిపించుకొనే అదృష్టం కల్పించారు, ఆ ఆది దంపతులు. అలా శ్రీశైల మల్లిఖార్జునులను సేవించగా సేవించగా ఒక శివరాత్రినాడు శ్రీ దత్త భక్తులు మమ్ము వెతుక్కుంటూ రావడం మమ్ము శ్రీశైలం తీసుకెళ్ళడం అక్కడ అనేక సాధనలు చేయించడం శ్రీదత్త మంత్రమును ఉపదేశించి మమ్ము ధన్యులను చేయటం జరిగింది. ఇది అంతయు దైవ సంకల్పానుసారమే జరిగిందని అప్పుడు తెలియక పోయినా, ఇప్పుడు పరిపూర్ణ విశ్వాసం కలిగింది. ధన్యులం.

ది. 23-3-93 ఉ॥ 10.30 గంటలకు శ్రీ దత్త భగవానులు శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి ఇలా వచించారు.

"నాయనా! శ్రద్ధగా విను. శ్రీశైలం లో వెలసియున్న భ్రమరాంబ నా మూలకారణ శక్తి అంటే నా కారణరూపం. పిశాచోన్మత్త భయంకర రౌద్రరూపం. వచ్చిన భక్తులను ఆమె పీక్కుతింటుంది అంటారు గదా! పీక్కుతినడం అంటే జీవునికి నామరూపాలను నాశనం చేసి, వెంటనే సద్యో మోక్షం ఇవ్వడమే. నా కారణ రూపమే భ్రామరీ రూపం. క్రిందనున్న మల్లిఖార్జున లింగమే నా త్రిముఖషడ్భుజరూపం. అది అష్టసిద్ధులనూ ఐహికాలనూ అనుగ్రహిస్తుంది. శ్రీ శంకర భగవత్పాదులు ఆమెను శాంతింపచేశారంటే వచ్చిన భక్తులకు సద్యోముక్తినిచ్చే భ్రామరీ లక్షణం తగ్గి, ఐహికాలను ప్రసాదించే నా త్రిముఖ,షడ్భుజ రూపం ప్రకటనమైనది అని అర్థం. శంకరులు శివ స్వరూపుడే కదా.అందుకే శ్రీశైలం పునర్జన్మ రాహిత్యానికి, వెంటనే మోక్షాన్ని ఇచ్చే క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. అక్కడ ఆముష్మికం కోసం అనేక సిద్ధులు తపస్సు చేస్తారు. పార్వతి మోక్షప్రదాయిని కాన ఐహికం కూడా వుండాలని కోరుకునేవారు శ్రీవిద్య నారాధించి శాక్తేయోపాసన చేసినచో వెంటనే శివారాధన చేయాలి.అలా చేస్తే ఆముష్మికంతో పాటు ఐహికం కూడా నిలుస్తుంది. శివుడు ఐశ్వర్యప్రదుడు. అలానే నారాయణుడు మోక్షప్రదాత. మోక్షాన్ని కోరితే ఐహికం నశిస్తుంది. కాన విష్ణుసహస్రం చదవగానే లక్ష్మినారాధిస్తే శాంతి. అంటే లక్ష్మియు ఈశ్వరునివలె ఐశ్వర్యప్రదాయిని. అట్లే శారద జ్ఞానప్రదమైన మోక్షదేవత. బ్రహ్మదేవుడు అష్టసిద్ధులనూ ఐహికాలనూ ప్రసాదిస్తాడు.

ఐహికం వద్దనేవారు శ్రీ విద్యతో శాక్తేయంగానూ, కేవలం నారాయణునీ, కేవలం శారదనూ ఉపాసిస్తారు. అట్టివారు తీవ్ర ముముక్షువులైన సన్యాసులు, అంత్య దశ లోని గృహస్థులూ. ఈశ్వరుడు, లక్ష్మి, బ్రహ్మదేవుడు నా త్రిముఖ షడ్భుజ రూపాలు. నారాయణ, శక్తి, శారదలు నా కారణ రూపాలు. అంటే నేనొక్కడినే వివిధ నామ రూపాల్లో భోగ మోక్షప్రదుడను. నా వామభాగం భగవత్స్వరూపము. నా దక్షిణ భాగము గురు స్వరూపము. అంటే గురు స్వరూపం ప్రధాన మన్న మాట.... ఎందుకు ? లక్ష్యమైన భగవంతుడు, సాధన అంతా ముగిసిన తరువాత చేరే గమ్యం. ఆ గమ్యానికి తీసుకువెళ్ళే బాధ్యత స్వీకరించినదే

గురు స్వరూపము. కాన ముందు ముఖ్యమైనదే గురు రూపం. కావుననే ఈ గురుదత్తుడే ముఖ్యుడు. బాధ్యత స్వీకరిస్తే, ఎన్నో తిప్పలు పడి జీవుని గమ్యానికి చేరుస్తాడు. ఆ గమ్యము నేనే. గమ్యమయిన భగవంతుడైన నేనే, సాధకుల సహాయార్థము గురు రూపంలో వచ్చాను. గురువు నాశ్రయించి నమ్మినచో, భగవంతుని చేరినట్లే. ఏ మాత్రమైననూ గురువుపై విశ్వాసము సడలినచో నీవు మధ్యలో మునిగి పోతావు. జాగ్రత్త. విశ్వాసమును చెదరనీయక, గురువయిన నన్ను గట్టిగా పట్టుకొనుము. నా గురు పాదము వదలకుము. పరీక్ష కొరకు విదలింతును. ఎవడు పట్టు విడవడో, వానిని గమ్యమున కీ పాదమే చేర్చును.

అష్టాదశ పీఠాలలో శ్రీ భ్రామరీ శక్తి పీఠం చాలా ప్రధానమైనది. ఏలననగా, ఆమె నా మూలకారణ, సద్యోమోక్షకరమైన తీవ్ర తేజోరూపము. ఈ రూపం వల్లనే శ్రీ శైలము పునర్జన్మరాహిత్యకరమైన ముక్తి క్షేత్రమైనది.

శ్రీ శైల క్షేత్రమున నీవు సాధన చేసినచో త్వరగా ఫలించును. అందుచేతనే కాబోలు శ్రీ దత్త భగవానులు మమ్మనుగ్రహించి శ్రీకాల భైరవ స్వరూపులైన శ్రీ దత్త భక్తులను నియోగించి మమ్ము శ్రీ శైలం రప్పించి, అనేక సాధనలు చేయించి అనుగ్రహించారు. స్వామీ! ధన్యులము.

## శ్రీముఖ నామ సంవత్సరం-యుగాది సందేశం

24-3-93 ఉదయం 5-00 గంటలకు శ్రీ స్వామివారు శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి ఇలా సెలవిచ్చారు:

"విశ్వసించిన అంతా కలదు
అనుమానించిన ఏమీ లేదు.
నమ్మి చెడినవాడూ లేడు
నమ్మక చెడనివాడూ లేడు.
విశ్వసించిన నేనే వస్తా
అనుమానించిననీవే రావు
నాకు లాభం ఏముందీ
అంతా లాభం నీకే కదా?

ఆనాడుదీని భావం మాకు అర్థంకాలేదు. కానీ ఈనాడు అర్థమైంది. సత్యం – సత్యం – ముమ్మాటికి సత్యం. కనుక మన విశ్వాసం ధృడమైనది అచంచలమైనది కావాలి.స్వామీ! ఎన్ని జన్మలనెత్తినను సరే నీ పాదారవిందములయందు ధృఢమైన అచంచలమైన భక్తి విశ్వాసములను అనుగ్రహించి నీ సేవలో తరింపచేయవయ్యా అని ప్రణమిల్లుదము.

ఉదయం 6.30 గంటలకు స్వామి ఇలా వచించారు: ''నాయనా విను, భక్తికి విశ్వాసమే శక్తి. శక్తిహీనుడు ఎలా పనిని సాధించలేడో విశ్వాసము సడలిన భక్తియు అలా గమ్యమును చేరలేదు. నాకు స్వార్థ లాభం గానీ, కీర్తి వాంఛ గానీ ఏమీలేవు. అంతయూ లాభం నీకే కదా! నిన్ను వంచింపనవసరం నాకేమున్నది? నీకు జరుగు లాభమును గుర్తించక అనుమానించినచో సర్వము కోల్పోదువు''. స్వామీ! ఏమంటున్నావయ్యా! నీవు సర్వేశ్వరుడవు. నీవే మా సర్వస్వము. అంతకు మించి ఏమీ లేదు. మాకు ధృఢ విశ్వాసము అచంచల భక్తి ప్రసాదించి మమ్మనుగ్రహించవయ్యా అని ప్రణమిల్లుదము.

స్వామి ఇలా అన్నారు ''అద్వైతము సిద్ధి. అది పొందితేనే శాంతి లభించును. అది రానంతవరకూ తపన అనగా భక్తి వుండును. అయితే అద్వైతంలో ఉండి ఎంత తపన పడతావో,అంత అద్వైత సిద్ధి వుండును. తపన యొక్క పరాకాష్ఠయే సాధన పూర్తియగుట. దాని తర్వాత పూర్ణాద్వైతము సిద్ధించును. ఈలోగా ఎప్పటికప్పుడు శాంతిని కోరినచో భావాద్వైతము వచ్చుచుండును . ఈ అద్వైతము కూడా సాధనకు సహాయపడును. ఏలననగా, నీకు ప్రియమైన దానికి వేరుగా నీవు వుండలేకపోవుటయే ఈ భావ అద్వైతము యొక్క సూచన. అదియును సాధనయే కాన భావాద్వైతము కూడా భక్తిలోని భాగమే. పూనకము వచ్చుట లోకమునందు కనిపించుటచేత అద్వైతమున్నదనియే అంగీకరించ వలెను. ఈ భావాద్వైతము కానీ పూర్ణాద్వైతముకానీ నా సంకల్పమున నీకు కలుగును. కాన దానియందు నీ ప్రయత్నమేమియునుండదు. ప్రయత్నించినచో ఈ అద్వైత ఫలము రాదు. అది కేవలము నా హస్తగతము. కాన దానిపై దృష్టినుంచకుము. దానిని ఎపుడీయవలయునో అప్పుడే నేను ఇచ్చుచుందును. నీవు నేనుగా అగుటకు నీకెంత తపనయున్నదో నిన్ను

నేనుగా మార్చుటలో నాకు అంతకన్నా ఎన్నో రెట్లు తపన వున్నది. ఆ యోగ్యతను నీవు సంపాదించుకొన్న క్షణమందే దానిని నీకిత్తును. కాన దానిపై దృష్టి పెట్టుకొనవద్దు. తడిసిన కట్టెయందు అగ్గిపుల్ల గీచి పెట్టినను అది ఆరిపోవును. ముందు కట్టెను ఎండపెట్టుకొనుము. నీవు సంసార సముద్రమున మునిగి తడిసియున్నావు. ముందు వైరాగ్యము వచ్చిన గాని ఎండినట్లు కాదు. అయితే వైరాగ్యము దానంతట అది కానీ, నీ ప్రయత్నము వలన కానీ రాదు. అదియునూ నా దయచేతనే వచ్చును. సూర్యుడైన నాయొక్క దయ అను ఎండ యందు నిన్ను నీవు వుంచుకొను ప్రయత్నమను భక్తి నవలంబించుము. నా భక్తియే నీకు వైరాగ్యమునిచ్చును. భక్తిలేని వైరాగ్యము నిష్ఫలము, అసాధ్యం కూడా'' అని వచించారు. ఆహా! స్వామీ! ధన్యులము. కాలభైరవ స్వరూపులైన శ్రీదత్త భక్తులను నియోగించి మమ్ముద్ధరించినదే ప్రత్యక్షసాక్ష్యము కాదా!

శ్రీస్వామి ఇంకా ఇలా సెలవిచ్చారు. ''నాయనా విను! అత్రి మహర్షి నాతండ్రి. అనసూయ తల్లి. వారికి నామీద ఎంత ప్రేమాభిమానాలు! అట్టి తల్లి దండ్రులను వదులుకొని, వివాహం లేకుండా మీ అందరిని ఉద్ధరించడానికే కదా నేను మీ చుట్టూ తిరుగుతున్నాను. మీరో? సంసారసుఖాలన్నీ అనుభవించారు గదా! ఇప్పటికీ మీరు కోరికలతో సతమతమవుతూ, నావంకకు పూర్తిగా తిరగడంలేదు. ఇది భావ్యమేనా? మీ కోరికలు నాకు చెప్పుకోవాలా? నాకన్నీ తెలుసు. సర్వజ్ఞుడనైన నాకు తెలియనిది ఏముంది? నేను చెవిటివాడనా, గుడ్డివాడనా, నాకు వినిపించదు -కన్పించదు అని అనుకోవాడానికి. ఇప్పటికయినా మనస్సులో కోరికలు తీసి పారేసుకోండి. నావైపు పూర్తిగా తిరగండి. మిమ్ము ఉపేక్షింతునా! అన్నారు స్వామి.

ఈ దివ్యబోధ వినగానే శ్రీ దత్త భక్తులు ఈ విధంగా గానం చేశారు భక్తి పారవశ్యంలో

దత్తుని తలచెదము - దత్తుని పిలచెదము-<br>
దత్తుని కొలచెదము - దత్తుని వలచెదము-<br>
ఏ కోరిక లేకయె-దత్తుని తలచెదము-<br>
మా తలపుకు, పిలుపుకు కొలుపుకు, వలపుకు కారణం<br>
దత్తునిపైగల మా అనురాగం దత్తునిపై మా మమకారం

శ్రీ దత్త భక్తుల కీర్తనకు స్వామి వారు ఆనందించి ఇలా పాడినారు.

"ఎన్ని ఇచ్చినా తృప్తి చెందని ఈ సంతానంలో
నీ కొరకేనని నిష్కామంతో నన్నర్చించే
భక్తునికై-సదా సంచరిస్తూ-తిరుగుచున్నాను తిరుగుచున్నాను.
అట్టి భక్తుని నిశ్చల నిర్మల ప్రేమకై
తపించి తపించి తపించుచున్నాను.
ఎన్ని ఉన్ననూ అట్టి భక్తుడు ఒక్కడైననూ లేడని
పిచ్చివాడనై వెదుకుచున్నాను వెదుకుచున్నాను.

అప్పుడు శ్రీ దత్త భక్తులు శ్రీ స్వామివారికి ఇలా విన్నవించుకున్నారు

"నీ ఎడబాటు నేనోర్వలేను - ఎన్నాళ్ళు స్వామి?
ఈ ద్వైత భావం - రావయ్య దత్తా - రావయ్య దత్తా
నీవే నేను-నేనే నీవు అయిపోదాం
నాగుండె చీల్చితి నీ కోసమేను
నీకింక ఈలోక సంచార మేల?"

శ్రీ గురుడు మందస్మిత వదనారవిందుడై ఇలా సెలవిచ్చారు.

"నాయానా ఇదిగో చూడు ఈ జీవుల పంక్తి. స్థూల శరీరాలు వదలిన సూక్ష్మజీవులు వరుసగా నరకంలో విచారణకు పోతున్నారు. ఈ ఆరుగురిని చూడు. ఈ ఆరుగురు స్థూలశరీరాలతో ఉన్నప్పుడు ఈ లోకంలో భార్య, భర్త, కొడుకు, కూతురు, మనుమడు, మనుమరాలు. ఆ స్థూలదేహాలు ఉన్నప్పుడు అందరూ ఒకరినొకరు విడువలేనంత మమకారంతో హా ప్రాణనాథా! హా ప్రాణ ప్రియా! హా జనకా! మొ॥ పిలుపులతో వున్నారు. ఆస్థూలదేహాలు పోగానే కేవలం సూక్ష్మ శరీరాలు ఆ పంక్తిలో ఒకరి నొకరు ముందుకు జరగమనుచు తిట్టుకొనుచు

చీదరించుకొనుచున్నారు ''చూచితివా! నీ దారా పుత్రాది బంధము లెంత క్షణికములో! అసత్యములో! కావ నిన్ను నీవు ఉద్ధరించుకొనుము. ఇతరులు నిన్ను భక్తుడని పొగిడినందున నీకు అక్కడ ఒరిగేదేమీలేదు. లేక తిట్టినందున తరిగేదేమీలేదు. ఏకాంతంలో అంతర్ముఖంగా సాధన చేయుము. నీవు,నేను తప్ప మన మధ్యలో మూడో వ్యక్తి లేడు. మూడో వ్యక్తి ఎవరును అచ్చటకు వచ్చి సాయముకానీ అపకారముకానీ చేయలేడు. కావ,నీకు ఎవరు సాధనకు దోహదం చేయుదురో వారే నీ బంధువులు తప్ప కేవలము రక్తపాశములతోనున్న అశాశ్వత-అసత్య బంధములపై భ్రమవీడుము. సద్భక్తులు నీ బంధువులు.వారే నీ సాధనను అభివృద్ధి చేసి అచట నీ ఉద్ధరణము జరుగునట్లు చేయుచున్నారు. నిన్ను నీవే ఉద్ధరించుకొనవలయును. పతనమైనను, ఉద్ధరణమైనను అంతయూ నీ చేతిలోనే వున్నది'' అన్నారు స్వామి.

ఆహా!ఎంతటి నగ్నసత్యము. మనం చూస్తూనే కూడా మోసపోతున్నాము గదా ! ఎంత సంపాదించినా ఏదీ వెంటరాదు కదా! ఎంత ప్రేమించినా అంత్యకాలములో ఎవరు వెంటరారు కదా! కనుక స్వామి దివ్యవాణిని మననం చేసుకుంటూ తరించుదాం.

శ్రీస్వామి వారు భక్తిని గూర్చి, కోరికలను గూర్చి ఇలా వచించారు. ''భక్తియను మొక్క ఫలించకుండా దానికి పట్టిన చీడపురుగులే కోరికలు. కావ ఆ కోరికలను నాశనం చేయుము. నీ భక్తి ఫలించును. సదా నన్ను స్మరించుము. నాస్మరణ చేయగనే నీకు సమీపమునకు నేనే వచ్చుచున్నాను. నా సామీప్యత చేత నీకు సారూప్య సాలోక్య సాయుజ్యములు సిద్ధించును. నా స్మరణ మానగనే మరల నీ రూపమును నీ స్వభావమును పొందుదువు. నీవు బొగ్గువు. అగ్నినైన నేను సమీపించగనే నీలో వేడి ఎరుపురంగువచ్చి క్రమంగా నీవును అగ్నియగుచున్నావు. నీలోని నిప్పునకు దూరం కాగానే చల్లబడి మరలా

బొగ్గుగా నగుచున్నావు. కాన నా స్మరణము సదా వుండినచో నీకు కైవల్యమే సిద్ధించును. అనగా నీవే నేను, నేనే నీవు అగుదుము. అట్టి స్మరణయందు కోరిక యుండరాదు. కోరిక నీరు వంటిది. వెంటనే నిన్ను తడిపి నన్ను దూరం చేయును. కోరికను గురించి నాకు విన్నవించవద్దు. అసలా కోరికను భావంలోనికే రానీయకుము. నాకు తెలియదా. నీ కష్టము? నిజభక్తుడవైన నీవు కష్టపడుచుండగ నే నూరకుందునా? నీకష్టము పోగొట్టుట నా భాద్యత కాదా? నాకు అసాధ్యమున్నదా? నీ కష్టము తీసివేయకుండుట నిన్ను పరీక్షించుటకే. నీకు నా పైగల ప్రేమ యొక్క స్థాయి పరీక్షలో నిరూపించబడుచున్నది.

ఈ మనుష్య లోకము 'కర్మలోకము'. ఈ మానవ జీవితము నందు సాధన చేయుము. దానికై నీ కెంతయో సాయపడుదును. ఎన్నో రూపముల నీ చెంతకు వచ్చి నీ సంశయములను తీర్చి నీకు కావలసిన ఉపదేశముల నిత్తును. ఈ లోకంలో ఈ మానవజన్మను వృధా చేసుకున్న చో పై లోకమున నీకు నా సహాయం ఏమియు నుండదు. అది కేవలం నీ సాధనను పరీక్షించి దానికి ఫలములనిచ్చు సమయమది. అచ్చట నేను నిష్పక్షపాతముతో జీవుని పాపపుణ్యములను పరిశీలించి తీర్పు ఇచ్చు చోటు. అచట నీకు నా సాయమేమియు నుండదు. నా సాయము ఈ లోకమున ఎంతయైనను సాధన సమయమున తీసుకొనుము. గురువు గారు, చదువుకొను సమయంలో పాఠం ఎన్ని సార్లు అయినా చెబుతారు, ఎంతైనా సాయం చేస్తారు. కానీ పరీక్ష హాలులో మాత్రం ఏమీ చెప్పరు. చాలా కఠినంగా వుంటారు. అక్కడ ఏమీ సాయం చెయ్యరు. కాన ఇక్కడ ఈ జన్మలో నన్ను బాగా ఉపయోగించుకొని నా సాయం తీసుకో. నాసాయం తీసుకోకుండా సంసారంలో మునిగి పరలోకంలో సాయం చేయమంటే చేయను. చదువుకునే సమయంలో సినిమాలు చూసి పరీక్షహాలులో సాయం అడిగితే కుదరదు'' అన్నారు.

ఆహా! ఎంతటి దివ్యవాణి. ఆచరించి తరింతుము గాక! స్వామీ అనుగ్రహించవయ్యా! అని ప్రణమిల్లుదము.

## సాక్షాత్కారము

ది. 29.3.93. మేము శ్రీశైలంలోయున్నాము. శ్రీ దత్త భక్తులు మాకు స్వామి వారి దివ్యవాణి ఎప్పటికప్పుడు వివరిస్తున్నారు. మేము మా సందేహలను శ్రీదత్త భక్తులకు విన్నవించడం, వెంటనే వారు శ్రీదత్త భగవానులకు విన్నవించడం అప్పుడు శ్రీస్వామివారు వివరించడం, తక్షణమే మాకు శ్రీవారి దివ్యవాణిని శ్రీదత్త భక్తులు వివరించడం రోజూ జరుగుతూనే వుంది. మా మనసులో ఇలా అనిపించింది. ఆహా! శ్రీదత్త భక్తుల అదృష్టమే అదృష్టం వారికి శ్రీ దత్త ప్రభువుల దర్శనం ఎల్లప్పుడు కలుగుతోంది. మాకు కూడా ఒక్కసారి ఆ సాక్షాత్కారం లభించరాదా అని! శ్రీస్వామి వారు సర్వాంతర్యామి కదా! ఆయనకు తెలియనిదేమున్నది. వెంటనే శ్రీస్వామివారు ఇలా వచించారు. అప్పుడు ఉ.5.00 అయింది. ''నాయనా! విను. ఈ దంపతులకు వివరించు. సాక్షాత్కారం గొప్ప విషయము కాదు. రావణుడు పరమేశ్వరుని దర్శించెను. కానీ ప్రయోజన మేమి? అతడు అనుగ్రహింపబడలేదు. కావలసినది అనుగ్రహము. రాజు వీధిలో పోయినపుడు చూచుదుము. దానివలన లాభమేమి? కావలసినది రాజానుగ్రహము. స్వామి, నీవు సమర్పణము చేసితివా లేదా అనునది మొదట చూచును. తరువాత సమర్పణముచేసినది ఏ భావముతో చేసితివనియే చూచును. అంతేకాని సమర్పణము చేసినది ఎట్టి గుణమును కల్గియున్నదనిచూడడు. నీకుఏ వస్తువు అనుగ్రహించబడినదో దానినే సమర్పించుము. అన్నియు స్వామి సృజించినవే కదా. ఒకని వద్ద తియ్యని కలకండ వుండవచ్చును. మరొకనివద్ద చేదుగా వుండు వేపకాయయే వుండవచ్చును. మొదట తనకున్న వస్తువు సంసారమునకు వినియోగించు చున్నాడా లేక స్వామికి నివేదించి సమర్పించుచున్నాడా? అనునది ప్రశ్న. ఇరువురును స్వామికే సమర్పించుచున్నారనుకొందము. అప్పుడు వారిలో గల సమర్పణ భావ మెట్టిది యను ప్రశ్నయే తప్ప, సమర్పిత వస్తువు ఎట్టిది? అనునది కాదు. మంచి భావముతో సమర్పించిన వేపకాయ

దుర్భావము తోనో, భావరహితంగానో సమర్పించిన కలకండ కన్నా గొప్పది.'వాడేమి చేయగలడు?' వాడి వద్ద కలకండ లేదు, వానికి వున్నది స్వామి అనుగ్రహించి యిచ్చినది వేపకాయయే''.

''సమర్పిత భావం మూడువిధములుగా నుండును. సద్భావము జ్ఞానంతోను వినయంతోను వుండును. అనగా స్వామి సర్వాధికుడని తెలిసి తాను అశక్తుడని తెలిసి అహంకారము లేకుండుటయే జ్ఞానం. ఇట్టి జ్ఞానం రాగానే వీనిలో వినయము వచ్చి తానొక బిచ్చగానివలె స్వామిని కరుణతో అర్థించును. ఇట్టి జ్ఞాన వినయమునే సత్త్వగుణ మనబడును. అట్టి సత్త్వగుణికి స్వామి తనపై ప్రేమకలుగునట్లు అనుగ్రహించును. కాన వాడు భక్తుడగును. ఇక రెండవది దుర్భావము. దీనియందు జ్ఞానం పెడదారిన పట్టియుండును. అహంకారము కలిగియుండును. మరియు తాను చేయు సమర్పణరూపమైన ఆరాధన ఇతరులు చూచి తన్ను పొగడ వలయునని కోరుకొనుచుండును. మరియు తన వద్ద కలకండ కలదన్న అహంకారము, దానిని సమర్పణచేయుట నలుగురు చూడవలయునని ఉండును. ఇదియే రజోగుణము. ఇక మూడవది అజ్ఞానము. దీనిలో ఏ భావము వుండదు .కేవలము అచేతనము చేయు క్రియవలె యుండును. ఉదా॥ అచేతనమైన ఒక మేఘము కురియు వాన శివలింగంపై బడినంత మాత్రాన మేఘము అభిషేకం చేసినట్లు కాదుకదా? ఇదియే తమో గుణము. రజోగుణి అహంకారముతో నీవు వేపకాయనే పెట్టితివి, నేను కలకండను పెట్టినానని సాత్త్వికుని హేళన చేయును''.

''భగవంతునికి భాషకాదు కావలసింది, భావము. నీవు ఎట్టి క్రియద్వారా ఆరాధించుచున్నావని కాదు. ఎట్టి భక్తితో ఆరాధించు చున్నావనియే ఉండును. నీవు సంస్కృతంలో స్తోత్రము చేసినా, నీ మాతృభాషలో చేసినా ఒక్కటే. భావమెచ్చటనున్నదో అచ్చట స్వామి వుండును. ఆరాధనా విధానంలో గొప్పలేదు. నీవు జప యజ్ఞములు చేసినా, శాస్త్రీయ సంగీతంలో పాడినా భావం లేనిచో వ్యర్థము. భావ

ముతో పిచ్చిపాటలు పాడినా అవి స్వామి కరుణకు మార్గములే''.

''సాత్త్వికుడు మోక్షమును కోరును. రాజసుడు ఐహికములనన్నింటిని కోరునను. తామసుని కెట్టి ఫలము లభించదు. ఈ త్రిగుణములకు అతీతమై ఐహికములతోపాటు మోక్షమును కూడా కోరనిదియే పరాభక్తి! ఇట్టి పరాభక్తి సాత్త్వికునికే క్రమంగా లభించును తప్ప రాజస తామసులకు ఏ నాడూ లభించదు. ఇందులో ఆరాధన ఎట్టి కోరికయు లేక కేవలం అకారణంగా భగవత్ప్రీత్యర్థము వుండును. ఈ పరాభక్తియే మహాభావమని పిలువబడి సమాధియనబడుచు చివరకు కైవల్యమునకు దారితీయును. అనగా అట్టివానికి స్వామి తన్ను తానే సమర్పించుకొనును. అట్టివాడు పూర్ణాద్వైత కైవల్యముతో స్వామియే అగుచు జీవన్ముక్తుడగును''.

''తామసునకన్నా ఐహికములకు స్వామిని కోరువాడు అగు రాజసుడు మేలు. ఐహికములను వదలి కేవలం ముక్తిని కోరు సాత్త్వికుడు రాజసునకన్నా మేలు. చివరకు మోక్షకామం కూడా లేని పరాభక్తి కలవాడయిన భక్తుడు అందరి కన్నా మేలు. అట్టివాడే యోగి. అట్టి యోగికే కైవల్యం సిద్ధించును. సాత్త్వికునకు సారూప్య, సాలోక్య, సాయుజ్యములు సిద్ధించును. రాజసునకు సామీప్యము సిద్ధించును. తామసుడు స్వామికి దూరముగా నుండును''.

''ఎట్టి కోరికయు లేక కర్మను అనగా దైవారాధన చేయువాడే యోగి. ఇచ్చట కర్మయనగా దైవారాధనయే తప్ప శరీర యాత్రకై చేయు క్రియను కర్మయనరాదు. స్వామిని పొందుటకై చేయు ప్రయత్నమునందే కర్మ శబ్దము రూఢమగును. ఇది యోగరూఢ శబ్దము.(అనగా కర్మ శబ్దార్థముతో కేవల మా అర్థమునందే నిశ్చితమగుట.) ఇదియే గీతలో నేను బోధించిన నిష్కామకర్మయోగ రహస్యము. ఏ కోరికయు లేక చేయు దైవారాధన రూపప్రయత్నము ద్వారా భగవత్కైవల్యమును పొందుటయే దాని భావము''. అని వచించారు.

శ్రీదత్త భక్తులు నిరంతర ఆరాధన చేస్తున్నారు. ఉదయం 10.30 ని॥లు అయింది. శ్రీ దత్త భక్తులిలా పాడినారు.

"కనిపించుదత్తా! కనిపించు దత్తా, కనిపించు దత్తా నా కండ్లకు
నీ కొరకె దత్తా, నీ కొరకె దత్తా, నీ కొరకె దత్తా నాబ్రతుకు."

శ్రీ స్వామి మందహాసం చేస్తూ దర్శనమిచ్చి అదృశ్యులయ్యారు.

## శక్తి వినియోగము

అప్పుడు శ్రీ దత్తభక్తులు ఇలా వచించారు - శ్రీదత్త స్వామి చాలా వినయ సంపన్నులు. అన్ని దేవతలకు తానే మూలమయ్యును అట్టి భావమును అంగీకరించరు. అన్నిదేవతల వేషములు వారివే. ఏవేషము నారాధించినను ఆ మూలవిరాట్‌ను ఆరాధించినట్లే గదా! ఉదాహరణకు సుబ్బయ్యయను నటుడు కృష్ణవేషము ధరించినాడను కొందము. కృష్ణ వేషములో వున్న సుబ్బయ్యను పాదములపై గిల్లి గాయపరిచిన సుబ్బయ్యను గిల్లినట్లే కదా! ఆసుబ్బయ్యే మరల రామవేషమును వేసినను ఆ గాయం రామ వేషములో కూడా యున్నది కదా! అన్ని వేషములు తీసివేసి, అదే నటుడు సుబ్బయ్య విశ్రాంతిగా కూర్చున్నాడు అను కొందము, అప్పుడు కూడా ఆయన కాలిపై గిల్లిన గాయము వుంటుంది గదా! కనుక అన్ని వేషములు వేసిన ఈ సుబ్బయ్య అనగా అన్నివేషములు తీసివేసి తన నిజవేషమున వున్న సుబ్బయ్యయే శ్రీ దత్త స్వామి. ఇది పరమ సత్యము" అని శ్రీ స్వామివారు తెల్పిరట. ఆహా! ఎంత చక్కటి ఉపమానము! స్వామీ ధన్యులము.

## శరీరము - కర్మాగారము

మానవ శరీరమును కర్మాగారముతో పోలుస్తూ స్వామి ఇలా సెలవిచ్చారు: "నాయనా విను. ఈ శరీరము కర్మాగారము వంటిది. దీనిలో అన్నము అను ముడిసరుకును పడవేయగా అది శక్తియగుచున్నది.

ఈ శక్తిని ముందు ఆ కర్మాగారంలో పనిచేయు కూలీలు కొంత జీతముల క్రింద తీసుకొందురు. ఈ కూలీలే గుండె, పొట్ట, శ్వాసకోశములు మొదలగు శరీరావయవములు. ఆతరువాత కొంతశక్తిని ఆ అన్నమును సంపాదించుటకు వినియోగించవలెను. అనగా కొంతభాగము ద్రవ్యము ముడిసరుకు కొనుటలో ఉపయోగింపవలెను. ఇదియును తప్పుకాదు. కాన ఆహార వస్త్రములను సంపాదించువరకు చేయు కర్మ తప్పుకాదు. ఇక మిగిలిన ధనమును అనవసరంగా ఖర్చుచేసి వృధాచేయక ఆ కర్మాగారము యొక్క యజమానికే లాభముగా సమర్పించవలయును. అట్లే మిగిలిన శక్తియంతయు అనగా - శరీరావయవముల క్రియలకు కొంత, ఆహార సంపాదనకు కొంత పోగా, మిగిలినది దైవారాధనకు అర్పించుము. ఏలనన ఈ శరీరమును నిర్మించి నడుపు యజమానిని నేనేకదా.

ఆహార సంపాదన మాత్ర కర్మయగు కర్తవ్యములు చేయుము. శ్రమ అనిపించినచో విశ్రాంతి తీసుకొనుము. ఇక మిగిలిన శక్తి అంతయు నా ఆరాధనకే వినియోగించుము. ఈ మూడు తప్ప నాల్గవదియగు అనవసర వ్యయుము చేయుకుము. అనగా-అనవసరముగా మాట్లాడకుము, అనవసరంగా ఆలోచింపకుము. అనవసరంగా శరీర క్రియలు చేయకుము. తప్పనిసరియగు కర్తవ్యములందు కూడా నా పరముగా చేసి నన్నారాధించుము.

ఉదా॥ వంటచేసినచో అది నా నివేదన లక్ష్యముగా చేయుము. ఆ సమయమున కూడా నన్నే స్మరింపుము. శరీర వ్యాయామము చేసే బదులు నాకు నమస్కరించి సాష్టాంగపడి లేచుచు దండ ప్రణామములు చేయుము. నా చిత్రములనే ప్రేమతో చూడుము. నీకు ప్రియమైన వారిని చూచుట తప్పనిసరైనపుడు వారిలో కూడా నన్నే చూడుము''.

## కుండలిని - షట్చక్రములు

శరీరములో ఏర్పడిన ఈ శక్తియే కుండలిని యనబడుచున్నది. ఈ శక్తిని ఉత్పాదించగా మిగిలిన అన్నమే మలము. దీని ప్రభావమే నిద్ర, రోగము. ఈ మలమే తమస్సు. ప్రకాశంలేని దంతయు చీకటి యగునట్లు, శక్తికన్నా భిన్నమైన ఈ పదార్థమే తమస్సు. ఈ మలస్థానమే పృష్టము. ఇచ్చటనే మూలాధారములో ఈ శక్తి నిద్రించుచున్నది. ఈ మలపదార్థ భిన్నమైన దంతయు రజస్సు. ఇదియే అన్నరసము. ఇందు జల, తేజో, వాయు తత్త్వములుండును. ఇదియే ధూళితో అనగా రజః కణములతో కూడిన ఒక దుమ్ము గాలివంటిది. లేక ఒకదుమ్ముతో కూడిన బురదనీరు వంటిది లేక రవ్వలతో కూడిన అగ్ని. ఈ మూడును కలిసినదే రజో గుణము. ఇదియంతయు జడశక్తిగా మారుచున్నది. ఈ జడ శక్తియే శరీరము యొక్క అన్ని కర్మలను చేయించుచున్నది. ఈ శక్తియే అహంకార కారణము. ఇక ఈ జడ శక్తియే చైతన్య శక్తిగా మారి మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారములతో పిలువబడుచున్నది. ఈ మనస్సే అజ్ఞాచక్రము. ఇంతవరకు కుండలిని గతి ప్రతివానికి సాధ్యము. ఈ మనసే అన్ని కోరికలకును కారణం అగుచున్నది. ఈ జడశక్తి వాక్కుగా మారుచున్న కంఠస్థానమగు విశుద్ధ చక్రమున రజస్సు వున్నను, ఈ చక్రాంతముననే మనస్సుగా మారుచూ యిక్కడ సంధిస్థానమగుచున్నది. అనగా కేవల ధ్వని, జడశక్తియొక్క క్రియ అయ్యును, వర్ణవాగాత్మక క్రియ మనస్సుతో సంబంధించి యుండును.

ఈ ఆరు చక్రములందును త్రిగుణాత్మకమైన కుండలినీ శక్తి ప్రయాణించి సంసార బంధములలోను, అన్ని విధములగు కోరికలతో వుండును.

ఆరుచక్రములు : 1. మూలాధారము (పృథ్వి) 2. మణిపూరము (నీరు) 3. స్వాధిష్టానము (అగ్ని)

4. అనాహతము 5. విశుద్ధచక్రము 6. అజ్ఞాచక్రము
(వాయువు) ( ఆకాశం) (మనస్సు)

సత్త్వమనగా సారము. అనగా తమో రజోగుణముల సారము. సత్త్వమే జ్ఞానము అనగా చైతన్యము. ఇందులో పదార్థతత్త్వమేమియు వుండదు. కాన నిర్మలము. జడశక్తులయొక్క అత్యంత సూక్ష్మరూపము కాన అన్నమునుండియే చైతన్యరూపుడయిన పురుషుడనబడు జీవుడు ఉద్భవించుచున్నాడు. అన్నము పంచభూతమయము, కాన పంచ భూతముల సారవికారమే జీవుడు. జీవుడు సృష్టింపబడిన తత్త్వమే గాని సృష్టికర్త కాదు. అజ్ఞాచక్రమును కుండలిని దాటలేకున్నది. అనగా జీవుని స్వప్రయత్నమగు స్వస్వరూపమగు శక్తి తనను మించి పైకి పోలే కున్నది. జీవుడిట్లు త్రిగుణములను దాటలేడు. ప్రతిజీవుడును స్వభావముచే చైతన్యమే కాన సత్త్వగుణరూపుడే. రజస్తమో గుణములను వదలి తన నిజతత్త్వమైన సత్త్వస్వరూపమును పొందుటయే ఆత్మ సంధానము. ఇది పరమాత్మ సంధానము కాదు. కుక్క తాను నక్క కాదనియు కుక్కయేనని తెలుసుకున్నది. ఇంత మాత్రమున అది సింహము కాదు. కాన అజ్ఞా చక్రము స్వస్వభావప్రాప్తి.

ఇక్కడ దైవానుగ్రహము గురురూపమున నేను సాయపడినచో కుండలిని, అజ్ఞాచక్రమును దాటి సహస్రారమును చేరి పరమాత్మతో కలియుచున్నది. అనగా చైతన్యమునకు అనూహ్యమైన పరమాత్మ తత్త్వప్రాప్తి జరుగుచున్నది. కాన పరమాత్మ చిత్ – జడముల రెండింటికిని అతీతుడని తెలియుము. సహస్రారములో అనగా పరంధామమునందు కుండలిని కైవల్యము పొందినచో తిరిగి క్రిందకు రాదు. ఇదియే నిర్వికల్ప సమాధి .కేవలము పరమాత్మను కలిసి ఆలింగనాదులతో ఆనందించుట సాయుజ్యము. దీనిలో లోకసంగ్రహార్థము పరమాత్మాదేశముతో తిరిగి క్రిందకు మూలాధార పర్యంతము రావలయును ఇది సవికల్ప సమాధి.

ఇట్లు తిరిగి వచ్చిన కుండలిని నిద్రించుచున్ననూ అంతర్ముఖముగా జాగరూకమై యుండి యోగనిద్రలో వుండును. అజ్ఞానుల నుద్ధరించు టకు వారియొక్క స్థితిలోనికి అవతరణము చేయుటయే ఈ యోగ నిద్రారహస్యము. అనగా నిద్రించుచున్నట్లు కన్పించిననూ పరమాత్మ యోగమునందే వుండుట. బురదలో నున్నవారి నుద్ధరించుటకు తాను బురదలో దిగవలయును గదా.

త్రికరణముల క్రియల రూపంలో ఉన్న కుండలినికి అనగా మనలోని శక్తికి, కర్తవ్యముల నాచరించుటయను బాధ్యతల వలన పక్కలకు పోక తప్పదు. కావుననే కుండలిని నేరుగా మార్గమున పోక సర్పమువలె వంకరలతో పోవును. దీనితో సమయం ఎక్కువ పట్టును. దూరము ఎక్కువగును. కానీ తప్పదు కర్తవ్యముల వలన. కాన ఈ వంకరలతో ప్రయాణించుట జీవునకు తప్పనిసరియై కుండలిని యొక్క సర్పగమనము స్వభావసిద్ధమైయున్నది. ఈ వంకరలు లేకుండా నేరుగా పోయి పరమాత్మను చేరుట చాలా కష్టము. అనగా కర్తవ్యములను త్యజించుటయే కాక, శరీరములో జరుగు అన్ని క్రియలను వదలవలయును. ఆహారమును వదలి చివరకు శ్వాసక్రియను కూడ వదలి, వాయు భక్షణముకూడా మానిన ఘోరమైన తపస్సు త్వరగా తక్కువ ప్రయాణముతో పరమాత్మ వద్దకు తీసుకుపోయినను ఇది చాలా కష్టసాధ్యము.

తప్పనిసరియగు కర్తవ్యముల నాచరించుచు పరమాత్మకు మిగిలిన శక్తియంతయు వినియోగించినచో మానవునకు ఈ జన్మ సమయముచాలు చేరుటకు. జన్మ ముగియుటకు ముందే త్వరపడి చేరుట పై మార్గము. ఇట్టి ప్రయత్నమును మానవుడు చేసినచో నేను వానికి ఆయుర్దాయమును పొడిగింతును. కాన త్వరపడి ఘోర తపస్సునకు పోనక్కరలేదు. త్రికరణముల క్రియలలో అనవసరంగా ఖర్చు చేసే శక్తిని

నా ఆరాధనకు వినియోగించిన చాలు. ఈ జన్మలోనే నన్ను పొంద గలుగుదువు.

ఇట్లు దైవారాధనకు ఉపయోగించు శక్తిని పుట్టించు అన్నమును సాధకులకు పెట్టినచో నా ఆరాధనకు ఇతరులకు దోహద పడుచుండుట చేత అన్నదానమునకు నా అనుగ్రహము ఫలమగుచున్నది . నన్నారాధించి నచో నేను అనేక మహాత్ముల నావేశించి నీ వద్దకే వచ్చి నిన్ను సాధనలో పైకి తీసుకుపోదును. నీవు పాఠశాలకు రానవసరంలేదు. నేనే నీ ఇంటికి వచ్చి పాఠములను బోధింతును. నాభక్తుల ఇంటింటికి తిరిగి జ్ఞానమును ప్రసాదించుదును. అట్టి మహాత్ములలో నా కళను చూసి , నన్నే లక్ష్యముగా నుంచుకొని వారిని సేవించుము. వారిని సేవించుచున్నపుడు వారిద్వారా నన్నే సేవించుచున్నావను విషయమును మరచినచో నీ సేవయంతయు బూడిదలో పోసిన పన్నీరగును. అట్టి మహాత్ముడును, నీవుచేసిన సేవను, కేవలం వార్తాహరునివలె, ఆ సేవను నాకు సమర్పణము చేయవలెను. కానీ తనకే అనుకున్నచో వాడును పతనము చెందును. వాడు కేవలం నా సందేశమును నీకందించు వార్తాహరుడే. అలానే నీ సేవను నాకందించు వార్తాహరుడే. ఇది మరువరాదు. స్వామీ! ఇది నగ్నసత్యం. అద్భుతం. మేము అల్పులం, అజ్ఞానులం, అటువంటి మాకు అనేక మహాత్ముల రూపంలో సాధనచేయించావు గదయ్యా! ఎన్నో సాధనలు చేయించితివి గదయ్యా! ఎన్నో బోధలు బోధించితివి గదయ్యా! శ్రీదత్త భక్తులను పంపి వారి పర్యవేక్షణలో ఎంతో పైకి తీసుకునివెళ్ళినావుగదయ్యా! ఆహా! ఎంతటి మహిమ! ఎంతటి వాత్సల్యము! అంతా నీ అనుగ్రహమేనయ్యా. అని ప్రణమిల్లుదము.

## పూర్వ జ్ఞానము

స్వామి ఇలా వచించారు ''అన్ని దేవతల రూపములునూ నా వేషములే అగుచున్నట్లు అన్ని రకములయిన ఆరాధనావిధానాలు సముద్రమును చేరు నదులవలె నా మార్గములే. ఒక వేషమును నిందించిన వేషధారియగు నన్ను నిందించుటయగునట్లే, ఒక మార్గమును చులకనగా

చూడరాదు. ఉదాహరణకు జపము,యజ్ఞము చేయువారు భజన చేయువారిని నిర్లక్ష్యముతో చూడరాదు. నీకు చేతనగు,నీకిష్టమైన మార్గంలో నీకిష్టమైన నా వేషాన్ని అవలంబించి నన్ను చేరుము. ఒక దత్తుడే అన్ని దేవతల రూపాలు వేషాలుగా ధరించి, అందరికీ తృప్తినిచ్చు చున్నాడని మరువకుము. నీకు ఏ వేషం వేయని అసలు మూలవ్యక్తినగు మూల విరాట్టు అయిన ఈ దత్తుడే కావలయునన్నచో అట్లే నాకు వేషం వేయక నా మూల స్వరూపముననే నీకు సాయ పడుదును.

నీలో శక్తి పరిమితము. ఆ శక్తినంతయును పెద్దగా అరచి భజన చేసి ఖర్చు చేసుకొనుటకన్నా,మౌనజపంతో ఎక్కువ సమయం నన్నారాధించుము. పదిమందికి వినిపించు జపముకన్నా,ప్రక్కవానికే వినిపించు జపము ఎక్కువ సమయం చేయవచ్చును. నీవరకే వినిపించు, కేవల జిహ్వాస్పందన మాత్ర జపము దాని కన్నను గొప్పది. గొప్పది యనగా ఎక్కువ సమయమున పరిమిత శక్తిని ఉపయోగించుట యను విషయమే తప్ప వేరొకటి కాదు. ఇంతమాత్రముననే పెద్దగా అరచి భజన చేయు వానిని తక్కువయనరాదు. త్రికరణముల క్రియలను అనవసర వ్యయములు చేయకుండా దాచుటయే యమ నియమములన బడును. శరీర -వాక్కుల క్రియలను అనవసరంగా వినియోగించక శక్తిని దాచుకొనుటయే బహిరింద్రియ నిగ్రహమైన యమము. అలానే మనస్సు యొక్క ఆలోచనలను అనవసరంగా ఖర్చుచేయకుండా దాచుకొనుటయే అంతరింద్రియ నిగ్రహమైన నియమము. ఈ యమనియమములతోనే యోగము ఆరంభించుచున్నది. తప్పనిసరియగు కర్తవ్యములు కాక,మిగిలిన అనవసర సంసార విషయములనుండి శక్తిని వృథాగా ఖర్చుకానీయక లోపలకు ఇంద్రియ వృత్తులను ఉపసంహరించుకొని శక్తిని దైవారాధనకై దాచుకొనుటయే ప్రత్యాహారము. ఆసనము

శరీరమునకు ఆరోగ్యమునిచ్చి కుదురుగా కూర్చొనునట్లు చేయును. ప్రాణాయామము మనస్సునకు నిశ్చలత్వము నిచ్చి బలమునిచ్చును. ఇట్లు శక్తి నిధిని కూర్చుకొని నిరంతరము చేయు దైవారాధనయే ధారణ. దానిచేత భగవదనుగ్రహంతో నిరంతరం భగవత్ప్రేమ రూపమైన భగవచ్చింతన యేర్పడుట ధ్యానము. దీని ఫలితములే సామీప్య, సారూప్య, సాలోక్య, సాయుజ్యములు. ఈ నాలుగునుసవికల్ప సమాధి లక్షణములు. నిర్వికల్ప సమాధిలో కైవల్యమేర్పడి జీవన్ముక్తుడగును. అతడే నేను. నేనే అతడు. సవికల్ప సమాధి పొందినవారు కూడా దాదాపు నాయంతవారే. వారు నా దూతలు. నా ప్రతినిధులు. వారిని సేవించుటయు నన్ను ఆరాధించినట్లే. వారిద్వారా నీకు నేను ఉపదేశించుచున్నాను.

నా గురించి నన్ను చేరు మార్గమును గురించియును తెలిసి కొనుటయే పూర్వ జ్ఞానము. ఇట్టి జ్ఞానము కల వానిలో తీవ్ర ప్రయత్నరూపమగు క్రియ యేర్పడి (కర్మ) దుర్వినియోగం కాకుండా శక్తి నిధిని సమకూర్చుకొని (యోగ) దైవము నుపాసింప, నా అనుగ్రహముతో భక్తి ఏర్పడి నన్ను చేరును. కాన జ్ఞానమే మూల కారణం. నన్ను చేర్చునది కేవలం భక్తియే. కాన కైవల్యము జ్ఞానము చేత సిద్ధించుచున్నదనినమూ, భక్తిచేత సిద్ధించుచు న్నదనినమూ ఒక్కటియే.

నా సందేశములను గ్రంధరూపము చేసి, ముద్రించి ఎందరో జీవులకు నా ప్రాప్తియందు సహకరించుటకు చేయు ఈ యత్నము కూడా నా ఆరాధనమే. ఎందరు దీనిచేత తరింతురో వారి అందరి పుణ్య భాగములు నిన్ను చేరుచున్నవి. కాన, నా తత్త్వ ప్రచారము వలన చాలా పుణ్యమును సాధించుకొని దానిద్వారా నా అపరిమిత అనుగ్రహమునకు పాత్రులగుదురు. మిగిలిన సాధన అంతయు నిన్ను నీవు ఉద్ధరించు కొనుట. ఇది పరులనుద్ధరించుట. కాన నా కార్యక్రమమున నీవు భాగముకొని నా కృపకు పాత్రుడవగుదువు.'' అన్నారు స్వామి.

పరబ్రహ్మము ఊహాతీతమనియు, దేని నుండి ఈ సమస్త భూతములు పుట్టి, దేనిచేత నిలచి, దేనియందులయమును చెందుచున్నవో అదే పరబ్రహ్మమనియు, అది ఏకైక స్వరూపమనియు, అద్వితీయమనియు, వేద ప్రమాణమనియు, ఆ పరబ్రహ్మమే దత్త పరబ్రహ్మమనియు వివరించి మమ్మనుగ్రహించి ధన్యుల చేసితివయ్యా! అని ప్రణమిల్లుదము.

★ ★ ★



శ్రీ గురుదత్త! ఓం జై గురుదత్త!!

శ్రీ దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

### అధ్యాయము - 4

శ్రీముఖనామ సంవత్సరం చైత్రశుద్ధ సప్తమి మంగళవారము ది. 30-3-93. ఆనాడు మాకు శ్రీశైలంలో వుండే భాగ్యం కలిగింది. శ్రీదత్త భక్తులు మావెంట యున్నారు. అనేక విషయాలు చెప్పుతున్నారు. ఇంతలో ఒక అద్భుతం జరిగింది. శ్రీదత్త భగవానులు సాక్షాత్కరించ టమే గాక శ్రీదత్త భక్తుల నుద్దేశించి ప్రసంగించుతూ వారితో తాను సర్వశక్తి సంపన్నుడ ననియు, సమస్త మత సమన్వయ సిద్ధాంతమును -తమకు కూర్చు భక్తుడయిన 'శ్రీదత్త భక్తుల' చేత సంగ్రహముగా పల్కించ దలచితిననియు తెల్పుచూ ఒక సుదీర్ఘమయిన అమృతవర్షం కురిపించారు. ఆనాడు మా దంపతులము శ్రీ దత్త భక్తులతో కలసి శ్రీశైలంలోయుండటం మా పూర్వజన్మ పుణ్యఫలమే. చదువరు లందరూ కృతార్థులే. ఆ పరమ పవిత్ర దినాన ఉదయం 5 గంటలయింది. శ్రీవారి దివ్యవాణి కోసం మా దంపతులం తహతహలాడుతున్నాము. శ్రీదత్త దివ్యవాణిని స్వామివారే శ్రీదత్త భక్తులనావహించి స్వయంగా లిఖించారు. దత్తభక్తులు మాకు వివరించి మమ్ము ధన్యుల చేశారు.

ఆనాటి శ్రీదత్త దివ్యవాణి ఇలా అనుగ్రహింపబడినది.

''నేను సర్వ శక్తి సంపన్నుండను. సర్వసమర్థుండను లఘటనా ఘటనా పటీయసియగు నా శక్తిని దెలియ దేవతలకును ఋషులకు నలవికాదు. ఇది నేను చేయగల,ది చేయలేనను వివాదంబులు నాయం

దొల్లనేరవు. అన్ని ఊహ్యంబుల నన్ని అనూహ్యంబుల నొనరింప గలవాడ నిట్లయ్యును ఉచితంబులనే చేయుదు ననుచితంబులనుచేయ నిట్లు ఔచిత్య కార్యకరణంబనుశక్తియు నాకు కలదు. కాన నేను సర్వశక్తిమంతుండనను వ్యవహారంబబాధింబగు. కాన నే ననుచిత కార్యంబులచేయని యెడల కొందరు మూఢులు నే నయ్యవి చేయలేనని తలంతురు. కాన పరిమిత శక్తిమంతుండనని భావింతురు. దానం జేసి మరి కొందరు నేనశక్తుండననియు,నేను లేనేలేననియు వాదించు చుందురు. మరియు పండితులును నేను సర్వశక్తిమంతుడనని యెరిగియు నిదియే చేసితి,నిట్లేయుంటి, నిది చేయలేదు,యిట్లు నేనుండననియు పరస్పరము వాదించుకొందురు. సర్వశక్తిమంతుండ నగు నేనన్నివిధములుగ నుందు నన్నివిధములుగ చేయుదు. కాని తత్తదవసరములందుగల ఔచిత్యముననుసరించి ఒక విధముగనుందు, నొకవిధముగ చేయుచుందు,కాన నా విషయంబులందు ఔచిత్య మేదియని అన్వేషణంబు చేయవలయు. ఔచిత్యమను దీప సహాయముతో నా తత్త్వంబును నాక్రియలను,నిర్ధారణంబు సేయవలయునే తప్ప,నరుండు పండితమన్యుండై తన యిచ్చవచ్చినట్లు నా తత్త్వంబును, నా క్రియలను,సిద్ధాంతీకరించి పరపక్ష ఖండనంబులను స్వపక్ష మండనంబులనుఁజేయుచు జీవితంబులను క్రోధ,మాత్సర్య గర్వకలుషితంబులఁజేసి సాధన సేయక భక్తి దూరులై వినయ వర్జితులై చెడి ఘోర నరకంబుల పడుదురు.

నీ వట్టి దుర్గతి నొందక నీ పాండిత్యంబును వినయంబుతో మేళవించి సమస్త మత సమన్వయ సిద్ధాంతంబును స్థాపించుటకు కారణంబు నీవు నా యందు మహాభావంబను పరాభక్తి చేసిన కతంబున నిన్నట్లు దుర్గతిపాలు కానీయక నా హస్తంబుల నిన్ను పట్టుకొని నా

వాడవగు నిన్ను రక్షించుకొంటి .కాన సిద్ధాంతమును సంగ్రహంబుగ నాకర్ణింపుము''.

## సమన్వయ సిద్ధాంతము

''పరబ్రహ్మమని బహ్మాభిమానులును, నారాయణుడని వైష్ణవులును, సదాశివుడని శైవులును, శ్రీ శక్తియని శాక్తేయులును పిలుచు మూల విరాట్టు నగు నేను వాక్కుల కందను. మనస్సులకు చిక్కను. బుద్ధులచే నప్రాప్తుండనై తర్కదూరుండనై అనూహ్యుండనై నిర్గుణుండనై నిర్వికల్పుండనై నిరంజనుండనై సుర ముని కిన్నెర నర గంధర్వాది సమస్త ప్రాణజాతంబులచే సదా అన్వేషింపబడుచునుందు. దేవతలును బ్రహ్మర్షులును అన్వేషించి యన్వేషించి, చర్చించి చర్చించి తుదకు నెవరికిని యెచటను ఏ కాలంబు నందును తెలియని వాడనని నిర్ధారణంబు చేసికొని పురుష ప్రయత్నంబులు వ్యర్థంబులని తెలిసికొనిరి.

ఈ నిర్గుణావస్థయందింట్లు అనూహ్యంబుగ నుండుట నా సర్వాధిక్య సర్వ మహత్త్వంబునకు ననన్య గౌరవంబునకు నుచితంబు కాన నిట్లుంటి. కాని భక్తులు నన్నుపాసింప దుఃఖంబు చెందియుంట వారల దుఃఖంబు నుపేక్షించుట యనుచితంబు కాన నేను ఎవరెట్టి ఆకారమును కోరిన ఆ ఆకారంబుగా మారి వారి ధ్యాన సేవలకు లభ్యుండనైయుంటి. కాన నట్టియెడల నేను గుణంబుగా మారియుంట గుణంబేయని చెప్పుట సత్యంబు. సగుణ శబ్దంబు దోషయుక్తంబు. దానిచేత గుణభిన్నంబుగ నేను నిర్గుణ స్వభావంబును విడువలేనివాడ నను అశక్తత నాయందు స్ఫురించు. కాన గుణంబుగ నిర్గుణంబుగ నుండుననుటయే నా తత్త్వ సిద్ధాంతంబు. నిర్గుణంబగు నేను గుణంబుగ నిజముగ కానియెడల గుణంబు నారాధించువారందరును గుణంబు నేనుకాదని తలచి వారి సేవలన్నియు నాకుచెంరలేదనియు, వారలు, ధ్యానించు

నది సాక్షాత్తుగా నేను కాదనియు తలంచి ఖిన్నులగుదురు కాన ఇట్టి అనుచిత దుఃఖ పరిహారంబునకై నేను గుణంబుగ మారియుంటి, కాన వారలు నన్నే సాక్షాత్తుగ ధ్యానించుచున్నారని నిర్గుణోపాసకులు తెలిసి వారల నవహసించు మహాపాపంబును విడువవలయు. ఇట్లు అపహసించు వేదాంత మతావలంబులు గుణోపాసకుల నజ్ఞానులని భాషించు చుందురు. కాని నిజంబుగ నా సర్వశక్తిమత్త్వంబున కేదియు నసాధ్యంబు లేదని పరమ సత్యంబెరుగని వారలగుటం జేసి ఈ పండితమన్యులే అజ్ఞానులని తెలియవలయు. మరియు వీరలు నన్ను చిత్స్వభావుండనని నిర్గుణ శబ్దంబున కర్ధంబుగా చెప్పుదురు.

చైతన్యమొక్కటియే చిత్, క్షేత్రజ్ఞ, జీవ, ఆత్మ, శరీరి, అంతఃకరణ చతుష్టయ నామంబులచే వ్యవహరింపంబడి పంచ భూతాత్మ కంబైన అన్నంబు యొక్క భూద్రవ్యంబగు శేషంబైన తమస్సునకు భిన్నంబైన పంక, జల, సస్ఫులింగ వహ్ని, సధూళి వాతంబగు రజో గుణంబు యొక్క సారంబు సత్త్వంబుగ నాకాశ వాగింద్రియ కంఠ స్థానంబు నందు మారుచున్నదనియును, ద్రవ్య రహితంబును, నిర్మలంబును నగు జ్ఞానమే చైతన్యంబనియు నిట్లు పంచభూతవికార సూక్ష్మ రసతత్త్వంబే చిత్తుకాన జీవుండు సృష్టింపబడిన వాడేకాని సృష్టికర్త కాడని తెలియజాలక జీవస్వభావంబునే నా నిర్గుణ స్వభావంబుగ వాదింతురు. అన్నంబు నుండి పురుషుండును, పంచభూతములనుండి వీని నుత్పాదించెనన్న శ్రుతుల తాత్పర్యంబుల నెరుంగజాలరు. కాన చిత్తు గుణంబే కాని నిర్గుణంబు కాదు. నిర్గుణంబనగాహ్యంబనియే నిర్ణయంబు. గుణ శబ్దంబుచే సర్వసృష్టియు వాచ్యార్థంబుగ తెలియుము. ద్రవ్యము నాశ్రయించిన గుణంబు రీతిగ సర్వసృష్టియు నన్నాశ్రయించిన కతంబున గుణంబు నాబరగు. కాన వీరలు నగంబును త్రవ్వి

మూషికంబును పట్టినట్లు నిర్గుణ తత్త్వ సంపాదన శ్రమనుఁ జేసి గుణంబగు చిత్తునే పొంది కేవలము ఆత్మానుసంధానంబు కావించిరే కాని నన్ను పొందలేదు. వీరలు నన్ను తర్కసాధ్యంబగు ప్రమేయజాలంబునందు నన్నేదేని నొక్క ప్రమేయంబుగ నిరూపించి, తర్క సాధ్యంబుగ నా అప్రమేయ తత్త్వంబును చేయనెంచెదరు. అప్రమేయుండగు నాయందు ప్రమేయ ప్రవర్తకంబులగు తర్కంబులు కుంఠితంబులు గదా. మరియు చిత్తు నప్రమేయంబని వాదింతు రది నిత్యానుభవ సిద్ధంబుగ స్వజ్ఞాన-పరజ్ఞాన ధర్మద్వయంబు కలిగియుండు కాన తనకు తాను ప్రమేయం బగు చుండు నిట్టి పక్షంబు నా యందు నుండుటయు లేకుండుటయు తెలియజాలని తత్వంబే అప్రమేయ తత్త్వంబు. వీరును గుణావలంబులై ధ్యాన సౌలభ్యార్థంబు నన్నుగుణంబుగ మారిన వానినెరిగి చిద్గుణంబైన నన్ను స్వాత్మరూపునిగ నారాధించిన తరింతురుగాని, విదితర సర్వగుణ నిరాకరణంబును, కేవల చిద్గుణ రూపంబు నంగీకరించి దానినే నిర్గుణంబని భ్రమించుటయు దోషంబులని తెలిసి, తామును గుణావలంబులగు భక్తులేయని తెలియవలయు, స్వస్వరూపంబు నేనని ఆత్మావలంబులగు వీరు నేను స్వస్వరూపంబైన చిత్తు కానిచో పరిపూర్ణా ద్వైత కైవల్యంబసాధ్యంబు కావున ఘటంబు పటంబు కాని చందంబున స్వస్వరూపంబు నాకు విజాతీయంబు కాదని స్వభావంబగు చైతన్యజీవుండే నేననియు అర్కింతు రది వ్యర్థంబు. ఏలనన నా సర్వశక్తి మత్త్వంబున కసాధ్యంబు లేదని మరచియుంటిరి కాని న సంకల్పంబునం జేసి ఘటంబు పటంబు గాదె? కాన స్వభావ జీవచైతన్యంబు సృష్టి జగద్భాగంబగునట్టి పరాప్రకృతియే కాని నేను కానని తెలియవలయు. కొందరు జీవుని నన్ను చైతన్య సామాన్యంబుగా నంగీకరించి విజాతీ యత్వంబు నెరిగియు అద్వైత సిద్ధి లేదని వాదింతురు. వారలును నాకు నసాధ్యంబు లేదను విషయవిస్మరణంబు చేసినవారలే యగుదురు. వీరందరును నా సృష్టి సంకల్పంబను చైతన్య లక్షణ కారణంబున నేను

చిత్స్వభావుండని నిర్ణయించిరి కాని, అనూహ్యుండగు నేను సంకల్పిం చుటయు నాకు నసాధ్యంబు కాదని భావింపరు.

జీవేశ్వర విజాతీయవాదులును నన్ను సకల కల్యాణ గుణునిగ చెప్పి, నాపరమౌదార్య గుణంబునకుచితంబుగు పూర్ణాద్వైతసిద్ధియగు కైవల్యంబును నేనిచ్చుటకంగీకరింపరు. కించిన్మాత్రనాద్వైతంబు నిచ్చుట నా అనంతౌదార్య గుణంబునకును లోపంబు గదాయని చింతింపరు. ఘటంబువలె విజాతీయుండగు జీవుండు పటంబుకానేరనిరీతి ఈశ్వరుండు కాడని వీరు చింతించుదురు. దానిచేత నాశక్తి నాచే సృష్టంబులైన ఘటపటంబుల నియమంబులచే నియతంబై నేనును ప్రమేయుండనని వీరల తలంపుగా తోచుచున్నది. సర్వప్రమేయంబులగు వస్తుజాతంబుల నియమంబులును నా సంకల్పంబుచే నియమింపబడి ప్రవర్తిల్లుచున్నవి. నా శాసనంబులచే ప్రకృతి నియమంబులు ప్రవర్తించు గావున, సృష్టిలోని పరాప్రకృతిగ భాగంబైనొప్పి నాచే సృష్టుండగు జీవుండు నాయనుగ్రహంబుచేత నా పూర్ణ కైవల్యంబునొందు. నిందు సంది యంబులేదు. అట్టి కైవల్యంబు భక్తాభీష్టంబు కానిచో వారలయభిమతం బులగు సామీప్య, సారూప్య,సాలోక్య, సాయుజ్యంబులనే ప్రసాదింతు కాని కైవల్యంబు లేదని వాదించరాదు.

జీవుండు నిత్యుండని తొల్లి నే చెప్పియుంటి. దాని భావంబు వేరు. జనన మరణంబులచే అనిత్యంబగు స్థూల శరీరంబుల దృష్ట్యా జీవుండు నిత్యుండని సాపేక్షతచేత నిత్యత్వంబు కలిగియున్నాడు. కాని అది నా నిత్యత్వంబువలె పరమార్థంబు గాదు. గో గోపాలకులు తొల్లి సత్యలోకంబునందు దాచబడి యుండగ నేను వారల మరల సృజించితినిగాదె. జీవుండు నిత్యుండైన మరల సృజింపబడుటయెట్లు? పరాప్రకృతియగు జీవుండు అపరాప్రకృత్యన్నరస సూక్ష్మసత్త్వ వికారంబె

కాన పరస్పర పరిణామంబులు సాధ్యంబు. అహల్యయను జీవుండు సశరీరంబుగా పాషాణత్వము నొంది మరల పరాప్రకృతి సహితంబు మారుట దీనికి నిదర్శనంబు కాదే. కాన జీవుండు స్వభావసిద్ధముగ బ్రహ్మంబు కాడు. కాని నా యనుగ్రహంబు చేత బ్రహ్మంబు కాగలడు. కాన వర్తమానంబున ద్వైతంబు సిద్ధియందు నద్వైతంబును సమ్మతంబులగు. మదారాధనాకామి యగుచు నద్వైతము నంగీకరింపడేని విశిష్టాద్వైత సమ్మతంబులగు సామీప్య సారూప్య సాలోక్య సాయుజ్యంబుల నొందుగాన సాధకజీవునకు భిన్నుండుగను, సిద్ధజీవున కభిన్నుండుగ నుందు. నిది నా సర్వశక్తి సంభావ్య సర్వదా కార్యంబునకు నిదర్శనంబుగ నిరూపిత పక్షత్రయంబై ఏకతర పక్ష సంశయ రాహిత్యంబును ప్రదర్శించు చుండు. మరియు నిట్లు, భిన్న, భిన్నాభిన్న, అభిన్నదశాత్రయంబునౌచిత్య సమన్వితంబని తెలియుము. సాధక జీవుండ నేనే నగుదునేని సాధన వైయర్థ్యంబును నా మోక్ష ప్రదాతృత్వ నిరర్థకత్వంబును సిద్ధించ ననుచితంబగు కాన సాధక జీవుండు భిన్నుండు. నా పరమౌదార్య గుణంబునకు నుచితంబుగ కైవల్య సిద్ధి గలదు. కాన ముక్తజీవున కభిన్నుండను. భక్తాభీష్ట ప్రధానౌచిత్యముగ భిన్నాభిన్నత్వంబును కలదని సిద్ధాంతంబు సేయవలయు.

నేను భక్తుల కొరకు గుణంబుగా మారియుండుటచేత నా నామరూపంబులు సత్యంబులైయుండు. అట్టివియు నసత్యంబులేని భక్త ఖేదంబనుచితంబు మరియు అసత్యంబులైనచో నవి ఆరాధించు వారల సత్యంబును చేర్చజాలవు. కేవల క్రీడార్థంబు సృజించిన జగన్నామ రూపంబులసత్యంబులనియే నిశ్చయంబు. జగత్తు సత్యంబేని సత్యంబునుండి సత్యాంతరంబునకు ముక్తి వృథయగు కాన, అసత్య జగత్తు నుండి మోక్షంబు సత్యంబు కావునను జగత్తు అసత్యంబనియే నిర్ణయంబు, మరియు అసత్యంబైన అభావంబు నుండియే అసత్యంబగు

జగత్తు నుత్పాదించియుండియును, జగద్భాగంబగు నసత్యుండైన జీవునకు అసత్యంబగు యీ జగంబు సత్యంబు కావున జీవదృష్ట్యా సత్యంబైన జగత్తు అభావంబు నుండియే నేను సృజించితి నన్నచో నా శక్తికి మహత్వంబు పరాకాష్టను చేరుకాన అసత్కార్యవాదంబు నంగీకరింప వలయు. నాకు నసత్తు నుండి సత్తును పుట్టించుట అసాధ్యంబు కాదు.

ఈ రీతి నామ రూపంబులను సత్యాసత్యంబులుగ సృజించు సర్వశక్తిమత్త్వంబు దృష్టాంతద్వయ ప్రదర్శన నిరూపితంబై తత్తదౌచిత్య సమర్థింతబగు మరియు మత్ప్రాప్తిరూపంబగు కైవల్య సాయుజ్యాదులకు జ్ఞానంబు మూలకారణంబును, భక్తి సాక్షాత్కారణంబుగ నొప్పుచుండు లక్ష్యవస్తు జ్ఞానంబును తదుపాయ మార్గ జ్ఞానంబును జ్ఞాన శబ్ద వాచ్యంబులు, జ్ఞానంబు చేత మదారాధనా తీవ్ర ప్రయత్న క్రియయను కర్మ యేర్పడు. తదావశక్యంబైన వైరాగ్య రూపంబగు యోగంబు సిద్ధింప సంసార విషయ దుర్వినియుక్తంబులగు నింద్రియ వృత్తుల శక్తి సామర్థ్యంబుల ప్రత్యాహారంబు చేత సాధకుండు పరమార్థ విషయంబున శక్తిమంతుండగు కాన జ్ఞానంబుచే కర్మ సంభవించు. కర్మకు యోగంబు శక్తిని చేకూర్చు. నిట్టుల జ్ఞానమూలంబగు నట్టిదియును యోగంబుచే శక్తివంతంబైనట్టిదియు నగు కర్మచేత పురుషప్రయత్నంబు సమగ్రంబుగా తపశ్శబ్దాభిధేయంబై నా అనుగ్రహంబునకు కారణంబగు. అహంకార రాహిత్యంబు కానిదే నా దయ సంభవింపనేరదు.

నా దయకు పురుషప్రయత్నముచేత నియమింపబడుటలేదు. నాదయ సర్వతంత్ర స్వతంత్రుడగు నాయొక్క సంకల్పంబున కధీనంబగు కాన పురుషప్రయత్నముచేత కైవల్యము సాధ్యంబు కాదు. పురుష ప్రయత్నంబుచేత నా దయ సిద్ధించెనేని సాధకునకు భక్తినను గ్రహించెద. అట్టి భక్తి నా యెడల పరాభావంబు నొంద, సర్వకామంబులను

వర్జించి, మోక్ష కామంబును లేక, కేవలము భగవత్ప్రీత్యర్థముగ తదారాధనా విధానంబగు కర్మ భక్తియోగంబునఁజేసి నిష్కామకర్మయోగంబనబడి మత్కైవల్య కారణంబగు కాన అట్టి కర్మయే పూర్వభాగంబున విస్తరింపబడి జ్ఞానముత్తరభాగంబున ప్రతిపాదింపబడి వేదంబులు వెలయుజ్ఞాన సమన్వయంబులే బ్రహ్మసూత్రంబులు. మందాకర్షణార్థంబుగ కర్మలు కామ్యంబులుగ వెలుగుచుండు వాటిని మోక్షము కొరకు యోగి నిష్కామంబుగా నాచరించు. ఇట్టి నిష్కామకర్మయోగము నుద్దీపించు భక్తియోగంబును గీతలో వచించినాడ. పండితులు వ్యాప్తి భ్రాంతులై సిద్ధాంతంబులను పాక్షిక సత్యంబులుగ చేసియుంటిరి.

జగన్నామరూపంబులసత్యంబులు కాన, భగవన్నామ రూపంబులు నసత్యంబులేనని కొందరు, భగవన్నామ రూపంబులు సత్యంబులు కాన జగత్తు సత్యంబని మరికొందరును, ముక్తజీవుండ భిన్నుండు గాన సాధక జీవుండును బ్రహ్మమేనని కొందరును, సాధక జీవుండు భిన్నుండు కాన ముక్త జీవుండును భిన్నుడేనని కొందరు భ్రమించి యుంటిరి. అందరును ప్రమేయ నియమంబులను నా యందు తర్కించి నా అప్రమేయత్వంబున నా సర్వశక్తి సర్వాసాధ్యకరణత్వంబును, నామ మాత్రంబుగ నంగీకరించియు, సిద్ధాంతములందు దాని ననుసరింపక శ్రుతులకు ముఖ్యార్థ వృత్తియగు నభిధను త్రోసిపుచ్చి, లక్షణ నాశ్రయించి వారి మూఢంబులగు నాగ్రహంబులకు సమన్వయించి, గ్రామసింహంబులం బోలి పరస్పర ఖండనంబులతో మొరుగుచు, జీవితంబులను పామరుల కన్నా హీనంబుగ వ్యర్థంబు చేసుకొనుచున్నారు కాన, నేను సర్వ హితప్రదుండను కాన, పామరులతో బాటు పండితుల నుద్ధరింప నీ సమన్వయ సిద్ధాంతమును నీ ద్వారా ప్రసిద్ధంబు సేయుచున్నాడను''.

శ్రీ దత్తభక్తులిలా అడిగినారట :

''స్వామీ! సులభమైన భాషలో చెప్పక ఇట్లు గ్రాంధిక భాషలో చెప్పితిరేల?''

స్వామి అన్నారట ---

'' పండితుల కుచితంబగు భాషలో వక్కాణించితి నేనుచిత క్రియాకారియని సిద్ధాంతంబు కదా!'' అని మందహాసంబు చేసి అంతర్ధానం చెందినారట.''

ప్రత్యక్షముగా మా కన్నులముందు జరిగిన ఈ సన్నివేశము మరపురానిది. స్వామీ! ఎన్నిసార్లు పఠించిననూ అమృతం వూరుచునే యున్నది గదా! సిద్ధాంతమునంతయు పొదిగి అమృత గుళికగా అందించితివిగదయ్యా! ధన్యులము!

## వివరణ

స్వామి గ్రాంధికముగా చెప్పిన సిద్ధాంతమునకు శ్రీ దత్త భక్తు లిలా వివరించినారు :

ఆచార్యులు ముగ్గురూ జీవునకు ఉత్సాహం కలిగించడానికి ఒక మాట చెప్పారు. అదేమంటే జీవుడూ పరమాత్మా ఇద్దరూ ఒకే చైతన్యమని. ఇద్దరూ ఒకే చైతన్యమన్నారు శంకరులు. ఒకే చైతన్యమైనా జీవుడవయవము. ఈశ్వరు డీ జీవులను అవయవములుగా కలవాడు కాన ఇద్దరికీ భేదం వుంది అన్నారు రామానుజులు. ఒకే చైతన్యమైనా హస్తిమశకాంతర భేదం వుందన్నారు మధ్వులు. పరమాత్మ చైతన్య మనడానికి కారణం కూడా చూపినారు ముగ్గురూ. అదేమంటే పరమాత్మ సృష్టి సంకల్పం చేశాడు కాన చైతన్యమే అయి ఉండాలి అని. సంకల్పం చేసేది చైతన్యమే కాని జడం కాదు కదా. ఇక్కడ ఇలా జీవునకు ఈశ్వరునకు చైతన్యమేనని ఒక్క తత్త్వ సంబంధాన్ని స్థాపించారు.

దీని ఉద్దేశ్యం నేనే బ్రహ్మమని కాని, లేక నేను ఆయనలో ఒక భాగమేనని కాని, లేక నేనెంత చీమలాగా ఆయన ముందు అల్పుడనైనా కనీసం ఆయనా నేను ఒకే చైతన్యమని కాని ఒక ఉత్సాహజనకమైన సంబంధాన్ని చూపించారు. ఐతే, ఇది కేవలం ఉదాహరణకు తప్ప ఏ మాత్రము యదార్థం కాదు. ఎందుకంటే పరమాత్మ చైతన్యమూ కాదు జడమూ కాదు. రెండింటికి అతీతుడు. ఇది కాదు. ఇది కాదనియే వాక్కుకు, మనస్సుకు, బుద్ధికి తర్కాలకు అందనివాడే స్వామి. మరి సృష్టి సంకల్పం చేశాడు కాన చైతన్యం కదా అని చెప్పనవసరం లేదు. ఎందుకంటే అన్నిటికి అతీతుడు సర్వశక్తి సంపన్నుడు అయిన స్వామికి సంకల్పించడం అనే ఒక క్రియ అసాధ్యం కాదు గదా. కాన కేవలం సంకల్ప క్రియనుబట్టి స్వామి చిత్ అనడానికి వీలులేదు. సర్వశక్తిమంతుడేది అయిననూ చేయకలడు కాన సంకల్పం చేశాడు. ఇందులో బాధ ఏమున్నది?

మరి జీవుడెవరు? చైతన్యమే. చైతన్యము కూడా సృష్టిలోని భాగమే. ప్రకృతి రెండు విధాలు గదా. అందులో ఒకటియే కదా పరాప్రకృతి. ఈ చైతన్యం అన్నరస వికారమైన జడశక్తి యొక్క రూపాంతరమే. కావుననే ''అన్నము నుండి పురుషుడు సంభవించును'' ''పంచభూతముల నుండి పురుషుని పుట్టించెను'' అని ఉపనిషత్తులు చెప్పినవి. పంచభూతమయమైన అన్నము తినగానే భూమయమైన తమోగుణ పదార్థము ఘనముగా మారుచున్నది. అదే మలము. ఇక ధూళితో కూడిన వాయువు వలె, రవ్వలతో గూడిన నిప్పువలె, బురద కూడిన జలమువలె, వాతాగ్ని జలమయమైన అన్నరసము వికారముగ జడశక్తి పుట్టి రజోగుణమనబడి అన్ని క్రియలను చేయుచున్నది. ఆ తరువాత ఆకాశతత్త్వమయమైన సంధిస్థానమునందు ఈ రజోగుణ వికార జడశక్తి చైతన్యముగా మారుచున్నది. ఈ జడశక్తి చైతన్యముగామారు నప్పుడు పదార్థ శేషము ఏదియు నుండదు. కాన నిర్మల మనబడే

సర్వపదార్థ సారమయిన అర్థముతో సత్త్వమనబడును. సత్త్వమనగా సారమని అర్థము. ఆ సత్త్వమే జ్ఞానశక్తి. ఇక్కడ వాగింద్రియము కేవల ధ్వని రూపముగా జడశక్తి కార్యముగాను, వర్ణ వాక్యముతో చైతన్య కార్యముగను ఉభయాత్మకముగా నుండును. ఇదియే కంఠస్థానమైన విశుద్ధ చక్ర ప్రదేశము. కాన క్షేత్రజ్ఞుడు, ఆత్మ, శరీరి, జీవుడు, చిత్తు మొ॥ పదములచే పిలువబడు చైతన్యము పంచభూతాత్మక అన్నరసవికారమే. అనగా జీవుడును సృష్టిలోని ఒక భాగమే తప్ప సృష్టికర్త ఏ మాత్రమూ కాదు.

ఈ సూక్ష్మ చైతన్యము ఘనీభవించగా క్రమంగా ఆకాశాదులు సంభవించుచున్నవి.'' ఆత్మన ఆకాశః'' అను శృతికి అర్థం ఇదే. అట ఆత్మ చైతన్యమనియే గదా. '' అతతి ఆత్మా'' కదా అనగా శరీర మంతయు వ్యాపించి వుండునది. చైతన్యం పంచభూతవికారమనుటకు ఒక ఉదాహరణము. అహల్య రాయిగా మారినది. ఆమెలోని జీవుడు అనగా చైతన్య మెచటకు పోయినది? లోకాంతరమునకు పోయి తిరిగి వచ్చినదా? మరల రాయి జీవుడుగా ఎట్లు మారెను? అనగా చైతన్యము జడముగను, జడము చైతన్యముగను మారుననియే పరస్పర పరిణామము సిద్ధాంతము. జీవుడు సృష్టింపబడినవాడే అనుటకు ఒక నిదర్శనము. రేపల్లెలో గోవులను, దూడలను గోపాలకులను బ్రహ్మ తన లోకమున దాచెను. కాని, స్వామి వాటి నన్నింటిని సృజించెను మరల . మరి జీవుడు నిత్యుడయిన అదే జీవుని తిరిగి ఎట్లు సృజించుట? కాన జీవుడు సృష్టి భాగమే కాని, సృష్టికర్త కాడు. చైతన్యము తన్ను తాను తెలుసుకొను ఆత్మజ్ఞానమును, ఇతర వస్తువుల తెలియు పరజ్ఞానమును ధర్మములుగా గలది కాన ఆత్మ జ్ఞానమనగా పరమాత్మ జ్ఞానం కాదు. వాత సూర్యాదులను శాసించు పరమాత్మ ఎక్కడ? పెనుగాలికి నిలువలేక పడిపోవు జీవుడెక్కడ? ఇది అనుభవ నిరూపితము. గీతలో జీవుడు

నిత్యుడని చెప్పుట మాటి మాటికి నశించు స్థూల శరీరముల దృష్ట్యా జీవుడు నిత్యుడనియే తప్ప, పరమాత్మ దృష్ట్యా పరమార్థ నిత్యుడని కాదని తెలియవలయును. మరణానంతరము మరల జన్మలనెత్తు జీవుడుస్థూల శరీరాపేక్షయానిత్యుడేనని భావము.

ఇంతవరకు శారీరకమీమాంస. ఇక సిద్ధాంత మేమనగా- పరమాత్మను బ్రహ్మాభిమానులు పరబ్రహ్మమని, వైష్ణవులు నారాయణుడనీ, శైవులు సదాశివుడనీ, శాక్తేయులు శ్రీశక్తియనీ పిలుస్తారు. పరమాత్మ సర్వ సమర్థుడు,సర్వ శక్తిమంతుడు. ఆయనకన్ని అసాధ్యాలు సాధ్యమే. ఊహ్యములయిన వాటిని అనూహ్యములను చేయగలడు. అన్ని రకాలా వుండగలడు. అన్ని రకాలా చేయగలడు. అయితే అవసరానికి ఉచితంగా ఒక విధంగా వుంటాడు. ఒక విధంగా చేస్తాడు. అలా వుండటానికీ,అలా చేయడానికి ఔచిత్యం కారణం. ఔచిత్యం కూడా ఒక శక్తియే కదా. అనుచితమును చేసిన వాడు ఉచితముగా చేయు సామర్థ్యం లేనివాడనే అంటాము కదా. కాన ఔచిత్యదీప సాయంతో ఆయన ఎలా వున్నాడు? ఏం చేశాడు ? అనేది మనం అన్వేషించాలి. ఇంకో రకంగా వుండలేదని,చేయలేడనీ అనరాదు. అనౌచిత్యం కాన అలా వుండలేదు చేయలేదనియే అనాలి.

సృష్టిని గుణం అంటారు. ఎందుకంటే గుణం ద్రవ్యాన్ని ఆశ్రయించి వుంటుంది. అలానే సృష్టి పరమాత్మను ఆశ్రయించి వుంది. కాన సృష్టి గుణము.సృష్టికి అతీతుడు కాన సృష్టిలో ఏ భాగము స్వామి కాడు కాన ఆయన నిర్గుణుడు. దేవతలకు ఋషులకే అర్థం కాని స్థితియే నిర్గుణము. అలానే వారు నిర్ధారించారు. అలా వుండడంలో ఔచిత్యము ఏమిటి? ఎవరికీ దొరకని మహత్త్వము,గౌరవము ఆయనకుండుట ఔచిత్యం. కాన అలా వున్నారు. కానీ,భక్తులాతత్త్వాన్ని ధ్యానింపలేరు.

సేవింపలేక దుఃఖించినారు. భక్తుల దుఃఖమునుపేక్షించుట అనుచితముగాన, స్వామి ఏ రూపం కావాలంటే ఆ రూపంగా మారినారు. అంటే పరమాత్మ గుణముగానే మారినాడు. కాన సగుణము అనరాదు. సగుణమంటే గుణంకన్నా భిన్నంగా అసలు స్వామి వున్నాడనే అర్థం వస్తుంది. అంటే భక్తులు యింతా సేవించి ధ్యానించిన గుణం స్వామి కాదా? ఆగుణము అసత్యమా? అసత్యము ఆరాధింపబడిననూ సత్యమునెలా చేరుస్తుంది. ఇదంతా భక్తులకు దుఃఖకరము. కాన స్వామి గుణమేనని చెప్పవలయునే తప్ప సగుణమని పిలువరాదు.

భక్త దుఃఖ మనుచితము. స్వామికి అసాధ్యమూలేదు. కాన గుణంగానే నిజంగా మారినారు. కాన గుణము కాదని పట్టుదల పట్టి వాదించుట అజ్ఞానమే అగును. కాన భక్తులుపాసించు భగవన్నామ రూపములు భగవంతుడే. వారిని అజ్ఞానులుగా వేదాంతులవహసింతురు. నిజముగా వేదాంతులే అజ్ఞానులు. ఏలనన స్వామి సర్వశక్తిమత్త్వము తెలియకపోవుటయు, తెలిసి సిద్ధాంతములలో అనుసరించకపోవుటవలన. పైగా వేదాంతులు భగవంతుని చైతన్యమనీ,చైతన్యమే నిర్గుణస్వభావమనీ వారే నిజంగా స్వామి నుపాసించుచున్నట్లు చెప్పుదురు. చైతన్యమూ గుణమే కాన, వారును చైతన్య గుణంగా మారిన స్వామిని ధ్యానిస్తున్న భక్తులే .స్వామి చైతన్యమనీ, అచైతన్యమే నిర్గుణమనీ కష్టపడి ఉపాసించుట కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లే తప్ప నిజంగా నిర్గుణుని ఎవ్వడునూ తెలియజాలడు.

కాన సిద్ధాంతమేమంటే--పరమాత్మ నిర్గుణుడూ-- గుణమూ రెండూను. ఇలా రెండు విధాలుగా వుండటం స్వామి సర్వశక్తిత్త్వము నిరూపింపబడుటయే గాక, ఔచిత్యం వల్లనూ అగుచున్నది. సర్వ శక్తిత్త్వము నిదర్శనముల ద్వారా నిరూపితమైనచో సంశయముండదు. ఉదా॥ ఆయన అన్నం తింటాడు. సున్నమూ తింటాడు అన్నాము. కానీ అన్నమే తిన్నాడు.

కాన సున్నము తింటాడో తినలేడో అను సంశయం కలుగును. రెండూ తిని నిరూపిస్తే సంశయముండదు. కాన ఇది దృష్టాంత నిదర్శన ప్రదర్శన నిరూపిత పక్షద్వయ సంశయరాహిత్యకరమైన సర్వశక్తిమత్త్వము.

## ఇక రెండవప్రకరణము

పరమాత్మ జీవునకు భిన్నుడా? భిన్నా భిన్నుడా? అభిన్నుడా?

## సమాధానము

మూడు విధాలుగానూ వుంటాడు. ఇది ఔచిత్యంతో సమర్థింపబడుటయే కాకుండా, ఆయన సర్వవిధ సర్వశక్తికి దృష్టాంత నిరూపితమైన నిస్సంశయ ప్రదర్శనం కూడా అయినది. ఎలా ఔచిత్యం? అంటే– ఇంతకు ముందే శారీరక మీమాంసలో చెప్పాము. జీవుడు సృష్టిలోని భాగమేననియు, సృష్టికర్త కాదనియు కాన పరమాత్మ జీవునకన్నా భిన్నుడే. భిన్నుడు కాకపోతే ఇక సాధన ఎందుకు? ఆయన ఇచ్చే మోక్షం ఏమున్నది? కేవలం మెడలో వున్న బంగారు హారాన్ని చూపించినంత మాత్రమే తప్ప, ఆ హారమును లేని వానికి బంగారు హారమును కొని ఇచ్చిన వాని యంత గొప్పవాడు కాడన్నమాట.

పరమాత్మ చాలా గొప్పవాడు కాన ఇది చాలా అనౌచిత్యం కాన జీవుడు పరమాత్మకన్నా అత్యంత భిన్నుడే. అసలు ఏ పోలికాలేదు. అనూహ్యుడాయన. ఊహ్యమైన పరాప్రకృతియగు చైతన్యమీ జీవుడు. హస్తిమశకములనుటకును వీలులేదు. ఏలనన హస్తిమ శకములలో పదార్థము ఒక్కటి దృశ్యముగా వున్నది గదా. సూక్ష్మ విచారణచేత అర్థమగువాడు జీవుడు. ఎంత విచారించినా అర్థం కానివాడు పరమాత్మ. ఆత్మ తన్ను తాను తెలుసుకొనుట, కుక్క తాను నక్కను కాదనియు, కుక్కయేననియు తెలుసుకున్నదే తప్ప సింహము కాలేదు. తాను దేహము

కాదు చైతన్యమని తెలియుటయే ఆత్మజ్ఞానము ఇది పరమాత్మ జ్ఞానము కాదు. దేహాధ్యాసమునుండి తాను చైతన్యమని తెలుసుకొనుటచేత సంసార విషయవాసనా విక్షేపక్లేశములు తొలగి సాధనకు అనుకూలించునే తప్ప పరమాత్మ ప్రాప్తి కాదు.

ఇట్లు భిన్నుడైన జీవుడు జ్ఞానకారణములైన యోగసహిత కర్మలచే నిష్కామముగా నన్నారాధించి నా కృపాదత్తమైన భక్తి యోగంచేత నన్ను పొంది నా చేత సాక్షాత్ కైవల్యమును పూర్ణాద్వైతమునే ప్రసాదింపబడుచున్నాడు. ఇట్లు నేను కైవల్యమును ప్రసాదించుట నా అనంతకల్యాణగుణములలోని పరమౌదార్యమను గుణమునకు అది ఉచితముగా యున్నది. అనగా పూర్ణకైవల్య మిచ్చుటచేత నా పరమౌదార్యమునకు తగినట్లుగానున్నది.

అయితే ఇక్కడ పూర్తిగా భిన్నుడైన జీవుడెలా బ్రహ్మమౌతాడు? నా సర్వశక్తికి అది ఉచితం కాన సాధ్యమే. కాన పూర్తిగా భిన్నుడైనంత మాత్రాన ఇక జీవుడు బ్రహ్మం కాలేడనరాదు. అందువల్లనే అసలు జీవుడు వేరుకాదు. జీవుడే బ్రహ్మమైయున్నాడంటే ఇక ఎటూ అద్వైత కైవల్యానికి పేచీ లేకుండా పోతుందని అనరాదు. ఎందుకంటే భిన్నుడైనా నా సర్వశక్తికి అద్వైత కైవల్యం అసాధ్యం కాదు. ఒకరు ఘటం అనే ఒక వస్తువే వున్నది. దానినే జీవుడని, పరమాత్మయనీ అంటారు. కాన జీవుడు పరమాత్మ యైనాడంటే ఘటం ఘటమే అయినది కాన తర్క సమ్మతమని అంటారు. మరియొకరు ఘటం అనే జీవుడు వేరుగా పటం అనే పరమాత్మ రెండో వస్తువుగా వున్నారు. కాన ఘటం పటం కావడం తర్కసమ్మతం కాదు. కాన జీవుడు పరమాత్మ కానేకాడని అంటారు. కానీ సిద్ధాంత మేమంటే, ఘటమూ పటంలాగా వేరుగానే జీవుడూ పరమాత్మ ఉన్నారు. ముక్తిలో నాసర్వశక్తిచేత ఘటాన్ని పటంగా మారుస్తానంటున్నాను. ఇలా

రెండు విధాలుగా అంటే ముందు జీవునకన్నా వేరుగానూ, తర్వాత జీవునకన్నా అభిన్నంగానూ వుండటం ఔచిత్యం చేత సమర్థింపబడినవి కాన నాకు అసాధ్యం లేదు కాన జరిగినదనుటలో అడ్డమేమున్నది? ఈ పూర్ణాద్వైత కైవల్యం భక్తునకు ఇష్టంకాని యెడల అనగా భిన్నంగానే వుండి పరమాత్మను ఆరాధిస్తూనే ఆనందిస్తూ వుండాలని అనుకుంటే వారలకు అభీష్టములైన సామీప్య సారూప్య సాలోక్య సాయుజ్యములనే పరమాత్మ ఇస్తాడు కాన అట్టివారి విషయంలో భిన్నాభిన్నంగాను వుంటారు.

## మూడవ ప్రకరణము

జగత్తు సత్యమా? అసత్యమా? భగవంతుని నామరూపాలు సత్యములా? అసత్యములా?

సమాధానము :

జగత్తు నామరూపాలు కేవలం క్రీడార్థం సృష్టించబడినవి కాన అసత్యములు. జగత్తు సత్యమే అయితే ఇక మోక్షం దేనినుండి? సత్యమునుండి మోక్షమెందులకు? అసత్యమునుండి సత్యప్రాప్తి కదా ప్రార్థింపబడుచున్నది. అయితే జగత్తు అసత్యము పరమాత్మకే తప్ప జీవునకు కాదు. ఏలనన జీవుడును జగత్తులోని భాగమే కదా. అనగా జీవుడును అసత్యమే. కావుననే అసత్యమైన జీవునకు అసత్యమగు జగత్తు సత్యమే అగును. మరియునిట్టి విధముగా జీవునకు సత్యమైన జగత్తు అసత్తునుండియే నేను సృష్టించుపక్షమున అభావమునుండియే సత్యమును సృష్టించుచున్నానన్న మహత్త్వ పరాకాష్ఠ నా శక్తికిచాలా ఔచిత్యకరము. అంటే అవ్యక్తమైనసత్యమును వ్యక్తము చేయుటకన్నా, అసలు ఏమియులేని అభావమునుండి సత్యముగ జగత్తును సృష్టించుచున్నాననుటలో గొప్పతనము ఎక్కువ అగును కాన

గొప్పతనమునకు ఔచిత్యముగా అసత్తునుండియే సత్యమును సృష్టించుచున్నాననియే సిద్ధాంతము. కాన "అసద్వా ఇదమగ్ర ఆసీత్" అను శృతికి అర్థము చెప్పుటలో అసత్ అనగా ఏమియును లేదనియే అత్యంతా భావమనియే ముఖ్యార్థమునే చెప్పవలయును గాని అవ్యక్తమైన సత్యమని చెప్పుట నా మహాతత్త్వమునకు లోపము గలుగును. అవ్యక్తమైనది వ్యక్తము చేయుట కేవలము చిన్నపనియే. ఏమియును లేని శూన్యమునుండి సత్యమైనదానిని సృష్టించుటయే మహత్త్వమునకు పరాకాష్ట కదా! ఇట్లు జగత్తు నామరూపములు, అసత్యము లయ్యును, నేను అకారమే అయినపుడు నా నామరూపాలు సత్యములేనని ముందు ప్రకరణములో నిరూపించితిమి. కాన ఇట్లు సత్యమును, అసత్యమును సృష్టించుశక్తి నాకున్నదని రెండు దృష్టాంతములచేత సంశయ రహితముగా నా సామర్థ్యము నిరూపితమైనది.

## నాల్గవ ప్రకరణము

ముక్తి మార్గమేది? జ్ఞానమా ? కర్మయా ? యోగమా? భక్తియా?

సమాధానము

జ్ఞానమువలన ఉద్భవించి, యోగముచేత శక్తివంతమయిన కర్మ మార్గమువలన పురుషప్రయత్నము సమగ్రమగును. అట్టి పురుష ప్రయత్నమున అహంకార రాహిత్యమేర్పడి నన్ను ప్రపత్తి చేసినపుడు ఆ జీవునకు నేను భక్తినొసగును. ఆ భక్తి పరాభావము నొందినపుడు నన్ను చేరును. నా ప్రాప్తి యనంతరము నేను కైవల్యము నిత్తును. నా ఆరాధనయందలి లోలత్వముచేత కైవల్య మభిమతము కాదేని, సామీప్యాది చతుర్విధఫలముల నొసగుదును.

ఇచ్చట జ్ఞానము మూలకారణము. ఆ జ్ఞానము రెండు విధములు. ఒకటి వస్తుజ్ఞానము అనగా నేను అనూహ్యుడను ,

సర్వశక్తిమంతుడను ఇత్యాది పై ప్రకరణములందు నిరూపించిన నా తత్వమును తెలియుట. రెండవది, ఉపాయ జ్ఞానము. అనగా ఈ నాలుగవ ప్రకరణ జ్ఞానము. ఈ రెండునూ తెలియగనే సాధకునిలో నా ప్రాప్తికై తీవ్రప్రయత్న రూపమయిన ఉపాసనా రూపమగు కర్మ సంభవించును. కర్మ త్రికరణముల క్రియలతో నుండును.

ఈ త్రికరణముల క్రియలును సంసార విషయ వాసనలతో దుర్వినియోగం కాకుండా క్రియాశక్తిని పెంచుకొనుటయే యోగము. యిట్టి యోగముతో కర్మశక్తివంతమగును. దీనితో పురుషప్రయత్నము పూర్తియగును. ఇట్టి క్రియలో అహంకారము వుండరాదు. శరణాగతి వుండవలెను. అనగా నా ప్రయత్నము పూర్తిగా చేసితినిగదా ఫలమేల రాదని తలచరాదు. కేవలము యాచక భావముతో ప్రపత్తి నొనరింపవలయును. ఇట్టి దానికి సంతసించి పరమాత్మ భక్తినొసగును. భక్తి అనగా ప్రేమ. ఈ భక్తి పరాభావము నొందుటయనగా ఏ కోరికయులేకుండటయే. యిట్టి భక్తితో కూడినట్టిదియు,యోగముచే శక్తివంతమైనట్టిదియు, జ్ఞానము నుండి వచ్చినట్టిదియునగు ఆరాధనా రూపకర్మయే నిష్కామకర్మయన బడును. ధ్యాన మనన చింతనాదులన్నియు కర్మయే. దీనిచే భగవత్ప్రాప్తి యను యోగము కలుగును. ఇదియే నిష్కామ కర్మయోగము, కోరికలు లేక, పరాభక్తితో కూడిన కర్మల నాచరించిన భగవద్యోగము కలుగును. కాన వేదపూర్వ భాగమున చెప్పబడిన కర్మలన్నియు కోరికలను త్యజించినచో మార్గమే కాన వేదమంతయు భగవత్ప్రాప్తి మార్గమే. అట్టి కర్మకు కారణమయిన జ్ఞానము ఉత్తర భాగమున చెప్పబడినది. కాన వేదమంతయు భగవద్యోగమునకు మార్గమే.

భగవంతుడప్రమేయుడు. అనగా సృష్టిలోని ఏ భాగమునూ స్వామితో పోల్చలేము. కాన ప్రమేయములగు సృష్టిలోని పదార్థముల మధ్య

వున్న నియమములన్నియు స్వామియందు చెల్లనేరవు. ఆ నియమము లన్నియు స్వామి సంకల్ప శాసనముచే జరుగుచుండగా, అవి వారి తత్వ్రక్రియలనెట్లు తెలుపగలవు? కాన ప్రమేయములపై నాధారపడిన నియమములన్నియును తర్కము కాన స్వామి తర్కాతీతుడు. ఇట్టి తర్కము పై ఆధారపడి ''వ్యాప్తి'' అనుదానిని ఆధారంగా చేసుకొని కొందరు జగత్తు నామరూపాలు అసత్యాలు కాన భగవన్నామరూపాలు అసత్యాలేననియూ, మరికొందరు భగవన్నామ రూపాలు సత్యాలు కాన జగత్తూ సత్యమేననియూ, కొందరు జీవుడు పరమాత్మకన్నా వేరు కాన ఎప్పటికినీ పరమాత్మ కాలేడనియు, మరికొందరు జీవుడు పరమాత్మ యగును కాన ముక్తికి ముందును జీవుడు పరమాత్మేయేననియు పలుకుచుందురు.

ఇది శాస్త్రవాద కలహములకు కారణమై పండితులు మాత్సర్యగర్వాదుల వశులై సాధన చేయక ముక్తికి దూరమగుచున్నారు. కాన అందరిని ఉద్ధరించవలసిన శ్రీ దత్తస్వామి పండితుల నుద్ధరించుట కొరకు ఈ సిద్ధాంతమును ప్రకాశింపచేసి సర్వసిద్ధాంతములను సమన్వయము చేసి వున్నారు.

**శ్రీ గురు దత్తాత్రేయాయ నమః**

**ఓం తత్ సత్**

శ్రీ గురుదత్త! ఓం జయ గురుదత్త!!

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము - 5

శ్రీశైలంలో శ్రీదత్త భక్తులకు స్వామి సాక్షాత్కరించి వినిపించిన దివ్యవాణియే ఈ శ్రీ దత్తవాణి. ది. 31-3-93 తెల్లవారుఝామున 4 గంటల సమయం.

### యోబుద్ధే పరతస్తుసః

బ్రహ్మదేవుడు వేయిదళాలు కలపద్మంపై ఉన్నాడు. విష్ణువు వేయితలల సర్పంపై శయనించి యున్నాడు. ఈ పద్మం, ఈ సర్పం మన బుద్ధియే. మన బుద్ధి సంసారంలో వేయి విధాలుగా ఛిన్నాభిన్నమై వుంటుందని అర్థం. ఆ బుద్ధి ఎప్పుడు ఒకే తలతో మారుతుందో అనగా దైవారాధన నిశ్చయానికి వస్తుందో ఆనాడు భగవంతుడు దానిని కంఠములో అలంకారముగా వేసుకొని గౌరవిస్తాడు.

వేయి తలలతో నున్న ఈ బుద్ధిపై భగవంతుడు బ్రహ్మ రూపంలోనూ, విష్ణురూపంలోనూ అధిష్టిస్తాడో అంటే జీవుడు పరమాత్మనుధారణ చేస్తాడో అప్పుడట్టి ధారణసేవా ఫలితంగా పరమాత్మయే జీవుని భారం వహిస్తాడని అర్థం. అంటే పాము స్వామిని ధారణ చేసి సేవింపగా స్వామియే దానిని మెడలో వేసుకొని భరిస్తాడు. అన్నిలోకాలపైనా, పద్మంపైనా బ్రహ్మ ఉన్నాడనుట సమస్త సృష్టికి అతీతంగా బుద్ధికిపైన పరమాత్మయున్నాడనుటయే ''యోబుద్ధే పరతస్తుసః'' అని గీతభావము యిదియే.

వాణి పరమాత్మని జిహ్వాపైనను, లక్ష్మి హృదయంలోను గౌరి శరీరార్ధభాగంలోను ఉండుట, వాక్కు, మనస్సు క్రియలలోని శక్తి స్వామి సంబంధంతో నున్నప్పుడు భర్త, భార్యనువలే జీవుని రక్షిస్తాడు. సత్వగుణమే స్వామితో సంగం పెట్టుకొనగలదు. తెల్లని హంస, తెల్లని గరుడుడు, తెల్లని నంది - ఈ సత్వగుణానికి ప్రతీకలు. హంసపాలనూ నీరునూ వేరుచేసినట్లు జీవుడు జ్ఞానాన్ని-అజ్ఞానాన్ని వేరుచేయాలి. ఆ తరువాత అజ్ఞానమయమైన సంసారంలోని విషయవాసనలనే పాములను గరుడుడు చంపినట్లు వాసనలను నాశనం చేయాలి. ఆ తరువాత సాత్విక విషయము లను అనగా సాత్విక ఆహారమగు ఆకులు, గడ్డి మొ॥నవి. నంది తిన్నట్లు గ్రహించాలి.

క్షీరసముద్రం సత్వగుణంకాని యింకా గట్టిపడలేదు. కాన తరంగాలతో చంచలంగా వున్నది. దానిలో అనేక వాసనలను తలలతోనున్న జీవుడు పరమాత్మను ధారణచేసి సేవిస్తే ఆ తెల్లని సత్వగుణం గట్టిపడి స్థిరమయిన తెల్లని వెండికొండలాగా విశ్వాసం నిశ్చలమైనపుడు పరమాత్మ యీ జీవుని మెడలో వేసుకొని ఆదరించి ఆ జీవుని తానే భరిస్తాడు. రాత్రి అంతయు నిద్రపోవు సమయంలో దైవారాధన వుండదు, సంసార వాసనలు వుండవు. అంటే శక్తి అంతా కేంద్రీకరించబడి, దాచబడి వుంటుంది. ఒక నీళ్ళటాంకు ఉంది. దానికి వేల చిల్లులున్నవి. ఒక ప్రధానమైన గొట్టము ఉంది. రాత్రి ఆ గొట్టము, ఆ చిల్లులు మూతబడి యుండును కాన టాంకులో నీరు సమృద్ధిగా యుండును. నిద్ర లేవగానే మన ఇంద్రియముల ద్వారా శక్తి ప్రసరణము సమృద్ధిగా వుండును. మనం లేవగానే భగవాదా రాధనయను ప్రధాన గొట్టమును తెరిచి మిగతా చిల్లులు అలాగే మూసి ఉంచితిమనుకొనుము. ప్రధానగొట్టము ద్వారా నీరు వేగముగా సమృద్ధిగా ప్రవహించును. కాన హృదయమున సంసారచింతలను

చిల్లులను తెరువక కేవల దైవారాధనమను ప్రధానగొట్టమును తెరిచినచో ఆ ఉపాసన సమృద్ధిగా, శక్తివంతముగా నుండును తరువాత పగలుక్రమంగా సంసార చింతలతో లాగబడి చిల్లులన్ని తెరువబడి ప్రధాన గొట్టముద్వారా నీరు సన్నగా వచ్చుటయో లేక అసలు రాకపోవుటయో జరుగును. కాన దైవారాధనమునకు బలము తగ్గిపోవును.

## కర్తవ్యము

కర్తవ్య భాద్యతలున్న వారు సమయమును శక్తిని మూడు విధములుగా వినియోగించవలెను. (1) కర్తవ్యముల నాచరించుట (2)విశ్రాంతి (3) దైవారాధన. కర్తవ్యములు తీరినవారు రెండువిధములుగా వినియోగించవలెను. (1) విశ్రాంతి (2) దైవారాధన . కర్తవ్యములు తీరిన తరువాత కూడా అనవసరమయిన సంసార వాసనలలోబడి అవియునూ కర్తవ్యములేనని సమర్థించుకొనుచు ప్రవర్తించినచో వారిని వారే వంచించు కొన్నవారు అగుదురు.

## విశ్వాసము

శిష్యులందరును ఒకే స్థాయిలో నుండరు. ఎవనికేది చెప్ప వలయునో ఎవనికెట్లుల చెప్పి పైకి తీసుకొని పోవలయునో గురువయిన నాకు తెలుసును. నన్ను శరణుజొచ్చి పూర్తిగా విశ్వసించిన, నేనే నీ యింటికి వచ్చి బోధించి సాధన చేయించి ఉద్ధరింతును. విశ్వాసములో స్వల్పముగా నైననూ అనుమానము రాకూడదు. అనుమానం రవ్వంత అయినను ఎంత విశ్వాసము నయినను పడద్రోయును. పెండ్లికి చూచుటకు పోయినట్టి కన్య అంతయును బాగుగానున్నది. కాని కాలిపై చిన్న కుష్ఠరోగమచ్చయున్న ఆ కన్యను వదలి వచ్చినట్లు నీకెంత విశ్వాసమున్నను అనుమానం రవ్వంత వచ్చిననూ నేను నిన్ను విడిచి పోవుదును. కాన విశ్వాసము పట్టుసడల నీయకుము. కొంచెము

సడలినను అంతయు పోవును. నాపై విశ్వాస ముంచినచో నీవు ప్రయత్నము చేయలేక పోయినను నేనే నిన్ను మోసుకొని పోయి గమ్యమునకు చేర్చుదును. నీకు విశ్వాసమున్నచో నేను బోధింతును. ఆ విశ్వాసమే ఇంకా పెరిగినచో నీ సాధనలో సాయపడుదును. ఆ విశ్వాసమే పూర్ణమయినచో నీ వాహనమగుదును.

భవాని శ్రీదత్త భక్తులను మహాత్ములని పొగడినది. దానికి శ్రీదత్త భక్తులిలా చెప్పారు.

''నాలో శక్తిగానీ ప్రతిభగానీ గోచరించినచో అది గురుదత్తు నిది. నాలో దోషము కనిపించిన అది నాదిగా తెలియవలయును. నాది ఈ గోనెసంచి. మీది ఈ మంచిపెట్టె. ఎవరైనా వచ్చి నన్ను '' ఈ పెట్టె ఎంత బాగున్నదంటే'' నేనేం చెప్పాలి?. '' ఈ పెట్టె నాది కాదు వారిది. నాది ఈ గోనె సంచియేనని చెప్పాలి గదా. అలా చెప్పక ఈ పెట్టె నాదేనని మురిసినచో అది నాదగునా? నాదేనని చెప్పుకున్నచో మీరు నన్నెంత నీచముగా చూతురు. అట్లే మీ పొగడ్తలు శ్రీ దత్తునికే చెందవలయును కాని నేను వాటినంగీకరించరాదు. ఏశక్తి అయినా తనదేనని తలచినవాడు పరమాత్మచే నీచునిగ చూడబడి పతనము చెందును. ఎవరు పొగిడినా, నమస్కరించినా దత్తార్పణం అనవలయునే తప్ప తానుంచుకొనరాదు. తానుంచుకొనవలసినవి ఎదుటివారు తనను విమర్శించి దూషించునపుడు వాటిని తనవిగా తెలుసుకొనవలయును. గోనెసంచి మీది కదా అన్నప్పుడు నాదే అంటాను అది సత్యమే కదా.''

**పరీక్ష :–** అసలు జీవుడు పరమాత్మవైపు తిరిగినవాడే పరీక్ష ఆరంభించును. సంసార బంధములన్నియు వద్దని గోలపెట్టును. పెద్దబంధము తల్లి. శంకరాచార్యుని సన్న్యసించుటకు అడ్డగించినదామెయే. పార్వతి తపస్సునకు బయలుదేరగా వద్దని అడ్డగించినది ఆమె తల్లి. అందుకే

పార్వతిని ఉమ అన్నారు. అయినను ఆమె ఆగలేదు. ఎంతవరకు తపస్సు చేసినదంటే చివరకు ఆకులు తినడం కూడా మానివేసేటంత వరకు వచ్చింది పరమాత్మ ధ్యాస వలన. అదే అపర్ణ అని పిలువబడుట. ఉమనుండి అపర్ణవరకు సాధనచేసింది. ఇట్లు భగవద్ధ్యాసలోపడి నిద్రాహారములు మానుటయే ఉపవాస, జాగరణములు.

## పార్వతి ఎవరు?

పార్వతి పర్వతమునుండి పుట్టినది. పర్వతము జడము అనగా జడమైన పంచభూతాత్మకమైన అన్నమునుండి ఉద్భవించిన జీవుడే. ప్రతి జీవుడును స్త్రీయే. ఏలనన ప్రతి జీవుడును పరాప్రకృతి (చైతన్యము) యేకదా. కాన ప్రకృతి భాగమే కదా. పురుషుడు ఈశ్వరు డొక్కడే. ఆమె తపఃఫలము ఎంతవరకు వచ్చినది? ఈశ్వరుని సగం శరీరమైనది. అనగా ఈశ్వరునితో సమానమైనది. అంతేకాదు – ఈశ్వరుని దాసునిగా చేసుకొని పదములక్రింద పడవేసి త్రొక్కినది. చివరకు ఈశ్వరునే ఆడించే మూలశక్తియగు మహాకాళియే యైనది.అంటే తపస్సు చేత ఈశ్వరుని పొందుట, ఈశ్వరునితో సమానమగుట, చివరకు ఈశ్వరునే దాసునిగా చేసుకున్నంత స్థితికి తీసుకుపోయినాడా ఈశ్వరుడు. ఒక జడము యొక్క వికారమైన పార్వతియను జీవుడు చివరకు తన పాదదాసునిగ ఈశ్వరు డుండు మహాకాళియను పరాశక్తిగా మారినది. అనగా భక్తులకు దాసు డగుచు వారి పాదప్రహారముల ననుభవించు చున్నాడు భగవంతుడు. సత్యభామ శ్రీకృష్ణుని తన్నుటయు నిదియే. కాన భగవత్ప్రేమ సాధించని దేమున్నది? దానిచేత పరమాత్మ నిన్ను తనకన్నా అధికునిగా చేసి నెత్తికెక్కించుకొని నీ పాదముల క్రిందనుండు స్థితికి తీసుకురాగల భక్తియే తపస్సు. గోపికల పాదధూళిని శిరమున తాల్చినాడు పరమాత్మ. ఇట్లు ఈ కథలందు తత్త్వార్థమును గ్రహించిన నీ సాధనకు దోహదములగును. లేకున్న కేవలము వినోదము నిచ్చు కథలుగానే మిగిలిపోవును. ప్రతి పురాణ కథలోను ఒక అంతరార్థమైన తత్త్వబోధగలదు.

శంకర,రామానుజ,మధ్వులు ముగ్గురును నా శివ, విష్ణు, బ్రహ్మాంశలే. వారలకు నా సిద్ధాంతము తెలిసినను ఆయాకాలములందున్న సాధకుల దశలననుసరించి కొన్ని ఉత్సాహజనకములగు సిద్ధాంతముల నేర్పరిచిరి. కాశీకి బయలుదేరినవాడు కొంత దూరము నడచి చతికలపడినాడు. వానికి ఉత్సాహముకల్పింప ''నాయనా! ఇంకా నాలుగు అడుగులు వేసినచో కాశీని చేరినట్లే'' అని గురువు చెప్పును. ఇదే శంకరులు చెప్పిన మాట. ''నాయనా! నీవు అసలు బ్రహ్మమే. నీ అజ్ఞానము వదలి జ్ఞానము తెచ్చుకొనుము. చాలు'' అన్నారు. ఇదియే ప్రరోచన. సరేనని లేచి నడువ నారంభించగా ''అన్నిటికన్నా భక్తి గొప్పది'' అని అసలు విషయమును బయట పెట్టినారు వివేకచూడామణి గ్రంథములో! మరల శిష్యుడు నిస్పృహతో చతికిలబడినాడు. అప్పుడు రామానుజుడు వచ్చి ''నాయనా! ఆ గురువు చెప్పినది అబద్ధము నేను నీకు సత్యము చెప్పుచున్నాను. ఇంకొక్క మైలు నడచినచో కాశీ రాగలదు అని చెప్పినారు. అంటే నీవు బ్రహ్మము కాదుకాని బ్రహ్మములోని అంశవే'' అన్నారు.

దానితో లేచి ఆ మైలు దూరము నడచినాడు శిష్యుడు. మధ్వాచార్యులు వచ్చి ''నాయనా! ఆ యిరువురును సరిగా చెప్పలేదు. సరిగా పది మైళ్ళు ఉన్నది కాశీ'' అన్నారు. అంటే జీవుడు వేరు బ్రహ్మము వేరు. చాలా దూరం ఉన్నది కాశీ అని చెప్పినారు. ఇట్లు నిజముగా కాశీ నగరమింకనూ వందమైళ్ళు ఉన్న సత్యము చెప్పి నిరాశ,నిస్పృహలను సాధకులలో కలుగనీయక సిద్ధాంతములను చెప్పినారే తప్ప వారలకు అసలు సత్యము తెలియక కాదు. దీనిని అర్థముచేసికొనలేక పరస్పర వాదములతో జయాపజయములను ఖండన మండనములతో పండితులు కలహించుట చాలా శోచనీయము. అనగా ఒకడు కాశీ నాలుగు అడుగులలో ఉన్నదనియు, మనియొకడు కాశీ మైలు దూరంలో ఉన్నదనియు, మరియొకడు పదిమైళ్ళ దూరంలో ఉన్నదని కలహించు

సమయమున నేను అసలు సిద్ధాంతమును బయటపెట్టవలసి వచ్చినది. కాశీ వందమైళ్ళు ఉన్నదని చెప్పవలసిన సమయము వచ్చినది.

## శక్తి

మహాకాళి శివుని త్రొక్కినపుడు శక్తి గెలిచినదని వినోదించు చున్నావే తప్ప దానిలో అంతారార్థము, భగవంతుడు భక్తునికి భక్తుడై, భక్తుని చేతిలో కీలుబొమ్మయైన విషయము పదిమందికి తెలియునట్లు చేయుచున్న ఈశ్వరుని భక్త పారవశ్యతను తెలుసుకొనుటలేదు. పార్వతి – ఉమ – అపర్ణ – అర్ధనారీశ్వరి – మహాకాళి అనునవి అయిదు అవస్థలు. కాన శక్తి జీవుడే. ప్రకృతియే. భక్తియోగం చేత శివునిచేరి శివతాదాత్మ్యంచెంది శివునితో సమానమై చివరకు శివుని చేతిలో యుంచుకొని, కీలుబొమ్మవలె ఆడించుస్థితికి యెదిగినది. కాన శక్తి శివునికన్నా గొప్పయె. కాని ఆ గొప్పతనం ఇచ్చినవాడు శివుడేనని శక్తికి తెలియును. నరులకు తెలియక పోవచ్చును. ఈ శక్తి జీవులయందు ప్రత్యేక ప్రేమను కలిగియున్నది. ఏలనన తాను ముందు జీవస్వభావమునుండియే వచ్చినది కాన జీవులపై ప్రత్యేక వాత్సల్యము కలిగియున్నది. శక్తిముందు ప్రకృతియే కదా తరువాత దైవంగా దైవం చేత మార్చబడినది చివరకు మోక్షం కూడా ఆమె చేతిలో వుంచుకున్నది. ఆమె అనుమతించిననే శివుడు అంగీకరించును. ఆమె ఏదియైనను ఇవ్వగలదు. శక్తియనగా వాణి, లక్ష్మి, పార్వతులు. శివుడనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. త్రిమూర్తులు ఏకమైన నాయందు ముగ్గురు శక్తులు ఏకమై శ్రీశక్తిగా మారి నాయందు అభిన్నముగా లీనమైనది. అందువలననే నారుమూర్తుల రూపాన్ని నేను. నాకన్నా భిన్నశక్తి లేదు. నేనే శ్రీశక్తిని. అందువలననే నన్ను శ్రీ గురుడైన దత్తాత్రేయుడందురు. నేనే శ్రీ విద్యకు ఆదిగురువును. శ్రీ చక్ర శ్రీమంత్రార్థము నేనే. ఈ శ్రీశైలమునందు శ్రీ శబ్దముకూడా నన్నే సూచించుచున్నది. ఇది నా

శైలముకాన శ్రీశైలము అని పిలువబడుచున్నది. ఇచ్చటనే శ్రీగురుడు పాతాళగంగలో అంతర్ధానము చెందినది. కాన ఇచట చేయు తపస్సుకు నా అనుగ్రహము లభించును. నా సాయమిచట యుండును. నాయందు కైవల్యము చెందినపుడు మాత్రమే అనగా నేనే ఆమె, ఆమెయే నేనుగా మారినపుడు శ్రీ శబ్దము వచ్చును. శ్రీ గురుడనగా, శ్రీశక్తియును గురుడును తానేయైన ఒక్క తత్త్వమే నని అర్థము. కావున నాతత్త్వము పరిపూర్ణమని తెలియుము. అందువలన నేను సదా బ్రహ్మచారిని. నా అవతారములన్నియు బ్రహ్మచర్యముతో నుండును. శక్తి నాకన్న వేరుగాక నేనేగా వుండుటయే దీని రహస్యము.

## శ్రీ గురుదత్తుడు

శ్రీశైలంలో 1-4-93 ఉదయం 10 గం॥లకు శ్రీదత్తవాణి.

''శక్తి జీవునకూ దేవునకు మధ్య వంతెన. శక్తి నారాధించనిదే దేవుని చేరలేరు. శక్తి ఆరాధన జీవుని, దేవుని వద్దకు తీసుకు వస్తుంది. శక్తి గురువుగా సాయపడుతుంది గమ్యాన్ని చేరడానికి. ఆ శక్తియే దైవమందు లీనమై గురువూ దైవమూ ఒక్కమూర్తియేయైన స్వామియే ఈ శ్రీదత్తుడు. శివశక్తులు కలసి ఏకమై, తల్లిదండ్రులు కలసి ఒకే ఆకారముగా మారి వచ్చినవాడే శ్రీగురుదత్తుడు. నేనే శివుడను, నేనే శక్తిని. శక్తి శివునివద్దకు తీసుకొని పోవును. శివుడు శక్తియు ఏకమై నీ వద్దకు వచ్చినవాడను నేను. కాన నీవు ప్రయాణించనవసరములేదు. నీవు నాలో కైవల్యము నొందుటయే మిగిలినది. అంతవరకు నా కార్యమును నీవు చేయువలయును. కాన నీ వెంటయుండుటయే సాయుజ్యము. మన ఇరువురము ఒకే చోట వుండుచున్నాము కాన సాలోక్యము వచ్చియే యున్నది, ఇక సారూప్య, సామీప్యము నెప్పుడో వచ్చినవి.

నా శక్తియు నేనును ఒక్కటియే, వేరుకాదు. లౌకికములైన సృష్టింపబడిన పదార్థములలో కూడా శక్తి వేరు కాదనియే మతము. ''నిన్న అశక్తుడు నేడు సశక్తుడు'' అను వ్యవహారముచేత శక్తియు దాని

అధిష్ఠానమైన ద్రవ్యము వేరుగానున్నను ఆ వ్యవహారము ప్రమేయముల మధ్యనున్నది. కాన అప్రమేయుడనైన నా యందు ప్రవర్తించదు కదా. కాన నేనును నా శక్తియు ఒక్కటియే. నిర్గుణుడనగు నేను నామ రూపములుగా మారినపుడును, జీవుడు తపస్సుచేత నేనుగా మారి ఆ తన నామరూపములతోనే ఉన్నప్పుడును, ఆ నామరూపములు సత్యములే యగును. కాన జీవుడను పార్వతి తపస్సుచేత తన నామరూపములనట్లే యుంచుకొని నా కైవల్యమును పొందినది. కాన ఆమె నామ రూపములును నా భగవన్నామ రూపములేగాన సత్యములుకాన, ఆమె నారాధించుట నన్నారాధించినట్లే. ఇంతియే కాదు-నా భక్తుల నారాధించిననూ వారి హృదయములందున్న నన్ను ఆరాధించినట్లే.

## నేను విశ్వాకారుడను

నేను విశ్వాకారుడనై, విరాట్టుగను ఉపాసింపబడుచున్నాను. ఈ విశ్వమంతయు నా భగవన్నామ రూపములే యగుచు సత్యములగు చున్నను, ఇదే విశ్వము క్రీడార్థముగ సృష్టించినందున అసత్యమునై యున్నది. అందువలననే విశ్వములో జరుగు వికారములన్నియు విశ్వాకారుడనైన నాయందు జరుగవు. అనగా విరాట్టుగా విశ్వము నుపాశించు వారలకు విశ్వమంతయు తన దృష్ట్యాసత్య మయ్యును, పరమాత్మ దృష్టిలో కేవలము అసత్యముగ నుండుచు జీవులకు సత్యమయ్యును అనేక వికారములతోకూడి యుండుచున్నను ఒకే విశ్వముండగల అనూహ్యస్థితి పరమాత్మశక్తికి సాధ్యము. ఉదాహరణమునకు శ్రీకృష్ణుని నోటిలో విశ్వమంతయును యశోద చూచుచున్నది. ఆ విశ్వములో ఒక భాగమైన భూమిపై యశోదా కృష్ణులున్నారు. ఇది ఎలా సాధ్యమననుది ఊహించ గలవా? అలానే ఈ సృష్టి విరాట్టు రూపంగా భగవన్నామరూపమై పరమార్థముగానే, ఉపాసనార్థము సత్యమైనది. ఇదే సృష్టి కేవలము వినోదార్థము సృష్టించిన

ఒక కార్యముగా క్రీడార్థమైన దృశ్యముగ పరమార్థముగా అసత్యమే యగును. మరియు జీవుని దృష్టిలో ఇదే సృష్టిసత్యమై అనేక వికారములతో నుండును. ఒకే కాలమున ఒకే వస్తువు ఇట్లు మూడువిధములుగా యుండి అర్థము కాని రీతిలో ఉండుట పరమాత్మశక్తికి సాధ్యమే. ఒకటియే మూడుగా యుండును. ఆ మూడును ఒకటియేగా యుండును. ఇదియే పరమాత్మ యొక్క అనూహ్యశక్తి. అందువలన జీవదృష్ట్యా విశ్వములో జరుగు పరిణామములు విశ్వాకారుడైన విరాట్టులో జరుగవు. కాన నన్ను విరాట్టు రూపంగా ఉపాసించుటలో ఎట్టి సంశయము వలదు.

జ్ఞానముచేత నన్ను తెలియజాలవు. ఎందువలన ననగా మనోబుద్ధి తర్కముల కతీతుడను గదా జ్ఞానముచే నన్ను తెలియదగినచో 'నేతి నేతీతి' ( ఇది కాదు, ఇది కాదు' ) అని శ్రుతులు ఎందుకు చెప్పును? నన్ను తెలియలేమని తెలుసుకున్నవాడు నన్ను గురించి తెలిసినవాడు నన్ను తెలుసుకుంటినన్నవాడు ఏమియు తెలియని వాడు. నేను తెలియబడనని తెలుసుకున్ననాడే సాధకునిలో అహంకారము నశించును.

## నేను కర్మసాధ్యుడను కాను

శ్రీశైలం ది. 2-4-93 ఉదయం 6 గం॥ల సమయం

## శ్రీదత్త దివ్యవాణి

''నేను తెలియబడని స్థితిలో ఉండుటవల్లనే జీవుడు సాధనలో తన అహంకారమును వదలగలుగును. లేకున్న నన్ను తెలుసుకొన గలిగితినని అహంకారముతో సాధనలో పతనమగును. అట్లు పతనము కాకుండా కాపాడుటకై నేనిట్లు ఎవరికి అర్థంకాని నిర్గుణస్థితిలో యున్నాను. దత్తుడెవరికి చిక్కడు అంటే ఇదే అర్థము. వాఙ్మనో బుద్ధి తర్కముల కందక పోవుట ఇదే. అట్లే ప్రయత్నములైన కర్మలచే నేను సాధింపబడినచో

జీవునకు అహంకారము వచ్చును తన ప్రయత్నముపైగల విశ్వాసముతో. కాన నేను కర్మసాధ్యుడను కాను. నన్ను కర్మలు సాధించలేవని ''నకర్మణా'' అని చెప్పుచున్నవి. మనస్సుకు అందనివాడు చిత్తవృత్తుల నిరోధించి చేయు చిత్తైకాగ్రతకు నేనెట్లు చిక్కుదును? కాన యోగమను ప్రయత్నమునకును చిక్కను.

అయితే పై జ్ఞానయోగ కర్మలచే నీ ప్రయత్నము సంపూర్ణ మగును. అట్టి ప్రయత్నము చేసియు నేను చిక్కనని తెలిసి, కేవలము నా దయకై శరణాగతి పొంది దైన్యముతో యాచకునివలె యాచించినచో భక్తిని ప్రసాదింతును. ఆ భక్తియే నిష్కామంగా నా యందు చేసినచో అది పరాభక్తి యగును. దానిచే కైవల్యమే సాధ్యము. కాన జ్ఞాన కర్మ యోగములు, అహంకార రహిత ప్రపత్తిని కూడినపుడు నా దయకు కారణములగును కాన జ్ఞాన కర్మయోగములు మూడును సాధనకు ఆవశ్యకములే. వీటిలో జ్ఞానములేనిదే ఏదియును సంభవించదు కాన జ్ఞానము మూలకారణమగుచున్నది. కాన సదా విచారణ చేయవలెను. విచారణచే నిశ్చయమేర్పడును. నిశ్చయము చేత తీవ్రప్రయత్నమేర్పడి చివరకు నా ప్రాప్తికే కారణమగును. కానీ నాచే ఫలమిప్పింప గలది ప్రేమ రూపమైన భక్తియే. నన్ను ప్రేమించు వానికి నేను దాసుడనగుదును.

## సంగము

సాధనలో సంగముయొక్క ప్రభావముండును. ఏకాంతము సాధకునికి సహాయపడును. వాతావరణ ప్రభావము సాధకునకు తప్పదు. విషయములలో నుండియు అంటకపోవుటయను రాజయోగము సిద్ధునకే సాధ్యము. కాన సాధకుడు విషయములకు దూరముగా నుండుటయే అవసరము. ఆవకాయ జాడీలోనుండుచు దాని పులుపు కారము అంటకుండనెట్లు? దానిలో మాగిన వాడికి అంతిమ క్షణంలో

పంచదార రుచి ఎట్లు వచ్చును? కాన విషయ సంగమును పరిహరించ వలెను. వైరాగ్యము దానిచే సిద్ధించును. ఇంత మాత్రమునే సరిపోదు. పంచదార ద్రవములోకి చేరవలెను. విషయములకు దూరమైన తరువాత సత్సంగమున ఉండవలెను. భగవచ్చింతనయను పంచదార ద్రవమున చేరవలెను. ఆ తరువాత పురుషప్రయత్నము సమగ్రమై ప్రపత్తిని చేసినచో భక్తి లభించును. పురుషప్రయత్నము తరువాత ప్రపత్తితో యాచింపవలెనే తప్ప పనికిరావలసిన కూలీడబ్బులనువలె అడుగరాదు. పనిచేసి, ప్రపన్నుడై యాచింపవలెను. నీ దయవచ్చిన ఇమ్మని అడుగవలెను. అప్పుడా భక్తిని నేనిత్తును. ఆ భక్తి నిష్కామము కావలెను. పనిచేయుచు కూలీడబ్బు నాశింపక అడుగక వుండును. అసలు కూలీపని డబ్బుపైన ధ్యాసయే యుండరాదు. అదియే పరాభక్తి. అట్టివాని ఇహపరములన్నిటిని నేనే దాసుడనై సమకూర్చుదును. యోగక్షేమం వహామ్యహమ్.

జారుడెన్ని కష్టములు పెట్టినను, తనసొమ్ము తీసుకొని అమ్ముకున్ననూ, గుడిసెలో ఉంచి, తాగివచ్చి తన్నుచూ హింసించిననూ, తన తల్లితండ్రులు వచ్చి రమ్మని పిలిచిననూ పోక, ఆ జారుని విడలేక, ఆ జారుడుచేయు హింసలన్నీ, తనకు ప్రియములుగా భావించిన యువతివలె నున్నప్పుడే పరాభక్తి అనబడును. జారుడు సుఖపెట్టుచున్నదే కృష్ణతత్త్వము. పై విధముగా హింసించి పరీక్షలను పెట్టునదియే శ్రీదత్తాత్రేయ తత్త్వము. అనగా పరాభక్తి యొక్క పరాకాష్టయే శ్రీదత్త తత్త్వము. శ్రీకృష్ణునిలో కనీసం సుందరరూపం ఉంది. బృందావన నృత్యం మురళీగాన రాసక్రీడలు మొ॥ సుఖాలున్నాయి. కాన కృష్ణుని జారునిగ అనుసరించిన గోపికల విషయం జారత్వమనునదే ఒక్కలోపము తప్ప మిగిలిన వన్నీ సుఖాలే. ఆపై తత్త్వమే నేను.

శ్రీదత్తుని జారునిగా అవలంబించిన జీవులను గోపికల విషయ మట్లుకాదు. శ్రీ దత్తుడే సుందర రూపాన్ని వదలి భయంకర వికార రూపములతో దర్శనమిచ్చును. అటువంటి సమయాలలో కేవల రూపాకర్షణ కలవారు నన్ను విడిచిపోవుదురు. అట్లు పోనివారిని, రాసక్రీడలతో ఆనందింపచేయుటకు బదులు అనేక విధములుగా కష్టపెట్టి హింసింతును. ఆ హింసలకు మరికొందరు జారిపోదురు. వాటికి కూడా నిలిచినవారే పరాభక్తి యొక్క పరాకాష్ఠను చేరినవారు. మాయవచ్చి జీవుని వెనుకకు రమ్మని ఆకర్షించును. మాయయను తల్లి వచ్చి ''నా ప్రియ పుత్రీ! ఇంకనూ వీనినేల విడువవు? రూపహీనుండును భయంకర వికార రూపముగా మారినవాడును, మరియు నిన్ను అనేక విధములు హింసించుచున్న వానిని, ఏమి కారణంతో వున్నావని'' ప్రశ్నించును. అపుడా భక్త జీవుడు ''నా దత్తుడేరూపమును పొందినా, నన్నెంత హింసించినా విడువజాలన'' ని చెప్పును. అదియే పరీక్షల పరాకాష్ఠ. అట్టివానికి నేను కైవల్యమిచ్చుటయేకాక వానికి దాసుడనగుదును. పార్వతితో మాయావటువు చెప్పినదిదియే'' ''స్మశానవాసి భయంకర విరూపాక్షుడు, పరమ దిగంబర దరిద్రుడు ఎన్నో కష్టాలు పడతావు'' అని చెప్పినా నాకా శివుడే కావాలన్నది. అట్టి పార్వతి జీవునకు కైవల్యము నిచ్చుటయే కాక తనకన్నను ఆధిక్యమిచ్చి ఆ జీవునకు దాసుడైనాడు శివుడు. ఆ శివుడు నేనే. ఆ పార్వతియే నా పరాభక్తి కొసకు చేరిన జీవుడు. ఇదియే పార్వతి భ్రామరీ స్థానంలో శివునికన్నా పైనున్నది. అనగా ఆమె పరాభక్తి పరాకాష్టకు శివుడే దాసుడైనాడు. ఇదియే శ్రీశైలంలో నీకు వివరించవలసిన నా తత్త్వము. పరాభక్తి పరాకాష్టచే జీవుడు భగవంతుని స్థానం కన్నా పైకి చేరును అనేది ఇచట తెలియవలసిన తత్త్వము.

## పరమ రహస్యము

అనాడు శ్రీరామ నవమి మా పురాకృత పుణ్యఫలమేనేమో శ్రీదత్త భక్తులతో కలసి మాదంపతులము శ్రీశైల మ హాక్షేత్రంలో వుండి శ్రీ దత్త భగవానుని కృపాకటాక్షంచేత మాతల్లి దండ్రులు శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునుల సేవ చేసుకొనడం స్వామి అనుగ్రహించారు. ధన్యులం అనాటి శ్రీదత్త దివ్యవాణి. శ్రీశైలంలో శ్రీభ్రమరాంబ అమ్మవారు శ్రీ మల్లిఖార్జునస్వామి వారి కంటె ఎత్తున వుంటుందిగదా. అంటే స్వామి వారి దేవాలయము క్రిందగను , అమ్మవారి దేవాలయము ఎత్తుపైనా వుంటుంది.దీని భావమేమి స్వామి అని మేము కోరగా శ్రీవారు ఈ దివ్యవాణిని అనుగ్రహించారు''పరాశక్తి పరాభక్తి పరాకాష్టచే జీవుడు భగవంతుని స్థానంకన్నా పైకి చేరును అనేది ఇచ్చట శ్రీశైలంలో తెలియవలసిన తత్త్వము. పార్వతి సామాన్యజీవుడే. సాధనచేత ఆమె ఉమ, అపర్ణ, అర్ధనారీశ్వరి, మహాకాలి అను అయిదు అవస్థలు సాధించింది. శక్తి జీవుడే. భక్తియోగంచేత ఆమె శివుని కీలుబొమ్మవలె ఆడించు స్థితికి చేరినది. శివుడే భక్తునకు సేవకుడైనాడు. ఆ పరాభక్తి చేతనే శ్రీమల్లిఖార్జునుడు భ్రమరాంబకు తనకన్నా పైస్థానం ఇచ్చాడు. ఈ రహస్యమునకు కూడా పరమైన రహస్యమును నీకు కాబట్టి విప్పి చెప్పు చున్నాను--'' అన్నారు శ్రీ గురుదత్తుడు--దత్తభక్తునితో ఇంకా ఇలా చెప్పారు.

'' ఈ పార్వతి సామాన్య జీవుడైనను అసలు ఆ పార్వతి నేనే. నేనే జీవుడెట్లు నా కొరకు తపస్సు చేయవలయునో చూపుటకై పార్వతిగా అవతరించితిని. శక్తి నా రూపాంతరమే. కావుననే అంత సమర్ధవంతముగా తపస్సు చేయగలిగినది. ఏలనన ఆ తపస్సు చేసినది రూపాంతరములో నున్న నేనే. అలానే హనుమంతుడు కూడా నేనే. జీవులకు ఆదర్శముగా నిలచి మార్గాన్ని ఆచరించి చూపాలని నేనే పార్వతిగా,హనుమంతునిగా

రూపొంది నన్ను నేనే ఆరాధించికొని జీవులకు బోధించుటకు ఆచరణలో చేసి చూపియున్నాను. ఈ రహస్యము అందరికి తెలియరాదు. ఏలనన పార్వతియు, హనుమంతుడను నేనే కాన సిద్ధిని సాధించిరి. మనమెట్లు సాధించగలమను నిస్పృహ, నిరాశలను చెందుదురు. ఐనను మార్గము అదియే.

శ్రీరామనవమినాడు నీవు ఈ శ్రీశైలమున యుండుటలో నీకిటు పార్వతి పరమేశ్వరుల రూపములోను, హనుమంతుడు శ్రీరాముని రూపంలోను జీవుడు నన్ను చేరవలసిన మార్గాన్ని బోధించాను. నేను జీవునిగా జన్మించినందున ఆ రూపంలో జీవుని బాధలు నాకు తెలుసు కాన జీవునిపై ప్రత్యేక వాత్సల్యముతో వుంటాను. కాన అదే నీకు గురుస్వరూపము. అనగా శక్తిని ఆశ్రయించుటగాని, హనుమంతుని ఆశ్రయించుటగాని చేసినచో నీకున్న ఐహిక బాధలను పోగొట్టి ఆధ్యాత్మిక మార్గమున నా కడకు తెచ్చెదరు. వారు నాకును జీవునకును మధ్య వంతెనవలె యుందురు. అయితే అసలు నేనే ఆరూపమునెత్తి జీవునకు సాయంచేయుటకు వచ్చితిని కాన వారు జీవస్వరూపులని దైవముకాదని తలచరాదు. వారే నేను నేనే వారు. వారు నా రూపాంతరములే గదా!

నీకు నేను శ్రీదత్త రూపమున గురువైన వంతెనను నేనే. చేరవలసిన గమ్యమైన దైవము నేనే. గురువు దైవము ఒకే రూపములో యున్న నేను నీ ఐహిక బాధలను పోగొట్టి ఆధ్యాత్మిక మార్గమున నిన్ను నావద్దకు చేర్చుకొందును. నేనే శక్తిని. నేనే శివుడను. నేనే హనుమంతుడను. నేనే శ్రీరాముడను. నాపై దృష్టిని స్థిరముగా నుంచుము అది చాలును''.

శనివారం. ది. 3-4-93 శ్రీముఖ నామ సం॥ చైత్రశుద్ధ ఏకాదశి ఉదయం 5 గంటలకు శ్రీశైలంలో శ్రీదత్త ప్రభువు శ్రీదత్త భక్తులకు ఈ పరమరహస్యాన్ని బోధించి ధన్యులచేశారు.

## యోగం సిద్ధించాలంటే

''నాయనా! విను, యోగము సిద్ధించాలంటే ఈ రెండు విషయములు పదిసార్లు రోజూ గుర్తుచేసుకో.

శ్లో॥ ''యేభ్యోమే జీవితం సర్వం నీ తంతే నాద్యరక్షకాః
అమతో రక్షకోనైతి మామితి జ్ఞానమంత్యజమ్ః

అనగా–చిట్టచివరి క్షణంలో ప్రతి జీవునకు చావుతెలివి నిస్తాను. అప్పుడు జీవుడు ఇలా భావిస్తాడు. ఎవరికొరకు జీవిత మంతయు వ్యర్థము చేసితినో, వారలిప్పుడు నన్ను రక్షించుట లేదు. ఎవరిపుడు రక్షించగలడో, వానికై జీవితమందు సమయమును గాని శక్తిని గాని వినియోగించలేదు. కాన అతడిప్పుడు వచ్చుట లేదు.

శ్లో॥ '' సమయేసతి నజ్ఞానం జ్ఞానేతు సమయోనచ
ఇతి మౌనవ్యథా భూయో జాతా మరణవేదనా.

అనగా– ఈ జ్ఞానము కలిగినది కాన ఇప్పుడు ఆరాధింతమన్న సమయములేదు. సమయమున్నప్పుడు ఈ జ్ఞానము రాలేదు. అని మౌనవ్యథను చాలాసార్లు పొందుటయే మరణవేదన.

## శరణాగతి

శరణాగతి అనగా ఆత్మార్పణము. అనగా నీ శరీర అతఃకరణలను నీకు సంబంధించిన సమస్త వస్తు, వ్యక్తి జాతమును నాకే అర్పించుట ప్రపత్తి. దానిచే నా కరుణకలిగి భక్తిని ప్రసాదించుదును. భక్తియన నాపై గల ప్రేమయే'' అన్నారు శ్రీగురుడు.

ఈరోజు శనివారం.''నేను ఈరోజు నర్సరావుపేట వెళ్తా'' నన్నారు. దత్తభక్తులు.మేమన్నాము ''స్వామీ! సాయత్రం 3గంటల బస్సుకు వెళ్ళవచ్చుగదా అని కానీ శ్రీదత్త భక్తులు 1.30 బస్సుకే బయలు

దేరారు.వెంటనే దత్తభక్తులు శ్రీవారి వాణిని ఇలా వినిపించారు. ''శక్తిని వృధా చేయక భగవధ్యానం చేసి కైవల్యాన్ని సాధించండి. నేను సాయము చేస్తాను'' అని మాకు బోధించి మధ్యాహ్నం 1-30 బస్సుకే బయలుదేరి నరసరావుపేట వెళ్ళారు. మాకు దిగులు కలిగింది. స్థిమితపడడానికి కొంత వ్యవధి కావలసి వచ్చింది. శ్రీ దత్త భక్తులు నరసరావుపేట వెళ్ళారుగదా. ది.5-4-93, ఉదయం 6.00 గంటలకు నరసరావుపేటలో వారికి స్వామి సాక్షాత్కరించి, జీవుల తత్త్వాన్ని ఇలా వివరించారు.

''ప్రతి జీవుడునూ కోరికతో నన్ను చేరుచున్నాడు. కోరికను పెద్దగా చెప్పుకొనువాడొకడు. ఆరాధనకు ముందు ఒకడు చెప్పును. మరియొకడు చివరలో చెప్పును. మరియొకడు కోరికను మనసులో తలచి వాక్కుతో చెప్పక ఆరాధించును. మరియొకడు కోరికలు అసలు కోరకున్న స్వామియే మనకు కావసనినవన్నీ తీరుస్తాడనే కారణంగా ఏ కోరికా లేకుండా (అన్ని కోరికలు నేనే తీరుస్తానని) ఆరాధిస్తాడు.

ఒకడు లౌకికాలను కోరుతాడు. మరియొకడు లౌకికాలు, క్షుద్రాలు స్వల్పాలు. చిన్న దొంగతనాలు స్వల్పాలు. కొడితే కోటీశ్వరుడినే కొట్టాలని నా కైవల్యం అంటే నా సర్వశక్తులూ నా సర్వసిద్ధులు గల కైవల్యాన్ని కోరుతాడు. నా కోసమే ఆరాధించేవాడు కనబడకయే తిరిగి తిరిగి దేశ సంచారినై ఎవరు కనబడక బాధతో పిచ్చివాడనై తాగుబోతునై తిరుగుచున్నాను.

(స్వామి మధురంగా తన ముత్యాల పలువరుస కాంతి తళుకు లొత్త నవ్వినారు.)

నీ శక్తి పరిమితం. నీ శరీరం అనే నీళ్ళటాంకుకు మూడు పెద్దగొట్టాలున్నాయి. అవియే వాక్కు, మనస్సు, క్రియలు. ఈ మూడు గొట్టాలనుండి శక్తి ప్రవహించి ఖర్చవుతుంది. అలసిపోయి ఆహారం తిని

నిద్రిస్తావు. ఈ మూడు గొట్టాల నీరు సంసార విషయాలకు ఖర్చుచేస్తే జీవుడికి సంసారమే సదా జన్మలతో నిలబడు తుంది. క్రమంగా పశుపక్ష్యాదులవలె కేవలం తిండి, నిద్ర, సుఖించుట, స్వార్థం తప్ప దైవచింతన లేనివాడుగా యున్నాడు. కాన వాడు కోరుకున్న పశుపక్ష్యాది జన్మలనే ప్రసాదిస్తాను. నాస్తిక జన్మ చివరి జన్మ. వాడికిక నరజన్మ లేదు. అన్ని పశుజన్మలే. నా వైపు ఆ మూడు గొట్టాలను వదలినవానికి ఆయురారోగ్య సుఖశాంతులను ప్రసాదించి సాధన పూర్తి అయ్యేటట్లు సహకరించి సాయపడతాను. చాలకపోతే మరల మనుజ జన్మనిస్తాను సాధనకొరకు. ఒకే గొట్టాన్ని ఎక్కువగా తెరిస్తే మిగతా రెండు గొట్టాలలో నీరు సన్నగిల్లుతుంది. కనుక ఎక్కువగా మాట్లాడడంకాని, ఎక్కువ మానసిక ఉద్రేకాలు పొందటంగాని, శరీర విహారాదులు ఎక్కువగా చేయడం గాని చేస్తే మిగిలిన రెండు శక్తులు ఆగిపోతాయి. మూడు పైపులు నిదానంగా మెల్లగా తిప్పితే నీరు మూడువైపులనుండి చాలాసేపు వస్తుంది. కనుక వాక్కు, మనస్సు, క్రియ మెల్లగా నడుపుకుంటే శాంతి సిద్ధిస్తుంది. కాన శాంతి అవసరము. తితీక్ష కావాలి. ఉపేక్షించుట నేర్చుకో సంసార లంపటములకు క్రుంగక, పొంగక శాంతంగా వుండటం నేర్చుకో. ఈ సమత్వస్థితి యోగానికి చాలా సహకారి. దీనివలన పరిమితశక్తి, త్రికరణములనే పైపులద్వారా చాలాసేపు నిదానంగా ప్రవహిస్తుంది. కర్తవ్యాలను ఆచరించడంలో కూడా ఈ సమత్వస్థితి పనికివస్తుంది. దీనివలన రోగాలు రాక, ఆయుర్దాయం వృద్ధి చెందుతుంది. కర్తవ్యాలు ఆచరించేటప్పుడు ఎపుడే కరణం (వాక్కు, మనస్సు, క్రియ) -ద్వారా శక్తిని ప్రవహింపచేసే అవసరం వస్తుందో తెలియదు. ఉన్న కాస్త శక్తిని మాటలనే పైపుద్వారా పోనిచ్చావనుకో కర్తవ్యంలో మానసికంగా ఆలోచించవలసిన అవసరం వచ్చినపుడు ఆలోచించలేకపోతావు. అలానే క్రియ చేయవలసి వస్తే నీరసంతో చేయలేకపోతావు.

## స్థిత ప్రజ్ఞుడు

కాన మూడు వైపుల ద్వారా సమంగా, నిదానంగా శాంతం గా శక్తిని ప్రవహింపచేసే సమత్వం వచ్చినవాడే స్థితప్రజ్ఞుడు అంటారు. ప్రజ్ఞ అనగా శక్తి అది స్థిరముగా వుండటమే స్థితమను శబ్దమునకు అర్థము. ఇట్టి శాంత–సమత్వ–స్థిత ప్రజ్ఞ లక్షణము దైవారాధనకు చాలా అవసరము. ఎందుకంటే మనస్సు వైవిధ్యాన్ని కోరుతుంది. కాస్సేపు ఆలోచిస్తుంది కాసేపు మాట్లాడిస్తుంది. కాసేపు నడిపిస్తుంది. కాన త్రికరణములద్వారా ఆరాధన చేస్తే మనస్సుయొక్క సహజ స్వభావాన్ని తృప్తి పరిస్తే అది అనుకూలమౌతుంది. ఇంతేకాక ఒకే కరణంద్వారా శక్తినంతా వినియోగిస్తే మిగతా కరణాలు పనిలేక సోమరులై మూలపడతారు. ఉదా॥ కేవలం ధ్యానం చేస్తే వాగింద్రియం చెడిపోయి స్తోత్రం చేయలేదు. శరీర క్రియలు లేక శరీరం సోమరియై తరువాత ప్రదక్షిణాదులను చేయలేదు. శరీరక్రియలు లేకపోతే ఆరోగ్యం దెబ్బతిని అసలు ఆరాధనకు మోసం వస్తుంది. శరీర–వాగేంద్రియాలే పనిచేస్తే మనస్సు ఆలోచించేపని చేయక తరువాత విచారణను చేయలేక జ్ఞానం సాధించలేదు. కేవల వ్యాయామం కన్న భగవత్ప్రణామములు, ప్రదక్షిణలు చేయడంవల్ల దైవారాధన ఆరోగ్యము అన్ని కలసివస్తాయి. ఇవి రెండు వేరుకాదు. ఆరోగ్యం బాగుంటేనేకదా దైవారాధన. ఏకరణంచేత అతిగా పని చేయించరాదు. అసలు పనిలేకుండా వుంచరాదు. మధ్యేమార్గంలో త్రికరణాలకు సమత్వంగా శక్తి అనే ఆస్తిని పంచడమే స్థిత ప్రజ్ఞ లక్షణము. అతిగా మాట్లాడితే గొంతు బొంగురుపోయి శ్వాసకోశవ్యాధి వస్తుంది. అతిగా శరీరక్రియచేస్తే రక్తపోటు హెచ్చుతుంది. అతిగా ఆలోచిస్తే మనసు చెడిపోయి ఉన్మాదం వస్తుంది. ఏకరణంతోనైనా ఎంతశక్తిని దైవానికి వ్యయం చేశాడనేది మాత్రమే విలువకు పరిగణింపబడిన పై ఇబ్బందులున్నాయి. కాన త్రికరణములందు సమంగా శక్తిని పంచి మధ్యస్థాయిలో పనిచేయటమే అన్ని విధాలా యోగలక్షణమౌతుంది.

మమకారాలు, ప్రేమలు, బంధాలు సంసారంలో యున్నప్పుడు అవి మానసికంగా ఆత్మీయుల గురించి చింతించుట, సంభాషించుట 92

ఉద్రేకపడుట మొదలగు వాటిద్వారా జీవుడు తన శక్తిని దుర్వినియోగం చేస్తున్నాడు. ఎందువలననగా అట్టివానిచేత మీ ఆత్మీయులకు లాభమే మున్నది? వాటి ద్వారా మీ ఆత్మీయులు నయాపైసా అయినా లాభపడుచున్నాడా? లేదు పోని అవి కర్తవ్యములా? కావు గదా. ఉదాహరణకు-నీ పుత్రుడున్నాడు. వానిపై మమకారంతో, మానసోద్రేకం చెంది పిచ్చాపాటిగా సంభాషిస్తూ ఎత్తుకొని ముద్దాడినందున వాడికి జరిగేదేమున్నది? నీ శక్తి నష్టం తప్ప ఏమియులేదు! కానీ నీ పుత్రునికి విద్యాభ్యాసం చేయించడం నీ కర్తవ్యము. అది చెయ్యి, వచ్చి అన్నం పెట్టమంటే పెట్టు. ఇది నీ కర్తవ్యం. కర్తవ్యాలలో శక్తిని వ్యయం చేయడం వృథా కాదు.

ఏలననగా వాటిచే నీ పుత్రుడు లాభపడుచున్నాడు. వానికే లాభంలేని, కేవలము నీ శక్తినే వ్యయంచేసే ఈ ప్రేమలు, మమకారాలు, వాటి వికారాలయిన మాటలు, వాటి వికారాలైన చేష్టలు ఎందుకు? ఎదుటివానికి ఉపయోగం లేకపోగా, నీ శక్తిని అనవసరంగా పోగొట్టుకొని దైవారాధనలో శక్తిహీనుడవౌతున్నావు. పైగా దైవారాధన నీ పుత్రుని రక్షించును. కాన నీ శక్తినంతా కర్తవ్యాచరణకు, దైవారాధనకు వినియోగించు. అలసినపుడు విశ్రాంతి తీసుకో. అంతేకాని కేవలం బంధాలు, మమకారాలు ప్రేమభాషణలు, ప్రేమచేష్టలు అటు కర్తవ్యాచరణకు ( ఇహ) ఇటు దైవారాధనకు ( ఆముష్మికము) నకు పనికిరాకుండా బూడిదలో పన్నీరులా పోస్తున్నారు. కాన నీ ప్రతి ఆలోచనను గమనించు. ప్రతి మాటను గమనించు. ప్రతి కదలికను గమనించు అది ఇహానికి గాని, పరానికి గాని పనికి వచ్చే రీతిలో నుంచు, ఇహాన్ని మితంగా వుంచి, ఎక్కువ పరానికే ఖర్చు చెయ్యి, వాసనలతో వృథా చేయవద్దు. ఇదే యోగం. ఇదే యోగం.

సంతానం కలిగిన తర్వాత బ్రహ్మచర్యం అవసరం. ఏలననగా ఆ బ్రహ్మచర్యంలోనే శక్తి నీలో వృద్ధియై దాచబడుచున్నది. సంతాన లక్ష్యములేని కేవల గృహస్థాశ్రమ ధర్మము ఇహానికి, పరానికి పనికిరాని శక్తి దుర్వినియోగమే. అందుకే ఋషులు సంతానము కలుగువరకే గృహస్థాశ్రమ ధర్మంలో వున్నారు. సంతానం కలుగగానే దంపతులిరువురు

బ్రహ్మచర్యంతో వుండేవారు. సంతానోత్పాదనం కర్తవ్యం గదా.

ఇక సంన్యాసులనగా ఎవరు? కర్తవ్యాలను లెక్కచేయక తన శక్తినంతా దైవారాధనకు వినియోగించేవారే సంన్యాసులు. అట్టివారి కర్తవ్యాలను దైవమే నెరవేరుస్తాడు. అందుకే సన్యాసి యొక్క వంశంలో ఏడు తరాలవరకూ దైవం ఉద్ధరిస్తాడు. అట్టివాని పితృదేవతలూ తరిస్తారు. కాన వాడు పితృ కార్యాచరణ దోషమును పొందడు. సంన్యాసియనగా తన త్రికరణముల శక్తినంతా ఒక్కబొట్టుకూడా సంసారానికి మళ్ళించక దైవానికే మరలించినవాడు. అంతే తప్ప కేవలము కాషాయవస్త్రధారణము సంన్యాసము కాదు.

గృహస్థుడును కర్తవ్యము తీరిన తర్వాత ఈ సంన్యాస స్థితికి రావలెను. అట్టివాని కుటుంబమును ఏడు తరములవరకూ నేను రక్షింతు నని ప్రతిజ్ఞ చేసి ఉన్నాను. నేను మాట తప్పను. సంన్యాసికి దైవారాధన -విశ్రాంతి తప్ప మూడవది వుండరాదు. గృహస్థునకు - కర్తవ్యాచరణ -దైవారాధన-విశ్రాంతి తప్ప నాల్గవది వుండరాదు. సంన్యాసియైనా, గృహస్థుడయినా శక్తిని దుర్వినియోగం చేయకుండా తీసుకొను జాగ్రత్తయే యోగము.

## శక్తి దుర్వినియోగం అయ్యేస్థానాలు ఏవి? యోగం అనగా ఏమిటి?

శోకం,మోహం, క్రోధం, మాత్సర్యం, అహంకారం, లోభం, మదం,మమకారం, అనురాగం, ప్రేమోద్రేకం, మానసిక భావోద్రేకం, 2సార్లు, కనీసం ఒక సారయినా ఈ విషయాలను స్మరణచేయాలి. పఠించాలి. అదే పారాయణము. క్రమంగా వారానికొకసారి -మాసాని కొకసారి ఇలా అభ్యాసం చేయాలి.

తారాస్థాయిలో భూషణము అనవసరం. అంటే, ఇహపరాలకు కొరగాని ప్రసంగములు, మాటలు, అనవసర శరీరక్రియలు, సంతానానంతరము గృహస్థ ధర్మము మొదలగునవి. కాన శక్తి దుర్వినియోగం లేకుండా పొదుపుపరచుకొని, ఆశక్తి త్రికరణములద్వారా సమంగా పంచుతూ కర్తవ్యాలను ఆచరించుతూ, దైవారాధన చేసుకుంటూ కర్తవ్య పరిపూర్తి అనంతరం శక్తినంతా కేవలం దైవారాధనకు వినియోగించడంతో పాటు అవసర విశ్రాంతిని తీసుకుంటూ తరించుటయే యోగము.

సంన్యాస స్థితికిరానిదే దైవానుగ్రహం కలలోనిమాట. అయితే సంన్యాస స్థితికి వస్తే చాలదు. నిష్కామం కావాలి. తన శక్తినంతా కేవల దైవానికే అర్పిస్తూ సంన్యాస స్థితిలో తపస్సుచేసే రాక్షసుడు ఒక కోరికతో చేస్తున్నాడు. కాన అట్టి సంన్యాసస్థితి చేత తన పతనం తప్ప ఉద్ధరణ జరుగదు. అణువు అణువు చీల్చినా కోరిక వాసనలేకుండానే కేవలం స్వామి యంటే నాకిష్టమని చేసే సంన్యాస స్థితిలోని ఆరాధనయే నిజమైన జ్ఞానపూర్వక సంన్యాసం ఔతుంది. అట్టి సన్యాసానికే పరీక్షలుంటాయి తనది నిజమైన సంన్యాసం అయితే పరీక్షలలో తప్పక నెగ్గుతాడు. దాని ఫలితమే కైవల్యాన్ని మించినది. అనగా వానికి భగవంతుడు దాసుడవుతాడు. అయితే దాసుడౌతాడని తెలుసుకొని అది మనస్సులో ఎక్కడో గూఢంగా దాచుకొని సంన్యాస స్థితిలో ఆరాధిస్తే, మనిషిని మోసం చేయగలడేమో గాని,సర్వజ్ఞుడనైన నన్ను మోసం చెయ్యలేడుగదా. కాన అది నిరుపయోగమే అవుతుంది.

కోరికవాసన యొక్క రూపమే. పై విధంగా శక్తిని దుర్వినియోగం చేయకుండా వాసనలను ఉద్రేకాలనూ త్రికరణాలతో తీసివేయగలిగితే క్రమంగా కోరిక కూడా లేకుండా పోతుంది. కాన యోగం, నిష్కామత్వాన్ని కూడా సాధించి పెడుతుంది. కాన యోగి అందరికన్నా గొప్పవాడు. నేను యోగులకు రాజును. యోగమే నా మార్గము. అదియే ప్రతిజీవునకూ మార్గము. పై విధంగా శక్తిని దుర్వినియోగం చేయకుండా ఉండలేము. వాసనలకు అలవాటు పడినాము అంటే పోని ఆ వాసనలను భగవంతునిపైకి మరలించు. అది మానసిక ఆరాధనం ఔతుంది. నీ ప్రేమలూ, మమకారాలు, భావోద్రేకాలు భగవంతుని పై ఉంచు. ఆ

ఉద్రేకాలకు సంబంధించిన వాక్కులతో భగవంతుని స్తుతించు. ఆ ఉద్రేకాలకు సంబంధించిన చేష్టలు కూడా భగవంతునియందే చూపించు. నీ ఉద్రేకాలన్ని త్రికరణముల ద్వారా నాపై చూపించు. శక్తిని దుర్వినియోగం చేసే నీ అలవాటూ తృప్తి పడుతుంది. అది అంతా దైవారాధనే కాన శక్తి దుర్వినియోగం కాకుండానూ పోతుంది. ఉ॥ నీకు కోపం ఎక్కువనుకో సాక్షాత్కరించవేమని నాపై కోపము పడుము. నీలో కామ వాసన కలిగినచో, నా చిత్రమును కౌగలించి ముద్దిడుము. ఏ భావమును నిరోధించకుము. అన్ని భావములూ నాకే అర్పణచేయుము. ఆభావము పవిత్రమా? అపవిత్రమా? అన్న విచక్షణ వద్దు. ప్రేమ సుగంధంలోన పరిమళిస్తుంటే ప్రతి భావము నాకు ప్రియమే. ప్రతి జీవుడు నాచే భరింపబడి రక్షింపబడుచున్నాడు. కాన నాకు భార్యయే. నేను అందరి జీవులకును కర్తను, భర్తను, హర్తను. పురుషులు తమ పురుషాహంకారము వదలనిదే నావద్ద స్థానంలేదు. ఋషులు చివరకు గోపికలైన నాడే ముక్తులైనారు. అహంకారమును, అభిమానమును వీడనిదే నా పాదములపై ప్రపత్తిని చేయజాలడు. భూమిపై కొండయున్నది. దానిపై చెట్టు ఉన్నది. కొండ చెట్టును మోయుచున్నదా? లేక భూమి రెండిటిని మోయుచున్నదా? చెట్టు భారముకూడా భూమిపైనే యున్నది. కాన భార్యభర్త లిరువురకును భర్తను నేనే. అట్లే రాజు తన సేవకుని పోషించుచున్నాడు. ఆ ఇరువురను పోషించు రాజును నేను. అన్ని భావములలోనూ అహంకారా భిమానాలను మాడ్చి, నన్ను శరణు చొచ్చుటయే ''సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ''. ఒక్క భావంబు అయినా, రవ్వంతైనా అహంకారం, అభిమానం ఉంటే కుష్ఠు మచ్చతోనున్న కన్యను వివాహానికి వర్జించినట్లు నా యోగానికి దూరుడౌతావు. ఇట్టి పరాభక్తిని అర్థము చేసుకొనుటకు ఎన్నో జన్మల తపస్సు, సంస్కారం కావాలి.

విచారణ బాగా చేసి జ్ఞానం ద్వారా నిశ్చయాన్ని పొందాలి. జ్ఞానమే నిశ్చయానికి దారితీస్తుంది. జ్ఞానమే మార్గాన్ని బోధించి ప్రవర్తింపచేయును. జ్ఞానముచే వేరు మార్గమున బోవచ్చును. అజ్ఞాని పొరపాటుపడి మార్గము తప్పి అలమటించును. జ్ఞానము చేతనే నిశ్చయం తీవ్రమై సాధన తీవ్రంగా జరిగి త్వరగా ఫలమునిచ్చును. కాన సత్సంగము

మహాత్ముల అనుభూతులను అమృతము వలె గ్రోలుము. వారి సంభాషణముల ద్వారా వేదశాస్త్రములన్నియు వాటి సారమును పిండును. నేను జ్ఞాన స్వరూపుడను. సర్వ వేద శాస్త్రములు నా పాదముల వద్దయున్నవి గదా!''

''ఆహా! స్వామీ! పరమాద్భుతము. నీవాగామృతపానముచే తరించితిమి. మానవమాత్రులముగదా అరిషడ్వర్గములకు బద్ధులమైన మా బోంట్లకు నీ వాగామృతమే జ్ఞానకుఠారము. ఈ లతలను కోసిపారవేసి ఈ బంధములను తెగనరికి నిన్ను చేర్చుటకు మాకోసం నీవు ఎంతటి శ్రమను తీసుకొంటివయ్యా! నీ బిడ్డలము. నీవుతప్ప మాకెవ్వరు దిక్కు. అనుగ్రహించవయ్యా! అని ప్రణమిల్లుదము.

పాహిమాం పాహిమాం పాహి!

## అంతర్ముఖోపాసన

శ్రీదత్తప్రభువులు అంతర్ముఖోపాసనను ఇలా వివరించారు. ''నాయనా! శ్రద్ధగా ఆలకించు. అంతర్ముఖోపాసన చాలా గొప్పది. అంతర్ముఖం అనగా మానసిక ధ్యానం అని కొందరంటారు. అది కానేకాదు. నీవు పరమాత్మ తప్ప మీ ఇద్దరిమధ్య మూడవ వ్యక్తికాని, మూడవ వస్తువుకాని లేకుండా నీవు చేయు ఆరాధన - ఇతరుల గుర్తింపునకు కాకుండా, అచ్చట రెండవ జీవుడెవ్వడును తోడురాడని తెలిసి అక్కడ నీవు నేను తప్ప మనమధ్య మూడోవ్యక్తి ప్రసక్తి లేదని తెలిసి నీవు-నేను అను రెండు స్పృహలు తప్ప మూడో స్పృహ లేకుండా ఆరాధించుటయే అంతర్ముఖయోగము.

## ఇది త్రికరణముల ద్వారా చేయువలెను

శ్రీముఖనామ సంవత్సరం చైత్రశుద్ధ పూర్ణిమ మంగళవారం 6-4-1993 ఉదయం 4 గంటల సమయం. శ్రీశైల క్షేత్రంలో-శ్రీదత్త భగవానుడు శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి అనుగ్రహించిన పవిత్ర దివ్యవాణి.

''నాయనా! శ్రద్ధగా ఆలకించు. సంసార విషయాలలో అతి బంధం కాని, అతి సంతోషం కాని, అతి దుఃఖం కాని పొందరాదు.

ఎందుకంటే అది నీ శక్తి దుర్వినియోగం యొక్క పరాకాష్ఠ. అసలు సంసార విషయాలలో ఆవంతైనా బంధంకాని, ప్రేమ కాని, సంతోషంకాని, దుఃఖంకానీ పొందకపోతే దుర్వినియోగం పైసాలతో సహా అరికట్టినట్లే. మొదటి దానిలో రూపాయల దుర్వినియోగం అరికట్టడము. రెండోదానిలో పైసాలుకూడా దుర్వినియోగం కాకుండా దాచినట్లే. బిందువులే సముద్రం అయినట్లే, పైసాలే రూపాయలౌతాయి. కాన అసలు సంతోషంకానీ, దుఃఖంకానీ ఎట్టి పరిస్థితులలో అయినా అరగింజతైనా పొందనివాడే యోగి. నిర్వికారంగా, నిర్లిప్తంగా ఉండేవాడే యోగి. అలా ఉంటే ఇతరులు బాధపడతారంటావా? ఆ ఇతరులు ఆనాడు అక్కడ తోడు వస్తారా? కాన అది నీ అవివేకానికి పెద్ద నిదర్శనం. అంతర్ముఖ సాధనలో మూడోవ్యక్తి స్ఫురహయే లేదు కదా.

యోగి ఆహారవిహారాలలో వివేకం తప్పక పాటించాలి. ఆహారం పరిమాణంలో మితంగాను, విలువలో శక్తివంతంగానూ వుండాలి. రోగాలకు కారణాలైన అన్నిటిని విసర్జించాలి. అతి భోజనం నిద్రకు కారణము. ఉపవాసము నీరసమునకు కారణము. అనావృష్టి, అతివృష్టి రెండు ఆరాధనా నిరోధకాలే. అతి విశ్రాంతి సోమరితనానికి దోవ. అసలు విశ్రాంతే లేకుంటే రోగహేతువు. కాన మితముగా విశ్రాంతి కావాలి. గాఢనిద్రయే విశ్రాంతి.

కలలు మరల మనస్సును శ్రమపెట్టి శక్తి దుర్వినియోగం చేస్తాయి. కలలకు కారణం వాసనలు. వాసన క్షయం అయితే కలలద్వారా అయ్యే శక్తి దుర్వినియోగం కూడా అరికట్టినట్లే. విహారాలు కూడా మితంగా వుండాలి. అతిగా ప్రయాణాలు రోగ కారణములు. ఒకేచోట వుంటే వాతావరణం మార్పులేనందున విసుగుతో కూడిన స్తబ్ధత వస్తుంది కాన అన్ని మితంలో వుండాలి.

ఎవరితో చేరితే నీశక్తి దుర్వినియోగం జరుగుతున్నదో గుర్తించి అట్టివారి సంగము వీడుము. వారి సంగము తప్పనిసరి అయినచో వారు పలుకునవి విననట్లు నటించుచు మనస్సును దైవార్పణ చేయుము. వారు శక్తి దుర్వినియోగము చేసుకునుచూ నిన్నును భాషింప ప్రేరేపింతురు. వారలకు సమయము,శక్తి విలువ తెలియదు అలాంటి సమయంలో మౌనంతో చిరనవ్వు అందించు చాలు. ఎదుటివారు బాధపడకుండా నిన్ను విడిచిపోతారు. వారితో సత్యము చెప్పిన నిన్ను నిందింతురు గదా''.

శ్రీదత్త భగవానులు సద్గురువు విశిష్టతను బోధిస్తూ ఇలా సెలవిచ్చారు. ''సరియైన సద్గురువుల సంగమున వుండుము. అట్టి వారు చాలా దుర్లభులు కేవలము దైవానుగ్రహము వలననే దొరకుదురు. వారి శుశ్రూష చేయుము. వారు అల్ప సంతోషులు వారల వద్ద యున్న అమూల్యజ్ఞాన రత్నముల నిధియంతయు నీకు ప్రేమతో నిత్తురు. ఆనాడు అచట తనను గుర్తించని భార్యా పుత్రాదులకు తన ధనమునంతయు మూఢుడు ఇచ్చుచు సద్గురువుల ఆతిధ్య శుశ్రూషలకై లోభించును. అజ్ఞానులగు ఈ దారాసుతులు నీకు ఉపకారము చేయకపోగా మమకారములతో నీ శక్తిని దుర్వినియోగము చేయు విష సర్పములకు పాలు పోసి హానిని పొందుచున్నావు . నీకు ఉపకారంచేసి, దైవరాధనకు ప్రేరేపించు మహాత్ములు ఇంటి కడకువచ్చి భిక్షాందేహి యనిన వారిని చీదరించుకొనుచున్నావు. నేనే వారి రూపముల వత్తును. నీకు సాయం చేయుటకు. నన్ను ఎన్నిసార్లు చీదరించితివో! అని వచించారు స్వామి. శ్రీదత్త ప్రభువుల వాణి అక్షరసత్యం సామాన్యుల మైన మా దంపతులవద్దకు శ్రీదత్తభక్తులు శివరాత్రి పర్వదినమున విచ్చేయడం మమ్ము శ్రీశైలం తీసుకెళ్ళడం ఆ మహాక్షేత్రంలో నిర్విరామంగా అనేక విధములుగా ఆరాధన చేయించడం, అనేక అద్భుత విషయములు

బోధించటం శ్రీదత్త ప్రభువే పరబ్రహ్మమని మాకు విశ్వాసం కలిగించి ఉద్ధరించడం మా దంపతులచేత శ్రీ స్వామివారి కార్యములలో ఉడతా భక్తిగా సేవ చేయించి తరింపచేయడం. ఇవి అన్నియు నిదర్శనములే కదా! స్వామీ! అల్పులం. సేవకులం. మన్నించి అనుగ్రహించవయ్యా అని ప్రణమిల్లుదము.

స్వామి మాకు ఇచ్చిన ఆజ్ఞ ఇలా ఉన్నది .''నాయనా! విను. ధనము కూడా నీ శక్తి రూపాంతరమే. కర్తవ్యములకు పోను కొంత యైనను దైవారాధనకు వినియోగించుము. పదిమందిని ఉద్ధరించుము. నాతత్త్వమును ప్రచారము చేయుము. ఎందరు ఉద్ధరింపబడుదురో వారి పుణ్యభాగములు నిన్నుచేరి నా అనుగ్రహమునకు కారణమగును. ప్రచారముచే నన్నారింధించుట, ఇతరులను ఉద్ధరించుట రెండూ జరుగును'' అని. ఆహా! స్వామీ! ధన్యులం. నీ ఆజ్ఞ శిరసావహిస్తాము. అనంతరము స్వామి చిరునగవు చిందిస్తూ ఇంకా ఇలా సెలవిచ్చారు.

''నాయనా! విను నేను యోగిరాజును. నేను చెప్పినంత విశదముగా యోగమును ఎవ్వరును నీకు చెప్పలేరు. శక్తి దుర్వినియోగానికి మూడు ముఖ్య కారణములు. అవియె ఈషణలు. అనగా చాలా గట్టి బంధములు. దారేషణ లేక పతీషణ–భార్యను భర్తగాని భర్త భార్యకు గాని త్రికరణములలో ఉద్రేకము కలిగించుచు శక్తి దుర్వినియోగము. పుత్రైషణ - సంతాన మమకారము. వారలకు మూటలు కట్టి ఈయవలెనని తన శక్తినంతా దుర్వినియోగంచేయుట. ధనైషణ - ధనమే పరమార్థమని నమ్మి తదార్జనకై శక్తినంతా దుర్వినియోగము చేయుట. ఈ మూడింటికే జీవిత సమయం అంతా శక్తినంతా దుర్వినియోగం చేయువాడు అధముడు. వానికి పశు కీటకాది జన్మలే ఫలము కేవలం కర్తవ్యమాత్రంగా అంటే మితంగా అంటే సంతానోత్పత్తి వరకే దారేషణ, విద్యాభ్యాసాదుల

వరకే పుత్రేషణ, ఆహార వస్త్రాదులవరకే ధనేషణ గలవాడు మిగతా శక్తిని దైవానికి వినియోగించే వాడు మధ్యముడు కర్తవ్యాలకు సహితము క్షణమైనా అణువు శక్తియైనా వినియోగించక సర్వసమయాన్ని దైవానికే అర్పితం చేసేవాడు ఉత్తముడు. నరజన్మఫలం సిద్ధిస్తుంది. ప్రతి జీవుడు చివరి దశలోనైనా మధ్యమస్థితి నుండి ఉత్తమస్థితికి రావాలి. అధముడు కనీసం చివరిదశలోనైనా కనీసం మధ్యమస్థితికి వచ్చినా మరల నరజన్మనిచ్చి ఉత్తమస్థితికి వచ్చే అవకాశం ఇవ్వబడుతుంది. బాల్యావస్థ నుండియే ఉత్తమ స్థితిలోకి వచ్చినవాడు శంకరాచార్యుడు ఒక పుత్రుడు కలుగగనే ఉత్తమస్థితికి పోయినాడు బుద్ధుడు. కనీసం బుద్ధునైనా అనుసరించాలి. హీనాతి హీనముగా బహుసంతానము గలిగి వారి కర్తవ్యములు తీర్చిన తర్వాత వార్ధక దశలోనైనా ఉత్తమ స్థితికి వచ్చి యోగి కావాలి. ఎవరినీ విమర్శించకు ఏ పుట్టలో ఏ పామున్నదో. రాయినీ రత్నాన్నీ వేరుచేసి చూడగల సర్వజ్ఞతాశక్తి నీకులేదు. రాతిని రత్నమంటే పాపమేమీ రాదు పొరపాటున రత్నాన్ని రాయి అని విమర్శించి నిందించిన మహాపాపము వచ్చును. కాన ప్రతి వానిలోను గుణమునే చూచి నీలో దోషములనే చూచుకొనుచు నిన్ను నీవు అందరికన్నా క్రిందనుంచుకొనుము. అట్లు చేసిన అహంకారము నశించి ప్రపత్తి కలుగును. అది లేనిదే, నా దయరాదు.

నా దయ వచ్చుటకు అహంకార, అభిమానములే అడ్డుగోడలు. ఈ విషయాలను రోజూ పఠించి గుర్తుంచుకో యోగం సిద్ధించేవరకు ఒకసారి చదివి పారవేసినచో గంటలో మరచిపోయి శక్తిని దుర్వినియోగము చేయుదువు. స్మరణచేత అభ్యాసము సిద్ధించును. జ్ఞానముచే దృఢ నిశ్చయమేర్పడి ఆచరణకు వెంటనే దారితీయును. జ్ఞానము లోపించుటయే అనాచారణమునకు కారణము. ఆచారమనగా శక్తి దుర్వినియోగమును అరికట్టుటయే తప్ప అనగా జ్ఞానముచే నిశ్చయించి దానిని మరల మరల

స్మరించుచు ఆచరణలో పెట్టి యోగమును సాధించి అట్టి కేంద్రీకృత శక్తిని దైవార్పణము చేయుట ఆచారధర్మములు. యోగసిద్ధియే ఆచారము. చరధాతువునకు జ్ఞానము, కర్మము రెండున్నవి అర్థములు. అనగా జ్ఞానస్మరణ పూర్వక ఆచరణక్రియయే. ఆచారమన తడిబట్టలు గాదు. ఆచారముచే యోగసిద్ధి జరిగి శక్తినంతా దైవార్పణ చేయుటయే స్వభావము. ఆచారము వలన ధర్మము వచ్చినచో సిద్ధి కలుగును'' అని వచించారు స్వామి.

శ్రీముఖనామ సం॥ చైత్ర బహుళ చవితి శనివారము ఉదయం 6 గంటల సమయం. శ్రీవారు సాక్షాత్కరించి అనుగ్రహించిన దివ్యవాణి:

## దత్తుడు

అజన్మా దత్తోయచ్ఛ్రిత జనతపః ప్రాగపిఫలం
దదద్దత్తో దత్త స్సకల జగతే బ్రహ్మణిగుణః
శ్రితాన్పుత్రాన్దత్తాన్కలయతిచదత్తత్వ సహితో
దదాత్యేవం తేఽపిద్విజశిఖరిణీం హాసతటితమ్ ॥

అర్థం:- జన్మలేనందున తనకు తానే దత్తత చేసుకున్నందునను, భక్తుల తపస్సులకు ముందే ఆ తపస్సుల ఫలములను ఇచ్చుటవలనను, సర్వజగత్తునకు ఈరూపమున పరబ్రహ్మము ఇవ్వబడినందునను, భక్తులను తన దత్తపుత్రులుగా భావించి కాపాడుట వలనను దత్తుడైన ఆ ఆ దత్తాత్రేయస్వామి నీకును దంతముల కొసల కాంతియను విద్యుత్తుతో కూడిన చిరునవ్వును ఇచ్చుటవలన (శిఖరిణీ శ్లోకమునిచ్చి) కూడా దత్తుడైనాడు.

ఆహా! అద్భుతం !!

## అష్టాంగయోగము

''నాయనా! శ్రద్ధగా ఆలకించు. సంసార విషయాలలో శక్తినెలా దుర్వినియోగము కానీయ కుండాదాచవలయునో, భగవంతునికై అలానే దానిని విరివిగా ఖర్చుచేయాలి. ఇక్కడ పొదుపు అక్కడ చూపరాదు. తన

పిల్ల పెండ్లికై అన్ని అనవసర ఖర్చులు మాని పొదుపుచేసి లక్షలను కూడబెట్టిన వాడు పిల్ల పెండ్లిరోజున కూడా ఖర్చుపెట్టడంలో పొదుపు చేయరాదు. ఏ అవసరం కోసం దాచినాడో దానికి ఖర్చు పెట్టకుండా దాచుకుంటే అది చివరకు దొంగలపాలయినట్లు భగవత్ప్రాప్తికి దాచిన శక్తిని ఖర్చుచేయకపోతే అట్టి శక్తి అంతా చివరలో మృత్యువుపాలే అవుతుంది. సంసార విషయాలలో పెద్దగా కేకలు వేయద్దన్నాను గాని ఉచ్చైస్వరంతో నాస్తోత్రము చేయవద్దని కాదు. అనవసర ఖర్చులుమాని, సుష్టుగా భోజనంచేసి, దాచేవాడు – కర్తవ్యాలకు పూర్తిగా శక్తిని వ్యయంచేసి మిగతా శక్తిని దాచేవాడౌతాడు. కాని భోజనం కూడా మితంగా సాధారణంగాచేసి దానిలోకూడా దాచేవాడు ఇంకా నాలుగు రూకలు దాచగలుగుతాడు. అలానే కర్తవ్యాలలోకూడా కేవలం కావలసినవరకే మితంగా చేసి మిగతా శక్తిని దైవప్రాప్తికి దాచేవాడు ఇంకా శక్తిమంతుడౌతాడు. అసలు అన్నంమాని కేవలం గంజితాగి దాచేవాడు ఇంకా దాచగలిగి పిల్లపెండ్లి ఇంకా బాగా చేస్తాడు. అలానే కర్తవ్యాలను కేవలం ఆహారం, గుడ్డకన్నా ఎక్కువ చేయకుండా శక్తిని దాచేవాడు యోగాన్ని ఇంకా బాగా సాధిస్తాడు. అసలు అన్నం, గంజి కూడా మానేసి పస్తుండి దాచడం చాలా అసాధ్యం. అలానే అసలు కర్తవ్యాలను త్యజించి పూర్తిగా శక్తినంతా యోగానికే అర్పణ చేయడమే నిజమైన సంన్యాసం. ఇది కలియుగంలో అసాధ్యము. ఇతర యుగాలలో గృహస్థులు భిక్షువులకు విరివిగా భిక్ష ఇచ్చేవారు. ఇదే అసాధ్యమయితే ఇక తపస్సుమాట అసంభవం. తపస్సు అంటే దేహంలో జరిగే శ్వాస, రక్త ప్రసరణ మొ॥ పనులకు కూడా ఖర్చు అయ్యే శక్తిని కూడా దాచి భగవద్యోగానికి అర్పణ చేయడం. అంటే వాయు భక్షణంకూడా మానివేయడం. అటువంటి మహాయోగిలోని శక్తి సర్వము భగవంతునిపై కేంద్రీకరింపబడి ఆ శక్తిలో ఒక అణువుకూడా కనీసం దేహంలో అంతర్గత క్రియలకుకూడా ఖర్చుగాదు. అదే సమాధి దానికి కలిమానవుడెంతో దూరంలో వున్నాడు అన్నారు స్వామి''.

శ్రీదత్త భగవానులు అష్టాంగయోగాన్ని ఇంకా ఇలా వివరించారు.'' కలిమానవుడు అష్టాంగయోగంలోని మొదటి రెండు మెట్లు అయిన యమ–నియమములను సాధించగలిగితే చాలు. యమం అంటే శరీరం–వాక్కుల ద్వారా దుర్వినియోగం అయ్యే శక్తిని దాచటము.

అంటే త్రికరణములద్వారా సాంసారిక విషయములలో దుర్వినియోగ మయ్యే శక్తిని దాచటమే. ఈ రెండే మానవులకు చేతనగుటలేదు. ఇక సమాధి ఎక్కడ? నియమం అంటే మనస్సుయొక్క ఆలోచనద్వారా దుర్వినియోగమయే శక్తి. శక్తిని దాచటము. ఉట్టికెక్కలేని అమ్మ స్వర్గానికి ఎక్కగలదా? అందుకే గీతలో ఈ రెండిటి గురించియే విపులంగా బోధించాను. ఈ రెండు పునాది. పునాదిలేని మేడ కూలుతుంది.

ఈ రెండు సాధించాలంటే జ్ఞానం ముందు కావాలి జ్ఞానంచేత క్షణికమైన ఆచరణ ఏర్పడుతుంది. మరసటి గంటకే కుక్కతోక వంకర. కాన జ్ఞానం స్మరణ చేతనే నిత్యాచరణకు దారి తీయును. రోజు 3సార్లు, 2సార్లు, కనీసం ఒకసారయినా ఈ విషయాలను స్మరణచేయాలి. పఠించాలి. అదే పారాయణము. క్రమంగా వారానికకొకసారి - మాసానికొకసారి ఇలా అభ్యాసం చేయాలి.

అభ్యాసంతో కూడిన వైరాగ్యంతో యోగాన్ని సాధించవచ్చు. వైరాగ్యమంటే శక్తి దుర్వినియోగం కాకుండా చేసే పొదుపే. ఆరంభంలో పొదుపు ఒక గంట చేస్తాము. రెండో గంటలో మరిచిపోయి మరల దుర్వ్యయం చేస్తాము. కాన జ్ఞానాన్ని స్మరించాలి.

ఈ స్మరణయే అభ్యాసము. నా యీ వాణి అంటే గీతాసారమును పఠించి అర్థం చేసుకో. గంటగంటకు గుర్తుచేసుకో. ఈ యోగశాస్త్రమే గీత. ఆసనం అంటే కదలక కూర్చోవడం గాదు. యమనియమాల అనంతరం-అంటే కావలసిన ధనం దాచావన్నమాట. ఆసనం అంటే పిల్ల పెండ్లి ఖర్చు ఆరంభమైనదన్నమాట. అంటే దైవారాధన ప్రారంభమే ఆసనము. భగవతారాధనలోని సుఖము నాస్వాదిస్తూ ఆ సుఖము స్థిరమైతే దానిని ఆసనమంటారు. స్థిరమైన సుఖమే ఆసనమని ఆసన శబ్దముయొక్క నిర్వచనము.

ప్రాణాయామం అంటే ఆ ఆసక్తిలోని తీవ్రత. తీవ్రంగా ఆలోచిస్తున్నప్పుడు దీర్ఘంగా శ్వాసపీల్చి స్తభింపచేస్తాము. అనగా శ్వాసక్రియను కూడా కాసేపు ఆపి దానికై వినియోగపడేశక్తిని కూడా ఆలోచనలో కేంద్రీకరిస్తున్నావము. ప్రాణాధికంగా దైవారాధనను చూపినపుడే ప్రాణాయామం సిద్ధించినట్లు. శ్వాసక్రియను ఆపి అవసరమైతే ప్రాణం

సైతం నీకు అర్పిస్తానన్న భావమే ప్రాణాయామంలోని తాత్పర్యం. శ్వాసనాపినప్పుడల్లా దైవం కోసం ప్రాణార్పణం చేసేందుకు సిద్ధమౌతున్న ప్రయత్న పరంపరయే ఇది.

ఇక ప్రత్యాహారం అంటే అంతర్ముఖ దైవారాధనమే. సాంసారిక విషయముల నుండి నివృత్తియే ప్రత్యాహారము. సంసారమున వుండియే నివృత్తిచేయుట రాజయోగము. అది చేతకాని యెడల విషయములకు దూరముగా నుండుటయే మార్గము. దానివలన నివృత్తికి కొంత దోహదమగును. దూరముగా నుండియు చింతలతో నున్న వ్యర్థమే. అట్టివారు సంసారమున నుండియే కొంచెము కొంచెము నివృత్తికై యత్నించవలెను. ఈ నివృత్తి మనస్సుకు సంబంధించినది. ఈ నివృత్తియు దైవమునందు లగ్నమగుటయు నిశ్చయముచే కాని పూర్ణ సాధ్యముకాదు. నిశ్చయము చేయునది బుద్ధి. అట్టి బుద్ధి వేదాంత జ్ఞానము లేక నిశ్చయము చేయకున్నది. కాన వేదాంత శ్రవణ మననములు చేసినచో బుద్ధికి జ్ఞానము కలుగును. దానిచే బుద్ధి నిశ్చయించును. దానిచేత నివృత్తి పూర్ణముగా సిద్ధించి ప్రత్యాహార సిద్ధి జరుగును. దానిచేత దైవలగ్నము మనస్సు పూర్తిగానగును. ఇదియే ధారణ అట్టి దైవలగ్న మనస్సును భ్రంశము జరుగకుండా బుద్ధియోగ సహాయముచేత కొనసాగించుటయే ధ్యానము. ఆ తరువాత సమాధియను సాధనస్థితి ఫలము లభించును. అదియే అద్వైతస్థితి.

ఆ సిద్ధి పూర్ణమైనచో నిర్వికల్ప సమాధి. అట్లుకాక భావ మాత్రమై 'తాత్కాలిక మైనచో సవికల్పమగు'ను.

## అష్టాంగయోగమనగా

1. యమం 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం
5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానము 8. సమాధి

ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీగురుదత్త। ఓం జయ గురుదత్త॥

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము - 6

శ్రీముఖ నామ సం॥ చైత్రశుద్ధ దశమి శుక్రవారము

ది. 2-4-93 - శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీవారి అనుగ్రహంవల్ల ఉదయం సంధ్యావందనము, జపము ధ్యానములు చేసుకొని శ్రీవారికి ఆతిథ్యమిచ్చి హస్తమస్తక సంయోగంపొంది, ఆశీస్సులందుకొని తరించాము. ఆహా! ఎంతటి కృప. స్వామి ఇలా వచించారు. ''బిడ్డలారా! నేను చాలా సంతోషించాను. మీరు శక్తిని వృధాచేసుకోకండి. మీ వయస్సు చూచుకోండి. మీరు ఇంకా పసిపాపలు కాదుకదా. నిరంతరం నా పాద పద్మములనే ఆశ్రయించండి'' అని. శ్రీదత్త భక్తులు ఆరోజు సాయంత్రం శ్రీమల్లిఖార్జున స్వామివారిని దర్శించి 6 గం॥లకు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో నమక పారాయణ చేశారు. శ్రీవారికి రుద్రాక్షమాల సమర్పించాము. స్వామి చిరునవ్వు చిందించారు. రాజరాజేశ్వరీ అమ్మ దర్శనం చేసుకొని భ్రమరాంబతల్లి దర్శనానికి వెళ్ళాము. అక్కడ శ్రీదత్త భక్తులు మాచేత ఒక ప్రత్యేక విధానంతో సౌందర్యలహరి షోడశి సంపుటితో పూజ చేయించారు. అమ్మ చాలా సంతోషించింది. ఆ తరువాత అమ్మ సమక్షంలో శ్రీసుబ్రమణ్యంగారు (మణి) అర్చన చేయించారు. అమ్మ బంగారు తల్లి వెలిగిపోతోంది. శ్రీదత్త భక్తులకు దర్శనమిచ్చింది. దత్తభక్తులతో అమ్మ ఇలా వచించింది. ''నాయనా! నీవు నా ఆత్మీయ పుత్రుడవు. ఎవరైన సరైన కోరిక కోరితే తీరుస్తాను. సరికానిది ఇవ్వను. కాని నీమీద వాత్సల్యం వల్ల నీవు ఏమికోరితే అది ఇస్తాను. అని చిరునవ్వు చిందించి అంతర్ధానమైనది. ఆహా! ఎంతటి ధన్యులు శ్రీదత్త భక్తులు.

వారి అనుగ్రహంవల్ల భగవత్‌సేవ చేసి తరించడం మా పురాకృత పుణ్యమే కదా!

శ్రీదత్త భగవానులు శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి మా దంపతులకు ఈ సందేశము అనుగ్రహించారు.

''సాయము చేసెదన్ వినుడు సాధన చేయుడు తప్పకుండ
ఈ కాయము రాలిపోవు ఇక కాలము తక్కువ శక్తి కూడ
మీ ప్రాయము చూచుకొండు పసిపాపలుగారు గృహంబు దిద్దుకో
న్యాయము దీపముండగనే నాడట రెండవ వాడు రాడొహో!

స్వామీ! ధన్యులం.

3-4-93 శనివారము ఉదయం 7.30 అయినది శ్రీవారు ఇలా వివరించారు.

''నాయనా! విను. సంభూతి ఉపాసన అనగా ద్రవ్యముతో ఉపాశించుటయే తప్ప మానసికముగా చేయకుండుట. అసంభూతి ఉపాసన అనగా మానసికముగా ఉపాసించుటయే తప్ప ద్రవ్యముతో చేయకుండుట. ఈ రెండును జోడించి చేసిన ఉపాసన సిద్ధినిచ్చును అని ఈశానోపనిపనిషత్తును అనుగ్రహించి అదృశ్యులయ్యారు.

ఇంతలో ఒక విచిత్రం. శ్రీదత్త భగవానుడు మరల సాక్షాత్కరించారు. ఇలా వివరించారు. ''నాయనా! శ్రీ ఆదిశంకరులు సౌందర్యలహరి పాలధార, పంచధారలలో నుండి రచించారు. తర్వాత శ్రీ భ్రమరాంబ తల్లి సముఖములో కూర్చొని షోడశి సంపుటితో సౌందర్యలహరితొ అమ్మను పూజించి ఆనందింపచేశారు ఆనాడు. ఆ తర్వాత ఆ పద్ధతితో ఇంత వరకు ఎవ్వరు అట్లా పూజించలేదు. నిన్న శుక్రవారం రాత్రి ఈ విధంగా నీవు ఈ దంపతులచేత పూజ చేయించావు. నేను చాలా సంతోషించాను'' అని అనుగ్రహించారు. ధన్యులం. ఆ సందేశం మాకు శ్రీదత్త భక్తులు వెంటనే అందించారు. మేము చాలా ఆనంద పడ్డాము. ఇ ంతలో నా శ్రీమతి ''స్వామీ! మీరు ధన్యులు మీకు స్వామి అమ్మ దర్శనం ఇచ్చి ప్రత్యక్షంగా పలికి అనుగ్రహించారు. మేము పామరులము. మాకు ఈ భాగ్యం కలుగుతుందా'' అని విన్నవించుకుంది. వెంటనే భగవానుడు శ్రీ దత్త భక్తులకు సాక్షాత్కరించి ఇలా పలికారు.

''సందేశంబును కోరనేల మరలన్ సందేశసారంబు ఆ
నంద ప్రేమల జీవితాంత సమయంబందున్ ననున్ కొల్చినన్
సందేహంబులు లేక చిట్టచివరన్ సాక్షాత్కరింతున్ యముం
డందుంరాడు తదీయులంచు దయతో అంకంబుపై చేర్చెదన్''

అని మా దంపతులకు వరప్రదానం అనుగ్రహించి మమ్ము ధన్యుల చేశారు.

ఆ రాత్రి నా శ్రీమతికి శ్రీ గురుడు స్వప్నంలో ''లోకోత్తరమైన మాట చెపుతాను విను'' అని శబ్దం వినిపించింది. వెంటనే ఆమె కళ్ళు తెరిచేసరికి ఏమీ లేదు. అప్పుడు ఆమె దత్తభక్తులకు విన్నవించగా, శ్రీ దత్త భక్తులు స్వామి వారిని ప్రార్థించారు. స్వామి ఇలా వివరణ ఇచ్చారు. ఆమెను ఈ వాక్యలు వ్రాసుకొని మననం చేసుకోమను అని సెలవిచ్చారు.

1. గతమును చింతించకుము. భవిష్యత్తును ఊహించకుము.
2. ఇకనైనా సమయాన్ని, శక్తిని, వృధా చేయకుము.
3. అచ్చట నిన్నే జీవుడును కనీసము గుర్తించను కూడా గుర్తించడు.

ఆహా! మహానుభావా! ఎంతటి దివ్యవాణి. నీ ఆజ్ఞను శిరసావహిస్తాము తండ్రీ అని ప్రణమిల్లాము.

## నిష్కామయోగం

శ్రీముఖ నామసంవత్సరశ్రావణశుద్ధ విదియ బుధవారము ది. 21-7-1993 సాయంత్రం 6 గం॥లకు శ్రీదత్త భక్తులకు, శ్రీదత్తాత్రేయస్వామివారు ప్రత్యక్ష దర్శనమిచ్చి నిష్కామయోగము, అంతర్ముఖత్వము మొదలగు విషయములపై వివరణ ప్రసాదించారు. ఇది సాక్షాత్తు శ్రీదత్తస్వామి అక్షర ప్రసాదము.

స్వామి ఇలా సెలవిచ్చారు. ''నాయనా! శ్రద్ధగా విను. నిష్కామం చాలా ప్రధానపాశం నన్ను ఆకర్షించి కట్టివేసుకొనడానికి. అలానే యోగం సాధనను ఎక్కువసేపు శక్తివంతంగా సాగించడానికి ఉపయోగిస్తుంది. దీనిచేత నిరంతర - ఆరాధన సాధ్యము. నిష్కామంవల్ల అంతర్ముఖత్వం వచ్చి తీరుతుంది. పురుష ప్రయత్నం లేకుండా నేనేదీ అనుగ్రహించను.

అలా అనుగ్రహిస్తే అందరిని అనుగ్రహించవలసి వస్తుంది. కొందరినే అనుగ్రహిస్తే నాకు అకారణ రాగద్వేషాలు ఆరోపించ బడతాయి. పురుష ప్రయత్నంవరకే ఫలమిస్తాను. అలా యివ్వడంచేత పురుష ప్రయత్నం చేయనివాడిని నేను అనుగ్రహించక పోవడం న్యాయం అవుతుంది. నేనెప్పుడూ న్యాయం తప్పను గదా!

నిష్కామం సాధిస్తే సరిపోదు. సంసారంనుంచి నిష్కామంతో పాటు నాపై కామం పెరగాలి. నాపై కోరిక లేకుండా కేవలం సంసారం మీద పూర్తి నిష్కామం సాధించినవాడు ఏ కోరికాలేని జడమైన రాయి వంటి వాడేగదా. అలానే యోగం ద్వారా శక్తిని కేంద్రీకరించి దాచి నా కొరకు వినియోగించనివాడు కూడా ఒక జడమైన తామస దీర్ఘ నిద్రలో వున్నవాడే అవుతాడు.. అలానే అంతర్ముఖత్వంలోకూడా నాపై దృష్టి లేకుండా కేవలం మూడోవ్యక్తి మూడో వస్తువుపై స్పృహ లేనివాడు దేనిపైన దృష్టిలేని అంధునితో సమానమే కదా. ఉదా॥ ఒక రాయికి కూడా మూడోవ్యక్తి పైనా,మూడో వస్తువుపైనా స్పృహలేదు. అది అంతర్ముఖ సాధకుడా? కాదు. ఎందువలననగా రాయికి నాపై దృష్టి లేదు. కాన నాపై కామంతో, ప్రపంచంపై నిష్కామం,నాకు అర్పించడానికై ప్రాపంచిక విషయాలనుండి శక్తిని దుర్వినియోగం కాకుండా కాపాడుకొని దాచడము, నాపైదృష్టినుంచి మూడోవ్యక్తిపై మూడో వస్తువుపై దృష్టినుంచక పోవడము - ఇవే వరుసగా నిష్కామం, యోగం, అంతర్ముఖం అనబడతాయి. పురుష ప్రయత్నం విలువను గుర్తించి సదా ప్రయత్నం చేయుము. దాని ననుసరించి సదా ఫలమిస్తూనే వుంటాను. ఇవి చాలా ముఖ్యం. మరువకుము.

## గాయత్రీ మంత్రము

నావెంటనున్న నాలుగు కుక్కలు నాలుగు వేదాలు. నా వెంట వస్తున్నాయి. నేను బ్రహ్మస్వరూపుడను. జ్ఞానకారకుడను. నా బ్రహ్మ తేజస్సునే గాయత్రి మంత్రముతో ధ్యానించుచున్నారు. నన్ను ధ్యానించుటకు ముందు నామరూపాత్మకయగు నా ప్రకృతియగు స్వభావశక్తి అయిన సరస్వతినే గాయత్రి ధ్యానశ్లోకముచే ముందు ఆరాధించి నామ రూపాతీతుడనగు నన్ను నామరూపాలతో

సాక్షాత్కరించుకొనుచున్నారు. నా నామరూపాతీత తత్త్వమును పూజించుట అసంభవముగాన బ్రహ్మకు పూజ లేదనుచున్నారేతప్ప అది నిందతోగాదు. గాయత్రి, సావిత్రి, సరస్వతి అను నామములు నాశక్తి నామములే. ఈ గాయత్రీ మంత్రమున జ్ఞానముచే బుద్ధులను ప్రేరేపించువాడను నేనే.

## ఆరాధనా విధానము

ఈ విధముగా సంధ్యావందనము వాణీ బ్రహ్మల ఆరాధనమే. తామాగ్ని వర్ణాం అను మంత్రముతో నమకమును ముగించవలెను. అప్పుడు ఆ అభిషేకము ఉమామహేశ్వరులకు చేయబడుచున్నది. ఆతరువాత విష్ణుసహస్రనామముతో లక్ష్మి అష్టోత్తరము చేసిన లక్ష్మి నారాయణుల ఆరాధన మగును. ఈ మూడును వెంటవెంటనే చేసినచో నా శక్తితో కూడిన నా ఆరాధనమగును. శక్తియు నేనే కాన నా ఆరాధనము అగుచున్నది. కాన ఈ విధముగా చేయు చుండుము.

జపము, హోమము, పూజా, గ్రంథ పఠనము మొ॥ ఆరాధన విధానము లన్నియు కొన్ని కొన్ని సమయములలో కొన్ని కొన్ని నియమములకు కట్టుబడి చేయనగును. కానీ నామ సంకీర్తనమను గానము సర్వాకాల సర్వావస్థల యందును చేయవీలగును. కాన గానము చేయు వానిని రక్షించునన్న అర్థముతో గాయత్రి శబ్దము ఏర్పడుచున్నది.

సంకీర్తనము వేరు సంగీతము వేరు. దీర్ఘరాగములతో నా నామము నుచ్ఛరించుటయందు ఆలస్యమును సహించలేని నా సత్యభక్తులు సంగీతభ్రమలో పడక సదా కీర్తన చేయుచుందురు. అందరికిని తల్లిని, తండ్రిని నేనే. అందరిని రక్షించువాడను నేనే. కాన నీవు మరియొక జీవునకు రక్షకుడవు కాలేవు. కాన నీవు తల్లివి, తండ్రివి అను అహంకారమును విడిచి నిన్ను నీవు రక్షించుకొనుము. నిన్ను నీవు రక్షించుకోలేని వాడవు ఇతరులనెట్లు రక్షింతువు?'' అని వచించారు. ఆహా! ఎంతటి రహస్యమును ఇంత చక్కగా వచించితివి గదయ్యా! ధన్యులము.

గురువారము 22-7-1993 ఉ॥ 7 గంటలకు స్వామి ఇలా వచించారు:

## జీవుల స్వాతంత్ర్యము

జీవులకు పూర్ణ స్వాతంత్ర్యము నిచ్చియున్నాను. వారి వారి బుద్ధ్యనుసారముగా కర్మల చేయుచుందురేకాని, నేను వారి చేత కర్మలను చేయించి సర్వమునకు నేనే కర్తనగుటలేదు. కొందరు అజ్ఞానముచేత వారి కర్తృత్వ భాధ్యతను నాపై పెట్టుచున్నారు. జీవులను, జగత్తును సృష్టించినది నేనే కాన నేను సర్వకర్తనే. కాని జీవులకు బుద్ధినిచ్చి మంచి చెడులను ధర్మ శాస్త్రములద్వారా, అవతారముల ఉపదేశముల ద్వారా చెప్పుచున్నాను. జీవులు మంచినిగానీ, చెడునుకాని అనుసరించు స్వాతంత్ర్యమును జీవులకే ఇచ్చియున్నాను . కాన వారి మంచి చెడు కర్మల కర్తలు వారే కాని నేనుకాను. ఆయా కర్మలఫలముల ననుభవించు ఆ జీవులే భోక్తలు కాని,నేను వారి కర్మ ఫలముల భోక్తనుకాను. ఇంతేకాదు ఒక జీవుడు ఏమి చేయబోవు చున్నాడో కూడా నాకు తెలియదు. తెలుసుకొనలేకకాదు. తెలుసుకొను ఇష్టములేదు. ఎందువలననగా తెలుసుకున్నచో వారి కర్మలను చూచి వినోదించు అవకాశముండదు. ఒక నాటకము కథ అంతయు ముందు తెలిసినచో దానిని బాగుగా వినోదించలేవు. కథ తెలియనిచో ఆ నాటకమును చూచి బాగా ఆనందింతువు. బాగా వినోదించు, ఆనందించువాడే రమించువాడగు రాముడు. కావుననే రాముడు మనుష్యునివలె మాయను కప్పుకొని భవిష్యత్తును తెలుసుకొనకుండా జీవుల కర్మలను సాక్షిమాత్రముగా చూచి ఆనందించి వినోదించు వాడగును "రమతే ఇతి రామః" కదా. నాభక్తుడు పిలిచిన నే వచ్చెదను. పిలుచునో లేదో కూడా నాకు తెలియదు. పిలవని వానిని చూచుచుందునే తప్పవానిని చేరను. పిలువగనే వచ్చి రక్షింతును. కాన నన్ను సదా పిలుచుచుండుము. అనగా నా నామమును సదా స్మరించుచుండిన ఏ ఆపద హఠాత్తుగా వచ్చినను నీ వెంటనుండి నిన్ను రక్షింతును.

## ''నేను కర్తను'', ''నేను భోక్తను'', ''నేను కర్తనుగాను'', ''నేను భోక్తను గాను'' ఎట్లు?

నేను కర్తనే. ఎందువలన? సర్వజగత్తును సృష్టించు కర్తృత్వము వలన కర్తను. నేను భోక్తను? ఎందువలన? సర్వజగత్తును చూచి వినోదించు ఆనందము ననుభవించుటవలన భోక్తను. అంతేకాని నీవు చేయు పిచ్చిపనులకు నేను కర్తను కాను. ఆ పిచ్చిపనుల ఫలముల ననుభవించు భోక్తను కాను. నా కర్తృత్వ, భోక్తృత్వములు వేరు. నీ కర్తృత్వ భోక్తృత్వములు వేరు. కాన ఇరువురము ఒకటి కాము. నా అనుగ్రహము సిద్ధించినచో నీవు నేను కాగలవు కాని ఇప్పుడు మాత్రము వేరు. అద్వైతసిద్ధి నా అనుగ్రహము పూర్ణముగా కలిగినచో ఉన్నది. అంతేతప్ప స్వభావముగా జీవుడు ఈశ్వరుడు కాడు.

## పరమాత్మ భక్తుల ననుగ్రహించుట

22-7-93 గురువారము-రాత్రి 8-30 గంటలకు స్వామి ఈ విధంగా వచించారు.

''నా భక్తులను నేను కనిపెట్టి వారికి మాత్రము రాబోవునది ముందుగా తెలుసుకొని వారికి సాయపడెదను. నేను సదా వారివెంటనుండి ఆపద వచ్చుటకు ముందే నివారింతును. భక్తులు తప్ప మిగతా జీవుల భవిష్యత్తును నేను తెలుసుకొను ఇష్టము లేనందున తెలుసుకొనక కేవలము సాక్షిమాత్రముగా చూచి ఆనందింతును. నాభక్తుల కొరకు నేనీ జగత్తులో సదా సంచరిస్తూ అనేక స్థలములందు అనేక రూపములతో, అనేక అవతారములతో వారికి సాయపడి వారినానందింప చేయుచున్నాను''.

స్వామి ఇంకా ఇలా అంటున్నారు ''నేనొక వడ్డీ వ్యాపారిని. నా భక్తుల భక్తిని పరీక్షించి దానికి విలువకట్టి ఆ విలువ ప్రకారము ఇహముగాని,పరముగాని వారు కోరిన ఫలముల నొసగుదును. కావున నేను నా భక్తుల తపస్సులకు ఫలప్రదాతను. కాన వారి భక్తిని పరీక్షించి,దాని ఫలమును విలువ ప్రకారముగా నొసగెదను. సర్వదేవతా రూపములు నేనేకాన, ఏ దేవతల నుపాసించిననూ విలువకట్టి ఫలముల నొసగవలసినది

నేనేకదా. కాన పరీక్షల చేయుట ఫలముల నొసగుట యందే నేను సదా నిమగ్నుడనైయున్నాను. ఆ భక్తికి విలువ కట్టిన తర్వాత నా వాణీశక్తి భాండాగారమునుండి విద్యా జ్ఞానములుగాని, నా లక్ష్మీభాండాగారము నుండి భోగ భాగ్యములను గాని, నా గౌరీభాండాగారమునుండి అష్టసిద్ధులను గాని మూల్యముగా విలువనుబట్టి తీసుకొనుటకు నేను అంగీకరింతును. మూల్యము తీసుకొనక, ఏ కోరికలు లేక, నావద్ద భక్తిని ఉంచినవారికి దానివడ్డీ పెరుగుచుండును. వారికి అవసరము వచ్చినపుడల్లా నేను ఆ వడ్డీని వినియోగింతును. అట్టివారికి నేను సదా ఋణపడి యున్నాను!'' అని వచించారు స్వామి. ఆహా! స్వామీ! అద్భుతము.

24-7-93 శనివారము ఉదయము శ్రీ దత్తవాణి

## దత్త పుత్రుడ నేనే

శ్రీవారు తనకన్న ధర్మం గొప్పది కాదని వివరించారు :

''పుత్రుడు ఇహలోకంలో అన్ని విషయాలలో సాయంచేసి, తరువాత నరకమునుంచి ఉద్ధరిస్తాడని అంటారు. ఇదే నిజమైతే, ఎందరో మహాజ్ఞానులు పుత్రుని పొందక, బ్రహ్మచారులై తరించారు. శాస్త్రము చెప్పినది అబద్ధముకాదు. కాన ఇక్కడ సమన్వయము ఏమంటే - భగవంతుని పుత్రునిగా దత్తత తీసుకొన్నవారే పుత్రవంతులు. అట్టి ఆ దత్తపుత్రుడనే నేను. నన్ను దత్తత తీసుకొను వారు, త్రిగుణములకు, అతీతమైన పూర్ణ విరాగియైన అత్రి కావలయును. మరియు అసూయను జయించి అనసూయ కావలయును. అట్టివారికి నేను నన్ను దత్తత చేసుకొని ఇహపరములలో వారిని కాపాడుదును.

ధర్మంకోసం అధర్మాన్ని వదలవలయును. నాకోసం ధర్మాన్ని కూడా వదలాలి. నాకన్నా ధర్మం గొప్పది అని భావించేవారు నా పరీక్షలో ఓడిపోతారు. ఋషులు నాకు యజ్ఞానికి ముందు అన్నం పెట్టుట నిరాకరించి నా పరీక్షలో ఓడిపోయారు. అంబరీషుడు నా కన్నా ధర్మానికి విలువ యిచ్చి నా శాపం పొందినాడు. అనసూయ నాకన్నా తన పాతివ్రత్య ధర్మానికి విలువనీయలేదు. కాన వరాన్ని పొందింది. అలానే సుమతి, శ్రాద్ధదినం రోజా భోక్తలు భోజనం చేయకముందే నాకు భిక్షనిడి ధర్మానికన్నా నాకు విలువ నిచ్చింది. ధర్మాచరణం నాయొక్క అనుగ్రహం పొందడానికే కాన నాకన్నా ధర్మం గొప్పది కాదు.

జగత్తును సృష్టించి, జీవుని సృష్టించి, సర్వభోగాలను కల్పించిన నా యందు కృతజ్ఞతతో స్తోత్రము చేయుటకన్నా మించినపుణ్యము లేదు. అందువలన ఎన్ని పాపాలు చేసినా, నా స్తోత్రము చేయుచున్న భక్తుడు కొంచెము పుణ్యశేషముతో పుణ్యాత్ముడే అగును. అలానే నన్ను నిందించు కృతఘ్నుడు మహాపాపము చేసినందున వాడు ఎన్ని పుణ్యాలు చేసినా చివరకు కొంచెము పాపము శేషముతో పాపాత్ముడే అగుచున్నాడు. ఇక నా స్తోత్రములు చేయుచు పుణ్యములను చేయువాడు సర్వశ్రేష్టుడు. నన్ను నిందించుచు పాపములను చేయువాడు సర్వాధముడు.

నన్ను నిందించక, నన్ను గురించి పట్టించుకొనక కేవల ప్రాపంచిక భోగ భాగ్యములలో మునిగినవాడు పశుపక్షి కీటాది జన్మల నొందును. నన్ను నిందించుచు లౌకిక భోగములలో మునిగినవాడు రాక్షస పిశాచ జన్మల నెత్తును.

నేను అనేక సాధురూపములతో అవతరించుచున్నాను. నేనెత్తు అవతారములు లోకుల యొక్క భిన్న భిన్నగుణములకు అనుకూలముగా నానా రూప గుణములతో ఉండును. నీకొక అవతార గుణములు నచ్చకపోయిన మౌనముగా నీకు నచ్చిన రూపమునే ఆరాధించుము. అంతేకాని ఏ రూపమును నిందించి విమర్శించకుము. నిందవలన నీ ఆరాధనా పుణ్యమంతయు నశించుచున్నది.

నన్ను నేరుగా చూచుట అసాధ్యము. అత్రి అనసూయలు తపస్సు చేత కాని, నన్ను దర్శించలేక పోయినారు. నా యోగీశ్వర రూపమును దివ్య చక్షువులతోగాని చూడలేరు. దివ్యత్వము తపస్సుచేత గాని రాదు. అందువలన నీ యోగ్యత ననుసరించి నాశక్తిని తగ్గించుకొని అవతరించుచున్నాను. అనేకుల అనేక స్థాయిలలో ఉన్న యోగ్యతలననుసరించి నేను అనేక అవతారముల నెత్తవలసి వున్నది. అంతేకాదు- ఒకే స్థాయిలో జీవులు అనేక గుణములతో భిన్నముగా నున్నారు. కాన ఒక్కొక్క స్థాయిలో మరల అనేక రూపముల నెత్తు చున్నాను. నా అవతారములు లక్షలు కోట్లకు వున్నవి.

త్రిమూర్తులు మొత్తము కలసి 99 పైసలు. ఒక పైసా నా నిర్గుణావస్థ. నేను 100 పైసలు పరిపూర్ణతత్త్వము. వాసుదేవుడు నా అవతారమే. అందువలననే అది విష్ణుని దశావతారములలో లేదు. యదు యాచనతో యదు వంశము నుద్ధరించుటకు నేను అవతరించితిని. జారచోరత్వాది మాయలతో నేను కప్పబడుట ఆ అవతారమునందున్నది. నా యోగీశ్వర రూపమే విశ్వరూపము. నా గురుబోధయే యోగ శాస్త్రమగు భగవద్గీత. నా అష్టసిద్ధులే అనేక మహిమలుగా చూపి యున్నాను. జీవులు వారి వారి స్థాయిలననుసరించి శ్రీ వాసుదేవుడు, శివుడు, విష్ణువు, బ్రహ్మ, మారుతి, గణపతి, మణికంఠుడు మొ॥లగు రూపాలు అనేక సిద్ధుల రూపాలను గురువులుగా వుంచుకొని వారి ద్వారా చివరకు మూల విరాట్టును అయిన దైవమునైన నన్ను దర్శిస్తారు.

కామక్రోధ లోభ మద మోహమాత్సర్యాలనే ఆరు దీర్ఘరోగాలతో జీవుడు రోగిగా యున్నాడు. దానికి తోడుగా జీవిత సమస్యలనే ఉప రోగాలతో ఇంకా దిగజారి నా వైద్యశాలలో చేరినచో, ఆజీవుడు నా ఆదేశముల ప్రకారమున్ననే బాగుపడును. త్రికాలములందును నా నామామృతమును ఔషధమును సేవించవలయును. ఈ రోగ కారణములయిన భోగములను అపథ్యాహారములను సేవించరాదు. కేవలము అన్న పాన వస్త్రాదులవరకే సాత్వికాహారమును ఇచ్చుచున్నాను. వాటితో తృప్తిపడి, భోగములనే అపద్యాహారములపై జిహ్వ చాపల్యమును నిగ్రహించుకొని నా వైద్యశాలలో ఉండవలయును. ఆ జీవుడు సంపూర్ణారోగ్య వంతుడయిన తరువాత నేను వానికి అష్టసిద్ధులనిచ్చి జగత్తులోనికి పంపుదును. ఆ జీవుడు స్వార్థమువీడి, లోకోద్ధరణార్థమై ఈ అష్టసిద్ధులను ఉపయోగించును. కాన పతనము నొందడు!!

**స్వామి భగవద్గీతా పారాయణ రహస్యము ఇలా వివరించారు.**

"భగవద్గీతను నిత్యమూ పారాయణ కొరకే పారాయణ చేయుట వ్యర్థము. ఏలననగా, భగవద్గీతలో " ఈ విధముగా ఆచరింపుము" అని

చెప్పబడినది. ఆ విధముగా ఆచరింపక, ప్రతిరోజు " ఈ విధముగా ఆచరింపుము" " ఈ విధముగా ఆచరింపుము" అని చదువుటలో ఉపయోగమేమి? ఆచరణములేని గీతాపారాయణము వ్యర్థము. ఏలనన గీత కేవలము ఆచరణమునే ఆదేశించుచున్నది. నీవు "8 గం॥ లకు అన్నం తిని, 9 గం॥లకు నిద్రపొమ్ము " అని ఆచరణము నాదేశించు వాక్యము గీత. ఒక నాడైనను ఆ సమయములలో అన్నం తినక, నిద్రపోక, రోజూ ఆ వాక్యమును పారాయణ చేయుటలో ప్రయోజనమేమి?" అన్నారు స్వామి.

శ్రీముఖ నామ సం॥ శ్రావణ శుద్ధ అష్టమి సోమవారము 26-7-1993 ఉదయం 5 గం॥ల సమయం.

శ్రీదత్త భగవానుడు శ్రీ దత్త భక్తులకు సాక్షాత్కరించి ఇలా వివరించారు.

## ఆహారము

"నాయనా! శ్రద్ధగా ఆలకించు. నా చేతిలోని భిక్షాపాత్రము, కమండలము, మితముగా ఆహారపానీయములను తీసుకొనవలయునను సూచనయే. ఆహారము సాత్త్వికములైనచో శరీరమునకు ఆరోగ్యము నిచ్చును. అవే రాజస, తామసములైనచో రోగమును కలిగించును. అట్లే సాత్త్వికులతో సత్సంగము మనస్సునకు ఆరోగ్యము. రాజస, తామసులతో సంగము సంసారరోగమునకు కారణము. ఆహారములో భార్య సహకారము ఎంతో అవసరము. సంగములో మిత్ర, పుత్ర బంధువుల సహకారం అవసరము. కాన వీరందరితో యోగమును గురించి చెప్పుకొని తనకు సహకరించమని చెప్పుకొనవలయును. వారి సమస్యలను వారే పరిష్కరించుకొన మనియు దైవారాధనమే అన్ని సమస్యలకు మూల పరిష్కారమనియు చెప్పి, వారి సమస్యలతో తన శక్తిని, తన సమయాన్ని వృథా చేయవద్దని బాగుగా చెప్పుకొనవలయును. వారలను తన యోగ మార్గప్రయత్నమునకు అనుకూలించమనియు అట్టి అనుకూలత్వము చేత

వారలకు దైవానుగ్రహము లభించుననియు చెప్పవలెను. అట్లుకాక ప్రతికూలత్వము చేత దైవాగ్రహము కలుగుననియు చెప్పవలెను. ఇట్లు వాతావరణమును అనుకూలము చేసుకొనవలెను. నిద్రాహారములు నియమములతో పాటించిన కాని యోగము సిద్ధించదు. వాటితోపాటు ఎట్టి మనుజుల సంగములో ఉన్నావనునదియు యోగ సిద్ధికి ముఖ్యకారణము. ఆహర నిద్రాసంగములే యోగమును నిర్దేశించు చున్నవి''.

ది. 27-7-93 ఉదయము 5-00 ల సమయం. శ్రీదత్త భగవానుడు ఇలా దివ్యవాణిని అనుగ్రహించారు.

## భక్తుని లక్షణములు

''నేను ఎట్టి సొమ్ములను ధరించుట లేదు. ఈ విషయము వైరాగ్యమును సూచించు చున్నది. ప్రపంచమునుండి పూర్తిగా మళ్ళిననే నా దర్శనము. గో రూపమైన ధర్మమును వెనుకకు పెట్టి ముందు నేనున్నాను. అనగా ధర్మము - నేను అని వచ్చినప్పుడు ధర్మమును వెనుకకు త్రోసి నన్ను ముందుంచినచో నా దర్శనమగును. ధర్మమునకు నాకన్న ఎక్కువ ప్రాధాన్యత నియ్యరాదు. ధర్మములన్నియు నాదయను పొందుటకు ఆచరించు మార్గములే. నేను ఈ కుక్కలను నాకన్న ముందుంచినాను. ఈ కుక్క అహంకారము లేక విశ్వాసముతో నా పాదములను నాకును. నేను తిన్న ఆహార ఉచ్ఛిష్టమునే తినును. నేను ఎంత కొట్టినను నన్ను వీడిపోదు. నాకు ఎదిరి వారిని చూచి కోపముతో అరచును. ఇవే భక్తుని లక్షణములు. భక్తుడు తన అహంకారమును వదలి నా పాదములపై పడవలెను. నాకు నివేదించియే తినును. నేను ఎన్నికష్టములు పెట్టినా నన్ను విడువడు. నాస్తికులను చూచి కోపావేశముతో అరచును. అట్టి భక్తుని నాకన్నా ముందుంచి నడిపింతును. వాడే జ్ఞానస్వరూపుడను వేదరూపుడు నీవు కేవల ధర్మాచరణమే అవలంబించి సాత్త్వికమైన గోవుగా ఉన్నచో నన్నాశ్రయించిననూ నాకు వెనుకనే వుందువు. అంతే తప్ప జ్ఞాన స్వరూపుడవు కావు. కుక్కవలే

విశ్వాసముతో నా పాదముల నాశ్రయించినచో నాకన్నా ముందుంచి నడపింతును. గోవు పవిత్రము ఎందుకనగా ధర్మము పవిత్రము. కుక్క అపవిత్రము. ఎందుకనగా ధర్మమును సైతమును వదలినది నా కొరకు. అయినను కుక్కకున్న స్థానము గోవుకు లేదు. కుక్కవేద స్వరూపమై అన్ని అపవిత్రములను పోగొట్టగల మంత్రాత్మకమైన పరమ పవిత్రరూపము. గోవు కేవలము పశురూపముననే ఉన్నది.

శ్రీ దత్త భక్తులిలా పాడినారు :

దత్తరాజా ఓ దత్తరాజా
నీ కుక్కనయ్యా నా దత్తరాజా
నీ పాదంబుజ మధువులనే నాకెదనయ్యా ..దత్త
నీ ఉచ్ఛిష్టములనె భుజింతునయ్యా .. దత్త
నీ వెంత కొట్టినా నిను విడజాలనయ్యా .. దత్త
నీ పగవారిని పీకెద కరచెదనయ్యా .. దత్త
నీకై ప్రాణములనె అర్పింతునయ్యా .. దత్త

అప్పటికి మాకు ఆ కీర్తన యొక్క రహస్యం తెలియలేదు. ఇప్పుడర్థమౌతోంది. దత్తావతారులైన షిరిడీ సాయినాథుడు శ్రీ దత్త భక్తులను షిరిడికి పిలిపించారు. దత్తభక్తులు, శ్రీ కోనేరు సత్యనారాయణ గారు వారి సతీమణి శ్రీమతి కాంచనలతగార్లతో షిరిడి వెళ్ళడం జరిగింది. షిరిడి సాయినాథుని సమాధి మందిరంలో శ్రీదత్త భక్తులు ప్రవేశించగానే విపరీతమైన దుఃఖంవచ్చి కంటనీరు పెట్టారు. వెంటనే శ్రీసాయి ప్రభువు దర్శనం ఇచ్చారు. ''ఎందుకురా ఏడుస్తావు. రేపు నీవు కూడా ఇంతేకదా'' అని అదృశ్యులయ్యారు. దత్తభక్తులు దుఃఖిస్తూనే క్యూలో నడుస్తున్నారు. శ్రీ సాయినాథుడు మరల దర్శనమిచ్చారు. ఇలా వచించారు. ''నాయనా! నీవు నా దగ్గర వుండే వల్ల కుక్కవు పూర్వజన్మలో. నేను శరీరాన్ని వదిలేముందు నీవు శరీరాన్ని వదిలేశావు. కనుక నా శరీర త్యాగ

సమయంలో నీవు లేవు. ఆ సమయంలో శ్యామ, మహల్సా, బూటీ, తాత్యా మొదలగు భక్తులు ఈ మందిరంలో సమాధి చేశారు. ఇది సమాధి మందిరం. అప్పటినుండి భక్తులు వేల సంఖ్యలో వస్తూ నన్ను భక్తితో సేవిస్తూ అనేక కోరికలు కోరుతూ నా ఎముకలు కొరుక్కు తింటున్నారే కాని ఏ ఒక్కడు కూడా అయ్యో! స్వామి శరీరంతో తిరిగేవారే ఈనాడు సమాధి అయిపోయినారే అని దుఃఖించడంలేదు. ఆనాడు నాకాళ్ళ వద్దయుండి శునక రూపంలో సేవించిన నీకు ఇప్పుడు మానవజన్మ ఇచ్చాను. నా భక్తుడవై జ్ఞాన ప్రచారం చేస్తున్నావే కానీ ఒక్కసారి కూడా నీవు శిరిడి రాలేదు. నీవు శిరిడి వచ్చి నన్ను దర్శిస్తే నీ భావం ఎలా వుంటుందో చూడాలని ఇప్పుడు రప్పించాను''. అని అదృశ్యులయ్యారు. శ్రీ దత్త భక్తుల దుఃఖం ఇంకా పెరిగిపోయింది. అప్పటికి క్యూలో స్వామి సన్నిధికి చేరారు. స్వామి మరల దర్శనమిచ్చారు. ఇలా వచించారు నాయనా! నేను చాలా సంతోషించాను. నీవు నా భక్తుడవు నీకు ఇప్పుడు వరం ఇస్తున్నాను. భగవంతునియందు ధృడ విశ్వాసము భక్తిని నీకు అనుగ్రహిస్తున్నాను అని మరల అదృశ్యమైనారు. ఆహా! ఇప్పుడు తెలిసింది శ్రీదత్త భక్తులు సాక్షాత్తు కాలభైరవ స్వరూపులని. అందుకే ఇలా పాడారు. ఆహా! ఎంతటి విశేషం. ధన్యులం. స్వామి ధన్యులం.

శ్రీముఖ నామ సం॥ శ్రావణ శుద్ధ చతుర్దశి ఆదివారము ది. 1-8-1993 ఉదయం 8.30 గం॥ ల సమయం. నేను విష్ణు సహస్ర నామములు పారాయణ చేసుకుంటున్నాను. నా శ్రీమతి వంట చేస్తోంది. శ్రీ దత్త భక్తులు అభిషేకం చేస్తున్నారు. ఇంతలో ఒక విచిత్రం జరిగింది.

## శ్రీ మార్కండేయస్వామి జన్మరహస్యం
## శ్రీదత్త దివ్యవాణి

శ్రీ దత్త భక్తులు నా పారాయణను ఆపుచేయుమన్నారు. వెంటనే పారాయణ ఆపుకొని, స్వామివారి దివ్యసందేశానికి ఎదురు చూచాను. నా శ్రీమతి వంటపని ఆపి పరుగున వచ్చి కూర్చుంది. శ్రీవారు ఇలా సెలవిచ్చారు.

''మీకు నేను ఒక రహస్యం చెపుతాను. శ్రద్ధగా ఆలకించండి. ఈ రహస్యం లోగడ ఎవ్వరికి చెప్పలేదు. ఇప్పుడు చెప్పుచున్నాను. వినండి. మార్కండేయునికి 16 సంIIలు ఆయుర్దాయమనియు, దానిని ఈశ్వరుడు మార్పుచేసి చిరంజీవిత్వాన్ని ప్రసాదించారని, యమధర్మరాజు మార్కండేయుని తన కాలపాశంచేత లాగి కడతేర్చడం అనే ధర్మం నిర్వర్తిస్తున్నప్పుడు ఈశ్వరుడు తనను మార్కండేయుడు ఆశ్రయించినందున రక్షించి కర్తవ్య నిర్వహణలోనున్న యమధర్మరాజును అన్యాయంగా శిక్షించాడని అంటున్నారు. ఇది సత్యం కాదు. ఇందులో రహస్యం చెపుతాను వినండి.

యమధర్మరాజు తన కర్తవ్య పాలనలో నిబంధనలను ఉల్లంఘించినందున మాత్రమే యముని తప్పులు దిద్ది సన్మార్గంలో ఉంచడమే ఈ చర్యకు ఆంతర్యం. ఇది ఎట్లో వివరిస్తాను. శ్రద్ధగా వినండి. ఈశ్వరుడు (పరమాత్మ) నిర్ణయించిన విధులను, కర్తవ్యాన్ని నిర్వర్తించడమే యమధర్మరాజు ధర్మము. కాని ఈశ్వరాజ్ఞ పొందకుండా తానంతట తానే స్వతంత్రించి ప్రాణదానం చేయడం యమధర్మరాజు పరిధిలో లేదు. సత్యవంతుని ఆయుర్దాయం తీరింది. యమధర్మరాజు సత్యవంతుని ప్రాణాలను హరించి తీసుకుపోతున్నాడు. ఇది ధర్మ నిర్వహణ, కర్తవ్య పాలనయే. కాని ఏం జరిగింది. సావిత్రి తన పాతివ్రత్య మహిమ చేత యమధర్మరాజును చూడగలిగింది. ఆయనను వెంబడించింది. యమధర్మరాజు ఇరకాటాన పడ్డాడు. వరం కోరుకోమన్నాడు. పతిప్రాణం తప్ప. అత్తగారికి మామగారికి దృష్టిని ప్రసాదింపమని వరం కోరింది. ప్రసాదించాడు. మరల వెంటబడింది. తిరిగి వెళ్ళమన్నాడు. కాని ఆమె తన పట్టుదల వదలలేదు. ఇంకో వరం కోరుకోమన్నాడు. అదికూడా తన భర్త ప్రాణాలు తప్ప. అత్తమామలకు పోయిన రాజ్యం ప్రసాదించమని వరం కోరింది. ఈ వరంకూడా ప్రసాదించాడు యమధర్మరాజు. ఆమె మరల వెంబడించసాగింది. తన పట్టుదల వీడలేదు. అప్పుడు యమధర్మరాజు ''సాధ్వీ! ఇంకొక వరం కోరుకో. అదియు నీ పతి ప్రాణాలు తప్ప'' అన్నాడు. సంతానాన్ని ప్రసాదించమని వరం కోరింది.

ఇచ్చానన్నాడు యమధర్మరాజు. మరల వెంటబడింది. ఇంకా వస్తావెందుకు అన్నారు యమధర్మరాజు. నా భర్త ప్రాణాలను తీసుకువెళుతూ సంతానాన్ని ప్రసాదించానంటే ఎలా కుదురుతుంది అని ప్రశ్నించింది ఆమె. యమధర్మ రాజు ఇరకాటాన పడ్డాడు. సత్యవంతుని ప్రాణాలు ఇచ్చేశాడు. సత్య వంతుడు పునర్జీవితుడైనాడు. ఇందులో యమధర్మరాజు తన కర్తవ్యాన్ని పాలించడంలో తన అధికారాన్ని అతిక్రమించాడు. కాలుడుగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ సత్యవంతుని ప్రాణాలు తిరిగి ఇచ్చి పునర్జీవితుని చేసే అధికారం యమధర్మరాజుకు లేదు. పరమేశ్వరుడైన నా అనుమతి పొందలేదు సరికదా, తన ధర్మాన్ని అతిక్రమించాడు. అందువలన యమధర్మరాజును ధర్మనిర్వహణ తత్పరుని చేయడం కోసమే ఈ మార్కండేయుని ఉపాఖ్యానం జరిపించాను.

మార్కండేయుడు పూర్ణ ఆయుష్కుడే. 16 సం॥ల అల్పాయువు కాదు. కాని మృకండ మహాముని తపస్సు చేయగా నేను పుత్రుని ప్రసాదిస్తూ అల్పాయువుగల భక్తుడు కావలయునా, దీర్ఘాయువుగల దుర్మార్గుడు కావలయునా కోరుకోమన్నాను. అల్పాయుష్కుడైనా, భక్తుడే కావలని కోరుకున్నాడు మృకండుడు. ఆ మిషతో పూర్ణాయుష్కు డైన మార్కండేయుని అల్పాయువుగా ప్రసాదించానేగాని మార్కం డేయుని అల్పాయుష్యం సవరించి పూర్ణాయువునిగా నేను చేయలేదు. యమధర్మరాజును కర్తవ్యయుక్తునిగా చేయుటానికే ఈ సంఘటన ఏర్పరచాను. ఎలా?

మృకండుముని కోరిన ప్రకారం అల్పాయుష్కుడైనా భక్తుడుగా ఉండే పుత్రుని ప్రసాదించడం జరిగింది కదా. పిల్లవాడు పుట్టగానే, యమధర్మరాజు వచ్చి ఆయువు తీరింది తీసుకుపోతానన్నాడు. మృకండ మహర్షి యముని ప్రార్థించాడు: స్వామీ ఇంకా మాకు ముచ్చటే తీరలేదు గదా. అప్పుడే తీసుకుపోతానంటారే. ఇది ధర్మమా అని. యమధర్మరాజు సరే అని వెడలిపోయాడు. మార్కండేయునికి 5 సం॥లు వయస్సు వచ్చింది. యమధర్మరాజు మరల వచ్చాడు. ప్రాణాలు హరించడానికి. మృకండ మహాముని మరల స్తోత్రం చేశాడు. ప్రార్థించాడు. స్వామీ! ఉపనయనమన్నా చేయనీయండి స్వామీ అని. అప్పుడు యమధర్మరాజు మరల వెనుదిరిగి

పోయాడు. ఇలా యమధర్మరాజు కర్తవ్య నిర్వహణకు రావడం, మృకండు మహర్షి స్తోత్రం చేయడం యముడు వెనుదిరిగిపోవడం జరుగుతూనే వచ్చింది. అల్పాయువైనప్పుడు యమధర్మరాజు తన కర్తవ్యం పాలించి మార్కండేయుని ప్రాణాలు హరించి తీసుకుని వెళ్ళవలసియుండగా, ఒకటికి రెండు, మూడుసార్లు రావడం, స్తోత్రం చేయగానే సంతోషించి, తనకు ఆ అధికారం లేకపోయినప్పటికి మార్కండేయుని ఆయువు వృద్ధి చేయుచు వెళ్ళడం జరిగింది. ఇది తన అధికార దుర్వినియోగమే కదా. చివరకు మార్కండేయునికి 16 సం॥లు వయస్సు వచ్చింది. మార్కండేయుడు నన్ను (పరమేశ్వరుని) ఆశ్రయించి ధ్యానసమాధిలో నిమగ్నుడైనాడు. అప్పుడు వచ్చాడు యమధర్మరాజు. కాలపాశంతో నన్నాశ్రయించియున్న మార్కండేయుని ప్రాణాలను హరించడానికి సాహసించాడు.

యమధర్మరాజుకు కనువిప్పు కలిగించుటకే శిక్షించాను. యమధర్మరాజు తన తప్పు తాను తెలుసుకునేటట్లు చేశాను. మార్కండేయుడు, పూర్ణాయుష్కుడే కదా. పూర్ణాయువు పొందాడు.

ఇది రహస్యం అని స్వామి చిరునవ్వు చిందించి అదృశ్యులైనారు. ఆహా! స్వామీ! ధన్యులం శ్రీ దత్త భక్తులద్వారా మాకు ఈ దేవ రహస్యాన్ని వినిపించి మమ్మనుగ్రహించావా తండ్రీ! అని ప్రణమిల్లితిమి.

## గురుస్వరూపము

4-8-93 ఉదయం 5 గం॥ ల సమయం. శ్రీ దత్త భగవానులు వచించిన శ్రీ గురుదేవ దివ్యవాణి. స్వామి ఈ దివ్యవాణిలో గురు స్వరూపాన్ని ఇలా వివరించారు.

''నాయనా! విను. జీవునకు కోట్ల జన్మల పాశాలు బంధించి ఉన్నాయి. వాటిని తెగగొట్ట వలయునన్న అహోరాత్రాలు తపస్సు చేసే కొన్ని వేల జన్మలకు కానీ సిద్ధించదు. మరి, ముక్తి కావలయునన్న, నీవు ప్రస్తుతము చేయు స్వల్ప తపస్సుచేత ఎన్ని జన్మలు కావలయునో ఆలోచించుము. ఈ వాసనా పాశములు ప్రతిక్షణమూ జీవుడేర్పరుచుకొని యున్నాడు. కాన స్వభావమును వీడలేడు.

నేను సదా విమర్శించి తిట్టుచుందును. ఏలననగా, నీవు ఎక్కిన

మెట్లు నేను చూచి ప్రశంసింపను. ఎక్కవలసిన మెట్లుచూచి, నీవు ఎక్కునట్లు ప్రేరేపించుటకు విమర్శతో నిన్ను ప్రోత్సహింతును. ఇదే గురు స్వరూపము.

## సాధన స్వరూపమే గురుస్వరూపము

స్వామి పాదముల వద్ద ఉన్న

1. నాలుగు కుక్కలు – వేదవిహితమైన స్వధర్మము.
2. ఆవు – స్వధర్మ స్వరూపము.
3. ఈ నాలుగు కుక్కలు, గోవు మధ్య స్వామి యున్నందున మన మందరము వేదవిహితమైన స్వధర్మ స్వరూపముతో యుండ వలెననునది సూచించబడుచున్నది.
4. ఇక స్వామి పీతాంబరము ధరించుట – కాషాయ ఉత్తరీయం ధరించుట – జీవుడు భోగభాగ్యములను, వైరాగ్యముతో కూడి అనుభవించవలెననియే భావము. అనగా ఈ భోగభాగ్యములు శాశ్వతమని భావించి వానితో మునిగి తేలరాదనియు. అవి అశాశ్వతములను వైరాగ్యభావముతోనే ఈ భోగభాగ్యములననుభవించవలెనని సూచన.
5. స్వామి చే బూనిన అక్షమాల – కమండలము ఏమి సూచించుచున్నవి? జీవుడు తన శత్రువగు క్రోధమును కమండలములోని జలమును ప్రోక్షించి క్రోధాగ్నిని శాంతింపచేసు కొనవలెననియు, క్రోధము వచ్చినపుడు తమాయించుకొని, మనస్సుతో జపము చేసినచో క్రోధము తొలగిపోవు నను సత్యమును అక్షమాల సూచించుచున్నది.
6. త్రిశూలము - ఢమరుకము :– జీవునకు కామమే గొప్ప శత్రువు. కనుక కామము (కోరికలు) అను ఈ శత్రువును త్రిశూలము చేత సంహరించి, ఢమరుక ధ్వని యనెడి సర్వశాస్త్ర సారమైన వేదాంతశాస్త్ర జ్ఞానమును అవగతము చేసుకొనవలెనని త్రిశూల, ఢమరుకముల అంతరార్థము.
7. శంఖ, చక్రములు ఏమి సూచించుచున్నవి?

జీవుడు లోభమను ప్రచండ శత్రువును చక్రముచే ఛేదించి, శంఖనాదమును నామ గానమును చేయుటయే శంఖ, చక్రములు అందించుచున్న సూచనలు.

8. త్రిముఖములు :- సర్వక్రియలు అను బ్రహ్మయు, సర్వకాలము అను ఈశ్వరుడు, భగవత్పరములైన మహాభక్తియను విష్ణువుతో చేరియుండుయే త్రిముఖముల అంతరార్థము.

9. త్రిశక్తులు :- వాక్కులను సరస్వతియు, చైతన్యవృత్తులను పార్వతియు, వస్తు స్వరూపిణియైన రాజ్యలక్ష్మియగు అన్నమునుండి ఉద్భవించు చున్నది.

ఇట్లు సమస్త వస్తువులు, సమస్తవాక్కులు, సమస్త చైతన్య వృత్తులైన సంకల్పములు భగవత్పరములుగా చేయుటయే త్రిశక్తుల అంతరార్థము.

1. క్రియ 2. శ్రద్ధ 3. కాలము 4. వాక్కు 5. వస్తువులు, 6. మనస్సు-చైతన్యము ఈ ఆరును భగవత్స్వరూపములై యుండుటయే త్రిశక్తి సహిత త్రిమూర్తి స్వరూపము. సాధన స్వరూపము శ్రీ గురు స్వరూపము. అందుకనే సాధన చేయాలి.

6-8-93 సాయంత్రం 7 గంటల సమయం శ్రీవారు అనుగ్రహించిన దివ్యవాణి.

నాయనా! శ్రద్ధగా ఆలకించు

''నా పాదములకు ధూళి సోకకుండా, ముళ్ళు గుచ్చుకోకుండా, రాళ్ళు గుచ్చుకోకుండా నా పాదములను రక్షిస్తూ, సేవిస్తు వున్న పాదుకలు పవిత్రమైనవి. నా పాదుకలే నా ఉత్తమ భక్తులకు ప్రతీకలు. సాత్వికమైన భావములతో నన్ను ఉత్తమగతిగా నమ్మి, సేవించే ఉత్తమ భక్తులే, నా పాదుకలు. నా పాదుకలను అందుకనియే సేవించాలి. నా పాద పద్మములను ఆరాధించుటయే నా పాదుకల పూజ. నా భక్తులను అనగా అహంకారమును త్యజించి, సర్వశ్య శరణాగతిచేసిన సద్భక్తులే నా పాదుకలు.

ఈ జగత్తంతయు చైతన్యము - జడము అను రెండు తత్త్వములు కలిసియున్నవి. శరీరం జడం. జీవుడు చైతన్య స్వరూపుడు. కావున జడచైతన్య స్వరూపుడైన జీవుడు, జడచైతన్య మిశ్రమములైన ఈ జగత్తును దాటుటకు తరించుటకు జడచైతన్యముల సాయము తీసుకొన వలెను. సాధకుడు, సాధన సామాగ్రియు, జడచైతన్యమను రెండు

తత్త్వములు తప్ప వేరొకటి లేదు. జ్ఞాన స్వరూపియగు సరస్వతి చైతన్యము, క్రియాస్వరూపుడగు బ్రహ్మదేవుడు జడము. భక్తి, శ్రద్ధ, సత్యస్వరూపుడైన విష్ణువు చైతన్యము, వస్తు స్వరూపియైన లక్ష్మి జడము. అట్లే మనోవృత్తి కుండలినీ శక్తి స్వరూపిణియైన పార్వతి చైతన్యము. కాల స్వరూపుడైన శివుడు జడము. ఇట్లు ప్రతి జంటయు చైతన్య జడముల మిశ్రమమే.

నేను గోవును అనుకొని యుండుట నాలుగు శునకముల మధ్యలో నిలుచుని యుండుట చతుర్వేదములచే చెప్పబడిన ఆయా వర్ణాశ్రమాచారవిహితమైన స్వధర్మమునే అవలంబించి నా స్వరూపమైన సాధన ఉన్నది. అనగా వేదవిహితమైన స్వధర్మానుష్ఠాన సాధనయే సిద్ధికి మార్గముగాని పరధర్మము కాదు. స్వధర్మమును విడిచిన సాధన సిద్ధించదు. ఇట్లు నన్ను సాధన స్వరూపుడైన సాధన జ్ఞానమైన గురువుగా తెలిసికొనుటయే సాధకులకు అవశ్యకముగాని కేవలము నన్ను కాషాయ పీతాంబర ధారిగా పాదుకలను ధరించి కుక్కలతో గోవుతో త్రిముఖముల తో షడ్భుజములతో భగవత్స్వరూపముగానే భావించి సాధనజ్ఞానములేని వారలు కేవల లక్ష్యమునే చింతించుచూ ప్రయాణ మార్గమును ఆలోచించని వారలే అగుదురు. కావున భగవత్స్వరూపమును ఆరాధించుచు నా గురుస్వరూపము ద్వారా ప్రయాణించువాడే నన్ను చేరగలడు. నేనున్నాని తెలుసుకొనుటయే భగవత్స్వరూపము. నన్ను ఎట్లు చేరవలయునో తెలుపునది గురుస్వరూపము. నాస్తికులను ఆస్తికులుగా మార్చుట భగవత్స్వరూపము. ఆస్తికుని భగవంతుని వద్దకు చేర్చునది గురు స్వరూపము ఇట్లు సాధకుడు భగవంతుడైన నన్ను గురుదత్త స్వరూపమున స్వీకరించిన తరింతును. భగవత్స్వరూపము మహిమలను, అష్టసిద్ధులను ప్రదర్శించి నాస్తికులకు సంశయాత్మకులకు మాత్రమే పరిమితమై యున్నది. భగవంతుడన్నాడను నిశ్చయ జ్ఞానము కలిగిన సాధకులకు ఇట్టి మహిమల ప్రదర్శనము ఇక అవసరములేదు. గురుస్వరూపము భగవంతుని చేరు సాధన. జ్ఞానరహస్యమును బోధించును. ఇట్లు సాధకుడు గురుస్వరూపము యొక్క ప్రాధాన్యతను గుర్తించవలసిన అవసరము ఎంతో ఉన్నది.

సాధకునకు రకరకాల అహంకారములున్నవి. వయో అహంకారమును పోగొట్టుటకు నేను బాల గురువుగా కనిపింతును.

బ్రాహ్మణాది వర్ణాహంకారమును పోగొట్టుటకు నేను ఛండాలునిగాను, సంన్యాసాశ్రమ అహంకారమును పోగొట్టుటకు నేను కాంతలతోగూడి యును, ఏకపత్నివ్రతుని అహంకారమును పోగొట్టుటకు జారునిగను, ఆచారవంతుని అహంకారము పోగొట్టుటకు మద్యపాయిగను, దురాచారునిగను, సాత్వికాహారుని అహంకారమును పోగొట్టుటకు మాంసభక్షకునిగను రూపాహంకారమును పోగొట్టుటకు కురూపిగను, ధనాహంకారము పోగొట్టుటకు బిచ్చగానివలెను జ్ఞాన,అహంకారమును పోగొట్టుటకు ఉన్మత్త మూఢునిగను, వస్త్రాహంకారమును పోగొట్టుటకు దిగంబరునిగాను కన్పింతునే తప్ప సాధకుని దిద్దు లక్ష్యము లేకుండా నా రూపములు అర్థరహితములు కావు. భగవంతుడే ఇట్లుండ, మనమెంత యను బుద్ధితో అహంకారమును పోగొట్టుకొనునట్లు చేయుటయే నా ఉద్దేశ్యము. స్వమతాభిమానాహంకారమును పోగొట్టుటకే అన్యమత వేషంలో కనిపిస్తాను.

## మనస్సు

7-8-93 ఉదయం 5 గంటల సమయం శ్రీ దత్త భగవానులు శ్రీదత్త భక్తులకు మనస్సును గురించి ఇలా వివరించారు ''మనస్సు చాలా ప్రధానమైనది దాని వృత్తులు అనబడే క్రియలను నిరోధిస్తే వాక్కు, శరీరాలు దానిననుసరించే నియమింపబడతాయి. మనస్సు సంసార విషయాలను సదా ఆలోచించి చింతించుట అనేక జన్మలనుండి వచ్చిన అలవాటు. ఎంతో కాలమునుండి మద్యాన్ని తాగే అలవాటు కలవాడు మద్యాన్ని తాగుట మానటం చేయలేనట్లు మనస్సుని నిగ్రహించడం కష్టము. సదా ఆలోచన చేయుటయే దాని చంచలత్వము. సంసారముకన్న ఎంతో రుచికరమైన భగవద్విషయములను ఆలోచించునట్లు చేయుము. మద్యమును తాగువాడు అమృతముతాగే అలవాటు పడినచో మద్యమును విసర్జించునే కాని అమృతము లేకుండా మద్యపానము మానలేదు. త్రాగుటయను క్రియ మానలేడు కాన త్రాగవలసిందే అట్లే మనసు చింతించు క్రియను మానలేదు. మరియు మద్యమును వదలవలయునన్న దానికన్న రుచికరమైన పానీయమును రుచిచూచిన మద్యమును మానునే కాని దానికన్న తక్కువైనది ఇచ్చిన మద్యమును మానలేడు. అట్లు సంసారవిషయములను త్యజించవలయునన్నచో అంతకన్నా రుచికరములైన భగవద్విషయములను మనస్సుకు పట్టించవలయును.

మనస్సు ఇంద్రియములద్వారా సదా స్పదించుచున్నది. కాన దర్శనము, శ్రవణము పలుకుట మొదలగు ఇంద్రియ క్రియలు సదా భగవత్పరములుగా చేయుము. ఇంద్రియములు పనిచేయునపుడు భగవచ్చింత చేయుము.

## అంతరాత్మవేరు - అంతర్యామి వేరు

అంతరాత్మవేరు, అంతర్యామి వేరు. జీవాత్మ, పరమాత్మ ఇరువురూ శరీరములో అంతరాత్మలుగా ఉన్నారు. కాన జీవాత్మ అంతర్యామి కాదు. పరమాత్మ జీవాత్మకు అంతరాత్మగా ఉన్నారు. అంతరాత్మగా ఉన్నంత మాత్రాన అంతర్యామిత్వం రాదు. అంతర్యామిత్వం అనగా శాసించుట. జీవాత్మ శరీరానికి అంతరాత్మగానే యున్నాడు. కాని శరీరమును శాసించగలుగుటలేదు. రక్తప్రసరణమును ఆపగలుగునా? లేక తనకిష్టములేని రోగము వచ్చినపుడు నివారించగలుగుచున్నాడా? శరీరము చేయు చలనాదులు కేవలము జీవుని సహచర్యము మైత్రిచేత వినుచున్నదే తప్ప సేవకునివలె నియమింపబడుట లేదు. కాన అంతరాత్మ అయినంత మాత్రాన అంతర్యామిత్వం ఉన్నట్లు కాదు. అంతరాత్మత్వం చేత జీవుడే అంతర్యామి అని తలచి జీవుడు పరమాత్మయని భ్రమించుచున్నాడు. ఒక గృహములో యజమానియు, అతిధియు ఉన్నారు. గృహములో ఉండుటయను లక్షణము సమానమే అయినా అనగా ఇరువురు అంతరాత్మలే అయినా యజమాని అంతర్యామి కాని అతిధి కాడు గదా. అయితే భక్తియోగం ద్వారా అంతరాత్మయగు జీవుడు అంతర్యామి కాగలడు. శరీరంలో అంతర్యామి అయినచో బాహ్యసృష్టికిని అంతర్యామి కాగలడు. తన శరీర రోగమును నివారించగలవాడు బయట తుఫానుగాలిని శాసించగలడు. అది సిద్ధావస్థ కాన సాధకుడగు జీవుడు అంతరాత్మయే తప్ప అంతర్యామి కాడు.

ఈ బేధమువలనే, శరీర -జీవులకు గల సంబంధమును ఈశ్వర-జగత్తులకు పూర్తిగా ఉన్నదివి చెప్పుటకు వీలులేదు. జీవుడు అవయవియై శరీరావయవములను తన అవయవములుగా కలిగియుండు శేషశేషిన్యాయము, ఈశ్వరజగత్తులందు చెప్పవచ్చును. అట్లే జీవునికి ఫలానుభవార్థమై శరీరమేర్పడుటచేత, ఈశ్వరుడనకును వినోదానంద

భోగమునకై జగత్తు ఏర్పడుటచేత భోక్తృ-భోగోపకరణ న్యాయమూ చెప్ప వచ్చును. కానీ సాహచర్య మైత్రిచే కొద్దిగా వినుచున్న శరీరము నియమింప బడుచున్నదని చెప్ప వీలులేదు. కాన జీవుడు - శరీరములలో నియామ నియామక భావము లేదు. కాని ఈశ్వరుడు పూర్తిగా నియామకుడై జగత్తు పూర్తిగా నియామ్యమగుచున్నది. ఇందువలన పూర్తి పోలిక తీసుకొని రాకూడదు. నా అంశలగు ఆచార్యులు చెప్పినది సరిగా అర్థము చేసుకొనక ఎవరకి ఏది చెప్పినారని విస్మరించి అనుయాయులు వాదించుకొనుచున్నారే తప్ప సమన్వయమునకై ప్రయత్నించుట లేదు.

7-8-93 ఉ॥ 11-30 ని॥లకు శ్రీదత్త ప్రభువులు శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి తన స్వరూపాన్ని ఇలా వివరించారు.

## సృష్ట్యాదిలో బ్రహ్మర్షులు ఉపాసించే దత్త స్వరూపము

మధ్యలో (బ్రహ్మరూపము) బ్రహ్మ ముఖము - ఇరువైపులా విష్ణు రుద్ర ముఖములు. ఊర్ధ్వ హస్తములలో కమండలము. అక్షమాల. మధ్యలో శంఖము. చక్రము, క్రింద త్రిశూల, ఢమరుకములు. కాషాయాంబర ధారి. పీతో త్తరీయ మేఖల; శార్దూల చర్మము ఉత్తరీయము.

## వర్తమాన స్వరూపము

మధ్యలో విష్ణుముఖము- ఇరువైపులా బ్రహ్మ, ఈశ్వర ముఖములు ఊర్ధ్వ హస్తములో శంఖు చక్రములు, మధ్య త్రిశూల ఢమరుకములు క్రింద హస్తములలో కమండలము, అక్షమాల -పీతాంబరధారి -కాషాయ ఉత్తరీయము; శార్దూల చర్మ మేఖల.

## ప్రళయ స్వరూపము

మధ్యలో రుద్రముఖము - ఇరువైపులా బ్రహ్మ, విష్ణు ముఖములు ఊర్ధ్వ హస్తములలో త్రిశూల, ఢమరుకము-మధ్య హస్తములలో కమండలము అక్షమాల. క్రింద హస్తములలో శంఖు చక్రములు-శార్దూల చర్మధారి. కాషాయ వస్త్ర మేఖల-పీత ఉత్తరీయము.

ఆయా కాలములలో మధ్య ముఖము ఊర్ధ్వ హస్తములకు ప్రాధాన్యత. ఇది లోక ప్రసిద్ధము. మధ్యం, ఊర్ధ్వం ప్రధానములు కదా. అందువలన వర్తమాన అవతారములో మధ్య విష్ణు ముఖము. నేను వాసుదేవుడుగా విష్ణు స్వరూపంతో ఆవిర్భవించాను. కనుక వర్తమాన కాలంలో ముక్తి వాసుదేవ స్వరూపం ద్వారానే. ఇందువలననే శ్రీపాద శ్రీ వల్లభుడు ఏక ముఖం, చతుర్భుజములలో వున్నారు. షడ్భుజ రూపాలలో 4 భుజములు విష్ణువు. బ్రహ్మరుద్రులు మిగిలిన రెండు హస్తములలో కూడా వున్నారు.

ఇందువలననే అనసూయ పుత్రుడుగా విష్ణు స్వరూపి దత్తుడనయ్యా, రుద్ర బ్రహ్మ అంశలను నాతో తీసుకున్నాను. జగత్తు స్థితి వున్నంత కాలము మూలవిరాట్టు విష్ణు ముఖంలో వుండటం కారణం. సృష్ట్యాదిలో యున్నది గురు స్వరూపం సృష్ట్యంతములో వున్నది పితృస్వరూపం. ఆ రెండు రూపాలు యోగ్యతను కోరుతాయి అనుగ్రహా నికి కనుక పరమ యోగ్యులైన ఋషులే అనుగ్రహానికి పాత్రులు - మధ్య స్థితిలో అనేక అయోగ్యులతో యున్నందున-మాతృ స్వరూపమైన విష్ణు స్వరూపము - ఈశ్వరుడు పితృస్వరూపుడు. ఆయన యొద్దనున్నది పురుష రూపమైన నంది. వర్తమానములో విష్ణువు-మాతృస్వరూపమైన గోవు వున్నది.

స్వరము గలిగిన రుద్ర నమక త్రిశత నామములతో, స్వరము లేని విష్ణు సహస్ర నామములు సమమై యున్నవి. ఆచార్యులు తమ స్థితి దృష్టిలో యుంచుకొని ఉపదేశములు ఇత్తురేకాని సాధకుని స్థితిని దృష్టిలో యుంచుకొనరు. కనుకనే శ్రీ శంకరాచార్యులు తన స్థితిని బట్టి జీవుడే బ్రహ్మమనెను. సదా అంతర బాహ్య శుద్ధులగు సాధువులు మంత్రము కూడా సదా జపము చేయమనియెదరు. కాని మామూలు సాధకులు

మడితో శుచిగా యున్నప్పుడు మాత్రమే మహా మంత్రమును జపించుము, ఇతర సమయములలో నామస్మరణ మాత్రమే చేయవలెను.

## పూర్ణదత్తోపాసన

శ్రీముఖ నామ సం॥ శ్రావణ సప్తమి 8-8-93 ఉదయం 6 గంటలు శ్రీదత్త భగవానులు పూర్ణదత్తోపాసనను గురించి ఇలా వివరించారు.

''మాతృ దేవోభవ. పితృదేవోభవ. ఆచార్యదేవోభవ'' అని శ్రుతి. మాతృరూప విష్ణువును, పితృస్వరూప శివుని, ఆచార్యరూపబ్రహ్మనే త్రిమూర్త్యాత్మకమే దైవమని చెప్పుచున్నది - జగత్తు స్థితిలో విష్ణు ప్రాధాన్యతచేత మొదట మాతృ రూపము, తరువాత ప్రళయావస్థను సూచించు పితృరూపము, ఆ పైన సృష్టిని సూచించు గురురూపము. జగత్తు స్థితిలో కలిలో యోగ్యతాధికారము చాలా తక్కువ గాన యమనియమముల చేతనే యోగసిద్ధి. ద్వాపరంలో ఆసన ప్రాణాయామములచేతనే యోగసిద్ధి. త్రేతలో ప్రత్యాహార ధారణలున్ననే సిద్ధి. కృతయుగములో ధ్యాన సమాధుల చేతనే సిద్ధి. ఇట్లు కలియుగంలో మాతృవాత్సల్యము చాలా ఎక్కువ కావలసి వచ్చినది. ఈ మాతృరూపంలో పితృ గురు రూపములు లీనమైయున్నవి.

త్రిమూర్త్యాత్మకమయిన, మాతృరూపమైన నారాయణరూపం సత్యనారాయణ నామంతో వుంటాడు. తెల్లని వర్ణం, తన అసలు సత్త్వ గుణం వల్ల. స్థితిలో దుష్టసంహారార్థమై శివుని తమోగుణ నీల వర్ణాన్ని తన పైకి ఆకర్షించుకున్నాడు. ప్రళయం దాకా సంహార కార్యంలేని శివుడు ధ్యానంలో వుండడానికి సత్వగుణ తెల్లని వర్ణమును తన పైకి ఆకర్షించుకున్నాడు. కాన దత్తరూపంలో నారాయణుడు శుక్లవర్ణంతో వుంటాడు. ఆ సత్యనారాయణ స్వామిని సదా ఆరాధించుము విష్ణుసహస్ర

నామములతో. అలానే అసలు మంత్రమైన అఘోరం యొక్క మూర్తియైన కాలాభ్రవర్ణమే శివుని తమోగుణవర్ణం. ఆ కాలరూపుడే సదాశివుడు దత్తమూర్తి. ఆయనకు రుద్రాభిషేకం చేయుము. బ్రహ్మ రజోగుణమూర్తి ఎరుపురంగు. గురు శబ్దార్థము సూర్యుడే కదా. ఎందు వలన? అంధకారమును పోగొట్టుటయే గురుశబ్దార్థము.

అందువల్లనే భర్గః అనుశబ్దము తేజస్సును చెప్పును. అదే బ్రహ్మవర్చస్సు. బుద్ధి ప్రేరకుడైన గురుస్వరూపమే బ్రహ్మదేవుడు. కాన సవిత బ్రహ్మయే. గాయత్రి, సరస్వతియను ఆయన శక్తియె అట్టి బ్రహ్మదేవుని మంత్రమైన గాయత్రితో ఆ ఎరుపురంగుతో నున్న సూర్యుని ప్రాతస్సాయం సమయముల ఆరాధింపుము. ఈ మూడును చేసినచో పూర్ణ దత్తోపాసనమగును. స్వామి హఠాత్తుగా ఇంగ్లీషులో అన్నారు, ''నాకు Part time God మరియు Partnership God కలవారంటే గిట్టదు''. మడికట్టుకొని పూజచేసి ఒక బ్రాహ్మణుడు లేచిపోయి వార్తాపత్రికను చదువుచుండగా చూపి ''చూడు మడి కాలం వరకే నా ఆరాధన. మైలపడగానే సంసార లంపటము. కర్తవ్యమునాచరించ వద్దనడంలేదు. కర్తవ్యములు లేనిచో నా ఆరాధనను సాగించుచుండ వలయును. మైలుపడిన సమయములలో నా నామస్మరణం చేయి. కాలము చాలా ప్రధానము. పోయిన రాదు. వృధా కానీయవద్దు. మీరు మీ సమస్యల భారమును నాపై వుంచుదురు. కాని పూర్ణ విశ్వాసము లేనందున దానికై మరల పురుష కారము చేయుదురు. ఎందుకు? విశ్వాసము పూర్ణముగాలేక పోవుటయే సమస్య. సాధనలో కొంత మీ శక్తి, కొంత నాశక్తి అని తలతురు. ఇదే Partnership God అంటే. ఇది నాకు గిట్టదు''. అన్నారు స్వామి.

శ్రీదత్త శబ్దము మాతృరూపము. ప్రభుదత్త శబ్దము పితృరూపము. గురుదత్త శబ్దము ఆచార్యరూపము. పుణ్యాహవాచనము

చూడుము. తూర్పున బ్రహ్మగురు కలశము. ఉత్తరమున మాతృవిష్ణు కలశము, దక్షిణమున రుద్రపితృ కలశము. దక్షిణకలశోదకము ప్రాక్కలశమున పోసినారు. అంటే తండ్రి గురువు వద్దకుపోయి నా పుత్రుని ఉద్ధరించమని యాచించినారు. గురువు అంగీకరించగా ఆ తర్వాత దక్షిణోత్తర కలశముల ఉదకము కలుపుచూ ప్రాక్కలశమున పోసినారు. అనగా తల్లితండ్రులు కలసి తమ పుత్రుని తెచ్చి గురువునకు సమర్పించినారు. ఈ పుత్రుడే జీవుడు. ఆ తరువాత ప్రాక్కలశోదకముతో పుణ్యాహ మార్జనముచే పవిత్రము చేసినారు. అనగా గురువు ఆ జీవుని జ్ఞానముచే పవిత్రునిచేసి ఉద్ధరించినాడు. ఇదే అంతరార్ధము. ఇక్కడను తిణీ త్రిణోవైదేవాః బ్రహ్మ విష్ణువు శివదేవులని నాస్వరూపమే చెప్పబడుచున్నది. ఆదిత్యం బ్రహ్మేత్యుపాసేత అనునపుడు కూడా సవిత గురుస్వరూపమైన బ్రహ్మయే. బ్రహ్మయే పరబ్రహ్మము. సవిత అనగా ప్రసరించువాడని అర్ధము. అనగా బ్రహ్మయే జగుత్తును సృష్టించు వాడనియే. కాన బ్రహ్మదేవుని తేజస్సే గాయత్రీ మంత్రార్ధము. జిహ్వాయందు వాణిని గలిగి, జ్ఞానోపదేశములచే శిష్యుల బుద్ధులను ప్రేరేపణ చేయువాడు గురువు. అత్రి అనగా త్రిమూర్తులను కానదన్నవాడు. అనగా సృష్టి, స్థితి, లయములు ముగ్గురు చేయుట శృతి చెప్పుటలేదు. ఒక్క మూర్తియే చేయునట్లు ''ఎతోవా ఇమాని'' అని యచ్ఛబ్దము యొక్క ఏకవచనమున్నది. కాన ఆ ఒక్క మూర్తియే కావలయు నన్నవాడు ఏ ఒక మూర్తి మూడు మూర్తులుగా విభజించ బడినదో ఆ ఒక్క మూర్తియే మరల శ్రీ దత్త మూర్తిగా కనబడినాడు. మాతృమూర్తి ఐహికముల నిచ్చును. పితృమూర్తి అణిమాదిసిద్ధులను ఆచార్యత్వము కీర్తిని ఇచ్చును. గురుమూర్తి కైవల్యమునిచ్చును. అని వివరించారు.

శ్రీముఖ నామ సం॥ శ్రావణ బహుళ అష్టమి శ్రీకృష్ణాష్టమి 9-8-93 ఉదయం 6 గం॥ల సమయము.

## రాసక్రీడ

శ్రీదత్త భగవానులు శ్రీదత్త భక్తులకు రాసక్రీడా రహస్యమును ఇలా వివరించారు:

''కృష్ణావతారంలో రాసక్రీడాలోలుడిగా వుండటంలో అనేక సంకల్పములున్నాయి. నన్ను నేను మాయలో గాఢంగా కప్పుకుంటాను. నా నిజమయిన భక్తులే నన్ను గుర్తించగలుగుదురు. ఎందువల ననగా నన్ను మాయతో గాఢంగా కప్పుకుంటాను గనుక ఆ మాయ గాఢమైనది కాకున్నచో ప్రతివారును గుర్తించుదురు. అప్పుడు పరీక్ష లేకుండా పోవును. ఆ గాఢ మాయయే నా రాసలీల. మరియు ఋషులే గోపికలు. వారి పురుషాహంకారమును పోగొట్టుకొని నేనే పురుషుడనని గుర్తించి జీవులందరు ప్రకృతి రూపులైన స్త్రీలేనని తెలిసి స్త్రీ రూపమున వచ్చినారు.

నేను సృష్టించిన కామక్రోధాదులన్నియు నా ప్రాప్తికి సహకరించునవియే. జీవుడు అజ్ఞానమున స్వార్థక్షణిక సుఖములకు తన అసత్యమైన అహంకారమునకు వాటిని సాధనలుగ చేయుచున్నాడు. వైరాగ్యము అను గంగానది, సరస్వతియను జ్ఞాననదితో చేరినపుడు, భక్తియను యమునగా మారును. వైరాగ్యము+జ్ఞానము = భక్తి. కామమును సంహరించి సంసారమునుండి మరలించిన శివుని సన్నిహిత యైన తెల్లని గంగ, కామ కాలుష్యమైన నల్లని వర్ణము లేకున్నది. ఇదే వైరాగ్యము. ఋషులు తపస్సుచే కామమును సంసారపరము కాకుండా నిగ్రహించి నారు. ఆ కామ భావము యుగ యుగముల నుండి దాచబడినది. వారు దానిని దుర్వినియోగము కాకుండా దాచినారే తప్ప, దానిని సద్వినియోగం చేయలేదు. యోగం ద్వారా శక్తిని దాచి నీలో ఉంచుకొనడానికి కాదు. దానిని నాకు సమర్పణం చేయాలి.

ఈ వైరాగ్యము చేత దాచబడి, సంసార కామం విడిచిన సత్త్వ గుణమే గంగ, ఆ నిర్మల ధవళ వర్ణము గంగకు, శివునకు ఉండుట అదే.

దానియందు రజోగుణ బ్రహ్మ జ్ఞానముతో నిగూఢమైన సరస్వతి చేరగా, దానిని పరమాత్మపరం చేయబడినది. అప్పుడా భావనది తిరిగి కారువర్ణంతో నల్లగా మారి దాని అర్పణంతో నల్లబడిన కృష్ణునికి సమర్పితమై యమున ఒడ్డున రాసలీల సాగింది. కామంలేని తెల్లని గంగ కామ కలుష నల్లని వర్ణంతో పరమాత్మ సమర్పితమై యమునగా మారుటకు మధ్యలో సరస్వతియను జ్ఞాననది సంగమంచేత జరిగినది. ఈ యమునా నదియే తమోగుణమై భగవదర్పితమైనది. ఇట్లు యుగయుగముల నుండి దాచబడిన కామభావమును నాకు ఒక్కసారిగా సమర్పించ బడుటయే రాసక్రీడలోని భావతీవ్రత. కామమనగా నా నామరూపాకర్షణ, భావతీవ్రతయే. అదే జీవులలో ఒకరి నామరూపాల కోసం మరొకరికి ఆ భావతీవ్రత కలుగుచున్నప్పుడు అది దుర్వినియోగమవుతున్నది. కాన బ్రహ్మచర్యం ద్వారా శక్తిని దాచి ఆ శక్తిని భగవంతునికి అదే ఆకర్షణ రూపంలో సమర్పించుటయే రాసక్రీడ ,గోపికలందరు స్త్రీలు కాదు. జీవులు. కృష్ణుడు పురుషుడు కాదు. గుణమైన పరబ్రహ్మమైన నేను. ఈ విధంగా షడ్గుణాలు నా ఆరాధన కోసం సృజించబడినవే .

యదువును అనుగ్రహింపదలచి యదువంశాన్ని ఉద్ధరించడానికే నేను వాసుదేవుడిగా అవతరించాను. అందుకే కృష్ణావతారం విష్ణువు దశావతారములలో లేదు. అది పరిపూర్ణతముడైన నా అవతారము. అందులో గీతోపదేశం ద్వారా నా గురుదత్త స్వరూపము,అనేక లీలల ద్వారా నా యోగ సిద్ధుల ప్రదర్శనము, జారచోరత్వాదుల చేత నా తత్త్వమును దాచుకొనుటయు, నా లక్షణములే '' అని వచించారు.

## షడ్భావములు

షడ్భావములు తన సాధనకు సహకారులుగానే సృష్టించబడినవని స్వామి ఇలా వివరణ ఇచ్చారు :

''నా నామరూప శరీరంపై ఆకర్షణ కామము. నేను అనుగ్రహించ లేదని ఎసువుతో నా పై అలుకవహించుటయే క్రోధము. కాలాన్ని శక్తిని

సంసారానికి దుర్వ్యయం చేయకుండా కాపాడుకొనుటయే లోభం. నా వాడనను నిర్భయతయే మదము. సదా నా చింతయే మోహము. నా దైవత్వమును, నా భక్తుల స్థితిని చూచి స్పర్ధతో సాధన చేయుటయే మాత్సర్యము. ఇట్లు షడ్భావములు నా సాధన సహకారులగనే సృష్టించ బడినవి''. అని వచించారు.

## మాయ

ఇక ''మాయ''ను గూర్చి స్వామి ఇలా వివరించారు :

'' అవతరించునప్పుడు ప్రకృతియు నన్నంటి వుండును. కాన మిమ్ములను దగ్గరగా చేరుదును. అయితే ఆ ప్రకృతి నన్ను కప్పి మీరు గుర్తించనట్లు చేయును. రామావతారములో ఏ మహిమలను ప్రదర్శింపక పోవుటయే కప్పిన మాయ. కృష్ణావతారములో చూపిన మహిమలకు విరుగుడుగా జార చోర త్వాది దుర్గుణములే మాయగా వున్నవి. మాయారహితమయిన పూర్ణమహిమతో కూడినది కేవలం అత్రి అనసూయల చేరిన నేనొక్కడినే''. అని వచించారు.

## కైవల్యము

కైవల్యము గూర్చి ఇలా వచించారు స్వామి :

''కైవల్యము అనేక విధములు. జీవుడు నాలో కైవల్యమునొంది తన శరీరమును విసర్జించును. ఇది విదేహ కైవల్యము. ఒక్కొక్కరు శరీరంతో నాలో లీనమవుతారు. ఇదే సదేహమైన సద్యోమోక్షము. అలానే అవతారాలలో కూడా జీవుడు మాత్రమే నేనుగా వుండి శరీరము ప్రకృతి మయమైనప్పుడు ఆ శరీరము ప్రకృతి నియమాల ననుసరిస్తూ నశిస్తుంది. ఈ అవతారాలే నరులకు సన్నిహితములు కాగలుగుతాయి. అలాకాక శరీరాలు తైజసంతో ఉండేవి నిత్యము ఉండగలిగేవీ దేవతా రూపాలు. ఇవి ప్రళయంలో నశిస్తాయి.

ధర్మము నాచరించుటవలన లోకము శాంతముగా సాగుతుంది. దానివలన సాధనకూడా చక్కగా సాగుతుంది. ఒక్కొక్కసారి

అధర్మాచరణ అత్యుత్కటమై లోకకంటకమై సాధకుల సాధనకు బాధాకరంగా వుంటుంది. అట్టివారికి కర్మఫలములు కాలక్రమంలో అనుభవించేటంత వ్యవధి వుండదు. కాన వెంటనే అనుభవించి ఇతరులకు క్రమశిక్షణ కలిగించుట కొరకు కర్మఫలప్రదాతను నేనేనని సూచించుటకు భక్తులకు దర్శన, స్పర్శన, సంభాషణవముల నెనుగ్రహించుటకు అవతరిస్తాను. కాన ధర్మాచరణం చేత సాధనకు బాహ్యవాతావరణము శాంతమై సహకరిస్తుంది. కాన ధర్మశాస్త్రము వేదాంత శాస్త్రముయొక్క బాహ్యసాధన వాతావరణమునకు సంబంధించినది''.

## అహంకారము నశించాలి అప్పుడే ముక్తి

''కృష్ణావతారంలో నా పాదాలు వ్యత్యస్తంగా వుంచి రాసక్రీడ వేణు గానం చేశాను. ఎడమపాదం, కుడిపాదాన్ని దాటి కుడివేపునకు వచ్చింది. కుడిభాగం పురుషునికి, ఎడమభాగం స్త్రీ ప్రతీకలు. ఋషులు పురుషాహంకారమును వీడి స్త్రీలయి నన్ను ఆరాధిస్తున్నదియే రాసక్రీడ. తక్కువస్థాయి అనుకొనుచున్న స్త్రీ స్థానం పురుషస్థానాన్ని దాటి ప్రాధాన్యత వహించింది. అంటే అహంకారము నశించింది. అప్పుడే ముక్తి. అహంకారము ఏ రూపంలో ఉన్నా, అది ముక్తికి అడ్డు. కులాహంకారము, ధనాహంకారము, వయోహంకారము, లింగాహంకారము, రూపాహంకారము, జ్ఞానాహంకారము, ఆచారాహంకారము, కళాహంకారము - ఇలా అహంకారము అన్ని రూపాల్లో నశించినప్పుడే పూర్ణ సత్వం. పూర్ణసత్వం రానిదే ముక్తియొక్క బయట వాకిలియు తెరువబడదు''.

## ఆహారవిహారాలు

ఆహార విహారాల ఔచిత్యాన్ని స్వామి మరల మరల నొక్కి వక్కాణిస్తున్నారు :

''వాతం శరీరాన్ని, శ్లేష్మం వాక్కును, పైత్యం మనస్సును రోగంలోకి దించి ఆరాధనకు అడ్డు కలుగచేస్తాయి. కనుక వాయువును

పుట్టించు ఆహారములను తగ్గించవలెను. గడ్డకూరలు, పప్పులు వాయువును పుట్టించును. శీతలమైనవి, మధురమైనవి శ్లేష్మకారకములు. ఇక తైలాది పదార్థములు అజీర్తిని కలిగించి పిత్తాశయమును మందగింపజేయును. వికటించు పదార్థములు కూడా పైత్యరసమును ఎక్కువ కలిగించును. వర్షాకాలమందు విహారము పనికిరాదు. ఇట్లు ఆహార విహారములను నియమించుకొనవలెను. సరిగా నిద్రలేనిచో మనసు నిర్మలంగా యుండదు. కాన సాధకుడు ఋతువుల కాల ప్రభావమును గమనించి ఆహార, విహారమందును నియమములను పాటించవలెను ఇది చాలా ముఖ్యమన్నారు స్వామి.

## కర్మఫలము

కర్మఫలములను అనుభవించుచో ఒక కర్మఫలము ముప్పాతిక అనుభవించిన తర్వాత చేసిన దైవారాధన వల్ల ఆ మిగిలిన పాతిక భాగము మరుజన్మమునకు జరుపబడును. ఇట్లు జీవుడు ప్రారబ్ధము వలన జన్మనెత్తినపుడు వాని సంచితములో కొన్ని కర్మఫలముల శేషములు కూడా, పూర్ణకర్మ ఫలితముతో చేరి ఉండును.

రాక్షసులు క్రోధముతో నన్ను సదా స్మరించిననూ అది ద్వేష భావముతో కూడినదగుట చేత భక్తికాదు. వారు క్రోధము ద్వారా తరించలేరు. చనువుతో ప్రేమతో కోపగించుట సత్యభామ చేసినది. ఆమె కోపమే సాధనకు సహకారి కాని రాక్షసుల కోపము కాదు.

## ఐశ్వర్యము

14-8-93 మధ్యాహ్నం 12 గంటలకు ఐశ్వర్యము యొక్క ప్రయోజనమును స్వామి ఇలా వివరించారు:

"కొంచెము సమయము పనిచేసినా శరీరయాత్ర జరిగిపోయే స్థితిని కల్పించినపుడు కూడా, మిగతా సమయంలో దైవారాధన చేయకుండా, లౌకిక కర్మలలోనే మునిగినవాడు మరుజన్మలో సమయ

మంతా శ్రమిస్తే కాని శరీరయాత్ర జరగని దరిద్రుడుగా పుట్టుచున్నాడు. అలాకాక ఆ కాస్తసేపు కూడా దైవారాధన చేస్తే బాగుండును గదా! కర్తవ్యం అడ్డు వచ్చినదేయని బాధపడేవాడు అన్న పాన వస్త్రాదుల లోటు లేకుండా పుడతాడు. అది తెలుసుకొని వాడా జన్మలో సమయము అంతయు దైవారాధనకే వినియోగించాలి.

ఇక శ్రీమంతుడుగా పుట్టినవాడు ఎవడనగా, ఒక శ్రీమంతుని సహాయము వలన తన కర్తవ్యములను వదలి సమయమంతా దైవారాధన చేసినవాడు. అట్టివాడు మరల శ్రీమంతునిగా పుట్టినపుడు వాడు మరల పదిమంది సాధకులకు సాయము చేయవలెను.

ఐశ్వర్యము ఇట్లు పరమార్ధ సాధనయే ప్రయోజనముగ కల్గినది. కాని పుత్రాదులకు మూటకట్టి ఇచ్చుటకు కాదు. దాని ప్రయోజనము గుర్తించి పరమార్ధ సాధనముకు ఉపయోగించినవాని పుత్రాదులు దైవానుగ్రహముచే వృద్ధిలోనే వుందురు''. అని వచించారు.

## గృహస్థాశ్రమ ధర్మము

గృహస్థాశ్రమములో చేయవలసిన ధర్మమును స్వామి చక్కగా వివరించారు:

''సాధకుడు ఏ రూపమును ధ్యానించవలెనని తర్కించరాదు. అన్ని రూపాలూ నావే. ఏ రూపం అని కాదు. నీలోని భక్తి ఎంత అనేదే చూడాలి. భక్తి అంటే ఎంతమాత్రం సంసారంనుండి నావైపుకు తిరిగినావనేదే ముఖ్యము. బంగారు పాత్రలో 1/4 శేరు పాలిచ్చిన దానికన్నా, మట్టి పాత్రలో శేరుపాలు ఇస్తే, తాగినవాడు తృప్తినొందును. అలానే ఏ రూపాన్ని ఆరాధించావనేది కాదు. ఎంతభక్తిని వృద్ధి చేసుకున్నావనేదే ప్రధానము. అలానే ఆరాధనా విధానము ఏదనేది కాదు ముఖ్యం. భక్తి ఎంత అనేది ముఖ్యం. ఏ ద్రోవను పోయినా చేరేది నన్ను మాత్రమే. జపతపాలు చేసేవాండ్లు భజనను ఎగతాళి చేస్తారు. భజన చేసేవాండ్లు జపతపాలకు చిక్కడంటారు. భక్తి అనేది సవృద్ధిగాయుంటే జపతపాల కైనా చిక్కుతాడు భజనకైనా చిక్కుతాడు. అది లేకపోతే ఏ మార్గానికి చిక్కడు.

అనేక రూపాల నారాధించినా, అనేక మార్గ విధానాలలో ఆరాధించినా భక్తియొక్క ప్రమాణమే ముఖ్యము. ఒకే రూపాన్ని ఒకే మార్గంలోకానీ అనేక మార్గాలలో కాని ఆరాధించవచ్చును. అలానే అనేక రూపాలను ఒకే మార్గంలోను ఆరాధించవచ్చు. ఎవరి ఇష్టమును అనుసరించి, వీలును బట్టి ఘలువునుబట్టి యుంటుంది. ఈ భక్తియే యోగము కూడా. ధ్యాతల్లో ఉన్నలోపం సవరించుకోకుండా, ధ్యేయంయొక్క రూపాల గురించి, జ్ఞాన మార్గముల గురించి చర్చించుట నిష్ఫలము. ధ్యాత సంసార విషయములనుండి నా వైపుకు తిరగటం అనే భక్తి యోగమే ప్రధానంగా ఆలోచించుకొన వలెను. కర్మలు చేస్తూ, మనస్సును నా వైపుకి ఉంచుట చాలా కష్టము. అది కేవలము సిద్ధులకే చేతనగును. సాధకుడు మితంగా కర్మలను కేవలం కర్తవ్యముల వరకే చేసి మిగతా సమయమును నాకు అర్పణము చేయవలెను. ఉదా॥ వంటచేయుట, వడ్డించుట నీ కర్తవ్యములు. ఆ రెండు మనస్సును ఆ పనులపై నిలిపి సక్రమంగా చేయుము. ఆ పనులు చేయుచూ మనస్సును నాపై ఉంచినచో ఆ పనులు చెడిపోవచ్చును గదా. మనస్సును నాపై ఉంచి కర్మలను చేయుట నీకు చేతకాదు కదా! కాని కర్తవ్యక్రియలను పూర్తిగా మనస్సు ఉంచియే చేయుము. ఆ తరువాత విషయముల సంగమును లౌకిక వ్యక్తుల సంసర్గమును దూరముగా పరిహరించి సమయమంతా నా ఆరాధనకే వినియోగించుము. కాన మనస్సును కేంద్రీకరించి, కర్తవ్యములను ఆచరించుచూ, విశ్రాంతి తీసుకొనుచూ మిగిలిన సమయమునంతా విషయములకు దూరముగా నుండి వాటి ప్రభావమును తప్పించుకొనుచు నా ఆరాధనలో మగ్నమగుటయే గృహస్థాశ్రమమునందు చేయవలసిన ధర్మము.

## సాధనసిద్ధి

15-8-93 ఉదయం 5 గంటలకు సాధన సిద్ధి ఇచ్చుటనే అని

శెలవిచ్చారు స్వామి :

"దేవతా రూపములన్నియును నాలోని భాగములే. ఒక నగరములో పేటలెట్లో అలానే ఏ రూపంలో నిలిచినా నాలో నిలిచినట్లే. ఏ పేటలో ఉన్నా ఆ నగరంలో ఉన్నట్లేగదా. కాన ముందు నగరమును

చేరు ప్రయాణమును గుర్తించవలయును. అదే సాధన. దానికే రూపములకు సంబంధములేదు. ఆ నగరమునకు అన్ని దిక్కులనుండి దోవలున్నవి. నీవే దిక్కున ఉన్నావో ఆ దిక్కునుండి వచ్చుదోవలో నగరమునకు రమ్ము. అది నీకు అనుకూలము. అంటే నీ కులాశ్రమములకు తగిన మార్గమున నీ పూర్వులు నడచిన బాటలో రమ్ము. ఇతర మార్గములను హేళన చేయకుము. చతుర్వర్ణములకు చతురాశ్రమములకును దోవలున్నవి. మరణమునకును,ముక్తికిని సంబంధమే లేదు. బ్రతికి యున్నప్పుడు ఏమి సాధించినావో మరణానంతరము అదే పొందగలవు. బ్రతికియుండగనే శివత్వము యొక్క అంశను పొందినవాడే మరణానంతరము కైలాసమును చేరినవాడగును. కాన సాధనయు, సిద్ధియు ఇచ్చటనే. మరణము కేవలము నిద్రవంటిది. మరణానంతరము మరలయాతనా శరీరముతో కర్మఫలములను అనుభవించు జీవుడు సంసారమున వున్నట్లే.

జగత్తు అంతర్ధానము బ్రతికియున్నప్పుడు కాకున్నచో మరణానంతరము కాదు. ప్రళయావస్థలో ముక్తుడైన వానికే జగదంతర్ధానము జరుగును. జగత్తు ఉన్నంతకాలము ముక్తుడయిన జీవుడును పరమాత్మ సాక్షిగా వినోదించు స్థితిలో ఉండును.

నిర్గుణ బ్రహ్మస్థితిని పొందిననూ ఈశ్వరస్థితిలో యున్నట్లే బ్రహ్మమే ఈశ్వరుడు, ఈశ్వరుడే బ్రహ్మము. ఏలనన జగత్తు సృష్టి స్థితి లయముల మూడింటిలోనూ ఈశ్వరునికి అభావమే అయ్యును వినోదార్థము దృశ్యమగుచున్నది. మేల్కొని కలగాంచువాడు ఈశ్వరుడు. జాగరూకత ఈశ్వరునికి ఉన్నది కాన కలవంటి జగత్తును తన సంకల్పములచేత సృష్టిస్థితి లయములను జరుపుచు సత్యకాముడును సత్యసంకల్పుడై జగత్తు స్థితిలో ఈశత్వ వశిత్వములను కల్గియున్నాడు. ఆ కలలో దృశ్యమానుడయి బద్ధుడై వినోదమునిచ్చు దృశ్యరూపుడే

జీవుడు. మేల్కొని కలగనువాడును, అసలు కలలేనివాడును ఇరువురును ఒక్కటియే గదా! ఏలనన ఇరువురికిని ఆ కల అభావమే గదా! ఆ అభావ జ్ఞానము ప్రతిక్షణమును మేల్కొని కలగను వానికిని వున్నది. కలగననివాడు నిర్గుణ బ్రహ్మము. మేల్కొని కలగనువాడు ఈశ్వరుడు. కలలో బద్ధుడై దృశ్య రూపుడయి కలను చూచువాడు జీవుడు. బ్రహ్మము అనగా ఈశ్వరుడు. ద్రష్ట అనగా సాక్షియై ఈశత్వ వశిత్వములను కల్గియున్నాడు. కాన సాధన ద్వారా జీవించియుండగనే ముక్తిని సిద్ధిని పొందవలయును. జీవన్ముక్తియే నిజమైన ముక్తి. మరణానంతరము ఫలానుభవమే తప్ప సాధన చేయు వీలు కాదు. సాధన యొక్క అవస్థను సిద్ధి సూచించును. విశ్వరూప ప్రదర్శనమే పూర్ణసిద్ధి. అట్టి సిద్ధిని నేను ఎప్పుడయినను, ఎవరికయినను చూపించగలుగుచున్నాను. కాన నేను పూర్ణ సిద్ధుడను. కాన నాకు సాధన అవసరము లేదు.

సిద్ధి అంశలు మాత్రమే వచ్చినచో ఆ జీవుడు సాధనలో కూడా అంశ మాత్రముగనే ఉన్నట్లు. కాన ఇంకను సాధన చేయవలయునే తప్ప పూర్ణ సిద్ధుడు కాడు. సత్యకామ, సత్యసంకల్పములు జగత్తుయొక్క సృష్టి స్థితిలయములకు వర్తించినప్పుడే పూర్ణసిద్ధి. కేవలము కొన్ని మహిమలు వచ్చినంత మాత్రమున పూర్ణసిద్ధి కాదు. అది అంశసిద్ధియే కాన సాధకుడు ఆ సిద్ధుల ప్రదర్శన భ్రమలోపడి పూర్ణసిద్ధుడనని తలచి సాధనచేయక ఆగిపోకుండా సాధనను సాగించవలెను. అని వచించారు.

విశ్వరూపమే విశ్వము. దానిని చూపించుటకు ముందు అదిలేదు . కాన దానిని చూపించు ప్రారంభక్షణమే సృష్టి. దానిని కొంతకాలము ధరించి చూపించుటయే స్థితి. దానిని ఉపసంహరించిన మరుక్షణమే ప్రళయము. ఇట్లు విశ్వము యొక్క సృష్టి, స్థితి, లయ ప్రదర్శనమే నా పూర్ణసిద్ధి.

## కామదహన రహస్యము

23-9-93 గురువారము ఉదయము 5 గం॥ల సమయం శ్రీదత్తవాణి . స్వామి కామదహన రహస్యము ఇలా వివరించారు.

''నాయనా! శ్రద్ధగా విను. ఈశ్వరుని కామదహనం కూడా సాధనను ఉపదేశించే అంతరార్థమే. పార్వతియను మాయ, దేహమే శాశ్వతమని నమ్మకమును తమోగుణాజ్ఞానంతో, ఆ సౌందర్యాహంకార రజోగుణంతో ఈశ్వరుడను సాధకుడగు జీవుని సమీపించింది. అనగా రాజస, తామస మాయ, సాధక జీవుని ఆకర్షించును. అనగా సాధకుని రాజస తామస వ్యక్తులు చేరి సంసారము వైపునకు ఆకర్షింతురు. అట్టి రాజస, తామస సంసారమునందు కోరికయే మన్మధుడు. ఆ కోరిక వెంట నుండు శ్రద్ధయే రతీదేవి. ఈ ముగ్గురును చేరి జీవుని సంసారమునకు ఆకర్షించుదురు.

ఇట్టి తరుణంలో జ్ఞాన స్వరూపుడును, అగ్నిస్వరూపుడను మూల శక్తియునగు శ్రీగురుదత్తుడను జ్ఞాన నేత్రము ఆ జీవునికి తోడై ఆ కామమును దహించును. అప్పుడా పార్వతి తొలగిపోవును. రతియును నిరాధార యైపోవును. సాధకజీవుడు కామదహనముచేసి నైష్క్యమ్యమును సాధించుటకు జ్ఞానాగ్ని రూపుడగు శ్రీగురుదత్తుడే కావలయును. క్రిందనున్న రెండు నేత్రాలు కూడా సూర్య చంద్ర తేజోరూపములైననూ చాలవు. క్రింది రెండు నేత్రములే బ్రహ్మ సరస్వతులు - లక్ష్మి విష్ణువులు పార్వతీ పరమేశ్వరులు. ఆ రెండు నేత్రములు పార్వతియందు ఆసక్తములగును. అనగా ఈ జంటలు ఐహికములను ప్రసాదించుచు సంసారమున సంబంధమున జీవుని తగులుకొనునట్లు చేయుదురు.

అగ్నియే సూర్యచంద్రుల తేజస్సులకు కారణము. అలానే శ్రీ దత్తుడే ఆ పైజంటలకు కారణమై ఊర్ధ్వస్థానమున ఉన్నాడు. ఆయన ఆజ్ఞాచక్రమున - అనగా నామరూప స్థానమున వున్నాడు. సహస్రారమున నిర్గుణముగానున్న పరమాత్మయే నామరూపములతో గూడి జ్ఞానాగ్ని స్వరూపుడై ఆజ్ఞా స్థానమున శ్రీ గురుదత్త రూపనామముల ఉన్నాడు. ఆయన సాయముచేతనే సంసారమునందలి కోరికలు దహింపబడి నైష్క్యమ్యము సిద్ధించును. ఆయన క్రిందనున్న జంటలు జ్ఞానాగ్ని

రూపులైనను, ఐహిక ప్రదాతలై, నైష్కర్మ్యమును ప్రసాదించరు. ఆయన శుద్ధసత్త్వమైపైన వున్నాడు. క్రింద రజస్తమోగుణ సంబంధముతో సంసారబంధమున ఆ జంటలున్నారు. కావున రజస్తమో గుణ సంబంధమైన సంసారమున ఈ రజస్తమోగుణ దేవతల ఆనుకూల్యము వలన ఐహిక ప్రాప్తి కలుగును. రజస్సు సూర్యుడై పురుష రూపమున, తమస్సు చంద్రుడై స్త్రీ రూపమున ఆ దేవతలలోనున్నారు. క్రియయే రజోగుణము. సంసారమే తమస్సు.

ఇదంతయు హిమవన్నగమున జరిగినది. హిమము చంద్రుని యందుండును. అనగా మనస్సు చంద్రుడు కాన, ఇదంతయు మనస్సునందు సాధకునకు జరుగు విశేషమే. ఆ తరువాత, పార్వతి దేహాభిమాన గర్వములను, రజస్తమో గుణములను వీడి, తపస్సుచేత సాత్త్వికయైనది. అట్టి పార్వతియందు జీవుడగు శివుడు ఆసక్తుడైనాడు. అపుడు తిరిగి రతీ మన్మథులు తోడైనారు. సాత్త్వికులనగా దైవమునందు ఆసక్తులైన భక్తులు. అనగా సంసారాసక్తులైన జీవులను విడచి, దైవసక్తులగు భక్తులందు సాంగత్యమును పెంచుకొనవలయును. అపుడా సాధక జీవుడు కైలాసమను సహస్రారమున పరమేశ్వర రూపమునుపొంది అధిష్టించును. భ్రూమధ్య – అజ్ఞాచక్ర – శ్రీగురు నందు సదా దృష్టినుంచుటయే భ్రూమధ్య దృష్టి. ఇదే యోగ దృష్టి అనబడును''.

ది. 23-9-93 గురువారము మధ్యాహ్నం 12.00 గంటలకు భోజన సమయంలో శ్రీదత్త భక్తులను శ్రీ నృసింహ సరస్వతి స్వామి ఆవహించి భిక్ష స్వీకరించిన మహిమ క్లుప్తంగా వివరిస్తాను. మనం పఠించి తరించెదముగాక!

ఆనాడు శ్రీదత్త భక్తులు ఉదయం 9 గంటలకు పూజకు ఉపక్రమించారు. 11.30 అయింది. ఇంకా పూజ జరుగుతూనే వుంది. ''స్వామీ! మీరు త్వరగా వెళ్ళాలి అని అన్నారుగదా. ఇప్పటికే టైము 11.30

అయింది. మీరు ఆరగించిన తర్వాత మిగిలినవాళ్ళకు వినియోగం జరగాలి గదా! భోజనానికి లేవండి'' అన్నాను. అప్పుడు దత్త భక్తుల నేత్రములు ఎఱ్ఱబారినై. ''నాతో అట్లా లింకు పెట్టుకోకండి. నివేదన అయినది గదా. ఆఫీసులకు వెళ్ళే వాళ్ళకు వడ్డించి పంపండి'' అంటూ పూజ ముగించారు. వారికి వడ్డించకుండా వినియోగం చేస్తే శేషాన్ని వారికి పెట్టడం అవుతుందని మా దంపతుల భయం. శ్రీ దత్త భక్తులకు వడ్డించాము. ఆరగిస్తున్నారు. ఇంతలో నా శ్రీమతి అడిగింది. ''స్వామీ! ఈ రోజు భగవానుడు ఏ రూపంలో భిక్ష స్వీకరిస్తున్నారు'' అని. శ్రీ దత్త భక్తులు ఇలా వచించారు. '' ఈరోజు శ్రీ నృసింహసరస్వతి వారే ఆవహించారు. వీళ్ళు నాకు అన్నం పెడుతున్నానని అనుకుంటున్నారు. వెర్రి వాళ్ళు. నేను కావాలనే వాళ్ళ వెంటబడి వాళ్ళ పాపాలను భిక్షరూపంలో స్వీకరిస్తున్నాను. వాళ్ళను పాపాలనుండి ఉద్ధరిస్తున్నాను''. అన్నారు. ఇంతలో భవాని (నాశ్రీమతి) అన్నం వడ్డించింది. అప్పుడు స్వామి ఇలా వచించారు. '' ఏమి ఆ తొందర. అంత త్వరగా పాపాలను ప్రక్షాళన చేసుకొని మోక్షం పొందాలనా ఆదుర్దా. తొందర పడవద్దు''. అని వచించారు, శ్రీ నృసింహసరస్వతి గురుదేవులు.

ఆహా! స్వామీ ! ఎంతటి కృపాళువువయ్యా! మేము పరమాణువులము. మమ్మనుగ్రహించ సంకల్పించావా తండ్రీ! మాజన్మ తరించింది. ధన్యులమయ్యా! మమ్ము సదా కాపాడవయ్యా! మమ్ము అనుగ్రహించవయ్యా అని ప్రార్థించాము.

## పూర్ణసిద్ధి

ఇక ''పూర్ణసిద్ధి'' ఇలా వివరించారు స్వామి. ''నాయనా! విను.

విశ్వరూపమే విశ్వము. దానిని చూపించుటకు ముందు అదిలేదు. కాన దానిని చూపించు ప్రారంభక్షణమే సృష్టి. దానిని కొంతకాలము ధరించి చూపించుటయే స్థితి. దానిని ఉపసంహరించిన మరుక్షణమే ప్రళయము. ఇట్లు విశ్వముయొక్క సృష్టిస్థితిలయ ప్రదర్శనమే నా పూర్ణసిద్ధి'' అని వచించారు స్వామి.

## చతుర్వేదములు

శ్రీ ముఖనామ సం॥ ది. 25-9-93 తేదీన ఉదయం 4 గంటలకు శ్రీదత్త ప్రభువులు సాక్షాత్కరించి శ్రీదత్త భక్తులతో చతుర్వేదముల అంతరార్థము ఇలా వివరించారు. "నాయనా శ్రద్ధగా విను. చతుర్వేదములు వాక్కు యొక్క నాలుగు రూపములే. యజుర్వేదము వాక్యము. ఋగ్వేదము పద్యము. అథర్వణ వేదము మానసిక జపము. సామవేదము గీతము. నన్ను ఈ నాలుగు విధములుగా ముఖముతో స్తుతించవలయును అనునదియే బ్రహ్మదేవుని నాలుగు ముఖములు.

బ్రాహ్మణుడనగా బ్రహ్మజ్ఞానమును పూర్ణముగా పొందిన సిద్ధుడు. క్షత్రియుడనగా ఆధ్యాత్మిక సాధనలో వచ్చు అడ్డంకులను గెలిచి సిద్ధివైపు ప్రయాణించు సాధకుడు. ఈ ఇరువురు ఆధ్యాత్మికులు కాన ఉత్తములు. ఇక వైశ్యుడన "విట్" అనగా నరుడు. అర్థార్థియై ఇహ పరములను కావలయునను మధ్యముడు. శూద్రుడనగా కేవలం ఐహిక సుఖములనే కోరుకొనువాడు. ఈ విధముగా నాలుగు వర్ణముల అంత రార్థమే తప్ప వర్ణము జన్మను బట్టి నిర్ణయించరాదు" అని వివరించారు.

మనస్సు యొక్క వైవిధ్య ప్రీతి తత్వాన్ని స్వామి ఇలా వివరించారు.

"నన్ను స్తుతించుటలో ఒకే విధమైన వాక్కు రూపము కన్నా, నాలుగు విధములుగా స్తుతించుట నాకు ప్రీతి. ఒకే అన్నమును పెట్టిన రుచించునా? నాలుగు రకముల పదార్థము లున్ననే ప్రీతికరము గదా. ఇంతేకాక, నీ మనస్సు కూడా ఒకే అవస్థలోనున్న వాక్కుతో ఎక్కువ కాలము స్తుతించగా, విసుగుచెందును. మనస్సునకు వైవిధ్య ప్రీతి కలదు. కాన సహస్ర రుద్రాభిషేకము కన్నా నాలుగు రకముల వాక్కుతో శివునారాధించుము.

తర్వాత "స్వామి "దాసభక్తి" ని ఇలా వివరించారు. నంది, హనుమంతుడు, గరుత్మంతుడు మొదలగు రూపములలో భక్తులు

నన్నారంధించుటను గమనించుము. వారికి జంతు శరీరములేల? నేను మనవాకృతిలోనున్నాను. కాన ఆ అకారముకన్నా తక్కువస్థాయిగల పశు జంతు పక్షి రూపములనే ఆశ్రయించిరే గాని, నా రూపములో నుండుటకు ఇష్టపడని వారి భక్తిని గమనించుము. అనగా నాతో సమానాసన స్థితిని వారు కోరక దాసభక్తిని నిరూపించిరి. అదే విధముగా వేదములు కూడా కుక్కల రూపములోనూ, ధర్మదేవత గోరూపంలోనూ నన్ను ఆశ్రయించినవి. కుక్కకున్న విశ్వాసము ఏ ప్రాణికిని లేదు. కాన కుక్కపై నాకు ప్రత్యేకాభిమానము కలదు'' అన్నారు స్వామి.

## కోరికలను త్రుంచుము

''కోరికలను త్రుంచుము. ఐహికములను, అష్ట సిద్ధులను, చివరకు మోక్షము కూడా కోరకుము. మోక్షము కూడా పురుషార్థమే. దుఃఖమునుండి నివృత్తియే మోక్షము. కాన అదియును స్వార్థమైన కోరికయే. ఏ కోరికయు లేక, ఎవరు కేవలము నా ఆరాధన ఆనందము నాశింతురో వారే నా నిజమైన భక్తులు'' అన్నారు స్వామి.

## ''ధ్యాత, ధ్యానము, ధ్యేయము''

శ్రీ దత్త ప్రభువులు ఇలా వివరించారు :

''జీవుడు షడ్గుణ స్వరూపుడు. సంసారము త్రిగుణ స్వరూపము. కాన ఇరువురి తత్త్వమొకటియే. గుణాతీతుడైన నేను వేరు తత్త్వము. కాన ధ్యాతయు, ధ్యానము గుణ స్వరూపమే. ధ్యేయము గుణాతీతము. అందువల్లనే జీవుని సూచించు చూపుడువేలు సదా త్రిగుణములను సూచించు సృష్టి ప్రతీకలగు మధ్యమ, అనామిక, కనిష్ఠికలతో చేరి, ఒకే తత్త్వమై ఉండును. భిన్న తత్వమగు అంగుష్టమైన నేను, ఈ నాలుగు వేళ్ళకన్నా వేరుగా ఉండును. జ్ఞానముద్రలో జీవుడు సంసారమును పరిత్యజించి, అనగా గుణతత్త్వమును విడిచి నన్ను చేరుటయే చిన్ముద్ర. అది సిద్ధావస్థను సూచించును.

గుణము క్రియయే, సర్వసృష్టియు క్రియయే. నిశ్చలమైన వస్తువులో కూడా అణువులు స్పందించి పరమాణువులు భ్రమించుచున్నవి. కాన క్రియా రూపమే సర్వ సృష్టియు జ్ఞానము కూడా క్రియయే. నిష్క్రియుడు జీవునకు అసాధ్యుడు. తుదకు శ్వాసాదులను యోగము ద్వారా ఆపిననూ శరీరములోని అణు పరమాణు స్పందన భ్రమణ క్రియల నాపలేడు.

యోగ స్థిరమైన మనస్సు కూడా చిచ్ఛక్తియే. శక్తి తరంగముల రూపంలో చలించుచున్నది. ఆలోచన చేత తరంగములు దీర్ఘములగునే తప్ప, తరంగ స్వభావము ఎన్నటికిని అణిగిపోదు. కాన యోగ నిశ్చల మనము కూడా క్రియాత్మకమే. చిద్రూపుడు అగు జీవుడు కూడా క్రియయే కాన నేను ఒక్కడనే నిష్క్రియుడను. జీవుడు సృష్టియును కర్మ రూపమే. నైష్కర్మ్య మనగా నా తత్త్వమే. నిర్గుణమే నిష్క్రియము అనురాగావేశరూపమైన భక్తియు, శక్తిరూపమే కాన క్రియయే అగుచున్నది. కాన సాధకుడు, సాధనయు అంతయును కర్మ స్వరూపమే.

నైష్కర్మ్య సిద్ధియనగా నన్ను పొందుటయే. నైష్కామ్య సిద్ధిలేనిదే నైష్కర్మ్యము అసంభవము. నైష్కామ్యము సిద్ధిస్తే 99 పాళ్ళు నైష్కర్మ్యము పూర్తిగా సిద్ధించినట్లే. ఎందుకనగా నైష్కామ్యము కోరికకు సంబంధించినది. కోరిక చైతన్య లక్షణము. చైతన్యము సృష్టిలో చాలా సూక్ష్మమైన బలవత్తమ శక్తి. ఆ చిచ్ఛక్తి క్రియయగు కోరికయు బలవత్తమ క్రియయె. బలవత్తమమగు క్రియను త్యజించకుండా నైష్కర్మ్య మెట్లు లభించును? కాన నైష్కామ్యసిద్ధియే నైర్కర్మ్యసిద్ధి. అది సిద్ధించినచో కేవల జడముల క్రియలను త్యజించుట చాలా తేలిక కాన, దాదాపు నైష్కర్మ్యసిద్ధి వచ్చినట్లే.

సంన్యాసమనగా నైష్కామ్యమే. కామ్యకర్మ త్యాగమే, సంన్యాసము. కర్మయనగా నా ఆరాధనము. ఆ ఆరాధనముకు ఫలమను కోరికతో

సంబంధము పెట్టకుండుటయే కర్మ యొక్క ఫలత్యాగము. అంతేకాని కర్మ త్యాగము కాదు. ఫలమే కోరిక. కాన కోరికలను త్యజించు నైష్కర్మ్యమే సంన్యాసము కాని కర్మత్యాగము సంన్యాసము కాదు'' అని వచించారు శ్రీదత్త భగవానులు.

26-9-93 ఉదయం 5 గంటల సమయం శ్రీదత్తప్రభువులు ఇలా వచించారు.

నిర్గుణం అంటే దుర్గుణాలు లేనివాడని, ఎవరి గుణములు చెప్పుటకు వీలుకావో ఆయన నిర్గుణుడని అంటారు. ఈ నిర్వచనాలు, నేను గుణంగా అవతరించినప్పుడు నిజమే అయినా, నా నిర్గుణావస్థకు అర్థము గుణములకు అతీతుడనియే. గుణమనగా సృష్టి. ఎందుకు? గుణము ద్రవ్యమును ఆశ్రయించి ఉన్నది. అలానే సృష్టి నన్నాశ్రయించి యున్నది దానికి స్వయంసత్తాలేదు. అట్లు అన్యాశ్రయుడను నేను కాను. నేను స్వాశ్రయుడను. కాన సృష్టిని కాను. సృష్టికర్తను. కాన నేను గుణము కాదు. కావుననే నిర్గుణుడను.

అయితే భక్తుల ధ్యాన సౌకర్యార్థము నేను గుణంగానూ మారుతాను. ఆ గుణం నేనే. ఈ విధంగా నేను గుణమూ నిర్గుణమూ రెండూ ఒకే సమయంలో అయి వుండగలను. అది నా సర్వశక్తికి సాధ్యము. మీ బుద్ధులకు అందనిది, మీ బుద్ధులకు అందునదియే గుణము. నేను గుణముగా ఉన్నప్పుడును అనగా అవతారములలో నా తత్త్వ లీలలను మీరు అర్థం చేసుకొనగలరా? లేదు. కాన గుణముగా ఉన్నప్పుడును నేను నా నిర్గుణ స్థితిని విడనాడలేదు. కాన అద్వైత మతమూ, ద్వైత విశిష్టాద్వైతములూ రెండునూ సత్యములే.

సాధన పండుచున్నప్పుడు అద్వైతము కళగా, అంశగా, పూర్ణముగా కొంత సమయము వచ్చుచుండును. దీనినే ఆవేశమందురు.

ఇది సాధన పంటకు వచ్చినట్లు గుర్తు. కానీ, అలాంటి సమయాలలో అహంకారం, కోరికలు రాకుండా చూసుకోవాలి. ఈరెండు పంటలకు పట్టు చీడపురుగులు. శాశ్వతాద్వైతం, రానిదే సిద్ధి పూర్తికాదు.

సాధన ఆరాధనలో వుండవలెను. ఎట్లు సదా వస్త్రముతో వుండునో అట్లే నా ఆరాధనలో వుండవలెను. సమయమునుబట్టి వస్త్రము మారవచ్చు కానీ వస్త్ర హీనముగా ఉండనట్లే ఆరాధనా విధానము మారవచ్చును కాని ఆరాధనా రహితముగా వుండరాదు. మడిలో పట్టు బట్టతో, మైలలో, లుంగీతో, బయటకు పోవునప్పుడు చొక్కా ధోవతితో వుండునట్లు సమయానుకూలమైన ఆరాధనా విధానములు మార్చ వలయునే కాని ఆరాధనా రహితముగా వుండరాదు. అనగా ఒకసారి జపము ఒకసారి భజన, ఒకసారి పూజ, ఒకసారి గ్రంధ పఠనము, ఒకసారి సత్సంగము. ఇట్లు మారవలెను.

నీకు అవసరమైన అన్న, పాన, వస్త్రముల నిత్తును కాన అడుగ పనిలేదు. అనవసరమైన అంతకు మించినవి అడుగరాదు. కాన అడుగవద్దు అడుగవలసిన దేదియును లేదు.

కోరికను పూర్తిగా తుంచుము. ఆరాధనా విధానములు మార్చవల యునే గాని ఆరాధనా రహితముగా యుండరాదు.

శ్రీ గురు దత్తునకు జయము జయము.



శ్రీ గురుదత్త ఓం జై గురుదత్త

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము - 7

### శ్రీదత్త భక్తులకు విచిత్రానుభవము

దిం. 24-9-93 శుక్రవారంనాడు ఒక వింత జరిగింది. శ్రీదత్త ప్రభువు శ్రీదత్త భక్తులకు విచిత్రానుభవం కలిగించారట.

ఏ జీవికైన అతి భయంకరమైన విషయం మృత్యువు -మృత్యుభయం. ఈ విషయమే స్వామి ముచ్చటించుచూ శ్రీదత్త భక్తునితో నవ్వుచూ ఇలా అన్నారట- " ఎందుకురా ఇలా భయపడతావు. మృత్యువు వచ్చినపుడు ఎలా వుంటుందో నీకు ప్రత్యక్షంగా చూపుతాను చూడు" అంటూ శ్రీగురుడు దత్తభక్తులకు ఆ అనుభవం ప్రత్యక్షంగా ఇచ్చారట. ఎలా ఉందీ అన్నారట.

నడివయస్సు స్థూలకాయుడు చిన్న వాళ్ళకు సరిపోయే బనీనును తాను ధరించి, అది శరీరానికి గట్టిగా బిగుసుకొని పట్టుకున్నప్పుడు, అతడు రెండు చేతులనుపయోగించి ఆ బనీనును గట్టిగా పైకి లాగి వేసినపుడు ఎలా వుంటుందో అంతే అలా ఉన్నదట. అప్పుడు జరిగినదేమంటే శ్రీగురుని సౌంజ్ఞచే శ్రీ దత్తభక్తుని శరీరంలోనుండి జీవుడు బయటికి రావడం-శరీరం పడిపోవడం-అప్పుడు ఈ అనుభవం కలగడం జరిగిందట. అప్పుడు స్వామి చెప్పారట. ఇంతే మృత్యువంటే ఏమీ భయపడ నవసరంలేదు. ఏదో భయంకరమైన బాధ ఏమీ వుండదు అన్నారట.

తర్వాత స్వామి వివరించారట. అసలు విషయం ఏమిటంటే- ఆ మృత్యువు ఆసన్నమైనప్పుడు భగవంతుడు ఆ జీవునికి జ్ఞానం ప్రసాదిస్తాడు. దానిని చావు తెలివి అంటారు. జ్ఞానం వలన ఆ జీవునికి రెండు విషయాలు స్పష్టంగా తెలుస్తవి.

1. తాను జీవితంలో ఎంతో కష్టపడి సంపాదించి, తన సుఖాలు కూడా లెక్క చేయకుండా తనవాళ్ళేనని తనను ప్రేమించే ఆత్మీయులేనని, వాళ్ళులేక తాను, తానులేక వాళ్ళు జీవించలేరని అతి వ్యామోహంతో యున్న భార్యా,పిల్లలు ఎవ్వరు ఆ మృత్యుసమయంలో ఏమీ ఆదుకోలేక పోవడం, తాను అనగా ఈ జీవుడు నాది నాది అనుకున్న శరీరం నాది కాదని తెలుసుకోవడం, ఈ బంధువర్గాన్ని, ఆస్తులను ఈ శరీరాన్ని వదలి వెళ్ళక తప్పక పోవడం కనిపిస్తుంది.

2. ఆ సమయంలో తనను ఉద్ధరించగలవాడు భగవంతుడేనని స్పృహ కలుగుతుంది. కాని తను ఆ భగవంతుని గురించి ఏమియు సేవ చేయలేదే. ఉద్ధరించగలవానిని విడిచిపుచ్చి, యే సహాయము చేయలేని వాళ్ళను ఆశ్రయించి మోసపోయితినే-అయ్యో- ఇప్పుడు భగవత్సేవ చేయడానికి సమయంలేదే- బ్రతికి ఉన్నంతకాలం భగవత్సేవ చేయక వృధా చేశానే ఇప్పుడు ఎవరు నాకు దిక్కు అని విలపిస్తాడు.

ఇది నిజమైన మృత్యుభయం అంటే. కనుక జీవించి వున్నప్పుడు జీవన్ముక్తి సంపాదించాలి. చనిపోయిన తర్వాత ఏమీ సాధించలేవు.

ప్రారబ్ధము, సంచితము, ఆగామి-తెలుసుకో-అంటే ఏమిటో.

ఒక జీవుడు తన జన్మజన్మాంతరములలో శుభాశుభములు (పాప పుణ్యములు) 100 చేశాడనుకో. వీటి ఫలితములు నరక స్వర్గములలో కొంత అనుభవిస్తాడు అంటే ఒక 60 అనుభవించాడు అనుకో ఇంకా కర్మఫలం 40 వున్నదిగదా మళ్ళా జన్మ ఎత్తినపుడు 61వ కర్మఫలంతో క్రొత్తజన్మ ప్రారంభమవుతుంది. అదే ప్రారబ్ధం అంటే.

ఇంకా 39 వున్నాయిగదా- ఆ మూటే సంచితము అంటే.

ఈ క్రొత్త జన్మలో ఈ 39 అనుభవిస్తూ వుంటాడు. మరల ఈ క్రొత్త జన్మలో చేసిన కర్మ ఫలాలు వున్నవిగదా. ఇవి 101 నుండి ప్రారంభమవుతాయన్నమాట. ఇవే ఆగామి అంటాం. (వచ్చే జన్మకు కారణం కనుక).

### హెచ్చరిక

కాలము, శక్తిని దుర్వినియోగం చేయకు. ఈ మానవజన్మ దుర్లభం-సదా సద్వినియోగం చేసుకోవాలి-అని స్వామి హెచ్చరించారు.

ది. 27-9-93 మధ్యాహ్నం 12.30 ని॥లకు శ్రీదత్త భక్తులకు వీరభద్రస్వామి సాక్షాత్కారము. అద్భుత సంఘటన.

ఈరోజు చాలా పవిత్రమైనది మా జీవితంలో. నేను నా శ్రీమతి దీక్షలో యున్నాము. మా గురుదేవులు అనుగ్రహించిన మంత్రరాజము ఈ రోజుతో లక్ష పూర్తి కావలసియున్నది. కాని నేను నా శ్రీమతి ఏమనుకున్నామంటే నాకు ఇంకా 19000 కొరవ ఉన్నది, నీకైతే 6000 మాత్రమే కనుక ఇవాళ సగం,రేపు సగం చేద్దాము. ఎందుకంటే శ్రీ దత్త భక్తులు ఈ రోజు పరబ్రహ్మశాస్త్రిగారి ఇంటికి ఆతిధ్యానికి వెళ్తున్నారు గదా. రేపు వస్తారు. రేపటికి లక్ష పూర్తిచేసి వారికి ఆపోసన వేసుకుందామని అనుకున్నాం. శ్రీ దత్త భక్తులు శ్రీ పరబ్రహ్మశాస్త్రి గారి ఆహ్వానం మేరకు వారి యింటికి వెళ్ళారు. అప్పుడు ఉ. 9-30 గంటలైంది. కాని వారి ఇంట్లో ఇబ్బంది రావడం వలన తిరిగి వచ్చేశారు. అప్పుడు నేను జపం చేసుకుంటున్నాను. శ్రీదత్త భక్తులు స్వంత పనులవలన త్వరగా భోజనంచేసి బయటకు వెళ్ళాలని చెప్పారు. కాని అప్పటికి నా శ్రీమతి వంట మొదలు పెట్టనేలేదు. వెంటనే ఆమె "స్వామీ! ఏమీ ఆలస్యం లేదు. మీరు పూజచేసుకోండి. ఇదిగో క్షణంలో వడ్డిస్తాను" అని, వెంటనే నేనన్నాను, "స్వామీ! మీరైతే లఘువుగా పూజ ముగించగలరు. కనుక ఈరోజు పూజ మీరు చేసి తీర్థం ఇవ్వండి" అని ప్రార్థించాను. స్వామి సరే అన్నారు. స్వామి పూజ చేస్తున్నారు. నేను జపం చేసుకుంటున్నాను. శ్రీ దత్త భక్తులు రావడం వల్ల నా శ్రీమతి తాను చేయవలసిన 6000 జపం చేసి లక్ష పూర్తి చేసింది. కాని నాకు పూర్తి కాలేదు. అందువలననే ఇంకా జపం చేస్తున్నాను.

ఇంతలో శ్రీదత్త భక్తులు పూజ ముగించారు. నా శ్రీమతి వంట ముగించి నివేదనకు సమకూర్చింది. నాకు ఇంకా జపం కొద్దిగా మిగిలి ఉంది. అందువలన నేను కూడా లక్ష పూర్తి చేయుటకు జపం చేస్తూనే ఉన్నాను. శ్రీ దత్త భక్తులకు ఆమె వడ్డించింది. ఇక ఆపోసన వేసు కోవడమే ఆలస్యం. ఆమె అన్నది. ''మీరు ఆపోసన వేస్తారా నన్ను వేసుకోమంటారా?'' అని. ''ప్రతిసారి నేను వేసుకొంటున్నాను గదా! ఈ సారి నీవు వేసుకో'' అన్నాను. ఆమె ఆపోసన వేసుకున్నది. నేను కళ్ళు మూసుకొని ఇంకా జపం చేస్తూనే ఉన్నాను. అప్పుడు నా శ్రీమతి అన్నది ''మిగతా జపం రేపు చేసుకోవచ్చు. స్వామితో మాట్లాడండి'' అని. కాని నేను జపం పూర్తి చేసుకునే ప్రయత్నమే చేస్తున్నాను. ఇంతలో ఒక విచిత్రం జరిగింది. శ్రీ దత్త భక్తులను శ్రీ వీరభద్రస్వామివారు పూర్తిగా ఆవహించి భిక్ష స్వీకరిస్తున్నారు. నేను మాత్రం జపం పూర్తి చేయడానికి కళ్ళుమూసు కొని జపం చేస్తూనే ఉన్నాను. అప్పుడు శ్రీ దత్తభక్తులను ఆవహించియున్న శ్రీ వీరభద్రస్వామి నవ్వుకున్నారు. స్వామి ఇలా వచించారు. '' ఏమిటి నేను ఎదురుగా ప్రత్యక్షంగా వస్తే, కళ్లుమూసుకొని ధ్యానం చేస్తాడేమిటి? ఆమెను వరం కోరుకోమంటే ఆమె అంతే ఏ వరం కోరుకోలేదు ఆయన ఇప్పటికి నేను ఎదురుగా ఉన్నా నన్ను గమనించక, ఇంకా ధ్యానంలో ఉన్నాడు'' అని వచించి చిరునవ్వు చిందించారు. నా శ్రీమతి అన్నది ''స్వామీ మీరు నవ్వుతున్నారు ఎందుకో చెప్పరా?'' అని. అప్పుడు శ్రీదత్త భక్తులు వివరించారు. '' ఎవరికోసం మీరు ధ్యానం చేస్తున్నారో అట్టి పరమేశ్వరుడే సాక్షాత్తు ఎదురుగా కూర్చుని భిక్షస్వీకరిస్తుంటే, గమనించక కళ్ళు మూసుకొని ఇంకా జపంచేస్తాడేమిటి వీడు'' అని వీరభద్రస్వామివారు నవ్వుతున్నారు అని. సరిగా ఆ సమయానికి నాకు జపం లక్ష పూర్తి అయింది. వెంటనే నేను కళ్ళు తెరచి ''స్వామీ క్షమించండి. నా తప్పు తెలుసుకున్నాను. మానవమాత్రుని

గదా! తప్పులు చేయుట సహజం గదా. సర్వాంతర్యామివి నీకు తెలియనిదేమున్నది. మా తప్పులు మన్నించి మమ్మనుగ్రహించవయ్యా'' అని ప్రణమిల్లాము. స్వామి అనుగ్రహించారు.

## శ్రీ వీరభద్రస్వామి వారి సందేశం

శ్రీ వీరభద్రస్వామి ఇలా వచించారు. ''నాయనా! విను. రామాయణంలో సీతాదేవి బంగారులేడి మీద వ్యామోహపడటం. భగవంతుడైన రాముని ఆ లేడిని తెచ్చిపెట్టమని సీతాదేవి కోరడం - అంటే జీవుడు విషయాసక్తుడై భగవంతుని పరికరముగా ఉపయోగించుకొనుట వలన పాపంచేసి తర్వాత ఆ పాప ఫలితాన్ని అనుభవించడంకోసం శ్రీరాముడు ఆమెను అగ్ని ప్రవేశం చేయించి శుద్ధ పరచడం జరిగింది. ఇక్కడ సీతాదేవి తన తప్పును తెలుసుకోలేదు. శ్రీరాముడే అగ్ని ప్రవేశం చేయించి శుద్ధ పరచారు'' అని వివరించారు.

శ్రీ వీరభద్రస్వామి శివపురాణం ఉటంకిస్తూ సతీదేవి, తండ్రి యజ్ఞానికి వెళ్ళడానికి పట్టుబట్టి భర్తనే దూరం చేసుకున్నదని, దక్ష యజ్ఞంలో ఆమె పరాభవం పొందినపుడు ఆమె తన తప్పును తానే తెలుసుకుందని, వెంటనే తానే అగ్నిని సృష్టించుకొని ఆత్మార్పణం చేసుకున్నదని'' వచించి మమ్మనుగ్రహించి అదృశ్య మైనారు. ఆహా! ధన్యులం. ఇది ఈరోజు విశేషం. ఈరోజు సోమవారం గదా.

మరునాడు మంగళవారం 28-9-93

ఈరోజు శ్రీదత్త భక్తులు బయటనుండి ఉ. 9.30 గం॥లకు ఫోను చేసి ''నేను ఈరోజు మీ యింటికి భోజనానికి వస్తానని'' చెప్పారు.

ఆహా! ఎంతటి అదృష్టం. అని మేము పూజ పూర్తిచేసుకొని, వంట సిద్ధం చేసుకొని వారి కొరకు ఎదురు చూస్తున్నాము. ఈరోజు మంగళవారం గదా శ్రీ ఆంజనేయస్వామివారి ప్రీతిగా ఆపోసన వేసుకుందా మని మా సంకల్పం.

శ్రీదత్త భక్తులు వస్తూనే, నిన్నరాత్రి నుంచి శ్రీ ఆంజనేయ

స్వామి వారు నన్ను పూర్తిగా ఆవహించి ఉన్నారు. నేను ఈరోజు బయట ఎక్కడా భోజనం చేయకుండా ఇక్కడకు రప్పించారు స్వామి. నేను త్వరగా బయటకు వెళ్ళవలసిన పనివుంది. త్వరగా వడ్డించండి. భోజనం చేసి వెళ్తాను''. అన్నారు.

అనటమే ఆలస్యం. నా శ్రీమతి వెంటనే వడ్డించింది. మేమిరు వురము శ్రీ ఆంజనేయస్వామి వారి ప్రీతికి ఆపోసన వేసుకున్నాము. అప్పుడు స్వామి ఇలా అన్నారు. ''నాకు అప్పాలు అంటే ఇష్టం గదా'' అని కాని మేము అప్పాలు చేయలేదు కదా. వడ్డించలేక పోయినాము. వెంటనే నా శ్రీమతి ఒక్క 3 నిమిషాలంటే 3 నిమిషాలలో అప్పాలు చేసి తీసుకొని వచ్చి వడ్డించింది. నేను ఆశ్చర్యపోయాను. ఆహా! ఒక్క క్షణంలో ఎలా చేసింది అని''. ఆమె ధన్యురాలు. శ్రీవారి సేవ చేసుకుంది. స్వామి చాలా సంతోషించారు. స్వామి మరల ఇలా వచించారు. ''అరటిపండు కూడా నాకిష్టమేనని'' వెంటనే నా శ్రీమతి స్వామికి అరటిపండు కూడా వడ్డించింది నేను ప్రక్కనేయుండి శ్రీస్వామి వారికి తేనె ప్రీతికరం కదా అంటూ తేనె వడ్డించాను. స్వామి అన్నారు - '' ఈ రోజు శ్రీ హనుమంతుల వారి ఆగమనమునకు ఇదే సూచన. తెలిసిందా? అన్నారు స్వామి. జ్ఞాని, కర్మయోగి, భక్తుడు అయిన శ్రీ ఆంజనేయస్వామి ఇలా జ్ఞాన బోధామృతాన్ని అందించారు.

''నాయనా ! విను జ్ఞానమంటే ఏమిటి? భగవంతుని జ్ఞానము - ఎవ్వరికి తెలియని వస్తువు. భగవంతుని చేరుమార్గము తెలుసుకొనుట యే జ్ఞానము.

కర్మ అంటే ఏమి? నిష్కామ్యంగా చేసిన పనియె కర్మ. నిష్కామ కర్మ వలన నైష్కర్మసిద్ధి.

యోగం అంటే ఏమి? కాలము, శక్తి, ఐహిక విషయములందు వృథాచేయక, భగవంతునియందు లగ్నం చేయడమే యోగము.

భక్తి అంటే ఏమి? త్రాగుబోతువాడు తాగుడు కొరకు పడే

వ్యసనం ఎంత తీవ్రమో - అంత తీవ్రంగా భగవదారాధన చేయడం భక్తి.

జ్ఞానము, కర్మ, యోగము, భక్తి - అవసరము అని వచించి అదృశ్యమైనారు స్వామి. మమ్ము ధన్యులను చేశారు.

28-9-93 సాయంత్రం 6 గంటల సమయం శ్రీవారు ఇలా వివరించారు:

''మడి అనగా సత్సంగము. మైల అనగా దుస్సంగము. దుష్టుల దర్శన, స్పర్శ, భాషణములు, వారి ద్రవ్యము తినుటయు, బుద్ధిని కలుషితము చేయుచున్నవి. వారి గుణములు మనలో ఆక్రమించును. అటువంటివారు ఇష్టులైనను పరిహరించుము. ఎక్కువమందితో పరిచయము కీర్తి అని భావించరాదు. కీర్తి మోక్షసాధనముకాదు. అందుకే ఋషులు కీర్తిని పరిహరించి గుహలలో తపస్సు చేసి వున్నారు. కాన సద్భక్తులను క్రొద్ధిమందియైనను ఎన్నుకొని వారితో అతి పరిచయము సాధించుకొన్న ఉద్ధరింపబడగలవు. అట్టివారి ఇంట గంజి అయినను త్రాగుము. ఆ గంజిద్వారా వారి సద్భక్తి నీలోకి ప్రవహించును. లౌకికుల పంచభక్ష్య పరమాన్నములన్నియు విషమువలె నిన్ను మాయలోనికి ఆకర్షించును.

రాత్రియందు మొదటి యామార్ధమున శయనించుము. (8.గం) తిరిగి మూడవ యామార్ధమున లెమ్ము. (4-గం ఉదయం) దీనితో 8గం.లు నిద్ర. అనగా మూడవవంతు నిద్రపోయిన, మిగిలిన 16.గం॥ (రెండు భాగములు) కర్తవ్యములు పోను మిగిలిని సమయమునదైవము నారాధించుము. ఈ నిద్రాసమయము తగ్గినచో ప్రాతఃకాలమున బద్ధకముండును. ఆ తగ్గిన నిద్రాసమయమును పగలు నిద్రించి సరిచేసుకొన్ననూ ప్రాతఃకాల పూజాభంగము కలిగించు బద్ధకము పోదు కాన, పగలు నిద్ర అనవసరము. కాన నిద్రించరాదు.

''నదివాస్వపేత్'' అట్లే రాత్రి లఘుభోజనము చేసిన ప్రాతఃకాలమున మనస్సు శుద్ధముగ నుండును ఏలనన పులితేనుపులు వచ్చినచో మనస్సు శుద్ధముగ ఉండదు. శరీరారోగ్యము వలన మనశ్శుద్ధి

కలుగును. ఇట్లు నిద్ర, ఆహార విహారములు ఆచరించుటలో జాగరూకత కలిగి వుండటమే యోగ ప్రథమ లక్షణము. ఇదే యమ, నియమముల విషయము. పునాదిలేని సౌధము నిలువదు.

## మానవుడు చంచల మనస్కుడు

మానవుడు తమస్సులో ఉండి వెలుగునకు తీసుకుపొమ్మని నన్ను ప్రార్థించి వేధించును. నేను తీసుకొని పోవుటకు ప్రారంభించగా, తన చీకటి విడువలేక నాకు ఐహిక భంగమాయెనని విలపించును. ఇట్లు మానవుడు తనకు కావలసిన దానిని గురించి నిశ్చయములేక చంచలుడై యున్నాడు.

ఆరాధనమున నిష్కామము చాలా ప్రధానము. నిష్కామారాధనమునకు అనంతఫలము. నేనిచ్చుటకు ''కుచేలుడు'' దృష్టాంతము, ప్రహ్లాదుడును నన్నేమియు యాచించలేదు. తిన్నడును నన్నేమియు అడుగలేదు. కోరికలతో తపించి వరములు కోరిన వారందరును చివరకు పతనము చెందిరి.

కష్టములు నా అనుగ్రహము వలన కలుగును. అవి శుద్ధిచేసి జ్ఞానమును,వైరాగ్యమును ప్రసాదించు సాధనములు. సుఖములు నా ఆగ్రహమువలన కలుగును. వాటిచే మత్తుడై పతనము చెందును. సుఖములలో కూడా జ్ఞానవైరాగ్య భక్తులను కలవానికి కష్టములు అవసరము లేదుకాని, వానికి సుఖములపై దృష్టి వుండదు.

అట్టివాని సంపదలు,శక్తులు కేవలం లోకకల్యాణార్థమే.

శ్రీముఖ నామ సం॥ కార్తీక శుద్ధ సప్తమి శనివారం20-11-1993.

నవంబరు 20వ తేదీ నా జన్మదినం. నాకు 63 సంవత్సరాలు నిండాయి. మా భార్యాభర్తలం శ్రీదత్త భక్తులను సాక్షాత్తు శ్రీదత్త భగవానునిగా భావించి పూజించావము. శ్రీదత్త భగవానులు దత్తభక్తులలోఆవహించేయున్నారు. స్వామి చిరునవ్వు చిందించారు. వారి నోటి వెంట ఈ గానం వెలువడింది. మనవి చేస్తాను.

## శ్రీ దత్త గానం

"ఎవరనుకున్నావు? ఇతడెవరనుకున్నావు?
కాలభైరవుడూ వేదపురుషుడూ
జ్ఞాన దీపమూ విశ్వాసరూపమూ ॥ ఎవరనుకున్నావు?
అతడే మార్గం - నేనే గమ్యం
నేనే మార్గం - నేనే గమ్యం
అతడే నేను - నేనే అతడు
మార్గ రూపంలో ప్రత్యక్షమయ్యాను
ప్రయాణము పూర్తి కాగానే
గమ్యరూపంలో ప్రత్యక్షమౌతాను
ఎవరనుకున్నావు?...
గమ్యరూపంలో ఇప్పుడే ప్రత్యక్షమైనచో
పడిపోవును మీ దేహం
ఓపిక పట్టుమూ అంత్య సమయము వరకూ
గమ్యరూపంలో అపుడే ప్రత్యక్షమౌతాను
ఎవరనుకున్నావు?...
ఇతడిని నేనే పంపితిని -
అనుమానించకుము
అనుసరించుమతడిని
మా ఇంటివరకు నిన్ను కొనివచ్చును తప్పకయే
అన్న విశ్వాసమున్నది. ఎవరనుకన్నావు ?...
నిర్గుణరూపుడ నేనే - అవ్యక్తమున కతీతుడనై నిలచి వున్నాను
నన్నర్థము చేసుకొన లేరు - నానుండి వచ్చినదే మహత్తూ
అదియే అనంత భూతాలు - వాటినుండి వచ్చినదే
అహంకారము
అదియే జీవుడు . ఎవరనుకున్నావు?..

ఆహా! స్వామీ! ధన్యులము. సత్యమును ఎరిగించి మా కన్నులు తెరిపించితివి గదయ్యా !! కృతార్థులము

21-11-93 ఆదివారము శ్రీ దత్త సద్గురువాణి ఇలా ఉన్నది.

## అందరాని పండు అంది వచ్చినది

"నాయనా! విను. నేను అక్షరుడను, నిర్గుణుడను అగు పరబ్రహ్మము. అవ్యక్తుడను కాన అవ్యక్తత అనునది నా లక్షణము. అక్షరుడు అవ్యక్తుడు. అవ్యక్తోఽక్షర ఉచ్యతే. ఇటువంటి అవ్యక్తమైన నా లక్షణము నుండియే అనాద్యనంతములగు పంచభూతములుద్భవించినవి. ఆ పంచభూతములే మహత్తు. వీటినుండి అహంకారమను చైతన్యమగు జీవుడు సంభవించినాడు.

నన్ను తెలుసుకొనలేనని తెలియుటయే జ్ఞానము. ఈ విశ్వమునకు అంతర్భూతముగా ఉన్న మరొక కారణరూపమైన విశ్వరూపమే నేను. అదియే విశ్వరూపుడు. అదియే విశ్వాంతర్గతమైన నిర్వికార విశ్వము అదియే ఈ విశ్వము నంతయు వ్యాపించియుండి విష్ణువనబడును. అదియే విశ్వం విష్ణుః ఆ విశ్వరూపము కన్నులకు కనబడదు. కావుననే పార్థునకు దివ్యనేత్రమును ఇచ్చితిని. ఆ విశ్వరూపము ఈ కనబడు కార్యరూప విశ్వమే అయినచో దివ్యనేత్రము అవసరములేదు. అందువల్లనే ఈ కార్యరూపమైన విశ్వములో జరుగు వికారము లేవియును కారణరూప విశ్వమైన నా కంటవు.

ఇట్లు అక్షరుడు, విశ్వరూపుడునగు నేను జీవులకు అందక ఉన్నాను. వారికి అందుటకు పరిచ్ఛిన్నమైన ఈ కార్యప్రకృతిలో చిన్నభాగముగ అనగా ఒక నరాకారము దాల్చివత్తును. అట్టి అవతారమునకు విశ్వరూపమునకు అక్షర తత్త్వమునకు తేడాలేదు. అందరాని పండు అందివచ్చినది అన్న విషయము తెలిసినవాడే ధన్యుడు. సంసారము లక్ష్యమయినచో పవిత్రమైన భావముకానీ, వస్తువు కానీ అపవిత్రమే. నీవు అనుభవించటకు చేసుకున్న వంట, పచ్చిమాంసమే. నాకు నివేదనము లక్ష్యముగా సంపాదించిన పచ్చిమాంసమే పంచభక్ష్యములతో కూడిన శుచియగు వంటయగును. కాన ఆరాధనా సమయంలో ఏ భావము వచ్చినను దానిని నాకు లక్ష్య సమర్పణము చేసిన పవిత్రమే అగును.

నేనొక మట్టి ముద్దను. దానికే ఒక రూపమున్నది. దానినుండి ఏ ఆకారముతో అయినా కుండ, పళ్ళెము మొ॥ తయారుచేయ వచ్చును. అలానే నా నుండియే సర్వదేవతా రూపములుద్భవించును. ఈ దేవదేవతా రూపములన్నియు నా వేషములు తప్ప, రూపములు కూడా కావు రూపాంతములో వస్తువుయొక్క గుణము మారును. పాలు పెరుగు మాదిరిగా. కాన సర్వదేవదేవతలు నా వేషములే తప్ప రూపములు కూడా కావు. ఏ వేషములేని మూలరూపమే నా దిగంబర రూపము. దిగంబర శబ్దమునకు అర్థము ఇది'' అని.

వెంటనే శ్రీ సుబ్రమణ్యస్వామి ఆవహించి ఇలా పచించారు. ''నాయనా! శ్రద్ధగా విను. దిగంబర శబ్దార్థమే ఇది అని, తన ఆధ్యాత్మిక గురువగు శ్రీ దత్త దేవుడే సర్వదేవతా స్వరూపుడని, ఇది పరమ సత్యము ఏ మాత్రము అనుమానించవలదు'' అని నొక్కి వక్కాణించారు. ఆహా! ధన్యులము.

ఆదివారము 12-12-93 శ్రీదత్త దివ్యవాణి :

## భావమే ప్రధానము

''భావరహితంగా చేసినా, నాయందు భావములేక అన్య భావముతో అనగా కోరికలతో చేసినా, రెండునూ వ్యర్థమే. కేవలము సద్భావముతో చేసినదే సఫలము సతిభావఃసద్భావః సత్ అనగా నేను. నాయందు భావముండుటయే సద్భావము. క్రియకన్నా వాక్కు గొప్పది వాక్కుకన్నా మనస్సు గొప్పది. మనస్సు అంటే భావస్వరూపమే కదా! కాన భావమే అన్నిటికన్నా విలువయినది. భావంతో చెప్పిన ఏ పలుకయినా, ఏ క్రియ అయినా నా తపస్సే అగుచున్నది.

భావంతో ఏనుగు పెట్టిన పూలు, సాలీడు పెట్టిన దారాలు, పాము పెట్టిన మణి అన్నియు సమమె. అవి అర్థము చేసుకొనలేక నా ద్రవ్యము నా పూజా విధానము గొప్పదియని కలహించి మరణించినవి. అవి ఎవరో కాదు. భక్తి కలిగియు, జ్ఞానమురాని జీవుల యొక్క ప్రతీకలే.

## నిజమైన జ్ఞానం

అన్నపాన వస్త్రాదులకు మించి ఆర్జించుట వ్యర్థము. అట్టి అర్జన వెంటరాదు. నీవిచ్చినవాడు పుచ్చుకొని అనుభవించునే కాని నిన్నుద్ధరించలేడు. దానిని అధికముగా అనుభవించినచో రోగమే వచ్చును. కాన దాని ప్రయోజనమేమి? అన్నపాన వస్త్రాదుల వరకే మితముగా సంపాదించి మిగిలిన శక్తిసమయములను నాకొరకు వినియోగించువాడే నిజమైన జ్ఞాని.

## నిజమైన ఉద్ధరణ

నేను ఉద్ధరించునపుడు బంధములు తెగును. ఐహికములు నశించును. అదియే ఉద్ధరణము నిజముగా. కాని జీవుడు అజ్ఞానముచేత నను నష్టపరచినాడని నన్ను నిందించును. ఉద్ధరించమని మొరపెట్టును. వాని దృష్టిలో ఉద్ధరణమనగా క్రిందకి పోవుటయే.

నా సృష్టియందు ఆశలేక, కేవలము నాయందే ఆశకల వానిని తిలకించినపుడు నేను మహానందమును పొందుదును. అట్టి నా ఆనందమునకే ఈ సృష్టిని కల్పించియున్నాను. ఎక్కడో ఎప్పుడో అను రెండు మాటలను వదలుము. ఇక్కడే ఇప్పుడే సిద్ధిని పొందవలెనని యత్నించుము. యత్నించినచో నేను సాయపడుదును. అట్లు సాయపడినచో అధర్మము అంతయు కర్మచక్రమునకు ఆధీనము కావలయును. ప్రయత్న కర్మలేని నిన్నుద్ధరించినచో అందరిని ఏల ఉద్ధరించరాదు? నేను ధర్మస్థాపకుడను కదా! నేనెట్లు ధర్మమును తప్పుదును? నీవు ప్రార్థించు క్రియ చేయగా నేను నీకు సాయపడుటయును

ఫలమునిత్తును. పిండి కొద్దియే రొట్టె. ఆ నీ ప్రయత్నము భావమయమై ప్రేమరూపమైనచో నీకేది నేనీయను? సర్వమిత్తును. భావమయమైన ప్రేయస్వరూపమైన భక్తియే ముక్తికి ఏకైక మార్గము. ప్రహ్లాదుడు దీనినే అవలంబించి నాచే ముక్తి నొసగబడెను.

ఇప్పుడున్న నరజన్మ మరల వచ్చునను నమ్మకము లేదు. వచ్చినను ఇప్పుడున్న భక్తి వాతావరణము అపుడుండక పోవచ్చును. ఉన్న అవకాశమును వృధాగా విడువకుము. నన్ను ఆముష్మికమునే అర్థింపుము. నా మాటల విలువ తెలిసినవాడు, నా ఒక్కొక్క వాక్యమునకు పొందు ఆనందము కోట్లు ఇచ్చినను పొందలేడు. విలువ తెలియని కోతి మణి హారాలను విసిరివేసినట్లు, మూఢుడు నా వాక్యములు శుష్క వేదాంతములను కొనుచున్నాడు. ఐహికసాధనమైన జ్ఞానమునకే అంత విలువ నీవిచ్చుచున్నపుడు ఆముష్మిక సాధక జ్ఞానమునకు ఎంత విలువనీయవలెను.

ఆహా! స్వామీ ! మణిపూసవంటి వాక్యముల నందించితివయ్యా! మా బోంట్లకు అంతటి జ్ఞానమెక్కడిదయ్యా! గురుస్వరూపమున వచ్చిన భగవంతుడవయ్యా! మా అజ్ఞానాంధ కారమును పటాపంచలు చేసి మమ్మనుగ్రహించవయ్యా అని వినతి చేయుచున్నాము తండ్రీ! మమ్ముద్ధరించవయ్యా అని ప్రణమిల్లుదము.

సోమవారం 13-12-93 న శ్రీ ముఖనామ సం॥ మార్గశిర బహుళ అమావాస్య శ్రీ దత్త భగవానుడు అనుగ్రహించిన దివ్యవాణి.

## ఈ లోకములోని ప్రేమలన్నీ స్వార్థములే

''నాయనా! శ్రద్ధగా ఆలకించు. భగవత్ప్రీతియే తన ఆనందముగా భావించుటయే భక్తి. భగవంతునకు తనయందు ప్రేమలేక ఇతరులయందే ప్రేమకలిగి యుండుటయే భగవంతునకు ఇష్టమయినచో అదే తనకు ఆనందముగా భావించుట భక్తి. అంతేకాక భగవంతుడు తన కోర్కెలను తీర్చకపోగా తనకు కష్టనష్టములను కలిగించినచో, ఇట్లు చేయుట స్వామికి ఇష్టమైనపుడు, స్వామి ఇష్టమే తన ఇష్టము కాన, తనకు కలిగిన కష్ట నష్టములు కూడా తనకు ప్రియములుగా తోచునెడల అదియె భక్తి . అనగా చివరకు స్వామి ఇష్టము స్వామికి ఏది సంతోషకరమో అదియే తన దృష్టిలో తనకునూ సంతోషకరము. అదియే ధర్మముగా నిశ్చయించుకొనుటయే భక్తిసారము. ఇట్టి భగవత్ప్రేమలో ఏ మాత్రము స్వార్థము ఉండదు. లోకములోని ప్రేమలన్నియు స్వార్థములే. అవి అనిత్యములు అసత్యములు. ఒక కాషాయ వస్త్రమును కప్పుకొన్న దొంగవాడికి నమస్కరించి, ఆ వస్త్రము తీసివేయగా వాడి నిజరూపము తెలిసి ద్వేషించినట్లు భార్య యవ్వనమునందు కేవలము చర్మము అను ముసుగుతో ఆకర్షించుచున్నదే తప్ప ఆ ముసుగు తీసివేసిన లోపలి మాంస,మల,మూత్రాదులు ద్వేషమును అసహ్యతను కలిగించును. కాన అట్టి యువతి ఆకర్షణ అసత్యము అంతేకాదు అనిత్యము. అదే యువతి ముసలి తనములో ఆ చర్మము ముడతలు పడగా వీని ఆకర్షణము

నశించును కాన అది అనిత్యము. ఇట్లే తల్లిదండ్రుల ప్రేమయు అనిత్యము, అసత్యమే. వారు నిన్ను తమ ఆనందము కొరకే ప్రేమించుచున్నారు. ముసలితనములో వారి సేవలు నీవు చేయనిచో చిన్నతనములో ఎంతో సేవచేసితిమని వాపోవుదురు. అంతియేకాదు నీవు స్త్రీ లోలుడవైనప్పుడు నీ సంతోషమే తమ సంతోషమని భావించక అసూయపడుదురు. నీవు గొప్పవాడవైనను తమ పుత్రుడింతవాడని మురిసిపోవుదురే తప్ప తమ పుత్రుడన్న విషయమును వదలి నీ గొప్ప తనమునకు మురిసిపోరు. అట్లు మురియు నెడల ఏ గొప్పవానిని చూచినను అసూయ పడక మురిసిపోవలయును. అట్లే నీవును వారిని నీ స్వార్థమునకే ప్రేమించుచున్నావు. చిన్నతనములో నీ ఆహారవినోదములను ఇచ్చువారిని ప్రేమించుటలో కేవలము నీ స్వార్థమే తప్ప వారి ఆనందమునకై వారిని నీవు ప్రేమించుటలేదు. అలాగే పెరిగిన తరువాత చిన్నతనములో వారు నీ సేవ చేసితిరను విషయమును స్మరించి బదులుకు బదులు వ్యాపారముగా వారి ఋణమును తీర్చుకొనుటకు చేయుచున్నావే తప్ప చర్మమను ముసుగుచే ఆకర్షింపబడి నీ భార్యయందే అనురక్తుడవగుచున్నావు. ఆ భార్యను మరల ముసలితనమున పూర్వవిధముగా ప్రేమించుటలేదు. ఈ విధముగా లోక ప్రేమలన్నియు అసత్యములు, అనిత్యములు, నాటకములు, బూటకములు, స్వార్థ లక్ష్యములు కాన చివరకు అన్నియును దుఃఖకారణములే అగును. ఇంతేకాక ఎన్నియో జన్మలయందు ఎందరో జీవులు మారుచుండుట వలననూ ఇవి పరమార్థ శాశ్వతములు కావు.

కావున స్వామి సంతోషము తనకు దుఃఖకారణమైననూ ఆ దుఃఖమునే తనకు సంతోషమైనచో అదే నిజమైన భక్తి. అట్టి ప్రేమ తన యందున్నదా? లేదా? అని స్వామి పరీక్షించుటయే నా దత్త పరీక్ష. అట్టి నీ ప్రేమస్థాయి ఎంతవున్నదో అంత తీవ్రమైన పరీక్ష వుండును. ఈ పరీక్ష

నీకు నాయందు ఎంత బరువుగల ప్రేమ ఉన్నదను తూకమే తప్ప నిన్ను ఏడిపించుట కాదు''. ఆహా! స్వామీ! ఎంత చక్కగా వివరించావయ్యా! కళ్ళు తెరిపించితివి గదయ్యా ! ధన్యులం.

14-12-93 శ్రీముఖ మార్గశిర శుద్ధ పాడ్యమి మంగళవారం ఈరోజు నా జన్మదినం శ్రీవారు మాకు ఈ దివ్యవాణి అనుగ్రహించారు.

'' సృష్టికి పూర్వం బ్రహ్మదేవుడు వున్నాడు. సృష్టి జరుగగనే ఇక బ్రహ్మలేడు. విష్ణువే వున్నది. సృష్టిసంహారానికి ముందు శివుడు వుంటాడు. కాన సృష్టిలో శివకేశవులున్నారు. సృష్టికి పూర్వమున్న బ్రహ్మ సృష్టికి అతీతుడు కాన ఆయన పూజ అసాధ్యము. బుద్ధికి అతీతుడన్న మాట. అందుకే బ్రహ్మయొక్క శబ్దము ఆయనయందు సమన్వయించింది. ఆయన సృష్టించిన ఈ జగత్తు ఆయన వినోదమును కల్పించి ఆయన సృష్టి వినోదమునందు రమించుచున్నాడు. ఈ పరమార్థమును అర్థం చెసుకొనక ఆయన సృష్టించిన ఆయన పుత్రికనే ఆయన రమించాడని తుచ్ఛమైన ఆరోపణమును పాషండులు నాస్తికులు పురాణములలో ప్రక్షేపములు చేసినారు. సృష్టికి పూర్వము గుణ క్రియ వలన నేనే బ్రహ్మను. తర్వాత నేనే స్థితి కారకుడను. కాన విష్ణువును. జగత్తును సంహరించు సమయము ఆసన్నమగునపుడునే శివుడ నగుదును. ముగ్గురు లేరు. ఒక్కడనే. కాన ఇప్పుడు నేను విష్ణుతత్త్వములో గుణక్రియల వలన వున్నాను.

అందుకే ప్రాధాన్యతను సూచించు మధ్య మందు విష్ణు ముఖము, ప్రాధాన్యతను సూచించు ఊర్ధ్వ హస్తములందు శంఖ చక్రములు వున్నవి. శివ పుత్రుడైన మణికంఠునకు విష్ణు నామము, విష్ణు భూషణములున్నవి. ఆయన రాజకుమారుడనగా రాజా. అనగా

పరిపాలనాస్థితి యందున్న విష్ణుతత్త్వము. త్రిమూర్త్యారాధనముతో షడ్గుణములను తొలగించుకొను 18 తపస్సులే 18 మెట్లు. శివకేశవసమన్వయమైన మణికంఠుని అర్థము చేసుకొనలేనివాడు బ్రహ్మ, శివ,కేశవ సమన్వయమైన నన్ను ఎట్లు అర్థము చేసికొనగలడు ?

40 రోజులు నియమములు పాటించినంత మాత్రమున అయ్యప్పలను పేరుతో పిలవరాదు. వారి భోజనములను భిక్షలన రాదు.ఎంతో సాధన చేత, నా దయ చేత కాని, అద్వైతము సిద్ధించదు. పరమ భాగవతులకు పెట్టు భోజనమునే భిక్ష అనవలెను. అట్టి పరమ భాగవతుడే సంన్యాసి. సంన్యాసికి పెట్టు భోజనమే భిక్ష. వారిని అయ్యప్ప భక్తులనవలెను. వారికి పెట్టు భోజనములను సమారాధనము అనవలెను. అద్వైతము నేనీయవలెనే తప్ప నీకై నీవు స్వయముగా పొందినట్లు అహం బ్రహ్మాస్మి అనరాదు. అది రజోగుణవృద్ధికి దారితీసి సాధనయందు పతితుని చేయును. నా ఆరాధనము చేయుచు ఇట్లే పౌండ్రక వాసుదేవుడు పతితుడయ్యెను.

ఇట్టి అజ్ఞానమును గురువులు ప్రోత్సహించరాదు. అయ్యప్పను నేనొక్కడినే. నాతో సముడు కానీ, నా అంశ మాత్రుడు గాని ఎవ్వడును లేడు. అది నా కరుణచేత నాకు నీపై కలుగు ప్రేమచేత నీకీయవలసిన ఆస్తి. నేనీయక ముందే నాదే ఆస్తియని నీవు ప్రచారము చేసుకొనరాదు.లోక సంగ్రహార్థము నీకు యోగ్యత పూర్తి కాగానే నేనే ఇత్తును. దానిని నీవు కోరరాదు. అందువల్లనే అష్టసిద్ధులు కావలయునని ఎవ్వడును కోరరాదు.

శ్రీముఖ నామ సం॥ మార్గశిర బహుళ చవితి శనివారం 1.1.1994 శ్రీదత్త ప్రభువు అనుగ్రహించిన దివ్యవాణి.

## త్రిగుణములు

"సత్త్వగుణము జ్ఞానమును, రజోగుణము కర్మప్రవృత్తిని, తమోగుణము అజ్ఞానమును ఇచ్చును. జ్ఞానము కర్మకును, కర్మ జ్ఞానమునకును పరస్పర కారణములు. అజ్ఞానమునందు జ్ఞానము కానీ కర్మగానీ లేవు. దైవజ్ఞానము, దైవారాధన కర్మ కావలయును కాన సత్త్వ రజోగుణములు ఆవశ్యకములు. వీటితోబాటు ప్రాపంచిక జ్ఞానము లేకుండుటయను అజ్ఞానము కూడ కావలయును. కాన తమోగుణము కూడా సాధకునకు ఆవశ్యకమే. అనవసరమైనది యేదియు నేను సృష్టించలేదు. ప్రాపంచిక జ్ఞానము లేని యెడల ప్రాపంచిక కర్మల యందు ప్రవృత్తి జరగదు. ప్రాపంచిక కర్మ ప్రవృత్తి లేనందున ప్రాపంచిక జ్ఞానము కలుగదు. ఇట్లు సాధకుడు త్రిగుణముల సాయమును పొందుటయే నా సాయము. నేను త్రిగుణాత్మక మూర్తిత్రయ రూపుడను గదా. దైవ జ్ఞానమను సత్త్వము, దైవారాధన యను కర్మరూపమైన రజోగుణములు లేని కేవల తమస్సే పాషాణము. గుణమే ద్రవ్యరూపముగా సాంద్రీకృత మగును. తమస్సు శివ రూపము. అనగా లౌకిక జ్ఞానము లేనివాడే శివారాధకుడు. లోక జ్ఞానము కలిగి లోక కర్మలయందు ప్రవృత్తుడగు వాడే నిజమైన శివ ద్వేషి. సత్త్వము విష్ణురూపము. దైవజ్ఞానియే వైష్ణవుడు. అదిలేనివాడే విష్ణుద్వేషి. దైవారాధన కర్మప్రవృత్తుడే బ్రాహ్మణుడు. అది లేని వాడే బ్రహ్మద్వేషి. సాధకుడు ఇట్లు నా మూర్తిత్రయ తత్త్వములైన త్రిగుణములను తెలుసుకొనవలయును. అట్టివాడే నా నిజమైన భక్తుడు. ప్రాపంచిక జ్ఞానము బొత్తిగాలేని ఋష్యశృంగుడే నిజమైన శివుడు. ప్రహ్లాదుడే నిజమైన వైష్ణవుడు. నారదుడే నిజమైన బ్రాహ్మణుడు" అని వివరించారు స్వామి.

శ్రీముఖ నామ సం॥ మాఘ శుద్ధ ఏకాదశి మంగళవారము 22-2-94 విజయవాడలో శ్రీదత్తప్రభువులు ఇలా వివరించారు.

## విష్ణు సహస్రనామములు

"విష్ణు సహస్రనామ ప్రాధాన్యత దానిలోని మొదటి నామములోనే వున్నది. విశ్వం విష్ణుః అనగా ఈ విశ్వమే నేను. అనగా నా తత్త్వమంతయు విశ్వములోనే వున్నది. ఈ విశ్వము అనాది. అనంతము. అనగా నేను అనాది అనంతుడను. ఈ విశ్వము దృశ్యముగా ఉన్ననూ దానిలోని తత్త్వము భౌతిక శాస్త్రజ్ఞులకు అర్థము కాని విషయము ఎంతో ఉందని వారే అంగీకరిస్తున్నారు.

అలానే అవతార రూపంలో నేను కనిపించినా, పరిశీలిస్తే నేను అనూహ్యునిగా, అగోచరునిగానే వున్నాను. ప్రచండ సూర్యుడే దుష్ట శిక్షణములోని నా స్వభావము. ప్రసన్న చంద్రుడే శిష్ట రక్షణములోని నా స్వభావము. ఈ విశ్వము అనేక వస్తువులగా యున్నది. అలానే, నేనూ అనేక రూపాలు ధరించుచున్నాను. ఈ విశ్వములోని అనంత నిర్మాణ ములు నా అనంత అద్భుతశక్తులను సూచిస్తున్నాయి. ఈ విశ్వంలోని ప్రకృతి తత్త్వాలు వాటి వాటి ధర్మాలను అతిక్రమించకుండా ఉండుట నా ఈశ్వర శాసకత్వ సామర్థ్యాన్ని చెప్పుచున్నది.

నన్ను ఆరాధించడంలో సమయము, విధానము ప్రధానము కావు. భావము ప్రధానము. నీ పుత్రుని ఒక ప్రత్యేక సమయంలో, ప్రతిసారి ఒకే విధానంలోనే లాలిస్తూ నీ ప్రేమను ప్రదర్శిస్తున్నావా? నీ పుత్రునిపై ప్రేమ ఉప్పొంగిన సమయ మేసమయమైనా కావచ్చును. ఆ సమయంలో నీకు ఏది తోస్తే ఆ విధానంలో నీ పుత్రునిపై ప్రేమను ప్రదర్శిస్తున్నావు. ఒకసారి ముద్దాడుచున్నావు, మరొకసారి లాలిస్తున్నావు, మరొకసారి మధురమును తినిపిస్తున్నావు.

అలానే నాపై నీకు ఏ సమయంలో ప్రేమ ఉప్పొంగునో అదే పవిత్ర సంధ్యాకాలము. ఆ సమయంలో నీకు ఏవిధానము తోచునో, ఆవిధానంలో నన్ను అర్చించుము. అది భజన కావచ్చును, నివేదన కావచ్చును, మంత్ర పఠనం కావచ్చును, మౌన భావన కావచ్చును, పూజ కావచ్చును, మరి ఏదయినా కావచ్చును. భావ రహితమయిన కేవల నిర్దిష్ట సంధ్య సమయమున కానీ, ప్రతీ దినమూ నిర్దిష్టమైన ఒకే యాంత్రిక పూజా విధానం కానీ నన్ను ఆకర్షింపజాలవు .

నన్ను ఆముష్యకమునకే ఉపయోగింతు నందురు. నిజమే. నీవు ఒక పురుషుని ఇంటికి వెళ్ళినావు నీకు 1000 రూపాయలు అప్పు కావలసి వున్నది నీవు యజమానిని అడుగుదువు కాని ఆయన భార్యను అడగవు గదా. నీవు అడుగకనే ఆయన భార్య నీకు ఫలహారము, భోజనము ఇచ్చుచున్నది. భోజనమునుగురించి ఆ యజమానిని యాచించవు. అది ఆయన పట్టించుకోడు. ఆ విషయము చాలా చిన్నది. ఆమె పరిధి లోనిది.

అలానే నన్ను అష్టసిద్ధులను సాధకులు కోరుదురే తప్ప చిన్నవి అయిన ఐహికములను అడుగరు. ఐశ్వర్యాదులు కేవలము భోజనము వంటివి. నా భక్తునికి నా ముగ్గురు దేవేరులు వాణీ, లక్ష్మి, గౌరులు వాటిని అడుగకయే ప్రసాదించుచున్నారు. వాటిని గురించి నేను పట్టించుకొనను. నేను కూడా కోరిక లేని వానికే లోక కల్యాణార్థము అష్ట సిద్ధులను ప్రసాదింతును. లేకున్నచో కోరిక కలవాడు కార్త వీర్యుని వలె పతన మగును. కాన కోరికను పూర్తిగా త్యజించి నన్ను అర్చించవలయును.

శివుడు తమస్సు, విష్ణువు సత్త్వము, బ్రహ్మ రజస్సు. తమస్సు అజ్ఞానము, సత్త్వము జ్ఞానము, రజస్సు కర్మ. ముందు అజ్ఞానము (తమస్సు) కావాలి. అంటే ప్రపంచ జ్ఞానము లేకపోవుట అనే అజ్ఞానము

కావాలి. ప్రపంచ జ్ఞానమున్నచో ప్రపంచ విషయ క్రియలు యందు ప్రవృత్తి సంగము ఏర్పడును. అది పోవలయునన్న లోకజ్ఞానము లేకపోవుట అను స్థితి అనగా ఉన్మాద స్థితి కావలయును. అదియే అవధూత స్థితి. అది రాకున్నంత కాలము లౌకిక కర్మలయందు ప్రవృత్తి,విషయ సంగము తప్పవు.

ఆ తర్వాత పరమాత్మ జ్ఞానము (సత్త్వము) కావలయును. ఆ తరువాత పరమాత్మను కర్మ ద్వారా అర్చించాలి. చింతించుట కూడా కర్మయే. ఏ విధమైన ఆరాధనయు కర్మయే. ఈ విధముగ త్రిగుణములును సాధనయందు ఆవశ్యమగుచున్నవి.

అన్ని దేవతలు నా వేషములే. సుబ్బయ్య అనువాడు హరిశ్చంద్ర వేషమున ఉన్నాడనుకొనుము. ''హరిశ్చంద్రుడెంత బాగున్నాడు!'' అనిననూ, ''హరిశ్చంద్ర వేషమున సుబ్బయ్య ఎంత బాగున్నాడు'' అనినను ''సుబ్బయ్య ఎంత బాగున్నాడు'' అనిననూ ఒకటే. ఏలయనగా ఈ మూడు మాటలు వినునది సుబ్బయ్యే కాని హరిశ్చంద్రుడు కాడు. కాన ఏ దేవతను ఆరాధించినా ఒక్కటే. సుబ్బయ్య అను భావము లేక కేవలము హరిశ్చంద్రుడికే పూలమాలలు వేసిననూ ఆ మాలను స్వీకరించి సంతసించినది సుబ్బయ్యే. సుబ్బయ్య అని తెలిసి కూడా పూలమాల వేయని వాని కన్నా, సుబ్బయ్య అని తెలియక హరిశ్చంద్రుడే అన్న భావముతో పూలమాల వేసినవాడే సుబ్బయ్యకు ప్రీతి పాత్రుడు. కాన భక్తి ప్రధానము కాని ఎన్నుకొనిన దేవతా నామరూపాలు కావు .

''అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే'' – అనగా అజ్ఞానము చేత ఈ మృత్యురూపమైన సంసారమును దాటిన తరువాత జ్ఞానము వచ్చి అమృతమైన పరమాత్మ లభించును. ఇచ్చట అవిద్య అనగా సాక్షాత్తుగా అజ్ఞానమనే చెప్పాలి. ఇది దేని అజ్ఞానము?

లోకము యొక్క అజ్ఞానము. లోక జ్ఞానమే లోక కర్మలకును లోక బంధములకును కారణము. అది పోనంతవరకు ఎట్టి ఉపాయము చేతను కర్మ ప్రవృత్తి తప్పదు.

అందువలన జ్ఞానులు ముందు నీకు అజ్ఞానమును ఉపదేశించుదురు. ఆ తరువాత పరమాత్మ జ్ఞానము. ఉపదేక్ష్యంతితే ౽జ్ఞానం అని ముందు పాఠమును, ఆ తరువాత ఉపదేక్ష్యంతితే జ్ఞానం అని రెండవ పాఠముగనూ చదవాలి. నేను ఈ రెండు అర్థములతోనూ అక్కడ గీతలో చెప్పితిని.

కావున లౌకికమైన వార్తా ఆలాపములను పెంచుకొని లోక జ్ఞానమును పెంచుకొనువాడు అవధూత స్థితికి వచ్చుటకు అసాధ్యమగును. బుద్ధిలో ఇప్పటికే వున్న లోక జ్ఞానమును విస్మరించి అవధూత స్థితికి దగ్గరగా వచ్చు ప్రయత్నమునకు వ్యతిరేకముగా సాధకుడు లోక జ్ఞానమును పెంచుకొనినచో అవధూత స్థితికి ఇంకా దూరమగుచున్నాడు.

దీనికి ఉదాహరణము : శ్రీ వ్యాసులవారు మహాజ్ఞాని. ప్రపంచ జ్ఞాననిధి. శ్రీ శుకులవారు గూడా మహాజ్ఞాని. కాని ప్రపంచ జ్ఞానమును విస్మరించారు. కనుక వారికి స్త్రీ పురుష తారతమ్యం కూడా లేదు. శ్రీ వ్యాసులవారు ప్రపంచ జ్ఞానాన్వితులగుట చేసి, వారికి స్త్రీ పురుష తారతమ్యం గలదు. అందువలననే వివస్త్రలుగా నదీస్నానం చేయుచున్న అప్సరసలు వృద్ధుడైన వ్యాసులు వచ్చినపుడు వెంటనే వస్త్రధారణ చేశారు.

అదే అంతకు ముందు నది ప్రక్కగా వెళ్ళిన యువకుడయిన శ్రీ శుకులును చూచినపుడు వారు వివస్త్రలుగా స్నానాలు చేస్తూనే యున్నారు. కారణం ఏమిటి? శ్రీ శుకులు ఆ పరిజ్ఞాన వివర్జితులు, అవధూతలు అవటం–అదే శ్రీ వ్యాసులు ఆ పరిజ్ఞాన సహితులవడం. కనుక ఈ ప్రపంచ విషయ పరిజ్ఞానాన్ని విస్మరించి అజ్ఞానమును

ఆశ్రయించడం వలన అవధూతలై ప్రపంచ విషయాసక్తులు కావడంలేదు.

కనుక సత్సంగం వలన ఆధ్యాత్మికాభివృద్ధి కలిగి, విషయాసక్తుడు కాక అవధూత లక్షణములు కలిగి భగవంతునకు చేరువ అవుతున్నాడు. అదే లౌకిక ప్రసంగవములతో కాలం వృధా చేసుకున్నవానికి ఈ ప్రపంచం లౌకిక జ్ఞానం పెరిగిపోయి, విషయాసక్తత అభివృద్ధిపొంది అవధూత లక్షణములకు దూరమై చెడిపోవుచున్నాడు.

శ్రీదత్త స్వామి శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి ఈ బోధ చేశారు. సత్సంగములో కాలము గడుపు. లౌకిక ప్రసంగాలకు దూరంగా వుండు అని హెచ్చరించారు.

ఈ హెచ్చరిక మనందరికీ కూడా ! స్వామీ! ధన్యులం!

## ఏకాంత సేవ – అంతర్ముఖారాధనము

శ్రీ గురుడు మరల ఇలా సెలవిచ్చారు.

" నీ పుత్రుని నలుగురు చూచేలాగా బజారులో ముద్దాడుతావా? లేక రహస్యంగా ఏకాంతంగా ముద్దాడుతావా? అలానే నిజమైన భక్తుడు భగవంతుని ఏకాంతంలో రహస్యంగా అంతర్ముఖంగా ఆరాధిస్తాడు కాని పదిమంది చూచేలాగా నన్ను అర్చించడు. ఏకాంతసేవ – అంతర్ముఖారాధనములోని అంతరార్థము ఇదే".

ఆహా! స్వామీ! ఎంత చక్కగా వివరించావయ్యా ! ధన్యులం.

## వృా దంపతుల సందేహ నివారణ

ది. 25-2-94 మాఘపూర్ణిమ విజయవాడలో తెల్లవారుఝామున: గృహస్థా శ్రమంలో వుంటూ వయస్సు మళ్ళిన తల్లి, తండ్రులు తమ కర్తవ్యాలు అన్నియు పూర్తి అయినప్పటికి కొడుకులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు మధ్య వుండవలసి రావడం

సర్వసాధారణంగా అందరం చూచే విషయమే. పిల్లలకు చదువులు చెప్పుకొనడం, కొడుకుల ఉద్యోగాలు, కొన్ని చోట్ల కోడళ్ళు కూడా ఉద్యోగాలకు వెళ్ళడం, వంటల హడావిడి, ఆఫీసు టైముకు, స్కూళ్ళ టైముకు హడావిడులు. యాంత్రిక జీవనం మన మందరం చూస్తున్న విషయమే.

కాని తండ్రి ఎంతో కాలం ఈ కార్యక్రమ యాంత్రిక జీవనంలో కొట్టుకొని, ఆయనతో పాటు భార్యగా ఆమె కూడా యంత్రం లాగా పనిచేసి, భర్త రిటైరుకాగానే ఇద్దరూ ప్రశాంత జీవనం గడపాలని విశ్రాంతి కోరడం సమంజసమే కదా. ఏకాంతంగా దైవ ధ్యానం చేసుకోవాలని కోరటంలో ఏమి అసంమజసము లేదుకదా.

కాని పై పరిస్థితులలో ఇది ఎలా సాధ్యం? కనుక ఏ శ్రీశైలమో లేక ఏ పుణ్య క్షేత్రమునకో వెళ్ళి వాళ్ళ శేష జీవితం గడుపుకొనడం బాగుంటుందా? ఈ సందేహ నివారణ, ఈ సమస్య పరిష్కార మార్గము శ్రీ గురుడు శ్రీదత్త భక్తులకు వివరించారు.

'' ఈ వృద్ధ దంపతులు అనుకున్నది నిజమే. కాని అంతా అట్లా కాదు. శ్రీశైలంలో వుండి సాధించడం మంచిదే. కాని ఇందులో ఒక మెళుకువ యున్నది విను. కాలమును, శక్తిని వృధాచేయరాదు. శ్రీశైలం వెళ్ళాలి. అక్కడ వుండి ఏదో సాధించాలి అనుకొంటూ, అటు వెళ్ళలేక ఇక్కడ తృప్తిలేక కాలమును,శక్తిని వృధా చేసుకున్నవాడు ఏమీ సాధించ లేడు.

శ్రీశైలంలో వున్నంత మాత్రాన అక్కడ వున్నవాళ్ళంతా ముక్తి పొందుతారా? అక్కడ వున్నవాళ్ళలో ఆముష్మిక చింతన వుండి సాధన చేసేవాళ్ళు ఎందరూ? శ్రీశైలం వెళ్ళలేక వారి గ్రామంలోనే వుండి ముక్తి పొందినవాళ్ళు లేరా?

కనుక అసలు విషయం చెపుతా విను. ముఖ్యమైనది భావం.

తెలుసుకో. వాళ్ళకు చెప్పు. కాలమును, శక్తిని వృథా చేయవద్దని, సత్సంగములో పాల్గొనమను. లౌకిక సంగము నుండి దూరంగా వుండమను. భావన, భావోద్రేకము ముఖ్యమని నొక్కి వక్కాణించు. సంధ్యా వందనము చేసుకొనేటప్పుడుగాని, భగవంతుని అర్చన చేయునప్పుడుగాని, భావము, భావోద్రేకము ప్రధానముగాని, ఏదో యాంత్రికముగా పీటమీద కూర్చుని, పట్టుబట్ట ధరించి, దైవకార్యము జరుపుకొనుట. ఆఫీసు టైము అయినది అటు వెళ్ళాలి-హడావుడి అనుకుంటూ-మధ్య మధ్యలో టైము చూసుకుంటూ చేసే యాంత్రిక అర్చనలు నిరుపయోగమే అవుతాయి. కనుక భావమే ప్రధానము.

ఇక పరిసరముల ప్రభావము గురించి వివరిస్తాను విను. పరిసరములకు కొంత ప్రభావము వుంటుందేగాని, నూటికి నూరుపాళ్ళు వుండదు. నూటికి 90 పాళ్ళు ఎక్కడ వున్నా వ్యక్తిత్వంపై వుంటుంది. మిగిలిన 10 పాళ్ళు పరిసరాలపై ఆధారపడి వుంటుంది.

శ్రీశైలంలో కాపురం వుంటున్న వాళ్ళు అందరికి నూటికి నూరు పాళ్ళు భావోద్రేకం కలుగుచున్నదా? శ్రీశైలంలో వుంటే తనకు వ్యక్తిగా సంపాదించుకొన్న 90 శాతము భావము పోను మిగిలిన 10 శాతము పొందడానికే వీలగుతుందిగాని, శ్రీశైలంలో వున్నంతమాత్రాన నూటికి నూరుపాళ్ళు దాని అంతట అదే భావమురాదు. కనుక ఎక్కడ వున్నప్పటికీ మొదట తాను తన వ్యక్తిత్వమును 90 శాతము భావముతో నింపుకొనుటకు ప్రయత్నించాలి కాని, ఎప్పుడో శ్రీశైలం వెళ్ళాలి, అక్కడ ఒక సంవత్సరం వుండాలి, అక్కడ ఏదో సాధించాలి అనుకుంటూ కాలాన్ని వృథా చేయరాదు. నిన్నటి విషయము చింతించవద్దు. రేపులేదు ఈరోజే – ఈ రోజే సాధన చెయ్యి. నేను తప్ప నిన్ను అక్కడ (అంత్యకాలంలో... ఆ లోకంలో) ఎవ్వరూ కాపాడలేరు. సదా జ్ఞాపకం వుంచుకో. నీ మనస్సుకు ఏ సమయంలో దేనియందు లగ్నమగునో అలా చెయ్యి. జపం చెయ్యి, ధ్యానం చెయ్యి, భజన చెయ్యి, ఏది భావనా యోగ్యమయితే అదే చెయ్యి.

మనస్సు పంచకల్యాణి గుఱ్ఱము వంటిది. దానిని నిగ్రహించుటకు మానవులకు అంత తేలికగా సాధ్యము గాదు. కావున మానవుడు మనస్సు యొక్క స్వభావమును అనుసరించి యోగమును సాధించవలయునే గాని బలవంతముగా దానిని నిగ్రహించు ప్రయత్నము చేసిన అది ద్విగుణీకృత బలముతో నిన్ను పడవేయును. ఉదాహరణమునకు మనస్సునకు ఒక లక్షణమున్నది. దేనికి దూరముగా వుండునో దానిపై భ్రమ ఎక్కువ. దూరముగా వున్న దానినే కోరును. కాన సంసారమును త్యజించి దూరముగా వున్నచో కొన్ని దినములకు అది సంసారమును తీవ్రముగా కోరి నిన్ను పడవేసి సంసారమునకు లాగును.

అట్లుకాక, నీవు సంసారములోనే వుండినచో దగ్గరవున్న దానిపై ఉపేక్షచేయు స్వభావము మనస్సుకు వున్నది కాన సంసారముపై ఉపేక్ష ఏర్పడి దూరముగ వున్న తీర్థ క్షేత్ర దైవముమీద భ్రమతో ఆసక్తి వుండును. కాన దైవారాధన సులభముగా జరుగును అని వివరించారు.

సాయంత్రం 6 గం॥ 30 ని॥లు అయింది. శ్రీ దత్త భక్తులు స్నానం చేసి మేడమీదకి వచ్చారు. అప్పుడు నేను శ్రీదత్త భక్తులతో ఇలా మనవి చేశాను.

''స్వామీ! శ్రీ గురుడు వివరించారు గదా! పరిస్థితుల ప్రభావం 10శాతము - వ్యక్తి చేకూర్చుకొనవలసినది 90 శాతమని. కాని అనుభవంలో మా బోటి సామాన్యులకు అది సాధ్యం కావడంలేదు. మీరే చూడండి. ఈ రోజు మనం సకాలంలో స్నానం చెయ్యగలిగామా, సంధ్యావందనం చేయగలిగామా. స్థిమితంగా ప్రార్థన, సాధన చేసుకోగలిగామా. అదేమనం శ్రీశైలంలో ఉన్నప్పుడు సకాలంలో అన్ని విధులు నిర్వర్తించుకునే వారము. దైవ దర్శనము-దైవప్రార్థన చేసుకునే వారంగదా. మరి పరిసరాల ప్రభావము మా బోంట్లపై ఎక్కువగాయున్నది గదా-అని ఆందోళన వ్యక్తపరచి, క్రిందికి స్నానం చేయడానికి దిగాను. మరల నేను ఒక గంటలో స్నానం, సంధ్యావందనం ముగించుకొని పై మేడమీదకు వెళ్ళాను.

శ్రీ దత్త భక్తులు నన్ను పిలిచి కూర్చోమని మా దంపతులకు ఈ విధంగా బోధించారు.

''మీరు స్నానానికి క్రిందకి వెళ్ళగానే శ్రీ గురుడు సాక్షాత్కరించారు. మీకు ఈ విధంగా చెప్పమని ఆదేశించారు''.

''పాపం వాళ్ళు దైవారాధన విషయంలో ఆందోళన చెందుతున్నారు. నేను చెప్పిన అన్ని విషయాలు అక్షర సత్యాలు. ఇందులో ఎట్టి సందేహానికి తావులేదు. శ్రీశైలంలో వుండి సాధించటం మంచిదే. కాని ఇక్కడ ఒక మెలుకువ యున్నది ఏమిటో తెలుసా? నీకు ఏ వస్తువు, వ్యక్తి నిత్యము ఎల్లవేళలా సన్నిహితంగా వుంటాయో, ఆ వస్తువు, వ్యక్తి మీద నీకు ఎప్పుడూ ఉపేక్ష, నిర్లిప్తత కలుగుతుంది.

ఇది సహజము. అదే ఏ వస్తువు, వ్యక్తి నీకు దూరం అవుతుందో ఆ వస్తువు. వ్యక్తి మీద నీకు ఎక్కువ మమకారం ఉంటుంది. ఇదే మన స్తత్వము నీవు ఏ కుటుంబమునైతే దూరంగా వుంచి శ్రీశైలంలో ఆరాధన చేయాలనుకుంటున్నావో, కొన్ని దినములు గడువగానే ఆ కుటుంబ సభ్యులపై ద్విగుణీకృతముగా ప్రేమ ఉప్పొంగి వారి పిల్ల పిల్లా పేరున అన్ని రకములయిన బహుమతులు, మిఠాయిలు కొనుక్కొని ఎప్పుడు వాళ్ళను చూద్దామా అనే కోరిక అధికమవడం మనం గమనిస్తూనే వున్నాముగదా.

అప్పుడు నీకు మొదటిరోజున శ్రీశైలంలో చేసిన ఆరాధన భావావేశము. 10 రోజుల తర్వాత చేస్తున్న సాధనలో భావావేశములో తేడా కనిపిస్తుంది. అంటే దగ్గర వస్తువుపై ఉదాసీనత, దూరవు వస్తువులపై ఆప్యాయత పెరగటం స్పష్టంగా కనిపిస్తాయి. కనుక ఎవరినయితే దూరం చేసుకోవాలో, వారిని సన్నిహితంగా వుంచుకుంటే అది సాధించవచ్చు. అట్లే – అయ్యో శ్రీశైలం వెళ్ళలేదే అనే భావము కల్గినప్పుడు, దూరంగా వున్న శ్రీశైలం నిత్యం సన్నిహితంగానే వుంటుంది.

కనుక అప్పుడప్పుడు శ్రీశైలం దర్శనం చేసుకుంటూ, తమ గృహమునందే వీలైనంత ఏకాంతంతో భావసహితమైన సాధన చేసుకుంటే చాలు. ముక్తి సాధించవచ్చు. కనుక వాళ్ళకు చెప్పు – అప్పుడప్పుడు శ్రీశైలం వెళ్ళి సాధన చేయమని – ఈ లోగా ఈ మేడ మీద ప్రశాంతంగా వుంటూ

సాధన సాగించమను'' అని వచించారట. ఆహా! ఎంతటి దివ్యసందేశం.

## దివ్యదర్శనం

ఈరోజు మాఘపూర్ణిమ. వెన్నెల రాత్రి. పూర్ణ చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడు. శివపురాణంలో - ప్రతిపూర్ణిమనాడు పార్వతిమాత కైలాసం నుండి కార్తికేయుని చూడడానికి క్రౌంచపర్వతం - (అనగా శ్రీశైలం) వస్తుంది. శ్రీ భ్రమరాంబ తల్లి ఆరోజున దేదీవ్యమానంగా దర్శనమిస్తుంది.

మేము, శ్రీదత్త భక్తులు ఈ పూర్ణిమనాడు విజయవాడలో ఉన్నాము గదా. నేను, నా శ్రీమతి ఈ పున్నమిరాత్రి చంద్రబింబాన్ని దర్శిస్తు సౌందర్యలహరి పారాయణ చేస్తున్నాం. ఇంతలో శ్రీ దత్త భక్తులు కూడా వచ్చారు. వారు కూడా పాల్గొన్నారు. పారాయణ పూర్తి కాగానే ఒక విచిత్రం జరిగింది. పూర్ణచంద్రునిలో భ్రమరాంబ తల్లి సాక్షాత్కరించింది. ఆనందపారవశ్యంతో ఆమె తబ్బిబ్బు పడుతోంది - ఆ ఉద్వేగం, ఆ ఆనందం పెల్లుబికిపోతూ శ్రీ దత్తభక్తులకు దర్శనమిచ్చింది అమ్మ. వెంటనే శ్రీదత్త భగవానులు సాక్షాత్కరించి శివానందలహరి వెంటనే పారాయణ చేయుమని ఆజ్ఞాపించారు. శ్రీ దత్త భక్తులు శివానందలహరి పారాయణ చేశారు. అమ్మ శాంతించింది. దత్త భక్తులకు ఆ రాత్రి అమ్మ నృత్యం చేస్తూ దర్శనమిచ్చింది. సరస్వతీదేవి వీణ మీటుతోంది; లక్ష్మీదేవి గానం చేస్తున్నది. ఇది దివ్య దర్శనం. అప్పుడు త్రిముఖ షడ్భుజరూపంతో శ్రీ దత్త భగవానులు సాక్షాత్కరించారు. ముగ్గురమ్మలు ఒక్కటైనారు. ముగ్గురమ్మలు మూలపుటమ్మ శ్రీ దత్తునిలో లీనమై శాంతిని పొందింది. శ్రీ దత్తుడు అదృశ్యమైనారు.

ఇది ఈ నాటి దర్శనం ఆహా! ఎంతటి అద్భుత దివ్య దర్శనం. సౌందర్యలహరి పారాయణ చేయగానే వెంటనే శివానందలహరి పారాయణ చేయండి అని శ్రీ దత్త భక్తులు వచించారు.

స్వామీ! మీ ఆదేశం శిరోధార్యం అని ప్రణమిల్లాము.

15-3-94 : శ్రీదత్తవాణి దివ్య సందేశము.

## సంసార విషయములో

"భావోద్రేకములను నివారించుము. ఆ ఉద్రేకముల ద్వారా ఎంతో శక్తి వృధా అగును. ఉదాసీనత, నిర్లిప్తత అలవరచుకొనుము. దీనిచేత శక్తి దాచుకొనవచ్చును. ఇట్లు దాచిన శక్తిని దైవోపాసనకు వినియోగించుము. అట్లు వినియోగించలేనిచో సోమరిపోతువగుదువు. దాచమన్నది సద్వినియోగం కొరకేగాని ఏ వినియోగం లేకుండా దాచుకొనమని గాదు. సంసార విషయములందు భావోద్రేకములను నిగ్రహించుకొని దైవచింతనలో భావోద్రేకములను పొందుము.

తండ్రిని త్యజించిన ప్రహ్లాదుని, తల్లిని త్యజించిన శంకరాచార్యుని భార్యను త్యజించిన బుద్ధుని, భర్తను త్యజించిన మీరాను ఆదర్శముగా పెట్టుకొనుము. ప్రేమ యనునది శక్తి యొక్క పవిత్రసారమైన మకరందము. అది సారమైన వెన్నవంటిది. దానిని కేవలము స్వామికే అర్పింపుము. దానిలో భాగమును ఎవ్వరికీ ఇవ్వకుము.

వీరందరు తాత్కాలికముగ నిన్ను పొందినవారే తప్ప - ఇప్పటికి ఎన్ని జన్మలు గడచినవో, ఎందరు భార్య, పుత్ర, జననీ జనకులు మారినారో తెలిసికొనుము. వారికిని ఇది బోధించి వారి ప్రేమలను స్వామికి సమర్పించునట్లు చేసి వారిని తరింపచేయుము. అంతేతప్ప, నీ ప్రేమను వారిపైకి పోనీయకుము. వారి ప్రేమలను నీవు ఆశించకుము. కేవలము స్వామికే నీ ప్రేమనంతా సమర్పించి, కేవలము స్వామి ప్రేమనే ఆశించుము. ఆ ప్రేమలో మహాభావము అను పరాకాష్ఠ రావలయును. నీ శరీరములో ప్రతి అణువు స్వామికై, గ్రీష్మ కాలమున ఇసుక రేణువులవలె కాలి కాలి అగ్ని కణములవలె అయినచో అదే మహాభావము. ఆ మహాభావముతో, రాజు అయిన తన భర్తను, సంఘ కట్టుబాట్లను తిరస్కరించి మీరా నాలో

ఐక్యమయినది. మీరా నా ప్రాణానికి ప్రాణము. రాధావతారము. ఆమె యొక్క మహాభావము చూడుము. భాష ప్రధానముకాదు. భావము ప్రధానము. భాష వేషమువంటిది. భావము వ్యక్తి వంటిది. వేషముచేత వ్యక్తి విలువ మారదు. నా కన్నుల నుండి ప్రేమ వర్షమును కురిపించిన ఆమెయొక్క మహాభావమును చూడుము.

''క్యోంతర్ సావో అంతర్యామీ ఆయ్‌మిలో కృపాకర్ స్వామీ
మీరా దాసీ జనమ్ జనమ్ కీ, పడీ తుమ్హారే పాం''

జగత్తులోని సంఘమును ఆధ్యాత్మిక సాధనలో తిరస్కరించుము ఏలనన వారి మాటలను పట్టించుకొని నీవు సంసారమున తగులుకొన్నచో, అచట వారెవ్వరూ నిన్ను రక్షించలేరు. మాట మాత్రము కూడా సాయపడరు. అసలు నిన్ను గుర్తించరు.

## సాధన

సాధన వ్యక్తిగత విసయము తప్ప లోకమును పట్టించుకొనవద్దు. లోకముయొక్క మాటలు పట్టించుకొన్నచో శంకరులు తన ముదుసలి తల్లిని వదులుకొనియుండెడివాడు కాదుగదా. ఏలనన ఆమె తనను అచట ( ఆ లోకములో) రక్షించలేదు అని తెలియును. ఆమె భాద్యతను నాపై విశ్వాసముతో వదలినాడు. అందువలన ఆమెను దత్త పుత్రునివలె రక్షించి యున్నాను. శంకరుని మూలముగా, ఆమెకును సద్గతిని ప్రసాదించితిని, నా కొరకు, తల్లిని త్యజించిన శంకరుడే నిజమైన మాతృసేవ చేసినవాడు. ఏలనన ఆమెను ఉద్ధరించినాడు. అదే నిజమైన సేవ తప్ప పాదములు పిసుకుట సేవకాదు అని వచించారు స్వామి.

శ్రీముఖ నామ సం॥ ఫాల్గుణశుద్ధ విదియ సోమవారం 14-3-94 : ఉదయం 4 గంటల సమయం శ్రీ దత్త భగవానులు ఇలా వివరించారు

## స్వామి సేవ

''నాయనా విను – స్వామి కార్యమునందు పాల్గొనుటయే స్వామి సేవకాని, కొబ్బరికాయలు, కర్పూరం అగరవత్తులు, సుగంధము నీవు అనుభవించు చున్నావే గాని నాకేమీ సంబంధములేదు. లోకోద్ధరణకు సంబంధించిన కార్యములలో పాల్గొనినచో నా నిజమైన సేవ చేసినవాడవగుదవు. నా దేవాలయము నిర్మించుటకు సాయపడిన పదిమంది శాశ్వతముగ అచ్చటచేరి తరింతురు. అది నా సేవ. నా సందేశములు వ్రాసి ముద్రించి ప్రచారము చేసి పదిమందిని శాశ్వతముగ కొన్ని తరతరాలు ఉద్ధరించినచో అది నా సేవ అగును'' అన్నారు స్వామి. ఇక అన్నదానము గూర్చి వివరించారు.

## అన్నదానము

''అన్నదానము జ్ఞానముతో చేయుము. ఆర్తులకు అన్నమిడుట దానము. ఏలనన నా సంతానములో ఒకడు ఆకలితో బాధపడుచుండగ వానికి అన్నమిడిన, నేను సంతసించుదును. వాడు అన్నార్జనకు అశక్తుడై వుండవలెనే తప్ప, సోమరిపోతునకు అన్నమిడరాదు. ఆ తరువాత నా భక్తునకు అన్నమిడుము. నీ విడిన అన్న శక్తితో వాడు నన్నారాధించిన పుణ్యములోనుండి కొంత నీకును చేరును. విచక్షణా రహితముగా అన్నదానము చేసినచో, దానిలోకూడా భాగము నిన్ను చేరును. కాన అన్నమిడిన తర్వాత ఆ అన్నశక్తి వ్యయము అగు వరకు నీ ఇంటిలో వుంచి దైవారాధన, దైవ సత్సంగములో ఉంచుము. అంతే తప్ప, అన్నము తినగానే వాడు వెడలి పోరాదు.

ఇక మనస్సు యొక్క స్వేచ్ఛ గురించి వివరిస్తాను.

మనస్సుకు దేశము, కాలము, పూజావిధానములో నియమములను పెట్టకుము. అట్లు పెట్టిన మనసు ఎదురు తిరిగి దానిలో లగ్నము కాదు. అట్లుకాక నీ ఇష్టమని చెప్పినచో దానికి స్వేచ్ఛనిచ్చినప్పుడు అది లగ్నమగును. అయితే ఇది కొంత సాధన స్థాయి వరకే వర్తించును.

ఆరంభదశలో మనస్సునకు స్వేచ్ఛ నిచ్చినచో విషయ వాసనలపైకి పోవును. దైవారాధనములోని రసము రుచి చూచి ఒక స్థాయికి వచ్చిన తర్వాత మనస్సుకు స్వేచ్ఛనిచ్చినచో అది లగ్నమగును. ఒకే విధముగా లేక ఒకే విధానములో ఉండిననూ దానికి విసుగుపుట్టును. భజన, పూజ, సత్సంగము, పారాయణము మొదలగు రీతులలో విధానమును మార్చుము. ఇవి అన్నియును పూజలే. తినబడునదంతయూ అన్నమైనట్లు ఇవి అన్నియునూ ఆరాధనలే.

## సాధనలో మాయ

సాధనలో మధ్య మధ్య మాయ సంసారములోనికి లాగుట కూడా సాధనలో భాగమే. అట్లా లాగబడి కొంతసేపు తరువాత పశ్చాత్తాపముతో భావోద్రేకముతో నన్ను ఆరాధింతువు. ఎండలో కాస్తసేపు నిలబడి నీడకు చేరినచో ఆ నీడయొక్క సుఖాతిశయము కలిగినట్లు సాధన విఘ్నము సాధనకు దోహదమే. అయితే ఇదియు సాధనలో ఒక దశకు చేరిన వారికే వర్తించును. అట్లు కాకున్నచో ఆరంభ దశలో సంసారము లోనికి లాగబడినవాడు అట్లే శాశ్వతముగ సంసారమున తగుల్కొనిపోవు ప్రమాదమున్నది.

## మనస్సును నిగ్రహించుట

కాన ఒక స్థాయికి వచ్చిన తరువాత మనస్సుయొక్క స్వభావమును అనుసరించి సాధన చేయవలెను. గాని దానిని నిగ్రహించుట నీ తరముగాదు. కొంతసేపు నిగ్రహించినను తరువాత అది నిన్ను పడవేయును. బాగుగా ఎదిగి పొగరులోయున్న కొడుకును వివేకముగా, వాని స్వభావము ననుసరించి హితము చెప్పినట్లు, చాలా శక్తివంతమైన మనస్సును మలచవలయునేకాని, పసిబాలునివలె భయపెట్టి అణచలేము అని వివరించారు స్వామి.

శ్రీముఖ నామ సం॥ ఫాల్గున బహుళ షష్ఠి శుక్రవారం 1-4-9 : శ్రీదత్త భగవానులు మోక్షమును గురించి ఇలా విశదీకరించినారు.

## "నా దర్శనమెప్పుడూ జ్ఞాన బోధకమే"

మోక్షము, సాయుజ్యము అంటే నాలో లీనమగుట అని తలచుచున్నారు. అట్లు లీనమగుట నాకు సాధ్యమే కాని అట్లు అగుటచేత జీవుడు తన ఉనికిని కోల్పోయి శూన్యమగుచున్నాడు. జీవుడు నాలో ఐక్యమగుటచేత నేను పెరగలేదు. అంతకుముందు తరగలేదు. కాన అట్టి మోక్షము చేత జీవుడు శూన్యమై చాలా నష్టము పొందుచున్నాడు. నా భక్తునకు నేను ఆ నష్టము కల్పింతునా? అట్టి ముక్తి నింతవరకు ఎవ్వరికీ ఇవ్వలేదు.

### ముక్తి

కాన ముక్తి అనగా ఈ సంసార బంధములనుండి విడిబడి నా సేవకుడై నా కార్యక్రమమున పాల్గొనుటయే. నా కార్యము ఈ సర్వజీవులను ఉద్ధరించుటయే. అట్టి కార్యమున పాల్గొనువాడు సంసార బంధముల తగులుకొనక, జన్మ మరణ దుఃఖములను అనుభవించడు.

అతడు నా ప్రతినిధిగా కొన్ని శక్తులను కలిగి లోక కళ్యాణార్థం ప్రదర్శించునట్లుగా అతనిని అనుగ్రహింతును. ఒక్కొక్క సమయమున ఆవశ్యకతనుబట్టి అతడిలో నేను పూర్ణముగా లీనమై అతడే నేను, నేనే అతడుగా ప్రదర్శింతును.

### జీవన్ముక్తి

కాన ముక్తి అనగా "నాది అను భావమును" పోగొట్టుకొనుటయే ఈ "నాది" పోయినచో "నేను" పోవును. అనాది సిద్ధించును. అట్టివాడు విశ్వమంతయు వాది అనుకొనును. సర్వప్రాణులను తన బిడ్డలే అను భావమును పొంది సర్వజీవోద్ధరణమునకై ప్రయత్నించును. అట్టివానిలో నేను పూర్ణముగా లీనమై ఉందును. ఇదియే జీవన్ముక్తి. దీనికి మరణము అవసరము లేదు. మరణానంతరము ముక్తి రావలయునను నియమము లేదు. ముక్తి, సాయుజ్యములు నీవు బ్రతికి ఉండగనే పొందగలవు. మరణము వలన మార్పు రాదు. ఇట్లు నా కార్యమున పాల్గొనుటయే నీకు నిజమైన సేవ యగును.

## నేను సర్వవ్యాపకుడను

నేను సర్వమును వ్యాపించియున్నాను. ఎందుకనగా నీవు ఎక్కడైనను నన్ను ఆరాధించుటకు వీలును కల్పించుటకే. నేను మద్యపాయిగానూ, స్త్రీలోలుడుగాను దర్శనమిత్తును. కారణ మేమనగా మద్యమును తాగువాడే నీ నిజమైన గురువు. ఎట్లు? మద్యపానము వలన ఆరోగ్యహాని, ధన నాశము, కీర్తి హాని మొదలగు నష్టములు కలిగినట్లే అయినా మద్యము వదలలేని వ్యసనము వలె నా ఆరాధన వలన సుఖములు కలుగకపోగా, కష్టములు కలిగిననూ నన్ను విడువ లేకుండటయే నిజమైన భక్తి. అట్లే ఎన్ని నష్టములు, కష్టములు కలిగినను స్త్రీ వ్యామోహితుడు, తన వ్యామోహమును విడనాడనట్లే దైవ వ్యామోహమును విడనాడరాదు.

కాన నా దర్శనమెప్పుడును జ్ఞాన బోధకమే, గురు స్వరూపమే అని గుర్తింపుము'' అని తెలవిచ్చారు.

శ్రీ ముఖ నామ సం॥ ఫాల్గుణ బహుళ సప్తమి శనివారము ది 2-4-94 శ్రీదత్త భగవానులు ఇలా వివరించారు.

## శ్రీదత్త పరీక్ష - కాకి-కోకిల

''నాయనా! వసంత కాలము వచ్చినపుడుకాని కాకి ఏదో, కోకిల ఏదో గుర్తించలేము. అదే విధముగా మృత్యువు ఆసన్నమైనప్పుడు కాని శ్రీదత్తుని విలువ, శ్రీదత్త వాణి యొక్క విలువ తెలియదు. ఈ క్షణికములు ఐహికములైన వాటి విలువకూడా ఆ సమయమున బోధపడును. ఇవి ఏల క్షణికములు ?

1. ఇవి నీ వెంట రావు. అంతే కాదు. 2. ఆ సమయమున నిన్ను కాపాడలేవు. నీ అనేక జన్మల మహాకాల ప్రవాహము ముందు ఇవి నీ వెంట రానందున, ఈ జన్మ ఒక క్షణమే కావున, ఈ జన్మ కాలము మాత్రమే అవి ఉంటున్నందున అవి క్షణికములే కదా.

## దత్తపరీక్ష

నేను కావలయునా? ఈ ఐహికములు కావలయునా? అనే ఒకే ఒక ప్రశ్నయే నా పరీక్ష. ఈ ఐహికముల కొరకు నేను కావలయునన్నచో, నీకు నిజముగా ఈ ఐహికములే కావలయును కాని నేను కాదు. ఏలనన ఈ ఐహికములను సాధించుటకు నన్ను సాధనముగా వాడుకొనుచున్నావు కాన నేను నీకు అవసరము లేదు. ఈ ఐహికములు ఒక్క క్షణ కాలము అనగా ఈ జన్మ పూర్తి కాగానే నిన్ను నిర్దయగా విడుచును. కాని నన్ను కోరుకొన్నచో జన్మ జన్మలలోను నిన్ను విడువక నీ వెంట పడుచుందును.

## ఐహికములను కోరకుము

రేపు అన్నది మరచిపొమ్ము. వృద్ధాప్యమునందు నీవు ఏమియు చేయలేవు. నీ వయస్సు ఉన్నప్పుడు సాధించుము. తెలియక సాధన చేయని వానికి మరల నరజన్మ వచ్చునేమో గాని, తెలిసి కూడా సాధన చేయని వానికిక ఎట్టి పరిస్థితులలోను తిరిగి మనుష్యజన్మ రాదు. ఐహికములు భోగముచే శాంతించవు. అవి భోగములచే వృద్ధిపొందును. కావున ఐహికములను కోరుట మొదటిలోనే త్రుంచుము. ఈ ఒక్కటి, ఈ ఒక్కటి అని అంతులేక పెరిగి పెరిగి చివరకు వాటి ఉచ్చులో చిక్కుకొని పోయెదవు. ఈ ఒక్కటి తీర్చిన చాలు వీడు దోవకు వచ్చునను నమ్మకముతో నేను ఒక భోగమునను ప్రసాదించగా, వాడు మరొకటి, మరొకటి అని అడుగుచున్నాడేతప్ప, నివృత్తి మార్గమునకు వచ్చుటలేదు.

నేను భోగములను అనుగ్రహించలేక కాదు. నేను భోగములను ప్రసాదించినచో ఎందుకు ఇచ్చుచున్నావని నన్ను అడుగువారు లేరు. నేనిచ్చినచో ఆ భోగములు కూడా అనంతములై వర్ధిల్లును. నేనిచ్చు దానికి అంతము లేకుండును. అట్లు నే నీయగలను. అట్లు ఇచ్చినచో నా నిధిలో కొరత పడదు. రోగి అయిన పిల్లవానికి గారెలు పెట్టని తల్లి, చేసిన గారెలు అయిపోవునని కాదు. అవి తిన్నచో ఇంకనూ రోగము వృద్ధి అగుననియే తప్ప వేరు కాదు.

## విరక్తి

విరక్తిని కలిగి యుండుము. నీవు ఈ ఐహికములను ఎంత కోరుచున్నావో అవి అంత వెనుకకు పోయి నిన్ను పరిగెత్తించి ఏడ్పించును. అవి ఎండమావులు. నీవు పరుగెత్తిన కొలది వెనుకకు పోవుచుండును. నిన్ను హింసించి వినోదించుట భోగములకు సరదా. వాటి సరదాకు బలిపశువు కాకుము. ఒక్కసారి విషయములను విదిలించి త్యజించుము మెల్ల మెల్లగా త్యజించుట అసంభవము. కాలము గడచిన కొలదీ అవి నిన్ను రోజు రోజుకు వశము చేసుకొనుచుండును కాన రోజులు గడచిన కొలదీ వాటి బలము పెరిగి నీ బలము తగ్గుచుండును.

## కాలకూట సర్పములు

ధనము, స్త్రీ పురుషుల అన్యోన్య వ్యామోహము, సంతానముపై అత్యంత బంధము, అష్ట సిద్ధులపై కోరిక, కీర్తి కాంక్ష అనునవి చాలా బలమైన కలకూట సర్పములవంటి విషయములు. వీటి వాత పడినవాడు రక్షింప బడలేడు. ఐహికములను సంకల్ప దశలోనే త్రుంచివేయుము. నీవు సంకల్పించిన ఐహికములు, సాధించ బడకుండా వాటికి విఘాతములను కల్పింతును. దాని అర్థము, నీవు సంకల్పించ వద్దని నీకు మాటి మాటికి బోధించుటయే. కాని ఎన్నిసార్లు బోధించినా, నీకు జ్ఞానము రానందున, నీవు మరల మరల సంకల్పించి వాటి కొరకు ఆరాటపడుచున్నావు.

## మననము

నీవు నేనిచ్చు ఈ జ్ఞాన వాక్యములనే రత్నములు వ్యర్థమైన రాళ్ళుగా భావించి, నిజముగా రాళ్ళయిన ఐహికములను రత్నములుగా భావించుచున్నావు. నేను నీకిచ్చు రత్నముల విలువ చివరి క్షణములో కాని తెలియదు. జ్ఞానమును విని, క్షణ క్షణము మననము చేయవలెను. అట్టి మననము చేయనిచో, తిరిగి విషయములు వశపరుచుకొనును. మననము చేయగా చేయగా ఆచరణ సిద్ధించును. ఆ దశలో వున్న వానిని విషయములు ఏమియు చేయలేవు.

## త్రిలోకసంచారి

నా లోకము బ్రహ్మ విష్ణు శివ లోకములే. ఆ మూడు లోకముల లోను యథేచ్ఛగా నా భక్తుడు సంచరించును. విష్ణు భక్తుడు కేవలం విష్ణు లోకములోనే వుండును. అట్లే ఇతర భక్తులు. కాని నా భక్తుడు ఈ మూడు లోకముల సంచరించి త్రిలోక సంచారి అగును. ఈ మూడు లోకములకు మించిన లోకములు లేవు. నన్ను మించిన, నాతో సమానమయిన దైవము లేడు లేడు లేడు అని నీకు నొక్కి వక్కాణించుచున్నాను. నన్నే సదా స్మరించి, నాయందే నీ దృష్టిని ప్రతిక్షణమును నిలుపుము. ఏ జీవుడయినా, ఏనాటికయినా ఉద్ధరించవలసిన ఉద్ధరించగలవాడను నేనే, నేనే, నేనే. కేవలము నేను ఒక్కడనే'' అని నొక్కి వక్కాణించారు.

భావనామ సం॥ చైత్ర శుద్ధ పాడ్యమి ఉగాది 11-4-94 భావ సం॥ ఉగాది సందేశము :

## భావము-ముఖము

శ్రీ ముఖము దానివెంట భావనామ సంవత్సరము. శ్రీ అనగా ఐహికము. ముఖము అనగా శరీరము వాక్కు రెండూ అర్థము. దాని వెంట భావము అనగా మనస్సు. కాన, ఐహికములందే త్రికరణములను అర్పణము చేయువాడు. నా ఐశ్వర్యమునందే దృష్టితప్ప నాయందు దృష్టిలేక ఉన్నాడీ జీవుడు. అయితే ఈ త్రికరణములలో భావము చాలా గొప్పది. భావమును నా వైపుకు తిప్పినచో వాక్కు, కర్మలు గూడ నా వైపునకు తిరుగును.

అయితే భావముపై ముఖముయొక్క ప్రభావమున్నది. అనగా నీవు సంబంధ సన్నిహితముగల శరీరములు అనగా వస్తువులు, నీవు విను వాక్కులు గూడ నీ యొక్క భావమును ప్రభావింప చేయుచున్నవి. కాన త్రికరణములు అన్యోన్యాశ్రయ బంధము కలిగి యున్నవి.

## సత్సంగము

శ్రీ శబ్దమునకు శ్రీవిద్య అనగా మోక్షవిద్యయను అర్థమున్నది. కావున మోక్షాసక్తుల సత్సంగము వారి వాక్యములను వినుటచేత భావము

ప్రభావితమగుచున్నది. కావున భావమును ప్రభావితము చేయు ముఖము అనగా వస్తువులు శబ్దముల యొక్క సంగమును నీవు నిర్ణయించుకొన్నచో నీ భావము నాయందు లగ్నమగును. దుస్సంగము, లౌకిక విషయ శబ్ద శ్రవణములు నీ భావమును నా నుండి మరలించును.

కాన, భావనామ సంవత్సరములోని భావమును, ఆ భావమును ప్రభావితముచేయు అంశములను గమనించి, భావమును సదా నాపై ఉండునట్లు ప్రయత్నించుము. ఇదియే సాధన. ఈ భావము అవిచ్ఛిన్నముగా ధారవలె అయినచో అదియే రాధ అదియే మహాభావము. దానిలో నన్ను పొందుటయేకాదు, నేను నీ దాసుడనగుదును.

## నిజమైన త్యాగియే సంన్యాసి

నిజమైన త్యాగియే సంన్యాసి. నాకొరకు సర్వమును త్యజించి, పరీక్షలో నాపైగల ప్రేమను నిరూపించిన అట్టి సంన్యాసి హృదయమే నా స్థానము. భార్య, పుత్ర, బంధు ధనాదులన్నియు త్యజించుటయేగాక, నా కొరకు ప్రాణములను సైతము త్యజించుటకు సిద్ధపడిన మీరా వంటి ఉత్తమ సంన్యాసి హృదయములే నా సహ్యపర్వతములు. సహ్య మనగా సహించగలది. నా పరీక్షలకు సహించి పర్వతములవలె నిలబడ గలిగిన ఆ సంన్యాసుల హృదయములే సహ్య పర్వత శ్రేణులు. మానవుడు ఇచ్చిన దానితో తృప్తిపడక ఇంకనూ కావలయునని నా వెంట పడుచున్నాడు. అట్టివాడు ఇక ఇచ్చినదానిని కూడా త్యజించిన సంన్యాసితో సముడగునా? ముందు, ఇంకనూ కావలయునను కోరికను త్యజించుము. ఆ తర్వాత ఇచ్చిన దానిని కూడా త్యజించగల రెండవమెట్టును ఆలోచిద్దాము. ప్రేమ పరీక్షలో నిలబడుటయే నిజమైన సంన్యాసము.

కొందరు తాము మనసా సంన్యసించితిమని చెప్పుదురు. అదియే నిజమైనచో గృహమును, సర్వులను విడచి ఏల పోకున్నాడు? పోగలిగిన కదా, నిజముగా సంన్యాసమును మనసా సిద్ధించినట్లు నిరూపణమగును. ఇట్టివి ఆత్మవంచనలే అగును. కొందరు భుక్తికొరకు, ధనార్జనకొరకు

కాషాయమును ధరించుచున్నారు. ఇట్టివి పరవంచనలగును. రెండునూ తుచ్ఛములే.

తనకన్న అధికుని, ముందు గౌరవించిననూ, క్రమముగా మానవుడు ద్వేషించి అసూయపడును. ఇట్టి ద్వేషముతో గృహస్థుడు, నిజమైన సంన్యాసికి, చివరకు భిక్షనిడడేమో అని శంకించి, గృహస్థుని ఊరడించుటకు, అన్ని ఆశ్రమములలో గృహస్థాశ్రమమే గొప్పది అన్నారు. కానీ, ఆచరణ పూర్వకముగా నాకై అన్నింటిని త్యజించిన వానికన్నా, ఆచరణలో ఏమీ త్యజించలేక తాను మనసా సంన్యసించితినని డంబములు పలుకు గృహస్థు గొప్పవాడు ఎట్లు అగును?

బ్రహ్మచర్యము నుండియే సంన్యాసము స్వీకరించుట ఉత్తమ ప్రేమ. గృహస్థుడు సంన్యసించుట మధ్యమ ప్రేమ. వానప్రస్థుడు సంన్యసించుట అధమప్రేమ. సంన్యాసిగా మరణించినవాడు ఉత్తముడు. వానప్రస్థునిగా మరణించినవాడు మధ్యముడు. గృహస్థుగా మరణించివాడు అధముడు. మధ్య మాధములకు మర్త్య, స్వర్గ, నరక లోకములను మూడు లోకముల వరకే గమనము. ఉత్తమునకు ఈ మూడు లోకములకు అతీతమయిన నా లోకము సిద్ధించును.

## నా పరీక్ష

మానసిక సంన్యాసము, ఆచరణ పూర్వక సంన్యాసమునకు నిలబడవలయును. అదియే దత్త పరీక్ష. నా కొరకు నీవు ఏ మాత్రము త్యజించగలవు? అనునదియే నా పరీక్ష. ఎంత త్యజించగలవో అంత ప్రేమ నాపై నీకున్నట్లు. ఏమియు త్యజించలేకున్నచో నాపై నీకు ప్రేమ ఏమియూలేనట్లే. శంకర,రామానుజ, మధ్వులు ఇట్లు ఆచరణ పూర్వకముగా సంన్యసించినవారు. రాధ,మీరా యును అంతే. నా సంప్రదాయములలో బ్రహ్మచర్యము నుండియే సంన్యాసి అగుట ఉత్తమ సంప్రదాయము. అయితే సంన్యాసి అహంకరించరాదు. ఇతరులను క్రమముగా

ఉద్ధరించుటకు ప్రయత్నించవలయును. కాని, ఇతరులు తనకన్నా తక్కువ వారని నీచముగా చూడరాదు. తక్కిన వారిని సానుభూతితో తరించుటకు జ్ఞాన బోధ చేయవలెను. ఇదియే సంన్యాసి ముఖ్య విధి.

## నైష్కర్మ్య సిద్ధి

నా కొరకు సర్వమును సంన్యసించగలనను నీ ప్రేమను క్రియా పూర్వకముగా నిరూపించుటయే నైష్కర్మ్యసిద్ధి. అదియే నిజమయిన సంన్యాసము. రామకృష్ణుడు వివాహమాడిననూ భార్యను స్పృశించలేదు. కేవలము శిష్యురాలిగా చూచినాడు. కాన అతడును బ్రహ్మచర్యమునుండి సంన్యసించిన ఉత్తముడే అగును. అట్లే మీరా కూడా, భర్తను తాకలేదు. ఆమెయు ఉత్తమ సంన్యాసియే. ఉత్తమునిగా నిలబడలేక పోయిననూ కనసీసము రెండవ,మూడవ స్థానములలో అయినా నిలువబడవలయునే గాని, మధ్యమ, అధమ స్థానములలో అయినా నిలబడలేక, అధమాధము నిగా నిలువబడరాదు.

ఇచ్చిన దానితో తృప్తి లేక, బ్రతికినంత కాలమూ అది కావలయును, ఇది కావలయును అని నన్ను వేధించుచూ, గృహస్థుడిగా – ఈ సంసార శ్లేష్మములో మరణించు ఈ మానవుడేనాటికి తరించును? అన్నారు శ్రీ దత్త స్వామి.

ఇంకా ఇలా వినిపించారు–

" ఏమి సేతుర జీవా! నేనేమి సేతుర? జీవా! ॥ ఏమి॥
ముక్తి నొసగమని కాళ్ళ బడేరు–బంధము తెంచిన ఏడ్చేరు ॥ ఏమి॥
ఇహమూ కావలె పరమూ కావలె – యోగము కావలె భోగము కావలె ॥ ఏమి॥
మహిమలు చేసిన గారడి యందురు–చేయకున్న నా మాట వినరు ॥ ఏమి॥

మనిషిగ వస్తే పొమ్మంటారు - సొమ్ములు పెట్టిన
నవ్వెదరు ॥ ఏమి॥
ఎక్కడ నుంచి వచ్చావో మరల నీవెక్కడికి పోతావో
నీకేమీ తెలియదుర జీవా
ఈ మధ్య క్షణ కాలము నందున, మిడిసిపడి ఎగిరెదవేలా ?
॥ ఎక్కడి॥
ఈ మేడలు మిద్దెలు పుత్రులు బంధులు, పట పట
తెగిపోతారు ॥ ఎక్కడి॥
జన్మము నరకము, మరణము నరకము, తదుపరి
నరకము చెప్పగనేలా? ॥ ఎక్కడి॥
నీ గతి తలచిన నాకే జలదరించును - ముద్దువలె
ఉంటావేలా? ॥ ఎక్కడి॥
కరుణాసాగర దత్తుని పాదము, గట్టిక పట్టిన
భయమేలా ? ॥ ఎక్కడి॥

ప్రతి క్షణమూ అంత్యకాలమని భావించి, మరుక్షణములోనే మృత్యువు సమీపించుచు నిన్ను కబళింపబోవుచున్నట్లు భావించి, ఆర్తితో భక్తితో నన్ను స్మరింపుము. అప్పుడు నీవు మృత్యువును గురించి భయపడ నేలా? ఎందుకనగా మృత్యువు ఏ క్షణమున వచ్చిననూ నీవు సిద్ధముగా వున్నావు. సిద్ధముగా వున్నవాడు భయపడడు. బాకీవాడు ఏ రోజు వచ్చిననూ వానికీయ్యవలసిన సొమ్మును నీవు సిద్ధముగా వుంచుకున్నచో నీవు సిద్ధపడియున్నావు కాన భయపడవు. సొమ్ములేని వాడు బాకీవాడు ఏక్షణమున వచ్చునో అని భయపడుచుండునుగదా. కావున సిద్ధముగా లేనివానికే భయముకాని, సిద్ధముగా వున్నవాడు భయపడడు ఇది ఈ నాటి దివ్యవాణి.

శ్రీ భావనామ సం॥ ఆషాఢ శుద్ధ త్రయోదశి మంగళవారము 21-6-94 శ్రీదత్త భగవానులు తన దివ్యవాణిని ఇలా అనుగ్రహించారు.

## మానవుడు-కృతఘ్నుడు

"నాయనా! శ్రద్ధగా విను. మానవుడు చాలా కృతఘ్నుడు. అందువలన జరామరణములకు లోనై క్రమముగా కృతజ్ఞతా జ్ఞానములేని పశుపక్ష్యాది జన్మల నొందు చున్నాడు. ఈ పశు పక్ష్యాదులు ఎట్టి కృతజ్ఞతా భావము తెలియక కేవలము పంచ భూతములను భోగించుచున్నవి. అట్టి పశు పక్ష్యాది జన్మల యొక్క స్వభావమునే మానవుడు తన మనుష్య జన్మలో ప్రదర్శించుచున్నప్పుడు, ఆ మానవుడు మరల మనుష్యజన్మనెత్తనేల? అందువల్లనే ఆ మానవునకు పునర్జన్మలన్నియు పశుపక్ష్యాది జన్మలే అగుచున్నవి.

అప : 1. నీవు దాహము కొన్నప్పుడు మంచినీరును త్రాగి ఎంత తృప్తిని, సుఖమును పొందుచున్నావు?

వాయు : 2. నీవు ఎండలో తప్తుడవైనప్పుడు జలస్నానములో చల్లని గాలిలో ఎంత సుఖమును అనుభవించుచున్నావు?

తేజో : 3. శీతాకాలమున వెచ్చని ఎండలో అనగా అగ్ని వలన ఎంత సుఖమునుపొందుచున్నావు ?

పృధ్వి : 4. భూమియొక్క ఫలరూపములయిన ఫలధాన్యాది పాకములను తినుచున్నప్పుడు ఎంత సుఖమును అనుభవించుచున్నావు?

ఆకాశము 5. విశాలమైన ఆకాశము కల నిర్జనమైన స్థలములో విహరించుచూ ఎంత సుఖమును అనుభవించుచున్నావు.

ఇట్లు పంచభూతములను వాటి వికారములను అనుభవించుచు ఎంతో భోగమును పొందుచున్నావు. కానీ ఈ పంచభూతములను అనుభవించు సమయమున ఆ సుఖానుభూతిలో పడిపోవుచున్నావే తప్ప, ఆ పంచభూతములను అసలు ముందుగా ఊహించి, సృష్టించినట్టి

సృష్టికర్తను ఆ సుఖానుభూతిలో తలచుచున్నావా? లేదు. కాన ఇట్టి కృతఘ్నదోషమును చేయుచూ మానవుడు ఆ పాపఫలము వల్లనే అధోగతి చెందుచున్నాడు.

## యోగి వేమన

మామూలుగా స్నానము చేసినపుడు మురికి పోదు. కాని సబ్బును ఉపయోగించినప్పుడు మురికి పూర్తిగా పోవును. అట్లే దత్త సబ్బును వాడినపుడు సంసారమాయ మలినమంతయును పోవును. నేను మాయ హరుడనేతప్ప మాయవర్ధకుడను గాను. నీవు ఇతర దేవతలనుపాసించి వారి నుండి కోరికలు నెరవేర్చుకొనుచూ వాటివలన వాసనలు పెరిగి ఇంకనూ శరీరమునకు బురద పూసుకొనుచున్నావని తెలియుము. నన్ను ఉపాసించుట అనగా సబ్బుతో చేయు స్నానము. మురికి పూర్తిగా పోవును. మురికియందును, బురదయందును కోరిక గలవాడు పందివలె బురదలో దొర్లునే తప్ప నిర్మలోదకముతో సబ్బుతో స్నానము చేయడు. కాన ఐహికము అను బురదను పోగొట్టి, సంసారమాయ అను మురికిని పోగొట్టు నన్ను , పందిజన్మల నెత్తినవారు ఆశించరు. పైగా విసర్జించి, ద్వేషించి నిందించుదురు.

పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా? ఈ బురదలో పొర్లాడుటకు ఏ తీర్థయాత్ర చేసినను ఏమి ప్రయోజనము? కాశీ, శ్రీశైలములు పోయి అక్కడ బురదగుంటలను కోరికలలో పొర్లాడుటకన్నా నీ యింటిలో కొలువు తీరియున్న నా స్మరణములో సబ్బుస్నానము చేసి పన్నీటిస్నానము చేయుటవేలు. కాశీపోవ పంది గజము కాదు. అవధూతయైన వేమన ద్వారా పలికిన వాడను నేనే సుమా! నా అనుగ్రహము వల్లనే అతడు యోగియైనాడు.

వాని నావేశించి శతకము చెప్పినవాడను నేనే. బురదనుపూసు కొన దలచువాడు సబ్బుస్నానం చేసినట్లు. చీకటి కోరువాడు దీపమును

వెలిగించినట్లు, ఐహిక వృద్ధిని కోరువాడు నన్నుపాశించును. శ్రీ గురుదత్తుని పలుకులు, మాయకు శరముల ములుకులు-మూఢుని రాత్రికి వెలుగులు అజ్ఞాని గడ్డకు పలుగులు.

## నా నిజరూపము వైరాగ్యము

నా నిజమైన రూపము ఈ మూడు ముఖములలో ఉన్నదని కాదు. సంసారమును వదలించుకొన దలచి, చేతకాక, ప్రయత్నము చేయుచు, సాయముకొరకు భగవంతుని అర్థించునపుడు ఆ భగవంతుడే దత్తుడనబడును. ఐహిక వృద్ధితో సంసారమును పెంచుకొనదలచి ఈ మూడు ముఖముల రూపమును ఉపాసించునపుడు ఈ మూడు ముఖముల రూపము దత్తుడు కాదు. కాన నా నిజరూపము వైరాగ్యమని తెలియుము. వైరాగ్యముతో భగవత్ప్రీత్యర్థముపాసించినపుడు ఆ దేవత ఏ రూపముతో యున్ననూ శ్రీదత్తుడే ఆ దేవత అని తెలియుము నా అనుగ్రహము, నా ఆగ్రహము రెండునూ నా అనుగ్రహముగనే భావించువాడే నా నిజమైన భక్తుడు

గురువు ఎప్పుడునూ శిష్యుని తప్పులు చూపి విమర్శించును. అదే గురుతత్త్వము. గురుతత్త్వము ఎప్పుడునూ చేదుగనే వుండును. అందువల్లనే వేమన శతకము అంతయు చేదు విమర్శయే. గురువయిన నా పలుకులు అవి''. ఆహా! స్వామి! ఇంత కఠినముగా చెప్పిననూ నీ హృదయము ఎంత మృదువయ్యా! వెన్నలాంటి హృదయముగల నీవు ఇంత కఠినముగా, నిష్కర్షగా చెప్పితివి గదా! నీవు ఆది గురువువు కదా! ధన్యులము.



ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీ గురుదత్త! ఓం జయ గురుదత్త!

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము - 8

శ్రీ గురుని సందేశములను గత 7 అధ్యాయములలో చదువరులు అమృతమును ఆస్వాదించి ఎంతో ఆనందానుభూతిని పొందినారని ఆశించుచున్నాము. ఇందులోని ప్రతి విషయము అక్షర సత్యమే. అంతా సర్వేశ్వరుని ఆజ్ఞానుసారమేగాని ఇందులో మా ప్రయోజకత్వమేమియూలేదని సవినయముగా మనవి చేసుకొనుచూ ఎనిమిదవ అధ్యాయము అందించుచున్నాము. శ్రీ గురుని దివ్యవాక్కును గ్రోలి మనమందరము కైవల్యధామమును చూరగొందుముగాక యని శ్రీవారికి వినతి.

శ్రీ భావనామ సం॥ ఆషాఢ శుద్ధ చతుర్దశి బుధవారము ది. 22-6-94 శ్రీ దత్త భగవానులు శ్రీ దత్త భక్తులకు సాక్షాత్కరించి అనుగ్రహించిన దివ్యవాణి శ్రద్ధగా పఠించి తరింతుము గాక!

### యోగసిద్ధి

''యుక్తాహార విహారశ్చయోగోర్భవతి దుస్సహా''

యోగము సిద్ధించుటకు సంగ్రహముగా పాటించవలసిన అంశములను గుర్తు పెట్టుకొనుము.

1. ఏ విషయమునూ మనస్సుచేత చింతించుట మాన వలయును. చింతచేత మనస్సు బలహీనమగుటయే గాక సంసారమునందు ఎక్కువగా లగ్నమై చివరకు సంసారమునకు బానిసయగును. ఏది ఎట్లు అయిననూ నీ చేతిలో లేదు. అంతా కర్మ వశమే. ఆ కర్మ దైవశాసనవశమై వున్నది కాన, చింతకు బదులు దైవ ధ్యానము చేసినచో ఆ నీవు చింతించు ఐహిక విషయములు కూడా సక్రమంగా నెరవేరును. చింతించుటవలన

నీవు ఏదో కొత్త మార్గమును కనిపెట్టుదుననుకొనుచున్నావు. కానీ ఆ కొత్త మార్గము కర్మ చక్రమునబడి చూర్ణమగును.

2. సంతోషము, దుఃఖము - ఈ రెండింటిని త్యజింపుము. ఈ రెండును శక్తిని వ్యయముచేయు బలమైన మార్గములు.

3. నీ శక్తిని, నీ సమయాన్ని నాకై వినియోగించుము. ఏలనన శక్తి-కాలము అను పార్వతి శివులు నాయందే యున్నారు. నీ ద్రవ్యమును, నీ జ్ఞానమును నాకై వ్యయించుము. ఏలనన ద్రవ్య-జ్ఞానములగు లక్ష్మీ విష్ణువులు నాలో వున్నారు. ని వాక్కును నీ బుద్ధిని నాకై ఉపయోగించుము. ఏలనన సరస్వతీ బ్రహ్మలగు వాక్కు బుద్ధులు నాలో వున్నారు. ఇదే నన్ను ఆరు తత్త్వములుగా షణ్ముఖ రూపంగా దర్శించుట.

4. మితంగాను, బాగుగా వండినదియును, వైద్యశాస్త్రము ప్రకారము పథ్యమైనదియును భుజించుము. శరీరారోగ్యము, ఆయుర్దాయములు సాధనకు ఎంతో ప్రధానాంశములు. వీటిలో వికటించినచో నిద్రయును భంగమగును. నిద్రయును చాలా అవసరము. మరియును విహారములను తగ్గించుము. అనగా ఒక ఊరినుండి మరియొక ఊరునకు తిరుగుటవల్ల చాంచల్యము వచ్చును. ఇదే ''యుక్తాహార విహారస్యయోగో భవతి దుస్సహః'' అని గీతలో చెప్పితిని.

భావనామ సం॥ ఆషాఢ బహుళ షష్ఠి బుధవారము29-6-94 రాత్రి 2 గంటల సమయము.

## తృప్తి - పరిపూర్ణసిద్ధి

శ్రీదత్త భగవానులు శ్రీ గత్త భక్తుని లేపి కూర్చుండ నియమించి అనుగ్రహించిన దివ్యవాణి ''నాయనా! లే, శ్రద్ధగా విను. ఇది చాలా ముఖ్యవిషయము బహుజా,,రూకుడవై వినుము తృప్తితో నుండుము. ఇదంతయును నాది. నేను నీవే అయి నప్పుడు నాదంతయూ నీదికాదా? కావున పరిపూర్ణసిద్ధి లక్షణము ఎల్లప్పుడూ తృప్తితో నుండుటయే. కాన సిద్ధుడు దేనినీ కోరడు. కోరవలసినది లేదు. అంతయు పొందినవాడు కాన కొత్తగా పొందుట వలన ఏర్పడు సంతోషమూ లేదు. పొంది పోయినదీ లేదు కాన దుఃఖమూ లేదు.

నా వాక్కును మాత్రమే ప్రచారము చేయుము. ఈ నాడు అనేక గురువులు తప్పు సిద్ధాంతములను ప్రచారముచేసి లోకులకు అధ్యాత్మిక ముగా అపకారము చేసి మహాపాపము చేయుచున్నారు. నా వాక్కును ప్రచారము చేసి మహా పుణ్యమును సంపాదించుము.

## జీవుని గతులు

జీవుని గతులిట్లుండును.

**1. పుణ్యపాపములు లేని జడుని అవస్థ :**

పశుపక్ష్యాది జన్మలు. ఫలము : స్వర్గ నరకముల బొందడు.

**2. పుణ్యము :**

లోకులకు ఐహికవములలో సాయము చేయుట. ఫలము : స్వర్గలోకప్రాప్తి తిరిగి మానవ జన్మ.

**3. మహా పుణ్యము :**

లోకులకు ఆధ్యాత్మికముగా నా వాక్కును ప్రచారముచేసి సాయపడుట. ఫలము : నా లోకమును చేరును. తిరిగి యిచటకు రాడు.

**4. పాపము :**

ఇతరులకు ఐహికముగా అపకారము చేయుట. ఫలము : నరకమును పొంది తిరిగి మానవ జన్మ.

**5. మహాపాపము :**

ఇతరులకు ఆధ్యాత్మికముగా తప్పు సిద్ధాంతములను ప్రచారము చేసి అపకారము చేయుట. ఫలము : శాశ్వత నరక ప్రాప్తి.

కావున ఎవ్వడునూ మహాపాపమును ఆచరింపక పుణ్యమును, మహా పుణ్యమును చేయవలెను.

అజ్ఞానము వలన గుడ్డితనము కలుగును. అట్టి అజ్ఞానాంధుడు నేనే రూపమున వచ్చినను చూడజాలడు. ఇక అజ్ఞానము కొంత కలిగి చత్వర దోషమున్నవాడు స్థూలమైనది చూచునే తప్ప, సూక్ష్మమును చూడలేడు. అట్టివాడు, నేను కొంత సిద్ధిని ప్రదర్శించిననే నన్ను గుర్తించును. పూర్తిగా జ్ఞానియగువాడు నేనే సూక్ష్మరూపమున వున్ననూ

అనగా ఎట్టి సిద్ధినీ ప్రదర్శింపకపోయిననూ నన్ను గుర్తించును. నా యందే తీవ్ర కామము కలవాడు జ్ఞాని. సంసార కామమే అజ్ఞానము.

## ఎవరిని నిందించకుము

ఎవరినీ నిందించకుము. ఏ పుట్టలో ఏ పామున్నదో నేను నిన్ను పరీక్షించుటకు అతి సూక్ష్మమైన దైవత్వముతో నీ కడకురాగా నన్ను అల్పునిగా భావించి నిందించినచో ఎంతో దోషము! ఒకవేళ సాధకుడు అత్యల్పమైన దైవత్వము కలవాడయినను వానికి నమస్కరించుము.

నీ నమస్కారము వానిలోగల అత్యల్ప దైవత్వమునకే చెందును. కాన నాకే చెందును. అధములను ఉద్ధరించుటకు నేను ఒక్కొక్కసారి అత్యల్ప దైవత్వముతో వారల స్థాయికి దిగి రావలయునుగాన అట్లు వచ్చిన నన్ను అల్పునిగా నిందించినచో నన్ను నిందించినట్లే కదా. కాన నీ కన్ననూ తక్కువవానిగా ఒక్కొక్కసారి నేను నీకు కనిపించవచ్చును. కాన ఎవరినీ నిందింపకుము'' అన్నారు స్వామి.

శ్రీ భావనామ సం॥ ఆషాఢ బహుళ అష్టమీ శుక్రవారం ది. 1-7-94 ఉదయం 4 గంటల సమయం శ్రీ దత్త దివ్యవాణి.

## ఉదాసీనుడవు కమ్ము

'' ఐహికములైన అన్న పాన వస్త్రాదులను ఇచ్చుచో, వాటిని పొందు శరీరము నశించును గాన అట్టి దానములచే లభించు పుణ్యము అశాశ్వతముగాన స్వర్గ ప్రాప్తికి కారణమై తిరిగి మానవ లోకమును ప్రవేశించుటకు కారణమగుచున్నది. కానీ, శాశ్వతమైన ఆధ్యాత్మికములో సాయము చేయుచో జీవునకు అది శాశ్వతమైన మోక్ష ప్రాప్తికి కారణమగును. కాన ఈ మహా పుణ్యము వలన శాశ్వతమైన నా లోకము లభించును. ఉదాసీనుడవు కమ్ము. కానీ ఆ ఉదాసీనత అద్వైత సాయుజ్యము అనంతరము రావలయునే కాని, సాధనలో ఉదాసీనత కారాదు. సిద్ధి అనంతరము ఉదాసీనతపూర్ణ తృప్తివలన ఏర్పడి సాక్షి మాత్రముగా వుందువు. జడములయిన కొయ్యలచే చేయబడిన ఈ పాదుకలు బ్రహ్మర్షులచే అర్చించబడుచున్నవి. కాన నా సంగముచేత

జడుడవైన నీవును లోక పూజ్యుడవుగుదువు కాన నేను మూఢుడనని చింతించకుము.

నా నైవేద్యము పాలు. వాసుదేవుని నైవేద్యము వెన్న. వెన్న పాల నుండి ఏర్పడును. అనగా నా నుండియే వాసుదేవుడవతరించినాడని నిశ్చయముగా తెలియుము.

అద్వైతము సిద్ధి. అయిననూ సాధకుడు తానే బ్రహ్మనని భావించవచ్చును. దానివలన సాధనలో ఉపయోగమున్నది. అట్లు అని నిజముగా తలచరాదు. తానే బ్రహ్మననుకొన్నప్పుడు నిర్వికారముగా సుఖః దుఃఖములకు అతీతమయిన ఉదాసీనత సంపాదించుకొనుట చేత సంసారము నందు శక్తి దుర్వినియోగమును అరికట్టి యోగమును సాధించవచ్చును.

## పాపము

పాపమును శిక్షించు భద్రకాళిని నేనే. గురువుయొక్క తత్త్వమే తప్పును దండించుట. పాపములో పరజన ద్రోహము మొదటి పాపము. అంతకన్ననూ ఎక్కువ పాపము దైవమునందు చూపవలసిన శ్రద్ధచూప కుండుట. అంతకన్ననూ ఎక్కువ పాపము దైవమునందు అసలు శ్రద్ధ చూపకుండుట. అంతకన్ననూ ఎక్కువ పాపము దైవమున్నాడని అంగీకరింపకుండుట. అంతకన్ననూ ఎక్కువ పాపము దైవ ద్వేషము దైవనింద.

## నరక లోకము

ఇదిగో చూడుము ఈ నరకలోకము. ఇక్కడ జీవులను శిక్షించు శక్తిని నేనే. రాక్షసునిలోని గుణములను పోగొట్టుటకు వాని రక్తమును త్రాగి క్రొత్త రక్తముతో నింపి పంపు వైద్యురాలే భద్రకాళి. అంతే తప్ప రక్తమాంస ప్రియకాదు.

జీవుడు శిక్షింప బడిన తరువాత తిరిగి జన్మించినపుడు ఆ శిక్ష స్మృతిలో లేదు కాన తిరిగి పాపము చేయును. ఆ శిక్షను స్మృతిలో ఉంచినచో భయముచేత పాపము చేయడు. కాని భయముచేత కాక, స్వతః పాపము చేయని స్వభావము రావలయును. కాన శిక్షను విస్మరించునట్లు చేసి, పునర్జన్మను ప్రసాదించుచున్నాను.

శ్రీ భావనామ సం॥ ఆషాఢ బహుళ నవమి శనివారము 2-7-94 ఉదయం 5 గంటల సమయము. శ్రీదత్తభగవానులు అద్వైత సిద్ధిని గూర్చి ఇట్లు వివరణ అనుగ్రహించినారు.

## అద్వైత సిద్ధి

"నాయనా! శ్రద్ధగా విను అద్వైత సిద్ధి ఉన్నది. ఇది రెండు విధములు :

### 1. నీవు నాలో లీనమగుట :-

ఇందులో నీ నామ రూపములు శూన్యమై నేనే మిగులుచున్నాను. కాన నీకు చాలా నష్టము. ఇది ఎవ్వరికిని ఇవ్వను. కాని భక్తుడు ఇదే కావలయునని పట్టుపట్టినచో ఇదే ఒసగుదును. తప్పదు.

### 2. నేను నీలో లీనమగుట :-

ఇందులో నీ నామరూపములట్లే యుండును. నేను నీలో లీనమగుదును. ఈ అద్వైత సిద్ధిని చాలా మందికి ఇచ్చి యున్నాను. ఇదియే జీవన్ముక్తి.

కాన అద్వైత సిద్ధిలేదనరాదు. అట్లులేదని చెప్పుటకు ఎవరికినీ అధికారము లేదు. అయితే అది జ్ఞాన సాధ్యముకాదు. కేవలము భక్తి ప్రపత్తి సాధ్యము.

బాగుగా తెలివి కలవాడు (జ్ఞాని) బాగుగా పనులు చేయువాడు (కర్మి), దృఢమైన ఏకాగ్రత కలవాడు (యోగి), ఈ ముగ్గురికన్ననూ నీవనగా ఇష్టము. (ప్రేమ) గలవాడు (భక్తుడు), - నా దయపై ఆధారపడి అహంకారము లేనివాడు (ప్రపన్నుడు) అగువాడు (భక్తి, ప్రపత్తులు కలవాడు) నాకు ఎక్కువ ఇష్టుడగును. కావున భక్తి ప్రపత్తి కలవానికి సిద్ధినిచ్చుచున్నాను.

అట్లు అని, జ్ఞాన, కర్మ, యోగములు వ్యర్థమని కాదు. నేను తెలియుటకు వీలుకానివాడనని తెలియుటయు, భక్తి సాధ్యుడనని

తెలియుటయు, జ్ఞానము. భక్తి ప్రపత్తులతో నన్నారాధించుటయే కర్మ. సంసారమున చిత్తము చీలికలు కానీయకుండా ఏకాగ్రతను సాధించుట యోగము.

భావోద్రేకము భక్తియొక్క తారాస్థాయి. ఇదే మహాభావము అనబడును. యోగము లేనిదే ఇది సిద్ధించలేదు. యోగ మనగా సంసార విషయములందు శక్తి దుర్వినియోగము అరికట్టుటయే. అది లేనిదే మహాభావము రాదు.

దేవతల నానా రూపములలో ప్రతిరూపమును సృష్టికర్తగా, సృష్టి భర్తగా, సృష్టిహర్తగా కీర్తించుచున్నారు. దీని అర్థము - నేను ఏ రూపములోనైనా లీనము కాగలను. నేను నీలో లీనమైనచో నీవు ఈ జన్మలోనే పరబ్రహ్మవు కాగలవని అర్థము. అట్లు చేసినచో నీకు నష్టముకాని అద్వైతసిద్ధి. అట్లుకాక, నీవు నాలో లీనమైనచో నీవు శూన్యమగుట నీకు నష్టము. నా భక్తునకు నష్టము అగుట నేనిష్టపడను. భక్తియనగా శుద్ధ ప్రేమ. శుద్ధ మనగా ఎట్టి ప్రతిఫలాపేక్ష లేకుండుట'' అని వచించారు స్వామి.

3-7-94 ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయములో స్వామి శ్రీ దత్తభక్తులను నిద్రలేపి ఈ దివ్యవాణిని అనుగ్రహించారు. ''నాయనా! లే. చాలా ముఖ్యమైన విషయమును చెప్పుచున్నాను. శ్రద్ధగా విను.

## అహంకారము

అద్వైతసిద్ధి లభించినకాని, అహంకార రాహిత్యము ఏర్పడదు. అంతకన్న తక్కువ సిద్ధి ప్రాప్తించినచో నీలో నీ స్వభావము కొంత వుండును. జీవ స్వభావమున్నంత కాలము ఏదో ఒక సమయమున వారు అహంకారమునకు వశులై పతితులగుదురు.

అందువల్లనే పూర్ణ అద్వైతసిద్ధి రాని ఋషులు, దేవతలు మొ॥ వారందరూ అహంకారమునకు వశులైనారు. నీకన్న రెండవవాడు అధికుడు ఉన్నాడని తెలియగనే, నీలో మాత్సర్యము (అసూయ) ప్రవేశించును.

దానియొక్క ఫలమే అహంకారము. నాకన్నా అధికుడుకాని, సముడుకాని లేనందున, నాలో అసూయకాని, అహంకారముకాని, ప్రవేశించజాలవు. కాన కేవలము నా పూర్ణ అద్వైతసిద్ధి లభించిన కాని దీని నుండి ముక్తుడవు కావు. అసూయలేని అనసూయకు మాత్రమే నేను దత్తునిగా లభించు చున్నాను.

## సత్సంగము

సత్సంగము చాలా గొప్పది. సదా దానియందే ఉండుము. మధ్యలో ఆపినచో దాని ప్రభావము నశించి నీ జీవస్వభావము విజృం భించును. అందువల్లనే నీకు నేను ప్రతిరోజు సత్సంగమును ప్రసాదించు చున్నాను. కోటానుకోట్ల జన్మల దుస్సంగ ప్రభావమును ఒక్క జన్మలో పోగొట్టవలయునన్నచో ఎంత తీవ్రమైన సత్సంగమును ఆచరించవలయునో ఆలోచించుము. అందువలననే నీ వెంట నిత్యము పడుచున్నాను. ఒకసారి బాధ్యతను నేను స్వీకరించిన తరువాత పూర్ణసిద్ధిని పొందువరకు నేను, నీవెంత మొత్తుకున్నను విడనాడలేను.

## నా ప్రత్యేకత

శ్రీదత్తుని ప్రత్యేకత ఇదియే. సాధారణముగా, నేను ఎవరి బాధ్యతను స్వీకరించను. మాయను ప్రదర్శించి నా దరికి రానీయకుండా జారిపోవుచుందును. ఒకసారి నేను చిక్కితినేని, ఇక నీవు నన్నుపోగొట్టు కొనవలయునని విశ్వప్రయత్నము చేసిననూ పోను. చిక్కడు-చిక్కితే విడువడు -ఇదే దత్త తత్త్వము.

తన గర్భమున పుట్టిన శిశువు ఏడ్చినను, తల్లి వామును పోయుట మానునా? కాన నీవు నా యందు, నిర్లక్ష్యము చేసిననూ, నన్ను పొమ్మని కేకలు పెట్టిననూ విడువను. శిశువు జారిపోయినా, చేతులతో కొట్టినా తల్లి విడుచునా?

నా వాత్సల్యము ముందు మాతృ, పితృ, గురు వాత్సల్యములు ఎందుకు పనికిరావు. అందువలన శ్రీదత్తుని చిక్కించుకొన్నవాడు ధన్యుడు. తరించక తప్పదు.

భక్తిలో ప్రపత్తిని కలుపుము. అప్పుడు అహంకారము రాలేదు. నిన్ను నీవు సదా అట్టడుగున వుంచుకొనుము. ఎవరు నిన్ను స్తుతించినా వెంటనే జాగరూకుడవై, ఆ స్తుతిని నా పరము చేయుము. అట్లు చేసినచో, నిన్ను దేవతలు సైతము స్తుతించు స్థితికి తెచ్చెదను. వినయమునకు మించిన సాధన గుణము లేదు.

## ప్రచారము

నా సందేశములను ప్రచారము చేయుము. దానితో ఇతరులును ఉద్ధరింపబడుదురు. అట్టి ప్రచారములో నీకును నిశ్చయము వృద్ధియై తరింతువు. ఒక పాఠము నీవు ఏకాంతముగా చదువుకొనుటకన్ననూ, ఇతరులకు బోధించిననాడు, ఆ పాఠము నీకు బాగుగా వచ్చును. కాన ప్రచారములో నీ ఆచరణకు బలము వచ్చును. అట్లు చేయుట నా కర్తవ్యములో నీవు నాకు సహకరించుచున్నావు. దానిచేత నిన్ను ప్రసిద్ధునిగా చేయవలయునని తలంపు తప్ప, నా పనికి ఎవరి సాయము అక్కరలేదు. సదా సత్సంగమే నిత్య జ్ఞానము. నిత్య జ్ఞానమే అజ్ఞానమును పూర్తిగా తుడిచివేయగలదు. సత్సంగము ఆపినచో వెంటనే దుస్సంగము నీ వెంట బడి లాగుకొని పోవును. ఆచరణములేని జ్ఞానము వ్యర్థము. ఆచరణము కావలయునన్న జ్ఞానము నిత్యము నిలువ వలయును. జ్ఞానము నిత్యము వుండవలయునన్నచో సత్సంగము సదా చేయుచుండవలయును. దీపము నిత్యము వెలుగుచుండినచో వెలుతురు నిత్యముగా వుండును. చీకటిరాదు వెలుతురులో ఆచరణ అను పనులను చేయ వీలగును.

నా నామ జపముకన్ననూ, సత్సంగము విలువైనది. దానితో సమానమైన సాధనలేదు. ఇట్టి సత్సంగములో ఋషులు సదా కాలము గడిపిరి కాన, వారు పూర్ణ అద్వైత సిద్ధిని సాధించగలిగిరి. చీకటి అనగా వెలుతురు లేకపోవుటయే తప్ప ప్రత్యేక పదార్థము కాదు. అజ్ఞాన మనగా ఒక విషయము తెలియక పోవుటయే. ప్రత్యేకముగా లేదు. విషయమును తెలిసినంతటనే, ఆ విషయము తెలియకపోవుటయను అజ్ఞానము పోవును.

కావున జ్ఞానము రాగానే అజ్ఞానము దాని యంతట అదే

నివర్తించును. కాన సదా సత్సంగముతో సదా జ్ఞానమును సంపాదించుము. జ్ఞానము అనంతము - అజ్ఞానమూ అనంతమే. అనంతమైన అజ్ఞానము పోవలయునన్నచో అనంత జ్ఞానమును సంపాదించవలయును. అట్టి అపారజ్ఞానసముద్రమే గురువు. ఆ గురువు నేనే.

''సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ''

అట్టి అనంత జ్ఞానమే బ్రహ్మము కాన అట్టి సదా జ్ఞానముచే, అజ్ఞానము నివర్తింపబడి ఆచరణ సిద్ధించి, నాయందు నీవు చేయు ప్రపత్తి భక్తిచే పూర్ణ సిద్ధిని పొందుదువు'' అని శెలవిచ్చారు స్వామి.

7-7-94 గురువారము శ్రీదత్త దివ్యవాణి :

## జీవుడు

''జీవుడు చైతన్యము అను పదార్థముతో చేయబడినాడు. చైతన్యము పంచ భూతముల వికారమే తప్ప, నా స్వరూపము కాదు. నేను చైతన్యము కాకపోయినను, సంకల్పించగలను. నేను అగ్నిని సృష్టించితిని. కాన అగ్నిని కాకపోయిననూ, సర్వమును దహించగలను. కాన దహించు శక్తి వున్నది కాన అగ్నిని కావలసిన పనిలేదు. అట్లే సంకల్పము అను ధర్మమున్నది. కాన చైతన్యము కావలసిన పనిలేదు. అన్నము యొుక్క వికారమే చైతన్యము. అన్నము తిననివాడు నిశ్చేతనుడగుచున్నాడు. అన్నము నుండియే జీవుడు సంభవించుచున్నాడు కావున జీవుడు స్వయముగా బ్రహ్మముకాదు. కాని నా అనుగ్రహము వలన కాగలడు. నా సంకల్పము చేత నేను ఎట్లు జీవునిగా మారగలనో, అట్లే నా దయచేత జీవుడు బ్రహ్మము కాగలడు. అట్లు కాదని చెప్పుటకు ఎవరికినీ అధికారము లేదు. అట్లు చెప్పినచో నా సర్వశక్తిత్వమును కించ పరచినట్లే గదా.

## తపస్సు

నా దయను సంపాదించుకొనుటకు తపస్సు చేయుము. తపస్సు అనగా నా కొరకు తపించుటయే. తపస్సులో క్రమముగా ఆహారము, జలపానము, వాయు భక్షణము (అనగా శ్వాసను పీల్చుట)

వదలుట జరుగును. ఇట్లు త్యజించుట ప్రయత్న పూర్వకముగా చేసినచో మరణము పాలగునే తప్ప సిద్ధి లభించదు.

త్యాగము అప్రయత్నముగా జరుగవలయును. అనగా నాపైనున్న ఆసక్తితో తినుట, నీరుత్రాగుట, గాలిపీల్చుట కూడా విస్మరించినచో అది తపస్సు అగునే తప్ప బలవంతముగా చేయరాదు. బలవంతముగా నా పూజలు కూడా చేయవనిలేదు. నీ పూజలకు నేను ముఖము వాచుకొని కూర్చొనలేదు. అప్రయత్నముగా, భావయుక్తముగా చేయవలెను.

## భావోద్రేకము

కామోద్రేకమున యున్న యువకుడు తన ప్రియురాలిని ఎట్లు బలవంతము లేక అప్రయత్నముగా ముద్దు పెట్టుకొనుచున్నాడో అట్లే అప్రయత్నముగా బలవంతము లేక భావోద్రేకముతో నా పూజ చేయవలెను. భావోద్రేకము వున్నప్పుడు చేయు క్రియలు అన్నియు నా పూజలే. అట్టి క్రియలు సాంప్రదాయ విరుద్ధములైనను నా కిష్టమైనవి కాన పూజలు అనబడును.

అంతేగాని భావము-భావోద్రేకము లేక కేవల సంప్రదాయాను సారముగా చేయు క్రియలన్నియు బూడిదలో పోసిన పన్నీరు అగును. ప్రయత్నములో బలవంతమున్నది. అప్పుడు దానిలో భావము లేదన్న మాట. భావము లేక సాంప్రదాయానుసారముగా నాకు చేసిన షోడశోపచార పూజలన్నియు వ్యర్థములే. భావముతో, అశ్రువులతో, మోహముతో పులకరింతలతో, నా విగ్రహమువైపు లేదా నా చిత్రవటము వైపు ఒక్క చూపు చూసిన చాలును.

అదే భగవద్దర్శనము. అదే ''ద్రష్టవ్యః'' కొందరు ఆ భావము ఇంకను ఉద్రేకము చెంద, నా పటమును ముద్దుపెట్టుకొందురు. ''అయ్యో! దేవతా పటము ఎంగిలి అయినది'' అని యితరులు విమర్శింతురు. కాని ఆ ఎంగిలి ముద్దే నాకు ప్రియము. ఆ ఎంగిలి ముద్దులో నీ నోటిలోని ఉమ్మితో నేను తడవబడి పవిత్రమైన భక్తి రసముతో స్నానము చేసినవాడనగుదును తప్ప భావములేని నీ పంచామృతచందనరసాది స్నానములచేత, నేను అపవిత్రుడనగుచున్నాను.

భక్తికి తగినట్లు పూజ వుండవలెను. భక్తికి మించిన పూజ చేయు

వాడు తన స్వార్థమును ఆశించి చేయుచున్నాడే తప్ప నాపై ప్రేమతో కాదు. ఎంత భక్తి వుండునో దానికి తగిన ప్రమాణములో క్రియ (పూజ) వుండవలయును. అట్లు భక్తికి తగిన ప్రమాణంలో క్రియ వున్నప్పుడే, ఆ పూజలో సత్యమున్నది కాన నేను ఇష్టపడుదును.

నాపై నీకు అణుమాత్రమే ప్రేమ (భక్తి) వున్నచో నిమిషమాత్రమే పూజ చేయుము. భక్తి అణు మాత్రమే వుండి, పూజ గంటలు చేసినచో అది అసత్యమయిన పూజ. అది, వేశ్య ధనము నాశించి, ఎంతో ప్రేమ వున్న దానివలే, గంటలకొలదీ నిన్ను లాలించునట్లుండును. అది గంటల కొలది ముద్దుల వర్షము అను క్రియను చేయుట లోపల ప్రేమ వుండి కాదు. నీ ధనము నాశించియే. కానీ కులకాంత అట్లుకాదు. నిజముగా ప్రేమ కలిగినప్పుడే ముద్దు పెట్టును తప్ప ప్రేమ భావము మనసులో లేనపుడు భర్త యాచించిననూ అంగీకరించదు.

## స్వార్థమును త్యజించుము :

కావున స్వార్థమును త్యజించి, నిష్కాముడవు కమ్ము. నానుండి ఏమియు ఆశించకుము. అప్పుడు నాపై నీకు ఎంత ప్రేమ కలుగును? ఎంతసేపు నన్ను పూజించుదువో పరీక్షించుకొనుము. నీ భక్తి ఎంతో, నీ యోగ్యత ఎంతో తేలిపోవును. అప్పటికిని నీకు నాపై ప్రేమ ఉన్నట్లు తేలినచో-నేను నీకు కష్టములను ఇచ్చెదను. అపుడు నాపై నీకు ఎంత ప్రేమ ఉన్నదో పరీక్షించుకొనుము. అప్పటికినీ నాపై భక్తి ఉన్నదని తెలిసినచో, నిన్ను దారుణముగా హింసించెదను. అవమానములపాలు చేయుదును. అప్పటికినీ నాపై ప్రేమ ఉన్నచో, నేను నీవాడ నగుదును. నీకు అద్వైత సాయుజ్యము నిచ్చెదను. ఇదియే దత్త పరీక్ష. ఇదియే దత్త తత్త్వము. ఇట్లు నేను చేయుదునని వినగనే నేను వద్దని పారిపోవుచున్నారు. అట్టివారి వెంట పడను.

అయితే అందరూ నా బిడ్డలే. అందరినీ ఉద్ధరించవలయును. కావున అన్యదేవతా రూపములలో వారికి ఐహికముల నిస్తాను. వారు నాపై ప్రేమ లేకున్ననూ, స్వార్థముతో చేయు పూజలకు కొంత ఫలము నిచ్చుట,

అన్యరూపములలో చేయుదును. అట్టి చాక్‌లెట్లు ఇచ్చుటచేత, క్రమముగా వారికి నాపై ప్రేమ గలిగి, ఐహికములను విడనాడి నా వైపుకు తిరుగుదురని ఆశతో యున్నాను. వారు దానిచే తరించుటయే నా లక్ష్యము తప్ప ఇందులో నాకు లాభము లేదు.

## అన్యదేవతలు

నా సృష్టి కావలయునన్నచో ఐహికము, నేను కావలయునన్నచో అది పరమార్థము. ఐహికమునకు అన్యదేవతలు. పరమార్థమునకు నేను. కావున ఇతర దేవతల నారాధించు వారును ఏనాటికయినా నా కడకు రావలసినదే తప్ప, వారు తరించలేరు. నాకడకు వచ్చినచో ఆనందము లభించును. ఇతర దేవతలు ఇచ్చునది తాత్కాలికపు మెరుపువంటి సుఖములు గాని అవి చివరకు దుఃఖమునకే దారితీయును. శాశ్వతానందము నా చేతిలో యున్నది. నేనిచ్చునది శాశ్వతము. అన్యదేవతలు ఇచ్చునది అశాశ్వతము. ఆ అన్యదేవతలు సైతము నా అనుజ్ఞ పొందియే, నా ఆజ్ఞ మేరకే ఐహికముల నిచ్చుచున్నారు. మందు తాగనని, పాయసము కావలయునని కుమారుడు పట్టుపట్టి ఏడ్చుచున్నాడు. నేను ఎంత చెప్పినను వినుటలేదు. వానికి పాయసము నా చేతులతో నేను ఇవ్వను. వాని తల్లికి, అనగా నాభార్యకు, ''సరే, పాయసము ఇమ్ము'' అని అనుజ్ఞను, ఆజ్ఞను ఇచ్చుదును. నా ఆజ్ఞమేరకే వాని తల్లి వానికి పాయసము ఇచ్చును. నేను పాయసము ఇవ్వనివానిగను, చేదుమందు ఇచ్చువానిగను, పిల్లవాడు నన్ను అపార్థము చేసుకొనుచున్నాడే తప్ప, పాయసముయొక్క పదార్థములు నేను సంపాదించినవనియు, నా భార్య పతివ్రతగాన నా ఆజ్ఞమేరకే ఏ పని అయినా చేయునను విషయము పిల్లవానికి తెలియుటలేదు.

ఇతర దేవతలందరూ (ఐహికముల నిచ్చువారు) పతివ్రతలగు నా భార్యలే. వారిచ్చు ఐహికములన్నియు నా సొమ్మే తప్ప, వారి పుట్టిళ్ళనుండి తెచ్చుకొన్నదికాదు. ఈ విషయము తెలియక అజ్ఞానులగు నా బిడ్డలు ఇతర దేవతలు ఐహిక ప్రదులనియు, నేను మాత్రము చేదు మందువంటి మోక్షమును ఇస్తానని నన్ను త్యజించి నాకు దూరముగా పోవుచున్నారు.

పిల్లలు తండ్రికి దూరముగా వుండి, తల్లికి దగ్గరగా ఉందురు గదా.

కాని జ్ఞానియగు పిల్లవాడు తల్లి పతివ్రతకాన, తండ్రి యిష్టాను సారమే చేయుచున్నదనియు, అంతయూ తండ్రి సొమ్మేనని, జ్ఞానము కలవాడై, తల్లి ఎట్లు తన భర్తను సేవించుచున్నదో, అట్లే తానూ తండ్రిని సేవించును. కాన, జ్ఞానియగువాడు ఎవడో ఒక్కడు మాత్రమే నన్ను చేరును.

అట్లు నన్ను చేరిన వానికి, నా సొమ్ముపై పూర్ణముగా పెత్తనము –అనగా ఈశ్వరత్వమును ఇచ్చుచున్నాను. వాడే నేను, నేనేవాడు. ఇదే జీవన్ముక్తియగు పూర్ణ అద్వైతఫలము–సృష్టికర్తయే కావలయునన్న జ్ఞానముతో ఆరాధించినప్పుడు ఆ రూపము ఏదయినా శ్రీదత్తుడే. ఐహికములగు సృష్టియే కావలయునని ఆరాధించినప్పుడు ఆ రూపము ఏదయినా శ్రీదత్తుడు కాదు. కాన, నీ దృష్టిని పట్టి శ్రీదత్తుడు సిద్ధించునే తప్ప, విగ్రహముయొక్క రూపముకాదు.

7–7–94 ఉదయం గం. 2–00ల సమయము శ్రీ దత్త దివ్యవాణి.

## మర్త్యలోకము

'' ఈ లోకము మర్త్యలోకము. మానవుడు మర్త్యుడు అనబడు చున్నాడు. మర్త్యుడు అనగా మరణము గలవాడని అర్థము. ఈ శబ్దము మరణమును గుర్తుచేయుచున్నది. మానవుడు ప్రతిరోజూ, ప్రతిక్షణము తాను మరణము పొందబోవువాడని తెలిసివుండవలెను. ప్రతిరోజు కొకసారి తాను మరణమును పొందబోవు ఘట్టమును ఊహించి ఆ క్షణమునే తాను అందరినీ, అన్నిటినీ వదలి మరణము చెందు క్షణమును అనుభవించి ఒక పూర్వరంగము ( రిహార్సల్) వేసుకొనవలెను. దానిచేత ఇవి అన్నియు తాత్కాలికములే తప్ప వీరిని, వీటిని శాశ్వతముగా వదలవలసినదేకదా అను భావము దృఢమగును. దానిచేత సంసారమున వైరాగ్యము సిద్ధించును. వైరాగ్యము ప్రతి క్షణము గలిగిననాడే దైవోపాసన యొక్క అవసరమును గుర్తించును. తాను శాశ్వతముగా ఇచ్చటనే ఉండువాడననియు, వీరితో, వీటితో శాశ్వతముగా తనతో ఉండునను

భావము వల్లనే మానవుడు సంసారమున తగుల్కొని యున్నాడు.

నీవు శయనించినపుడల్లా మృత్యువుయొక్క సన్నివేశమును అభినయించుము. శ్వాసను ఒక్క క్షణము బంధించుము. చూశావా! ఎంత బాధగా వున్నదో! ఇప్పుడు శ్వాసను తిరిగి పీల్చుచున్నావు. కానీ ఆ క్షణమున నీవెంత ప్రయత్నించినా ఆ శ్వాస తిరిగి పీల్చలేవు. చూచితివా? ఎంతబాధ కలుగునో! అందరినీ, అన్నింటినీ వదలి శాశ్వతముగా పోతున్నావు అనుకో. చూడు ఎంత వేదన కలుగుచున్నదో! చూడు నీ మనస్సు ఇపుడు ఏమంటున్నది? ''అయ్యో! వీటి కొరకు, వీరి కొరకు నా జీవితకాల మంతయు వ్యర్థము చేసితినే! అయ్యో! ఎంత మూర్ఖుడనైతిని. అయ్యో! ఈ విషయము తెలియకపోతిని. అయ్యో! ఈ మృత్యువు గురించి ఆలోచింపక ప్రవర్తించితినే'' ఇట్లు ఎంత వేదన కలుగుతున్నదో! ఇప్పుడు శ్రీదత్తుని విలువ ఎంతయో అర్థమగుచున్నదికదా! ఇప్పుడు శ్రీదత్తుని వచనములు మణిమాణిక్యముల కన్ననూ ఎంతో విలువ కలిగినవని తెలియుచున్నవి. కావున శయనించి నప్పుడెప్పుడును, నీవు మృత్యు సన్నివేశమును గుర్తుతెచ్చుకొనుము. సాధన ఆచరణలోకి వచ్చి తీరును. ఆహారము, నిద్ర, విహారము, భోగములు, మానసిక చింతన వీడుట మొ॥ యోగాంశములను గుర్తుంచుకో.

వీటియందు జాగరూకుడవై పథ్యముగా, మితముగా యున్నచో శరీరము రోగబాధితముకాదు. రోగమున్నచో సాధన చేయలేక సమయము వ్యర్థమగును. కాన రోగమును రానీయకుండు అంశములు ప్రధానములు. రోగమునుంచి రక్షణ చేసికొన్నచో ఆయుర్దాయము వృద్ధియగును. దీనిచేత, సాధన సమయము పెరుగును. అంతా నీ చేతిలోయున్నది. జరుగుచున్నది అంతా పూర్వకర్మమని, దైవేచ్ఛయనియు అనుట అజ్ఞానము. జీవునకు పూర్ణ స్వాతంత్ర్యము ఇచ్చినాను. ''స్వాతంత్ర్యము'' అను ఒక తత్త్వమును సృష్టించితిని. కావున ప్రారబ్ధము కేవల జన్మనిచ్చి అంతమగును. ఇక సంచితము అనుమూట విప్పబడుటలేదు. కాన నీవు ఇప్పుడు చేయునవి, అనుభవించునవి అన్నీ నీ చేతులతో చేసుకొనుచున్నవే.

ఇప్పుడు చేసిన కర్మలు నీ సంచితము మూటలోనికి

''ఆగామి'' అను పేరున చేరుచూ, నీ సంచితము + ఆగామి = మొత్తము సంచితమై అందులోని ఒక కర్మ నీ పునర్జన్మకు కారణమగును. కాన ''కర్మ'' ''కర్మ'' అని పలుకుచూ నీ అవివేకమునకు మసి పూయకుము, నీవు సర్వస్వతంత్రుడవు.

బాగుపడినా, చెడిపోయినా నీకు నీవే బాధ్యుడవు.

శ్రీ భావనామ సం॥ శ్రావణ పూర్ణిమ 22-7-1994 శుక్రవారము గురుపూర్ణిమ పర్వదినమున శ్రీ దత్త భక్తులకు సాక్షాత్కరించి శ్రీ దత్త భగవానులు అనుగ్రహించిన దివ్యసందేశము ఇలా ఉన్నది.

''రసోవైసః'' పరమాత్మ రస స్వరూపుడు. భక్తియు రస స్వరూపమే. భక్తియనగా ప్రేమయే. కాన పరమాత్మ ప్రేమ స్వరూపుడు. ఎవడు భక్తిని పొందగలిగినాడో వాడు పరమాత్మను పొందినట్లే. పంచదారయు, తీపియు రెండు వేరుగాలేవు.

భక్తియే ఏకైక మార్గము. వ్యాస ముని 18 పురాణములు, భారతము, బ్రహ్మ సూత్రాలు వ్రాసినా ముక్తిని పొందలేదు. భాగవతము వ్రాసి ముక్తుడైనాడు. భాగవతము భక్తితో నిండి యున్నది. భాగవతము అనగా భగవంతునికి సంబంధించినది. భగవంతునికి సంబంధించినది భక్తియే తప్ప వేరుకాదు.

ఒక దూర ప్రదేశమునకు అతి త్వరగా విమానములో పోయినట్లు భక్తిచే త్వరగా భగవంతుని చేరవచ్చును. భక్తి పురుష ప్రయత్న లబ్ధము గాదు. అది కేవలము దైవానుగ్రహ లభ్యము. ఈశ్వరారాధనము చేసి ''స్వామీ! భక్తినిమ్మ'' ని భగవంతుని అర్థించవలయును. భక్తిచేత 7 రోజులలో కేవలము 7 రోజులలో యుగయుగములు జప, తప, యజ్ఞాదులచే సాధింపరాని భగవంతుని పరీక్షిత్తు పొందినాడు.

మిగతా మార్గములలో కూడా భక్తి లేశము ఉన్ననే ఫలము లభించును. భక్తి ప్రాణము. ప్రాణము లేకున్న ఆ వ్యక్తి ఎంత సుందరుడయినా శవమే, అమంగళమే కదా. ప్రాణమున్నచో సుందరుడు కాకున్ననూ అమంగళము కాదు. కాన భక్తి ఉన్నచో క్రియ ఎంత

అవకతవకగా ఉన్ననూ మంగళమే అగును. భక్తియను ప్రేమలో స్వార్థము వుండరాదు. అది ఎట్టి ప్రతిఫలాపేక్ష లేనిదిగా ఉన్ననే సత్యమగును. ప్రతిఫలకాంక్ష ఉన్నచో నీ భక్తి ఫలముపై తప్ప స్వామిపై కాదు. కాన నైష్కామ్యము సిద్ధించనిచో భక్తి వ్యర్థము.

### ఉపవాసము

ఉపవాసము అనగా దుష్టాహారమును త్యజించుటయే కాని ఆహారత్యాగము కాదు. సాధకుడు ప్రతిరోజు ఇట్టి ఉపవాసము ఉండవలెను. దానిచే ఆరోగ్య, ఆయుష్యములతో పాటు సత్త్వగుణ వృద్ధి జరుగును. భక్తి పరాకాష్టలో పడి అసలు ఆహారమునే మరచిపోవుట నిజమైన ఉపవాసము. అంతే తప్ప ఆహారమును ఒక్కదానిని త్యాగముచేసి, రోజంతయు ఇతర లౌకిక క్రియలలో మునుగుట ఉపవాసము ఎట్లు అగును? ఆహారముతో బాటు లౌకిక వృత్తులన్నియు సహజముగా త్యజింపబడవలయును. బలవంతముగా కాదు. అది నిజమైన భక్తిలో జరుగును. అప్రయత్నమైన ప్రేమయే నిజమైనది. తెచ్చిపెట్టుకున్న ప్రేమ ఎంత వరకు నిలుచును?

భక్తిరసము లభించగనే ఆనందము కలుగును. ఆనందము కూడా భగవత్స్వరూపము. కావున భక్తి లభించగనే ఆనందము లభించును. సంసారములో గల అన్ని బంధములను భగవంతునిపై వుంచి, ప్రతిఫలాపేక్షలేకుండా స్వామిని ప్రేమించుటయే భక్తి. అట్లు రాధ, గోపికలు, మీరాబాయి చేయగలిగినారు. రాధను మించిన భక్తురాలు లేదు. కావున రాధాలోలుడై రాధా పాదదాసుడైనాడు. రాధయనగా ప్రేమ పరాకాష్ఠయే. అది అనురాగము యొక్క మహాసముద్రము యొక్క ఉప్పెన. దానిచే సముద్రములో శయనించియున్న స్వామి ముంచబడి, ఆ ఉప్పెనచే కొట్టుకొని నీ వద్దకు తేబడును. స్వామికి రెండు కన్నులు సమర్పించిన తిన్నడు కూడా భక్తియొక్క పరాకాష్ఠయే. తిన్నడికి పెట్టిన పరీక్ష దత్తపరీక్ష. మీరా, ప్రహ్లాదాదులకు విషాది పరీక్షలు అయిన దత్తపరీక్షలు పెట్టబడినవి. నీ ప్రేమ స్వామిపై ఉన్నదా? ఫలముపై ఉన్నదా? అను పరీక్షయే దత్తపరీక్ష.

అది స్వామిపై వున్నచో ఎంత తీవ్రముగా నున్నది అనునదియే రెండవ దత్త పరీక్ష. ఇంతకన్నా వేరుగా దత్త పరీక్షలేదు. ఆ పరీక్షలో నీ స్థాయి నిర్ణయింపబడి నీకు స్వామి ఇచ్చు ఫలము నిర్ణయించబడును.

నేను వ్యాస మునిని. వ్యాసుని వెంటయు నాలుగు వేదములు కుక్కలై వచ్చుచుండును. నారదోపదేశముచే భాగవతము వ్రాసి చిత్తశాంతిని వ్యాసుడు పొందినాడనుట, కేవలము సాధకులకు భక్తిలేనిదే ముక్తి రాదని బోధించుటకు ఆడిన నాటకమే. నేను వ్యాసమునినే. ఈ గురుపూర్ణిమయు నా పూర్ణిమయే'' అని పలికారు స్వామి.

ది. 25-7-94 మధ్యాహ్నం 12.30 ని॥లకు శ్రీదత్తవాణి :

## దుష్టుల వాక్య శ్రవణము

''వాక్కు వినుటవలన దాని ప్రభావము మనస్సుపై బడి, ఆ ప్రభావము నీ వాక్కుపైన బడును. కాన దుష్టుల వాక్య శ్రవణము నీ వాక్కును, నీ మనస్సును చెడగొట్టును. అటులనే దుష్టాహారము నీ శరీరమును, నీ మనస్సును చెడగొట్టును. కాన ఆహారములో సాత్త్వికాహార గ్రహణము, అటులనే సత్సంగ శ్రవణము వలన నీ త్రికరణములు పవిత్రములై యోగమునకు సహకరించును.

ఆహారము, సంగము- ఈ రెండునూ యోగమునకు పునాది. పునాది చెడినచో పైనున్న ఇల్లు పడిపోవును. కాన ఎంత నీవు యోగములో పైకిపోయినా, ఈ రెండిటి వలన నీవు పతనమగుదువు. యోగములో పైకి పోవుచున్ననూ, ఈ రెండు పునాదులను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనించి శ్రద్ధ వహింపవలయును.

## దుష్టాహారము

కఫ వాత పిత్తములను కలుగజేయు మూడు ఆహారములను వర్జించుటయే నా త్రిమూర్తి స్వరూప సంకేతము.

కఫము వాక్కును, వాతము శరీరమును, పిత్తము మనస్సును చెడగొట్టును. ఈ త్రికరణములలో ఏది చెడిననూ యోగసాధనములు

చెడినట్లే అగును.

శీతల పదార్ధములు కఫమును కలుగజేయును. గడ్డలు, నూనె,పప్పు పదార్ధములు వాతమును కలుగచేయును. అపక్వ పదార్ధములు పిత్తమును ఉద్రేకపరుచును. మధురము ఎక్కువ తిన్నచో మేహరోగ వృద్ధికరము.

నేను పర్ణాదునికి సాక్షాత్కరించితిని. అతడు స్మరించగానే దర్శనమిచ్చితిని. దీనిలో అంతరార్ధము ఏమి? సాధకుడు ఎక్కువగా పత్రములను భుజించినచో ఆరోగ్యం కలిగి, సాధన చేయుటలో కృతకృత్యుడగును అట్టివాడు సిద్ధిని త్వరలో పొందును.

దుష్టాహారము గ్రహించగనే కొంతకాలం రోగబాధతో, మరి కొంతకాలం ఆ రోగోపశమన చికిత్సలతో వ్యర్ధమగును. సాధకుడు కాలమును వ్యర్ధపరచలేడు. కాన దుష్టాహారమును వర్జించువాడు ఉత్తమ సాధకుడు. రాజసాహారము, తామసాహారములను త్యజించి, సాత్వికాహారము గ్రహించుటచేత ఉప =భగవత్సన్నిధి. వాస= నివశించును అను అర్ధంచేత ఉపవాసి అగుచున్నాడు. అందువల్లనే...

## నిత్యోపవాసి - సదాబ్రహ్మచారి

అరుంధతి తెచ్చిన సాత్వికాహారము గ్రహించుట చేత దుర్వాస ముని నిత్యపవాసియైనాడు. అటులనే ధర్మ మార్గమున గ్రహించిన తన భార్యయందే రమించి, పరస్త్రీలను మాతృభావముతో చూసినవాడైన వశిష్టముని సదా బ్రహ్మచారియైనాడు. కాన సాత్వికాహార గ్రహణము, ఏకపత్ని వ్రతము ఈ రెండు ఉపవాస బ్రహ్మ చర్యములకు అర్ధముకాన దుష్ట ఆహారమును గ్రహించినవాడు వేశ్యను పొందిన వ్యభిచారితో సమానమని గ్రహించవలెను. జిహ్వా చాపల్యమును, గుహ్యాచాపల్యమును ఈ విధంగా నియమించుకొనుట సాధక లక్షణం. సాధనలో పరాకాష్ఠకు పోయినవాడు సాత్వికాహారమును, ధర్మపత్ని గమనం కూడా త్యజించును. అది యోగులకు సాధ్యము. మానవులకు సాధ్యం కాదు. అటులనే దుష్టుల

సంగమూ-వారి దుర్వాక్య శ్రవణమును వర్జించి సత్సంగముతో సద్వాక్యశ్రవణము చేయుట సాధకునకు ప్రథమావస్థ. తరువాత అతడు రెండు సంగములకు అతీతుడై ఏకాంతమునకు పోవును. కాన సాత్త్వికాహారమును, గృహస్థాశ్రమమును సర్వజన సంగమును వదలువాడు యోగి. అది రెండవ అవస్థ. ముందు మొదటి అవస్థను గమనించు కొనవలయును'' అని శెలవిచ్చారు స్వామి.

శ్రీ భావనామ సం॥ ఆషాడ బహుళ షష్ఠి గురువారము 28-7-1994వ తేదీన శ్రీ అక్కలకోట మహరాజు వారు భోజన సమయములో శ్రీ దత్త భక్తులను ఆవహించి - భోజన విషయములో నియమము పాటించాలని దివ్యసందేశం అనుగ్రహించారు. అనంతరము శ్రీ దత్త ప్రభువు ఇలా తన దివ్యవాణిని అనుగ్రహించారు.

## అన్నము-సంభాషణము

''నాయనా! విను అన్నము అనగా తినబడునది అంతయు అగును. అన్నకోశము పై ప్రాణ మనో విజ్ఞాన ఆనందమయ కోశములు ఆధారపడి ఉన్నవి. అన్నరసం, ఆ రసం నుండి ఉద్భవించిన శక్తియొక్క రూపాలే మిగిలిన కోశములు. కావున యోగి అన్నమును బాగుగా విమర్శించుకొని గ్రహించ వలయును. దుష్టాన్నము, రోగకరములైన అన్నములను త్యజించుము. అన్నరస ప్రభావంచేత ఆయుర్దాయము తగ్గి ప్రాణకోశము నశించవచ్చును. లేక ఆయుర్దాయము వృద్ధియై ప్రాణకోశము బలపడవచ్చును.

అన్నరస ప్రభావమే మనస్సుపై పడును. అన్న శక్తియే బుద్ధికి బలమునిచ్చి విజ్ఞాన విచక్షణను వృద్ధి చేయును. విజ్ఞానముచేత ఈశ్వరారాధనము చేసి ఆనందము పొందవచ్చును. కావున అన్నముపై ముందు నీ బుద్ధిని కేంద్రీకరించుము. రాజస, తామస ఆహారములను గీతలో వివరించితిని. వాటిని త్యజించుము. మధురము కూడా సాత్త్వికమే. కాని మితముగా ఉండవలెను. బియ్యము, గోధుమలు, పాలు, పెసరపప్పు ఆహార శ్రేష్ఠములు అయినను మితము ముఖ్యము. ఎప్పుడును కడుపు

నిండరాదు. మలమూత్రములు అత్యల్పముగా వచ్చుటయే మితాహార మునకు సూచన. యోగియొక్క శరీరమునుండి దుర్గంధమురాదు. వాని మలమూత్రములు కూడా దుర్గంధముతో వుండవు. వాత రోగము చాలా ప్రమాదకారి కాన వాతరోగకారకములయిన వాటిని త్యజించ వలెను. కారము, పులుపు, గడ్డలు, పప్పులు, కొవ్వులు వాతరోగకరములు. వేడి చల్లారకమునుపే భుజింవలెను. చద్ది ఆహారము రోగకరము. వాతకరము. తమోగుణమును వృద్ధివరుచును.

కాన ఓ జీవా! అన్నమును గురించి బాగుగా వివరణగా విచారము చేయుము. అన్నము ఎట్లు నోటితో తినుచున్నావో, అట్లే ఇతరులు చెప్పు వాక్యములను చెవులతో తినుచున్నావు. దుష్టాన్నము ఎట్లు శరీరమునకు రోగకరమో, దుర్వాక్యములు అట్లే మానసిక రోగకరములు సదా భగవద్వాక్య వేదాంత వాక్య శ్రవణము చేయుట, సాత్త్విక ఆహారమును నోటితో తినుట యగును. అన్నము తినుట, వాక్యములు వినుట ఈ రెండింటి యందు శ్రద్ధ వహించినచో మనస్సు నిర్మలమై, మనస్సులోనికి దుర్భావములు రావు. ఈ భావములే నీవు పలుకు వాక్యములకు, నీవు చేయు పనులకు, నీకు వచ్చు స్వప్నములకు కారణములు. మనస్సులోనికి దుర్భావనలు రాకుండా అరికట్టుటలో పై రెండు- (అన్నము, సంభాష ణము) ఎంతయో సహకరించును.

## భావతీవ్రతయే సాధనసారము

ఆ భావము భగవత్పరమై తీవ్రముగా వుండుటకు పై విషయములు సహకరించును. భావతీవ్రతయే భగవత్ప్రాప్తికి కేవల సాధనము. నీ భావము తప్ప స్వామికి ఏమియు అక్కరలేదు. నీ ద్రవ్యముతోగాని, నీ వాక్కులతో గాని స్వామిని మెప్పించలేవు, నీ భావముతో స్వామిని పరవశించునట్లు చేయవీలగును. భావతీవ్రతయే భక్తి పరాకాష్ఠ.

సంగముచేతను, అన్నము చేతను భావము కలుషితమగును. కావున సంగమును పరిహరించి ఏకాంతమున వుండుము. సత్సంగము చేయుము. కలుషిత భావమును తుడిచివేయువలయునన్న శరీరరోగ చికిత్సవలె కాలమెంతయో కావలసి వచ్చును. కర్తవ్యమాత్రమును చేయుట

కర్మ. కర్మను చేయుము. కాని దానిలో ఆసక్తుడవు కావద్దు. ఈశ్వరారాధనము కూడా కర్మయే. కాని దానిని యజ్ఞము అందురు. జ్ఞానము వచ్చిన కొలదీ యజ్ఞమును ఎక్కువగా చేయుము. దీనిలో ముందుగా కొన్ని దోషములు ఉన్ననూ కాలక్రమేణా అవి తొలగిపోవును. యజ్ఞము కూడా భావములో భాగమే. కర్మయును భక్తిరూపము అగును. భావము లేనిదే ఎవడును కర్మను చేయడు. కావున కర్మ అంతయును భావమునే సూచించును.

కావున భక్తితో యజ్ఞమును చేయుము. యజ్ఞము భక్తియొక్క స్వరూపమే. భావము కూడా కర్మరూపమే కదా. అయితే కోరికలతో వస్తువులను సాధించుటకు స్వామిని ఒక పావుగా వాడుకొనదలచినచో, ఆ భక్తి అంతయును, ఆ యజ్ఞమంతయును వ్యర్ధమే. అట్టి యజ్ఞఫలము అనుభవించగానే, ఆ యజ్ఞము ఆ భక్తి అంతయును నశించును. ఫలమును ఇచ్చిన వెంటనే కర్మ నశించవలయును. కోరికలు లేకుండా భగవత్ప్రీతితో యజ్ఞమును చేసినపుడు, దాని ఫలము స్వామి యొక్క శాశ్వతానుగ్రహము. దానికి ఫలానుభవము లేనందున స్వామి నీకు ఋణపడును. కాన స్వామి శాశ్వతముగా నీకు కట్టుబడియుండును. కావున కోరికలు లేకుండా భక్తితో స్వామిని ఆరాధించు యజ్ఞములను నిరంతరము చేయుటయే సాధనసారము.

ఈ యజ్ఞములు, ద్రవ్యమయములు, వాఙ్మయములు, భావమయములుగా త్రివిధములు. ఈ మూడు యజ్ఞములు వేరువేరుగా చేయవచ్చును. లేదా మూడింటిని కలిపి చేయవచ్చును. ఏ యజ్ఞమైనను భావములేనిచో వ్యర్ధము.

## భావము ప్రధానము

భావముతో, వాక్కుతో, స్తుతించుచూ, ద్రవ్యముతో హోమము చేయుట త్రివిధయజ్ఞము. భావముతో, వాక్కుతో స్తుతించుట ద్వివిధ యజ్ఞము. కేవలము భావముతో ధ్యానించుట ఏకవిధ యజ్ఞము. భావము లేని వాక్కుగాని, 'భావములేని ద్రవ్యము కానీ' భావములేని వాక్-ద్రవ్యములు కానీ వ్యర్ధములు. ఇంత ఏల? భావమే

సర్వము. స్వామి భావ ప్రియుడు భావము వున్నప్పుడు వాక్కు-ద్రవ్యములు అప్రయత్నముగా పొల్గొనును. భావబలము చేతనే ఎవడయిననూ, ఏమాటయైననూ పలుకును, ఏ పనియైననూ చేయును. భావములేక పలుకులు, క్రియలు వ్యర్థములు. చేసిననూ, పలికిననూ, నిలువజాలవు. కాన క్షణక్షణము నీ భావమును మాత్రము స్వామిపై వుంచుము. భావమే నవనీతము. కర్తవ్యములందును భావమును మగ్నము కానీయకుము. కర్తవ్య కర్మలు కొంతకాలము నకు భావములేకుండా చేయగలుగు స్థితికి రావచ్చును. కాన కర్తవ్య కర్మలలో కూడా భావమును స్వామిపై వుంచుటచేత, నిరంతరము భావము స్వామిపై ఉంచుటకు వీలగును. ఆ భావము ఒకవేళ సద్భావము కాకపోయిననూ, ఆ దుర్భావము కూడా స్వామికే సమర్పించుము.

''తమేవశరణం గచ్ఛ సర్వభావేన భారత'' అని గీతలో ఇదియే చెప్పియున్నాను.

భావము - భావము - భావము ఇదియే సాధన సర్వస్వము.

## భక్తి మార్గము

''రాగము వద్దు. అనురాగము కావలె నాకు.
వేదము వద్దు. నిర్వేదము కావలె నాకు''.

ఒక విధానములో కానీ, ఒక ప్రత్యేకమైన మార్గములో కానీ నన్ను చేరవలయుననుకొనుట పొరపాటు - ఒక సమయము కానీ, ఒక ప్రదేశము కానీ నన్ను చేరుటకు సహకరించలేవు.

సాధనకు ఇష్టము ననుసరించి ఇవి అన్నియు ఏర్పడుచున్నవే కానీ, నాకు అయిష్టము అయినది ఏదీలేదు.

## నన్ను చేరుటకు ఎన్నిసార్లు చెప్పినా ఒకే మార్గము అదియే భక్తి మార్గము :

భక్తి ప్రేమస్వరూపము. ఆ ప్రేమ పరీక్షలకు నిలువవలయును. నా పరీక్షలు అతి సూక్ష్మముగా యుండును. అన్నము ఉడికినదా లేదా అనుటకు ఒక మెతుకు పట్టుకొని పరీక్షించినట్లుండును.

## నాపై ప్రేమ ఏర్పడుటకు నా అనుగ్రహము ముఖ్యము

దానితో బాటు నా ఆరాధనలు ఎక్కువగా చేయుటయు, నన్ను గురించి ఎక్కువగా తలచుటయు, నన్ను గురించి సంభాషించి సత్సంగము ను చేయుటయు, నన్ను వర్ణించు గ్రంధములను చదువుటయు చేసిన నాపై ప్రేమ వృద్ధి అగుటకు ఇవి సహకరించును.

భగవత్ప్రేమ పరాకాష్ఠకు చేరగా, చెప్పిన ఏ పిచ్చిమాటయైనను వేదమే. చేసిన ఏ పిచ్చి చేష్టయైనను యజ్ఞమే. కావున ప్రేమను సాధించుము.

ప్రేమను వృద్ధిపరచుకొనుటకు ముందు సర్వభూతముల పైనను ప్రదర్శించి అభ్యాసము చేయుము. అయితే, ఈ సృష్టిలో నేను లేనను విషయమును తెలియుము. కావున భూత ప్రేమ, చివరకు సంసార బంధముగా మారరాదు. ప్రేమ తత్త్వమును వృద్ధిపరచుకొనుటకు అది ఒక మార్గమే తప్ప, పంచభూతములకు విలక్షణముగా నున్న నన్ను ఈ పంచభూతముల సృష్టియే అని భ్రమింపరాదు.

నన్ను తెలుసుకొనగోరు, చూడగోరు కోరికను త్యజించుము. అది మహామహా తపస్వులకే శక్యము కాలేదు. నీకు యోగ్యత లభించగనే చూచెదవు, పొందెదవు. అంతవరకును అది జరగదు. జరిగినచో నీవు తట్టుకొనలేక రాలిపోవుదువు. దానివలన చేయవలసిన సాధన ఆగిపోవును. నేనెప్పుడును నీ వెంట వున్నాను. కాని, నీవు చూడగలుగు మాయ రూపములతో వున్నాను. ఇప్పటికి ఇంతే! క్రమముగా అనుభూతి బలపడిన కాని పరమాత్మ సాక్షాత్కారము లభించదు.

నాకు సంబంధించిన ఏ ఆరాధనమైనను, బలవంతముగా చేయకుము. అది అప్రయత్నముగా వుండవలెను. మరియు అది ఎట్టి

కోరిక తోను వుండరాదు. చివరకు మోక్షము కూడా కోరికయే అని తెలియుము.

దుఃఖమును త్యజించి ఆనందమును పొందుటయే అన్ని కోరికలలో సారాంశము. అదియే మోక్షములోనూ వున్నది. కాన మోక్ష ఆశను కూడా త్యజించుము.

## వైరాగ్యము - భక్తి

వైరాగ్యము, భక్తి. ఈ రెండు అభ్యాసమువలన సాధించవచ్చును. భక్తికి పరీక్ష వైరాగ్యమే. నా సృష్టి కావలయునన్నచో వైరాగ్యములేదు. వైరాగ్యము లేనిచో నాపై భక్తి లేనట్లే. నేనే కావలయునన్నచో నా సృష్టిపై నీకు దృష్టి పోదు. కాన పూర్ణ భక్తికి, సత్య భక్తికి లక్షణము పరిపూర్ణ వైరాగ్య రూపమైన నిష్కామమే. మనసా వాచా కూడా ఏదియును కోరకుము. నీకు ఏది కావలయునో నాకు తెలియును. నీకేది కావలయునో నీకు తెలియదు.

## పరమ సత్యము

ఓ పిచ్చిజీవుడా! నాపై నీకు ఈ ఒక్కజన్మలోనే అనురాగము తెలియును. కానీ నీపై నాకు అనేక కోట్ల జన్మలందున్న అనురాగము తెలియును. నీపై నాకు గల అనురాగము తెలిసినచో నీకు మతిభ్రమించి పిచ్చి పుట్టును. అందుకే పూర్వజన్మలను గుర్తులేకుండా చేసినాను. నీకేది మేలు చేకూర్చునో దానిని నీవు అడుగకయే యివ్వనా? నీకు ఇవ్వనేమో అన్న సంశయము ఏర్పడుటకు కారణము నీపై నాకు కోట్ల జన్మలనుండి ఏర్పడిన నా అనురాగమును నీవు గుర్తించకపోవుటయే.

## మరణము

మరణమన్న భయమును వీడుము. ఇప్పటికి నీవు ఎన్ని వస్త్రములను మార్చినావు? అట్లే ఎన్ని మరణముల ద్వారా క్రొత్త జన్మలను పొందినావు. పాతవస్త్రముల పారవేసి క్రొత్త వస్త్రమును గ్రహించువాడు సంతోషించునట్లు మరణమునకై సంతసించుము. మరణానంతరము ముక్తి రావచ్చును కూడా. కాన జన్మ సమయమున దుఃఖించవలయును కాని

మరణమునకై దుంఖించరాదు. ఈ శరీరముపై, ఈ శరీరసంబంధిత వస్తువులు-వ్యక్తులపైగల మమకారము వీడలేక మరణమునకు భయపడుచున్నావు కాని అందులో భయపడవలసినది లేదు. ఇప్పటికి నీవు ఎన్ని శరీరములు, ఎందరు వ్యక్తులు, ఎన్ని వస్తువులు, ఎన్ని గృహములతో మునిగి మునిగి వచ్చినావో గదా? అవి అన్నియు నీవి అయినవా? వారందరూ నీవారైనారా? నేనొక్కడినే నీవాడను. కావున అన్ని జన్మలలో నీవెంటవున్న నాపై సర్వకాలములందు సర్వావస్థలయందు దృష్టిని వుంచుము. ఆ దృష్టిని ఒక్క క్షణము కూడా చెదరనీయకుము. ఒక్కక్షణము చెదిరిననూ మరల నాపై వుంచలేవు. మాయ లాగుకొని పోవును. నీ దృష్టిని నాకు ముందు సమర్పించుము. నీ దృష్టి అనగా నీ మూడవదియైన జ్ఞాన నేత్రము-అనగా నీ మనస్సు, నీ భావము అని అర్థము. ఆ దృష్టిని నాపై సదా వుంచుట చేసినచో నేను నీకు తప్పక లభించగలనని ప్రమాణముచేసి చెప్పుతున్నాను'' అన్నారు స్వామి.

ఆహా! స్వామీ! ఈ జీవులమీద ఎంతటి కరుణ. వీరిని ఉద్ధరించవలెనని ఎంతటి తపన పడుతున్నావయ్యా! ఎంతచెప్పినా ఈ జీవులలో మార్పు రావడంలేదని బాధపడుతున్నావా? తండ్రి! నీ బిడ్డలం గదా. నీవు మా తండ్రివి. మా తప్పులను కాచి, మమ్మనుగ్రహించి, ఉద్ధరించవయ్యా! అని ప్రణమిల్లుదము.

## విచిత్ర సంఘటన

ఒక విచిత్రమైన సన్నివేశము. ఒక వ్యక్తి అదే పనిగా ఒక వేళా పాళా లేకుండా వీపున మూట, చేతిలో కర్ర,మాసిపోయిన జీర్ణ వస్త్రములతో మాసిన గడ్డముతో వస్తూ వుండటము భోజనము చేసి ఎంతో కొంత దక్షిణ తీసుకొనిగాని వెళ్ళకపోవడం చాలాకాలంనుండి జరుగుచున్నది మాకు.

ఆ రోజున మాయింట్లో దత్తభక్తులు వేంచేసియుండగా ఆ వ్యక్తి వచ్చారు. వారిని చూడగానే ఎంత కాదనుకున్నా మాకు కొంచెం విసుగు కలిగినప్పటికి, వారిని సత్కరించి పంపాము. అయిననూ తృప్తి తీరక శ్రీదత్త భక్తులను వీరిని గూర్చి వివరణ కోరగా, శ్రీదత్త స్వామి శ్రీదత్త

భక్తులద్వారా ఈ క్రింది వివరణ ఇచ్చినారు.

''రాగమేలనో అనురాగ రహితమైన
వేదమేలనో త్యక్త నిర్వేదమైన
సాధనయునేల ప్రేమయు శాంతిలేక
స్వామి యేలనో గుర్తించు శక్తిలేక?''

అతిధి విష్ణువు శ్రీదత్తుడతడె నేను
పెట్టలేకున్న కసరకు తిట్టవలదు
శాంతి ప్రేమతో పలికిన స్వామి ప్రీతి
సొమ్ము మొత్తము నాదియే నమ్ముమిదియు.

పూర్వము హాస్పేటలో ఒక బ్రాహ్మణ స్త్రీ వుండెడిది. ఆమెకు జ్ఞానము బోధించిన గురువు జలోదర వ్యాధితో బాధపడుచు ఒక గురువారమునాడు, మరియొకసారి ఆదివారమునాడు ఆమె గృహమునకు వచ్చెను. ఆమె ఆ గురువును కసరుకొనెను. ఆ గురువు ఖిన్నుడయి పోయెను. నేను ఒక సాధురూపమున పోయి ఆమెకు ఇట్లు జ్ఞానోప దేశమును చేసితిని.

''అమ్మా! నీవు మీ గురువును కసరుకొనుటచేత అతని పూర్వ పాపము ఈ శిక్షచేత నశించి పవిత్రుడయ్యెను. కాని నీవు పాపమును సంపాదించుకొన్నావు. దీని ఫలమును మరల జన్మలో అనుభవించ వలయును'' దానికి ఆమె నన్నునూ కసురుకొన్నది. ''పో!పో! నీవు నాకేదో చుట్టంలా చెప్పవచ్చావు'' అని. దానికి నేను ''అమ్మా! నీవీ జన్మలో మాత్రమే నన్ను చూచితివి. కానీ నిన్ను 72 కోట్ల జన్మలనుండి ఎరుగుదును. నీపై నాకు 72కోట్ల జన్మల నుండి అనురాగము కలదు. నీకు అది గుర్తులేక ఇట్లు మాట్లాడుచున్నావు. నీవు తెంచుకున్ననూ నేనెట్లు తెంచుకోగలనమ్మా?'' అని అంటిని. దానికి ఆమె '' ఈ మాయ మాటలకేమి? పో పొమ్ము'' అని కసురుకొనుచు ''నీవు మాయమాటలు చెప్పినచో కరిగి నేను బిచ్చము పెట్టుదుననుకున్నావు. అదేమియు కుదరదు'' అని పల్కెను.

దానికి నవ్వి నేను ఇట్లు పలికితిని- ''అమ్మా! ఒక కసాయి వాడు రెండు మేకలను తెచ్చెను. ఆ మేకలను మరునాడు అతడు వధించి, బంధువులతో గూడి భుజించపోవుచున్నాడు. ఆనాడు కొంత గడ్డితెచ్చి ఒక మేకముందు వేసిపోయెను. రెండవ మేక ఆ గడ్డికై ముందుకురాగా మొదటి మేక దానిని కసరుకొనెను. అప్పుడు నేనొక బల్లిరూపమున శబ్దము చేయుచూ ఇట్లు పలికితిని.

'' ఓ మేకా! ఈ గడ్డిని నీవు ఆర్జించినావనుకొనుచున్నావా? ఆ గడ్డి నీదికాదు. కసాయివాడిది. నీవు దానిని కసరి, గడ్డినంతయూ కాపాడుకొన్ననూ, ఇంత గడ్డిని నీవు తినలేవు. నీవు కాపాడిన గడ్డి వ్యర్థమే. ఏలనన మిమ్ములను ఈ కసాయివాడు రేపు వధించపోవుచున్నాడు. కాన ఈ గడ్డియు, మీరు ఉభయులును కసాయివాని సొమ్మే కదా!''

ఇంతలో ఆ బ్రాహ్మణ స్త్రీ భర్త ఇంటిలోనుండి బయటకు వచ్చి ''బాగుగా పలికితివి. ఆ సాధువునకు బిచ్చము వేయుము'' అని పలుకగా ఆ స్త్రీ లోపలికి పోయెను. ఆమె భర్త పండితుడు. కాన అతనికి ఇట్లు చెప్పితిని.

'' ఆ కసాయివాడే రుద్రుడు. ఈ జగత్తు అంతయు, అనగా అచేతన పంచభూతములును, ఆ భూతములచే నిర్మింపబడిన ఈ శరీరములును చైతన్యరూపులయిన ఈ జీవులయిన పశువులు అనగా మేకలును రుద్రుని సొమ్మే. కాన అతడు పశుపతి. రుద్రుని సొమ్మే ఐశ్వర్యము కాన ''ఈశావాస్యమిదం సర్వం'' ''కస్యస్విద్ధనం?''అని చెప్పినది శ్రుతి అని పలుకగా అతడు సంతసించి నాకు ఆపూట వారి ఇంట భిక్ష చేసినాడు. ఇష్టము లేకపోయిననూ ఆమె నాకు వడ్డించి పెట్టినది.

ఆ బ్రాహ్మణ స్త్రీ ఈ జన్మలో ఒక బ్రాహ్మణునిగా జన్మించి దరిద్రుడై, సదా సంచరించుచూ తిరుగుచున్నాడు. అతడిని నేను కాపాడుదును. అందరునూ నా బిడ్డలేకదా. ఒక మానవ జీవుడు తన సోదరుడయిన అన్యమానవ జీవుని వదలిననూ, కన్న తండ్రి వదలుకొన లేడు గదా.

కాన శాంతితో ప్రేమతో ఉండుము. ఆవేశముచేత శక్తి వ్యర్థమై కాలము కలుషితము అగును. శాంతి చేతనే యోగము సిద్ధించును. శాంతియే యోగము యొక్క ప్రధానమైన మొదటి లక్షణము'' అని వచించారు స్వామి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

12-8-94 ఉదయం 5 గంటలు శ్రీదత్తవాణి విజయవాడలో

## క్రియా యోగము

శ్రీ దత్త భక్తులు సుఖాసీనులై యున్న సమయంలో నేనొక ప్రశ్న వేశాను. స్వామీ! యోగుల గురించిన గ్రంథము ఒకటి నేను చదివాను. దానిలో క్రియా యోగమును విషయము వివరించబడినది. కాని ఆ వివరణము సంపూర్ణముగా వచింపబడలేదు. గురువు ద్వారా పొందవలెనని సూచింపబడినది. క్రియాయోగం అంటే ఏమిటి? అని ప్రశ్నించడం జరిగింది. ఆ సమయంలో శ్రీదత్తభక్తులు ప్రశాంతంగా కూర్చున్నారు. ఏ సమాధానము రాలేదు. మరునాటి ఉదయం 5 గం॥ లకు శ్రీదత్తాత్రేయ స్వామి వారు ఇచ్చిన వివరణ ఇది-

''రాముడు కృష్ణుని సమీపించెను'' -వాక్యం-

ఈ వాక్యములో కర్త-రాముడు, కృష్ణుడు-కర్మ. సమీపించెను-క్రియ.

ఇట్లే -

భగవంతుడు.... కర్మ

జీవుడు .... కర్త

సమీపించుట ... క్రియ

అనగా భగవంతుని చేరు సాధన స్వరూపమే క్రియ. ముందు చేరినగాని ఆయనలో ఐక్యము కాలేము. ఐక్యము అగుటయే యోగము. కాన దానికి ముందు సమీపించుట అను క్రియ వుండాలి. ఈ రెండును చేరియే క్రియా యోగము అనబడును.

క్రియా=సాధనచే భగవంతుని సమీపించుట.

యోగము=భగవంతునిలో ఐక్యమగుట.

సాధన అంతయూ క్రియా స్వరూపము. భావము కూడా క్రియయే. ప్రేమయు క్రియయే. ప్రేమ చైతన్య శక్తి లక్షణముగాన, శక్తి క్రియా రూపము కాన, ప్రేమయు క్రియయే. సర్వసృష్టియు క్రియయే. స్థావరము అనునది లేదు. జీవుడునూ చైతన్య రూపుడే కాన క్రియారూపుడే.

సమీపించుట అను క్రియ సరి అయిన మార్గములో జరగాలి. మార్గము తప్పు అయినచో క్రియ వ్యర్థమగును. సరి అయిన మార్గము భక్తియే. అనగా ప్రేమయే. అనగా పైన చెప్పినట్లు క్రియారూపమే.

క్రియ అనగా సృష్టి. క్రియకు అతీతమైనవాడు నిష్క్రియుడు... స్వామి ఒక్కడే. కాన కర్తయు, క్రియయు రెండూ క్రియలే. కర్మయైన స్వామియె నిష్క్రియుడు. అనగా క్రియకు అతీతుడు అనియే అర్థము. కాని క్రియకాని స్థిరుడు అనికాదు. క్రియకాదనియే చెప్పగలముగాని స్థిరము అనునదియు చెప్పలేము. ఇది కానిచో అది అని చెప్పినట్లు కాదు.

ఇట్లు వ్యాకరణము ననుసరించి కొందరు సాధనను క్రియా యోగమన్నారు. అట్లుకాక క్రియ అనగా కర్మ అను పర్యాయము తీసు కొన్నచో, క్రియా యోగమే కర్మయోగము.

నా భార్యను మధుమతి అన్నారు. అనగా ఒక స్త్రీ అని కాదు. మధు=మధురమైన; మతి=భావము. అనగా ప్రేమభావమే. జీవుడు పరిపూర్ణ ప్రేమభావ స్వరూపుడయిననాడు మధుమతి అగును. అట్టి జీవుడు నన్ను చేరగనే ఆ జీవుని నేను కల్యాణము చేసికొన, ఆ జీవునకు భర్తనై బాధ్యత వహించెదను. ఇదియే స్వామి కల్యాణములోని అంతరార్థము.

ఈ మధుమతి వాణీ–లక్ష్మి–పార్వతి రూపము.

వాణి అనగా వాక్కు, లక్ష్మి అనగా ద్రవ్యము, శరీరము అనగా చేష్టలు అనగా కర్మ. పార్వతి అనగా శక్తి. అనగా భావము, మనస్సు అంటే

వాచా, కర్మణా, మనసా, జీవుడు మధుమతియై ప్రేమ భావముతో ఉండుటయే మధుమతి ''త్రిశక్తి స్వరూపిణి'' అని అర్థము. ఇట్లు జ్ఞాని అంతరార్థములను గ్రహించవలెనుగాని, అజ్ఞానివలె తలంబ్రాలు పోయించి స్వామి కళ్యాణము చేసితిననుకొనరాదు. జీవులందరూ ప్రకృతియే కాన, స్త్రీ రూపులే అని గుర్తించి భర్తయను అహంకారము వదలి, భర్త స్వామియే అని గుర్తించిననాడు స్వామి యదార్థ కళ్యాణము.

## అర్హత - ఫలము

ప్రేమ, భావ రూపమున వున్నచో, సాధారణమైన మానవులు గుర్తించలేరు. కాన, వాచా కర్మణా వ్యక్తముచేయాలి. కాని స్వామి విషయమున ఆయన సర్వజ్ఞుడు. భావమును గ్రహించగలడు. కాన వాచా, కర్మణా వ్యక్తము చేయవలయునను నియమము లేదు. నీవు ప్రేమతో నిండి మధుమతీ స్వరూపుడవైననాడు నీకు ఆ ఫలము నేరుగాకానీ, గురువు ద్వారా కానీ, స్వామి నీ ఇంటిలో వున్ననూ అందచేయును. ఫలము పొందు అర్హత సాధించవలయును కానీ, ఇంటి నుండి బయటకు పోయినంత మాత్రమున ఫలము లభించునా? స్వామి అర్హత కలవానికి ఒక్కొక్క రూపమున ఫలము అందించును. ఇచ్చట అర్హత ముఖ్యము కాని ఆ అందించు విధానము కాదు.

ఒకనికి ఫలమును జేబులో యుంచవచ్చును. కాన జేబు తడుముకొనుచున్న మాత్రమున ఫలము వచ్చునా? అర్హత రాగానే నీకు చేతికి ఇవ్వవచ్చును. నిన్ను చూచి మరియొక్కడు చేతినే చూసుకొనుచున్న మాత్రమున ఫలము వచ్చునా? వానికి అర్హతరాగానే ఫలము నోటికి అందించవచ్చును. కాన అర్హత రాగానే నీకు ఎచట వున్ననూ ఫలము లభించును. ఒకరివద్దకుపోయి, ఒక విధానము చేసినంత మాత్రమున ఫలము రాదు. నీవు కూర్చున్న చోటనే వుండి అర్హత సంపాదించుకొన్నచో అక్కడే స్వామి ఆవిర్భవించి ఫలమునిచ్చును.

నా అనుగ్రహమును పొందిన ఆ జీవులు మధుమతీ రూపులు. కావున నన్ను సేవించినవారు వాణి వాక్కుతో గానము చేయుచున్నది. లక్ష్మి ద్రవ్య శరీర చేష్టయైన కర్మతో పాదములను పిసుకుచున్నది. పార్వతి

భావ మనో రూపమున తపస్సు చేసినది. ఇట్లు వారు నా దాసులు. వారికి కొన్ని అధికారముల నిచ్చితిని. అవియె వారు ఐహికములను యిచ్చుట - యజమాని సేవకులు అతిథిని ఫలహారముచే అర్చించుటకు యజమాని యొక్క అధికారమే. ఇంత మాత్రమున స్వామి ఐహికములను యివ్వడని కాదు. '' ఆ సేవకులే అన్నము పెట్టితిరి. యజమాని పెట్టలేదు'' అందురా? సేవకులు పెట్టిననూ యజమానియే అన్నము పెట్టెనని అందురుకదా. కాన నేను ఐహికములను నేరుగా ఇవ్వకపోయినా, నా దాసులే ఇచ్చిననూ, ఇచ్చినవాడను నేనే.

స్వల్పములయిన ఐహికముల కన్ననూ, గొప్పది అయిన ఆముష్మికమును ఇచ్చెదను. కాన నిజముగా ఐహిక... ఆ ముష్మిక ప్రదాతను...

నేనే .. నేనే .. నేను ఒక్కడనే...

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

★★★



శ్రీ గురుదత్త! ఓం జయ గురుదత్త!!

శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

## అధ్యాయము - 9

### శ్రీ దత్త తత్త్వము :

భగవంతుడు సర్వ వ్యాపకుడు. సర్వమునకు ఆధారము. అన్నిచోట్ల అన్ని శక్తులను కలిగియున్నాడు. ఒక ప్రదేశమున ఎక్కువ శక్తులు కలిగిలేడు. ఒక్కొక్క చోట ఋషులకు సాక్షాత్కరించినాడు. ఆ ఋషులున్న ప్రదేశములలో వ్యక్తమైనాడే తప్ప, ఆ ఋషులున్న ప్రదేశములలో ఏమీలేదు. మరియును వారికి వ్యక్తమగుట పూర్వమెప్పుడో జరిగిపోయినది. ఆ ప్రదేశమునకు ఇప్పుడు ఇతర ప్రదేశముల కన్ననూ విశేషమేమి కలదు?

ఒక యజమాని, ఒక సేవకునికి ప్రీతుడై ఒక ప్రదేశమున బహుమానము నిచ్చెను. ఆ ప్రదేశములో నిలిచినచో యజమాని బహుమానమిచ్చుననుకొనుట వెర్రితనము. ఆ సేవకునివలెను నీవును సేవలచే ప్రీతినొందించినచో యజమాని నీకునూ ఏ ప్రదేశము నందైనను బహుమానమీయవచ్చును. ఆ యజమాని ఆ సేవకునకు సోమవారము ఏకాదశినాడు బహుమానమిచ్చినాడు గాన, సోమవారము ఏకాదశినాడు విశేషమున్నదని తలచుట వెర్రియే. కాన ఒక ప్రదేశమున కానీ, ఒక కాలమునగానీ ఏ ప్రత్యేకతయును లేదు. దైవమును ప్రసన్నము చేసుకొనట ముఖ్యము కానీ, దేశ కాలములలో ప్రత్యేకత ఏమియునూ లేదు. అన్ని ప్రదేశములును అన్ని కాలములును సమానములే అని తెలియుము.

నన్ను సహజముగ యదార్థముగ ఆరాధించుము. అనగా నాపై నీకు ఎంత ప్రేమ ఉన్నదో పరీక్షించుకొనుము. నేను ఐహికములను కానీ, ముక్తినిగాని ప్రసాదించను అని తలంచి ఇప్పుడు నాపై నీకు ఎంత ప్రేమ కలదో పరీక్షించుకొనుము. అయిననూ నన్ను అర్చించుచున్నావా? అట్లు అయినచో నిజముగా ప్రేమ వున్నట్లే. తరువాత, నేను వరముల నివ్వకపోగా, కష్టములనిచ్చెదను అని తలంచుము. ఇప్పుడునూ నీకు నాపై ప్రేమ వున్నచో, ఇప్పుడు నిజముగ నీకు నాపై ప్రేమ పరాభక్తిగా యున్నట్లే. అట్లే నీవు అర్చించిననూ నీకు నేను ఎట్టి లాభమును చేయను. అంతేకాక కష్టముల నిత్తును. నీవు ఎంత మాత్రము నాపై నిజమయిన ప్రేమ కలిగివున్నావో పరీక్షింతును. ఇదియే దత్తతత్త్వము.

## నిజమైన ఆరాధన

ప్రేమ నిజముగా వున్నదని పై విధముగా తేలిన తరువాత, అది సహజముగా వున్నట్లే. ఏలనన కోరికలు లేనప్పుడు కృత్రిమమైన ప్రేమరాదు. నీవు నీ పసిపిల్ల నుండి ఏమియు ఆశించనపుడు, నీకు ఆపిల్లపై ప్రేమ నిజముగ సహజముగా వుండును. '' ఆ ప్రేమను ఎట్లు వ్యక్తము చేయవలయును? ఏమి మాట్లాడవలయును? అని నీవు ఆలోచించ పనిలేదు. అట్లే నన్ను ఏ విధానమున, ఏ శబ్దములతో అర్చించవలయునని ఆలోచింపనేల? నీ పిల్లపై ప్రేమను వ్యక్తము చేయుటకు ఏ విధానమును ఏ శబ్దములను ఆలోచించనట్లే, నాపై ప్రేమను వ్యక్తము చేయుటకు ఏ మార్గమునూ అన్వేషించ పనిలేదు. నీ పిల్లపై ప్రేమను వ్యక్తము చేయుటకు ఒక ప్రదేశము, ఒక కాలము అవసరము లేదు. ఎప్పుడు భావము వచ్చిన, ఆ సమయముననే నీకు తోచిన మాటలతో చేష్టలతో ప్రేమను వ్యక్తము చేయుదువు. అట్లే నీకు నాపై ప్రేమ భావము కలిగినపుడు, ఏ సమయమైననూ, ఏ ప్రదేశము అయిననూ, ఆ సమయంలో నీకు తోచిన మాటలతో-చేష్టలతో ప్రేమను వ్యక్తము చేయుటయే నిజమైన ఆరాధన.

నీవు ఒకనాడు నీ పిల్లపై ప్రేమను వ్యక్తము చేయలేదనుకొనుము ''అయ్యో! ఈనాడు వ్యక్తము చేయలేకపోయితినే'' అని విచారింతువా?

లేదు అట్లే, ఒకనాడు నన్ను అర్చించనంత మాత్రమున చింతించనేల? నీ పిల్లపై, నీ భార్యపై, నీ భర్తపై ఎట్లు సహజప్రేమ దేశకాల నియమములు లేక వ్యక్తములగునో, అట్లే నాపై దేశకాల నియమములు లేకుండా వ్యక్తము చేయుటయే నిజమయిన ఆరాధనము.

ఒక క్షేత్రము చాలక బహుక్షేత్రములకు పోవువాడు అల్ప విశ్వాసి. క్షేత్రము కన్నను, తన ఇంటిలో అర్చించు వాడు అధిక విశ్వాసి. తన ఇంటికన్ననూ, సదా తానెక్కడ ఉన్ననూ హృదయంలో అర్చించువాడు పూర్ణవిశ్వాసి.

ఇట్టి సహజ, సత్యప్రేమ వున్నచో, వాడు సాత్వికుడైనా, రాజసుడైనా, తామసుడైనా నన్ను చేరును. అట్టి త్రిగుణ రూపులైన నా పరమభక్తులయిన జీవులే లక్ష్మి-వాణీ-పార్వతులు. నాకు నీగుణములతో పనిలేదు. నీ సహజ-సత్యప్రేమ నాకు సమర్పణము చేసినచో చాలును. నీ హృదయంలో వున్న నేను, నీ శరీరము నంతయు వ్యాపించి నీవే నేను అగుదువు.

ది. 13-8-94 శ్రీదత్తవాణి.

## నిజమైన పుణ్యక్షేత్రము

''పూర్వము పుణ్యక్షేత్రములన్నియును ఏకాంత స్థలమున ఉండెడివి, జన సమర్దనకు ఇచ్ఛగించక, సాధకులు ఏకాంతముగ నున్న అరణ్య, గిరిప్రాంతములకుపోయి ప్రశాంతముగ భగవంతుని ఆరాధించిరి. అట్టి ఆరాధన ప్రదేశములే పుణ్యక్షేత్రములయినవి. క్రమముగా జనులు అందరును వారి వారి కోరికలను నెరవేర్చుకొనటకై, అట్టి ప్రదేశములలో భగవంతుడు ఎక్కువగా వ్యక్తమైనాడని పోయి ఆరాధింప ఆరంభించిరి. ఆ జన సమర్దము యొక్క కోరికల వత్తిడికి తట్టుకొనలేక, అసలు సర్వత్రా వ్యాపించియున్న స్వామి ఆ ప్రదేశముల నుండి తనను తాను ఉపసంహరించుకున్నాడు. కావున నేను నిశ్చయముగా చెప్పుచున్నాను - వినుము.

అసలు ఈనాడు ఈ పుణ్యక్షేత్రములందు ప్రత్యేకముగా వుండుట కాదు. ప్రత్యేకముగా లేకున్నాడు ఈ క్షేత్రములకన్ననూ, మామూలు ప్రపంచంలోనే సర్వవ్యాపియై వున్నాడు. కాని గొర్రెల స్వభావముతో జనులు సంమర్ధమున్న చోటకే, సంమర్ధమున పోవుచున్నారు.

భగవంతుడు సర్వవ్యాపకుడు. అయిననూ ఆయన ప్రత్యేక ప్రదేశములందు విశేషముగా వ్యక్తమగుటయు నిజమే. ఎచ్చట విశేషముగా వ్యక్తమగుచున్నాడు?

## నిష్కామము ఏకాంతము

ఎచ్చట కోరికలు లేక నిష్కామంగా జనులు తన ఆరాధన చూడవలయునను డాంబికము లేకుండా ఏకాంత ప్రదేశమున భక్తుడు ఆరాధించుచున్నాడో అచటయే స్వామి విశేషముగా వ్యక్తమగుచున్నాడు కావున నిష్కామము, ఏకాంతము ఎచట వున్నవో అదియే నిజమైన పుణ్యక్షేత్రము అని ఘంటాపథముగా చెప్పుచున్నాను.

ఇదే విధంగా కోరికలు, జన సంమర్ధము వున్నచోట స్వామి సర్వవ్యాపి అయ్యున్నూ, అచట విశేషముగా లేకుండా తనను తాను ఉపసంహరించుకొన్నాడు. కాన సర్వత్రా వున్నాడు. ఏకాంత ప్రదేశములలో నిష్కామారాధన జరుగుచున్న చోట విశేషించి వ్యక్తమై యున్నాడు. అట్లే జన సమర్ధ ప్రదేశములలో కోరికలు తీర్చుకొనుటకై ఆరాధన జరుగుచున్న చోట విశేషించి లేడు. అచట అసలు లేడు. నిష్కాముడవై ఆరాధించినచో అదే నిజమైన పుణ్యక్షేత్రము.

కాన నిష్కాముడవుకమ్ము. కేవల భగవత్కాముడవై ఏకాంత ప్రదేశమునకుపోయి ఆరాధింపుము. అదియే నిజమైన పుణ్యక్షేత్రము అట్లుపోవుటయే నిజమైన తీర్థయాత్ర. జనసమర్ధమున్నచోట ఆరోగ్యము ఉండదు. మరియు మోసము వ్యాపారము, డాంబికము ఉండును ఇవి అన్నియు యోగ విరుద్ధములు. యోగవిరుద్ధములయిన ప్రదేశములందు యోగియే నిలువజాలడు. ఇక యోగేశ్వరుడు నిలుచునా?

ఇప్పుడీ పుణ్యక్షేత్రములన్నియును ఒకనాడు పూర్వము నిజమైన పుణ్యక్షేత్రములే. ఏలనన ఆనాడు ఇవి యన్నియును ఏకాంత ప్రదేశములే. ఆనాడు ఈ ప్రదేశములలో యోగులు నిష్కామముగా యోగేశ్వరుని ఆరాధించి వుండిరి. ఇంగువపోయిననూ ఇంగువ వాసన ఉండును గదా అనుకొనరాదు. అనేకుల స్వార్ధములగు కోరికలను దుర్గంధములచేత వాసితమైన ఈ ప్రదేశములు ఆ ఇంగువవాసనను ఎట్లు వెదజల్లగలవు?

నిష్కాములైన పరమ భాగవతులే ఋషులు. అట్టి ఋషులు నివశించి సంచరించినదే తీర్థక్షేత్రమని శాస్త్రోక్తి. ఆ ఋషులు ఏకాంతములయిన అరణ్యములలోనే నివశించిరి. అట్టి ఏకాంతములయిన గిరులు, తరులు, నిర్ఝరులు మాత్రమే పుణ్యక్షేత్రములు.

నీవును నిష్కాముడవై ఒక ఏకాంత ప్రదేశమున స్వామిని నారాధించినచో ఆ ప్రదేశము నిజమైన పుణ్యక్షేత్రము. ఒకవేళ అట్టి ఏకాంత ప్రదేశము లభించనిచో, అల్పజన సంమర్ధముగల నీ గృహములోని పూజా గృహములో నిష్కాముడవై స్వామి నారాధించినచో నీవు నివసించి సంచరించిన నీ గృహమే నిజమైన పుణ్యక్షేత్రము'' అని ఉద్ఘాటించారు. ఆహా! స్వామీ! ఎంతటి దివ్య సందేశము. అద్భుతము!

17-8-94న దివ్య సంఘటన :

శ్రీ దత్తభక్తులను మాతా అన్నపూర్ణేశ్వరి ఆవహించి మా ఆతిధ్యమును స్వీకరించి మమ్ములను ధన్యులగావించి అనుగ్రహించింది. అంతా స్వామి లీల!

అన్నపూర్ణే సదా పూర్ణే శంకర ప్రాణవల్లభే
జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాందేహి చ పార్వతి.

శ్రీ భావనామ సం॥ శ్రావణ శుద్ధత్రయోదశి శుక్రవారము ది.19-8-94 శ్రావణ శుక్రవారము. వరలక్ష్మి వ్రతం.

ఉదయం 11.30 ల సమయం. ఈ రోజు వరలక్ష్మివ్రతం పూర్తి చేసుకొని హైదరాబాద్ వెళ్ళాలి. అందువలన పెందలకడ లేచి అన్ని సిద్ధం చేసుకొని వరలక్ష్మి వ్రతం పూర్తి చేసుకున్నాము. ఇక భోజనం చేసి బయలు

దేరడమే ఆలస్యం. ఇంతలో ఆశ్చర్యంగా శ్రీ దత్త భక్తులు వేంచేశారు. వెంటనే మేము వారిని ఆహ్వానించి ''స్వామి! సమయానికి విచ్చేశారు గదా! మా ఆతిథ్యం స్వీకరించి మమ్మ ధన్యులం చేయండి'' అని ప్రార్థించాము. అప్పుడు దత్త భక్తులిలా అన్నారు. ''నేను ఈ రోజు భోజనమునకు వెళ్ళవలసియున్నది. అందుకని మిమ్ములను చూచి వెళ్ళుడానికి వచ్చాను'' అన్నారు. స్వామి! తీర్థం స్వీకరించి, కొంచెం ఫలహారం చేయమని ప్రార్థించాము. సరేనన్నారు. ఫలహారం చేశారు. ''స్వామీ! ఈనాటి దివ్యవాణిని వినిపించరా'' అని ప్రార్థించాము.

శ్రీ దత్త భక్తులు ఇలా శెలవిచ్చారు.

'' ఈరోజు యమధర్మరాజు శిష్య సమేతంగా ఆవహించారు. నచికేతుడే శిష్యుడు. యమధర్మరాజు బంగారువర్ణంలో స్వర్ణమూర్తిగా ఆవేశించారు. యమధర్మరాజు నరకలోకంలో కాలమూర్తిగా నల్లగా భయంకరంగా వుంటారు. పితృలోకంలో స్వర్ణమూర్తిగా బంగారు ఛాయలో ఉంటారు. ఈరోజు ఆవేశము-స్వర్ణమూర్తి. గురుశిష్యులు వేంచేశారు. ఇలా అనుగ్రహించారు.

''పరబ్రహ్మమును తెలుసుకొను జ్ఞానార్జనయే శ్రేష్టము'' అని.

మేము వందనం చేశాము. స్వామి అనుగ్రహించారు.

## దివ్యస్వప్నం

11-9-94 ఉదయం 9 గం॥ లకు మా మనుమరాలు చి. లావణ్య ఫోనుచేసి ఇలా చెప్పింది.

''తాతయ్యా! రాత్రి శ్రీ సత్యసాయిబాబావారు స్వప్నదర్శన మిచ్చారు. ఆ స్వప్నంలో- అందరము ఇంట్లో కూర్చున్నామట. శ్రీసత్య సాయిబాబావారు వేంచేశారట. నేను నా శ్రీమతి భవాని, మనుమరాలు లావణ్య కూర్చుని వున్నామట. స్వామి అన్నారట- '' ఏమయ్యా! బాలకృష్ణమూర్తి! నల్లపూసవైనావేమిటి? ఎన్నిసార్లు చెప్పను? నిన్ను జపంచేసుకోమని. మీరు బాగా జపంచేసుకోండి'' అని కఠినంగా హెచ్చరించారట అని చెప్పింది. ఆహా! స్వామీ! ఇది మా దంపతులకు శ్రీవారి హెచ్చరిక. ఈ సమాచారం వినగానే మాకు కళ్ళనీళ్ళు తిరిగాయి. ఇలా వినతి చేశాము-

"స్వామీ! మానవమాత్రులము. మీ ఆరాధన చేయాలని నిష్కపటంగా ప్రయత్నిస్తున్నాము. సర్వాంతర్యామివి. నీకు తెలియనిది ఏమున్నది. చుట్టు తప్పనిసరి వ్యాపక కర్తవ్యాలలో పడి కాలము, శక్తి వృధా చేస్తున్నాము నిజమే, క్షంతవ్యులము.

నీ పాదపద్మములయందు మా హృదయము ఎల్లప్పుడు ధృడమైన భక్తి కలిగి యుండునట్లు అనుగ్రహించవయ్యా- క్షమించ వయ్యా శ్రీదత్తా!! అని వినతి చేసుకున్నాము.

స్వామి ఎప్పటికప్పుడు వెంటయుండి త్రోవ చూపిస్తూనే వుంటారు. ఆహా! ఎంతటి కరుణ!!

18-11-94 కార్తీక పౌర్ణమినాడు శ్రీదత్త భగవానుడు అనుగ్రహించిన శ్రీదత్తదివ్యవాణి

"నీవే భవానివని భావించుము
భక్తియె సర్వసాధనల సారము, కర్మలెల్ల - ఆ
ఆ భక్తియె లేనిచో వృధయె ప్రాణవిముక్త శవంబుఁబోలి ఆ
భక్తియు భావరూపమగు భద్రముగా మది పట్టుమాపరా
భక్తియె కోర్కెలేనియెడ, బంధముఁదెంచును నన్ను ఁజేర్చెడిన్.

దత్తుని పట్టుట కష్టము. చిక్కను జారును నిత్యము॥ ఈ
ద్రవ్యము చేతను, పూజల చేతను, చిక్కడు చిక్కడు తెలియండీ॥
దత్తుని పట్టే మార్గము చెప్పెద. సావధానముగ వినరండీ ॥
ప్రేమ ఒక్కటియే పట్టే పాశము, కోర్కెలున్నయెడ తెగునండీ
కోర్కెలేనియెడ ప్రేమలు సున్నా, బంధములన్నియు అంతేనండీ ప్రాణము
మానము॥ సర్వసమర్పణ స్వామికొరకై చేయండీ॥
నీవు శూన్యమయి స్వామియె సర్వము నిండి పోవునట్లు బ్రతకండీ॥

స్వామి ఒక్కడే పురుషుడు. పరాభక్తుడగు జీవుడు ప్రకృతి రూపమైన స్త్రీయని నిజతత్త్వము తెలుసుకొని, వాక్కాయ మనస్సుల చేత తపించి తపించి, వాణీ లక్ష్మి గౌరీ రూపుడైన వాడే పరమ భాగవతోత్తముడు.

నీకు కావలసిన ఐహికములను అతడే ఇవ్వగలడు. స్వామి అక్కరలేదు వాటికి. స్వామి కాళ్ళవద్దపడి ఉన్న కుక్క చాలును. అది అనుగ్రహించినచో నీకు ఇంద్రాధిపత్యము లభించగలదు. కాన కోర్కెలున్న నాకుక్కనారాధింపుము. సర్వాధిపత్యమునందు విరక్తుడవైన నాడు నా వద్దకు రమ్ము'' అని పలికారు స్వామి.

15-12-94 దివ్యవాణి

ఏమిసేతురా జీవా! నేనేమిసేతుర?
ముక్తినొసగమని కాళ్ళపడేరు
బంధము తెంచిన ఏడ్చేరు ! ॥ ఏమి॥
మహిమలు చూపిన గారడియందురు
చూపకున్న నామాట వినరు.. ॥ ఏమి ॥
ఇహమూ కావలె మోక్షము కావలె
భోగము కావలె యోగము కావలె ॥ ఏమి॥
మనిషిగ వచ్చిన పొమ్మంటారు
సొమ్ములు పెట్టిన నవ్వెదరు! ॥ ఏమి ॥

ఎక్కడినుండి వచ్చావో! మరల ఎక్కడికిపోతావో
నీకేమి తెలియదురా. జీవా!
ఈ మధ్య క్షణకాలము లోపల
మిడిసిపడి ఎగిరెదవేలా? ॥ ఎక్కడి ॥
మిద్దెలు మేడలు పుత్రులు బంధులు
క్షణమున పటపట తెగిపోతారు. ॥ ఎక్కడి ॥
జన్మము నరకము! మరణము నరకము
తదుపరి నరకము చెప్పగనేలా? ॥ ఎక్కడి ॥
నీ సంగతి తలచిన నాకే జలదరించును
మొద్దువలె వుంటావేల? ॥ ఎక్కడి ॥
కరుణాసాగర దత్తుని పాదము
గట్టిగ పట్టిన భయపడనేలా? ॥ ఎక్కడి ॥

అనురాగమను కుంకుమను తల్లిపై జల్లి
ధన్యుడు కావలె మాన్యుడతడు.

ప్రతిక్షణము అంత్యక్షణమని తలచి ఆర్తితో ప్రేమతో నన్ను స్మరించుచుండుము. సిద్ధముగా నున్నవాడు భయపడనక్కరలేదు. బాకీ సొమ్ము సిద్ధముగ వుంచుకొన్నవాడు అప్పులవాడు ఎప్పుడు వచ్చినను సిద్ధముగనున్నాడు కాన భయపడడు. మరుక్షణమే మృత్యువని తలచి ప్రతిక్షణమును చివరి క్షణముగ తలచువాడు జ్ఞాని. పురుషభావా హంకారము త్యజించి స్వామియే భర్తగా భావించి ప్రతి అంత్యక్షణమున స్వామిని పతివ్రతవై స్మరించుము.

''అహమిత్యేవ విభావయే భవానీమ్''
స్వామియే భవుడు. జీవుడే భవాని.

16-12-94 శ్రీ భావనామ సం॥ మార్గశిర శుద్ధ చతుర్దశి
మా దివ్యానుభవము

ఇది సత్యం. అనుభవం. మనవి చేసి ధన్యులమవుతాము.

మార్గశిర శుద్ధ త్రయోదశి వెళ్ళి చతుర్దశి వచ్చింది - 15-12-94 తేది. 16-12-94 ఉదయం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి అన్నవరము వెళ్ళవలసి యున్నది. 17-12-94 మార్గశిర పూర్ణిమ. ఆనాడు శ్రీ వీర వెంకట సత్యన్నారాయణ స్వామివారి సన్నిధిలో మేము ఏటేటా చేసుకొనే శాశ్వత వ్రతము, కళ్యాణము, అన్నదానము. ఆ శాశ్వత కార్యక్రమము ఏర్పాటు చేసుకొన్నప్పుడు ఆనాడు మార్గశిర పూర్ణిమ అనియే భావించాముగాని ఆరోజు శ్రీదత్తజయంతి అని అప్పట్లో మాకు తెలియదు. ఏటేటా పై కార్యక్రమము జరుపుకుంటూ వస్తున్నాము. శ్రీదత్త భగవానుని అనుగ్రహ పాత్రులమైన తర్వాత మార్గశిర పూర్ణిమకు అన్నవరం వెళ్ళవలసిన సమయం మరల 17-12-94 న వచ్చింది. బయలుదేరాలని ప్రయత్నం. వస్తూ పిఠాపురంలో శ్రీదత్త భగవానుని సేవించాలని అనుకొన్నాం. ఇట్లుండగా 16-12-94న శ్రీదత్తప్రభువుల దివ్యవాణి వచ్చింది.

అందులో ఇలా వున్నది.

"నీ ఇంటిలోనే కొలువుదీరి యుంటిని పిచ్చివాడా! నీ కాళ్ళ త్రిప్పట - ఎందుకు - ఎందుకు? నేను తలచిన - చిటికె లోపల అందుకుందువు యుగ యుగ తపములు చేసిన అందని బ్రహ్మపదవిని" అని స్వామి మా దంపతులను హెచ్చరించారు. ఏంచేయాలి? అనే ఆతురత కల్గింది.

హరిహర హిరణ్యగర్భాత్మక శ్రీవీర వెంకట సత్యన్నారాయణ స్వామివారు సాక్షాత్తూ త్రిమూర్త్యాత్మక శ్రీదత్త ప్రభువులే. పిఠాపురంలో వేంచేసియున్నది శ్రీదత్తావతారులు శ్రీపాద శ్రీవల్లభులే కదా. ఆనాడు దత్త జయంతి అని మార్గశిర పూర్ణిమ విశేషం కూడా తెలిసింది కదా. స్వామివారి హెచ్చరికలో ఏమన్నారు?

"పిచ్చివాడా! నీ కాళ్ళత్రిప్పట - ఎందుకు ఎందుకు? నేను తలచిన చిటికె లోపల - అందుకుందువు - యుగయుగ తపములు చేసిన అందని బ్రహ్మపదవిని-నా ఆజ్ఞ లేనిదే- ఎవ్వడేమియు-నీకీయలేడు నన్నర్థించియే-వరములనిత్తురు-దేవదేవతలు నన్ను తెలిసిన వాడు ఎవ్వడు-అన్యుల చూడడు అన్ని చివరల -చిట్టచివరి -వాడను నేనే -నీపై దయతో-స్వయముగ వచ్చితి -నీవు తరించగ కంటి మాయ -తెరలను త్రోసి -గుర్తు పట్టుము-ఋషులును దేవులు -గుర్తుతెలియక - వెదుకు చుండగా నీదు ఇంట - నీదు వెంట - నీదు జంట - ఉంటినే" అని.

తెల్లవారింది. అన్నవరం బయలుదేరాలికదా. కాని స్వామి వారి దివ్యవాణి మాకేమి బోధించినది? పిచ్చివాడా! నేను నీ ఇంటిలోనే కొలువు తీరియుండగా, నిన్ను తరింపచేయుటకు నీపై దయతో స్వయముగా వచ్చి నీదు ఇంట,నీదు వెంట,నీదు జంటగా కొలువైయుండగా, నన్ను విడిచి, నేను ఎక్కడో వున్నాని తలచి తిరుగుట నీ కాళ్ళ త్రిప్పటయేకాని, ఏమి ప్రయోజనము? ఏ దేవీదేవతలైననూ నన్నర్థించియే వరములిత్తురు. నేను సర్వజ్ఞుడను ఋషీశ్వరులు, దేవతలు నన్ను కనుగొన గుర్తు తెలియక

వెదుకుచుండగా నేను నీపై దయతో స్వయముగా నీ ఇంట కొలువు తీర్చి యుండగా నన్ను గుర్తించక నీవు ఇటు అటు తిరుగుట వ్యర్థము. కనుక కంటి మాయ తెరలను త్రోసివేసి నన్ను గుర్తుపట్టుము. నాపై దృష్టిని నిలిపి ప్రక్కకు త్రిప్పక స్థిరముగా యుంచుము. నన్ను తెలిసిన వాడెవ్వడు అన్యుల చూడడు. అన్ని చివరల చిట్టచివరివాడను నేను. నేను తలచినచో యుగ యుగముల తపము చేసిననూ అందని పదవిని చిటికలో అందుకుందువు అని హెచ్చరించారు గదా. మేము అన్నవరం ప్రయాణము విరమించుకొని దత్తజయంతిని మాయింటివద్దనే చేసుకున్నాము.

ఆహా! ఎంతటి జ్ఞానబోధ – ఆ వీర వెంకట సత్యన్నారాయణ స్వామియే శ్రీదత్త ప్రభువు – శ్రీదత్త ప్రభువే శ్రీవీర వెంకట సత్యన్నారాయణ స్వామి – ఆ స్వామియే మాయింట,వెంట,జంట నిలచి మమ్మను గ్రహించినారు! ధన్యులము !!

17-12-94 శ్రీదత్త జయంతి. శ్రీదత్త భక్తులు వేంచేశారు. శ్రీదత్త జయంతి సలక్షణంగా జరిపించారు. స్వామి! ఏరూపంలో వస్తారో! హఠాత్తుగా ఆ సమయంలో శ్రీ నరసింహమూర్తి అని వృద్ధ బ్రాహ్మణుడు విచ్చేశారు. వస్తూనే '' ఒరే! ఈ రోజు దత్తజయంతి. నేను వచ్చాను. నాకు అన్నం పెట్టండి'' అంటూ వెకిలిగా నవ్వారు. వారు వృద్ధ బ్రాహ్మణులు. డస్సి కృశించియున్నారు. వారు మాట్లాడుతూ వుంటే నృత్యం చేసినట్లే వుంది. వెంటనే వారికి స్నానం ఏర్పాటు చేశాం. శ్రీదత్త భక్తులతోపాటు అతిధి శ్రీనరసింహమూర్తిగారికి కూడా పీటలేసి ఇద్దరిని అర్చించాము. అప్పటికి మా యింటికి బంధురూపంలో వచ్చియున్న ఒక వేదపురుషుని ఇల్లాలును సాక్షాత్తూ భ్రమరాంబతల్లిగా పీటమీద కూర్చో బెట్టి అర్చించాము. శ్రీదత్త భక్తుల మెడలో పూలహారము వేసి వారికి నూతన వస్త్రములతో అలంకరించాము. శ్రీనరసింహమూర్తిగారిని కూడా అర్చించాము. భోజనానికి ఉపక్రమించే ముందు శ్రీదత్త భక్తులు హఠాత్తుగా పీటమీదనుంచి లేచారు. ఏమిటా! అని చూస్తున్నాము. మేము వారికి సమర్పించిన పూలమాల, నూతన వస్త్రములు శ్రీ నరసింహ మూర్తిగారికి

సమర్పించారు. తర్వాత ఇరువురు భోజనము చేశారు. తాంబూలం సేవించారు. శ్రీ నరసంహమూర్తిగారు నూతన వస్త్రములను ధరించి వెడలిపోయారు. నా శ్రీమతి శ్రీదత్తభక్తులతో ఇలా వచించింది – ''స్వామీ! మీకు మేము నూతన వస్త్రములను సమర్పించుకొంటిమి గదా, మీరు ధరించక, శ్రీనరసింహమూర్తిగారికి సమర్పించితి రేల? మాకు చెప్పరా? అని మిన్నకున్నది. శ్రీదత్తభక్తులు ఇలా సమాధానం చెప్పారు-

'' ఇది శ్రీ దత్తాజ్ఞ'' అన్నారు.

శ్రీ దత్తజయంతినాడు శ్రీదత్తాత్రేయస్వామియే స్వయముగా మా యింట కొలువు తీర్చి, శ్రీదత్త పూజయు,హోమము, మా ఆతిధ్యమును ను స్వీకరించి, మమ్ము సాక్షాత్తుగా అనుగ్రహించుటకొరకే, మేము అన్నవరం వెళ్ళకుండా స్వగృహమునందే వేంచేసి యున్న స్వామిని అర్చించు భాగ్యము మాకు కల్గచేసి మమ్ము ధన్యులను చేశారు. ఆహా! స్వామి! ఎంతటి కృపాళువువయ్యా! ఎంతటి ప్రత్యక్షదైవవయ్యా! అని ప్రణమిల్లితిమి.

మా అబ్బాయి చి. భాస్కర్ మా తరపున అన్నవరం వెళ్ళి శ్రీ వీర వెంకట సత్యన్నారాయణస్వామివారి వ్రతము చేశాడు అన్నవరం ప్రసాదం తీసుకువచ్చి, పిఠాపురంలో శ్రీ శ్రీపాద శ్రీవల్లభుల దర్శనము చేసుకొని ప్రసాదం తీసుకొని రావడం కూడా జరిగింది ఎంతటి కృప.

## శ్రీదత్త జయంతి–మార్గశిర పున్నమి–స్వామి సందేశము

'' ఈ రోజును కోరల పూర్ణిమ అందురు. రొట్టెలను కొరికి కుక్కలకు వేసినచో వాటి కోరలలోని విషము ఇరిగిపోవునను వాడుక కలదు. దీని అంతరార్ధమేమి? రొట్టెయే ఈ ఐహికము. దీనిని నీవు నోటి వరకు వచ్చినను భుజించక త్యాగము చేసి పడవేసినచో, నిన్ను కరచి నీకు పిచ్చిని పట్టించబోవు మాయ అనెడి ఈ కుక్క కోరల విషము విరిగిపోవును. కాన నీకు అపకారము చేయజాలదు. కాన రొట్టె తినుట అను భోగము కాదు.

ఉమ్మి వేయుట అను త్యాగము చేతనే నా యోగము సిద్ధించుచున్నది. ఈ మాయ అనెడి కుక్క కరచినచో నీవును కుక్కవలె ప్రవర్తించి పిచ్చివాడవై మృత్యువు పాలగుదువు. విషయ వాసనలను రొట్టెలను నోటివరకు వచ్చినను, లొంగిపోయి, మింగక, తుచ్ఛములు క్షణికములని భావించి త్యజించుము. వైరాగ్యం లేనిచో అసలు యోగము ఎట్లు సిద్ధించును? పలకయే పట్టనిచో వ్రాయుట నేర్వగలవా?

ఐహికములలో నీవెంత లగ్నమై పిచ్చివాడవైతివో నీకు తెలియదు. పిచ్చివానికి పిచ్చి వున్నట్లు వానికి తెలియదు. వానికి పిచ్చి వున్నట్లు బయటనున్న పిచ్చిలేని వానికి తెలియును. నీలో ఎంత సంసారమాయా విషము జీర్ణించుకొన్నదన్న, నీవు కొరికిన రొట్టెలు తిన్న ఈ కుక్కలు కూడా పిచ్చికుక్కలగునని, నీకు అందనీయక, వాటిని నావెంట త్రిప్పుకొను చున్నాను. నీ కన్న ఈ కుక్క ఎంతో నయము. నీకును, కుక్కకును ఎంత చెప్పినను తిరిగి మొదటికే వచ్చు తోక వంకర గుణమే సమానముగా యున్ననూ, దానికి నాపై గల విశ్వాసము నీకులేదు. ఇది నాకై తన ప్రాణమునే ఇచ్చును. నీవా? నీ జేబులోని చిల్లిగవ్వనైననూ నా కొరకు ఈయజాలని కృతఘ్నుడవు. ఇచ్చినను, అంతకు పదింతలు మరల ఇమ్మని కోరుచు పెట్టుబడి పెట్టి వ్యాపారము చేయువాడవు. నేను సత్యమును చెప్పుచున్నాను.

నిజముగా ఈనాడు 84 కోట్ల జీవరాసులలో మానవునకన్న అధమమైన జంతువులేదు. జంతువులు అప్పటివరకు ఆహారమున్న చాలును తృప్తి పడును. మానవుడు పది తరములవరకు సరిపడు గ్రాసము సంపాదించిననూ, ఇంకను ఐహికములను విడనాడక, ఇంకనూ సంపాదించుటకై నన్ను పీడించుచున్నాడు. వాని స్వార్థమును పూరించు కొనుటకు నన్ను పీడించుటయేతప్ప, మానవుడు చేయు పూజలో నాపై సద్భావము లేకున్నది. ఇట్టి మానవుని కన్న మృగ పక్ష్యాదులే మేలని, ఋషులు మానవులుండు ప్రదేశములు వదలి, మృగ పక్ష్యాదులుండు

వనముల నాశ్రయించినారు. సద్భావమనగా సత్యమైన నాయందే నీ భావమును ఉంచుట. అనగా నాకన్న భిన్నమైన ఈ సృష్టి అంతయూ ఐహికములన్నియూ అసత్యములని తెలిసి జ్ఞానియై, నేనే సత్యమని తెలిసి నాయందే భావమును దీక్షగా ఉంచుటయే సత్యన్నారాయణ వ్రతములోని అంతరార్థము. అంతే తప్ప ఐహికములను సాధించుటకు గోధుమరవ్వ, అరటిపండ్లు మొదలగు ప్రసాదమును నాకు లంచముగా పెట్టి నన్ను నీ సంసార పిచ్చిని ఇంకనూ పెంచుకొనటకు పావుగా వాడుకొనుట కాదు.

నీ భావమును నా యందు లగ్నము చేయుటయే నిజముగా స్వామి వారి కళ్యాణమును చేయించుటలో అంతరార్థము. జీవుడు, భగవంతుని తన పతిగా ఎన్నుకొని, ఆ నాటినుండి ఆ భగవంతునియందే పతివ్రతా ధర్మముతో ఉండుటయే పార్వతీ- పరమేశ్వర అథవా లక్ష్మీనారాయణాది కళ్యాణముల అంతరార్థము.

రాధను చూడుము. నాకొరకు ఎంత తపించి పోయినదో, తలచుకొన్నచో, నాకే ఆశ్చర్యమగును. ప్రేమయొక్క పరాకాష్ఠ అంత ఎత్తు ఉన్నదని నాకే తెలియదు. ప్రేమయొక్క అసలైన ఔన్నత్యమును చూపినది రాధయే. అందుకే ఆమెకిచ్చిన స్థానము ఏమిటి? నాకన్నా నన్ను మించిన స్థానమును ఇచ్చి ఆమె పాద దాసుడనైతిని. మహాకాళీ పాదములక్రింద పడియున్న పరమేశ్వరుని అంతరార్థమదే. అంతేతప్ప శక్తి శివుని ఓడించి తొక్కుచున్నదని తామసులు మూఢులై భావింతురు. అంతరార్థము తెలియనిచో ప్రతిదీ అంతేకదా.

నీవు ఎంత ఐహికమును సంపాదించిననూ, ఎన్ని రకముల ఐహికములను పొందిననూ, వాటి నన్నటినీ ఒకరోజున వదలి పోవలయును. ఆరోజు నుండి వాటితోకానీ, నీవు ఆరాటపడిన వ్యక్తులతో కానీ నీకు ఎట్టి సంబంధము లేదు. ఈ జన్మ ఒక్క క్షణమే కదా! ఈ మహా మహాకాల ప్రవాహములో. కావున ఐహికములన్నియు క్షణికములే కదా. వాటివల్ల ప్రయోజనమేమి? నీవెంట ఎవరు ఏదీ రాదు - నేను తప్ప. కాన నాయందే భావమును ఉంచి ఐహికములను త్యజించుటయే నిజమైన

దత్త జయంతి.

బ్రహ్మము నేనేరా
పరబ్రహ్మము నేనేరా ఓ జీవా
పరాత్పర బ్రహ్మమూ నేనేరా.
నన్ను చేరిన - చేరవలసిన - గమ్యము లేదిక
లేదిక - లేదిక - లేదిక -లేదిక -బ్రహ్మము

సృష్టికర్తను - సృష్టిభర్తను - సృష్టి హర్తను
సృష్టి అంటని - బుద్ధికి చిక్కని - భక్తిగమ్యుడ -బ్రహ్మము

ఎవ్వడు యముడు -ఎవ్వడింద్రుడు-నా భావరూపులే
నన్ను మించిన -ధర్మాధర్మము - లెచ్చట నున్నవి... -బ్రహ్మము

నీ ఇంటిలోనే - నే కొలువుదీరి - ఉండియుంటిని
పిచ్చివాడా! నీ కాళ్ళుతిప్పట - ఎందుకు ఎందుకు?.. -బ్రహ్మము

నేను తలచిన - చిటిక లోపల - అందుకుందువు
యుగయుగ తపములు-చేసిన అందని బ్రహ్మపదవిని..-బ్రహ్మము

నాపై దృష్టిని స్థిరముగ నిల్పుము - తిప్పకు పక్కకు
నాదు నామము-నీదు ఊపిరి-శబ్దము చేయుము.. -బ్రహ్మము

నా ఆజ్ఞలేకయే - ఎవ్వడేమియు - నీకీయలేడు
నన్నర్థించియే -వరముల నిత్తురు-దేవదేవతలు.. -బ్రహ్మము

నన్ను తెలిసిన - వాడు ఎవ్వడు - అన్యుల చూడడు
అన్ని చివరల - చిట్ట చివరి - వాడను నేనే.. -బ్రహ్మము

నీపై దయతో - స్వయముగ వచ్చితి - నీవు తరించగ
కంటిమాయ - తెరలను త్రోసి - గుర్తు పట్టుము.. -బ్రహ్మము

ఋషులును దేవులు - గుర్తు తెలియక - వెతుకుచుండగ
నీదుఇంట - నీదువెంట - నీదుజంట - ఉంటినే.. -బ్రహ్మము"

అని మమ్మనుగ్రహించారు శ్రీదత్త ప్రభువు. స్వామి! ధన్యులం.

భావనామ సం॥ పుష్యబహుళ నవమి బుధవారం

దె. 21-1-95న శ్రీ దత్త భక్తులకు శ్రీదత్త భగవానులు ప్రత్యక్షమై దివ్యవాణిని ఇలా అనుగ్రహించారు.

''నాయనా! శ్రద్ధగా విను. విషయములు మద్యమువంటివి. అలవాటు చేయుట తప్పు కనుక ఆదిలోనే త్రుంచాలి.

'' ఎంతో దూరం బ్రహ్మపదం – ఓ జీవా! ఇంకా
ఎంతో దూరం బ్రహ్మపదం

కన్నుల చంపుము – చంపుము చెవులను
జిహ్వను చంపుము .. వారే శత్రులు–
విషయాకర్షిత మింద్రియసంతతి
నాపై మనమును నిలువగ నీయదు – ॥ ఎంతో దూరం ॥

నన్ను చేరెడి లక్ష్యము నీకూ, చేసే సాధన
దాని విరుద్ధము మంట జేసెడి
లక్ష్య సాధనకు, నిప్పుల జలము పోసిన రీతిగా ॥ ఎంతో దూరం॥

ఏది విందువో, ఏది చూతువో
ఏది పల్కుదువో, అదియే నీలో
జీర్ణమగును, నీదగు తత్త్వము
ఆలోచింపుము, దీనిని చాలును ॥ ఎంతో దూరం॥

మొహమాటంబను మాటను వదలుము
కఠిన మనముతో దీక్షను బట్టుము
చూడకు దేనిని, వినకుము నెవ్వరి
పలుకకుమందరి పరిహరించుము ॥ ఎంతో దూరం॥

పిచ్చివాడవని పలికెడు వారల
పిచ్చివారలని తెలియుము మదిలో
వారలె యమపురి కేకలు పెట్టగ

ఇంద్రియనిగ్రహ నిశ్చలబుద్ధిని
నాపైనుంచుము నిమిషనిమిషమును
నన్నే చూడుము నన్నే వినుమూ
నన్నే పలుకుము ఇదియే మార్గము ॥ఎంతో దూరం॥

జగతిని వదలుట మోక్షము సుమ్మీ
నన్నే తలచుట సాధన సుమ్మీ
నన్నే చేరుట కైవల్యంబని
పండితులందురు, సత్యంబిదియే'' ॥ఎంతో దూరం॥

ఇంద్రియములు వేటియందు ప్రవర్తించునో అవియే మనస్సును కట్టివేసి తమ బానిసగ జేయును. నీకు తెలియకయే, నీవు నిగ్రహించిననూ ఆగక ఇంద్రియములు, మనస్సు వాటిపై పరిగెడును. విషయములు మద్యము వంటివి. అలవాటు చేయుటయే తప్పు. ఆదిలోనే త్రుంచవలెను. విషయవశుడు నన్ను చేరుట కల్ల. చేరుదునని అనుకొనుట ఆత్మ వంచన. వాడు చిరంజీవి అనుకొని సాధన చేయుటను రేపటికి త్రోయుచున్నాడు. రేపులేదు. నేడే పూర్తిగా ఉన్నదో లేదో తెలియదు. నిన్నటి దినము రాదు. కాన నేడే, ఈ క్షణమే నాయందు నిష్ఠితుడవు కమ్ము.

## శ్రీ దత్త లీల

శ్రీయువనామ సం॥ చైత్రశుద్ధ షష్టి శ్రీశైలంలో 6-4-95 గురువారము:

నేను నా శ్రీమతి శ్రీశైలం వెళ్ళాము. శివసదనంలో బసచేశాము. ఆనాడు గురువారము. ఇంట్లోనే పూజ. జపం చేసుకున్నాము. అన్నదాన సత్రానికి భోజనానికి వెళ్ళాలి. మధ్యాహ్నం 12.00గంటలైంది. మా గది తలుపులు మూసి ఉన్నవి. బయట వరండాలో జనసంచారం ఏమీ లేదు. ఇంతలో నాకు ''కోయి అన్నదాన్ కరేగా'' అని శబ్దం వినిపించింది. వెంటనే నేనన్నాను ''చూడు చూడు ఎవరైన మహాత్ములు వచ్చారేమో'' నని. నా శ్రీమతి వెంటనే అన్నది. ''నాకు భవతి భిక్షాందేహి'' అని వినిపించింది అంటూ వెంటనే తలుపులు తెరిచింది. చూడగా ఎవ్వరూ

లేరు. ఏమిటి? ఈ చిత్రం అనుకుంటూ గదితాళంవేసి అన్నదాన సత్రానికి బయలుదేరాం. శివసదనం నుండి రోడ్డుమీదకి వచ్చాము. రోడ్డు మలుపులో ప్రక్కనే శ్రీభ్రామరిసదనమున్నది. మేము శివసదనం నుండి బయటకు వచ్చి శ్రీభ్రామరీ సదనం వద్దకు వచ్చేసరికి, భ్రామరీ సదనం నుండి రోడ్డుమీదికి మా వైపుకు ఒక అవధూత వస్తున్నారు. పచ్చగా పొడుగుగా ఆజానుబాహువుగా ఉన్నారు. కాళ్ళకు చిరిగిపోయిన కాన్వాస్ బూట్లు మొలకు ఒక పాత వస్త్రము, ఒంటినిండా చిరిగిపీలికలైన రిబ్బన్ల వంటి గుడ్డ పీలికలు, చేతిలో ఒక కాగితము (న్యూస్ పేపరు ముక్క) దానిలో మసాలాగారె చిన్నముక్క వున్నది. స్వామి దానిని గిల్లుకొని నోట్లో వేసుకుంటూ నడుస్తున్నారు. సరిగ్గా వారు మేము ఎదుబొదురుగా ఒకచోట కలిశాము. స్వామి ఇలా అన్నారు. ''భూక్ లగెగా కుచ్ అన్నదాన్ కరేగా'' అని. అంటే, ఆకలి వేస్తోంది కొంచెం అన్నదానం చేస్తారా అని. మేము ఆశ్చర్యచకితులమైయ్యాము. ఇదేగా మాకు వినిపించిన శబ్దం. ఆహా! అనుకున్నాము. నేను పర్సులోనుండి కొంత పైకం తీసి వారికి ఇద్దామనుకున్నాను. నా శ్రీమతి అన్నది- ''స్వామికి ఏదైనా భోజనం చేయిద్దామని.'' వెంటనే ''స్వామీ! రండి అని వారిని తీసుకొని పోయాము స్టాల్ దగ్గరకు. పూరీలు, గారెలు ఉన్నాయి. స్వామి ఇంగ్లీషులో ఇలా అన్నారు.' No I dont want puri. Give me one single chapaty. That is available in the other stall" అని. మేము వెంటనే స్వామిని కర్ణ అనే అతడు పెట్టుకున్న స్టాల్ దగ్గరకు తీసుకెళ్ళాము. కాని అక్కడ కూడా చపాతీలు లేవు. అయ్యో! ఏమిటి ఈ పరీక్ష అనుకున్నాము. దానికి ఎదురుగా ఇంకో స్టాల్ ఉన్నది అక్కడ ఉన్నాయి. వెంటనే 3 చపాతీలు వేయించాను. నా శ్రీమతి దగ్గర ఉండి బాగా కూర వేయించింది. ఉల్లిపాయలు కూడా వేయించింది. స్వామిని కుర్చీలో కూర్చోబెట్టాము. వారిముందు భోజనం ఉంచి స్వామి స్వీకరించండి అని ప్రార్థించాము. స్వామి మహదానందపడ్డారు. '' ఓం నమః శివాయ'' అన్నారు. వారి భాషలో మజ్జిగ తాగుతానని తెల్పారు. ఒక గ్లాసు మజ్జిగ ఇచ్చాము.

స్వామి పాదములకు నమస్కరించాము శ్రీదత్త ప్రభూ అనుగ్రహించవయ్యా అని ప్రణమిల్లాము. స్వామి తన రెండు హస్తములతో చాలా ఆనందముగా "తుమ్హారా ఇచ్ఛా పూరీహోగా" అంటే మీమనస్సంకల్ప సిద్ధి అని ఆశీర్వదించారు ధన్యులం.

స్వామి ముందుగా శబ్ద రూపేణ, తర్వాత సాక్షాత్కార రూపేణ, మమ్మనుగ్రహించి తర్వాత సాక్షాత్తుగా కోరి భిక్ష స్వీకరించి మమ్ము ధన్యుల చేశారు.

ఇది శ్రీదత్త భగవానుని దివ్యలీల కాకపోతే మరేమిటి?

## 15-4-95, యువనామ సం॥రం చైత్రశుద్ధపూర్ణిమ శనివారం చంద్రగ్రహణ సందర్భమున శ్రీదత్తవాణి

## ఆధ్యాత్మిక సాధన, జీవిత విధానము

శ్రీదత్తభక్తులకు స్వామి సాక్షాత్కరించి శ్రీసత్యసాయిబాబా వారి రూపములో ఈ దివ్యవాణిని ప్రసాదించారు–

" ఆధ్యాత్మిక సాధన, జీవిత విధానము. ఈ రెండు వేరువేరు కావు. నిజముగా ఆలోచించినచో జీవితమే యదార్థమైన ఆధ్యాత్మిక సాధన. జీవితములో నీవు అలవరచుకొన్న గుణాలే ఆధ్యాత్మిక సాధనలో ప్రకటిత మగుచున్నవి. ఒక పెద్ద నృత్య ప్రదర్శన చేయుటయే ఆధ్యాత్మిక సాధన. ఆ ప్రదర్శనమును నేర్చుకొనుటయే జీవితరంగము. జీవితములో నీవు ఆలోచించు ప్రతి భావము, నీవు మాట్లాడు ప్రతి మాటా, నీవుచేయు ప్రతిపనీ, ఆధ్యాత్మిక సాధన పూర్వరంగములో శిక్షణలే. ఎట్లు అనగా ఉదా॥ స్వామిని నీవు ఆరాధించినప్పుడు, స్వామి నిన్ను పరీక్షించుటకు ప్రత్యపకారము చేయును. ఆ సమయంలో నీవు ఓర్పు వహించి స్వామిపై ప్రేమను తగ్గకుండా ఉంచుకొను గుణము ఉండాలి. ఈ గుణము నీకు జీవితరంగంలో శిక్షణ లభించాలి. అలా లభించినప్పుడే, ఆ పరీక్షా సమయంలో ఆ గుణము నీకు సాయము వస్తుంది. ఈ గుణం జీవితంలో ఎలా లభించును? నీవు ఉపకారము చేసినవారు కూడా నీకు ప్రత్యప

కారము కావించినారనుకొనుము. అట్టివారిపై నీవు ద్వేషమును పొందక, వారిని  కూడా అదే ప్రేమతో నీవు చూచినచో నీవు జీవితంలో అలవరచుకొన్న ఆ గుణము స్వామి పరీక్షా సమయంలో నీకు అక్కరకు వస్తుంది. అలాకాక జీవితంలో నీ శత్రువులను నీవు ద్వేషించి ఉన్నచో, స్వామి నీపై శత్రువుగా వ్యవహరించినప్పుడు స్వామిపై ద్వేషమును వహించి, పరీక్షలో ఓడిపోయి సాధనలో పతితుడవగుదువు. ఇలానే ప్రతిఫలాపేక్ష లేకుండా స్వామిని ప్రేమించుతత్త్వము సులభముగా నీకు లభించును. జీవితంలో నీవు అలవరచుకొన్న శాంతము, ఓర్పు, స్వార్థరహిత ప్రేమలే సాధనలో ప్రకటితమగుచున్నవి.

కావున దివ్యాత్మ స్వరూపులారా!

జీవితం- ఆధ్యాత్మిక సాధన వేరు కానేకావు. జీవితంలో నీవు కోతివలె చిందులు త్రొక్కినచో, ఆధ్యాత్మిక సాధనలో కూడా తీవ్ర పరీక్షా సమయాలలో అవే చిందులు నీవు అప్రయత్నంగా నీకు తెలియకుండా త్రొక్కుతావు. జీవితంలో నీ గుణాలు నీ స్వభావమే ఆధ్యాత్మిక సాధన అనే అద్దంలో ప్రతిబింబిస్తాయి. కావున జీవితమే సాధన. జీవితమే సాధన స్వరూపమైన తపస్సు. జీవితంలో సత్త్వగుణాలు అలవరచుకొనలేనివారు ఆధ్యాత్మిక సాధన చేయగలరా? శిక్షణలోనే చేతగానివాడు ప్రదర్శనలో గెలుచునా? కావున మీ జీవితాలను స్వార్థ రహితమైన, నిష్కామమైన పరమ పవిత్రమైన మధురాతి మధురమైన ప్రేమతో నింపుకొనుడు. ఆ ప్రేమలో ద్వేషము, క్రోధము,అసూయ, అహంకారము, అను విష బిందువులను పడకుండా కాపాడుకొనండి. అప్పుడే మానవత్వం పరిపూర్ణమగును. అది పరిపూర్ణమైన నాడు దైవత్వము క్షణములో సిద్ధించును.

నృత్య శిక్షణకు 360 రోజులు పట్టును. నృత్య ప్రదర్శన ఒక గంటసేపు మాత్రమే. కావున మీరు ప్రతిక్షణమూ మీ జీవిత చర్యలను మీ జీవితంలో మీరు ఆలోచించే ఆలోచనలను, జీవితంలో మీరు మాట్లాడే మాటలూ, చేసే చేతలూ గమనించి వాటిని మార్చుకొనండి. జీవతమును

సత్వగుణ మయంగా చేసుకోండి. అది జరిగిననాడు మీ ఆధ్యాత్మిక సాధన ఒక్క క్షణమే.

ఆధ్యాత్మిక సాధన అనగానేమి? శ్రీ దత్త పరీక్షయే. అది ఒక్క గంటయే. అందులో గెలుపొందగనే మీకు క్షణకాలములో జీవన్ముక్తి లభించును. మీరు పరీక్షపై, పరీక్షానంతరము లభించు డిగ్రీ సర్టిఫికేటుపై ధ్యాసను కేంద్రీకరించవద్దు. మీరు కేంద్రీకరించుకొనవలసినది అంతా మీ జీవితమనే విద్యాబోధనకాలమే. విద్యా శిక్షణ కాలములో జాగ్రత్త పడినచో పరీక్ష ఎంతసేపు? సర్టిఫికేటు రావటం ఎంతసేపు? ఈ రహస్యమును మీరు గ్రహించక, మీరు ఎన్ని పూజలు, జపములు, భజనలు, గ్రంథపఠనములు, సత్సంగములు, శ్రవణములు మొదలగు ఎన్నిచేసినా అవి వ్యర్థములు, వ్యర్థములు - ముమ్మాటికీ వ్యర్థములని ఈ చంద్రగ్రహణ సమయమున నొక్కి నొక్కి చెప్పుచున్నాను'' అన్నారు స్వామి.

శ్రీ యువనామ సం॥ చైత్రశుద్ధ తదియ సోమవారం శ్రీదత్త భగవానులు అనుగ్రహించిన దివ్యవాణి.

న దత్తాదపరోదేవః న ప్రేమ్ణః పరసాధనమ్

అనగా-శ్రీదత్తుని కన్నా వేరు దైవము లేదు. దైవ ప్రేమకన్నా వేరు సాధనము లేదు.

జగత్తును సృష్టించుట, జగత్తును పాలించుట, జగత్తును లయం చేయుటకన్నా మించిన పెద్ద కార్యాలు లేవు. ఈ మూడు కార్యాలు ఒక్కరే చేశారు. బండనెత్తిన వాడే, విసరిన వాడు. అతడే బండను ముక్కలు చేసినవాడు. ఎత్తలేనివాడు విసరలేడు. కాన జగత్తును సృష్టించినవాడే పాలించుచున్నాడు. జగత్తును లయింప చేయుచున్నాడు. కాన బ్రహ్మ విష్ణు ఈశ్వర నామాలు క్రియా నామధేయాలే తప్ప మూర్తులు కావు. ఆ మూడు నామధేయాలు నావియే. కాన దత్తుని మించిన దైవం లేడు. ఎవరిశక్తి అయినా చేసిన పనినిబట్టి తెలియును. జగత్సృష్టి,పాలన, ప్రళయము లను మూడు పెద్దపనులు మించిన పనిలేదు. ఆ పని చేసిన నాకన్నా గొప్పవాడు రెండవవాడు లేడు.

''న తత్సమశ్చాభ్యధికశ్చ శ్రూయతే'' అని శ్రుతి. ఇక ప్రేమను మించిన సాధన లేదు. నీవెన్ని చేసినా నాపై నీకెంత ప్రేమ ఉన్నది పరీక్షలో నిరూపణము అగును. పరీక్షలో తప్పి నేను అహోరాత్రాలు చదివితినన్నచో ప్రయోజనము లేదు. నీవు అహోరాత్రాలు చదివినా, నీకా సారాంశము వంటబట్టలేదు అని తెలుసుకొనవలయును. అట్లే సాధన సర్వస్వ సారాంశము ప్రేమయే. ఆ ప్రేమ నాపై నీకెంత ఉన్నదో దానినిబట్టి నీ సాధన స్థాయి నిర్ణయించబడును'' అన్నారు స్వామి.

## ఒక అనుభవం

11-9-95 రాత్రి నేను మెట్లు ఎక్కుతున్నాను. హాస్పటల్ నుండి నీరసంగా వస్తున్నాను. మా మనుమరాలు చి. రమ్య వెనుకనుంచి కొట్టింది. ఊరుకున్నాను. మెట్లపైనుంచి నీళ్ళు పోసింది తడిసిపోయాను. నాకు ఓర్పు నశించింది క్రోధం వచ్చింది. రమ్యపై నీళ్ళుపోశాను. ఆహా! ఈ చిన్న విషయానికి ఓర్పు నశించింది. క్రోధం ఇంకా తగ్గలేదని తర్వాత తెలుసుకున్నాను. ఇది ఒక అనుభవం.

ది. 1-10-95 యువనామ సం॥ ఆశ్వీయుజ శుద్ధ అష్టమి-దుర్గాష్టమి- శ్రీ దత్తవాణి శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి శ్రీ దత్త భగవానులు ఇలా అనుగ్రహించారు.

## దుర్గాష్టమీ సందేశము

''దుర్గములో నున్నవాడు ఎట్లు రక్షణ పూర్తిగా కలిగివుండునో దుర్గారూపమున నన్నాశ్రయించిన వాడును పూర్తిగా రక్షించబడును. ఇది మాతృస్వరూపము. బిడ్డల తప్పులను క్షమించి కాపాడు స్వభావము కలిగి ఉండును. వర్తమాన కాలమున విష్ణు స్వరూపమున స్థితి దశలో విశ్వము ఉన్నది కాన, ఉన్నాను. విష్ణు స్వరూపము మాతృరూపము. ప్రస్తుతము నేను కేవలము విష్ణురూపమున ఉన్న శ్రీ దత్తుడు కావున దుర్గారూపము నారాయణి వైష్ణవి అని తెలియుము. కావున ఈ దినము నా విష్ణు అవతారముల విజయములను స్మరించుము. నా హస్తముల పదినఖముల నుండియేదశావతారములు వచ్చినవి. ఈనాడే నేను రామావతార రూపంలో

రావణుని నిర్జించితిని. ఈనాడే కృష్ణుని రూపంలో నేను అర్జునునికి ఉత్తర గోగ్రహణ విజయమును ప్రసాదించితిని. ఈనాడే నేను హిరణ్యకశుపుని చీల్చితిని. నాకు నరసింహావేశములో భక్తవత్స లత్వము ద్విగుణీకృతముగా ఉండియున్నది. కారణము ప్రహ్లాదుడు పసివాడు. దానికి తోడు నా పరాభక్తి చేత మరీ పసివాడైనాడు. ఇట్లు ప్రహ్లాదుని స్వభావము అయిన పసితనము రెండింతలుగా ఉన్నందున నా ప్రేమయు ద్విగుణీకృతమై ఆవేశరూపమున గోచరించినది. నేనే ఆ నారసింహశక్తినగు నారసింహుని. హిరణ్యాక్షుని వధించిన వారాహిని నేనే. నా పాదమును నీవెప్పుటనైనను శరణము పొందుటకు వీలుగా నేను వామనావతారమున నా పాదమును ముల్లోకములందును వ్యాపింపచేసి ఉన్నాను. నీ అహంకారమును నా పాదములకింద ఉంచుకొనినచో దానిని పాతాళమున నకు అణగద్రొక్కెదను. ఇక మరల పైకిరాదు. నీవీ సంసార సాగరమున మునిగి జ్ఞానమును కోల్పోయి వున్నావు. నీ జ్ఞానమును సోమకాసురుడు అను భోగరూపమాయ హరించి వున్నది. నేను దృష్టికి నిలయమైన నేత్రాకారముకల మత్స్యరూపమున ఆ మాయను హరించితిని. అనగా నీ జ్ఞాననేత్రమును నాపై నుంచినచో నీకు తిరిగి అజ్ఞానరూపమైన వేదమును బోధింతును. నీవే సంసార సముద్రమున ఒక్కొక్కసారి క్రుంగి పోవుచున్నావు. నిన్ను కూర్మరూపమున పైకెత్తి భరించెదను. నానుండి సిద్ధులను పొంది అహంకరించిన కార్తవీర్యుని అహంకారము వేయి విధములుగా సహస్రబాహువులయినది. వాటిని నాకుఠారము చేత పరశురామ రూపమున ఖండించి నీకు ముక్తిని ప్రసాదించెదను. నీవు అజ్ఞానము చేత నాకు పశువులను బలి ఇచ్చుచున్నావు. అది కేవలము నీవు మాంసాహారివగుటచేత, నీ ఆహారమును నాకు నివేదనము చేయుచున్నందున స్వీకరించుచున్నానే తప్ప, నీవు పశువులను వధించుచున్నందున నేను బుద్ధరూపమున కన్నీరు గార్చుచున్నాను. కాన పశుహింసను మానుము. కనీసము నాకు సమర్పించుటకైనను విరమించుము. నీవు పశువులను నరికినట్లు, నేను కల్కిరూపమున దుష్టులను

ఖండించపోవుచున్నాను. ఇట్లు నా దశావతార తత్త్వములతో నా పూజ చేయుము.

ఆహారమును మితముగా భుజింపుము. రెండవపూటకు నీకు ఆహారమును నేనివ్వనేమోనన్న సంశయముతో రెండుపూటల ఆహారమును ఒకసారి తినుచున్నావు. ఆ ఎక్కువ ఆహారముతో కొంతయే జీర్ణమై నీ శరీరమునకు కావలసిన శక్తి నొసగును. మిగిలిన ప్రేగులలో మల రూపమున దాచబడియున్నది. దానినుండి వాయువులు జనించి నీ శరీరమును వ్యాపించి వాతరోగములను కలుగజేసి నిన్ను దుర్బలునిగా చేయుచున్నది. అట్టి మలము విసర్జనము చేతకాని నీకు రోగనివృత్తి కాదు.అట్లే భవిష్యత్కాలములో నీకు కావలసిన ధనమును నేనివ్వ నేమోనన్న సంశయముతో ఇప్పుడే ఎక్కువ ధనమును సంపాదించు టయు, నీవు ఎక్కువ ఆహారము తిన్నట్లుగా వున్నది. నీవు దాచిన ధనము, ప్రేగులలో ఉన్న మలముతో సమానము. అది వాతమును కలిగించి నీకు దౌర్బల్యము ను కలిగించునట్లు, ఆ ధనము కూడా నీకు వ్యసనములను కలిగించి నిన్ను దుర్బలుని చేయును.

నా భక్తుడగు యోగి ఆపూట భిక్ష వరకే సంపాదించును. దాచుకొనడు. రెండవపూటకు నేను ఆహారమును ఇస్తానన్న నమ్మకము వానికున్నది. అందువలన వానికి అల్పములగు మలమూత్రములు వుండును. కాన వానికి రోగములు వ్యసనములు లేకుండును.

ఒక ప్రదేశము, ఒక కాలము, ఒక విధానము అను భ్రమను వీడుము. నా ఆనందమునకే ఆరాధించుము. నీ ఆరాధనలో నీ ఆనందమును సైతము కోరకుము. నీ ఆరాధన నా ఆనందమునకు చేయుచు, నా ఆనందమే నీ ఆనందమని భావించి చేయుము. ఆస్థితి వచ్చినకాని నన్ను సాక్షాత్కరించుకొనలేవు.

31-8-1995 గురువారం - రాత్రి 8-00 గం||

శ్రీదత్తవేదము గ్రంధావిష్కరణమున శ్రీ స్వామివారి దివ్యవాణి

## సత్సంగమును మించిన సాధనలేదు

"కాలము ప్రధానము. సాధకుడు కాలము యొక్క విలువను గ్రహించవలెను. తమోగుణమున మునిగి కాలము విలువ తెలియని మానవుని మానమున ఒక సంవత్సరము పితృమానమున ఒక నెల అనగా పితృదేవతా స్థానమున ఉన్నవాడు అనగా దైవముపైన శ్రద్ధగలవాడని అర్థము. పితృదేవతలకు శ్రద్ధ ప్రధానము కావున దైవ శ్రద్ధ కలవానికి ప్రతిదినము ఒక నెలగా భావించును. అనగా ఒక దినము వృధా అయ్యేనేని ఒక నెల వృధాయయ్యెనని భావించును. ఆ తరువాత ది దైవ మానము. దైవ స్థానమున ఉన్నవాడు అనగా సత్త్వగుణమయమైనవాడు- అనగా శ్రద్ధ పెరిగి ఆధ్యాత్మిక సాధనలో సత్త్వగుణం పూర్ణమై దత్త పరీక్షలో నెగ్గినవాడు అనగా సాధన పండినవాడు ఒక్కరోజు వ్యర్థమైనచో ఒక సంవత్సరం వ్యర్థమైనట్లు భావించును. ఇదే మానవ సంవత్సరము దైవమానములో ఒకరోజుకు సమానము. ఇక బ్రహ్మజ్ఞానియే బ్రహ్మమానములో ఉన్నవాడు. అనగా నిశ్చయజ్ఞానము కల సిద్ధావస్థను సమీపించినవాడు. అట్టి బ్రహ్మ మానంలో మానవ సంవత్సరం ఒక్క క్షణమే. ఇదే కాలజ్ఞానము యొక్క అంతరార్థము. మానవావస్థలో తమోగుణము అజ్ఞానము. పితృదేవతావస్థలో రజో గుణము కర్మ. దేవతా వస్థలో సత్త్వగుణము జ్ఞానము. బ్రహ్మ మనావస్థలో త్రిగుణాతీతమైన పరాభక్తి తత్త్వము. కావున పరాభక్తి కలవాడు ప్రతిక్షణమును ఒక సంవత్సరముగా భావించి దైవారాధనలో కాలమును సద్వినియోగము చేయును. పోయిన కాలము రాదు. రేపు ఉండునో లేదో తెలియదు. మృత్యువు ఏ రూపంలో ఏ క్షణంలో ఉందో! ఒక్కొక్క క్షణమును ఒక్కొక్క సంవత్సరముగా భావించుము. దైవమును గురించి చింతించుము. దైవ ప్రేమను పెంచుకొను ప్రయత్నమును చేయుము. ఇంక కొన్ని సంవత్సరములు ఆయుర్దాయమున్నదని ఉదాసీనుడవు కాకుము. కొన్ని సంవత్సరములు కొన్ని క్షణములేనని భావించుము. ఏలనన కొన్ని సంవత్సరములు ఈ నరజన్మ ఇంకనూ మిగిలియున్ననూ, ఈ జీవుడు ఇంక మారడని

నిశ్చయించిన దైవము ఆ ఆయుర్దాయమును రద్దుచేసి పశుపక్ష్యాది జన్మలకు నెట్టవచ్చును. చూచితివా. కొన్ని సంవత్సరములు కొన్ని క్షణములే నిజముగా కావచ్చును. దీనినే అకాల మృత్యువందురు. ఇలానే దైవప్రాప్తికై ప్రయత్నించు సాధకునకు కొన్ని క్షణములే ఆయువు మిగిలిననూ, వాని సాధనకు సాయముగా కొన్ని సంవత్సరాలుగా దానిని మ 'ర్చవచ్చును దైవము. కావున కాలము యొక్క విలువను తెలియుట చాలా ముఖ్యము. సాధనలో తప్పని సరియగు కర్తవ్యములకు కాలము పోను మిగిలిన కాలం క్షణక్షణం సంవత్సరంగా భావించి, సంవత్సరాలున్నవని భావించకు. క్షణాలే ఉన్నవని భావించి దైవమునకు అభిముఖుడవు కమ్ము. దుస్సంగమును పరిహరించి, సత్సంగమును అర్జించుము. సత్సంగమె ప్రేమను నిజముగా పెంచును. సత్సంగమును మించిన సాధన లేదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## అద్భుత దర్శనం

శ్రీ దత్త భక్తులు సత్తెనపల్లి దగ్గర గారపాడుగ్రామం పనిమీద వెళ్ళారట. అచ్చట ఒక మిత్రుని ఇంటిలో బసచేయవలసి వచ్చినదట. వారి ఇంట్లో టేప్‌రికార్డర్‌లో ''రూపుతేరా మస్తానా - మల్లెపూల మస్తానా'' అనే పాట పెద్ద శబ్దంతో వినిపించిందట.

ఆ సాయంకాలం శ్రీ దత్తభక్తులు ఆ వూరి పొలంలో ఒంటరిగా నడచిపోతూ పరధ్యానంగా టేపురికార్డులో వినిపించిన పాటను పాడుతూ వెళ్ళుతున్నారట. ఆ పిచ్చ పాటను తాను పాడుతున్నాననే ధ్యాస లేక ఏదో ఆలోచిస్తూ వెళు తున్నారట. అప్పుడు శ్రీ దత్తభగవానుడు సాక్షాత్కరించారట. స్వామి దత్తభక్తులను చూసి నవ్వుతూ ''చూశావా! మాయలో పడ్డావు '' అన్నారట. శ్రీ దత్తభక్తులు వెంటనే త్రిప్పుకున్నారట.

అదే ఫణితిలో

''దేవ దేవ శ్రీదత్త పాహి పాహి ఉన్మత్త

త్వం మమైక ఆలంబో దత్తమేక మాలంబే'' అని పాడారట

తా॥ ఓ దేవ దేవా! శ్రీ దత్తా! ఓ ఉన్మత్తుడా! నన్ను రక్షించుము. రక్షించుము. నీవు ఒక్కడవే నాకు ఆధారము. ఒక్కదత్తునే పట్టుకొందును.

వెంటనే శ్రీ దత్తస్వామి ఉన్మత్త రూపందాల్చి నృత్యం చేశారట. ఇది ఒక గంటసేపు జరిగిందట. తర్వాత స్వామి యథాప్రకారంగా దర్శనమిచ్చి ఆశీర్వదిస్తూ ఇలా వచించారట.

"నాయనా! ఐహికమైనా, ఆముష్మికమైనా నా చేతిలో ఉన్నది. నా ఆజ్ఞ లేనిదే దేవ - దేవతలు ఎవ్వరికి ఏమియు ఇవ్వలేరు" అని చిరునవ్వుచిందించి అదృశ్యులైనారట.

అహా! ఎంతటి విచిత్రానుభవము.

## ప్రార్థన

శ్లో॥ దేవ దేవ శ్రీదత్త పాహి పాహి ఉన్మత్త
త్వంమమైక ఆలంబో దత్తమేక మాలంబే.

తాత్పర్యము : ఓ దేవదేవా! శ్రీదత్తా! ఓ ఉన్మత్తా! నన్ను రక్షించుము రక్షించుము. నీవు ఒక్కడవే నాకాధారము. ఒక్కదత్తునే పట్టుకొందును. అని పాడారు శ్రీదత్త భక్తులు. మనము అట్లే ప్రార్థన చేసి తరింతుము గాక!

6-10-95 1-45 ని॥ లకు శ్రీ దత్తవాణి

## నాదర్శనము లోని అంతరార్థం

నేను నింద్యాచారునిగ కనిపించి, యోగీశ్వర రూపంలో నీకు దర్శనమిచ్చినపుడు నీకు కలుగు మహాశ్చర్యంతో కూడిన ఆనందము అనంతముగా ఉండును. అట్లుకాన, నేను సదాచారుడైన బ్రాహ్మణ రూపంలో కనిపించి దత్తస్వరూపంతో సాక్షాత్కరిస్తే కలిగే ఆశ్చర్యానందములు కొద్దిగా ఉండును. నేను అనంత, ఆనంద రూపిని. అందువలన నేను అనంతానంత రూపదర్శనమిస్తాను. ఎర్రని ఎండలోనుండి నీడకు వచ్చినపుడు కలిగే సుఖాతిశయం చాలా ఎక్కువ. మామూలు ఎండలోనుండి

పీడకు వచ్చినపుడు కలుగు సుఖం తక్కువ. కావున నేను ముందు దురాచారునిగ కనిపించి నీలో ద్వేషక్రోధములను ఎర్రని ఎండను రగిలించి, ఏ నోటితో నన్ను దూషించినావో, అదే నోటితో నన్ను స్తుతించునా పవిత్ర దత్త స్వరూపాన్ని చూపిస్తాను. అపుడు నీకు కలిగే ఆశ్చర్యానందాలు అనంతముగా ఉండును. అనంతానందమే నా తత్త్వము. ఇదే నా దర్శనములోని అంతరార్థము.

యువనామ సం॥ కార్తీక శుద్ధ నవమి 1-11-95 బుధవారము.

శ్రీదత్తవాణి

## అసలు తండ్రి – దత్త తండ్రి

''నాయనా! విను. దత్త తండ్రిని ఆస్థి కొరకే సేవించి చేరుదురు. కాని అసలు తండ్రి పై గల నిజమైన ప్రేమ ఉండదు. అట్లే నానుండి ఐహికముల నాశించి నన్ను సేవించు ఈ భక్తులకు నిజముగా నేను దత్త తండ్రినే కదా!

నీవు అసలు తండ్రి అనుకొనుచున్నవాడు జన్మాంతరమున నీతో సంబంధములేక నీ శత్రువుగా నీతో కలహించుచున్నాడు. పైగా నీ తండ్రి నీకిచ్చు ఆస్తియు నాదే.

నీ జన్మ కారకుడను నేనే. నిన్ను గర్భమున ప్రవేశపెట్టి కాపాడి యున్నాను. పోషించిన తల్లియు నేనే! మహాభక్తుల రూపంలో నీకు సాయపడిన బంధువును నేనే. నాతో సంబంధము లేక కేవలము ఐహికములను కోరుట తమోగుణము. ఐహికముల కొరకు నాతో సంబంధముంచుకొనుట రజోగుణము. ఐహికములను త్యజించి, నిత్యానంద ముక్తిని యాచించుట సత్త్వగుణము. ఈ మూడు గుణములను త్యజించి అత్రివి కమ్ము. ఇదే మమకార త్యాగము.

నా గొప్పదనముల చూచి అసూయపడి నాకైవల్యమును కోరి ఆ గొప్పదనమును పొంది అహంకారవశుడవు కావద్దు అనసూయవు కమ్ము. నేను నీకు లభింతును.

శ్రీగురుదత్త

మార్గశిర పూర్ణిమ.. శ్రీ దత్తజయంతి 6-12-95 శ్రీ దత్త భగవానులు శ్రీ దత్తభక్తులను ఆవహించి ఈ దివ్యవాణిని అనుగ్రహించారు.

''చెప్పవలసిన దంతయు చెప్పియుంటి
చెప్పవలసిన దింక నిశ్శేషమగును
చేయవలసిన దెంతయో శేషమగుట
చేయవలసిన దానిలో సాయపడుము.

నాయనా!

నేను సత్యమును చెప్పుచున్నాను. నామాట విశ్వసించుము. నీ సాధన అంతయు నేటితో పూర్తియైనది. ఇంక నీవు సాధన చేయనవసరము లేదు. ఐతే, ఈ 84 కోట్ల జీవరాసులు నా బిడ్డలే కాన నీకు సోదరులై యున్నారు. ఈ ప్రాణులందరచేతను సాధన చేయించి సిద్ధికి చేర్చుట నాకున్న గాఢమైన ఒకే ఒక కోరిక ఈ కార్యక్రమమున నీవును పాల్గొన్నచో నీ సోదరులకు సాయపడుటయేగాక, నీ తండ్రికి ఎంతో ఆనందమును చేకూర్చిన వాడవగుదువు.

కావున నా సందేశములను ప్రచారము చేసి ఇతరులను ఉద్ధరించుటయే ఇక నీవు చేయవలసిన పని. సాధన పూర్తి అయినది అన్నమాటకు అర్ధము సిద్ధి నీ హస్తములోయున్నట్లే. సాధన పూర్తి కాకముందు అనగా సిద్ధిని పొందకముందు వేదనయు, అశాంతియును కలిగి సాధకుడు ఆరాడపడుచుండును. సాధన పూర్తియై సిద్ధిని హస్తగతము చేసుకొనినవాడు పరిపూర్ణశాంతితో యుండును. పరిపూర్ణ శాంతియే సిద్ధి యొక్క అసలైన లక్షణము. నీవు ప్రచారము చేయవలసిన సాధనయొక్క సారాంశము ప్రేమయొక్క పరాకాష్ట తత్త్వమే. అది యొక్కటియే నన్ను చేరుటకు మార్గము.

ఆ ప్రేమ పరాకాష్టలో సాధకుడు ధర్మమును కూడా అతిక్రమించ వలెను ధర్మము నాకన్న గొప్పది కాదు. అటు ధర్మమును అతిక్రమించుట చేత ధర్మము కన్ననూ నాకు గొప్ప స్థానమును ఇచ్చుట చేత ప్రేమ పరాకాష్ట వ్యక్తమగును. అనసూయను, సుమతిని, ప్రేపల్లెలో

మునిపత్నులను ఇట్టి పరీక్షలకే గురిచేసి ధర్మము నాకన్న గొప్పదా? ధర్మముకన్నా నేను గొప్పవాడినా? అను ప్రశ్నలకు గురిచేసియున్నాను. ధర్మముకన్న నాకే గొప్ప స్థానమును ఇచ్చి అనసూయ సుమతి నన్ను పుత్రునిగా పొంది లాలించి ఆ మహానందముతో తరించిరి.

అట్లే ముని పత్నులును వారి భర్తలు ఆగ్రహించినను, వినక ధర్మము కన్న నాకే గొప్ప స్థానమును యిచ్చి పూర్ణాహుతి చేయక మునుపే నాకు భోజనమిడి తరించిరి. అట్లే రాధయు, మీరాయును నా కొరకు ధర్మమును అతిక్రమించిరి. ప్రేమ పరాకాష్టలో సుఖము లభించకపోగా కష్టములు, అవమానములు, దారుణహింసయు లభించినను నన్ను విడనాడ కుండుటయే నా పరీక్షలో నెగ్గుట. అనగా నా పరీక్షలో నెగ్గుటకు కావలసిన బలము నిన్ను దారుణముగా హింసించు నీ శత్రువును కూడా లోకమున ప్రేమించుటచేత నీకు ఆ బలము కలుగును. విజయము సిద్ధించును. నేను పాశ్చాత్యదేశములో అవతరించినపుడు సాధకులకు బోధించినదిదియే. నన్ను కొరడాలతో కొట్టి, ముఖమున ఉమ్మివేసి, ముళ్ళకిరీటముపెట్టి దారుణముగా హింసించి చంపినవారిని నేను ఏ మాత్రము ద్వేషించక ప్రేమించి, వారిని క్షమించి యుంటిని. దానిలోని అంతరార్థమేమి? దారుణమైన శత్రువును కూడా నీవు ప్రేమించకలిగిన నాడు పరీక్ష సమయములో స్వామి నీకు దారుణశత్రువుగా నటించినప్పుడు ప్రేమ ఏ మాత్రము తగ్గకుండా స్వామిని ఆరాధించకలుగుదువు. ప్రేమలో ఏమాత్రము స్వార్థమున్నచో అట్టి దివ్యప్రేమ లభించదు. ప్రతి జీవుడును ఇతర వస్తువులను ఇతర వ్యక్తులను తన స్వార్థమైన సుఖమునకు ప్రేమించుచున్నాడే తప్ప తన స్వార్థము ఏ మాత్రము లేక కేవలము వారి సుఖమునకే ప్రేమించుట లేదు. అందువలన వీటిని ప్రేమలు అనరాదు. ఇవి అన్నియు స్వార్థములే!

నాకు ఒకసారి శిరోవేదన వచ్చినట్లు నటించితిని. నా భార్యలెవరునూ, ఆ శిరోవేదన పోవుటకు తమ పాదధూళిని నారదమునికి ఇవ్వలేదు. అట్లు ఇచ్చినచో నరకమునపడి నరక బాధను అనుభవించవలసి వచ్చును అను భయము చేత, అనగా స్వార్థముచేత ప్రవర్తించిరి. కాని గోపికలు మాత్రము నా శిరోవేదన తగ్గుటయే ప్రధానము కాని వారు అనుభవించ

వలసిన నరక బాధను తృణప్రాయముగా లెక్కగట్టి పాదధూళిని ఇచ్చి యుండిరి. ఇది కృష్ణావతార సంఘటన.శ్రీ దత్త పరీక్షలు. ఇట్లు అతి సూక్ష్మాతి సూక్ష్మములుగా యుండును. అవి అశిధారావ్రతము అనగా కత్తి అంచుపై నడకలేను. కావున ఈ సాధన సారాంశమును ప్రచారము చేసి పతితులగు నీ సోదరులను అనగా నా బిడ్డలను ఉద్ధరించు. తండ్రికి ప్రయోజకుడైన పుత్రునిపై దృష్టి ఉండును. పతితుడైన పుత్రునిపైననే విశేషముగా దృష్టియుండును. అంతమాత్రమున నీపై నాకు ప్రేమ లేదనియు, లేక తగ్గినదనియు కాదు. నీవు నాకు తండ్రికి జ్యేష్టపుత్రునివలె సాయము చేయుచూ, నా అంతవాడవని అర్ధము. నీపై నాకు ప్రేమ తగ్గినచో నాపై నాకు ప్రేమ తగ్గినట్లే గదా! తన్ను తాను ప్రేమించుకొనని వాడు ఎక్కడైనా ఉండునా?

''కావున జ్యేష్ఠః పితృ సమోభ్రాతా'' అనగా జ్యేష్ఠ కుమారుడు తండ్రితో సమానమైనవాడని శాస్త్రము.

అందువలన ఈనాటి నుండియు పూర్ణతృప్తితో, పూర్ణశాంతితో నా ఆదేశమును పాటించి పతితులైన అన్య సోదర జీవులను ఉద్ధరించు కార్యక్రమమున పాల్గొనుము.

నీవెన్ని జన్మలెత్తినను చేయువలసినది ఇదియే. నేను ఎన్ని అవతారములనెత్తినను కూడా చేయవలసినది ఇదియే కదా!

ఇది ఈనాటి దివ్యవాణి.

ఆహా! స్వామీ! ధన్యులము. మమ్మనుగ్రహించవయ్యా! అని ప్రణమిల్లుదము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# శ్రీ కాలభైరవ స్తుతి

## ప్రార్థన

శ్రీ దత్తా! నీ జీవితము నిర్మలము. నిన్నే నమ్మితి స్వామీ!
నను బ్రోవ రావయ్యా దత్తా!
నా జీవితము వంచన, చంచలమని నన్ను విడనాడకో దత్తా!
నన్ను రక్షింప వేగమే రావయ్య దత్తా!
గురువే ఉత్తమగతి. గురువు నీవే ననుకొంటి
సరగున నను బ్రోవరామయ్య దత్తా !!!



కాల భైరవుడు

శ్రీ దత్త భగవానుని వెంటనున్న ఆవు యమధర్మరాజా. సాత్త్వికుడు. ఇతడు శారీరకశిక్షలనిచ్చి జీవుని మంచి మార్గములోనికి మార్చుటకు యత్నించును. దానికి జీవుడు మారడేని, తన వెంటనున్న క్రూర శునకము అనగా కాలభైరవుని నియోగించును. కాలభైరవుని ఒక చేతిలో అగ్నిపాత్రయున్నది. రెండవ చేతిలో చీపిరి వున్నది. ఆ అగ్నిపాత్రలోని మహా విద్యుచ్ఛక్తి ద్వారా దుర్గుణోన్మాదముకల జీవునకు చికిత్సచేసి, జీవునిచే మానసిక యాతన ననుభవింపచేసి జీవుని దుర్గుణములను తన రెండవచేతిలోని చీపిరితో ఊడ్చివేయును. ఈ కాలభైరవుడు చాలా భయంకరుడు. '' ఈ యముడూ నేనే. కాలభైరవుడూ నేనే దండించు సమయమున నున్న గురుస్వరూపమే దండ ధారియగు యముడను. ఇక ఆ దండనములోనే అతి భయంకర గర్జనారావమును చేయువాడను నేనే. కాన నేను కాలభైరవుడని పిలువబడుచున్నాను. నా క్రోధములోను, నేను దండించు దండనము లోను అంతర్గతంగా జీవులను మార్చి బాగుచేయు వాత్సల్యమే తత్త్వము తప్ప ద్వేషము లేదు. నా క్రోధము నా మనస్సునకు అంటనిది. నా మనస్సు సదా శాంతముగా నుండును. నా క్రోధము కేవల శారీరక క్రియయే తప్ప, మనస్సునకు ఏ వికారము కలిగించనిది. ఇదే యోగము యొక్క తత్త్వము. ఈ విధముగా యోగము నాచరించువాడు సిద్ధిని

పొంది, అతడే నేనుగా అగును'' అన్నారు శ్రీ దత్త ప్రభువు.

కనుక

ఉద్వేగ రహితా సంతోషరహితా శాంతి సముద్రా శ్రీదత్తా ।
నిశ్చల నిర్మల తత్త్వజ్ఞానీ నిర్వికార జగదంత స్సాక్షీ
యోగిరాజ గురు పీఠాధీశా అవధూతాఖిల విషయస్పందా । అని

కీర్తించి, తరిద్దాం.

తా॥ దుఃఖము, సంతోషము-రెండు లేనివాడా! శాంతి సముద్రమా! శ్రీ దత్తా!

నిశ్చల నిర్మల తత్త్వ జ్ఞానము కలవాడా! ఏ వికారము చెందకుండా జగత్తుయొక్క లోపలనుండి, సాక్షిగా చూచువాడా!

యోగిరాజ గురుపీఠమును అధిష్టించిన ఈశ్వరుడా!

అన్ని విషయవాసనల కదలికల చేత అంటబడక వాటిని ఎగర కొట్టినవాడా! శ్రీ దత్తప్రభూ'' అని భావము.

## శ్రీ దత్త కాలభైరవ స్తుతి

## అద్భుత దర్శనం ! ! !

మా గురుదేవులు శ్రీ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తిగారు కెమిస్ట్రీ ప్రొఫెసరు Msc.,PhD. వారే దత్త భక్తులు. వారికి శ్రీదత్తాత్రేయ భగవానుని సాక్షాత్కారం కల్గినది. స్వామి వారితో సర్వకాలసర్వావస్థలయందు సంభాషిస్తారు. వారి దివ్యవాణియే శ్రీ దత్త దివ్యవాణి. మా దంపతులకు శ్రీ వేణుగోపాలకృష్ణమూర్తిగారి సేవా భాగ్యం కల్గటం మా పురాకృత పుణ్యఫలమే తప్ప వేరొకటి కాదు.

ది. 7-5-1997 తేదీ రాత్రి గం.11.30 ని॥లకు శ్రీ దత్త భగవానులు శ్రీ దత్త భక్తులకు శ్రీ దత్త కాలభైరవ స్వరూపంతో సాక్షాత్కరించారు. శ్రీ దత్త భక్తుల నోటివెంట ఈ స్తోత్రం వెలువడింది.

ఆ అమృత వాక్కులే శ్రీ దత్త కాలభైరవస్తుతి- భక్త కోటికి అందచేస్తున్నాము పఠించి తరించ వినతి.

## శ్రీ దత్త కాలభైరవ స్తుతి

శ్లో॥ బిభ్రతం పాణి పద్మాభ్యాం మార్జనీం చాగ్ని పాత్రకం
శ్వేతం శునక మారూఢం కాలభైరవ మాశ్రయే ॥

తా॥ ఒక హస్తమున అగ్ని పాత్రను, మరియొక హస్తమున చీపిరిని ధరించి తెల్లని శునకమును అధిష్టించియున్న కాలభైరవ స్వామిని ఆశ్రయించుచున్నాను.

శ్లో॥ నీలమేఘ ప్రతీకాశం భస్మఫాలం త్రిలోచనం
కృష్ణా జినం చాక్షహారం కాలభైరవ మాశ్రయే ॥

తా॥ నీల వర్ణమైన మేఘములవలెయున్న వారును, ముఖమున విభూతిని ధరించినవారును, మూడు నేత్రములుగలవారును, లేడి చర్మమును రుద్రాక్ష హారమును ధరించినవారును అయిన కాలభైరవ స్వామని ఆశ్రయించుచున్నాను.

శ్లో॥ వామాం సాలంచి భిక్షార్థ కాషాయాం శుక భస్త్రికం
ముక్తకేశం మహావీరం కాలభైరవ మాశ్రయే.

తా॥ భిక్ష కొరకు ఎడమ భుజమున కాషాయ వర్ణముగల ఝోలీని ధరించిన వాడును, ముడివేయని కేశములు గలవాడును మహావీరుడు అయిన కాలభైరవ స్వామిని ఆశ్రయించుచున్నాను.

సాక్షాచతుర్వేద సార స్వరూపం
శ్రీ దత్త దూతం శిరసా నమామి॥
స్వామి విశ్వాసార్ధ శునకాకారం
శ్రీ దత్త దూతం శిరసా నమామి॥
కాలభైరవ గురు దండాధికారం
శ్రీ దత్త దూతం శిరసా నమామి ॥
కాశీపుర క్షేత్రపాలక దేవం

శ్రీ దత్త దూతం శిరసా నమామి॥
శ్రీ దత్త దూతం శిరసా నమామి ॥
ప్రభుదత్త దూతం మనసా స్మరామి॥
గురుదత్త దూతం వచసా భజామి॥
శ్రీ దత్త కాలభైరవ స్వామి దేవతా భ్యోనమః
ఆత్మ ప్రదక్షిణ నమస్కారం సమర్పయామి॥

## శ్రీ దత్త దివ్యవాణి

'' ఓ పిచ్చి జీవుడా। నాపై నీకు ఈ ఒక్క జన్మలోనే అనురాగము తెలియును. కాని నీపై నాకు గల అనురాగము తెలిసినచో నీకు మతి భ్రమించి పిచ్చి పట్టును. అందుకే పూర్వజన్మలను గుర్తులేకుండా చేసినాను. నీకు ఏది మేలు చేకూర్చునో దానిని నీవు అడగకయే ఇవ్వనా? నీకు నేను ఇవ్వనేమో అన్న సంశయము ఏర్పడుటకు కారణము నీపై నాకు కోట్ల జన్మల నుండి ఏర్పడిన నా అనురాగము నీవు గుర్తించక పోవుటయే.

కనుక నన్ను మించిన దైవము లేడు. నన్నే ఆరాధించుము. తప్పక తరింతువు''. అని మరల మరల వక్కాణించారు.

## ప్రార్థన
## శ్రీ దత్త శరణాగతి

శ్లో॥ దేవదేవ శ్రీ దత్తా పాహిపాహి ఉన్మత్త
త్వంమమైక ఆలంబో దత్తమేక మాలంబే ।

తా॥ శ్రీ దేవదేవా! శ్రీ దత్తా! ఓ ఉన్మత్తా! నన్ను రక్షించుము రక్షించుము. నీవు ఒక్కడవే నాకాధారము. ఒక్క దత్తునే పట్టుకొందును.

శ్రీ దత్త శరణం మమః
గురు దత్త శరణం మమ
ప్రభు దత్త శరణం మమ

ఓం శాంతిః శాంతిః శాంతిః
శ్రీ దత్తవాణి

29-3-98 బహుధాన్య సం॥ చైత్రశుద్ధ పాడ్యమి ఆదివారము

## యుగాది సందేశము

''మేము మిమ్ములను సత్యమైన లక్ష్యమగు పరబ్రహ్మమైన మమ్ములను గుర్తించునట్లు చేసి, సత్యమైన మార్గమును మీకు ప్రకాశింపచేసి, మిమ్ములను మా వైపుకు నడిపించుకొనుచున్నామని తెలియుడు.

మా సేవకులగు కాలభైరవుల వారిని మీ వద్దకు పంపి సంపూర్ణ సత్యమును ప్రకాశింపచేసినాము. మేము కాలభైరవుల దృష్టిలో వారికి యజమానులము. కానీ మా దృష్టిలో వారికి మేము సేవకులము. మా సేవకులకు మేము సదా సేవకులము. కాలభైరవుల వారే మేము. ఏ బేధమూ లేదు. మేమే ప్రతి వస్తువులోను ప్రతి వ్యక్తిలోను ఉన్నాము. అయితే అహంకారము నశించి కేవలము ''నేను'' అను పదము మాత్రము మిగిలిన వారిలో మేము పూర్తిగా ప్రకాశించము. అహంకారము ఘనీభవించిన వారిలో మేము ప్రకాశింతుము. ఉదాహరణకు ఒక నైలాను గుడ్డతో చుట్టబడిన సుబ్బయ్యను ''సుబ్బయ్యా'' అనియే పిలుతుము. సుబ్బయ్య అతి పలుచని నైలాను గుడ్డద్వారా స్పష్టంగా ప్రకటితమగుచున్నాడు. అదే సుబ్బయ్య ఒక ఇనుప పెట్టెలో ఉన్నాడనుకొనుము. ఆ పెట్టెను ''పెట్టె'' అందుమే తప్ప సుబ్బయ్య అని పిలవము కదా! నైలాను గుడ్డవంటి ఒక భక్తునిలో నేను ప్రకటితమైనప్పుడు ఆ భక్తుని నా పేరుతోనే పిలుచుదురు. ఒక మూర్ఖునిలో నేను గూఢముగానున్నాను. అతని పేరుతోనే అతడిని పిలుతురు.

మీరేల మాటి మాటికి రక్షరక్ష అని పలవరిస్తున్నారు? ఈ సర్వ జీవులలో మిమ్ములను రక్షించినంత ఎవ్వరినీ రక్షించలేదు. మీరు మమ్మ పూర్ణంగా విశ్వసించి మమ్ములను సేవించుచున్నారు. కాన మేము మీ సేవకులము మా దృష్టిలో. మమ్ములను సేవకులుగా చేసుకున్న ఈ స్థితి, కైవల్యము కన్న గొప్పది. ఇంతకు పైన ఇంకేమి స్థితికలదో మాకు తెలియదు. మీకు తెలిసిన చెప్పుడు. మేమే ఆ స్థితికి మిమ్ములను చేర్చెదము.

మమ్ములను పూర్తిగా విశ్వసించినవారు, మేమే రక్షింతుమన్న

పూర్ణ విశ్వాసము కలవారు కాన రక్షించమని అర్థించరు. అట్లు అర్థించుట మా ఆత్మీయతపై నమ్మకము లేనట్లు.

స్వామీ! ధన్యులము. క్షంతవ్యులము అనుగ్రహించవయ్యా అని ప్రణమిల్లుదము.

శ్రీ దత్తవాణి 22-4-99 గురువారం

## దివ్య సందేశం

''ఓ జీవా!

వైరాగ్యమంటే ఏమనుకున్నావు? వైరాగ్యము అనగా విరాగము. విరాగము అంటే ''వ్యస్తోరాగోలోకాత్ విశేషో రాగోభగవతి'' అని వ్యుత్పత్తి. అనగా లోకమునుండి ప్రేమను ఉపసంహరించుకుని, స్వామిపై ఆ ప్రేమను ఉంచుట. అంతే తప్ప ప్రేమలేకుండా పాషాణమువలె జడమగుటకాదు. అయితే ఇక్కడ నీ ప్రశ్న ఏమంటే- లోకంలో ప్రేమ లేకపోతే కర్తవ్యాలు ఎలా చేయటం? మన బంధువులు మన ప్రేమను పొందనందున బాధ పడుదురుగదా అని. దీనికి సమాధానం చెపుతాను విను శ్రద్ధగా - లోకంలో ప్రేమ లేకుండానే కర్తవ్యాలు చేయవచ్చును. బంధువులను సంతోషింప చేయవచ్చును. ఎలా? కుండ నెత్తిపై పెట్టుకుని నృత్యం చేయుచున్న నర్తకిని చూడు. దాని ధ్యాస అంతా కుండపైనే. కానీ నృత్యంలో లయలో ఏ తప్పురాదు. అలా ప్రేమను భగవంతునిపై పెట్టి కర్తవ్యాలను చక్కగా నిర్వర్తించవచ్చును. కర్తవ్య నిర్వహణము ఒక జడక్రియ. దానికి ప్రేమ అవసరంలేదు. పిండిని పిసుకుట ఒక జడక్రియ. దానిని ప్రేమతో పిసికినా, ప్రేమలేకుండా పిసికినా ఫలం ఒక్కటే, తేడాలేదు. ఇక రెండో అంశం - మన ప్రేమలేనపుడు మన చుట్టూ ఉన్న సంతానాదులు బాధపడుట. ప్రేమ వద్దన్నాను కానీ, ప్రేమను ప్రదర్శించుట వద్దనలేదే! ఇదే రాజయోగము. బాహ్యంగా ప్రేమను నటించి ఇతరులను బాధపెట్టకుండా ఉండవచ్చును. వసుదేవుడు మరణించగా కృష్ణుడు వలవలా ఏడ్చినాడు. కానీ మనస్సులో ఏడవలేదు. తండ్రి కోసం దుఃఖించు కృష్ణుని చూచి దేవకి, బంధువులు కృష్ణునికి తండ్రిపైగల ప్రేమకు సంతృప్తి పడ్డారు.

ఒక పనిపిల్ల నీ పిల్లలపై ఎంతో ప్రేమను ఒలకపోయును కానీ దాని ప్రేమంతా లోపల దాని ఇంట్లో ఉన్న దాని సొంత పిల్ల పైనే ఉంటుంది కదా. పనిమనిషి ప్రేమకు నీవు నీ పిల్లలూ సంతోషిస్తారు. జ్ఞాని- అజ్ఞాని ఇద్దరూ సమంగానే కర్తవ్యం చేస్తారు- ఇద్దరూ సమంగానే బంధువులపై ప్రేమను ఒలకపోస్తారు. తేడా అల్లా జ్ఞాని లోపల అసక్తుడై తన ప్రేమను భగవంతునిపై కలిగి ఉంటాడు. అజ్ఞాని లోపలకూడా అదే ప్రేమతో ఉంటాడు. ఇదే తేడా ''కుర్యా ద్విద్వాంస్తథాఽసక్తః'' అని ఇదే గీతలో చెప్పాను.

అసలు నీవు ఐహికానికి స్వామికి ముడిపెట్టరాదు. నీకు చేయ వలసిన మేలు అంతా చేశాను. నీ కష్ట సుఖములను (పాపపుణ్య ఫలాలను) మార్చి మార్చి దశాచక్రంగా కర్మచక్రాన్ని తయారుచేసి, ఆ చక్రం మధ్యలో నిన్నుంచి చక్రాన్ని నీ చుట్టూ తిప్పుచున్నాను.''భ్రామయ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా'' అని ఇదే గీతలో చెప్పాను. ఓ జీవా! ఇంకేమి చేయమంటావు? నీకష్టాలన్నీ అవతలకి తోసి సుఖాలనే ముందుకు తెమ్మంటావా? చెప్పు. అలానే చేస్తాను. తరువాత సుఖానికి ముఖం వాచుకొని నిరంతరం ఏడుస్తావు. అప్పుడు మాత్రం నేనేమీ చేయలేను. ఎందుకంటే నీవు కోరుకున్నదే చేశాను కదా '' అనుభవించు'' అంటాను. కావున నీవు బాగా ఆలోచిస్తే నానుండి కోరవలసిన మేలు ఏమియును లేదు. పశ్చాత్తాపంతో దిద్దుకుంటే ఈ జన్మకర్మలు నశిస్తాయే తప్ప, నీ ప్రారబ్ధం- నీ సంచితం నశించవు కదా. ఏలనన ఆ కర్మల జ్ఞానం నీకు లేదు దిద్దుకుందామంటే. నీ సంచితమే నీ ముందు జన్మలకు కారణము. ప్రస్తుత జన్మకారణ కర్మయే ప్రారబ్ధం. నీవు ఈ జన్మకర్మలను దిద్దుకున్నందున సంచితంలోకి ఈ జన్మపాపాలు ఇక చేరవు. కాని, దిద్దుకొనలేని ప్రారబ్ధం - సంచితం కారణాలుగా గల భవిష్యజ్జన్మలు తప్పవు కదా. నీ సంచితంలోని పాప పుణ్యాలతోనే నీ భావి జన్మలలో సుఖ,దుఃఖ కర్మచక్రాలను తయారు చేస్తాను.

నా నుండి నీవు పొందగలమేలు ఏమియును లేదు. నేను చేయగలిగి

నంత మేలు నీ జన్మసమయంలోనే చేశాను. కావున నా నుండి నీవు పొంద గల అధిక ప్రయోజనము ఏమీలేదు. నన్ను నీవు ప్రయోజనం కొరకు ఆరాధించుట వృధా. నీ ఆరాధన వలన నేను చేయగలిగిన మేలు ఇంక ఏదియును లేదు. నీవు నా బిడ్డవు. బిడ్డ ఆరాధన చూసి తండ్రి మేలు చేస్తాడా? ఆరాధన చేసినా, చేయకున్నా, తండ్రి చేయగలిగినంత మేలు బిడ్డలకు చేస్తాడు. దుఃఖములేని సుఖములు వెగటు కలిగిస్తాయి. నీకు నిరంతర సుఖం ప్రసాదిస్తే , విసుగుపుట్టి నీకు పిచ్చి పుడుతుంది. సుఖదుఃఖాలు మారిమారి అనుభవించుట నీకు ఆనందాన్నిస్తాయి. ఈ సుఖదుఃఖాలు నీ కర్మలే. నీకు నీవే కారణము. నాకేమీ సంబంధంలేదు. నేను నిన్ను చేయమని ప్రేరేపించలేదు. అనుభవించక ఎంతవారికిని తప్పదు. అదే ధర్మదేవుని శాసనము. ధర్మదేవుని రక్షిస్తానే తప్ప అవమానించను. నీ పాపకర్మను రద్దు చేసిన అందరి పాపకర్మలు రద్దుచేయవలదా? నేను నిష్పక్షపాతిని. నీవు స్తుతించుచున్నావు కదా అన్నచో నీ కాకాకు లొంగి పోయి కోర్టులో ఇచ్చిన తీర్పు తప్పించుట అన్యాయం కాదా? లోకంలో ఒక జడ్జి అలా చేస్తే వానిని నీవే విమర్శిస్తావే! మరి అదేపని నీవు చేస్తూ నన్ను చేయమంటావేమి? లంచమిచ్చినవారును లంచము పుచ్చుకొన్న వారిరువురూ శిక్షార్హులే. నీ పాపకర్మ రద్దుచేసినచో నీతోపాటు నేను ధర్మదేవుని శిక్ష బారి పడవలసినదే! నీ పాపము రద్దుకాకపోగా, నీ శిక్ష రెండితలవుట, అన్యాయంగా నాకు శిక్ష పడుట! ఇది నీ తెలివిగల పనియేనా?

## కల్యాణ గుణములు

నన్ను ఆరాధించవలసిన అవసరంలేదు. అయినా ఆరాధిస్తానంటే అదే నిజమైన ఆరాధన. ప్రతిఫలాపేక్షలేక, నా గొప్పతనముచే ఆకర్షించబడి అసూయపడక నా కారుణ్య, సౌజన్య , ఔదార్య, గాంభీర్య, సౌందర్య, సౌరభ్య, ధైర్య, వీర్య, జ్ఞాన, బల, యోగ, తేజో, విలాస, విభూతి, సామర్థ్యాది అనంత కళ్యాణ గుణములకు ఆకర్షింపబడి ఆరాధించినచో, అట్టి ఆరాధన, ఏ ఫలమును ఆశించక, సహజముగా, సత్యముగా వచ్చిన

ప్రేమాకర్షణ. నేను నిన్ను ఆరాధించమని అడిగినచో అట్టి ఆరాధనకు జీతమడుగ వలయును. కాని సత్యారాధనలో జీతముండదు. అది సత్య-సహజ -శుద్ధ -నిర్మల ప్రేమ- అదే భక్తి.

శ్రీదత్తవాణి 25-4-99

ఓజీవా!

నా ఆరాధనమును ప్రయత్నించి పెంచకుము. అట్లు పెంచవలసిన అవసరములేదు. ఎందుకనగా ప్రతిఫలాపేక్ష లేనపుడు తక్కువ - ఎక్కువ ఆరాధనలుండవు. నేను ఒక గంట పనిచేయుగా 10రూ.లను ఇచ్చినావనుకొనుము. మరియొక గంట పెచ్చుపని చేసినచో మరియొక 10 రూ.లను ఇత్తువు. కాని నా ఆరాధనము 1గంట చేసిన 2గం॥లు చేసిన ప్రతిఫల ప్రసక్తియే లేనప్పుడు నీవు ప్రయత్నించి ఆరాధనా సమయమును పెంచనేల?కావున ఎంత ఆరాధన నీకు సహజముగా వచ్చునో అంతే చేయుము. అదే సహజము. సహజమే సత్యము-నిర్మలము-భగవత్ప్రీతి కరమగును. ఆరాధనా విధానము గురించికూడా చింత ఏల? కాళ్ళు పిసికినచో 10రూ.లు, వీపుతోమినచో 20రూ.లు అను జీతములో మార్పులున్నచో కాళ్ళు పిసుకుటకన్నా, వీపు తోముటయే మేలని కర్మ విధానమును మార్చుకొనవచ్చును. కాళ్ళు పిసికినా, వీపుతోమినా, నానుండి లభించునది ఏమియును లేనప్పుడు, నీవు ప్రతిఫలాపేక్ష లేకుండా చేసినపుడు ఏవిధానమైననేమి? ఎంత సమయమైననేమి? ఈ లౌకిక సంసార కర్మలందు భగవంతుని లాగకుము. అట్లే భగవదారాధనములోనికి ఈ సంసారమును లాగకుము. అవి రెండూ వేరువేరు తీర్థప్రసాదముల వంటివి. వాటిని కలుపరాదు. నన్ను గురించి క్షణమాలోచించుము. నన్ను దత్తస్వామియని కొందరు తలుతురు. కాలభైరవుడని కొందరి మతము. తాతయ్యగారి అబ్బాయి అని కొందరి భావము. మోసగాడని మరికొందరి మతము. నేనెవ్వరు? అన్నీ ఎవరెట్లు భావించిన వారికి అట్లే గోచరింతును. అట్లే ఆచరింతును. ఒకరిభావమునకు మరియొకరి భావకర్మల నాచరింపను. అనగా నన్ను

తాతయ్యగారి కుమారునిగా భావించువారికి అట్లే ప్రవర్తించెదను. స్వామిగా విశ్వశించేవారికి అట్లే ప్రవర్తించెదను. కావున నీవును ఓ జీవా! నిన్ను తల్లిదండ్రిగా భావించువారికి తల్లిదండ్రిగనే ప్రవర్తింపుము. నిన్ను కొడుకుగా భావించువారికి కొడుకుగా ,అల్లునిగా బావించువారికి అల్లుడిగా ప్రవర్తించుము. కోడలిగా భావించువారికి కోడలి గానే ప్రవర్తించుము. నిన్ను భక్తునిగా భావించువారికి భక్తునిగా ప్రవర్తించుము. నిన్ను తల్లిగా భావించి వచ్చిన పిల్లలకు తల్లిగానే ప్రవర్తించుము. వారికి నీ భక్తి భావము చూపరాదు. కర్తవ్యము, భక్తి వేరువేరు. రెండింటిని మిశ్రమము చేయవలదు. రెండూ పాడగును. కర్తవ్యములో కూడా మనస్సును స్వామిపై వుంచి నటించుచూ కర్తవ్యములను చేయుము. తప్పక తరింతువు.

ప్రమాధినామ సం॥ శ్రావణ బహుళ అమావాశ్య 9-9-99 గురువారం శ్రీదత్త వాణి

## అత్రి - అనసూయలు

అత్రి - అనసూయలు ఋక్ష పర్వతముపై తపస్సు చేశారు. వారికి స్వామి తన్ను తాను దత్తపుత్రుడిగా దత్తం చేసుకున్నారు. దీనిలోని అంతరార్థమేమి ?

అత్రి అనగా - మూడింటిని పారద్రోలినవాడు. ఆ మూడే

(1) సాత్త్వికాహంకారము : విద్య-జ్ఞానము, సద్గుణములు తనకు కలవని గర్వించుట.

(2) రాజసాహంకారము : ధనము, బంధుబలం, తానుచేయు సత్కార్యముల గురించి గర్వించుట.

(3) తామసాహంకారము : తన శరీరములోని శక్తి సామర్థ్యాలు, తన శరీరము రూపమును గురించి గర్వించుట. ఈ మూడును ఒకదానికన్నా మరియొకటి బలమైనది. ఎప్పుడు యీ మూడు అహంకారములు తొలగి పోవునో వాడు అత్రి అగును. అట్టివాని అహంకారములు పోగా, ''అహం'' (నేను) పోయినది. ఇక వానికి ''మమ'' (నాకు) అనునదియే ఉండదు. అట్టివాడు స్వార్థమును పోగొట్టుకొని నిర్మలుడగును. వానికిక కోరికలే ఉండవు. ఇది తనను గురించిన సాధన.

అనసూయ అనగా - తనచుట్టు ఉన్నవారిని గురించిన సాధన.

తన తోటి మానవులపై అసూయ చెందకుండా ఉండుటయే అనసూయ స్థితి.

ఇట్లు అత్రి - అనసూయ స్థితులు గల జీవుడు ఋక్ష పర్వతముపై తపస్సు చేశారు. ఋక్ష అనగా - భల్లూకము. అనగా భల్లూకను పట్టువంటి నిష్ఠ. పర్వతము అనగా నిశ్చలత్వ స్థితి. నిష్ఠతో గూడిన నిశ్చల స్థితియే ఋక్ష పర్వతము. తపస్సు అనగా తపనతో చేయుపని. ఈ తపస్సు మూడు విధములు -

1. మానసిక తపస్సు : భగవంతుని నుండి జ్ఞానమును సంపాదించుకొనుట.
2. వాచిక తపస్సు : ఆ జ్ఞానమును ఇతర జీవులకు ప్రభోదించుట.
3. శారీరకమైన కర్మ తపస్సు : దేశ సంచారమును చేయుచు ప్రచారకర్మను చేయుట. ఇదే తపస్సు. సేవా రూపమైన కర్మ.

ఇట్టి సేవ చేసిన వారికి (జీవునకు) స్వామీ తన్ను తాను అర్పణము చేసుకుంటారు. ఇదే దత్తత. తన్ను తాను పుత్రునిగా సమర్పణము చేసుకొనుట. పుత్రుడు అనగా సేవకుడు. అనగా తన సేవకునికి సేవకుడౌతాడు. ఇదే చరమ-పరమ ముక్తి.

సేవయే చరమస్థితి. ఒక కన్య వరుడి గుణగణముల జ్ఞానమును పొంది, తరువాత అతడిని పొందుటకు తపన పడును. ఈ తపనయే భక్తి. భక్తి ద్వారా స్వామిని పొందును. ఆ తరువాత ఆ భర్తను వృద్ధ వయస్సు వరకును బ్రతికియున్నంత వరకును భార్య సేవ చేయును. ఈ సేవయే నిజమైన పరీక్ష. సేవతోనే సర్వము సమాప్తమైనది. ఈ సేవకు ముందు యోగము కావలయును. యోగము అనగా కాల శక్తులను దుర్వినియోగము చేయకుండా కాపాడుకొనుట. యోగము తరువాతనే కర్మ (సేవ). కావున జ్ఞాన-భక్తి-యోగ-కర్మ (సేవ) లే వరుసగా సోపానములు.

ఇట్టి అంతరార్థమును గ్రహించక, కేవల కథనే తీసుకొని

వినోదించుట, సేవలో పాల్గొనక చేయు పూజలు భజనలు, జపములు, యజ్ఞములు వ్యర్థములే అగును.

16-9-99 గురువారము ఉదయం 6-15 ని॥లకు శ్రీ దత్త వాణి

దమము :- ఇంద్రియ నిగ్రహము. ఇది వైదిక కర్మాచరణము చేత సాధింపబడునది. బ్రహ్మస్వరూపము.
దయ :- ఇది సాత్త్విక జ్ఞాన సాధ్యము విష్ణుస్వరూపము.
దానము :- ఇది త్యాగ కర్మ అగు శివస్వరూపము. ఈ మూడు కలిసి దత్త స్వరూపము అనగా దానము. జ్ఞానమును దానము చేయుటవలనను, అత్రి అనసూయలకు తన్నుతాను పుత్రునిగా దానము చేయుటవలనను, సర్వజీవులకు ఆయా కర్మఫలములను నిష్పక్షపాతముగా దానము చేయుట వలనను దత్త శబ్దము ఏర్పడినది.

దానము చేయునపుడు యోగ్యతను చూడవలెను. సాత్త్విక గుణము కల దైవభక్తియే యోగ్యత. ఇట్టి యోగ్యత కలవారికి ఒక వస్తువు లోపించినపుడు అది మనవద్ద సమృద్ధిగా నున్నపుడు దానిని దానము చేయుటయే దత్త స్వరూపము. ఇది పుణ్యకర్మ. సుఖకరము. అదత్త మనగా దానము చేయకుండుట ఇదే పాపకర్మ దుఃఖకరము. వస్తువు అనగా ధనము, శక్తి మొ॥ ఏదయినా కావచ్చును. వృద్ధులు యోగ్యులగు వారి కడ శక్తి తకువగా ఉండును. వారికి వారి పనులలో సాయపడుట మనవద్ద పుష్కలముగా నున్న శక్తిని దానము చేయుట దానము. అత్రి అనసూయలు యోగ్యులు కానీ సంతానము లేదు. కావున స్వామి తన్ను తాను దానము చేసుకున్నారు. గురుస్వరూపంలో యోగ్యులగు వారికి స్వామి సదా జ్ఞానమును దానము చేయుచున్నారు. మనవద్ద పుష్కలముగా నున్నదానిని మనమే కేవలము అనుభవించు బుద్ధిని నిగ్రహించుటయే దమము. దానము చేసిన వానికి అది కాలాంతరమున జన్మాంతరమునను ఆ వస్తువు వృద్ధి చెందును. యోగ్యులగు వృద్ధులకు శక్తిని దానము చేసిన వారికి ఏ రోగములు రాకుండా శక్తి సమృద్ధిగానుండి ఆరోగ్యముతో ఆయుర్దాయము వృద్ధి చెంది ఉండును. ''వృద్ధోపసేవీ చాయుష్మాన్'' అని శాస్త్రోక్తి ఇదియే.



ధాతృనామ సంలో శ్రీ దత్త భగవానులు అనుగ్రహించిన దివ్యవాణి
పాఠక మహాశయులకు అందించి తరింతుము గాక

15-1-97

శ్రీధాతృనామ సం॥ పుష్య శు॥ సప్తమి బుధవారం రాత్రి 9 గంటలకు శ్రీదత్త భగవానులు శ్రీ దత్త స్వామిని ఆవహించి అనుగ్రహించిన దివ్యవాణి

## స్వరూపము-స్వభావము

స్వరూపమనగా నామరూపము. ఉదాహరణకు పంచదార తెల్లగా వున్నది. చిన్న చిన్న కణములుగా వున్నది అనుట. స్వభావమనగా పంచదార యందలి తీపితనము. పంచదార, తీపిదనము వేరు చేయలేము. అట్లే స్వామి యొక్క రూపము అనగా త్రిముఖము, షడ్భుజములు, మాలా, కమండలము, ఢమరుకము, త్రిశూలము, శంఖ చక్రములు, ఇలా స్వరూప లక్షణములు. ఇక స్వామి యొక్క కళ్యాణగుణములైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమలు - స్వభావ లక్షణములు. స్వభావ లక్షణములు నేనైతే, స్వరూప లక్షణములు నేను ధరించిన చొక్కా వంటిది. "స్వామీ ! మీ స్వరూపము ఎంత బాగున్నది" అని పొగడి దానినే ఆరాధించుట- నా చొక్కాను అరాధించినట్లు అగును. అదే "స్వామీ! మీ కళ్యాణ గుణములు సత్య, ధర్మ, శాంతి, ప్రేమలు ఎంత మధురముగా యున్నవి" అని కీర్తించినచో నన్ను కీర్తించినట్లు అగును. అదే నీవు-నా స్వరూపమును కీర్తించి నా స్వబావమును తిరస్కరించినచో నా చొక్కాను గౌరవించి నన్ను అవమానించినట్లే అగును. రావణుడు ఎన్నో స్తోత్రములు చేసినాడు. అన్నియు నా స్వరూప వర్ణనములే. కానీ నా స్వభావమైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమలలో, ధర్మమును అనుసరించలేదు. అధర్మమును ఆశ్రయించి చెడిపోయెను. నా స్వరూప కీర్తన అతనిని ఉద్ధరించలేదు, పైగా అతనిని నేను శిక్షించితిని. దీని అంతరార్ధమేమి? స్వరూప అరాధనము ముఖ్యము కాదు, స్వభావ కీర్తనమే ప్రధానము. కనుక నా కల్యాణ గుణములైన

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను ఆశ్రయించి నన్ను చేరుము. సత్యము అనగా నేను ఒక్కడినే సత్యము. కనిపించు యీ సృష్టి అంతయు అసత్యమే అని తెలుసుకొనుము.

ధర్మము అనగా ధర్మాచరణమును ఆశ్రయించవలెనే కాని అధర్మమును ఆశ్రయించరాదు అని తెలుసుకొనుము.

శాంతి అనగా ఎల్లప్పుడు శాంతిని కలిగి యుండవలెననియు అశాంతిని మనసులోనికి రానీయరాదనియు తెలిసికొనుము.

ప్రేమ అనగా సర్వజీవకోటి యందు ప్రేమ కలిగి ఉండవలెనని తెలుసుకొనుము.

ఇదే నన్ను చేరు మార్గము కనుక "స్వామి సేవకునిగా స్వామి సేవలో నిస్వార్థముగా మునిగి తరించుము.

ఆహా! స్వామీ! ఎంత మృదువుగా ఎంత చక్కగా, అరటిపండు వలిచి నోటికి అందించినట్లు వచించితివయ్యా! ధన్యులం:

జయగురుదత్త శ్రీ గురుదత్త



## ఏకైక మార్గము

### మకర సంక్రమణ సందేశం

శ్రీ దత్త భగవానులు శ్రీ దత్త స్వామిని ఆవహించి 14-1-97 మకర సంక్రమణ సందేశమును ఇలా అనుగ్రహించారు.

జ్ఞానం భక్తిః వినా ధర్మం యోగః కర్మ చ నిష్ఫలం
పతేద మూల సౌధం హి రావణస్యేన దండనాత్!

జ్ఞానము-భక్తి-యోగము-కర్మ అనునవి ధర్మము లేనిచో వ్యర్థములై పునాది లేని సౌధము యొక్క అంతస్థుల వలె పడిపోవును. రావణుడు దండింపబడినాడు గదా! అతడు యీ నాలుగు ఉన్నను ధర్మము లేనందున దండింపబడినాడు.

అపాపాదేవతాశ్శుద్ధాః ప్రాయశ్చిత్తేన మానవాః
నాంగీ కుర్వంత్యహంకారా ద్విదిత్వా పి చ రాక్షసాః

పొరపాటు చేయనివారు దేవతలు. వారు శుద్ధులు. చేసి దిద్దుకొనువారు మానవులు. చేసి అహంకారముతో అంగీకరించక దిద్దుకొననివారు రాక్షసులు. వారు తెలిసియు దిద్దుకొనరు.

శ్రుత్వాపి జానతేనైవ పశవః పశురూపిణః
దేవదైత్యానరస్థాహి రాక్షసాన్ దండయామ్యహమ్

రాక్షసులు తెలియచెప్పినను తెలుసుకొనలేరు అని అనరాదు. అట్టివి పశువులు. అవి పశురూపాలతో వేరుగా ఉన్నవి. అట్లు వేరుగా కనపడని దేవతలు, రాక్షసులు, మానవులలోనే ఉన్నారు. కాన, రాక్షసులకు నా దండన తప్పదు.

నా స్వభావము సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ. నా స్వరూపము మారిననూ స్వభావము మారదు. జగత్తును అసత్యమని విశ్వసించి, నన్ను పరమ సత్యమని విశ్వసించిన వాడే నా సత్య స్వభావమును అనుసరించిన వాడు. అధర్మము చేయక ధర్మము నాచరించు వాడే నా ధర్మస్వభావము ననుసరించువాడు. అశాంతి లేక సదా శాంతితో ఉండు వాడే నా శాంతి స్వభావానుసారి. అట్లే ఏ జీవిని ద్వేషించక, ప్రేమించువాడే నా ప్రేమ స్వభావానుసారి. నా స్వరూపమును ఆరాధించుచు నా స్వభావమైన ధర్మమును విరోధించిన వాడే నా నిజమైన విరోధి. అట్టి వాడు నా వస్త్రమును కీర్తించుచు నన్ను నిందించుచున్నాడు. నా శివ స్వరూపమును ఆరాధించినా, నా ధర్మ స్వభావమును విరోధించిన రావణుడు నా విరోధియే. నా స్వరూపమును విరోధించినా నేను బాధపడను. విష్ణుస్వరూపమును నిందించినా, హిరణ్యకశివుని నేను దండించలేదు. కానీ ప్రహ్లాదుని బాధించుటచేత ధర్మమును విరోధించినాడు కాన దండింపబడినాడు. దండనములో కూడా నా ప్రేమయే ఉన్నది.నా నిత్య స్వభావము అగు ప్రేమ మారదు. దండించి జీవుని ఉద్ధరించుట (మార్పు చేయుట) ద్వేషము కాదు. అది జీవునిపై నా ప్రేమయే అగును.

రాక్షసత్వము నుండి మానవత్వము అను మెట్టు నెక్కకుండా, మూడవ మెట్టు అగు దైవత్వము ఎట్లు వచ్చును? కాన అధర్మమును అంగీకరించి పశ్చాత్తాపముతో దిద్దుకొనుటయే సర్వపాపమును రద్దు చేసుకొను ఏకైక మార్గము.

జయగురుదత్త శ్రీ గురుదత్త

4-1-2001 విక్రమనామ సం॥ర పుష్య శు॥ నవమి గురువారం ఉదయం 6-15 ని॥లకు

## శ్రీ దత్త దివ్యవాణి

"స్వామీ! ఈ భక్త పరమాణువులకు స్వామి వారి అనుగ్రహ ఆదేశం అనుగ్రహించండి- ప్రభూ! రోజూ గానం చేసుకోవలసిన గీతాలు సూచించండి స్వామీ!" అని ప్రార్థించాము మా దంపతులము. స్వామి ఇలా వచించారు..

జ్ఞానం-గానం-ధ్యానం వరుసగా బ్రహ్మ విష్ణు శివ స్వరూప త్రిపుటి. ఇదే సాధన మార్గము. మీరు నమ్మిన గురువే పరమాత్మ యను నిశ్చయమే జ్ఞానము. జ్ఞానములో లోపమున్నచో పునాది కూలినట్లే. ఇక మనస్సులో అట్టి గురువుపై గల ఆకర్షణయే ధ్యానము. ఇది మానసిక భక్తి. ఇక గానము అనగా అట్టి గురువును వాక్కులతో స్తుతించుట. ఇది వాచిక భక్తి. ఈ విధముగా జ్ఞాన-భక్తి తత్త్వాలే సాధన మార్గము.

హనుమంతుడు రాముడినే గురువుగా నమ్మినాడు. రాధ కృష్ణుడినే గురువుగా నమ్మినది. ఇది " ఏకభక్తిర్విశిష్యతే " అనేక గురువులను ఆరాధించుట వలన ఏకాగ్రత భిన్నమైపోవును. " అనంతా బహుశాఖాశ్చ" ఇదే.

ప్రస్తుత కాలంలో కనపడిన ప్రతి వారిని గురువు అని, స్వామి అని పిలుస్తున్నారు! చివరకు రిక్షావాడు కూడా "గురూ! బండెక్కుతారా" అని ప్రతివాడినీ అడుగుతున్నాడు. దీనికి కారణము ఎక్కడను సంపూర్ణవిశ్వాసము కుదరకపోవుటయే. ఒకరిని విశ్వసిస్తారు. అవునో! కాదో! అన్న అనుమానము. అవునంటే కాదేమో నష్టపోతాము కదా. కాదంటే ఔనేమో అలానూ నష్టపోతాము కదా. కావున ప్రతివాడిని గురువు, స్వామీ అంటే సరిపోతుంది కదా అన్న లౌకికమైన ఆలోచనయే ఈ బహుగురుత్వమునకు కారణము తప్ప, అందరి గురువులలో నున్న శ్రీ గురుదత్తుని సందర్శించుట కాదు. అది కేవలము వారి విశ్వాసమును కప్పి పుచ్చుకొనుమాట. లౌకికము ఉన్నంతకాలము వైదికము రాదు. వైదికములోనే, ఛాందసత్వములోనే భగవానుడు లభిస్తాడు.

పరమాత్మను గుర్తించుటకు సిద్ధులు గుర్తులు కావు. రాముడెట్టి సిద్ధులను ప్రదర్శించలేదు. పరమబుద్ధిమంతుడైన హనుమంతుడే రాముడినే పరమాత్మగా విశ్వసించాడు. సిద్ధులు ప్రదర్శించిన శ్రీకృష్ణుడిని నిరాకరించినాడు. కావున సిద్ధులను రాక్షసులు సైతము ప్రదర్శిస్తారు. కేవలము జ్ఞానము(బుద్ధి), భక్తి (మానసిక ప్రేమ యను ధ్యానము, వాచిక ప్రేమయగు గానము కలిపి భక్తి అగును) లేక ప్రేమతత్వము ద్వారానే భగవంతుని గుర్తింపనగును.

ఒక పురుషుడు ఏకపత్ని వ్రతుడు కాకపోయినా, భార్య మాత్రము పతివ్రతగా నుండవలయునని ధర్మశాస్త్రములోని అంతరార్థము ఏమి? భర్త యనగా భగవానుడను గురువే. భార్య అనగా భక్తుడను జీవుడు. అంటే భగవంతుడైన గురువుకు అనేక శిష్యులు ఉండవచ్చును కాని, ఒక శిష్యుడికి అనేక గురువులు ఉండరాదు. ఏకాగ్రతలో హనుమంతుని రాధను ఆదర్శముగా తీసుకొనవలయును.

శ్రీ గురుదత్త

జయగురుదత్త



9-2-2001 ఉదయం గం. 6.30 లకు విశ్వగురువగు శ్రీ దత్తాత్రేయ భగవానుడు సర్వమత సమన్వయ సిద్ధాంతమును ఇలా అనుగ్రహించారు.పఠించి, ఆచరించి తరింతుముగాక!

దేహము, కుటుంబము, లోకము- ఈ మూడు కలిపి త్రిపుటి అగును. ఈ మూడింటికి ఆధారమైనవారు వరుసగా మూఢుడు-అజ్ఞాని-జ్ఞాని అనబడుదురు. మూఢుడు కేవలము దేహసుఖము కొరకు పరిమితుడై రాక్షస ప్రకృతి కలిగి అధోగతిని పొందును. ఇక అజ్ఞాని తన కుటుంబ సుఖమునకు పరిమితుడై నర ప్రకృతి కలిగి మధ్యమ గతిని పొందును. జ్ఞాని సర్వలోక సుఖమునకు పరిమితుడై దేవ ప్రకృతి కలిగి ఊర్ధ్వగతిని పొందును. మానవుడు ఊర్ధ్వగతిని లక్ష్యముగా పెట్టుకొని దైవత్వమును పొందుటకు చేయు ప్రయత్నమే సాధన అనబడును. కేవలము దేహ సుఖము, కుటుంబ సుఖము మాత్రమే లక్ష్యముగా కలిగి దానవ మానవ ప్రకృతులతో జీవించుచున్న మానవుడు ఏనాడు లోకమునందున్న సర్వజీవులను తన దేహము వలె తన కుటుంబము వలె చూచుకొని సర్వజీవులు పరిపూర్ణసుఖాన్వితులైనపుడే సంతృప్తి చెందునో ఆనాడు ఈ జీవుని యొక్క జీవత్వము తొలగి దేవత్వము సిద్ధించి జీవుడు ఈశ్వరుడిగా మారుచున్నాడు.

కావున సర్వలోకము తన కుటుంబముగా భావించి సర్వజీవులును తన కుటుంబ సభ్యులేనని సర్వజీవుల తరణమునకై అహరహము శ్రమించు పరమాత్మ యొక్క నరావతారమునకు సహకరించు సేవకుడే నిజమైన జీవన్ముక్తుడు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య గుణములలో ఒక దాని కన్నా మరియొకటి బలవత్తరమై అన్నిటికన్నా మహాబలవత్తరమైన మాత్సర్యమును ఋష్యాదులు సహితము జయించలేక వున్నారు. జీవులలో అత్యుత్తమమైన ఋషులు కూడా అసూయను జయించలేక " అహం" అను సాత్వికా అహంకారమును దాటలేక పరిపూర్ణమైన అనసూయత్వము, అత్రిత్వము పొందలేక పరమాత్మ ప్రాప్తి పరిపూర్ణము కాక యున్నారు. కావుననే ఋషులలో సైతము అత్రి, అనసూయలకు మాత్రమే పరమాత్మ ప్రాప్తి లభించినది.

జయగురుదత్త శ్రీ గురుదత్త

13-3-2001 మధ్యాహ్నం గం 2-30 లకు దివ్యవాణి

# సర్వమత సమన్వయం

భగవంతునికి పక్షపాతము ఉండదనియు, సృష్టిలోగల సర్వజీవులకు పరమపిత అనియు సర్వమతములు అంగీకరించినదే. ఆయన అన్ని దేశములందును, అన్ని కాలములందును అవతరించి తన దివ్య సందేశమును అన్ని తరములకును అందించియున్నాడు. క్రైస్తవులు క్రీస్తును నమ్మనివారు నరకమున పడుదురనియు, హిందువు విష్ణువునో, శివునినో నమ్మనివాడు తరించరనియు వరస్పరము కలహించుకొనుచున్నారు. ఇట్లే సర్వ మతములు కలహించుకొనుచు భగవంతుని బిడ్డలగు మానవులు సోదర ప్రేమతో మెలగవలసినది పోయి అన్యోన్య ద్వేషముతో శత్రువులగుచున్నారు. ఒకనాడు ఇట్లు కలహించుకొనుచున్న హిందువుల వర్గమును క్రైస్తవుల వర్గమును ఇట్లు ప్రశ్నించితిని-

పాశ్చాత్యదేశమున క్రీస్తు జన్మించి తన దివ్యసందేశమును ఆదేశములో నున్న ఒక తరము వారికి అనుగ్రహించినాడు. ఆ తరము తరువాత కొన్ని వందల సంవత్సరములకు అనగా కొన్ని తరములు గడిచిన తరువాత పాశ్చాత్యులు భారతదేశమునకు వచ్చినారు. ఈ గడచిన తరముల వారికి క్రీస్తు గురించిగాని ఆయన దివ్య సందేశము గురించి కాని తెలియదు. అట్లు తెలియకపోవుట వారి దోషము కాదు. మరి ఈ గడచిన తరములన్నియు వారి దోషము లేకపోయిననూ, క్రీస్తును ఆరాదించకపోవుటవలన నరకమునబడుట న్యాయమా? వారు నరకమున పడినచో క్రీస్తు భగవానునికి పక్షపాత దోషము అంటినట్లు కాదా? ఒక వేళ ఆ తరముల వారు నరకములపడలేదన్నచో, క్రీస్తును

ఆరాధించక పోయిననూ నరకమున పడకపోవుట సిద్ధించినట్లే గదా! అనగా నీ మాటను నీవే ఖండించుకున్నవాడవగుదువు. ఇదే వాదము హిందువులకును అన్వయించును.

శ్రీకృష్ణభగవానుడు భారతదేశములో గీతా సందేశమును ప్రసాదించిన కొన్ని వేల సంవత్సరముల తరువాత అనగా పాశ్చాత్యులు భారతదేశమును కనుగొన్న తరువాత భగవద్గీత ఇంగ్లీషు బాషలోనికి అనువదింపబడి పాశ్చాత్య దేశములకు పోయినది. ఇంతకు ముందు పాశ్చాత్య దేశములో యున్న ఆ వేల సంవత్సరముల తరముల వారు శ్రీకృష్ణుని ఆరాధించనందున నరకమునకు పోయినారా? శ్రీకృష్ణుని గురించి వారికి తెలియకపోవుట వారి దోషము కాదు గదా! దీని వలన శ్రీకృష్ణ భగవానునకు పక్షపాత దోషము అంటుట లేదా? దీని వలన అటు క్రీస్తు భగవానునికి ఇటు కృష్ణ భగవానునకు పక్షపాత దోషము ఆపాదించెను. దీనిని అటు క్రైస్తవులు ఇటు హిందువులు అంగీకరింతురా? మరి దీనికి మార్గమేమి?

ఈ సమస్యకు ఒకే ఒక పరిష్కారము ఉన్నది. అది ఏమనగా ఒకే భగవంతుడు అటు పాశ్చాత్య దేశములో క్రీస్తుగాను ఇటు భారతదేశములో శ్రీకృష్ణుడుగాను అవతరించి ఒకే దివ్య సందేశమును ఆయా భాషలలో చెప్పినారన్నచో భగవంతుడు నిష్పక్షపాతి యగును. ఈ వాదము సర్వ మతములకును సమన్వయించును.

అనగా ఒకే భగవంతుడు అన్ని దేశములయందును అన్ని కాలములయందును అన్ని తరముల వారికి ఆయా భాషలలో అనేక రూపములలో అవతరించి బోధించుచున్నాడు అను సిద్ధాంతమును అందరును అంగీకరించవలసినదే తప్ప వేరు పరిష్కారము లేదు. అన్ని మతముల వారు ఎట్టి దురభిమాన ఉద్రేకములు లేక శాంతముగా బుద్ధిని ఉపయోగించి ఆలోచించినచో ఈ సిద్ధాంతమును అంగీకరింతురు.

కొన్ని మతముల వారు భగవంతుడు నిరాకారుడనియు ఆకారమును ధరించడనియు, అసలు నరాకారమున అవతరించ డనియు వాదించుచున్నారు. వీరికి నేను ఒక ప్రశ్నను వేయుచున్నాను. భగవంతుడు సర్వశక్తిమంతుడా? కాదా? ఆయన సర్వశక్తి మంతుడనియే అన్ని మతములు ఘోషించుచున్నవి. అది నిజమైనచో సర్వశక్తులు గల భగవంతుడు నరాకారమును అవతరించ గల శక్తిని కలిగియున్నాడా? లేదా? "లేదు" అన్నచో అట్టి శక్తిలేని భగవంతుడు సర్వశక్తిమంతు డెట్లగును?

"అట్టి శక్తి కలిగియున్నాడు" అన్నచో అవసరమైనపుడు అతరించినాడు అనుటలో నీ అభ్యంతరమేమి? అవసరము ఏమి? అనగా నిరాకారమును ధ్యానించుటకు వీలు కాదు. భక్తుల ధ్యాన సౌలభ్యము కొరకు దర్శన స్పర్శలను అనుగ్రహించుటకై విగ్రహరూపమగు సాకారములను ధరించినాడు. దర్శన, స్పర్శలు మాత్రమే కాక సహవాస సంభాషణ ఆనందమును అనుగ్రహించుటకై ఆయన నరాకారమును కూడా ధరించును. నరాకారములే అవతారములు. ఇవి అన్ని తరముల వారికి అన్ని దేశములలోను ఆయా భాషా సంస్కృతులను అనుసరించి అనేక అవతారములను ఆయన ధరించుట "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్" అని వేదములో చెప్పబడినది.

ఈ సిద్ధాంతములను ప్రపంచములో అన్ని మతముల వారును ఎట్టి ఆవేశములు లేక ఓర్పుతో ఆలోచించి విశ్వములోని మానవులందరును ఒకే పరమాత్మ యొక్క బిడ్డలని తెలుసుకొని సౌభ్రాత్రముతో జీవించవలయుననియు, స్వమతమును అనుసరించుచు అన్యమతములను కూడా స్వమతములతో సమానముగా తెలుసుకొని గౌరవించవలయుననియు, అన్ని వీధులును ఒకే కూడలి వద్దకు చేరుచున్నవి ఒక వీధి నుండి మరియొక వీధికి అడ్డముగా పో పనిలేదు. కావున మతాంతరీకరణ వ్యర్థము. "స్వధర్మే నిధనం శ్రేయః" అను గీతా వాక్యసార మిదియే.

జయగురుదత్త శ్రీ గురుదత్త

5-7-2001 వృష నామ సం॥ర ఆషాఢ శు॥ పూర్ణిమ



# గురుపూర్ణిమా సందేశము

కర్తవ్యము అనగా తనకొరకు కాక, ఇతరుల కొరకు చేయ వలసివచ్చిన పని. తనను ఆశ్రయించిన భార్యాపుత్రుల కానీ, తల్లిదండ్రు లను కాని దుఃఖింప చేయరాదు. నీ దైవ సేవయొక్క పరమ ఫలమేమి? సర్వజీవులకు దుఃఖ నివృత్తిని కలిగించి ఆనందమును ప్రసాదించుటయే! అట్టిచో నీవు యింటిలోని వారికే ఆనందమును ప్రసాదించలేనపుడు బయటవారికేమి ఆనందము నీయగలవు? ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెక్కునా? కావుననే సన్యసించునపుడు తల్లిదండ్రుల అనుజ్ఞ కావలయును. వారు నీ ఆధ్యాత్మిక విలువను గుర్తించి సంతోషముగా అంగీకరించినచో నీవు సన్యసించవచ్చును. అసలు సన్యాసమనగా నేమి? వస్త్రములను వదలి, గృహము వదలి, కర్తవ్య కర్మలను వదులు టయా? కానేకాదు. "న కర్మణా మనారం భాత్ " "న చ సంన్యసనాదేవ" "న నిరగ్నిర్నచాక్రియః" ఇత్యాది గీతా ప్రమాణములు సంన్యాసమనగా కర్మలను త్యజించుట కాదని చెప్పుచున్నవి. వస్త్రము, గృహము, కర్తవ్యములను కర్మలు జడములు. జడములు జీవునికి బంధ కారణములు కావు. ఈ దేహమును విడచి జీవుడు పోవగానే ఏ జడము వెంబడించదు కదా. వెంబడించనిది బంధము ఎట్లు కాగలదు? దేహము జడము. ఆ జడముతో చేసిన జడకర్మ, యీ దేహము ఇచ్చట దహింపబడగానే, భస్మమగుచున్నది. " అనాశ్రితః కర్మఫలం" "తస్మాదసక్తస్సతతం" "కుర్యాద్విద్వాంస్తథా" ఇత్యాది శ్లోకములన్నియును మనస్సంగమే కర్మఫలములనిచ్చి బంధమైనది యని చెప్పుచున్నవి. సంగమే మనోవ్యామోహము. ఇది చైతన్య గుణమై జీవుని మరణానంతరమూ వెంటాడి జీవునకు కర్మఫలప్రదాయకమై బంధనమగుచూ మరల కర్మలను ప్రేరేపించి, వీటి ద్వారా తాను బలపడుచూ, మహా బంధకారణ మగును. కావున నీవు త్యజించవలసినది మానసిక వ్యామోహమునే తప్ప గృహమును కాని, కర్మల ను కాదు.

సీత రావణుని శరీరముతో మెలివేసుకొన్నదని " గజం కక్ష్యేవ కాంచనీ" అని చెప్పబడినది. ఆమె వివశయై స్పృహ తప్పి యున్నది. ఆ శరీర స్పర్శకు పాప కర్మయే లేదు. కావున అగ్ని పరీక్షలో ఉత్తీర్ణమైనది. రేణుక కేవలము గంధర్వ దర్శనము వలన మనస్సును చలింప చేయుటవలన, స్పర్శ కర్మ చేయకున్ననూ, పాపియై జమదగ్నిచేత శిరశ్ఛేదన ఫలము ద్వారా శిక్షించబడినది. కావున వ్యామోహమును విడనాడి పరమాత్మపై వ్యామోహమును పెంచుకొనండి. పరమాత్మ కొరకు అవసరమైన ఏదియైనా, ఎవరినైనా త్యజించగల మానసిక స్థితి రావల యునే తప్ప, మీ త్యాగములతో పరమాత్మకు పనిలేదు. నిజంగా గృహవ్యామోహమే లేనపుడు పరమాత్మకై గృహత్యాగము చేయగలవని పరీక్షలో నిరూపించుము. అది చాలును. నిజముగా గృహత్యాగము చేయుట అవసరము లేదు. అరణ్యములో నున్న సింహవ్యాఘ్రాదులకు ముక్తి లభించినచో అడవికేగిన నీకును ముక్తి లభించును. ఏ కర్మ చేయని ఒక పాషాణమునకు ముక్తి లభించినచో నీకును కర్మత్యాగముచేత ముక్తి లభించును. వైరాగ్యముతో కాశీయాత్రకు బయలుదేరినవాడు కన్యాదాత యొక్క ప్రార్థన చేత గృహస్థాశ్రమమును స్వీకరించినవాడు గృహస్థుడైనను సంన్యాసియే. గృహస్థుడు కాక, కాషాయము కట్టి, దేహిక వ్యామోహములు కలవాడు సంన్యాసియైననూ గృహస్థుడే.

ఈనాడు వ్యాస భగవానుడు ఉదయించిన పుణ్యదినము. వ్యాస భగవానుడు కూడా తల్లి ఆదేశముతో అంబిక, అంబాలికలయందు పుత్రోత్పాదనము చేసినాడు. ఆ కర్మ వలన ఆయనకు ఎట్టి ఫలము అంట లేదు. కారణము ఆయనకు అంబిక, అంబాలికల యందు కాని, స్త్రీ సంగమునందు కాని ఎట్టి వ్యామోహము లేదు కావున కర్మ ఎట్టి ఫలము ను ఈయజాలదు. కేవలము కర్మ ఫలవ్యామోహమే కర్మఫలములను అందించుచున్నది. కావున భగవంతునియందు వ్యామోహము కలిగి ఎట్టి ఆసక్తియు కర్మలయందు లేక తప్పనిసరియైన కర్మలను (కర్తవ్యములను) ఆచరించువాడు ఆ కర్మ ఫలములను పొందదు. వానికి ఆ కర్మలు బంధ కారణములు కావు.

## భగవంతుని స్వరూపము

శివలింగమనగా చిచ్ఛక్తి తరంగము. అనగా జీవునిలో ఉండే చిచ్ఛక్తి స్వరూపమే. శివలింగాకారమున ఉన్నది. ఈ శివలింగ చిచ్ఛక్తి స్వరూపమే జీవునిలో జఠరాగ్ని స్వరూపమున భాసించుచున్నది."అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః" ప్రకారముగా అన్నమును పచనము చేసి దానినుండి చిచ్ఛక్తిని పుట్టించుచు జీవుని స్వరూపమును బలపరచుచున్నది. కావున నిజమైన శివలింగము జీవునిలో ఉండు జఠరాగ్నియే. ఈ జఠరాగ్ని రూపమైన సత్యమైన శివలింగమునకు ఆహారమును అందించుటయే నిజమైన అభిషేకము, ఆరాధనము. అనగా ఆకలితో బాధపడువారి యొక్క జఠరాగ్ని స్వరూపమైన శివలింగమునకు పంచామృతములను ఆహారమును పెట్టుటయే నిజమైన పంచామృతాభిషేకము. అయితే యీ అభిషేకమునకు అర్హులు కేవలము బాల, వృద్ధ రోగులగు భిక్షుకులే కావలయును తప్ప, పని చేసుకోగలిగియు సోమరితనముతో యాచించువారు కాదు. అట్టి భిక్షుకులకు పెట్టు పంచామృతాహారమే అనగా పంచభక్ష్యములతో కూడిన ఆహారమే నిజమైన పంచామృతాభిషేకము. అంతే తప్ప, పాషాణ రూపముననున్న శివలింగముపై పంచామృతములను కుమ్మరించి, వాటిని కొంత నేలపాలు చేసి, మిగిలినది ధనికులు తీర్థముగా తీసుకొనుటకాదని శ్రీ దత్త సద్గురువుల అభిప్రాయము. అది కేవల పామర బోధకమగు ప్రతీకారాధనమే. జ్ఞానము, ప్రేమ-ఈ రెండే భగవంతుని యొక్క స్వరూపము. ఈ స్వరూపమే, భగవంతుని చేరు మార్గము కూడా అగును.

## దత్తుడు వైద్యుడు

శ్రీ దత్తుడు జీవులయొక్క షడ్గుణములను రోగములను నయము చేయుటకు వచ్చిన వైద్యుడు. సిద్ధులను ప్రదర్శించిన లక్షల కొలది జీవులు చుట్టుమూగుదురు. అపుడు ఆయన నయము చేయువలసిన రోగులు దూరమై పోవుదురు. కావున సిద్ధులను ప్రదర్శించక కేవలము వైద్యము చేయు కార్యమున నుండునని గ్రహించవలయును.

జయగురుదత్త శ్రీగురుదత్త

శ్రీ కృష్ణదత్త దివ్యవాణి ప్రొ॥ డా॥ జన్నాభట్లవేణుగోపాల కృష్ణమూర్తి

## అవతార జీవుడు పరబ్రహ్మము

"యతో వాచో నివర్తన్తే" "నైషాతర్కేణ" "న చక్షుషా.." "న సందృశే" ఇత్యాది శ్రుతులన్నియు దత్త పరబ్రహ్మము ఇంద్రియ -మనో-బుద్ధి తర్కాదుల ద్వారా ఏజీవునకును అగ్రాహ్యమని ఘోషించుచున్నవి. ఆ పరబ్రహ్మమే జీవులకు దర్శన-స్పర్శ-సంభాషణా దులను అనుగ్రహించటకై, ఒక మనుష్య శరీరమును ఆశ్రయించి అవతరించుచున్నది. "మానుషీం తను మాశ్రితమ్" అని గీతయును, "వివృణుతే తనూంస్వామ్" అని శ్రుతియు నిదే చెప్పుచున్నది. ఈ అవతారమును గుర్తించి ఆరాధించి సేవించనిచో, జీవుడు శాశ్వతముగా నష్టపోవునని "ఇహచేదవేదీ దథ సత్యమస్తి, న చేదిహావేదీ న్మహతీ వినష్టిః" శ్రుతియు చెప్పుచున్నది. పరబ్రహ్మము ఎటూ ఎవరికినీ చిక్కదు. ఇక ఆ పరబ్రహ్మావతారమును కూడా వదలినచో అట్టి జీవునకు ఇక పరబ్రహ్మము ఎపుడును ఎక్కడను చిక్కదు. దీనికి చక్కని ఉదాహర ణము: ఈ విశ్వములో శక్తి కిరణములు వ్యాపించి యున్నవి. కానీ మనము యీ శక్తిని స్పృశించలేము. ఇదే శక్తి ఒక తీగలో వ్యాపించి నపుడు, యీ శక్తిని ఆ తీగె ద్వారా స్పృశించగలము. ఇక్కడ కరెంటు, తీగె అని రెండూ ఉన్ననూ ఆ రెండింటికీ అద్వైతమే. ఏలనన ఆ తీగెను ఎక్కడ స్పృశించినను కరెంటు షాకు కొట్టుచున్నది. ఇదే అవతార శరీ రము. ఇట్టి అవతార జీవుడే పరబ్రహ్మము. (జీవో బ్రహ్మైవ నా పరః) ఇంత మాత్రమున కరెంటు లేని తీగెలన్నియును కరెంటు కావు. చూడటానికి, కరెంటు తీగె- తీగె ఒకే విధముగా నుండును. ప్రకృతి ధర్మములననుసరించియే అవతార శరీరము కూడా ఇతర శరీరముల వలె క్షుత్పిపాసాది ధర్మములను కలిగియే ఉండును. "తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్" అని శ్రుతియును "జీవభూతస్సనాతనః" అని గీతయును అవతార జీవుని గురించి చెప్పుచున్నవి. ఈ అద్వైతమును సర్వజీవులకును వర్తింపచేయరాదు. మాధవుడు యాదవునిగా అవతరించినపుడే

అద్వైతము. ఇంతమాత్రమున యాదవులందరు మాధవులు కారు. అయితే యాదవులకును, సర్వజగత్తుకును మాధవుడే ఆధారముగా నున్నాడు. బల్లపై వస్తువులున్నవి. బల్ల వాటికి ఆధారము. వస్తువులలో బల్లలేదు. "నత్వహంతేషు" "నేతి నేతీతి" అని గీతాశ్రుతులు ఇదే చెప్పను. అవతార శరీరములో మాత్రము ఆధారముగకాక, తీగెలో కరెంటు వలె వ్యాపించియుండును. "జీవులందు బ్రహ్మమున్నది" అన్న వాక్యములో కేవలము ఆధారముగా బ్రహ్మమున్నది అని "అందు" అను సప్తమీ విభక్తికి ఔపశ్లేషిక అర్థమును తీసుకోవాలి. "అవతారము నందు బ్రహ్మమున్నది" అను వాక్యములో తీగెలో కరెంటు వలె తీగెను అంతా కరెంటు వ్యాపించియున్నది అని "అందు" అను సప్తమీ విభక్తికి అభివ్యాపక అర్థమును తీసుకోవాలి.

## గొల్లభామలు-వేదఋషులే

శ్రీదత్త పరబ్రహ్మము, అత్రిసుతునిగా అవతరించినపుడు ఆశ్రమవాసులైన వేదఋషులు శ్రీదత్తుని సద్గురువుగా ఉపాసించి జ్ఞానామృతమును ఆస్వాదించినారు. శ్రీదత్తుడే యదువుకు 24 గురు తత్త్వములను బోధించి, తండ్రి శాపముచే రాజ్యాధికారమును పోగొట్టు కొనిన యదువుకు యాదవరాజ్యమును అనుగ్రహించదలచి కృష్ణునిగా, యదువంశమున అవతరించెను. ఆ అత్రి ఆశ్రమవాసులైన వేదఋషులే గోపకాంతలుగా జన్మించినారు. ఆ గొల్లభామలు తెల్లని సాత్త్వికములగు వారి శరీర (పాలు), వాక్కు (పెరుగు), మనము (వెన్న)లను మనోవాక్కాయములను త్రికరణములను, అత్రిమూర్తి స్వరూపునికి సమర్పించి ఆత్మార్పణము కావించి, కృష్ణ దత్త ప్రీతిని కావించినారు. ఇట్టి ఆత్మార్పణములో పరువు, అధర్మ నరక భయములను సైతము త్యజించి దత్త పరీక్షలో నెగ్గినారు. "దత్తం ఛిన్నం" అను మాట ప్రకారముగ వారికి సర్వబంధచ్ఛేదము జరిగినది. "సర్వధర్మాన్ పరిత్యజ్య" గీత ప్రకారముగ సర్వధర్మములను ఉల్లంఘించి స్వామికి ఆత్మార్పణము కావించినారు. ధర్మశాస్త్రములను వ్రాసిన యీ ఋషులే, చివరకు గోపికలుగ, జన్మించి "స్వామికి ఏది ప్రియమో అదే ధర్మము" అని తేల్చి ఆచరించినారు. లోకంలో అధర్మమున కన్నను ధర్మము గొప్పది. కానీ,

లోకేశ్వరుని వద్ద ధర్మము కన్నను స్వామియే గొప్ప. ధర్మదేవత గోవుగా స్వామి పాదాల వద్ద తలవంచింది. "జారవచ్చ" అని నారద భక్తి సూత్రము, జారభావము ముక్తి మార్గమైనదని చెప్పెను!

ఈ గోపికలు వేద ఋషులే అయిననూ, వారికి అడ్డుగోడలుగా నిలచిన యాదవులందరును, యీ విశ్వనాటకమున, స్వామి ఇచ్ఛానుసారముగ వారి వారి పాత్రలను పోషించి, దత్త పరీక్షకు సహకరించిన అజ్ఞాన జీవులే. అడ్డులున్న కాని, నది పొంగి లక్ష్యము వైపునకు దూకదు గదా! యాదవులు స్వామిని, ఒక నరునిగ భావించి, గోపికలను, తప్పు బట్టి హింసించినారు. అది చూడలేక బృందను, దగ్గరనున్న మధురను కూడా వదలి గోపి రాలేనంత దూరముగ నున్న ద్వారకకు వెడలిపోయినారు స్వామి. లోకంలో అధర్మమునకన్నను ధర్మము గొప్పది. కానీ లోకేశ్వరుని వద్ద ధర్మము కన్నను స్వామియే గొప్ప. ధర్మదేవత స్వామి పాదాల వద్ద తల వంచింది.

## స్వామి ఒక్కడే పురుషుడు-జీవులంతా స్త్రీలే

పురుష సూక్తమున "పురుషఏవేదగ్ంసర్వం" అను శ్రుతి ప్రకారముగ, స్వామి ఒక్కడే పురుషుడు. జీవులంతా పరాప్రకృతి స్వరూపులే అని, "ప్రకృతిం విద్ధిమే పరాంజీవభూతాం" అని గీత ప్రకారముగ స్పష్టము. శరీరము అపరాప్రకృతి, జీవుడు పరాప్రకృతి. కావున జీవులందరును ప్రకృతియే అనగా స్త్రీలే! లోకముననున్న పురుషులును, పురుషవేషమున నున్న స్త్రీలే. కావున సర్వజీవులకును స్వామి ఒక్కడే భర్త. ఒకసారి, మీర, తులసీదాసు ఆశ్రమమున రాత్రి విశ్రమింపకోరగా, తులసీదాసు "ఇది పురుషులుండు ఆశ్రమము, స్త్రీలకు నిషిద్ధము" అన్నాడు. అపుడు మీర, ఆశ్చర్యముతో "అయ్యా ! ఇంత కాలము నేను స్వామి ఒకడే పురుషుడని భావించినాను, మనలో కూడా పురుషులున్నారా?" అని ప్రశ్నించగా, తులసీదాసుకు జ్ఞానోదయమై మీర పాదములపై బడినాడు. "స్త్రియస్సతీః ....పుంస ఆహుః" అని శ్రుతి. పురుషులందరును స్త్రీలే, ఆయన సతులేనని చెప్పుచున్నది. శ్రీలక్ష్మి రుక్మిణిగా సత్త్వ గుణ రూపిణి. రజోగుణ రూపిణి

వాణి, వ్యంగ్య వాక్కులు గల సత్యభామ. ఇక విరహదుఃఖ తమో గుణ ధ్యాననిష్ఠ రాధయే గౌరి. స్వామి యొక్క యోగమాయయే మధుమతి (మధురభక్తితో స్వామిని సేవించునది) గొల్లభామగా అవతరించినది. స్త్రీలు, పురుష వేషమును ధరించిన యీ విశ్వనాటకమునందు ఆమె పాతివ్రత్య భంగము కాలేదు కావున ఆమె పాపరహిత అన్న అర్థములో "అనఘ" అన్నారు స్వామి (అఘము చేయనిది). ఆమెను వేశ్యయన్నచో తానెపుడును వేశ్యాలోలుడే నన్నాడు దత్తుడు. స్వామి కొరకు సర్వబంధములను తెంచుకొని, సర్వధర్మాలను అతిక్రమించి, ఆచరించిన అనఘాదత్తుల నాటకమే భాగవతము. అనఘారూపాలే గోపికలు-వారే బ్రహ్మజ్ఞాన దీపాలైన వేదఋషులు. గొల్లభామను దేవతలు మార్గాన్ని ఆచరణలో బోధించి చూపించిన తల్లిగా స్తుతించారు.

## అనఘయే కుండలినీ శక్తి

జీవుని సూచించే యీ అనఘయే కుండలినీశక్తి. ఇది వంకరల గమనంతో ఆరు చక్రాలను దాటి సహస్రారమును చేరి స్వామితో యోగ మందును. దీని అర్థమేమి? ఈ చక్రాలే జీవుని ఆకర్షించి ముంచివేసే బంధాలైన సంసార సముద్ర సుడిగుండాలు. ఇవి మాయా బంధాలు. "ఆత్మనఃకామాయం సర్వంప్రియమ్" శ్రుతి ప్రకారముగా స్వార్థసుఖమును ఇచ్చునవే సంసార బంధాలు. అంటే నీవు ఎవరికి సుఖమును ఇస్తావో వారే నిన్ను ప్రేమిస్తారు. వారు వారి సుఖమునకై నిన్ను ప్రేమిస్తున్నారని శ్రుతి అర్థము. ఇట్టి మాయా బంధాలను మాయతోనే జయించవలెనని చెప్పుటయే, వంకరల గమనంతో, గిరగిర తిరుగు చక్రాలను దాటుట. ఇదే, గోపిక, పతిపుత్రాదులను నిద్రపుచ్చి, అర్థరాత్రి రసస్వరూపుడగు స్వామి ('రసోవైసః' శ్రుతి) యొక్క రాసకేళిని చేరినది. ఇదే యోగ శాస్త్రాంతరార్థము అని స్వామి వివరణము. స్వామికి గోపికపై గల ఆకర్షణము బాహ్యరూపము వలన కాదు. గోపి, కోతి రూపంలో ఉన్నా, నా ప్రియుడైన హనుమంతుడు వనితా రూపంలో వచ్చాడని కౌగలిస్తానన్నారు గోపీ గీతలలో! అయితే ఇది బాహ్యాకర్షణగా వక్రీకరిస్తూ భ్రష్టమౌతుందని, యీ బ్రహ్మయోగ రాసకేళిని రహస్యముగా

("రహస్యంహ్యేతదుత్తమమ్"- గీత), తన జన్మ సమయమగు అర్ధరాత్రి, బ్రహ్మపిలుపు అగు మురళీనాదంతో చేశారు స్వామి. స్వామి, బృందావిహారియైన ప్రేమస్వరూపుడు మాత్రమే కాదు, ద్వారకాపతియగు ధర్మస్థాపకుడును, శ్రీయోగిరాజు అగు గీతా బోధకుడగు గురు స్వరూపుడుకూడయని గుర్తించవలెను. "సత్యకామః" శ్రుతి ప్రకారము, స్వామికి ఎట్టి కోర్కెలు లేవు. "నానవాప్తమవాప్తవ్యం" గీత ప్రకారము స్వామి పొందవలసినది ఏమియును లేదు. స్వామి అఖండానంద సాగరుడు. నిత్యతృప్తుడు- నిర్వికారుడు-నిర్వికల్పుడు. ఇది జీవుని త్యాగమును పరీక్షించుటయే. "త్యాగేనైకే" శ్రుతిప్రకారము, స్వామి కొరకు త్యాగము చేయుటయే మార్గము. స్వామికి ఎంత విలువనిస్తావు అనేదే దత్త పరీక్ష. "యానిశా సర్వభూతానాం" గీత ప్రకారముగా, రాత్రి అందరును నిద్రించుచుండగా, యోగి (గోపి) మేల్కొని, యోగిరాజును చేరును. గోపికలు వెన్నలేని పాలు పెరుగులను సంసారమనే కంసునకిచ్చి, వెన్నతో కూడిన పాలు, పెరుగులను స్వామికి సమర్పించినారు. అనగా, ప్రేమలేని వాక్కాయములను సంసార పరములు చేసి( ప్రేమ ఉన్నట్లు నటించి), ప్రేమతో కూడిన వాక్కాయములను (అనగా మనోవాక్కాయములను త్రికరణములను) అర్ధరాత్రి స్వామికి సమర్పించినది గోపి. ఇట్టి త్యాగస్థితికి తెచ్చినది కృష్ణప్రేమయే కాని, అష్టసిద్ధులతో కూడిన కృష్ణమాయ (గారడి) కాదు. అష్టసిద్ధులు స్వామి సొమ్ములు. రాక్షసులు, తపస్సు అను మొండిపట్టుదల పట్టి, సర్వపితయగు స్వామి నుండి ఆ సొమ్ములు తీసుకుంటారు. వాటిని ప్రదర్శిస్తారు. ఇంత మాత్రమున వారు స్వామి కారు. అష్టసిద్ధులందు కనపడు తేజస్సు మొదలగునవి జడములే. జడము కన్న చైతన్యగుణములే విలువ కలవి. స్వామిని గుర్తించుటకు అష్టసిద్ధులు గుర్తులు కావు. స్వామి యొక్క సహజరూప సౌందర్యమైన చైతన్య గుణములగు జ్ఞాన-సత్య-ధర్మ-ప్రేమ-ఆనంద-శాంతి-వినయ- కారుణ్యాది గుణములే. ఇవి ఇతరులు స్వామినుండి తీసుకొనలేరు. సౌందర్య రూపము వలె స్వామి నుండి వేరు చేయుటకు వీలు కానివి. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" "ఆనందో బ్రహ్మ" "రసోవైసః" ఇత్యాదిశ్రుతు లన్నియును బ్రహ్మమును గుర్తించు యీ లక్షణములనే చెప్పుచున్నవి.

జగత్ - సృష్టి - స్థితి - లయాధికారమను కిరీటము సైతము ఆంజనేయునికి (భవిష్యత్సృష్టికర్త భర్త- హర్త ) స్వామియిచ్చినారు. (అందువలననే "జన్మాద్యస్యయతః" అను బ్రహ్మసూత్రము యీ లక్షణము కూడా స్వరూప లక్షణము కాదనియు, తటస్థ లక్షణమేననియు చెప్పుచున్నదని భాష్యకారులమతము) రసము బ్రహ్మమని శ్రుతి. ఆ స్వామి క్రీడయే రాసక్రీడ. ఆ రాసక్రీడ భాగవతమే పరీక్షిత్తుకు ఏడు రోజులలో ముక్తినిచ్చినది! " విద్యావతాంభాగవతే పరీక్షా " అన్నారు. అనగా పాండిత్యము పరిపూర్ణమైన వాడు భాగవతము ఎంతవరకు అర్థము చేసుకున్నాడనేది పరీక్షించమని అర్థము. భాగవత తత్త్వము అతి నిగూఢము అని భావము.

జయగురుదత్త శ్రీగురుదత్త



## శ్రీదత్తజయంతి దివ్యవాణి

శ్రీదత్తోఽహం-గురుదత్తోఽహం-ప్రభుదత్తోఽహం

నన్ను గురువుగా భావించిన వారికి జ్ఞానబోధ చేసి మార్గమును చూపింతును. నన్ను గురుదైవముగ భావించిన వారికి మార్గమును చూపించి, చేయిపట్టుకొని మార్గమున నడిపింతును.

సాధన కేవలం మాటలు కాదు. ఆచరణ-ఆచరణ. అందుకే జపతపములు నిజమైన సాధనలు కావు. నా కోసం నీ వెంత త్యాగం చేస్తావనేదే నా నిత్య పరీక్ష. త్యాగం చేసిన తరువాత, నీవు నిజముగా నీ బంధమంతయును నాపైనే అని తేల్చుకున్న తరువాత మరల నిన్ను సంసారంలోనే ఉంచుతాను. అలా ఉంచినా, నీవు సరస్సులోని పద్మపత్రము వలె అంటక ఉంటావు. అప్పుడు సంసారంలో ఉన్నా నీవు నిజముగా త్యాగివే అనగా సత్యసంన్యాసివి. సంన్యాసం అంటే కాషాయం ధరించి, ఆశ్రమాలు కట్టి చందాలు పోగు చేసి సంసారంలో కూరుకపోవటం కాదు. కీర్తి కామం సంన్యసించక సంన్యాసి కాడు.

నేనొక రాళ్ళగుట్టను. ఏ రాయికీ ఏ రూపమూ ఉండదు. నీవేరూపం చెక్కితే ఆ రూపంలోనే ఉంటాను నీ వరకు. కానీ, నీ రూపమే,

అందరూ ప్రతి రాయిలోనే చెక్కుకొనవలయునని పట్టు పట్టకుము. నీ మతం నీ మార్గం నీకు సిద్ధినిస్తుంది. కానీ పరమతమును ఆక్షేపించకుము. అది వంకరగావచ్చు. నీది నేరు మార్గము కావచ్చును. అన్ని నదులు సముద్రమును చేరును. కాదని నీవు పట్టుపట్టినచో నేరుగా వచ్చు నీ నది ఆగిపోయి, వంకర నదియే సముద్రమును చేరును.

నాతో ఎట్టి బంధము అని చూడవద్దు. ఆ బంధములో నాపై ఎంత ప్రేమ ఉన్నదనేది భగంతుని లెక్క. కన్నప్ప మార్గం చాలా నీచము. ఎంగిలి నీటితో పుక్కిలించి అభిషేకము! పచ్చి మాంసము నైవేద్యము. పురోహితుడు దానిని ఆక్షేపించినాడు. కానీ కంట రక్తము కారినపుడు కన్నప్ప కన్నులనే పెరికి యిచ్చినాడు.భక్తాగ్రేసరుడైనాడు. పురోహితుని ఋజుమార్గం కన్నప్ప వంకర మార్గం ముందు వెలవెలా పోయింది! "త్యాగేనైకే" శ్రుతి యొక్క సత్యార్థమే కన్నప్ప.

గొల్లభామయే అనఘ-మధుమతి. భర్తను, సంతానమును, ధనమును, తల్లిదండ్రులను, బంధువులను త్యజించి స్వామిని వరించినది. అలా, తనను వరించమని స్వామి కోరలేదు. "సర్వధర్మాన్ పరిత్యజ్య" సర్వధర్మాలను అతిక్రమించి స్వామిని చేరినది. మీరాబాయి కూడా అంతే. శంకరాచార్యుడూ అంతే అందుకే వారిరువురినీ స్వామి సశరీరంగా ఐక్యము కావించుకున్నారు. పతినీ, తల్లినీ, త్యజించారు. ప్రహ్లాదుడు తండ్రిని త్యజించాడు కానీ స్వామిని త్యజించుటకు అంగీకరించలేదు. శంకర-ప్రహ్లాదుల కన్నను మీరబాయి గొప్పది. భర్తను త్యజించుటకు సిద్ధపడినది. అయితే స్వామిని ఊహామాత్రంగానే ఉంచుకున్నది. మీరాబాయి కన్నను గొల్లభామ యింకనూ గొప్పది. అవతరించిన స్వామీ, కేవలం నరుడనే అందరూ అంటున్నా, స్వామిగా గుర్తించి, సర్వమును త్యజించి, ధర్మాన్ని అతిక్రమించి స్వామిని చేరినది. ఒక నరుడైన పతిని త్యజించి, నరాకారమున నున్న నారాయణుని చేరుట గొప్ప. ఏలనన, ఆ అవతారుని కూడా నరుడనే చాలా మంది అంటున్నారు!

నిజంగా నరుడైతే పాపము, నరకము తప్పవు. కానీ, గొల్లభామకు నరుడు కాదు నారాయణుడే అనే విశ్వాసము నూటికి నూరు పాళ్ళున్నది. అది విశ్వాస పరీక్ష. అనగా నిజముగానే యీ నరుని నారాయణుడనే విశ్వసిన్తున్నావా? లేక అనుమానము కొంచెము ఉన్నదా? అనే విశ్వాసముకు పరీక్ష అది.

స్వామి కొరకై అలా సర్వమును త్యజించి, స్వామిని నరాకారంలో ఉన్నా విశ్వసించి, ఎన్నో హింసలను అతిక్రమించి, ధర్మపతనము, నరకభీతినీ దాటి, గొల్లభామ స్వామిని చేరినది. భక్తుని త్యాగప్రతిరూపమే స్వామి కావున స్వామి కూడా ద్వారకను, అష్టసతులను, సర్వభక్తులను త్యజించి, కేవలము గొల్లభామనే చేరినారు. ఇదే గోలోక స్వరూపము. భక్తుడు-భగవంతుడు ఇద్దరే అక్కడ మిగిలినారు. ఈ గోలోకమే సహస్రారం-ఏడవకొండ-సత్యలోకం-దత్తలోకం ఇదే. అంతే తప్ప మాడున సహస్రారం లేదు. తిరుమలలోనిది ఏడవ కొండకాదు. ఆకాశంలో పైన సత్యలోకం-దత్తలోకం లేవు. ఇవన్నీ ఇక్కడే యీ లోకంలోనే ఉన్నాయి. మూర్ఖులు శిశుబుద్ధులు కేవలం యీ పరోక్ష భ్రమలతో సర్వమును నశింప చేసుకుంటారు. ప్రత్యక్షావకాశమును జారవిడచుకుంటారు. కొందరు నరుని నారాయణునిగా భావించరు."అవజానంతిమాంమూఢాః మానుషీం తనుమాశ్రితమ్" (గీత) "నన్ను మూఢులు, మనుష్య శరీరము నాశ్రయించినంత మాత్రమున మాధవునిగా విశ్వసించరు". అజ్ఞానులు కేవలం వేషముతో కాని విశ్వసించరు. నాటక వేషధారియగు శంఖచక్ర సహితుని నారాయణుడందురు. నారాయణుడనగా నిజముగా జ్ఞానాశ్రయు డని అర్థము. అవతారమును బ్రహ్మము యొక్క సహజ సౌందర్యమగు జ్ఞానము ద్వారా మహర్షులు నిర్ణయింతురు. వాక్కులు-ఆచరణ ద్వారా అవతార నిర్ణయము జరుగును. కేవలము శంఖ చక్ర వేషము ద్వారా, కేవలము రాక్షసాదులు సైతము ప్రదర్శించు అష్టసిద్ధుల ద్వారానో అవతారమును అజ్ఞానులు నిర్ణయింతురు. కాని జ్ఞానోపదేశములను వాక్కులు, ప్రేమమయమైన ఆచరణము ఎచటనున్నదో అదే పరబ్రహ్మము యొక్క సత్యావతారము. అతడే నిజముగా దత్తపరబ్రహ్మము.

అట్టి దత్త పరబ్రహ్మము ఒకే సమయమున అనేక నరాకారములను ధరించి, అనేక కార్యములను చేయుచున్నది. కావున ఒక సమయమున ఒకే నరావతారమనరాదు. షిరిడీసాయి, అక్కలకోట మహారాజు ఒకే సమయమున రెండు దత్తావతారములున్నవి.

ఇక నరావతారము నారాయణుడే. కరెంటు తీగెకు కరెంటుకూ భేదము లేదు. ఎక్కడతాకినా కరెంటే! ఆపాదమస్తకము నారాయణుడే. ఊహాతీత పరబ్రహ్మము అగ్రాహ్యము. ఉపాసనకు అందదు. అందిన దానిని వదలి, అందని దానికై అర్రులు చాచుట అవివేకము. కావున, అవతారమును వదలినవాడు. సర్వనాశనమును చెందునని " మహతీ వినష్టిః " అని శ్రుతి చెప్పుచున్నది. అట్టి అజ్ఞాని ఉభయభ్రష్టుడగును. ఒక నరావతారము కాకున్నచో మరియొకనరావతారమునైన పట్టుకొనుము. నరావతారములను విశ్వసించనివాడు మూఢుడని గీతలో వాసుదేవుని వచనము. అన్ని నరావతారములలోను ఒకే బ్రహ్మమను కరెంటు ఉన్నది. నరావతారమును మార్చువాడు మూఢుడు. కానీ నరావతారములను విశ్వసించని వాడు పరమ మూఢాగ్రేసరుడు. అగ్రాహ్యమగు బ్రహ్మమును అందుకొనలేక, మొండితనముతో, నష్టపోయి దుఃఖమొందునని "అవ్యక్తాహిగతిర్దుఃఖం" అని గీతలో గోవిందుని వాక్యమున్నది. నా సత్యభక్తుడెన్నడును నశించడు (నమే భక్తః ప్రణశ్యతి-గీత) మార్గము వంకరయే కానీ దానిలో త్యాగం, ప్రేమ ఎంత ఉన్నాయి ? దానిని బట్టే విలువ. పావుకిలో బరువుగల పంచదారచిలుకకన్నా కిలో బరువు గల పంచదార గాడిదయే ధర ఎక్కువ పలుకును. కావున, ఓ నైష్ఠికులగు పండితులారా! ఓ ధర్మరాజులారా! మీ మార్గము గొప్పదే. దానిలోనే త్యాగం-ప్రేమను పెంచుకొనండి. పరమార్గము పామరమైనది. అధర్మమయమైనది కావచ్చును గాక. దానిని ఆక్షేపించకుడు. నవ్వినవాపచేనే పండును. యజ్ఞధర్మమునకు బద్ధులై యజ్ఞము నాచరించిన మునులు ముక్తిని

పొందలేదు. యజ్ఞధర్మమును ఉల్లంఘించినవారై , యజ్ఞాన్నమును, నరాకారమునున్న గోపాలునికి నివేదించిన ముని పత్నులే ముక్తులైనారు. అంతేకాదు, ఆ మునులు మరల గోపికలై, ధర్మముకన్న స్వామియే ఎక్కువయని ధర్మమునుల్లంఘించినగాని ముక్తిని పొందలేదు. అట్లు ఉల్లంఘించలేని మునులు ముక్తిని పొందలేనివారు కావున వారు గోపికలుగ జన్మించక, పురుషమునులుగానే జన్మించినారు. గోపికలు, ఋషిపత్నులు ముక్తులైనారు. లోకమున అధర్మముకన్నను ధర్మము గొప్పది. ఆ ధర్మము లోకేశునికన్నను గొప్పది కాదు. ఈ విషయమునే నరావతారుడై నారాయణుడు పరీక్షించును. అవతారమును స్వామియని నీవు నమ్మినావు. కానీ ఆ నమ్మకము ఎంతవరకు నిజము? ఎంతవరకు నిలచునో దత్తుడు పరీక్షించును. స్వామియని పిలచిన నీవు నిజముగా హృదయాంతరాంతరములనుండి పిలచితివా? లేక జిహ్వాగ్రము నుండియా? అనియే పరీక్ష. నల్లగుడ్డలు నెలరోజులు కట్టిన వాడు కూడా " స్వామి " అనబడుచున్నాడు. రౌడీలు కూడా " గురూ! " అని సంబోంధించుకొనుచున్నారు. ఈనాడు స్వామి, గురు శబ్దములంత తేలిగావాడుచున్నారు! ఆచరణలో నిజమైన త్యాగము-నిజమైన ప్రేమ అణుమాత్రముండవు. కానీ సాక్షాత్కారములు, మోక్షములు కావలయును. వాటిని ఎంత విలువ తక్కువగా భావించుచున్నారు. భక్తుని, సంన్యాసిని, ఐహికమునకు చెడిన అవివేకిగా భావించుచున్నారు. మాత్సర్యము, అసూయపోగొట్టుకొనినవారే అనసూయలు. అనసూయలకే దత్తుడు చిక్కును, నిరంతర భక్తిధారలే రాధలు. రాధలకే గోవిందుడు చిక్కును. దైవము కొరకు ప్రాణ త్యాగము చేయువారే సతులు. సతులకే శివుడు లభించును. నీవు ఒక నరుని "స్వామి" అని దైవస్వరూపునిగా పిలచినపుడు, ఆ నరుడు నిజముగా ఒకవేళ దత్తుడే అయినచో, "స్వామి" అను శబ్దము నిజముగా నీవు మనస్ఫూర్తిగా పలికితివా? లేక ఏదో ఒకరాయి విసిరినట్లు పలికితివా? అని పరీక్షించును. ఒక మాటను చెప్పినపుడు "కర్మణ్యేకం వచస్యేకం మనస్యేకం మహాత్మనాం" అని సత్యమైన భక్తుడు కర్మణా - వచసా - మనసా స్వామి అని నమ్ముతాడు. " కర్మణ్యన్యత్ వచస్యన్యత్ మనస్యన్యద్దురాత్మనా" అసత్యమైన భక్తులు చెప్పునది చేయునది

తలచునది వేరువేరుగా ఉండును. ధృతరాష్ట్రుడు కృష్ణుని పరమాత్మునిగా అనేకసార్లు సంబోంధించాడు, విశ్వరూపం దర్శించి విశ్వసించాడు. కానీ, అతడి విశ్వాసము స్థిరము కాదు కావున, కృష్ణుడు ధృతరాష్ట్రుడిని, తన సార్వభౌమాధికారమును వినియోగించి పాండవులకు అర్ధరాజ్యము కానీ కనీసము 5 గ్రామములైనా ఇమ్మన్నాడు. నిజముగా కృష్ణుడిని భగవంతుడని మనసా పూర్ణముగా విశ్వసించినచో భగవదాదేశమును పాటించెడివాడు. కానీ పాటించలేదు. కావున "భగవాన్" అను సంబోధనము ధృతరాష్ట్రుడికి నాలుక చివరి నుండి వచ్చినదే తప్ప, మనసా అన్నది కాదని తేలిపోయినది. ధర్మరాజును తీసుకొండి. అన్ని భగవదా దేశములను పాటించాడు కానీ "అశ్వత్థామా హతః" అన్నపుడు భగవదాదేశం పాటించక గజః అని కూడా అన్నాడు. అతడు స్వామి కన్నను ధర్మమును మిన్నగా భావించినాడు. భగవదాదేశము పాటించక పూర్ణవిశ్వాసము లేనందుననే అతడికి నరక దర్శనమైనది. అర్జునుడు అట్లుకాక, స్వామి నంది అంటే నంది, పంది అంటే పంది అన్నట్లుగా ఆచరించాడు. భగవదాదేశంతో తాతను సైతము వధించినాడు. అదే పూర్ణ భక్తి. గోపికల విషయంలో ఆ పూర్ణ భక్తి పరాకాష్టను చెందినది. పాతివ్రత్య ధర్మమును సైతము ఉల్లంఘించినారు. కావున, గోపికలను మించిన భక్తులు కానీ, భాగవతమును మించిన పవిత్ర గ్రంథము కానీ, కృష్ణుని మించిన దత్తావతారము కానీ లేదని నేను యీ నాడు పాంచజన్యమును పూరించి ఘోషించుచున్నాను.



## తృతీయ ముద్రణమునకు ముచ్చటగా మూడే మాటలు

అంతా దత్తమయం, దత్తానుగ్రహం, రెండవ ముద్రణ ప్రతులు అయిపోవటం చేత పవిత్ర గ్రంథమును కోరు భక్తులకు, కాపీలు అందించలేకపోతున్నాము గదా! దైవం ఉపేక్షించునా? శ్రీ సీతేపల్లి చంద్రశేఖర్ శ్రీమతి గాయత్రి పుణ్యదంపతుల హృదయంలో స్వామి ప్రవేశించి ఈ తృతీయ ముద్రణకు శ్రీకారం చుట్టారు. వారు ధన్యులు. ద్వితీయ ముద్రణ అనంతరం శ్రీ భీమశంకరం దంపతులు వారి పుత్రరత్నములు లక్ష్మీకాంత్, ఫణికుమార్, కుమార్తె భాగ్యలక్ష్మి, శ్రీఅజయ్ నాగలక్ష్మి దంపతులు వారి చిన్నారులు అద్భుత రీతిన స్వామి అనుగ్రహమునకు పాత్రులైనారు. ఎన్నో ఎన్నెన్నో మహిమలు, మహత్తులు, అనుభూతులు, అనుగ్రహములు అందించారు దత్తస్వామి. శ్రీ కృష్ణదత్తుల రూపంలో పద్మారామ్, సీతారామయ్య దంపతులకు అందించిన అనుగ్రహ ప్రసాదం అద్వితీయం. నన్ను, నా శ్రీమతిని, మా కుటుంబమును కంటికి రెప్పవలె కాపాడుచూ నాకు పునర్జీవితం ప్రసాదించిన దత్త ప్రభువులకు హృదయ పుష్పాంజలి సమర్పించు కుంటూ, "స్వామీ! ఎన్ని జన్మలు ఎత్తినప్పటికి నీ పాదారవిందముల యందు ధృఢమైన, అచంచలమైన భక్తి విశ్వాసములు ప్రసాదించి నీ సేవలో మా దంపతులను తరింపచేయువయ్యా" అని స్వామికి విన్నవించుకుంటున్నాము.

---

**శ్రీ దత్తగ్రంధమాలయందలి ఈ క్రింది పుష్పరాజములను మా నుండి పొందవచ్చును.**

| | | గురుదక్షిణ |
|---|---|---|
| 1. శ్రీ దత్త వేదము | - | రూ80-00 |
| 2. శ్రీ దత్త గురు భగవద్గీత | - | రూ101-00 |
| 3. దత్తోపనిషత్తులు | - | రూ20-00 |
| 4. శ్రీకృష్ణ భాగవతము | - | రూ30-00 |

గోపీగీతలు, బ్రహ్మగాయత్రి అచ్చులో ఉన్నవి.

ఇట్లు
శ్రీ దత్తసేవలో
చిలుకూరు బాలకృష్ణమూర్తి,
శ్రీమతి భవాని

శ్రీ గణేశాయ నమః     శ్రీ గురుదత్తాత్రేయాయ నమః     శ్రీ సరస్వత్యై నమః

# శ్రీ దత్త వేదము

## అక్షరప్రసాదము

### వినతి

భక్త మహాశయులారా!

వేదమే పరమప్రమాణ గ్రంథము. శ్రుతి వాక్యానుసారం పరబ్రహ్మము ఇట్లు నిర్వచించబడినది.

'' ఏకమేవ అద్వితీయం బ్రహ్మ
యతోవా ఇమాని భూతాని
జాయన్తే యేన జాతాని జీవన్తి
యత్ప్రయన్త్యభిసం విశన్తి ''

అనగా బ్రహ్మమొక్కటే. రెండవది లేదు. దేని నుండి ఈ పంచభూతములు పుట్టి, దేనిచే నిలచి, దేనియందు లయించు చున్నవో అదే బ్రహ్మము. భగవాన్ శ్రీ దత్తాత్రేయస్వామి వారే పరబ్రహ్మ.

''యత్సాక్షాదపరోక్షాబ్రహ్మ'' అనగా ప్రత్యక్షమగుట కూడా శ్రుతిచే చెప్పబడి యున్నది. కనుక ఈ కనపడుచున్న త్రిముఖ, షడ్భుజ రూపమే పరబ్రహ్మము. భగవాన్ శ్రీ దత్తాత్రేయ స్వామియే పరబ్రహ్మము. ఇదే అసలు రూపము. మిగిలిన రూపాలు బ్రహ్మము యొక్క వేషాలేకాని అసలు రూపాలు కావు. స్వామి బ్రహ్మ విష్ణు శివాత్మకుడు. వారి దేవేరులే వాణి, లక్ష్మి, పార్వతులు. స్వామి సర్వదేవ దేవతా స్వరూపులైనందున శ్రీవారికి పెట్టిన ఒక నమస్కారము 33 కోట్ల నమస్కారములగును.

శ్రీ దత్త సేవలో మేమందించిన శ్రీ దత్త గ్రంథమాలను పఠించి, ఆనందించిన కొందరు భక్తుల సూచనల మేరకు శ్రీ దత్తవేదము ద్వితీయ ముద్రణములో భాగముగా -

1. శ్రీ దత్త స్తుతి
2. శ్రీ దత్త అష్టోత్తర శతనామములు
3. అమ్మవారి అష్టోత్తర శతనామములు
4. శరణాగతి మొదలగునవి

చేర్చినాము. పఠించి, ఆనందించి తరించ వినతి.

ఇట్లు
శ్రీ దత్త సేవలో
**చిలుకూరు బాలకృష్ణమూర్తి**
**శ్రీమతి భవాని**



# శ్రీవిష్ణుదత్తకృత శ్రీ దత్తాష్టకము

1. దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్త వత్సలం
ప్రపన్నార్తి హరం వందే స్మర్తృగామీ సనో వతు ॥

2. దీనబంధుం కృపాసింధుం సర్వకారణ కారణమ్
సర్వరక్షాకరం వందే స్మర్తృగామీ సనో వతు ॥

3. శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణం
నారాయణం విభుం వందే స్మర్తృగామీ సనో వతు ॥

4. సర్వా నర్థ హరం దేవం సర్వ మంగళ మంగళం
సర్వక్లేశ హరం వందే స్మర్తృగామి సనోవతు ॥

5. బ్రహ్మణ్యం ధర్మతత్త్వంజ్ఞం భక్త కీర్తి వివర్ధనం
భక్తాభీష్టప్రదం వందే స్మర్తృగామీ సనో వతు ॥

6. శోషణం పాప పంకశ్చ దీపనం జ్ఞాన తేజసః
తాపప్రశమనం వందే స్మర్తృగామీ సనో వతు ॥

7. సర్వరోగ ప్రశమనం సర్వ పీడా నివారణం
విపదుద్ధరణం వందే స్మర్తృగామీ సనో వతు ॥

8. జన్మ సంసార బంధఘ్నం స్వరూపానంద దాయకమ్
నిశ్రేయశ పదం వందే స్మర్తృగామీ సనో వతు ॥

9. జయఃలాభ యశఃకామ దాతుర్దత్తస్యయః స్తనం
భోగ మోక్షప్రద స్యేమం ప్రపఠేత్ సకృతీ భవేత్ ॥

# కృష్ణకృత
# శ్రీదత్తాష్టకము

శ్లో ॥ బ్రహ్మవిష్ణు శివాఖ్యానాం । మూర్తీనాం మూలహేతవే ।
త్రిమూర్తి ముఖ పద్మాయ । దత్తాత్రేయాయతే నమః ॥1॥

శ్లో ॥ అరుణ శ్యామధావళ్య । వర్ణ మిశ్రమ వర్ణినే ।
అనసూయైక భాగ్యాయ । దత్తాత్రేయాయతే నమః ॥2॥

శ్లో ॥ శంఖం చక్రం త్రిశూలం చ। ఢక్కా మపికమండలుమ్ ।
బిభ్రతేఽక్ష స్రజంహస్తైః । దత్తాత్రేయాయతే నమః ॥3॥

శ్లో ॥ కుర్వతే భావమాత్రేణ । సృష్టిస్థితి లయానపి
సర్వదేవ స్వరూపాయ । దత్తాత్రేయాయతే నమః ॥4॥

శ్లో ॥ గురూణాం గురురాజాయ । శ్రుతీనాం శ్రుతయేఽపిచ।
శాస్త్రాణా మపి శాస్త్రాయ। దత్తాత్రేయాయతే నమః ॥5॥

శ్లో॥ బాలోన్మత్తవదీక్ష్యాయ । సర్వలీలా విహారిణే ।
అవధూతైక లక్ష్యాయ । దత్తాత్రేయాయతే నమః ॥6॥

శ్లో ॥ కరుణావాహినీమూల – వాత్సల్యార్ణవ చక్షుషే ।
ఆహ్వానాదేవదృష్టాయ । దత్తాత్రేయాయతే నమః ॥7॥

శ్లో ॥ శ్రితానుద్ధర్తు కామాయ । కలౌ సర్వగతాయ చ
సాధ్యా సాధ్యాని దదతే। దత్తాత్రేయాయతే నమః ॥8॥

## ఫలశ్రుతి

శ్రీదత్తాత్రేయ దేవస్య పుణ్యం కృష్ణ కృతాష్టకమ్
పఠతాం స్యాదిహాముత్ర ఫలమీప్సిత మక్షయమ్.

ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీదత్త గురుదత్త ప్రభుదత్త

# శ్రీదత్త చరణమాల

శ్రీదత్త దేవం శిరసా నమామి - గురుదత్త దేవం వచసా భజామి
ప్రభుదత్త దేవం మనసా స్మరామి - శ్రీ దత్త దేవం శిరసా నమామి॥
ఓం కార మంత్రార్థ పరమాత్మ తత్త్వం- నిర్గుణబ్రహ్మైవగుణరూప మాద్యమ్
అత్రితపః ఫలదత్త మాత్రేయం- అనసూయాగర్భవరవత్సరూపమ్
బ్రహ్మవిష్ణు శివ వదనత్రయాబ్జం- వాణీశ లక్ష్మీశ గౌరీశ మేకమ్
కోటిత్రయ సురవట తరుమూలం- శంఖచక్రయుగ వైష్ణవహస్తమ్
ఢమరు త్రిశూలక శంకరపాణిం- మాలాకమండలు బ్రహ్మకరాబ్జమ్
కాషాయ కౌశేయ కమనీయ చేలం- కటితట పాదాంత పీతాంబరంతమ్
మేఖలార్ధోరుక శార్దూలకృత్తిం- శునకాయిత చతురామ్నాయ పాదమ్
రక్షార్థ మాశ్రిత గోరూపధర్మం- కార్తవీర్యార్జున సామ్రాజ్యమూలమ్
పరుశురామ శిష్యపరమాచార్యం- శంకరాచార్యాయ చండాలవేషమ్
యోగీశ్వర యోగిరాజైక వాచ్యం- కరతలామలకాణిమాద్యష్ట సిద్ధిం
విష్ణుదత్త స్తోత్ర పరమానందం- సృష్ట్యాది సృష్ట్యంత నిత్యావతారం
గణపతిపరూపం స్కందస్వరూపం - మణికంఠరూపం మారుతిరూపం
రామకృష్ణ వీరభద్ర స్వరూపం - కాళికా రాజేశ్వరీ శక్తి రూపం
శ్రీ విద్యాయంత్రమంత్రాది బోధం - ఆదిత్యాది నవగ్రహాకారం
ఓంకారహృదయస్థ గ్రహపతిభానుం- ఐం బీజ శంఖస్థ పూర్ణేందుబింబం
క్రోం బీజచక్రస్థ కుజగ్రహంతం- క్లీం బీజ డమరుకస్థితబుధఖేటం
క్లూం బీజ జలపాత్ర గురుగ్రహంతం- హ్రాం బీజపదామశుక్రగ్రహంతం
హ్రీం బీజ శూలస్థ శనైశ్చరంతం- హ్రూం బిజవామాంఘ్రికేతుగ్రహంతం

సారితిదక్షిణ పాదస్థరాహుం-దత్తాత్రేయాయ నమ ఇతి పూర్ణం
శ్రీపాదనృసింహ సమర్థగురురూపం-మాణిక్యప్రభు సాయిస్వరూపం
సర్వమతదేవతాసాధుజనరూపం-కలియుగేచిత్రాణి ప్రదర్శయంతం
విశ్వరూపేమధ్యవదనత్రయేశ్యం-స్మార్తవైష్ణవశైవసర్వైక దైవం
గురుశబ్దతాత్పర్య పర్యవసానం -వేదశాస్త్ర జ్ఞాన పండితరాజం
గురుశిష్య సంప్రదాయాద్యాచార్యం-ధీ ప్రచోదక గురుగాయత్రర్థ్యం
మతత్రయాచార్య సిద్ధాంత మూలం-గురుచతుర్వింశతితత్త్వయబోధం
వేదాంత శాస్త్ర ప్రథమాచార్యం-మునిసురాణామపిపరీక్షకంతమ్
సృష్టిస్థితి ప్రళయాకారిత్రివక్త్రం-అష్టసిద్ధికరమష్టైశ్వర్యదానం
ఆయురారోగ్య సంతాన వరదానం-దివ్యమంగళశోభివరదానమూర్తిం
జిహ్వాగ్రవక్షశ్శరీరార్ధశక్తిం-విద్యామహైశ్వర్యమహిమ ప్రదానం
అష్టసిద్ధి ప్రదానైకాధికారం-పరుశురామచిత్తశాంతి ప్రదానం
జన్మరహితమత ఏవదత్తాఖ్యం-దత్త పుత్రాయిత నిజ భక్తవత్సం
దేవతానామేవదేవతాస్థానం-కోటిత్రయస్త్రింశదేవత్రిమూర్తిం
పరమహంసారాధ్య దిగంబరాంగం - సన్యాసి మోక్షార్థమవధూతరూపం
వాంఛిత వరదానషడ్భుజమూర్తిం-ధనసుతాది వరద త్రిముఖస్వరూపం
భక్తిమార్గేణైవకేవలసాధ్యం-నిర్గుణంసర్వగుణభూతావతారం।
జ్ఞానినంయోగినంవేదకర్మిష్టం-భక్త పరీక్షార్థ మాయావిరూపం
చిత్రచిత్రవిచిత్ర కలియుగలీలం-సాక్షాత్పరబ్రహ్మశబ్దార్థమేకం
బ్రహ్మతేజోదివ్యసౌందర్యరూపం-నవకోటిమన్మథలావణ్యాంగం
త్రితిలక కుంకుమ భస్మోర్ధ్వ పుండ్రం-బ్రహ్మచారిణమాదిబ్రహ్మర్షివిప్రం
ఆచారహీనంసదాచారవంతం-కర్తుమకర్తుంవికర్తుంసమర్థం

పరుశురామాయైవకర్మాచార్యం-మధుపానమత్తంనమూఢైర్దృష్టం
సర్వమంత్రసిద్ధిప్రదవామముష్టిం-విష్ణుదత్త శ్రాద్ధనిమంత్రితవిప్రం
కాశీపురస్నానకరవీరసాంధ్యం-మాహురీపురభైక్ష్య సహ్యాద్రినిద్రం
గోరక్షనాథాయ దత్తగురుగీతం-ప్రహ్లాదభక్తాయ ముక్తిప్రధానం
మేరుదక్షిణపీఠ ఖేచరీముద్రం-వక్షస్థలోద్భాసియజ్ఞోపవీతం
కాలజటాబంధకేశకిరీటం-స్ఫటికదామతులసీరుద్రాక్షహారం
మందారకుందాతసీపుష్ప మాలం-వేదశునకాఘ్రాతపాదుకాపాద్మం
చరణాంచితకమలశంఖచక్రాంకం-బ్రహ్మముఖరసనాగ్ర భారతీనృత్యం
వక్షస్థలస్థితలక్ష్మీవిలాసం-రుద్రముఖవామార్ధపార్వతీహాసం
యదుయాచనాయదువంశావతీర్ణం-పింగళనాగాయశంకరరూపం
ఇంద్రాయజంభాంతకరలక్ష్మీశం-బదరికావనసిద్ధ బ్రహ్మ స్వరూపం
అలర్క శిష్యాయమాయావధూతం-శీలాఖ్య విప్రాయసశునకవిప్రం
శ్యామారుణధవలమిశ్రవర్ణం - భక్తివాత్సల్యేన దత్తసాయుజ్యం
ఆదిశేషేణాపివక్తుంమశక్యం-బృహస్పతినాపిబోద్ధుమశక్యం
శ్రీ దత్త దేవం శిరసా నమామి-గురుదత్తదేవం వచసా భజామి
ప్రభుదత్త దేవం మనసా స్మరామి-శ్రీదత్త దేవం శిరసా నమామి

ఓం శాంతిః శాంతిః శాంతిః

★ ★ ★

# శ్రీ దత్తాత్రేయష్టోత్తర శతనామావళి.

1. ఓం శ్రీ దత్తాయ నమః
2. ఓం శ్రీ దేవ దత్తాయ నమః
3. ఓం శ్రీ బ్రహ్మ దత్తాయ నమః
4. ఓం శ్రీ విష్ణు దత్తాయ నమః
5. ఓం శ్రీ శివ దత్తాయ నమః
6. ఓం శ్రీ అత్రి దత్తాయ నమః
7. ఓం శ్రీ ఆత్రేయాయ నమః
8. ఓం శ్రీ అత్రి వరదాయ నమః
9. ఓం శ్రీ అనసూయాయ నమః
10. ఓం శ్రీ అనసూయాసూనవే నమః
11. ఓం శ్రీ అవధూతాయ నమః
12. ఓం శ్రీ ధర్మాయ నమః
13. ఓం శ్రీ ధర్మపరాయణాయ నమః
14. ఓం శ్రీ ధర్మ పతయే నమః
15. ఓం శ్రీ సిద్ధాయ నమః
16. ఓం శ్రీ సిద్ధిదాయ నమః
17. ఓం శ్రీ సిద్ధి పతయే నమః
18. ఓం శ్రీ సిద్ధి సేవితాయ నమః
19. ఓం శ్రీ గురవే నమః
20. ఓం శ్రీ గురు గమ్యాయ నమః
21. ఓం శ్రీ గురోర్గురుతరాయ నమః
22. ఓం శ్రీ గరిష్ఠాయ నమః
23. ఓం శ్రీ వరిష్ఠాయ నమః
24. ఓం శ్రీ మహిష్ఠాయ నమః
25. ఓం శ్రీ మహాత్మనే నమః

26. ఓం శ్రీ యోగాయ నమః
27. ఓం శ్రీ యోగ గమ్యాయ నమః
28. ఓం శ్రీ యోగాదేశకరాయ నమః
29. ఓం శ్రీ యోగ పతయే నమః
30. ఓం శ్రీ యోగేశాయ నమః
31. ఓం శ్రీ యోగాధీశాయ నమః
32. ఓం శ్రీ యోగపరాయణాయ నమః
33. ఓం శ్రీ బాలాయ నమః
34. ఓం శ్రీ బాల వీర్యాయ నమః
35. ఓం శ్రీ కుమారాయ నమః
36. ఓం శ్రీ కిశోరాయ నమః
37. ఓం శ్రీ కందర్ప మోహనాయ నమః
38. ఓం శ్రీ అర్ధాంగాలింగితాయ నమః
39. ఓం శ్రీ సురాగాయ నమః
40. ఓం శ్రీ విరాగాయ నమః
41. ఓం శ్రీ వీతరాగాయ నమః
42. ఓం శ్రీ అమృత వర్షిణే నమః
43. ఓం శ్రీ ఉగ్రాయ నమః
44. ఓం శ్రీ అనుగ్రహ రూపాయ నమః
45. ఓం శ్రీ స్థవిరాయ నమః
46. ఓం శ్రీ స్థవీయసే నమః
47. ఓం శ్రీ శాంతాయ నమః
48. ఓం శ్రీ అఘోరాయ నమః
49. ఓం శ్రీ మృడాయ నమః
50. ఓం శ్రీ ఊర్ధ్వరేతసే నమః
51. ఓం శ్రీ ఏకవక్త్రాయ నమః
52. ఓం శ్రీ అనేకవక్త్రాయ నమః

53. ఓం శ్రీ ద్వినేత్రాయ నమః
54. ఓం శ్రీ యోగిధ్యేయాంఘ్రి పంకజాయ నమః
55. ఓం శ్రీ దిగంబరాయ నమః
56. ఓం శ్రీ దివ్యాంబరాయ నమః
57. ఓం శ్రీ పీతాంబరాయ నమః
58. ఓం శ్రీ శ్వేతాంబరాయ నమః
59. ఓం శ్రీ చిత్రాంబరాయ నమః
60. ఓం శ్రీ శంఖినే నమః
61. ఓం శ్రీ గదినే నమః
62. ఓం శ్రీ మునయే నమః
63. ఓం శ్రీ మౌలినే నమః
64. ఓం శ్రీ విరూపాయ నమః
65. ఓం శ్రీ స్వరూపాయ నమః
66. ఓం శ్రీ సహస్ర శిరసే నమః
67. ఓం శ్రీ సహస్రాక్షాయ నమః
68. ఓం శ్రీ సహస్ర బాహవే నమః
69. ఓం శ్రీ సహస్రాయుధాయ నమః
70. ఓం శ్రీ సహస్ర పాదాయ నమః
71. ఓం శ్రీ పద్మినే నమః
72. ఓం శ్రీ సహస్ర పద్మార్చితాయ నమః
73. ఓం శ్రీ పద్మ హస్తాయ నమః
74. ఓం శ్రీ పద్మ పాదాయ నమః
75. ఓం శ్రీ పద్మనాభాయ నమః
76. ఓం శ్రీ పద్మమాలినే నమః
77. ఓం శ్రీ పద్మ గర్భారుణాక్షాయ నమః
78. ఓం శ్రీ పద్మ కింజల్క వర్చసే నమః
79. ఓం శ్రీ జ్ఞానినే నమః
80. ఓం శ్రీ జ్ఞాన గమ్యాయ నమః

81. ఓం శ్రీ జ్ఞాన విజ్ఞాన మూర్తయే నమః
82. ఓం శ్రీ త్రినేత్రాయ నమః
83. ఓం శ్రీ ద్విభుజాయ నమః
84. ఓం శ్రీ షడ్భుజాయ నమః
85. ఓం శ్రీ అక్షమాలినే నమః
86. ఓం శ్రీ కమండల ధారిణే నమః
87. ఓం శ్రీ శూలినే నమః
88. ఓం శ్రీ ఢమరు ధారిణే నమః
89. ఓం శ్రీ ధ్యానినే నమః
90. ఓం శ్రీ ధ్యాన నిష్ఠాయ నమః
91. ఓం శ్రీ ధ్యాన స్థిమిత మూర్తయే నమః
92. ఓం శ్రీ ధూళిదూసరితాంగాయ నమః
93. ఓం శ్రీ చందన లిప్త మూర్తయే నమః
94. ఓం శ్రీ భస్మోద్ధూళిత దేహాయ నమః
95. ఓం శ్రీ దివ్య గంధానులేపినే నమః
96. ఓం శ్రీ ప్రసన్నాయ నమః
97. ఓం శ్రీ ప్రమత్తాయ నమః
98. ఓం శ్రీ ప్రకృష్టార్థప్రదాయ నమః
99. ఓం శ్రీ అష్టైశ్వర్య ప్రదానాయ నమః
100. ఓం శ్రీ వరదాయ నమః
101. ఓం శ్రీ వరీయసే నమః
102. ఓం శ్రీ బ్రాహ్మణే నమః
103. ఓం శ్రీ బ్రహ్మ రూపాయ నమః
104. ఓం శ్రీ విష్ణవే నమః
105. ఓం శ్రీ విశ్వరూపిణే నమః
106. ఓం శ్రీ శంకరాయ నమః
107. ఓం శ్రీ ఆత్మనే నమః
108. ఓం శ్రీ అంతరాత్మనే నమః

ఓం శ్రీ పరమాత్మనే నమః

## శ్రీ దత్తాత్రేయస్వామివారి ప్రధాన షోడశ నామములు

1. ఓం శ్రీ వరదాయ నమః
2. ఓం శ్రీ కార్తవీర్యాది రాజరాజ్యప్రదాయ నమః
3. ఓం శ్రీ అనఘాయ నమః
4. ఓం శ్రీ విశ్వశ్లాఘాయ నమః
5. ఓం శ్రీ అమిత ఆచారాయ నమః
6. ఓం శ్రీ దత్తాత్రేయాయ నమః
7. ఓం శ్రీ మునీశ్వరాయ నమః
8. ఓం శ్రీ పరాశక్తి పదాశ్లిష్టాయ నమః
9. ఓం శ్రీ యోగానందాయ నమః
10. ఓం శ్రీ సదోన్మదాయ నమః
11. ఓం శ్రీ సమస్త వైరి తేజోహృతే నమః
12. ఓం శ్రీ పరమామృత సాగరాయ నమః
13. ఓం శ్రీ అనసూయా గర్భరత్నాయ నమః
14. ఓం శ్రీ భోగమోక్ష సుఖప్రదాయ నమః
15. ఓం శ్రీ శ్రీపాద వల్లభాయ నమః
16. ఓం శ్రీ నృసింహ సరస్వతి స్వామి సద్గురు పాదుకాభ్యాంనమః

# అమ్మవారి అష్టోత్తర శతనామావళి

ధ్యానం : వందే పద్మాకరాం ప్రసన్న వదనాం సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యామభయప్రదాం మణిగణైర్నానావిధైర్భూషితాం
భక్తాభీష్ట ఫల ప్రదాం హరిహర బ్రహ్మాదిభిస్సేవితాం
పార్శ్వే పంకజ శంఖ పద్మ నిధిభిర్యుక్తాం సదాశక్తిభిః
సరసిజ నయనే సరోజ హస్తే ధవళ తరాంశుక గంధమాల్యశోభే
భగవతి హరివల్లభే మనోజ్ఞే త్రిభువన భూతి కరిప్రసీద మహ్యమ్
సర్వ మంగళ మాంగళ్యే శివే సర్వార్థ సాధికే
శరణ్యే త్ర్యంబికే దేవి నారాయణి నమోస్తుతే ॥

1. ఓం ప్రకృత్యై నమః
2. ఓం వికృత్యై నమః
3. ఓం విద్యాయై నమః
4. ఓం సర్వభూతహిత ప్రదాయై నమః
5. ఓం శ్రద్ధాయై నమః
6. ఓం విభూత్యై నమః
7. ఓం సురభ్యై నమః
8. ఓం పరమాత్మికాయై నమః
9. ఓం వాచే నమః
10. ఓం పద్మాలయాయై నమః
11. ఓం పద్మాయై నమః
12. ఓం శుచయే నమః
13. ఓం స్వాహాయై నమః
14. ఓం స్వధాయై నమః
15. ఓం సుధాయై నమః
16. ఓం ధన్యాయై నమః
17. ఓం హిరణ్మయ్యై నమః
18. ఓం లక్ష్మ్యై నమః
19. ఓం నిత్య పుష్టాయై నమః
20. ఓం విభావర్యై నమః
21. ఓం అదిత్యై నమః
22. ఓం దిత్యై నమః
23. ఓం దీప్తాయై నమః
24. ఓం వసుధాయై నమః
25. ఓం వసుధారిణ్యై నమః
26. ఓం కమలాయై నమః
27. ఓం కాంతాయ్యై నమః
28. ఓం కామాక్ష్యై నమః
29. ఓం క్రోధ సంభవాయై నమః
30. ఓం అనుగ్రహ ప్రదాయై నమః
31. ఓం బుద్ధ్యై నమః
32. ఓం అనఘాయై నమః

33. ఓం హరివల్లభాయై నమః
34. ఓం అశోకాయై నమః
35. ఓం అమృతాయై నమః
36. ఓం దీప్తాయై నమః
37. ఓం లోక శోక వినాశిన్యై నమః
38. ఓం ధర్మ నిలయాయై నమః
39. ఓం కరుణాయై నమః
40. ఓం లోకమాత్రే నమః
41. ఓం పద్మప్రియాయై నమః
42. ఓం పద్మహస్తాయై నమః
43. ఓం పద్మాక్ష్యై నమః
44. ఓం పద్మసుందర్యై నమః
45. ఓం పద్మోద్భవాయై నమః
46. ఓం పద్మముఖీయై నమః
47. ఓం పద్మనాభప్రియాయై నమః
48. ఓం రమాయై నమః
49. ఓం పద్మమాలాధరాయై నమః
50. ఓం దేవ్యై నమః
51. ఓం పద్మిన్యై నమః
52. ఓం పద్మ గంధిన్యై నమః
53. ఓం పుణ్య గంధాయై నమః
54. ఓం సుప్రసన్నాయై నమః
55. ఓం ప్రసాదాభి ముఖ్యై నమః
56. ఓం ప్రభాయై నమః
57. ఓం చంద్రవదనాయై నమః
58. ఓం చంద్రాయై నమః
59. ఓం చంద్రసహోదర్యై నమః
60. ఓం చతుర్భుజాయై నమః
61. ఓం చంద్ర రూపాయై నమః
62. ఓం ఇందిరాయై నమః
63. ఓం ఇందు శీతలాయై నమః
64. ఓం అహ్లాద జనన్యై నమః
65. ఓం పుష్ట్యై నమః
66. ఓం శివాయై నమః
67. ఓం శివకర్యై నమః
68. ఓం సత్యై నమః
69. ఓం విమలాయై నమః
70. ఓం విశ్వజనన్యై నమః
71. ఓం పుష్టయే నమః
72. ఓం దారిద్రనాశిన్యై నమః
73. ఓం ప్రీతి పుష్కరిణ్యై నమః
74. ఓం శాంతాయై నమః
75. ఓం శుక్లమాల్యాంబర్యై నమః
76. ఓం శ్రియై నమః
77. ఓం భాస్కర్యై నమః
78. ఓం బిల్వనిలయాయై నమః
79. ఓం వరారోహాయై నమః
80. ఓం యశస్విన్యై నమః
81. ఓం వసుంధరాయై నమః
82. ఓం ఉదారంగాయై నమః
83. ఓం హరిణ్యై నమః
84. ఓం హేమామాలిన్యై నమః
85. ఓం ధనధాన్య కర్యై నమః
86. ఓం సిద్ధయే నమః

87. ఓం ప్రైణపోమ్యాయై నమః
88. ఓం శుభప్రదాయై నమః
89. ఓం నృపవేశ్మగతానందాయై నమః
90. ఓం వరలక్ష్మ్యై నమః
91. ఓం వసుప్రదాయై నమః
92. ఓం శుభాయై నమః
93. ఓం హిరణ్యప్రాకారాయై నమః
94. ఓం సముద్ర తనయాయై నమః
95. ఓం జయాయై నమః
96. ఓం మంగళా దేవ్యై నమః
97. ఓం విష్ణు వక్షస్థల స్థితాయై నమః
98. ఓం విష్ణు పత్న్యై నమః
99. ఓం ప్రసన్నాక్ష్యై నమః
100. ఓం నారాయణ సమాశ్రితాయై నమః
101. ఓం దారిద్రధ్వంసిన్యై నమః
102. ఓం దేవ్యై నమః
103. ఓం సర్వోపద్రవ వారిణ్యై నమః
104. ఓం నవదుర్గాయై నమః
105. ఓం మహాకాళ్యై నమః
106. ఓం బ్రహ్మవిష్ణుశివాత్మికాయై నమః
107. ఓం త్రికాల జ్ఞాన సంపన్నాయై నమః
108. ఓం భువనేశ్వర్యై నమః

మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి, స్వరూప
బగవాన్ శ్రీ దత్తాత్రేయాయ నమః
పాదారవిందయోః
నానావిధ పరిమళ పత్ర పుష్ప అక్షతాం సమర్పయామి.

శ్రీ దత్త

## మధ్యలో బ్రహ్మ ముఖము
## సృష్ట్యాదిలో బ్రహ్మర్షులు ఉపాసించే దత్త స్వరూపము

శ్లో॥ శివశ్రీశయోరాన నాభ్యాం షడంసం
చతుర్వేద మూలం జగత్సృష్టిలోలమ్
సరస్వత్యుపేతం సరోజాత వర్ణం
పరబ్రహ్మ మధ్యం భజే దత్త దేవమ్ ॥

అర్థం : శివ-విష్ణు ముఖములతో, ఆరు చేతులు కలవాడును, చతుర్వేదములకు మూలమైన వాడును, జగత్సృష్టియందు ఆసక్తుడైన వాడును, సరస్వతితో కూడిన వాడును, కమల వర్ణుడును, పరబ్రహ్మ స్వరూపము మధ్యలో కలవాడును అగు దత్త దేవుని భజించుచున్నాను.

## వర్తమాన దత్తస్వరూపము
## మధ్యలో విష్ణుముఖము

శ్లో॥ విధీశానయోరాన నాభ్యాం షడంసం
ఘనశ్యామ గాత్రం ప్రఫుల్లాబ్జ నేత్రమ్
రమా వక్షసం రమ్యరూపాభి రామం
మహావిష్ణు మధ్యం భజే దత్త దేవమ్ ॥

అర్థం : బ్రహ్మ-శివ ముఖములతో ఆరు చేతులు కలవాడును, మేఘశ్యామల శరీరుడును, వికసించిన కమలములవంటి నేత్రములు కలవాడును, లక్ష్మి దేవిని వక్షస్థలమున కలవాడును, రమ్యమైన సౌందర్యముతో ఆకర్షణీయు డును, మహావిష్ణువు మధ్యనున్న దత్తదేవుని భజించుచున్నాను.

## ప్రళయ స్వరూపము
## మధ్యలో శివముఖము

శ్లో॥ హరిబ్రహ్మణోరా ననాభ్యాం షడంసం
లలాటేక్షణం చన్ద్రఖణ్డావతంసమ్
భవానీ సమేతం విభూతి ప్రభాఙ్గం
మహాదేవ మధ్యం భజే దత్తదేవమ్ ॥

అర్థం : విష్ణు-బ్రహ్మ ముఖములతో, ఆరుచేతులతో, ఫాలనేత్రముతో చంద్రకళను తలపై అలంకారము గలవాడును, భవానీ సమేతుడును, విభూతివలె తెల్లని వర్ణముతో మెరయుచున్న వాడును, మహాదేవుడైన శివుడు మధ్యనున్న దత్త దేవుని భజించుచున్నాను.

## శ్రీ దత్త దివ్యవాణి

శ్లో॥ న వర్ణో న లిఙ్గం మతం నాశ్రమోనో
న కోఽవ్యస్తి భేదోఽత్ర దత్తస్య మార్గే
మహాజ్ఞాన భక్తిర్మహా యోగ సేవా
విశిష్టైవ సర్వత్ర దత్తస్యమాన్యా ॥

తా॥ బ్రాహ్మణాది కుల భేదము కానీ స్త్రీ పురుష లింగభేదముకానీ, శైవ వైష్ణవాది మతభేదము కానీ, బ్రహ్మ చర్య గృహస్థ వానప్రస్థ సంన్యాసాది ఆశ్రమ భేదము కానీ, మరి ఏ ఇతరమైన భేదము కానీ, శ్రీ దత్త సద్గురువుల మార్గములో లేనేలేదు. కేవలము మహాజ్ఞానము (అనగా శ్రీ దత్తుని పరబ్రహ్మమని గుర్తించుట) మహాభక్తి, మహా యోగములతో కూడిన మహాసేవ మాత్రమే ప్రతిచోట గొప్పదిగా శ్రీ దత్త ప్రభువుల చేత గౌరవింప బడుచున్నది.

శ్లో॥ త్రిమూర్తి వదనోజ్జ్వలం
త్రిభుజ యుగ్మ సంశోభితం
చతుశ్శునక సంవృతం
విమల ధర్మధేను శ్రితమ్
ధరావలయ సంచరం
చరణపాదుకా ఘట్టనం
మహర్షి కుల నాయకం
నమత దత్తదేవం గురుమ్ ॥

తా॥ త్రిముఖములతోను, షడ్భుజములతోను, నాలుగు శునకములచేత సేవింపబడుచు ధర్మధేనువుచే ఆశ్రయించ బడినటువంటిన్ని భూమి నంతయు సంచరించునట్టి వారును, పాదుకలు శబ్దము చేయుచుండు నట్టి వాడును, మహర్షుల కులనాయకుడైన శ్రీ గురుదత్త దేవుని నమస్కరించండి.

## శ్రీ వారికి వినతి

శ్లో॥ నైవాష్ట సిద్ధిం న చ వాఽత్ర కీర్తిం
నా పి త్వదీయాం పదవీం వృణోమి
వృణో మ్యహం జన్మని జన్మనీహ
శ్రీ దత్త! తే పాద సరోజ సేవామ్ ॥

తా॥ అష్ట సిద్ధులను కానీ, ఈ లోకములో కీర్తిని గానీ, నీతో సమానమైన కైవల్య పదవిని కానీ కోరుటలేదు. ఓ శ్రీదత్తా! ప్రతి జన్మలోను నీ పాద పద్మసేవనే కోరుచున్నాను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# శ్రీ దత్త గద్య ప్రార్థన

హే శ్రీ దత్త! హే గురుదత్త ! హే ప్రభు దత్త!

1. అస్య విశ్వస్య సృష్టి స్థితి లయహేతు స్త్రిముఖై స్త్వమేక రూప ఏవ పరబ్రహ్మ వేదోక్త లక్షణద్వయ నిర్వచనాత్. త్వమేవ సర్వ దేవతా దేవ వేషస్థ శైలూష ః ఇదం విశ్వమపి విశ్వరూపాఖ్యం తవ వేషమాత్రమేవ. అవతరసిచ తత్తత్సాధక స్థాయి భేద మనుసృత్యయుగవదనేకరూపధారీ స్త్రైర్మిలసి చ తాదృశోభూత్వా తానుద్ధరసి చ

జ్ఞానబోధై స్సర్వ జీవానా మేకోద్ధార కోభవానే వహి

2. త్వదేక ప్రేమరూపేభ్యో నిష్కామసేవ కేభ్య సర్వందదాసి చరమ పదం చ తేషాం దాసోభూత్వాయదుత్తరం కైవల్యాదపి. అచ్ఛిన్నస్త్రిధాభిన్న ఇవదృశ్యసేత్వత్త ఏవ ఛిన్నం దారిద్ర్యం ఛిన్నం దుఃఖం ఛిన్న మజ్ఞానం ఛిన్నం సర్వ బన్ధ కారణం చ స్వార్థ తత్త్వమ్.

3. త్వమేక ఏవ జ్ఞాన దాన ధైర్య వీర్య తేజో లావణ్యౌదార్య త్యాగరాగ సౌన్దర్య సౌరభ్య సౌజన్య సౌలభ్య కారుణ్య తారుణ్య సౌహార్ద సౌశీలాద్యపార కల్యాణగుణ రత్నపారావారః త్వయాऽऽ కృష్టోऽహంత్వాంసేవే, న కాప్యత్ర ప్రతిఫలాపేక్షా త్వామేవ నిత్యం నమామి స్మరామి గాయామి పూజయామి ధ్యాయామి.

అర్థము :- ఓ శ్రీ దత్తా! ఓ గురుదత్తా! ఓ ప్రభుదత్తా !

1. వేదములలో చెప్పబడిన రెండు లక్షణములుగల పరబ్రహ్మ నిర్వచనము ననుసరించి, ఈ విశ్వమునకు సృష్టి, స్థితి లయములను నీ మూడు ముఖములతో చేయుటవలన, మరియును నీవు ఒక్కడవే అగుటవలన వేదోక్తమైన పరబ్రహ్మము నీవే. సర్వదేవతలు, సర్వదేవులు, నీవేషములే. నీవు యీ వేషములలో నున్న నటుడవు. ఈ విశ్వము కూడ, విశ్వరూపుడను నీ దేవతా వేషమే. ఆయా సాధకుల స్థాయి భేదము

ననుసరించి వారి వారి స్థాయికి దిగి, ఒకే సమయమున అనేకరూపములతో అనేకావతారములుగ వచ్చి, వారివారితో వారివలె నటించుచు వారితో కలిసియున్నావు. వారికి జ్ఞాన బోధలను చేసివారిని ఉద్ధరించుచున్నావు. సర్వజీవులను ఉద్ధరించగల ఏకోద్ధారకుడవు నీవే కదా.

2. నీయందే ప్రేమ గలిగి, ఏ కోరిక లేకుండా, నీ సేవ చేయు నీ సేవకులకు చరమ పరమపదాన్ని యిచ్చుటకు, నీవు వారి దాసుడవైనావు. ఈ ముక్తి కైవల్యముకన్నను గొప్పది. నీవు నిజముగ అచ్ఛిన్నుడవు కానీ త్రిమూర్తులుగా ఛిన్నుడవైనట్లు కనపడుచున్నావు. నీవలన దారిద్ర్యము ఛిన్నమగును. దుఃఖము ఛిన్నమగును. అజ్ఞానము ఛిన్నమగును. సర్వబంధములకు కారణమైన స్వార్థము ఛిన్నమగును.

3. నీవు ఒక్కడవే జ్ఞాన, దాన, ధైర్య, వీర్య, తేజస్సు, లావణ్యము, ఔదార్యము, త్యాగము, రాగము, సౌందర్యము, సుగంధము, సౌజన్యము, సౌలభ్యము (సులభముగా లభించుట), కారుణ్యము, తారుణ్యము (యౌవనము), సహృదయము, సౌశీల్యము మొ॥ అపారములగు కల్యాణ గుణములను రత్నములుగల సముద్రుడవు. నేను కేవలము నీ గుణముల చేత ఆకర్షింపబడి నిన్ను సేవించుచున్నానే తప్ప, నాకు నీ సేవలో ఎట్టి ప్రతిఫలాపేక్షయును లేదు. నిన్నే నిత్యము నమస్కరింతును. నిన్నే స్మరింతును, నిన్నే కీర్తించెదను. నిన్నే పూజింతును. నిన్నే ధ్యానింతును.

## కృష్ణకృత

## శ్రీదత్త నవరత్న శ్లోకమాల (దత్త నవకము)

శ్లో ॥ నమస్తే త్రిమూర్తి స్వరూపోజ్జ్వలాయ
నమస్తే త్రిధా సర్గ రక్షాలయాయ
నమస్తే త్రిశక్త్యఙ్గనా వల్లభాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 1 ॥

తా॥ త్రిమూర్తి స్వరూపముతో ప్రకాశించు నీకు నమస్కారము. జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయముల కొరకు మూడు వేషములతో ఉన్న నీకు నమస్కారము. వాణి, లక్ష్మి, పార్వతి యను మూడు శక్తులకు భర్తయగు నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తునకు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే త్రిలోకాది మధ్యాత్యయాయ
నమస్తే త్రికాలార్థ సద్దర్శనాయ
నమస్తే త్రిపుట్యర్థ సద్బోధకాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 2॥

తా॥ మూడు లోకములకు ఆది, మధ్య, అంతములగు నీకు నమస్కారము. భూత భవిష్య వర్తమాన విషయములను చూడగలుగు నీకు నమస్కారము. పరమాత్మ, జీవుడు, సాధన మార్గము అను త్రిపుటిని చక్కగా బోధించు నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తునకు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే త్రివేద స్వరోచ్చారణాయ
నమస్తే త్రిపుణ్డ్రోర్ధ్వ రేఖాముఖాయ
నమస్తే త్రిణేత్రాన్తరాలోకనాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 3॥

తా॥ ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అను మూడు స్వరములతో వేదములను ఉచ్చరించు నీకు నమస్కారము. ముఖమున ఊర్ధ్వ త్రిపుండ్ర రేఖలు గల నీకు నమస్కారము. మూడు నేత్రములతో ఆత్మావలోకనము చేయు నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తునకు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే త్రిధా ఉ ఉ చార్య రూపాగతాయ
నమస్తే త్రివేదాన్త సంస్థాపకాయ
నమస్తే త్రిభాష్య ప్రయోగాన్వయాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 4॥

తా॥ త్రిమతాచార్యుల రూపములతో అవతరించిన నీకు నమస్కారము. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతమతములను స్థాపించిన నీకు నమస్కారము. ప్రస్థాన త్రయ గ్రంథములకు రచింపబడిన భాష్యములను సమన్వయము చేసిన ప్రయాగ సంగమమగు నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తునకు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే త్రిబన్ధేషణా ఖణ్డనాయ
నమస్తే త్రికర్మేధ్మదాహానలాయ
నమస్తే త్రిదేహైక మోక్షప్రదాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 5॥

తా॥ ధారాపుత్ర ధన బంధములను ఈ షణాత్రయమును ఖండించు నీకు నమస్కారము. ప్రారబ్ధ ఆగామి సంచితములను మూడు కర్మలు అను సమిధలను దహించు అగ్నియగు నీకు నమస్కారము. స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు ఒకే సమయమున మోక్షమును కల్గించగల నీకు నమస్కారము. పరబ్రహ్మవగు దత్తుడగు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే త్రిపాదార్ధ మన్త్రాధిపాయ
నమస్తే త్రిమన్త్రైక మన్త్రాశ్రయాయ
నమస్తే త్రివర్ణైక వర్ణేరితాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 6॥

తా॥ త్రిపాదములు గల గాయత్రీ మంత్రమునకు అధిపుడగు నీకు నమస్కారము. ''ఓం నమో బ్రహ్మణే ఓం నమో నారాయణాయ ఓం నమః శ్శివాయ '' అను మూడు మాత్రములు కలసి ఒకే మంత్రమైన దానికి ఆధారమైన నీకు నమస్కారము. అకార, ఉకార, మకారములు కలసిన ఓంకారముచే సూచింపబడిన నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తుడగు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే ధరా మణ్డలే సఞ్చరాయ
నమస్తే చతుస్సారమేయావృతాయ
నమస్తే సకృద్భిన్నరూపేక్షితాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 7॥

తా॥ భూమి అంతయును సంచరించుచున్న నీకు నమస్కారము నాలుగు వేదములు శునకములుగా వారి చుట్టుముట్టిన నీకు నమస్కారము. ఒకే సమయమున అనేక రూపములతో గోచరించు నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తుడగు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే శివబ్రహ్మ విష్ణ్వాననాయ
నమస్తే షడబ్జాంశు పాణి ప్రజాయ
నమస్తేஉన సూయాత్రిపుత్రాయితాయ
పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥ 8 ॥

తా॥ బ్రహ్మ, విష్ణు, శివ ముఖములు గల నీకు నమస్కారము. ప్రకాశించు చున్న ఆరు పాణి పద్మములతో వెలయు నీకు నమస్కారములు. అనసూయ-అత్రి దంపతులకు పుత్రునిగా దత్తమైన నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తుడగు నీకు మరల నమస్కారము.

శ్లో॥ నమస్తే మహాజ్ఞాన సత్పణ్డి తాయ
నమస్తే గురుశ్రేణి రాజోత్తమాయ
నమస్తే మహాయోగ పీఠేశ్వరాయ
పరబ్రహ్మదత్తాయ భూయో నమస్తే ॥ 9॥

తా॥ మహాజ్ఞానముతో ప్రకాశించు సత్యమైన పండితుడగు నీకు నమస్కారము. గురు పరంపరలో రాజాధిరాజువగు నీకు నమస్కారము. మహాయోగ పీఠమును అధిష్టించిన ప్రభువగు నీకు నమస్కారము. పరబ్రహ్మమగు దత్తుడగు నీకు మరల నమస్కారము.

## ఫలశ్రుతి

శ్లో॥ దత్తాయ నవరత్నానాం
శ్లోక మాలాం సమర్పితాం
కృష్ణేన పఠతాం సిద్ధః
శ్రీ దత్త సదనుగ్రహః ॥ 10॥

తా॥ కృష్ణునిచే రచింపబడి, శ్రీ దత్తునకు సమర్పించబడిన ఈ నవరత్న శ్లోకమాలను పఠించువారికి శ్రీ దత్తుని యొక్క సత్యమైన అనుగ్రహము సిద్ధించును.

# శ్రీ దత్త శివ పంచాక్షర మాల

1. అభిషేకప్రియ- భవాని శంకర - నమశ్శివాయ - నమశ్శివాయ
2. బిల్వార్చనరత
3. భస్మాంగరాగ
4. గంగాజలధర
5. శశాంక శేఖర
6. చంద్రకళాధర
7. కపర్దమకుట
8. తామ్ర జటాధర
9. ఫాల విలోచన
10. విభూతి ఫాల
11. రుద్రాక్షహార
12. వాసుకి హార
13. పన్నగ భూషణ
14. నీల కంధర
15. కాలకూటగళ
16. తుషార ధవళ
17. శూలాయుధ ధర
18. మృత్యుంజయ హర
19. కరి చర్మాంబర
20. వ్యాఘ్రాజిన ధర
21. నారాయణప్రియ
22. నంది వాహన
23. చండీప్రియతమ
24. గౌరీ మోహన
25. నటన మనోహర
26. ఢమరుక నాథ
27. తాండవలోల
28. కైలాసాచల
29. హే పరమేశ్వర
30. జ్ఞాన దాయక
31. ఐశ్వర్య ప్రద
32. భక్త చిత్త హర
33. కిరాత వేష
34. ధ్యాన ముద్రిత
35. పంచాననధర
36. మహాట్టహాస
37. అకాల మృతిహర
38. దక్షాధ్వర హర
39. లింగాకృతిధర
40. దేవాసురనత
41. మదవృషభధ్వజ
42. సంగీత నిపుణ
43. నాట్యాధి దేవ
44. ప్రమధ గణేశ
45. గణపతి జనక
46. కుమార తాత
47. హే కాలాంతక
48. ఇంద్రస్తంభక
49. ఉపమన్యుప్రియ
50. పరమోదార
51. సర్వశాసక
52. వేదైక వేద్య
53. వేదాంత బోధక
54. ప్రళయ భయంకర
55. శ్మశాన వాసి
56. భిక్షుక వేష
57. పిశాచరూప

58. బాలోన్మత్త
59. మంగళరూప
60. త్రిలోక సుందర
61. కాశీవాస
62. కాల భైరవ
63. పాశుపతాస్త్ర
64. భూత నాయక
65. పినాక చాప
66. త్రిపురాసుర హర
67. రామేశ్వర గత
68. అనాద్యనన్త
69. శ్రీశైల నిలయ
70. స్వయంభులింగ
71. హే వీరభద్ర
72. ఏకాదశవిధ
73. నమకానందిత
74. స్తోత్రోత్సాహ
75. హనుమద్రూప
76. శంకర దేశిక
77. ముండిత కేశ
78. కాషాయాంబర
79. మన్మధ దహన
80. జ్వాలా నేత్ర
81. ఉమార్ధ దేహ
82. భంభం నాద
83. సింహ గర్జన
84. శరభావతార
85. సాయంతాండవ
86. రజత గిరీశ
87. హిమగిరి సదన
88. పాదాహతయమ
89. మృకండు జనుత
90. పూర్ణాయుః ప్రద
91. ఘోరామయ హర
92. దారిద్ర్య దహన
93. దుఃఖ నాశక
94. శ్రీ యోగిరాజ
95. తీవ్ర తపస్విధర
96. హరినయనార్చిత
97. క్షీరాభిషిక్త
98. దధిఘృత సేక
99. మధుధారోక్షిత
100. సికతాభిషేక
101. ఫలరససిక్త
102. గంగాభిషేక
103. కపాలమాల
104. ఫాలాగ్ని కుంకుమ
105. పంచాక్షర పర
106. అనన్య విక్రమ
107. ఆది గురూత్తమ
108. తత్పురుషాస్య
109. అఘోర వక్త్ర
110. సద్యోజాత
111. వామదేవ ముఖ
112. ఈశాన వదన
113. నీల లోహిత
114. పురాణ పురుష
115. పింగళ కేశ
116. ప్రసాద సులభ

117. ద్రాక్షారామ
118. భీమేశ్వరహర
119. సోమనాధ శివ
120. ఘృష్ణేశ్వర గత
121. వైద్యనాధ శివ
122. అమరేశ్వర హర
123. నాగేశ్వర హర
124. శ్రీ మహాకాళ
125. కేదారేశ్వర
126. కాళీ వల్లభ
127. కరుణా సాగర
128. త్రియంబకేశ్వర
129. క్షీరపాత్ర భవ
130. విధిహరి వదన
131. మధ్యేశివ ముఖ
132. శ్వచతుష్టయ వృత
133. ధర్మధేనుయుత
134. అనసూయాత్మజ
135. అత్రికుమార
136. దత్తాత్రేయ
137. హరహర హరహర
138. భవభవ భవభవ
139. శివశివ శివశివ

భవాని శంకర ః నమః శివాయ
నమః శివాయ



ఓం శాంతిః శాంతిః శాంతిః

# శ్రీ దత్త వాక్యత్రయము

1. దత్తునికన్న వేరు దైవము లేదు
2. దత్తుని జ్ఞాన ప్రచారము కన్న వేరుగా సేవలేదు.
3. దత్తుని సేవకునిగా జన్మజన్మలయందు శాశ్వతముగా నిలచియుండుటయే శాశ్వత మోక్షము.

ఇవే దత్త మతము యొక్క సారాంశమైన వాక్యత్రయము.

శ్రీ దత్త భగవానుడు త్రిమూర్త్యాత్మకుడు
బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపమే కాదు
వాణి హిరణ్య గర్భాత్మకుడు
లక్ష్మి నారాణాత్మకుడు
ఉమా మహేశ్వరాత్మకుడు
సర్వబ్రహ్మర్షి ఆత్మకుడు, సర్వ సిద్ధాత్మకుడు
సర్వగ్రణాత్మకుడు సర్వదేవతాదేవాత్మకుడు


## పరబ్రహ్మ

స్వామివారి పాదముల వద్ద – ప్రతి నిత్యము
ఒక ఎర్రని పుష్పము – (వాణి బ్రహ్మలకు)
ఒక నీలపు పుష్పము – (లక్ష్మి నారాయణులకు)
ఒక తెల్లని పుష్పము – ( ఉమా మహేశ్వరులకు)
అర్పించి తరింతుముగాక!

## నీరాజనం

శ్రీ దత్త దేవునకు నీరాజనం
గురుదత్త దేవునకు నీరాజనం
నీరాజనం భక్తి నీరాజనం
నీరాజనం భాష్ప నీరాజనం
నీరాజనం దీప నీరాజనం
నీరాజనం దివ్య నీరాజనం. ॥
నీ బ్రహ్మముఖముకు నీరాజనం
నీ విష్ణు ముఖముకు నీరాజనం
నీ రుద్ర ముఖముకు నీరాజనం
నీ మూడు తలలకు నీరాజనం
ఆ ఆరు నయనాలకు నీరాజనం
నీ కాషాయ పటమునకు నీరాజనం
నీ పీతాంబరమునకు నీరాజనం
నీ శార్దూలకృత్తికి నీరాజనం
శ్రీ దత్త దేవునకు నీరాజనం
కమండల్వక్షమాలతో నొప్పు
నీ బ్రహ్మ హస్తాల నీరాజనం
ఢమరు త్రిశూలాలతో నొప్పు
నీ రుద్ర హస్తాల నీరాజనం
శంఖచక్రంబులతో వెలుగు
నీ విష్ణుహస్తాల నీరాజనం
శ్రీ దత్త దేవునకు నీరాజనం
శ్రీ దత్త పాదములకు నీరాజనం
గురుదత్త పాదుకలకు నీరాజనం
నీ ధర్మ గోవుకు నీరాజనం
నీ శ్రుతి శునకములకు నీరాజనం
నీ భక్తుడైనట్టి ఆ గణపతి సచ్చిదానంద స్వామికి నీరాజనం

శ్రీ దత్త దేవునకు నీరాజనం
గురుదత్త దేవునకు నీరాజనం
నీరాజనం భక్తి నీరాజనం
నీరాజనం భాష్ప నీరాజనం
నీరాజనం దీప నీరాజనం
నీరాజనం దివ్య నీరాజనం.
సర్వకర్తా సర్వ భర్తా సర్వ హర్తా మంగళం ।
సర్వ నేతా సర్వ దాతా సర్వ మాతా మంగళం ।
దత్తాత్రేయ మంగళం ॥
హరిహర రూపా విధి సురవేషా మంగళం
దత్తాత్రేయ మంగళం
అంతర్యామీ అఖిలారాధ్య మంగళం
దత్తాత్రేయ మంగళం ॥
శ్రీ దత్త దేవా మంగళమ్
గురుదత్త దేవా మంగళమ్
ప్రభుదత్త దేవా మంగళమ్
నా దత్త దేవా మంగళమ్



శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

## భక్త మహాశయులకు మా తుది పలుకు

భక్తమహాశయులారా! శ్రీదత్తవేదము ప్రథమ ముద్రణ 1995 సం॥లో జరిగింది. శ్రీవారి ఆజ్ఞానుసారం ఇప్పుడు అనగా 1999వ సం॥లో రెండవ ముద్రణ వేయించడం దత్త భగవానుడు మాకు, మిత్రబృందమునకు అనుగ్రహించిన వరమే. ధన్యులం. శ్రీదత్త వేదమును ఆనాడు అందుకున్న భక్తులు శ్రీవారి దివ్యవాణిని గ్రోలి పరమానందభరితులగుటయే కాక శ్రీదత్త వేదమును పారాయణ చేయు సమయంలో ఎన్నో అనుభవములను, అనుభూతులను, దివ్య స్వప్న దర్శనములను పొంది ఆనంద డోలికలలో తేలిపోయినారని ఆశిస్తున్నాము. భక్త మహాశయులు కొందరు సంహితాయన గురుద్వి సాహస్రి అనగా శ్రీగురు చరిత్రను పారాయణ చేసి యుండ వచ్చును. వారికి అనుభవమే. అందు నామధారకునితో సిద్ధ సరస్వతీ యోగీంద్రుడు ఇలా అంటారు "నీ పూర్వీకుడొకడు శ్రీ గురుప్రసాద ప్రాప్తుడయ్యాడు. అందువలననే శ్రీ గురుని యందు నీకు భక్తి కలిగింది. ఇది శ్రీ గురుని అనుగ్రహమే. నీ వంశంలో గూడా వర్ధమానుడు కలుగుతాడని నాకు నిశ్చయంగా తోస్తున్నది" అని. వారి పూర్వీకుడు సాయందేవుడని తెల్పుతూ వారి చరిత్రకూడా చెప్పడం జరిగింది. శ్రీనృసింహ సరస్వతి స్వామివారు సాయందేవుని స్తోత్రానికి సంతోషించి ఇలా అనుగ్రహించారు గదా "నాయనా! నీ స్తోత్రానికి సంతోషించాను. నాయందు నీకు నిర్హేతుకమయిన భక్తి ప్రసాదించాను. నీ వంశస్థులందరూ నా భక్తులవుతారు" అని. ఇక్కడ ఈ ప్రస్తావన ఎందుకు తెచ్చానంటే–నేను సామాన్యుడను. నా భార్యకూడా సామాన్య కుటుంబమునుండి వచ్చినదే. అట్టి మాకు శ్రీ గురుని అనుగ్రహము వలన శ్రీ సదానంద సరస్వతి మహరాజ్‌ల శిష్యులమయ్యే భాగ్యం లభించింది.

1992లో దత్తభక్తులు శ్రీజన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి గారి సాంగత్యము లభించినది. దీనిని బట్టి శ్రీగురునిపై భక్తి ప్రపత్తులు

కల్గటము, మా పూర్వీకులు శ్రీగురుప్రసాద ప్రాప్తులు అని నిశ్చయముగా తోచు చున్నది. అట్లే శ్రీగురుని అనుగ్రహమువలన మా కుటుంబ సభ్యులకు స్వామివారియందు భక్తి ప్రపత్తులు కలగటం మా అదృష్టం. ఇదంతా స్వామి వారి కృప. శ్రీదత్త భక్తులు మా కుటుంబ సభ్యులకు గురుతుల్యులు. మా పిల్లలు వారిని దత్తు మామయ్యగారు అంటారు.

మా పెద్దమ్మాయి చి.ల.సౌ. శ్రుతకీర్తి, మా అల్లుడు చి. రమేష్ కుమార్ దత్తావతారులైన శ్రీ షిరిడి బాబా వారికి, వర్తమాన దత్తావతారు లయిన శ్రీ సత్యసాయిబాబా వారికి భక్తులయ్యారు.

మా రెండవ అమ్మాయి చి.ల.సౌ. రమా సుందరి, మా అల్లుడు విజయరాంకు 1995లో శ్రీ దత్తాత్రేయస్వామివారి అనుగ్రహంవలన మంచి అనుభూతులు కల్గినాయి. మా పెద్దబ్బాయి చి. భాస్కరు, వాడి ధర్మపత్ని చి.ల.సౌ. శ్రీలక్ష్మి, మా రెండవ అబ్బాయి చి. ప్రభాకరు, వాడి ధర్మపత్ని చి.ల.సౌ. బాలాత్రిపుర సుందరి, మా మూడవ అబ్బాయి చి. రమణ వాడి ధర్మపత్ని చి.ల.సౌ. సుజాత కూడా స్వామి భక్తులవడము స్వామి అనుగ్రహమే. మా మనుమడు చి. పవన్‌కుమార్, మనుమరాలు చి. లావణ్య శ్రీ గురుని కృపాకటాక్ష వీక్షణపాత్రులవడం స్వామి అనుగ్రహమే. మా మనుమడు చి. వాసు, మనుమరాలు చి.ల.సౌ. సరోజ కూడా స్వామిని విశ్వసించి కొలుస్తున్నారు. ఇది అంతా ఎందుకు వ్రాసానంటే శ్రీ గురుడు ఆనతి యిచ్చినట్లు పూర్వీకులలో ఒక్క దత్త భక్తులున్నా ఆ వంశంలోని తరతరాలలో దత్తభక్తి యుంటుందని నిశ్చయమౌతున్నది కదా. ఆ వాక్కు అక్షర సత్యం.

ఇక అసలు విషయానికి వస్తాను. శ్రీదత్త భక్తులకు శ్రీదత్తాత్రేయస్వామివారు వినిపించిన దివ్యవాణి మేము ఆస్వాదించి ఆనందించడం, స్వామి వినిపించిన దివ్యవాణి ''శ్రీదత్త వేదము''గా గ్రంథస్థం చేయడము శ్రీగురుని అజ్ఞానుసారం జరిగిన విషయమని ఇంతకుముందే మనవి చేశాను. ''శ్రీదత్త వేదమును'' అచ్చువేయించే శక్తిని ప్రసాదించ

వయ్యా యని శ్రీవారినే వేడుకున్నాను. స్వామి అనుగ్రహించారు. డి.బి.ప్రింటర్సు వారిని కలిసాము. వారు చాలా ఆనందంగా వెంటనే పని ప్రారంభించారు. శ్రీగురుని కృపాకటాక్షం. ఇక్కడ ఒక అద్భుతం జరిగింది. మనవిచేస్తాను.

మా రెండవ అమ్మాయి చి.ల.సౌ. రమాసుందరి ఫోన్ చేసింది హైదరాబాద్ నుండి చాలా ఆనందపరవశంగా. అమ్మాయి చేసిన ఫోన్ వివరాలు యివి. మా అమ్మాయికి 10-7-95 నాటి తెల్లవారుజామున ఒక దివ్య స్వప్నం వచ్చిందట. ఆ స్వప్నంలో నేను, మా అక్కగారు (మా అక్కగారు కీ.శే. ప్రభల కామేశ్వరమ్మగారు, రామ భక్తురాలు. కైవల్యం సాధించింది) ఒక చాప మీద కూర్చుని యున్నామట. నేను "శ్రీదత్త వేదమును ఆమెకు చదివి వినిపించుచున్నానట. ఇంతలో ముగ్గురు యతీంద్రులు వచ్చారట. వారు కాషాయబట్టలు ధరించి దండకమండలాలు ధరించి, జపమాల, తలపై శిఖ ధరించివున్నారట. వారి వెనుక వృద్ధ యతీంద్రుడు వారి సతీమణి వచ్చారట. వారు అందరూ వచ్చి చాపమీద కూర్చునియున్న మా చుట్టూ కూర్చుని "దత్త వేదము"ను ఆనందంగా, చిద్విలాసంగా వింటున్నారట. వారి చూపులలో ఆనందం పొంగిపొరలు తున్నదట. మరల మధ్యాహ్నం స్వప్నంలో శ్రీదత్తస్వామి దర్శనమిచ్చారట. ముందు వచ్చిన యతీంద్రులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులని వారే శ్రీదత్తాత్రేయస్వామి యని, వృద్ధ దంపతులు వారి తల్లిదండ్రులయిన శ్రీఅత్రి మహర్షి, అనసూయమాత యని తెల్పారట శ్రీదత్తవేదము విని చాలా ఆనందించారట. ఇది స్వప్నం. మా అమ్మాయి ఇంకా ఇలా అన్నది–మీరు శ్రీదత్తవేదమును పదిమందికి తెలిసేటట్లుగ గ్రంథ రూపంలో ప్రచురణ చేస్తున్నారుగదా. అందువలన శ్రీగురుడు చాలా ఆనందపడ్డారని. చూడండి దత్తమహిమ.

ప్రథమ ముద్రణ వేసిన గ్రంథములు చాలా ఉదారంగా భక్తులకు అందించడం జరిగింది. కాపీలు 1997లోనే అయిపోయినై. అయిపోయి రెండు సంవత్సరాలు కావస్తున్నది. తర్వాత విడుదల అయిన శ్రీద సూక్తులు, శ్రీదత్తామృతము కాపీలు కూడా అయిపోయినవి. ఈలో

శ్రీదత్తభగవానులు శ్రీదత్త భక్తులకు సాక్షాత్కరించి ప్రత్యక్షముగా శ్రీదత్త గురు భగవద్గీత వచించడం ఆ గ్రంథ ఆవిష్కరణ 3-12-98 శ్రీ దత్త జయంతినాడు జరగడం జరిగింది.

ఇప్పుడు చాలామంది భక్తులు శ్రీదత్తవేదము కావాలని అడుగుతున్నారు. ఇట్లుండగా శ్రీశిష్ట్లా భీమశంకరంగారు, వారి సతీమణి శ్రీమతి వసుమతిగారు వారి పుత్రులు లక్ష్మీకాంత్, ఫణికుమార్‌లు శ్రీదత్తభగవానుని సేవలో నిమగ్నులవడం వారితో పరిచయం విచిత్రంగా జరిగింది. శ్రీదత్తవేదమును పునః ముద్రణ వేయాలని వారి సంకల్పం- వారి శ్రద్ధా భక్తులే ఈ ద్వితీయ ముద్రణకు పునాది. శ్రీదత్త భక్తులు అనుగ్రహించారు. మాకు ఉత్సాహం ద్విగుణీకృత మైనది. శ్రీదత్తవేదము గ్రంథములో కొన్నికొన్ని సంఘటన లను చేర్చి, అందించే ఈ ప్రయత్నంలో శ్రీవారి అనుగ్రహం పూర్తిగా లభించింది. ధన్యులం. ఈ పవిత్ర గ్రంథముయొక్క పునఃముద్రణకు సహకరించిన భక్తబృందమునకు ముద్రించిన సవితాప్రింటర్సు అధినేత శ్రీ సుబ్బరాజు గారికి కృతజ్ఞతలు అందించుచున్నాము.

ఈ గ్రంథములో ఎక్కడన్నా తప్పులు దొర్లినచో అవి మావి అనియు, కీర్తి శ్రీవారిదనియు మనవి చేస్తూ ముగిస్తున్నాము.

ఇట్లు
శ్రీదత్త భగవానుని సేవలో
**చిలుకూరు బాలకృష్ణమూర్తి**
**శ్రీమతి భవాని.**
41-15-4, నల్లగేటుడౌన్
కృష్ణలంక, విజయవాడ - 13.

ప్రమాథి - మార్గశిర పూర్ణిమ
22-12 -99.

శ్రీరామజయ జయ గురుదత్త

# నమస్సుమాంజలి

మా గురువర్యులు ప.పూ. సచ్చిదానందేంద్ర సరస్వతీ స్వామీ అనుగ్రహము వలన, మా జననీ జనకుల ఆశీర్వాదము వలన, భగవాన్ శ్రీ దత్తాత్రేయ మంత్రానుష్టానము వలన, నాకు వేదాంత జిజ్ఞాస ఏర్పడినది. గడచిన పాతిక సంవత్సరములుగా కేవలము ఐహిక ఆముష్మికములకు భగవంతుని ఆరాధించితిమి.

బహుధాన్య నామ సంవత్సరము ఆశ్వీయుజ మాసములో బ్రహ్మశ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తిగారు మా కార్యాలయమునకు వచ్చి "దత్త గ్రంధమాలలో భాగముగా ప్రచురితమైన భోగభాగ్య గులికలు, శ్రీశ్రీ అక్కలకోట మహరాజ్‌ల చరిత్ర, శ్రీ మాణిక్ ప్రభువుల చరిత్ర మొదలైన పుస్తకములను నాకు అందజేసినారు. అవి చదవగా అనేక విషయములు తెలిసినవి. తరువాత "శ్రీ దత్తగురు భగవద్గీత" పుస్తకము ప్రచురింపబడుచున్నదనియు తెలిపి నన్ను వారి గృహమునకు రావలసినదిగా కోరినారు. నేను బహుధాన్య నామ సంవత్సరం కార్తీక మాసంలో ఒక ఆదివారమునాడు వారి ఇంటికి వెళ్ళితిని. అచట "శ్రీ దత్త వేదము" అను పుస్తకము ఒకటి రెండు పేజీలు చదివి, పుస్తకములోని విషయము చాలా బాగున్నది, పూర్తిగా చదవాలి అను ఉద్దేశముతో వారిని అడిగితిని వారు ఇచ్చినారు. మా కుటుంబసభ్యు లందరమూ ఆ పుస్తకమును ఆమూలాగ్రముగా చదివి అందు నిక్షిప్తమై వున్న "జ్ఞాన సందేశము" అనుసరణీయము, ఆచరణీయము అను ఉద్దేశ్యముతో వారి పుస్తకము వారికి తిరిగి ఇచ్చివేస్తూ, ఒక పుస్తకము ఉంటే మా కివ్వవలసినదిగా కోరితిని. వారు ఒకటే పుస్తకము ఉన్నది. వేరు పుస్తకములు లేవు అని తెలిపినారు. ఆ పుస్తకములోని "శ్రీ దత్త దివ్యవాణి" అందు పొందుపరచిన విషయములు మానవ గ్రాహ్యమునకు దుర్లభమని భావించితిని. మహాభావమనే పరాభక్తి వలన భగవాన్ దత్తాత్రేయస్వామిని ప్రత్యక్షము చేసుకున్న మహానుభావులైన బ్రహ్మశ్రీ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి గారితో "శ్రీ దత్త గురు భగవద్గీత" గ్రంధావిష్కరణ దినమైన మార్గశిర

పౌర్ణమి గురువారము ది. 3-12-1998 న పరిచయభాగ్య మేర్పడినది. "శ్రీ దత్త వేదము" అను గ్రంధము నేను చదివి తరించుటయే కాదు పదిమంది చదివి తరించాలనే ఉద్దేశ్యముతో గ్రంధము పునర్ముద్రణ చేయాలనే తలంపును శ్రీ బాలకృష్ణమూర్తి గారి దగ్గర వ్యక్తం చేయుట, వారు శ్రీ దత్త భక్తులు శ్రీ వేణుగోపాలకృష్ణ మూర్తి గారికి తెలుపుటయు, వారు మాకు ఆ సేవా భాగ్యము ప్రసాదించిన పిదప పునర్ముద్రణకై ప్రయత్నం ప్రారంభించినాము. ఈ నాటికి మీకు అందించగలిగినాము.

ఈ గ్రంధము పాఠకులకు ఆధ్యాత్మికోన్నతి కలిగించుటయే గాక జ్ఞాన ప్రచారసేవయందు అనురక్తులను చేయుననుటలో సందేహము లేదు.

దత్తవేద పుస్తక పఠనము, మా కుటుంబము వారిలో దత్త భక్తి మరింతగా ప్రాదు చేసుకొనుటయు, స్వామి జ్ఞాన ప్రచారసేవయం దను రక్తుల మగుటకు, మరియు గత కొలది కాలముగా అస్వస్థతోనున్న నా ధర్మపత్ని స్వస్థతో నుండుటయు మా స్వానుభవములోని విషయము.

మాకీ అవకాశము కలిగించిన శ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తి భవానీ దంపతులకు వందనమొనరించుచూ వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. దత్త భక్తులు శ్రీ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తిగారి సత్సంగము వలన అనేకమైన అద్భుతమైన స్వామి సందేశములను విని ఎంతయో ఆనందించితిమి. వారికి మా హృదయపూర్వక నమస్సుమాంజలులు సమర్పించుకొంటున్నాము.

ఇట్లు
దత్త సేవలో
**శిష్ట్లా భీమశంకరం**
**వసుమతి**

# సర్వ వేదాంత సారం

ప్రమాధినామ సం॥ మార్గశిర శుద్ధ విదియ గురువారము సాయంత్రము 5-15ని॥లకు శ్రీ దత్త భగవానుడు శ్రీ దత్త భక్తులకు సాక్షాత్కరించి ఈ దివ్యవాణిని అనుగ్రహించారు.

ఏక ఆగతః - ఏక ఉద్గతః
మధ్య బంధనం -విమృశరేనర విమృశరేనర
దత్త బంధనం - శాశ్వతంకిల
దత్తమాశ్రయ - విమృశరేనర
విమృశరేనర - విమృశరేఖల
అమృత మాగతం-పంకముజ్ఝితం
ఛిద్యతేస్వయం - విమృశరేనర
విమృశ - విమృశ - విమృశ.

ఏకాంతమున ఉన్ననూ, ఎవ్వడు నిర్వికారముగా ప్రశాంతిలో ఉండగలడో అట్టివాడే జీవన్ముక్తుడు. స్థితప్రజ్ఞుడు. ఒకడే ఈ లోకమునకు వచ్చినాడు. కొంతకాలము కొన్ని బంధములలో చిక్కుకున్నాడు. ఈ బంధములను వదల్చుకొని మరల ఒక్కడే పోవుచున్నాడు. ఈ జీవుడు అశాశ్వతములు అసత్యములైన ఈ బంధములలో ఎంతగా చిక్కుకున్నా డంటే ఈ మధ్యకాలములో కొంచెము సమయమైనను ఆ బంధము నుండి దూరముగా ఉండవలసివచ్చినవుడు ఎంతో వేదన పడుచున్నాడు కాని జన్మ మొదలు మరణ పర్యంతము భగవంతుని చూడకుండ భగవంతునికి దూరంగా ఉన్నందున ఒక క్షణకాలము కూడా వేద పడుటలేదు. ఈ మానవుడు ఎంత అజ్ఞానియో ఎంతటి మూఢు వర్ణించుటకు వేయి జిహ్వాలు గల ఆదిశేషునకు సైతము సాధ్యము కాద ఆదిశేషుడు భగవంతుని గుణగణములను వర్ణించుటకు శక్తుడగునేమె గాని ఈ మానవుని యొక్క గుడ్డితనమును గురించి వర్ణించుట ఎన్నటికిని శక్తుడు కాడు. ఈ మానవుడు ఏ బంధముల గురించి వే పడుచున్నాడో ఆ బంధములు గల జీవులందరును నిజముగా వ

సుఖము కొరకే ఈ మానవుని ప్రేమించియున్నారు. ఈ మానవుని వలన సుఖము లేనపుడు ఆ బంధములన్నియు వీనిని నిర్దాక్షిణ్యముగా విడిచి పోవుచున్నవి. అట్టి బంధములకొరకు నిత్యము ప్రాకులాడుచూ చింతించుచూ ఈ మానవుడు కొట్టుకొనుచున్నాడు. కాని భగవంతునితో బంధమెట్టిది ?

భగవంతుడు ఈ మానవుని ఉద్ధరించుటకు వీని సుఖము కొరకే వీనిని ప్రేమించుచున్నాడు. వీనినుండి ఆయనకు ఎట్టి సుఖావసరములేదు. సర్వవ్యాప్తియగు అట్టి భగవంతుడు ఏకాంతమున ఈ జీవుని వెంట యుండగా అట్టి బంధమును విస్మరించి భగవంతునితో రమించి ఆనందించక కనపడని దూరముగా యున్న బంధముల కొరకు అల్లాడుచున్నాడు. పది దినములు ఈ బంధములు కంటికి కనిపించనంత మాత్రమున ఇంతగా అల్లాడుచున్న ఈ జీవుడు పుట్టినప్పటినుండి ఇన్ని సంవత్సరములు గడచిననూ నిజమైన ఆ ఆత్మబంధువగు భగవంతుడు కనిపించలేదని ఏ మాత్రమైననూ వేదన పడుటలేదు. అందువలన మానవుని యొక్క గుడ్డితనము అజ్ఞానము వర్ణనాతీతములు.

''దత్తం ఛిన్నం'' అంటారు. అనగా దత్తారాధన సర్వసంబంధాలను ఛేదం చేస్తుంది అని. అంటే దీని అర్థం-దత్త భగవానుడు ఉపాసకుని సర్వబంధాలను ఛేదం చేస్తాడని అర్థం తీసుకుంటారు కానీ ఇది సరి అయిన అర్థం కాదు.

దీని అర్థమేమి ? – అమృతము లభించని వరకు బురద నీళ్ళను త్రాగును. అమృతము చిక్కిన తరువాత, బురద నీళ్ళపై కల బంధము తెగిపోవును. ఈ బురద నీటి బంధమును అమృతము తెంచినదా ? కాదు కాదు. అమృతములోని రుచిని ఆస్వాదించిన తర్వాత, బురద నీటిపై కల బంధము దానంతట అదే తెగిపోయినది. ఈ బంధచ్ఛేదమునకు అమృతము దొరకుటయే అనగా అమృతమే కారణము. దీనినే దత్తం ఛిన్నం అంటారు. అనగా సర్వబంధముల ఛేదానికి కారణము

శ్రీ దత్త బంధములోని మాధుర్యమే. కావున దత్తుడీ విధముగా సర్వబంధ చ్ఛేదనమునకు కారణమగుచున్నాడు. 'ఇదే దత్తం ఛిన్నం' లోని అంతరార్థము. దీని అర్థము దత్తుడు వచ్చి నిర్దాక్షిణ్యముగా భక్తుని సంసారబంధములను బలవంతంగా ఛేదించి, తన బంధమునే నిలబెట్టుకొనుట కాదు. అమృతము వచ్చి మిగతా పానీయములపై బంధములను బలవంతముగా త్రెంచుటలేదు.

మానవజన్మలో ఏదైతే సాధించుకుంటావో అదే జీవితానంతరము నిలుస్తుంది. ఏలననగా మానవజన్మ తరువాత సాధనకు అవకాశము లేదు. ఈ జన్మలో సాధించనిది, ఈ జన్మ తరువాత రాదు. కావున ఈ జన్మ ముగియు లోపల దేనిని సాధిస్తావో ఆ స్థితిలోనే తరువాత కూడా నిలుస్తావు. అంటే ఈ జన్మలో జీవన్ముక్తుడైన వాడు మరణానంతరమూ ముక్తుడౌతాడు. మరణానంతరము కొత్తగా వచ్చే ముక్తి ఏమీ లేదు. ఈ విషయమే వేదములో " ఇహ చేద వేదీ దధ సత్యమస్తిన చేదిహావేదీ న్మహతీ వినష్టిః" అని చెప్పబడినది.

ఇది ఈ నాటి దివ్యవాణి.



# ముగింపు

స్వామివారు ఇచ్చిన సందేశముతో ఇక ముగిస్తాను.

3-4-93 ఆరోజు శనివారం ఉదయం 7-30లకు స్వామి ఇలా విశదీకరించారట.

అసంభూతి ఉపాసన అనగా ద్రవ్యముతో ఉపాసించటయే తప్ప మానసికముగా చేయకుండుట.

అసంభూత ఉపాసన అనగా మానసికంగా ఉపాసించుటయే తప్ప ద్రవ్యముతో చేయకుండుట. ఈ రెండిటిని జోడించి చేసిన ఉపాసన సిద్ధించును. అన్నారట స్వామి.

స్వామి ఇంకా ఇలా సందేశమిచ్చారట.

1. గతమును చింతించకుము. భవిష్యత్తును ఊహించకుము. ఈ క్షణమే మీది.
2. ఇకనైననూ సమయాన్ని, శక్తిని వృధా చేయకుము.
3. అచ్చట నిన్నే జీవుడును కనీసము గుర్తించను కూడా గుర్తించడు.

అని శెలవిస్తూ శ్రీ స్వామివారు ఈ క్రింది పద్యమును పాడినారట.

''సాయము చేసెదన్ వినుడు సాధన చేయుడు తప్పకుండ
ఈ కాయము రాలిపోవు ఇక కాలము తక్కువ శక్తి కూడ
మీ ప్రాయము చూచుకొండు పసి పాపలుగారు గృహంబు దిద్దుకో
న్యాయము దీపముండగనే నాడట రెండవవాడు రాడొహో''

''సందేశంబును కోరనేల మరలన్ సందేశ సారంబు ఆ
నంద ప్రేమల జీవితాంత సమయం బందున్ ననున్ కొల్చినన్
సందేహంబులు లేక చిట్ట చివరన్ సాక్షాత్కరింతున్ యముం
డందుండరాడు తదీయులంచు దయతో అంకంబుపై చేర్చెదన్''


శ్రీ దత్త భక్తుల ద్వారా స్వామి ఇచ్చిన వరప్రసాదం ఇది.

బ్రహ్మ విష్ణు శివాయ విద్మహే
దత్తాత్రేయాయ ధీమహి
తన్నో దత్త ప్రచోదయాత్ ॥
దత్తాత్రేయాయ విద్మహే
అత్రి పుత్రాయ ధీమహి
తన్నో దత్త ప్రచోదయాత్ ॥
దత్తా త్రేయాయ విద్మహే
గాయత్రీ శాయ ధీమహి
తన్నో దత్త ప్రచోదయాత్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీ గురుదత్త    జయ గురుదత్త



**డా॥ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తి M.Sc., Ph.D.**

శ్లో॥ స్పృష్టి స్థితి ప్రళయ కారణమస్య వేదా
ద్బ్రహ్మైవ య స్త్రిముఖ సూచక దత్తదేవః
అన్యస్వరూప మసమన్వయ హేతుముక్తం
తస్మాత్స ఏవ శరణం మమ వేద సిద్ధః

తా॥ వేదములో చెప్పిన బ్రహ్మము – నిర్వచనమేమనగా – ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, ప్రళయములను చేయు ఏకైక స్వరూపమే బ్రహ్మము. మూడు ముఖములతో యీ మూడు పనులను చేయు ఏకైక స్వరూపమగు శ్రీ దత్త దేవుడే వేదము ద్వారా సిద్ధించిన బ్రహ్మము కావున మాకు శరణ్యుడు. ఇతర స్వరూపములందు ఈ వేద సమన్వయము కుదరదు కావున వాటిని విడచినాము.

ఓం శాంతిః శాంతిః శాంతిః